వేద రహస్యం



శ్రీ అరొబిందో

అనువాదం – వి. శ్రీనివాస చక్రవర్తి

అధ్యాయం – 1

సమస్య – పరిష్కారం

అసలు వేద రహస్యం అంటూ ఏదైనా ఉండేదా? ఉంటే ఇంకా వుందా?

సమకాలీన చింతన ప్రకారం ప్రాచీన వేదరహస్యం పూర్తిగా బట్టబయలు అయిపోయింది. దాని సారం సంపూర్ణంగా తేటతెల్లం అయిపోయింది. ఇక అందులో రహస్యం అనేదే లేదు. వేద ఋక్కులన్నీ ఏదో ఆదిమ, కిరాత జాతి బలిదాన సమయంలో చదివే శాంతిమంత్రాలు. ప్రకృతి శక్తులని వ్యక్తీకరిస్తూ చేసే ఏవో మొరటు పూజలు. అందులో ఉన్నదంతా కేవలం అయోమయమైన, అసంపూర్ణమైన పుక్కిటి పురాణం, ఇంకా పూర్తిగా రూపుదేలని దృష్టాంతం. అడపాదడపా ఖగోళవిజ్ఞానంతో జోడించబడ్డ ఊహాగానం. తదనంతరం వచ్చిన ఋక్కుల లోనే ఏవో లోతైన తాత్విక, నైతిక భావాల తొలిఛాయలు కనిపిస్తాయి. ఆ భావాలు కూడా "చోరులు," "వేద ద్వేషులు," అంటూ వేదఋక్కులలోనే ఎన్నో సందర్భాలలో దూషించబడ్డ ద్రావిడ జాతుల నుండి అరువు తెచ్చుకున్నవే అంటారు కొందరు. అయినా ఆ భావజాలంలోనే తదనంతరం వచ్చిన వేదాంత భావజాలానికి చెందిన తొలిచిగుళ్ళు కనిపిస్తున్నాయంటారు. మొన్నమొన్నటి దాకా ఉన్న ఆదిమ దశ నుండి అతి వేగంగా మానవ పరిణామం సాగిందనే ఆధునిక భావాలకి, ఈ రకమైన చింతనతో పొత్తు కుదురుతోంది. అంతోఇంతో క్షుణ్ణంగా సాగినట్టుగానే కనిపించే పరిశోధన ఈ చింతనకి

మద్దతు నిస్తోంది. ఇంకా శైశవ దశలో ఉండి, అనాధారిత విధానాలని ప్రయోగిస్తూ, నిరంతరం మారే ఫలితాలని ప్రకటించే, ఎన్నో క్రొంగొత్త శాస్త్రాలు – తులనాత్మక శబ్దవ్యుత్పత్తి శాస్త్రం, తులనాత్మక పౌరాణిక శాస్త్రం, తులనాత్మక మతవిజ్ఞానం మొదలైనవి - ఈ చింతనకి చేయూతనిస్తున్నాయి.

ఒక ప్రాచీన సమస్యని ఓ క్రొత్త దృక్పథంతో ప్రదర్శించడం ఈ అధ్యాయాలలో నా ఉద్దేశం. ఇంతవరకు లభ్యమైన పరిష్కారాలని తిరస్కరించే వినాశాత్మక పద్ధతిని నేను అవలంబించబోవడం లేదు. నిర్మాణాత్మకంగా, ధనాత్మకంగా మరింత విశాలమైన పునాదుల మీద గత పరిష్కారాలకి పరిపూరకమైన సిద్ధాంతాన్ని నిర్మించబోతున్నాను. సాధారణ సిద్ధాంతాలు అంతంతమాత్రంగానే పరిష్కరించిన కొన్ని సమస్యల మీద నా కొత్త సిద్ధాంతం నవీన కాంతులు చిందించే అవకాశం ఉంది.

ఋగ్వేదంలోని శ్లోకాలని అతిప్రాచీనమైన భాషలో వ్యక్తం చెయ్యడం జరిగినందు వల్ల వాటి అన్వయంలో ఎన్నో తేలని సమస్యలు తలెత్తుతున్నాయి. (యూరోపియన్ పండితుల అభిప్రాయంలో ఈ ఋగ్వేదం ఒక్కటే అసలైన వేదం). అందులో కనిపించే అతి ప్రాచీనమైన శబ్దజాలం, శైలి మరింత అర్వాచీన భాషలో కనిపించదు. వాటి భావాన్ని నిర్ధారించే ప్రయత్నం కూడా సంధిగ్ధంగానే ఉంటుంది. ప్రాచీన సంస్కృతంలో ఉండే ఎన్నో పదాలు ఆ వేదంలోనూ కనిపించినా, వాటి అర్థం విషయానికి వస్తే, అనంతర కాలంలో వచ్చిన సాహితీసాంప్రదాయంలో ఆ పదాల అర్థానికి, వేదంలో వాటి అర్థానికి మధ్య ఎంతో తేడా కనిపిస్తుంది. వేదంలో వాడబడిన పరిభాషలో, అత్యంత సామాన్య పదాలు కూడా, అర్థాన్ని తేల్చి చెప్పడంలో అతి కీలకమైన పదాలు కూడా, ఒకదానితో ఒకటి సంబంధం లేని

అనేకార్థాలని సంతరించుకోగలవు. మనం ఎంచుకున్న అర్థాన్ని బట్టి సంపూర్ణ శ్లోకాలు, సంపూర్ణ కాండాలు మాత్రమే కాక అసలు సమస్త వేద చింతనే బహుళార్థాలతో ప్రకాశిస్తుంది. ఈ ప్రాచీన స్తోత్రాల అంతరార్థాన్ని నిర్ధారించేందుకు గాను గడచిన వేల ఏళ్లలో కనీసం మూడు సారులైనా గణనీయమైన ప్రయత్నాలు జరిగాయి. ఈ మూడు ప్రయత్నాలలో కూడా వాడబడ్డ పద్ధతులు వేరు, వచ్చిన ఫలితాలూ వేరు. అలాంటి ప్రయత్నాలలో మొట్టమొదటిది పూర్వచారిత్రక యుగంలో జరిగింది. ఆ ప్రయత్నం గురించిన అవశేషాలు మనకి బ్రాహ్మణాలలోను, ఉపనిషత్తులలోను కనిపిస్తాయి. ఆ తరువాత కాలంలో భారతీయ పండితుడు సాయణుడు చేసిన సాంప్రదాయనిబద్ధమైన అన్వయం మనకి లభ్యం అవుతోంది. ఇక అర్వాచీన కాలంలో యూరొపియన్ పాండిత్యం ఎంతో తులనత్మక పరిశీలన చేసి, ఎంతో ప్రయాస పడి చేసిన అన్వయం మనకి మిగిలింది. ఈ చివరి రెండు ప్రయత్నాలలోను ఒక సామాన్య లక్షణం కనిపిస్తోంది. వాటి అన్వయాల బట్టి పరిశీలిస్తే ఆ ప్రాచీన స్తోత్రాలు అసామాన్యమైన అసంబద్ధత గలవిగా, భావశూన్యమైనవిగా కనిపిస్తాయి. ప్రత్యేక వాక్యాలని తీసుకుని, వారి సిద్ధాంతాల ప్రకారం అన్వయిస్తే అంతోఇంతో భావం ఉన్నట్లుగానే ఉంటుంది. అయితే అనవసర శబ్దపుష్టితో, అనుచితమైన అలంకారంతో, భావం అల్పంగాను, శబ్దం అనల్పంగాను ఉన్నట్టు కనిపిస్తుంది. కాని ఆ శ్లోకాలని ఓ అఖిలఘనరాశిగా తీసుకుని పరిశీలించినట్లయితే, తక్కిన ప్రాచీన జాతులకి చెందిన రచయితలకి మల్లె కాక, వేదకవులకి సుసంబద్ధమైన, సహజమైన, సజావైన భావవ్యక్తీకరణ సాధ్యం కాదా అన్న ప్రశ్న పుట్టక మానదు. కాస్త క్లుప్తమైన, సరళమైన వేదభాగాలలో తప్ప, తక్కిన చోట్ల భాష కృతకంగాను, అయోమయంగాను తోచుతుంది. భావాలలో ఒకదానికొకటి

సంబంధం లేకపోయినా అన్వయకారుడు వాటిని బలవంతంగా ఒక దరికి చేర్చినట్టు అనిపిస్తుంది. అన్వయం చేయబోయిన పండితుడు అభూతకల్పన చేస్తున్నాడేమో ననిపిస్తుంది. ఈ ప్రయత్నాలలో మనకి కనిపించేది వేదరహస్యం బహిర్గతం కావడం కాదు. అన్వయానికి లొంగని సమాచారాన్ని బుద్ధి పుట్టినట్టు బలవంతంగా మలచుకోవడమే ఇక్కడ కనిపిస్తోంది.

అయినా కూడా ఈ అయోమయ, అనాగరక కృతులే ప్రపంచ సాహితీ చరిత్రలో ఓ మహోన్నత స్థానాన్ని ఆక్రమించాయి. ప్రపంచంలో కెల్లా అత్యంత ప్రగాఢమైన, శోభాయమానమైన మతానికి అవి ప్రాణం పోయడమే కాక, అత్యంత సునిశితమైన తత్వ చింతనకి కూడా అవి ఊపిరి పోశాయి. బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో, తంత్రంలో, పురాణంలో, గొప్ప తాత్విక సాంప్రదాయాలలో, ప్రముఖ ఋషుల, మునుల బోధలలో సత్యమైన దానికి, సాధికారికమైన దానికి పట్టుకొమ్మలుగా, ప్రమాణాలుగా కొన్ని వేల ఏళ్లుగా వేదాలు నుతింపబడుతూ వచ్చాయి. మానవ మానసం అందుకోగల అత్యుత్కృష్టమైన అధ్యాత్మిక సత్యానికి మరో పేరే వేదం. మానవ వేద్యమైన అతి ప్రగాఢ జ్ఞానమే వేదం. అయితే సమకాలీన అన్వయాలని మనం సమ్మతించినట్లయితే, - అవి సాయణాచార్యుడి అన్వయాలే కావచ్చు, ఆధునిక సిద్ధాంతాలే కావచ్చు, - ఇలాంటి ప్రగాఢమైన, పవిత్రమైన ప్రాముఖ్యత అంతా కేవలం ఓ అభూతకల్పన అన్నట్టు అవుతుంది. ఎప్పుడూ ఐహికమైన లాభాల కోసం, ఆనందాల కోసం ప్రాకులాడుతూ, అత్యంత ప్రాథమికమైన నైతిక భావాలు, మతపర తపనలు తప్ప మరింకేమీ తెలీని అనాగరికుల అమాయక గుడ్డినమ్మకాలకి, అజ్ఞానానికి ప్రతిరూపాలుగా గోచరిస్తాయి వేదఋక్కులు. కొన్ని

ప్రత్యేక భాగాల అంతరార్థం, ఈ రకమైన సామాన్య తాత్పర్యానికి విరుద్ధంగా ఉన్నట్టు కనిపించినా, అది ఈ విధమైన సంపూర్ణ అవగాహనని కూలదోయదు. ఆ కారణం చేత తరువాత వచ్చిన మతాలకి, తాత్విక సాంప్రదాయాలకి పునాదులు ఉపనిషత్తులలోనే ఉన్నాయని అనుకోవాలి. వేదాలలో కనిపించే భౌతిక కర్మకాండకి వ్యతిరేకంగా తాత్విక, తార్కిక బుద్ధి చేసిన తిరుగుబాటు వల్లనే ఈ కొత్త మతాలు, తాత్విక సాంప్రదాయాలు వచ్చినట్టు భావించవలసి ఉంటుంది.

యూరొపియన్ పరిస్థితులతో తప్పుడు పోలిక చేత సమర్థించబడే ఈ రకమైన చింతన ప్రత్యేకించి వివరించేదేమీ ఉండదు. ఉపనిషత్ భావజాలంలో గోచరించేటువంటి ప్రగాఢమైన, చిరంతనమైన చింతనలు, సునిశితమైన, సువిస్తారమైన మనస్తత్వ విజ్ఞానం, ఏమీ లేని శూన్యం లోంచి పుట్టుకు రావు. పురోగమించే మానవ మానసం క్రమంగా జ్ఞాన శిఖరాలు అధిరోహిస్తూ పోతుంది. లేదా ముందు అయోమయమై, అగోచరమై ఉన్న జ్ఞానాన్ని నవీకరించి, విస్తరింపజేస్తూ పోతుంది. లేదా అసంపూర్ణమైన పాత సూచనల ఆసరాతో కొత్త ఆవిష్కరణలను చేరుకుంటుంది. ఉపనిషత్ చింతనా సాంప్రదాయానికి అంతకు పూర్వం ఏవో గొప్ప మూలాలు ఉండి తీరాలి. ఆ మూలాలు ఏమై ఉంటాయన్న వెలితిని పూరించడానికి చేయబడ్డ పరికల్పన ఒకటి ఉంది. నాగరికులైన ద్రావిడ జాతి నుండి, వారిని జయించిన అనాగరికులైన ఆర్యులు ఈ భావాలని అరువు తెచ్చుకున్నారని ఆ పరికల్పన చెప్తుంది. ఇలాంటి ఊహాగానాన్ని సమర్థించేది కేవలం మరికొన్ని ఊహాగానాలు మాత్రమే. అసలు

పంజాబ్ ద్వారా వచ్చిన ఆర్యుల దండయాత్ర కథనం అంతా శబ్దశాస్త్రవేత్తలు పుట్టించిన పుక్కిటిపురాణమేనా అని సందేహించవలసి వస్తుంది.

ప్రాచీన యూరప్ కి చెందిన తత్త్వచింతనా సాంప్రదాయాలకి ముందు రహస్యమైన గూఢవిద్యా సాంప్రదాయాలు ఉండేవి. ఆర్ఫిక్, ఎల్యూసీనియన్ గూఢ సాంప్రదాయాలు సిద్ధం చేసిన సస్య మనోభూమిక నుండి పైథాగరస్, ప్లేటోలు ఆవిర్భవించారు. భారతీయ చరిత్రలో చిట్టచివరి చింతనా విప్లవానికి కూడా అటువంటి నాంది ఉండే అవకాశం ఎంతైనా ఉంది. ఉపనిషత్ చింతనకి చెందిన భావరూపాల బట్టి, ప్రతీకల బట్టి, బ్రాహ్మణాల సారాంశం బట్టి చూస్తే, ప్రాచీన భారతంలో కూడా, గ్రీస్ లో గూఢ సాంప్రదాయాలలో జరిగినట్టు, తత్త్వచింతనకి రహస్య బోధనల ముసుగు వేసిన దశ ఒకటి ఉండేదని తలపోయవలసి ఉంటుంది.

వేదరహస్యాన్ని గురించి ప్రతిపాదించబడ్డ సిద్ధాంతాలలో మరో వెలితి కూడా కనిపిస్తుంది. వేదాలలో ప్రకృతి శక్తులకి చేసే స్థూల పూజకి, ప్రాచీన గ్రీకు సాంప్రదాయానికి చెందిన అభ్యుదయ మతానికి, ఉపనిషత్తులలోను, పురాణాలలోను పేర్కొనబడ్డ దేవతల యొక్క అధ్యాత్మిక, మానసిక వృత్తులకి, మధ్య ఎంతో తేడా ఉంది. ఏ సంస్కృతిలో నైనా మానవ మతం యొక్క ప్రప్రథమ వికాసమాన దశలలో బాహ్యమైన ప్రకృతి శక్తుల అర్చన కనిపిస్తుందని, మనిషికి తన అంతర్యంలో స్ఫురించే చైతన్యాన్ని, వ్యక్తిత్వాన్ని బాహ్య ప్రకృతి

శక్తుల మీద ఆధ్యారోపించడం సహజమేనని, వివరించే ఆధునిక సిద్ధాంతాన్ని ప్రస్తుతానికి మనం స్వీకరిద్దాం.

వేదంలో అగ్ని అంటే నిస్సందేహంగా నిప్పు అనే అనుకోవాలి. అలాగే సూర్యభగవానుడు అంటే సూర్యుడు. పర్జన్యం అంటే వర్షామేఘం. ఉష అంటే వేకువ. ఇక మరి కొందరు దేవతల విషయంలో వారి క్రియలు గాని, ధర్మాలు గాని స్పష్టంగా లేకపోతే, ఆ దేవతల పేర్ల వ్యుత్పత్తిలోకి సునిశితంగా శోధించి, దానికి కాస్తంత ఊహాగానం జోడించి, ఆ దేవతల లక్షణాలని అర్థం చేసుకునే ప్రయత్నం చేయొచ్చు. ఆధునిక చారిత్రక కాలమానం ప్రకారం, వేదకాలానికి తరువాత వచ్చినా, ఆ కాలానికి మరీ దూరంలో లేని ప్రాచీన గ్రీకు సాంప్రదాయంలో మాత్రం గణనీయమైన తేడా కనిపిస్తుంది. ఆ సాంప్రదాయానికి చెందిన దేవతల విషయంలో, వారికి ఉద్దేశింపబడ్డ ఆంతరిక ధర్మాలు, వారి భౌతిక ధర్మాల కన్నా ఉన్నతమైనవిగా, ప్రధానమైనవిగా పరిణమించాయి. ప్రాచీన గ్రీకు సాంప్రదాయంలో ప్రచండుడైన అగ్ని దేవత కాస్తా తదనంతర కాలంలో మరింత శాంతస్వభావుడైన కర్మ దేవతగా మారాడు. అలాగే సూర్యసమానుడైన అపోలో, కవితా స్ఫూర్తికి, తాత్విక అభినివేశానికి అధిదేవత అయ్యాడు. ఉషస్సుకి ప్రతీక అయిన ఏథీన్ దేవత, తన భౌతిక ధర్మాలన్నీ మర్చిపోయి జ్ఞానానికి అధిదేవత అయ్యింది. అలాగే యుద్ధం, ప్రేమ, సౌందర్యం ఇలా ఎన్నిటికో ప్రతీకలైన దేవతలందరి విషయంలోను భౌతిక కర్మలు మటుమాయం అయిపోయాయి, విస్మరించబడ్డాయి. మానవ నాగరికత యొక్క పురోగమన క్రమంలో ఇలాంటి మార్పు అనివార్యం అంటే సరిపోదు. ఆ మార్పు వెనుక ఉన్న కారణాలని శోధించాలి, విశదీకరించాలి. ఈ మార్పు గ్రీకు పురాణంలో ఎలా జరిగిందో, మన పురాణాలలో

కూడా దేవతల పేర్లలో, ప్రతీకలలో జరిగిన ప్రతిక్షేపం ఇంచుమించు అదే విధంగా జరిగింది. సరస్వతీ నది విద్యాదేవతగా మారింది. వేదాలలోని విష్ణువు, శివుడు ఇప్పుడు అత్యుత్తమ భగవత్తత్వానికి ప్రతీకలు అయ్యారు. విశ్వం యొక్క వికాసాన్ని, వినాశనాన్ని శాసించే దేవతలుగా త్రిమూర్తులలో చేరిపోయారు. ఈశోపనిషత్తు సూర్యుణ్ణి జ్ఞాన ప్రకాశనానికి అధిదేవతగా స్తుతిస్తుంది. ఆయన ప్రభావంతో అత్యుత్తమ జ్ఞానాన్ని చేరుకోవచ్చని అంటుంది. కొన్ని వేల ఏళ్లుగా ప్రతీ బ్రాహ్మణుడు తన నిత్య కర్మలలో భాగంగా జపిస్తూ వచ్చిన గాయత్రీ మంత్రంలో కూడా సూర్యుడికి ఈ విధమైన ధర్మమే ఆపాదించబడింది. ఋగ్వేదంలో ఋషి విశ్వామిత్రుడు వ్రాసిన భాగం నుండి ఈ మంత్రం వచ్చిందని ఇక్కడ గుర్తించాలి. అదే ఉపనిషత్తులో అగ్ని దేవుడు పాపాలని తొలగించి పావనం చేసే పావకుడిగా, సన్మార్గాన మానవాత్మని దివ్యానందం వద్దకు కొనిపోయే మార్గదర్శిగా, మానవ చర్యల వెనుక ఉండే ఇచ్ఛాశక్తిగా కూడా, కీర్తించబడతాడు. ఇతర ఉపనిషత్తులలో దేవతలు మనిషిలోని ఐంద్రియశక్తులకి ప్రతీకలు అన్నది స్పష్టంగా కనిపిస్తుంది. వేద యజ్ఞానికి అవసరమైన మహత్తర మధుపానాన్ని అందించే 'సోమం' అనే మొక్క కాస్తా చంద్రభగవానుడితో సమానం కావడమే కాక, మనిషిలోని మనస్సుని శాసించే దేవతగా గుర్తించబడింది. ఈ పరిణామాలన్నీ బహుళదేవతాసహితమైన ఉపాసనకి, పార్థివ అర్చనా సాంప్రదాయనికి నెలవైన వేద కాలం తరువాత వచ్చినవని అనుకోవాలి. అలాగే దేవతలపై అధ్యాత్మిక ధర్మాలు ఆరోపించబడ్డ కాలానికి ముందు వచ్చినవని అనుకోవాల్సి ఉంటుంది. వేదకాలానికి చెందిన మతంలోని ప్రకృతి నిబద్ధమైన అంశం మీదనే మనం అనన్యంగా దృష్టి నిలపడం వల్లనే ఇలాంటి వెలితి పుట్టుకొచ్చినట్టు కనిపిస్తోంది.

అయితే ఆ వెలితి మనం చేజేతులా సృష్టించుకున్నదే గాని ఆ ప్రాచీన, పవిత్ర రచనలలో లేదని నాకు అనిపిస్తోంది. మానవ చింతన యొక్క తొలిదశలకి చెందిన అద్భుతఘట్టం యొక్క లిఖితరూపమే ఋగ్వేదం అని నేను ప్రతిపాదిస్తున్నాను. చరిత్రాత్మకమైన ఎల్యుసీనియన్, ఆర్ఫిక్ నిగూఢదశలు కూడా ఆ అపూర్వ ఆది దశ యొక్క పెళుసైన అవశేషాలే. మరి ఆ దశలలో మానవజాతికి చెందిన అధ్యాత్మిక, తాత్విక జ్ఞానం అంతా గుప్తంగా ఎందుకు ఉంచబడిందో ప్రస్తుతం అంతుచిక్కడం లేదు. అధములకి, అనర్హులకి అందకుండా ఆ జ్ఞానం అంతా స్థూల, భౌతిక ప్రతీకలలోను, ముసుగులలోను గూఢంగా ఉంచబడింది. ఆ ఆత్మజ్ఞానాన్ని, దేవతల వరమైన ఋత జ్ఞానాన్ని, పవిత్రంగా, గుప్తంగా ఉంచడం ఆ ప్రాచీన ఋషుల ముఖ్యోద్దేశం అనిపిస్తోంది. అలాంటి ప్రజ్ఞ సామాన్య మానవ మనస్సుకి అందడం అనుచితమే కాక అపాయకరం కూడా అని వాళ్లు భావించి ఉంటారు. ఆ జ్ఞానం అపరిపక్వ, అపరిశుద్ధ మనస్సులకి అందితే దాన్ని వాళ్లు వక్రపరిచి, దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. అందుకే ఋషులు అనుత్తమమైనదే అయినా ఫలదాయకమైనది కనుక అధములకి బాహ్యపూజని బోధించారు. అర్హులకి ఆంతరిక మార్గాన్ని బోధించారు. అందుకే అర్హులకి అంతరార్థం స్ఫురించేలా, బాహ్యపూజా మార్గాన్ని అనుసరించే జనసామాన్యానికి స్థూలార్థం స్ఫురించేలా వారు ద్వంద్వార్థం గల భాషనే ప్రయోగిస్తూ వచ్చారు. వేదఋక్కులన్నీ ఈ ప్రాతిపదిక మీదనే సూత్రీకరించబడ్డాయి, నిర్మించబడ్డాయి. అందులోని శ్లోకాలు, కర్మకాండలు అన్నీ బాహ్యంగా చూస్తే ఆ కాలంలో ప్రచారంలో ఉన్న సామాన్య మతంతో పొసగే విధంగా ప్రకృతి పూజలోని సాధారణ విశేషాలుగా

గోచరిస్తాయి. కాని ఆంతరికంగా చూస్తే అవన్నీ ఆనాటి మానవజాతికి సాధ్యమైన అత్యుత్తమ ఆత్మిక సంస్కృతిని, అధ్యాత్మిక వికాస మార్గాన్ని, అనుభవాన్ని, జ్ఞానాన్ని వ్యక్తం చెయ్యగల వీలైన, మేలైన పదాలుగా ద్యోతకమవుతాయి. సాయణాచార్యుడు గుర్తించిన బాహిరమైన కర్మకాండ అంతా వాస్తవమైనదే కావచ్చు. ఐరోపా పండితులు సూచించిన ప్రకృతిగతమైన అన్వయాన్ని కూడా స్వీకరించవచ్చు. కాని వాటి వెనుక ఎప్పుడూ దాగి వున్న వేదరహస్యం ఒకటుంది. పరిశుద్ధాత్ముడిని, ప్రబుద్ధ మానసుడిని ఉద్దేశించి పలికిన రహస్య పదాలవి (*నిణ్యా వచాంసి*). వేద శబ్దాల నిజార్థాన్ని ముందు స్థిరంగా స్థాపించి, వాటి సహాయంతో గుప్తంగా ఉన్న, అతి ముఖ్యమైన ఈ అంతరార్థాన్ని వెలికితీసి, వేదప్రతీకల అర్థాన్ని, దేవతల ఆత్మగత క్రియలని నిర్ణయించడం కష్టమే కాని, అత్యవసరమైన కార్యం. ఈ పుస్తకంలోని వివిధ అధ్యాయాలు, వాటి చివరిలో వచ్చిన అనువాదాలు అన్నీ ఆ దిశలో ఒక సన్నాహం అవుతాయి.

ఈ ప్రతిపాదన సమంజసమైనది అని తేలితే దాని వల్ల మూడు ప్రయోజనాలు ఉంటాయి. దీని వల్ల ఉపనిషత్తులలో ఇంతవరకు సరిగ్గా అర్థం గాక, లేకుంటే తప్పుగా అర్థమైన విభాగాలు మరింత సరళంగా, సఫలదాయకంగా అర్థమవుతాయి. అలాగే పురాణాల మూలాల గురించి కూడా అర్థమవుతుంది. భారతీయ ప్రాచీన సాంప్రదాయం సమస్తాన్ని సహేతుకంగా వివరించడానికి వీలవుతుంది. వేదాంతం, పురాణం, తంత్రం, తాత్విక సాంప్రదాయాలు, ఘనమైన భారతీయ మతాలు – అన్నిటికీ మూలం వేదమే నని తెలుస్తుంది. వాటి తొలి బీజాలు అక్కడ మనకి కనిపిస్తాయి. తదనంతరం వచ్చిన భారతీయ

చింతనకి కూడా మూలాలు అక్కడ కనిపిస్తాయి. ఆ విధంగా భారతీయ నేపథ్యంలో తులనాత్మక మత పరిశోధనకి ఒక స్థిరమైన వేదిక ఏర్పడుతుంది. అర్థం లేని హఠాత్ పరిణామాలకి, అర్థం కాని సంక్రమణాలకి వివరణ వెతికే ప్రయత్నంలో వ్యర్థ ఊహాగానలతో ఇక కాలయాపన చెయ్యనవసరం లేదు. హేతువుని తృప్తిపరిచే విధంగా, సహజమైన, ప్రగతిశీలమైన పురోగమన రహస్యం మనకి అవగతం అవుతుంది. ప్రాచీన దేశాలకి చెందిన వివిధ పౌరాణిక గాధలలోని అవకతవకలని కూడా అర్థం చేసుకునే వీలు ఉంటుంది. పైపైన చూసే దృష్టికి మాత్రమే ఆ అవకతవకలు కనిపిస్తాయి. లోతైన అంతరార్థాన్ని పొడచూడగల్గితే అవి మాయమవుతాయి. ఆ ఆంతరిక సూత్రాన్ని పట్టుకోగలిగితే ఋక్కులు సహేతుక, సజీవ సమస్తాలుగా ద్యోతకమవుతాయి. అందులోని భావప్రకటనా పద్ధతి, ఆధునిక పద్ధతితో పోల్చితే కాస్త అపరిచితంగా అనిపించినా, ఎంతో సమంజసంగా, సంక్షిప్తంగా తోచుతుంది. నిరర్థక శబ్ద పుష్టికి బదులు, పరిమిత పదజాలంలో అపరిమిత భావసంపదని కుదించే ధోరణి కనిపిస్తుంది. కిరాతుల జీవన శైలిని తెలిపే అవిశేష కథనంగా కాక, ప్రపంచ ప్రాచీన సద్గ్రంథాలలో అత్యుత్తమ స్థానాన్ని ఆక్రమించే రచనగా వేదం సాక్షాత్కరిస్తుంది.

అధ్యాయం – 2

వైదిక సిద్ధాంతం – సింహావలోకనం

మన మేధోజన్య తత్వచింతనా సాంప్రదాయాల కన్నా పురాతనమైన యుగానికి చెందిన రచన వేదం. ఆ ఆదిమ యుగంలో ఆలోచన మన తార్కికమైన హేతుశక్తి కన్నా భిన్నమైన

మార్గాలని అనుసరించింది. భాష మన ఆధునిక ప్రమాణాలు అసమ్మతమని భావించే ధోరణులని అలవరచుకుంది. ఆ యుగంలో విప్రోత్తములు, సామాన్య మానవ దైనిక వ్యవహారాలకి, ఇంద్రియ వృత్తులకి అతీతమైన జ్ఞాన రంగాలలో వ్యవహరిస్తున్నప్పుడు ఎప్పుడూ ఆంతరిక అనుభూతి మీదను, లోజ్ఞానం ఇచ్చే సూచనల మీదను ఆధారపడేవారు. వారి లక్ష్యం ఆత్మప్రకాశనం, తార్కిక నిరూపణం కాదు. వారి ఆదర్శం అంతఃప్రేరణ గల ఋషి. సునిశిత బుద్ధి గల తార్కికుడు కాదు. వేదమూలాలకి సంబంధించిన ఈ సత్యాన్ని భారతీయ సాంప్రదాయం భద్రంగా పదిలపరిచింది. ఋషి అంటే ఋక్కులని కూర్చిన ఓ వ్యక్తి కాడు. ఓ సనాతన సత్యాన్ని, వ్యక్తికి అతీతమైన జ్ఞానాన్ని, దర్శించిన ఓ ద్రష్ట. వేద భాషని 'శ్రుతి' అంటారు. ఋక్కులలోని లయ బుద్ధి కూర్చినది కాదు. అది వినిపించినది. వ్యక్తికి అతీతమైన జ్ఞానాన్ని అందుకోవడానికి ఆత్మశిక్షణ చేత సంసిద్ధుడైన మానవుడి అంతశ్శ్రవణానికి వినిపించిన, అనంతుడి లోంచి పెల్లుబికిన, ఓ దివ్య ధ్వని. అసలు దృష్టి (చూపు), శ్రుతి (వినికిడి) అనే పదాలు వైదిక పరిభాషకి చెందినవి. ఈ పదాలే కాక వైదిక పరిభాషకి చెందిన మరెన్నో పదాలు వేద జ్ఞానం యొక్క ప్రగాఢమైన, పవిత్రమైన తత్వాన్ని సూచిస్తాయి.

ఆత్మప్రకాశనం అన్న వైదిక భావనలో అదేదో మహిమాన్వితమైనది, లోకోత్తరమైనది అన్న భావన ధ్వనించదు. ఆ సామర్థ్యాన్ని అలవరచున్న ఋషి క్రమబద్ధమైన ఆత్మశిక్షణ ద్వారా ఆ శక్తిని సాధిస్తాడు. జ్ఞానం అంటే ప్రయాణించడం, అందుకోవడం, కనుక్కోవడం, గెలుచుకోవడం. ఆ మార్గాంతంలో కలిగేదే ఆత్మప్రకాశనం. చరమ విజయానికి బహుమతి ఆత్మతేజం. ఈ యాత్ర అనే భావన, సత్యం దిశగా జీవాత్మ సలిపే యాత్ర అన్న భావన, వేదంలో మనకి తరచు ఎదురవుతూ ఉంటుంది. ఆ యాత్రలో జీవాత్మ ముందుకి సాగుతూ పైపైకి అధిరోహిస్తుంది. దాని ఆకాంక్ష ఫలితంగా కొత్త చైతన్య, తేజో భూమికలు విప్పారుతాయి. ప్రతాపవంతమైన కృషి చేత మరింత విస్తారమైన అధ్యాత్మిక ఐశ్వర్యాన్ని గెలుచుకుంటుంది.

చారిత్రక దృష్టితో చూసినప్పుడు, మానవజాతి దాని సమిష్టి పురోగమన పథంలో, ఒక దశలో సాధించిన ఓ మహత్తర ప్రగతికి ఆనవాలుగా వేదం గోచరిస్తుంది. అంతరంగ బహిరంగాలలో జరిగే ఆత్మసమర్పణను వర్ణించే కర్మకాండమే వేదం. ప్రకృతిగత, పాశవిక మానవుడికి అందని అనుభవైక, భావ భూమికల ఆవిష్కరణని, ఆరోహణని కీర్తిస్తూ, మర్త్యమానవుడిలో పనిచేసే దివ్య తేజాన్ని, శక్తిని, కృపని కొనియాడుతూ, ఆత్మ పాడే విజయగీతికే వేదం. కనుక అది బుద్ధిగత వృత్తి నుండి, విశృంఖల ఊహాగానం నుండి పుట్టిన ఫలితాల లిఖిత రూపం మాత్రం ససేమిరా కాదు. అందులో ఆదిమ మత శాసనాల ఆనవాళ్లు లేవు. పొందిన అనుభవాలలోని సామాన్యత కారణంగా, అందుకున్న జ్ఞానంలోని వ్యక్తిరాహిత్యం కారణంగా, కొన్ని స్థిర భావాలే వేదంలో పదే పదే ఆవృత్తమై వస్తుంటాయి. ఆ భావాలు ఒక స్థిరమైన ప్రతీకాత్మక భాషలో వ్యక్తం అవుతుంటాయి. మరి మానవ భాష యొక్క ఆ ఆదిమ దశలలో అలాంటి భావజాలం యొక్క వినియోగం సహజమేనేమో. ఆ దశలో మానవజాతి యొక్క సామాన్య మానసానికి అందని తత్వాన్ని వ్యక్తం చెయ్యడానికి అవసరమైన మాంత్రిక భావప్రకటనా శక్తితో పాటు కచ్చితమైన నిర్దిష్టత గల అటువంటి భాషాప్రయోగం అనివార్యమేమో. అవే భావాలు పలు ఋక్కులలో పదే పదే ఆవృత్తం అవుతూ, అవే స్థిర శబ్దాలతో, అలంకారాలతో, సమాసాలతో మళ్లీ మళ్లీ కనిపిస్తూ ఉంటాయి. ఆలోచనలో కొత్తదనం కోసం గాని, భాషలో నవ్యత కోసం గాని, కవితలో వన్నెపోని సృజన కోసం గాని పాటుపడుతున్నట్టు కనిపించదు. కవితా లాలిత్యం మీద గాని, వైభవం మీద గాని, సౌందర్యం మీద గాని వేదఋషుల ధ్యాస ఉన్నట్టు అగుపించదు. ఒక విధమైన దివ్యగణిత సూత్రావళి మీద నిర్మితమైన పవిత్ర ఛందోరూపాన్ని ఆలంబనగా చేసుకుని వేదఋషులు శిష్య, ప్రశిష్యుల అవిచ్ఛిన్న పారంపర్యానికి సనాతన జ్ఞానాన్ని సుస్థిరంగా బోధిస్తూ వచ్చారు.

వేద ఋక్కులు తీరుగా ఛందోబద్ధమై ఉంటాయి. వాటి ప్రయోగంలో మారని సునిశితత్వం, నైపుణ్యం కనిపిస్తాయి. శైలిలో, కవితా స్వరూపంలో గొప్ప వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాయి. అవి కరుకైన కిరాతులో, అనాగరిక కర్మకారులో చేసిన సృష్టి కావు. ఆత్మాలోకిత ప్రేరణ ప్రోద్బలంగా, గంభీర, సునిర్దేశ్య గమనంలో సృజన చేస్తున్న, సచేతనమైన, పరమోత్కృష్టమైన కళ యొక్క ఉఛ్వాస నిశ్వాసాలు ఆ కవితలు. ఇంత ప్రగాఢ సృష్టి కూడా

ఒకే నిశ్చిత పరిధిలోను, మారని కవితా సామగ్రి తోను కూర్చబడినట్టు కనిపిస్తుంది. ఎందుచేతనంటే ఋషులకి కళాత్మక వ్యక్తీకరణ కేవలం ఒక సాధనం మాత్రమే, ముఖ్య లక్ష్యం కాదు. వారి ప్రధాన ధ్యాస అంతా అత్యంత క్రియాశీలమైన, ప్రయోజనాత్మకమైన (ప్రయోజనాత్మకత అన్న పదానికి సమున్నత అర్థాన్ని తీసుకుంటే) లక్ష్యం మీదే వుంది. ఋక్కుని కూర్చిన ఋషికి ఆ ఋక్కు, తనకి, అన్యులకి కూడా అధ్యాత్మిక పురోగతి సాధించడానికి ఒక మార్గం మాత్రమే. అది అతడి ఆత్మ నుండి ఉదయిస్తుంది. అతడి మనసులో ఓ శక్తి అవుతుంది. అతడి అంతర్జీవన చరిత్రలో ఓ ప్రధాన, లేక కీలక ఘట్టంలో చేయబడ్డ ఆత్మాభివ్యక్తీకరణకి సాధనం అవుతుంది. తనలోని వేలుపుని వ్యక్తం చెయ్యడంలో అది దోహదం చేస్తుంది. చెడుకి ప్రతీక అయిన భక్షకుణ్ణి నాశనం చెయ్యడంలో సహాయం చేస్తుంది. పరిపూర్ణత కోసం శ్రమించే ఆర్యవీరుడి చేతిలో ఆయుధం అవుతుంది. కొండ వాలు మీద సంచరించే ఆవర్తకుణ్ణి, మార్గమధ్యంలో ఎదుటపడే తోడేలుని, సెలయేళ్ల వద్ద పొంచి వుండే చోరుణ్ణి చెండాడే దేవేంద్రుడి వజ్రాయుధంలా మెరుపులా పెల్లుబుకుతుంది.

వైదిక చింతనలోని మారని సారంతో పాటు అందులోని లోతు, సునిశితత్వం, శిల్పసౌందర్యాలని జోడించి పరిగణిస్తే కొంత ఆసక్తికరమైన చర్చకి అవకాశం ఏర్పడుతుంది. అంత సుస్థిరమైన శిల్పం, సారం ఒక జాతి యొక్క చింతనా చరిత్ర యొక్క, అనుభవైక చరిత్ర యొక్క తొలిదశలలో సాధ్యం కాదని సులభంగా వాదించడానికి వీలవుతుంది. కనుక మనకి తెలిసిన వేద సంహిత ఒక ప్రత్యేక కాలం యొక్క ఆరంభాన్నో, వికాస క్రమంలోని మధ్యంతర స్థితులనో, కాకుండా అంతిమ స్థితిని సూచిస్తోందని అనుకోవలసి వస్తుంది. వేదంలో మనం అత్యంత ప్రాచీనం అని తలపోసే ఋక్కులు కూడా, ఒక విధంగా కొంచెం అర్వాచీన పరిణామానికి చిహ్నాలు కావచ్చు. మరింత పూర్వపు మానవ భాషలో వ్యక్తం చెయ్యబడ్డ ప్రాచీన దివ్యగీతికలని, కాస్త అర్వాచీనమైన, నమ్యమైన శిల్పంలో పోతపోయగా పుట్టిన

రచనలు కావచ్చు[1]. లేదా అసలు వేదసాహిత్యం సమస్తమూ, ఏదో ప్రాచీన ఆర్య కవితా రాశి నుండి వేద వ్యాసుడు ఎంచుకున్న కొన్ని ప్రత్యేక గీతాల సముదాయమే కావచ్చు. మరి అపారమైన వ్యాస సంకలనం చేశాడు కనుకనే వ్యాసుడికి ఆ పేరు వచ్చింది. ఆసన్నమవుతున్న కలియుగం దిశగా, చిక్కనవుతున్న సంజె కాంతికి, చరమాంధకారానికి నెలవయిన రాబోయే శతబ్దాల దిశగా, దృష్టి సారించిన కృష్ణ ద్వైపాయన వ్యాసుడి యొక్క సృష్టి వేదం. ప్రజ్ఞానమయ యుగాలకి, విరాజమాన ఉషస్సులకి చెందిన మన 'పితరులు' తమ వారసులకి అందించిన ఆఖరి వీలునామా వేదం. అధోతలాల దిశగా, భౌతిక జీవనం దిశగా, బుద్ధి గత, తార్కిక, హేతు నిబద్ధమైన జీవనం దిశగా ఉన్ముఖులైన మానవాళికి వారు అందించిన చరమ సందేశం వేదం.

అయితే ఇవన్నీ నిరాధారిత ఊహాగానాలే, అనుమానం చేత గ్రహించే విషయాలే. మానవ యుగ చక్రంలో గతానికి చెందిన భావ జాలం మరుగుపడడం, వినష్టం కావడం తరచు కనిపిస్తుంటుంది. వేదం విషయంలో అదే జరిగినట్టుంది. వేదం తరువాత భారతీయ అధ్యాత్మిక చరిత్రలో మహర్దశగా చెప్పుకోదగ్గ వేదాంత యుగారంభానికే వేద చింతన బాగా మరుగుపడిపోయింది. ప్రాచీన వైదిక జ్ఞానం నుండి వీలైనంత భాగాన్ని సంరక్షించి దానికి కొత్త ఊపిరి పోయడానికి ప్రయత్నించింది వేదాంతం. ఒక విధంగా ఈ పరిణామం అనివార్యమే ననిపిస్తుంది. ఎందుకంటే వేద ఋషులు సంస్థాపించిన చింతనా వ్యవస్థ సాధారణ మానవాళికి అందరాని అనుభవాల మీద ఆధారపడినది. ఆ శోధనలో వారికి ఉపయోగపడ్డ చేతనా సామర్థ్యాలు సామాన్యులలో ప్రచ్ఛన్నంగా ఉంటాయి. లేక అసంపూర్ణంగా వికాసం చెంది ఉంటాయి. ఆ సామర్థ్యాలు కొందరిలో మేలుకొని వున్నా, వాటిలో ఎన్నో అనుచిత అంశాల మేళవం కనిపిస్తుంది. సత్యాన్వేషణలో ఆరంభంలో ఉండే శోధనా తీవ్రత

[1] వేదంలో "ప్రాచీన" మరియు "ఆధునిక" (పూర్వః... నూతనః) ఋషుల ప్రస్తావన వస్తుంటుంది. ఆ ప్రాచీన ఋషులని ఇంచుమించుగా దేవతామూర్తులుగాను, జ్ఞానానికి మూలవిరాట్టులుగాను పరిగణించవచ్చునేమో.)

నెమ్మదించాక, వేసటతో కూడుకున్న దశలు రావచ్చు. అలాంటి దశలలో పాత సత్యాలు పాక్షికంగానైనా వినష్టం కావచ్చు. అలా వినష్టమైన భావసారాన్ని ఆ ప్రాచీన గీతాల పునఃపరిశీలన ద్వారా తిరిగి సాధించడం అంత సులభం కాదు. ఎందుకంటే వేదబుక్కులు ఉద్దేశపూర్వకంగా ద్వంద్వార్థాన్ని సూచించే భాషలో కూర్చబడ్డాయి.

ఒకసారి మూలరహస్యం తెలిస్తే మనకి అర్థం కాని భాష కూడా అర్థమయ్యే అవకాశం వుంటుంది. కాని ఉద్దేశపూర్వకంగా ద్వంద్వార్థంతో చేసిన రచన లోని అంతరార్థాన్ని వెలికి తీయడం మరింత కష్టం. ఎందుకంటే అందులో శోధనని తప్పుదోవ పట్టించే ఎరలు ఎన్నో ఉంటాయి. కనుక భారతీయ మానసం మరలా వేదంలోని అంతరార్థాన్ని తెలుసుకోగోరే ప్రయత్నం చేసినప్పుడు ఆ కార్యం కఠినంగా తోచింది, పాక్షిక విజయమే లభించింది. ఈ రహస్యాన్ని ఛేదించగల ఒక్క మూలం మాత్రమే ఇంక మిగిలింది. వేదమంత్రాలని జ్ఞాపకం పెట్టుకుని పారంపర్యంగా ప్రచారం చేసే వాళ్లు, లేదా వైదిక కర్మకాండకి అధ్వర్యం వహించే వాళ్లు, మనకి అందించే ఆ ప్రాచీన, సాంప్రదాయక జ్ఞానం మాత్రమే మనకు మిగిలింది. అసలు వేదమంత్రాల బోధన, కర్మకాండ నిర్వహణ – ఈ రెండు కార్యాలు మొదట్లో ఏకమై వుండేవి. తొలిరోజుల్లో యజ్ఞం చేసే యాజ్ఞికుడే వేదగురువు కూడా అయ్యేవాడు. కాని వేదంలోని తేజం, సారం అప్పటికే మరుగుపడిపోయాయి. వైదిక కర్మకాండ జరిపించే మేటి పురోహితులకి కూడా ఆ మంత్రాలలోని శక్తి గురించి, వాటి అంతరార్థం గురించి అపరిపూర్ణమైన అవగాహన మాత్రమే వుండేది. ఎందుకంటే వైదిక కర్మకాండలోని బాహ్యాచారం అందులోని ఆంతరిక జ్ఞానం మీద ఓ దట్టమైన బెరడులా పేరుకుపోయింది. ఏ ఆంతరిక సారానికి అది రక్షక కవచంగా మొదట్లో ఏర్పాటు చెయ్యబడిందో ఆ ఆంతరిక సారానికి కారాగారంలా పరిణమించింది. ప్రతీకాత్మకంగా జరిపించే కర్మకాండలోని శక్తి క్రమంగా హరించుకుపోసాగింది. ఆ ప్రాచీన పునీత గీతంలోని తేజం తొలగిపోయింది. కరుకైన, అయోమయమైన ఉపరివిషయం మాత్రమే మనకి మిగిలింది.

వేద ఋక్కులని, కర్మకాండని ఆరంభంగా తీసుకుని అధ్యాత్మిక చింతన మీద, అనుభవం మీద ఓ కొత్త వ్యాఖ్యానంగా వెలువడ్డ కృతులే బ్రాహ్మణాలు, ఉపనిషత్తులూను. అలా ఆరంభమైన అధ్యాత్మిక పునరుద్దీపనంలో రెండు పరస్పర పరిపూరక అంశాలు ఉన్నాయి. ఒకటి గతానికి చెందిన బాహ్యరూపాల సంరక్షణ. రెండవది వేద సారం యొక్క నవ్య ప్రకటన. ఇందులో మొదటి దానికి బ్రాహ్మణాలు చిహ్నాలు. రెండవ దానికి ఉపనిషత్తులు సంకేతాలు.

వైదిక కర్మకాండకి చెందిన సూక్ష్మాలని, వాటి భౌతిక సాఫల్యానికి కావలసిన నిబంధనలని, అందులోని వివిధ విభాగాల యొక్క, క్రియల యొక్క, ఉపకరణాల యొక్క ప్రయోజనాన్ని, ప్రతీకాత్మక అంతరార్థాన్ని, కర్మకాండకి సంబంధించిన వివిధ మంత్రాల యొక్క ప్రాముఖ్యతని, గతించిన గాధల, సాంప్రదాయాల జ్ఞాపకాలని తిరిగి స్థాపించి, సుస్థిరంగా ప్రతిష్ఠించడమే బ్రాహ్మణాల లక్ష్యం. అందులో ప్రస్తావించబడ్డ ఎన్నో గాధలు ఋక్కుల కన్నా పురాతనమైనవని స్పష్టంగా తెలుస్తుంది. అప్పటికే అర్థం కాకుండా పోయిన ఎన్నో విభాగాలని వివరించడం కోసం ఆ గాధలు కల్పించబడ్డాయి. ఇక మరి కొన్ని గాధలు, కథలు ప్రతీకాత్మక పద్ధతిని వాడిన ప్రాచీన కవుల ఉపకరణాలు మాత్రమే కావచ్చు. లేదా ఋక్కులు విరచించబడ్డ కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘట్టాలే కావచ్చు. మౌఖిక సాంప్రదాయంలో జ్ఞానాన్ని ప్రసారం చేసినప్పుడు అందులోని తేజం మరుగుపడే అవకాశం ఎక్కువ. పాత ప్రతీకల స్థానంలో కొత్త ప్రతీకలు వచ్చినప్పుడు, పాత జ్ఞానాన్ని కొత్త ప్రతీకలు కప్పిపుచ్చే ప్రమాదం వుంది. కనుక బ్రాహ్మణాలలో ఎన్నో ఆసక్తికరమైన సూచనలున్నా అందులో మన పరిశోధనకి పనికొచ్చే అంశాలు బహుతక్కువ. వివిధ వేద విభాగాల అంతరార్థాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో అవి విశ్వసనీయమైన మార్గదర్శకాలు కాలేవు. ఎందుకంటే బ్రాహ్మణాలు వేదాలలోని స్థూలార్థాన్నే నిశితంగా నిర్ధారించే పద్ధతిని అవలంబిస్తాయి. వేదసారాన్ని వెలికి తీయాలంటే అటువంటి పద్ధతి సముచితం కాదు.

ఉపనిషత్తు వ్రాసిన ఋషులు అవలంబించిన పద్ధతి పూర్తిగా వేరు. ధ్యానం చేత, అధ్యాత్మిక అనుభూతి చేత వినష్టమైన జ్ఞానాన్ని తిరిగి సాధించే ప్రయత్నం చేశారు వీళ్లు. వారి సొంత

అనుభూతులకి, అంతఃప్రకాశనాలకి వేదమంత్రాలని ఒక ఆధారంగా, ప్రమాణంగా వాడుకున్నారు. వేద శబ్దాన్ని భావబీజంగా వాడుకుని పాత సత్యాలని కొత్త రూపాల్లో పునరావిష్కరించారు. అలా ఆవిష్కరించిన దాన్ని వారు జీవించిన వర్తమాన యుగానికి చెందిన పరిభాషలో వ్యక్తం చేశారు. వేదమంత్రాలతో వారు వ్యవహరించిన తీరులో ఓ ప్రత్యేక వ్యక్తిగత ఉద్దేశం వుంది. ఒక గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్న పండితుడు ఆ గ్రంథంలోని శబ్దాల, వాక్యాల అర్థాన్ని వీలైనంత కచ్చితంగా, నిర్దుష్టంగా స్థాపించాలని పాటుపడతాడు. కాని ఉపనిషత్ రచయితల కాంక్ష అటువంటిది కాదు. వారు అన్వేషిస్తున్నది భాషకి అతీతమైన సత్యం. ఏ అంతఃప్రకాశనం కోసం అయితే వారు పాటుపడుతున్నారో, దాన్ని సూచించడానికి పదాలు వీలైన సాధనాలు మాత్రమే. శబ్దం యొక్క వ్యుత్పత్తిని కొన్ని సార్లు విస్మరించేవారు, లేదా కొన్ని సందర్భాలలో సరైన వ్యుత్పత్తి వారికి తెలిసేది కాదు. పదంలోని ఉపశబ్దాల అన్వయంలో వారు వాడిన ప్రతీకాత్మక పద్ధతిని అర్థం చేసుకోవడం, అనుసరించడం సులభం కాదు. ఆ కారణం చేతనే, ఒక పక్క ప్రాచీన ఋషులు స్థాపించిన భావవ్యవస్థ పట్ల, మౌలిక భావనల పట్ల ఉపనిషత్తులు ప్రసరించే కాంతి అమూల్యమైనదే అయినా, మరో పక్క వేదాల యొక్క అసలు అర్థాన్ని ప్రకటించడంలో బ్రాహ్మణాలకు మల్లె ఇవి కూడా అంతగా ఉపకరించలేదు. ఉపనిషత్తుల అసలు ప్రయోజనం వేదాల అన్వయం కాదు, వేదాంతం యొక్క సంస్థాపనం.

ఈ మహత్తర విప్లవంలో నుండి ఓ సరికొత్త, శాశ్వత అధ్యాత్మిక, భావ లహరి జనించింది. వేదం లోనుండి వేదాంతం ఆవిర్భవించింది. ఆ పరిణామంలో పాత వైదిక చింతన యొక్క, సంస్కృతి యొక్క పతనానికి దారి తీసిన రెండు ఒరవడులు కనిపిస్తున్నాయి. మొదటది బాహ్యమైన కర్మకాండకి, మంత్రం యొక్క, యజ్ఞం యొక్క స్థూల ప్రయోజనాలకి ప్రాధాన్యత తగ్గిస్తూ, కేవలం అధ్యాత్మిక ప్రయోజనానికి, ఉద్దేశానికి ప్రాధాన్యత ఇచ్చే ఒరవడి. ప్రాచీన అధ్యాత్మికులు బాహ్యాంతరాలకి, ఐహికాముష్మికాలకి మధ్య సాధించిన సమతౌల్యం, సమన్వయం ఇప్పుడు భ్రంశమయ్యింది, భంగపడింది. ఓ కొత్త సమతౌల్యం, ఓ నవసమన్వయం సాధించబడింది. అది చివరికి సన్యాస మార్గం దిశగా, వైరాగ్యం దిశగా మొగ్గు చూపింది. తదనంతరం బౌద్ధమత ప్రభావం వల్ల అందులోని తదనుగుణమైన

లక్షణాలు మరింతగా అతిశయింపబడడం వల్ల, ఈ మధ్యలో సాధించబడ్డ సమతౌల్యం, సమన్వయం మరొక్కసారి భంగపడింది, భ్రంశం చెందింది. ప్రతీకాత్మకమైన కర్మకాండ, యజ్ఞం అర్థంలేని జ్ఞాపక చిహ్నాలుగా, ఓపలేని భారాలుగా పరిణమించాయి. క్రమంగా అవి యాంత్రికంగా, అప్రయోజకంగా మారాయి. వాటిలోని అంతరార్థం విస్మరించబడినా, కర్మకాండకి చెందిన సూక్ష్మాలన్నీ మొండిగా, తర్కరహితంగా అనుసరించబడుతూ వచ్చాయి. జాతీయ మానసంలో ఒక విభాగం వెనకటి ఆచారాలనే వదలకుండా అంటిబెట్టుకుంటూ వచ్చింది. అర్థం కాకపోవడం వల్ల ఆచారాలలోని సూక్ష్మాలన్నిటికీ అతిశయమైన ప్రాధాన్యత నిస్తూ తర్కరహితంగా వాటిని అమలు జరుపుతూ వచ్చింది. ఆ విధంగా వేదాంతానికి, వేదానికి మధ్య ఒక కరకైన విభజన ఏర్పడింది. సిద్ధాంతపరంగా లేకపోయినా ఆచరణలో మాత్రం అలాంటి విభజన లోతుగా కుదురుకుంది. ఆ విభజన "వేదం పురోహితుల కోసం, వేదాంతం ఋషుల కోసం" అనే సూత్రం చేత నిర్వచించబడింది.

వేదాంత విప్లవం తీసుకువచ్చిన మరొక ఒరవడి కూడా వుంది. ప్రాచీన అధ్యాత్మికులు వాడిన గాఢాపూరితమైన మేలిమి తెరని, అలంకార సంయుక్తమైన కవితా భాషని విడనాడి, ప్రతీకాత్మక భాషకి స్వస్తి చెప్పి, వాటి స్థానంలో మరింత సుస్పష్టమైన, తాత్వికమైన భాషని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఒరవడి మరింత ముదిరిపోయిన దశలో, వైదిక కర్మకాండ మాత్రమే కాక, వేద ఋక్కులు కూడా నిష్ప్రయోజనాలు అనే పరిస్థితి ఏర్పడింది. స్పష్టంగా, సూటిగా భావప్రకటన చేసే ఉపనిషత్తులు, భారతీయ చింతనకి తలమానికాలుగా భావింపబడుతూ, వాశిష్ఠ, విశ్వామిత్రుల మహత్తర శ్లోకాలని కూడా స్థానభ్రంశం చేశాయి. విద్యాబోధనకి వేదాలే ప్రమాణాలు అనే భావన క్రమంగా పట్టుసడలింది. శ్రద్ధతో, సద్బుద్ధితో వేదాలని అధ్యయనం చేసే సాంప్రదాయం బలహీనపడింది. వెనకటి ప్రతీకాత్మక భాష యొక్క వాడుక తగ్గింది. దాని అంతరార్థపు టవశేషాలు కూడా వినష్టమైపోయాయి. వైదిక పూర్వీకుల చింతనా సరళి కన్నా చాలా భిన్నమైన చింతనా సరళిగల కొత్త తరాలు ప్రవేశించాయి. లోజ్ఞాన యుగాలు అంతరించిపోయాయి. హేతు యుగపు ప్రథమ ఉషాకాంతులు ప్రసరించాయి.

ఆ విప్లవానికి బౌద్ధమతం చరమగీతం పాడింది. ప్రాచీన ప్రపంచానికి చెందిన బాహ్యా కర్మకాండలో, అర్థంలేని అడంబరం, యాంత్రికమైన ప్రయోజనం మాత్రమే మిగిలాయి. వైదిక

కర్మకాండని అది నిషేదించడానికి ప్రయత్నించింది. వెనుకటి గ్రాంథిక భాషలో మరింత సుపరిచితమైన వ్యావహారిక భాషని తీసుకురావాలని చూసింది. ఈ మధ్యలో పురాణాల మీద ఆధారపడ్డ కొత్త మతాల ఆవిర్భావం చేత హైందవ సాంప్రదాయం కొత్త ఊపిరి పోసుకుంది. ఆ కారణం చేత వేదప్రభావం మహర్దశని చేరుకునే తరుణం కొన్ని శతాబ్దాల కాలం వెనుకబడింది. ఆ ఆలస్యం వల్ల ప్రత్యేకంగా వేదాలకి ఒరిగినది ఏమీ లేదు. కొత్త మతాల ప్రాచుర్యం క్రమంగా పెరిగింది. కొత్త మతస్థులకి అర్థం కావడం కోసం ప్రాచీన కృతులని మరింత సరళమైన భాషలో, మరింత ఆధునికమైన సంస్కృతంలో తిరగరాయవలసి వచ్చింది. వేదాలని పురాణాలు పక్కకి తోశాయి. ప్రాచీన క్రతువుల స్థానంలో కొత్త మతాల ఆచారాలు వచ్చి చేరాయి. ఋషుల నుండీ పురోహితల వద్దకి ఒకప్పుడు వేదం ఎలా చేతులు మారిందో, ఇప్పుడు మళ్లీ పురోహితుల నుండి పండితుల వద్దకు మరొక్క సారి తన స్థానాన్ని మార్చుకుంది. ఆ మార్పే వేదార్థానికి సమాధి కట్టినట్టయ్యింది. దాని ఔచిత్యం యొక్క, పవిత్రత యొక్క ఆఖరి వెలుగులు ఇప్పుడు పూర్తిగా రూపుమాసిపోయాయి.

క్రైస్తవ సాంప్రదాయానికి పూర్వయుగాల నుండి నేటి వరకు వేదబుక్కుల విషయంలో వెలువడ్డ భారతీయ పాండిత్యం అంతా వ్యర్థ ప్రయాస అనుకోడానికి లేదు. వేదార్థం ఏనాడో వినష్టమైనా, వేదబుక్కు సజీవకృతిగా విలసిల్లే పరిస్థితి ఏనాడో మటుమాయమైనా, పండితుల నిర్విరామ కృషి వల్లనే వేదవాక్యం మనకి భద్రంగా మిగిలింది. వేదరహస్యాన్ని తిరిగి సాధించే ప్రయత్నంలో కూడా గత రెండు సహస్రాబ్దాల పాండిత్యం మనకి ఎన్నో అమూల్యమైన సాధనాలని విడిచిపెట్టింది. కచ్చితమైన స్వరంతో పాటు యదాతథంగా లభ్యమయ్యే వేదపాఠం, యక్ష, సాయణాది పండితుల ఘన వ్యాఖ్యానాలకి చెందిన పరిభాష మొదలైనవి అందుకు తార్కాణాలు. ఆ భాష్యాలలో ఎన్ని అనల్పమైన దోషాలున్నా, అవి అందించే పునాది మీదుగానే స్థిరమైన వేదాధ్యయనం దిశగా మొదటి మెట్టు వెయ్యడానికి వీలవుతోంది.

పండితవర్గం

రెండు వేల ఏళ్లుగా వేదపాఠం నిర్దోషంగా నిలిచి మనకి దక్కింది. మనకి తెలిసినంత వరకు వేదం గ్రీకు సంస్కృతి మహర్దశని చేరుకున్న యుగం కన్నా పాతది. ఆ దశలో భారతంలో మేధోవృత్తి అద్భుతంగా వెల్లివిరిసింది. ఈ భూమికి చెందిన ప్రాచీన సాహిత్యంలో వర్ణించబడ్డ సంస్కృతికి, నాగరికతకి మూలాలు వేదాల్లో ఉన్నాయి. వేదాలు కచ్చితంగా ఎంత పాతవో తేల్చి చెప్పడం కష్టం. కాని కొన్ని కొన్ని ఆధారాల బట్టి పరిగణించి చూసినప్పుడు వేదాలు అపారమైన పురాతనత కలిగినవని అనుకోవలసి ఉంటుంది. ప్రతీ అక్షరంలో, స్వరంలో నిర్దోషమైన వేదపాఠం వైదిక కర్మ కాండకి ఎంతో ముఖ్యం. పొల్లుపోని దోషరాహిత్యం ఉంటేనే యజ్ఞం సఫలం అవుతుంది. ఉదాహరణకి బ్రాహ్మణాలలో త్వష్టి తపస్సుకి చెందిన గాధ ఒకటుంది. ఇంద్రుడి చేత వధింపబడ్డ తన కుమారుడి మరణానికి ప్రతీకారంగా తపస్సు చెయ్యదలచాడు త్వష్టి. కాని స్వర స్థానాలలో పొరబాటు వల్ల మంత్రోచ్చారణలో దోషం వాటిల్లి, తన చేతిలో ఇంద్రుడు చావడానికి బదులు, ఇంద్రుడి చేతిలో తానే మరణించవలసి వస్తుంది. ప్రాచీన భారతీయుల అపారమైన జ్ఞాపక శక్తి కూడా లోకవిదితమే. అందుకే మహాభారతం వంటి ఇతిహాసాల విషయంలో ఆధునిక పరిష్కృత రూపాలు రావడం వల్ల, మూల కృతిలో ప్రగాఢమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కాని వేదం పరమపవిత్రంగా భావింపబడడం వల్ల కురువంశీయుల గాధ అయిన మహాభారతంలో జరిగినట్టుగా వేదపాఠంలో సవరణలు జరగలేదు. ఆ కారణం చేత మహర్షి, వేద సంకలనకారుడు అయిన వ్యాసుడు కూర్చిన రూపంలోనే వేదసంహిత మనకు సారాంశంగా సంక్రమించింది అని విశ్వసించవచ్చు.

అయితే అది సారాంశంగా మాత్రమే గాని ప్రస్తుత లిఖిత రూపంలో యదాతథంగా లేదు. వైదిక ఛందస్సుకి, సాంప్రదాయక సంస్కృత ఛందస్సుకి మధ్య ఎన్నో భేదాలు ఉన్నాయి. ముఖ్యంగా సాహితీ శిల్పానికి ఎంతో అవసరమైన సంధి విగ్రహ ప్రయోగంలో వైదిక ఛందస్సు మరింత చొరవ తీసుకుంది. వేదఋషులు కరకైన ఛందోసూత్రాల కన్నా ధ్వనిలో సహజత్వానికే ప్రాధాన్యత నిచ్చారు. కొన్ని సార్లు శబ్దాలని జోడించారు, మరి కొన్ని సార్లు జోడించకుండానే వదిలేశారు. కాని వేదం లిఖితరూపాన్ని సంతరించుకున్నప్పుడు మాత్రం సంధివిగ్రహ సూత్రాలు మరింత నిరంకుశమైన ప్రభావాన్ని ప్రసరించాయి. వైయాకరణులు పూనుకుని ప్రాచీన వేదపాఠాన్ని వ్యాకరణ సూత్రాలకి అనుసారం కచ్చితంగా తిరగరాశారు.

అయితే ఆ ప్రయత్నంలో వారు ఒక ముఖ్యమైన జాగ్రత్తను మాత్రం తీసుకున్నారు. మూల పాఠానికి అనుబంధంగా పాదపాఠాన్ని కూడా జోడించారు. అందులో సంధులని విడదీసి మూల శబ్దాలని స్పష్టంగా ప్రకటించారు.

ఈనాడు మనం వేదపాఠం నుండి వేదోచ్చారణకి చెందిన ఆదిలయలని కచ్చితంగా వెలికితీయగలుగుతున్నాం అంటే ఆ విజయానికి మన్ననగా నిర్దోషమైన జ్ఞాపకశక్తి గల పూర్వీకులకి నివాళులర్పించాలి. పాదపాఠం యొక్క ఉచ్చారణలో సందేహం ఏర్పడ్డ సందర్భాలు ఎంతో అరుదుగా మాత్రమే ఏర్పడతాయి. కాబట్టి ప్రాచీన వేదపాఠాన్ని సమ్మతించడానికి మనకి ప్రమాణాలు ఉన్నాయి. అక్కడక్కడా సందేహాలు తలెత్తినా ప్రాచీన యూరోప్ సాహిత్యంలో విస్తృతంగా జరిగిన సవరణలని పోలిన సవరింపులు చెయ్యాల్సిన అగత్యం వేదపాఠానికి పట్టలేదు. ఈ సౌలభ్యం కారణంగా కూలంకషమైన భారతీయ పాండిత్యానికి మనం సతతం ఋణపడి వుండాలి.

అయితే కొన్ని దిశలలో మాత్రం పాండిత్య సాంప్రదాయాన్ని నిస్సంకోచంగా అనుసరించడం మంచిది కాదు. అందుకు తార్కాణంగా, ప్రాచీన సాంప్రదాయం తగినంత ధృఢంగా, స్థిరంగా లేని చోట్ల వేద ఋక్కులని వేదఋషులకి ఆరోపించే ప్రక్రియని చెప్పుకోవచ్చు. అయితే ఇవి కాస్త అప్రముఖమైన విషయాలు. అంతే కాక వేదఋక్కులు సరైన క్రమంలో, పూర్ణ రూపంలో ఉన్నాయనుకోవడంలో సందేహం లేదని నా ఉద్దేశం. ఇందుకు మినహాయింపులు వున్నా సంఖ్యలో, ప్రాముఖ్యతలో అవి అత్యల్పమైనవి. వేదఋక్కులు అసంగతంగా తోచాయంటే అందుకు కారణం అవి మనకు అర్థం కాకపోవడమే. ఒకసారి సూక్ష్మం పట్టుచిక్కిందంటే వాటి లయలలోనే కాక, వాటి భాషలోను, చింతనలోను దాగి వున్న సమగ్ర, సంపూర్ణ రూపం సాక్షాత్కరిస్తుంది.

వేదాన్ని అన్వయించే ప్రయత్నంలో ప్రాచీన భారతీయ పాండిత్యాన్ని ఆశ్రయించినప్పుడే కొంత అప్రమత్తత అవసరమని అర్థమవుతుంది. ఎందుకంటే సాంప్రదాయక పాండిత్య యుగంలోనే వైదిక సంస్కృతిలో కర్మకాండకి ప్రాధాన్యత నివ్వాలనే దృక్పథం

బలపడిపోయింది. పదాల, వాక్యాల మూలార్థాలు, పరోక్ష సూచనలు, చింతన యొక్క మూలాకృతికి చెందిన రహస్యాలు మొదలైనవన్నీ అప్పటికే వినష్టమైపోయాయి. అంతేకాక ఆ రహస్యాన్ని కాస్తయినా విడమర్చి చెప్పగల లోదృష్టి గాని, అధ్యాత్మిక అనుభవైక శక్తి గాని అప్పటి పాండిత్యంలో లేకపోయాయి. పదునైన తార్కికత, శుష్క పాండిత్యంతో చేయికలిపినప్పుడు సత్యాన్వేషణ తప్పుదోవ పట్టే అవకాశం ఎక్కువ.

మనకి గొప్ప సహాయంగా నిలిచిన యాస్కుడి పరిభాషలో రెండు గొప్ప వైవిధ్యంతో కూడుకున్న అంశాలని మనం గుర్తించాలి. ఒక శబ్దశాసనుడిగా యాస్కుడు మనకి వేదశబ్దాల అర్థాలు చెప్తున్నప్పుడు అతడి ప్రతిభ ఎనలేనిది. అతడి సహాయం సాటిలేనిది. అయినా కూడా ప్రాచీన శబ్దాల అర్థాలన్నీ అతడికి పట్టుబడినట్టు లేవు. అప్పటికే ఎన్నో పదాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇక కచ్చితమైన శాస్త్రీయమైన భాషాశాస్త్రం యొక్క ఆసరా లేకుండా ఆ పదాల అర్థాలని తిరిగి సాధించడం ఇంచుమించు అసంభవమే. అయితే వైదిక సాంప్రదాయం యొక్క గొప్పదనం వల్ల ఎన్నో పదాలు బతికి బట్టకట్టాయి. యాస్కుడు తనలోని వైయాకరణ ప్రతిభని పక్కన బెట్టి, కేవలం సాంప్రదాయాన్ని అనుసరిస్తూ పదాలకి అర్థాలని ఆపాదించిన సందర్భాలలో, శబ్దశాస్త్ర నియమాల ప్రకారం అతడు ఆపాదించిన భావం సమంజసమైనదే నని కాలాంతరంలో నిర్ధారణ చెయ్యడానికి సాధ్యమయ్యింది. కాని యకుడిలోని శబ్దవ్యుత్పత్తి శాస్త్రవేత్త (etymologist) అతడిలోని శబ్దశాసనుడికి (lexicographer) సాటిరాడు. శాస్త్రీయ వ్యాకరణం ప్రాచీన భారతంలోనే ఊపిరి పోసుకుంది. కాని శాస్త్రబద్ధమైన శబ్దశాస్త్రానికి పునాదులు ఆధునిక యుగంలోనే ఏర్పడ్డాయి. భారతంలోనే కాక, యూరొప్ లో కూడా, పందొమ్మిదవ శతాబ్దం వరకు కూడా, పాతకాలపు శబ్దవ్యుత్పత్తి శాస్త్రవేత్తల పరిశోధనలు సరైన విధివిధానాలు లేక తప్పులతడకలుగా తెల్లారాయి. యాస్కుడు కూడా అలాంటి విధానాలనే వాడుతున్నట్టు కనిపిస్తే ఇక ఆయన సాంగత్యాన్ని వదులుకోవడమే శ్రేయస్కరం. అంతేకాక వేదపాఠానికి అతడు చేసిన అన్వయం, కాలాంతరంలో సాయణుడు చేసిన అన్వయం కన్నా మిన్నగా వుందనడానికి కూడా లేదు.

అద్భుతంగా అలరారిన వైదిక సాహితీ యుగానికి యక్షుడి నిరుక్తం శ్రీకారం చుడితే, సాయణుడి వేదభాష్యం ముగింపును సూచిస్తోంది. పూర్వచారిత్రక యుగం నుండి పుణికి పుచ్చుకున్న అపూర్వమైన సృజనతో, ప్రతిభతో తొణికిసలాడుతున్న అలనాటి భారతీయ మానసం వైదిక భాషాసంపదకు ప్రాణం పోసింది. ఆ ప్రాచీన సాంప్రదాయం మనకి మిగిల్చిన సాహితీ పెన్నిధి వేదభాష్యం. ఎంతో కాలం ఆ సాంప్రదాయానికి దక్షిణ భారతం కేంద్రంగా, ఆలవాలంగా నిలిచింది. మహ్మదీయ దండయాత్రల ధాటికి ఆ సాంప్రదాయం అంతా కకావికలం అయిపోయింది. ఆ తరువాత కూడా నవసంకలనం కోసం, నూతనారంభం కోసం చెదురుమొదురుగా ఎన్నో స్ఫూర్తిభరిత ప్రయత్నాలు జరిగాయి. కాని ఆదిలో జరిగినట్టు చారిత్రక, బృహత్తర స్థాయిలో సృజన చెయ్యడం సాధ్యపడలేదు.

వైదిక సాంప్రదాయంలో పారంపర్యంగా వచ్చిన సారస్వతం ఎనలేనిది. మహాపండితుడైన సాయణుడు, తన సమకాలీనులైన పండితవర్గం సహాయంతో చేసిన మహత్తర మేధోప్రయాసకి అది ఫలితం. అందులో పలువురి పాత్ర వున్నా, ఆ వివిధ మేధో ధారలన్నిటినీ కలిపి కుట్టిన సాయణుడి ప్రతిభ అపారం. సూక్ష్మాలలో అక్కడక్కడ కొన్ని అవకతవకలు ఉన్నా, దాని పూర్ణాకృతిలో సంలగ్నత కనిపిస్తోంది. శైలిలో పొందిక, పదును కనిపిస్తోంది. పాతకాలపు భారతీయ భాష్యాలలో ఇలాంటి లక్షణాలు కొంతవరకు అరుదనే చెప్పాలి. నిస్సారమైన శబ్ద పుష్టి ఎక్కడా కనిపించదు. వేదపాఠం యొక్క అన్వయంలో తలెత్తే సమస్యలన్నీ ఒడుపుగా తెరమాటుకి నెట్టబడ్డాయి. ఆ కౌశలానికి, పాటవానికి ఎంతటి వ్యతిరేకి అయినా మనసు మార్చుకుని వేదభాష్యాన్ని స్వీకరించాల్సిందే. సాయణుడి అన్వయాలలోని తర్కం, హేతువాదం వేద పరిశోధనలు చేసిన యూరొప్ పండితులని తెగ ఆకట్టుకున్నాయి.

కాని వేదం యొక్క బాహ్యార్థాన్ని మాత్రమే తీసుకున్నా కూడా, సాయణుడి విధానం పట్ల, ఫలితాల పట్ల కూడా అభ్యంతరాలు వెలిబుచ్చక తప్పదు. సాయణుడి అన్వయాలని కచ్చితంగా అనుసరిస్తూ పోతే ఎన్నో చోట్ల విచిత్రమైన, అసంగతమైన అర్థాన్ని

స్వీకరించవలసి వస్తుంది. సర్వసామాన్యమైన వేదశబ్దాల విషయంలోను, స్థిరమైన వేదసూత్రాల విషయంలో కూడా అతడి అన్వయాలలో ఎంతో ఆశ్చర్యకరమైన వైవిధ్యం కనిపిస్తుంది. సాయణుడి పద్ధతిలో దృష్టి మొత్తం బాహ్యమైన కర్మకాండ మీదనే కేంద్రీకృతమై ఉన్నట్టు కనిపిస్తుంది. వేదసారం మొత్తాన్నీ ఆ ఇరుకైన బాహ్యార్థపు మూసలోకే కుందించాలనే ప్రయత్నం కనిపిస్తుంది. అతడి విధానంలో మౌలికమైన బలహీనత కూడా ఇదేనని అనుకోవాలి. ఈ కారణం చేత ఋషుల మహోన్నత భావజాలం, వారి తపన, తపస్సు అంతా ఈ ఇరుకైన, భావదారిద్ర్యపు మూసలోకి కుదించే ఒరవడి కనిపిస్తుంది. ఆ ఒరవడిని సమ్మతించినట్లయితే వేదం పట్ల మన ఆరాధనా భావం, వేదం యొక్క పవిత్రమైన అధికారం, దాని అసమాన దివ్య ప్రతీతి మొదలైన వన్నీ అర్థం లేనివి అవుతాయి. ఒక ఆదిమ దోషం నుండి బయల్దేరి ఒక మూఢవిశ్వాసంగా, గుడ్డి ఆచారంగా పరిణమించిన వేద సాంప్రదాయం అప్పుడు మనకి కనిపించి కలవరపెడుతుంది.

సాయణుడి భాష్యంలో చర్చించవలసిన మరి కొన్ని అంశాలు కూడా ఉన్నాయి. కాని అవన్నీ కేంద్రభావనకి అనుషంగికమైన అంశాలు మాత్రమే. అనాదిగా, సాంప్రదాయకంగా వస్తున్న వేదసాహిత్యానికి ఒక తీరైన, అంతర్వైరుధ్యాలు లేని అన్వయాన్ని అందివ్వడం కోసం సాయణుడు, అతడి సహాధ్యాయులు ఎంతో విశ్వప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో కొన్ని అంశాలని యదాతథంగా స్వీకరించారు. మరి కొన్నిటి విషయంలో పట్టువిడుపు పాటించారు. వెనకటి భాష్యాలలో కొంత అనిశ్చితి, అయోమయం ఉన్నప్పటికీ, దీర్ఘకాలం వేదాధ్యయనం చేసినవాడు కావటంతో, వేదాన్వయానికి ఒక స్థిరమైన రూపాన్ని అందివ్వగలిగాడు సాయణుడు.

అధ్యాత్మిక, తాత్విక, మానసిక దృక్పథంతో చూస్తూ శృతిని అసలు అన్వయించడం ఎలా? ఇదే సాయణుడు తలపడవలసిన మొట్టమొదటి అంశం. అదే మనకి అత్యంత ప్రధానమైన అంశం కూడాను. ఆ అంశానికి వచ్చేసరికి సాయణుడు సమకాలీన, సాంప్రదాయక

(orthodox)[2] భావనని స్వీకరిస్తాడు. అయితే అలా స్వీకరించిన సన్నివేశాలు అరుదుగానే తారసపడతాయని గుర్తించాలి. సమకాలీన అన్వయాలలో కనిపించని తాత్విక, మానసిక అన్వయాలని కూడా కొన్ని అరుదైన సందర్భాలలో చూచాయగా పేర్కొంటాడు. ఉదాహరణకి వృత్రాసురుడి విషయంలో అలాంటి కథనాన్ని పేర్కొంటాడు గాని, దాన్ని సమ్మతించడు. మానవుడి కామితార్థాన్ని తనకి అందకుండా వృత్రాసురుడు దాచి వుంచుతాడని ఒక పాతకాలపు అన్వయం వుంది. కాని సాయణుడి దృష్టిలో వృత్రాసురుడు కేవలం మేఘమండలానికి చెందిన ఒక రాక్షసుడు. వర్షపు నీటిని అతడు కురవకుండా బంధించి వుంచుతాడు. వానదేవుడైన వరుణుడు ఆ బంధాలని త్రెంచి నీటిని విడుదల చేస్తాడు.

ఇక రెండవ అంశం పురాణాలకి సంబంధించినది. పౌరాణిక గాథల్లో దేవతల కథలు, సాహసాలు వర్ణించబడతాయి. ఆ గాథల్లో దాగి వున్న అంతరార్థాన్ని, ప్రతీకాత్మక వాస్తవాలని విస్మరిస్తూ కేవలం బాహ్యార్థానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే ఒరవడి కనిపిస్తుంది.

ఇక మూడవ అంశం పౌరాణిక గాథలకి, చరిత్రకి సంబంధించిన అంశం. బ్రాహ్మణాలలో ఎందరో పాతకాలపు రాజుల, ఋషుల కథలు చెప్పబడ్డాయి. వేదాలలో చెప్పబడ్డ ఎన్నో విషయాల వివరణలో కూడా కాలాంతరంలో ఆ కథలు ప్రస్తావించబడ్డాయి. ఈ సంగతులతో వ్యవహరించే విధానంలో సాయణుడు కాస్త తటపటాయిస్తున్నట్టు కనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో ఆ గాథల పరంగా వేద ఋక్కుల అన్వయాన్ని స్వీకరిస్తాడు. మరికొన్ని సందర్భాల్లో మరి కాస్త మేధోగతమైన అన్వయాన్ని స్వీకరిస్తాడు. ఈ రెండు విధానాల మధ్య, ప్రమాణాల మధ్య ఊగిసలాడుతున్నట్టు కనిపిస్తాడు.

అన్నిటికన్నా ముఖ్యమైన అంశం మరొకటి వుంది. అది ప్రకృతిగతంగా అన్వయించే విధానం. ఎన్నో వైదిక పదాలకి సాంప్రదాయకమైన, స్వయంవిదితమైన అర్థాన్నే తీసుకుంటాడు. ఉదాహరణకి ఇంద్రుడు, మరుత్తులు, అగ్నిత్రయం, సూర్యుడు, ఉష. కాని మిత్రుడిని

[2] ఇక్కడ orthodox అన్న పదాన్ని దాని వ్యావహారిక అర్థంలో వాడుతున్నాను. యూరొప్ లో orthodox, heterodox అన్న పదాలని సాధికార మతాచారానికి అనుగుణమా, విరుద్ధమా అన్న అర్థంలో వాడుతారు. అయితే అటువంటి ఇరుకైన, ఛాందసమైన దృక్పథం ప్రాచీనభారతానికి సరిపడదు. మన దేశంలో అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే స్వాతంత్ర్యం ఎప్పుడూ ఉండేది.

పగటితోను, వరుణుడిని రాత్రి తోను, భగ, ఆర్యములని సూర్యుడితోను, రిభులని ఆ సూర్యకిరణాలతోను ముడిపెడతాడు. ప్రకృతిగతమైన వైదిక సిద్ధాంతానికి బీజాలు ఇక్కడ మనకి కనిపిస్తాయి. ఈ సిద్ధాంతాన్నే యూరోప్ పాండిత్యం స్వీకరించి, అపారంగా విస్తరింపజేసింది. ప్రాచీన భారతీయ పండితులు తమ పరికల్పనలో ఇలాంటి స్వేచ్ఛని గాని, కచ్చితమైన శాస్త్రీయమైన విధానాన్ని గాని అవలంబించలేదు. అయినా కూడా సాయణుడి వ్యాఖ్యానంలో ఈ అంశమే యూరోప్ కి చెందిన తులనాత్మక పౌరాణిక శాస్త్రానికి పట్టుకొమ్మ అయ్యింది.

ఆ విధంగా బాహ్యార్థానికి, అంతరార్థానికి మధ్య ఊగిసలాట కనిపించినా, చివరికి బాహ్యాచార పరాయణమైన అన్వయానిదే పైచేయి అయ్యింది. దాని నీడలో తక్కిన అన్వయాలన్నీ కనుమరుగైపోయాయి. వేదార్థాన్ని వివరించే గొప్ప తాత్విక వ్యవస్థలు కూడా చివరికి ఒక సంకుచితమైన దృక్పథాన్నే స్వీకరించాయి. ఆ దృక్పథం ప్రకారం ఒక పక్క వేద ఋక్కులు మహోన్నతమైన జ్ఞానానికి ప్రమాణాలు అని సమ్మతిస్తూనే, మరో పక్క వేదాల ప్రధాన లక్ష్యం కర్మకాండని వర్ణించడం, నిర్వచించడం మాత్రమేనని నమ్మాల్సి ఉంటుంది. ఇక్కడ కర్మకాండ అంటే ప్రత్యేకించి వైదిక యజ్ఞ యాగాదుల విధివిధానాలకి సంబంధించిన వివరాలు అన్నమాట. ఇలాంటి అవగాహనతోనే సాయణుడు తన వ్యాఖ్యానాన్ని కొనసాగిస్తాడు. వైదిక పరిభాష అంతటినీ ఈ మూసలోకే కుదించాలని చూస్తాడు. ముఖ్యమైన వైదిక పదాలన్నిటినీ – అన్నం, అర్చకుడు, దాత, ఐశ్వర్యం, స్తుతి, ప్రార్థన, క్రతువు, యాగం - యజ్ఞవిధుల పరంగా వర్ణిస్తాడు.

మరి ఆ అన్వయం ప్రకారం యజ్ఞం యొక్క లక్ష్యం కేవలం అహంకార సంబంధమైన, ఐహికమైన వస్తువులే. అంటే ఐశ్వర్యం, బలం, అధికారం, సంతానం, దాసదాసీజనం, బంగారం, గుర్రాలు, గోవులు, యుద్ధంలో రిపువర్గాలపై విజయం, సంవాదంలో ప్రత్యర్థి పతనం మొదలైనవి. ఈ సరళిలో ఒక్కొక్క ఋక్కును అన్వయిస్తూ పోతుంటే, ఈ మనోభావానికి గీతాబోధనకి మధ్య స్పర్థ స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే భగవద్గీత ఒక పక్క వేదం బోధించేది దివ్యజ్ఞానం అని నొక్కి చెప్తూనే, మరో పక్క కేవలం స్థూలమైన అధికారం,

ఆనందం, ఐశ్వర్యాల సాధన పరంగా వేదాన్ని అర్థం చేసుకునే ధోరణిని కూడా తీవ్రంగా ఖండిస్తుంది.

సాయణుడి వ్యాఖ్యానం వల్ల దురదృష్టవశాత్తు వేదార్థం కేవలం ఈ రకమైన అత్యధమమైన అన్వయానికే పరిమితమైపోయింది. ప్రధానంగా కర్మకాండ పరంగా వేదాన్ని అర్థం చెసుకునే సాంప్రదాయం భారతంలో బలపడిపోవడంతో, ఆ అత్యుత్తమ దివ్యకావ్యం భారతీయ జీవనంపై ప్రసరించగల అద్భుత ప్రభావాన్ని మన జాతి చేజార్చుకుంది. ఆ కారణం చేతనే ఉపనిషత్తుల మూలరహస్యం కూడా చేజారిపోయింది. వేదాన్ని అర్థం చేసుకోవడంలో అనాదిగా వచ్చిన ఒక తప్పుడు అవగాహనకి సాయణుడి వాఖ్యానం ముక్తాయింపు పాడింది. అలా మూతబడ్డ తెరని తొలగించే అవకాశం మళ్లీ ఎన్నో శతాబ్దాల వరకు దొరకలేదు. ఇక దీర్ఘకాలం తరువాత మరో పరాయి నాగరికత వేదాధ్యయనానికి పూనుకున్నప్పుడు, వెనకటి మౌలిక తప్పిదానికి మరెన్నో దోషాలని జతచేర్చింది.

అయితే ఒక విధంగా వేదవిద్యకి చెందిన నిగూఢ అంతరంగ మందిరాలలోకి ప్రవేశించాలంటే సాయణుడి అన్వయం ఎంతో అవసరం. ఐరోపా పాండిత్యం, కృషి ఎంత సువిస్తారమైనా అది సాయణుడి వ్యాఖ్యానాల ఆవశ్యకతని తప్పించలేకపోయింది. అడుగడుగునా దాంతో ఒక పక్క విభేసిస్తూనే, అడుగడుగునా దాన్ని వినియోగిస్తూ ముందుకు సాగడం జరుగుతుంది. ఆ విధంగా అవసరమైనంత మేరకు దాన్ని వాడుకుని, దాని ఉపయోగం తీరాక విడిచిపెట్టి, ఆ సోపానం మీదుగా పైకి సాగుతూ వేదార్థం యొక్క ప్రగాఢమైన అంతర్యంలోకి ప్రవేశించాలి.

అధ్యాయం 3

ఆధునిక సిద్ధాంతాలు

వేదం పట్ల సాయణుడు చేసిన బాహ్యాచార పరాయణమైన అన్వయం వల్ల ఏర్పడ్డ మూసని బద్దలు కొట్టడం కోసం ఒక పరాయి సంస్కృతి రంగప్రవేశం చెయ్యాల్సి వచ్చింది. గొప్ప నిష్ఠతో కూడిన కృషి, ఎనలేని తెగువతో, తెలివితో కూడిన ఊహాశక్తి, ఒక విధమైన నిజాయితీ తో కూడుకున్న పాండిత్యం ఇప్పుడు ఆ ప్రాచీన కృతి యొక్క అధ్యయనానికి పూనుకుంది. కాని ఆ ప్రాచీన కవుల కవితా రీతిని అర్థం చేసుకోగల శక్తి ఆ పాండిత్యానికి లేకపోయింది. ఆ ప్రాచీనుల స్వభావంతో మమేకమై అర్థం చేసుకునే సత్తా దానికి లేకపోయింది. వైదిక ప్రతీకలలో, ఉపమానాలలో, కథలలో దాగిన నిగూఢ రహస్యాలని తెలుసుకోడానికి

అవసరమైన మేధోగత, అధ్యాత్మిక సంస్కృతి దానికి లేకపోయింది. అలాంటి ప్రయత్నం వల్ల రెండు విభిన్న పరిణామాలు ఏర్పడ్డాయి. ఒక పక్క మునుపటి కన్నా సూక్ష్మంగా, సవివరంగా, కూలంకషంగా వేదాన్ని అన్వయించే ప్రయత్నం మొదలయ్యింది. మరో పక్క ఆ ప్రయత్నం వేదం యొక్క స్థూలార్థాన్ని మరింత బలవత్తరం చేసి, అతిశయింపజేసి, దాని నిజమైన అంతరార్థం మరింతగా మరుగు పడేలా, అస్పష్టమయ్యేలా చేసింది.

ఐరోపా పండితులు తమ వేదాధ్యయనాన్ని ఎంత శ్రద్ధగా, నిష్ఠగా కొనసాగించినా, వాళ్లు సాయణుడి వ్యాఖ్యానం స్థాపించిన సాంప్రదాయ పద్ధతి నుండి వైదొలగి కొత్త పుంతలు తొక్కే ప్రయత్నం చెయ్యలేదు. సాయణుడి వ్యాఖ్యానంలో, బ్రాహ్మణాలలో వాళ్లు తమకి దొరికిన అంశాలని ఆధునిక సిద్ధాంతాల యొక్క, ఆధునిక జ్ఞానం యొక్క దృక్పథం నుండి చూస్తూ మరింతగా అభివృద్ధి పరచారు. శబ్దవ్యుత్పత్తి శాస్త్రం నుండి, పురాణాల నుండి, చరిత్ర నుండి తెచ్చుకున్న తులనాత్మక విధానాలని ప్రయోగిస్తూ, దొరికిన సమాచారాన్ని తెలివిగా విస్తరింపజేస్తూ, చెదురుమొదురుగా ఉన్న విషయాలని దురుసుగా ఏకీకరించే ప్రయత్నం చేస్తూ, వైదిక పురాణాన్ని, వైదిక చరిత్రని, వైదిక నాగరికతని కలిపే ఓ సమగ్ర దర్శనాన్ని అందించే ప్రయత్నం చేశారు. ఆ దర్శనాన్ని వాళ్లు ఎంత ధీమాగా, సవివరంగా నిర్మించినా, అది పెళుసైన అభూతకల్పన అని, బలం లేని ఇసుక నేల మీద అది నిలిచిందని వాళ్లు గ్రహించుకోలేకపోయారు.

సాయణుడు చూపిన బాటలోనే పాశ్చాత్య వేదాధ్యయనం తొలి అడుగులు వేసింది. ఆ దృక్పథం ప్రకారం వేదాలు, మోటైన సామాజిక కట్టుబాట్లు కల్గిన, ప్రకృతి పట్ల ఒక అమాయకమైన, శైశవమైన అవగాహన కలిగిన, ఒక ఆదిమ, అనాగరిక తెగవారు పాడుకున్న జానపదాలు. ఏదో అద్భుతమైన మహిమ గల వైదిక కర్మకాండని సాయణుడు ఒక దివ్యజ్ఞానంలో భాగంగా స్వీకరిస్తే, అదే కర్మకాండని ఐరోపా పండితులు ఏవో మానవాతీత శక్తులని – అవి దుష్టశక్తులు కావచ్చు, శిష్ట శక్తులూ కావచ్చు - ప్రసన్నం చేసుకోవడం చేసే మోటైన ఉపాసగా అర్థం చేసుకున్నారు. వేదంలో చారిత్రక అంశం వుందన్న సాయణుడి సూచనని దొరకపుచ్చుకున్న ఆ పాండిత్యం వేదబుక్కుల్లోని సంఘటనలకి నూతనార్థాలు కల్పించుకుంటూ, ఆ ఆటవిక తెగల వ్యవహారాల యొక్క, వ్యవస్థల యొక్క, చరిత్ర యొక్క రూపురేఖలని చిత్రించే ప్రయత్నం చేశారు. కొందరు వైదిక దేవతలకి, కొన్ని ప్రకృతి శక్తులకి

మధ్య వేదం సూచించిన పోలికని ఆధారంగా తీసుకుని, ఆర్యుల పురాణాల మధ్య తులనాత్మక పరిశీలన చెయ్యడానికి పూనుకున్నారు. వేదంలో ప్రస్తావించబడ్డ ఆదిత్యుడికి, సూర్యుడికి మధ్య చూచాయగా సూచించబడ్డ అభిన్నతని ఆధారంగా చేసుకుని, దాని ఆదిమ పురాణాలన్నిటికీ ఒక మూలసూత్రంగా తీసుకుని, సూర్యగాథా సిద్ధాంతం, నక్షత్ర గాథా సిద్ధాంతం మొదలైన సిద్ధాంతాలని ప్రతిపాదించి, వాటి మీద తులనాత్మక పురాణాధ్యయనాన్ని స్థాపించారు. ఈ రకమైన చింతనతో కాస్త మూఢనమ్మకం, కాస్త ప్రకృతిపరమైన దృష్టాంతం, కాస్త జ్యోతిష్య పరిజ్ఞానం కలగలిసిన విచిత్ర, ప్రాథమిక కవితాసృష్టిగా వైదిక కవిత్వాన్ని అన్వయించారు. ఈ మూలాంశాలని పక్కన బెడితే వేదంలో మిగిలింది అప్పటి సమకాలీన చరిత్ర, యజ్ఞ విధులకి సంబంధించిన విధివిధానాలు. ఏ విధమైన అధ్యాత్మిక సారమూ లేని మోటైన మూఢాచారాల వృత్తాంతాలు. వారి ప్రయాసకి అంతంలో ఇదీ మనకి మిగిలింది.

ఈ రకమైన అన్వయానికి, ఆదిమ మానవ సంస్కృతులని వర్ణించే ఆధునిక వైజ్ఞానిక సిద్ధాంతాలకి మధ్య పొత్తు కుదురుతోంది. ఆటవిక స్థితి నుండి మానవుడు ఇటీవలి కాలంలోనే నాగరిక ప్రపంచంలో ఆవిర్భవించాడన్న సిద్ధాంతం పందొమ్మిదవ శతాబ్దంలోనే కాక, ఇప్పటికి కూడా ప్రబలంగా వుంది. అయితే మానవ గతం పట్ల విస్తరిస్తున్న మన జ్ఞానం ఈ తప్పుడు నమ్మకాన్ని కదిలించింది. కొన్ని వేల ఏళ్ల క్రితమే చైనా, ఈజిప్ట్, చాల్డియా, అసీరియా మొదలైన ప్రాంతాల్లో అద్భుతమైన నాగరికతలు విలసిల్లేవని మనకి ఇప్పుడు తెలుసు. ప్రాచీన ఆసియా లోను, మధ్యధరాసముద్ర తీర జాతులలోను అధునాతన సంస్కృతి ఉన్నట్లే, ప్రాచీన భారతం లోను, గ్రీస్ లో కూడా అధునాత సంస్కృతి ఉండేదని ఇప్పుడు సార్వత్రికమైన నమ్మకం ఏర్పడుతోంది. అయితే అలనాటి వైదిక భారతీయులకి అటువంటి అధునాతన సంస్కృతి ఉండేదని ఒప్పుకోకపోవడానికి కారణం ఐరోపా పాండిత్యం మొదట్నుంచి స్వీకరించిన సిద్ధాంతమే. ఆ సిద్ధాంతం ప్రకారం వైదిక భారతీయులు ఆర్యులు అనబడే జాతికి చెందినవారు. ఆ ఆర్యజాతి హోమర్ కావ్యాలలో వర్ణించబడ్డ ఆర్య గ్రీకులు,

కెల్ట్ లు, జర్మన్ లు మొదలైన జాతుల గాధలలోను, ప్రాచీన గాల్, ట్యూటన్ జాతులని వర్ణించే ప్రాచీన నోర్స్, రోమన్ గాధల్లోను, వివరించబడ్డ సంస్కృతితో తులతూగే సంస్కృతి గలవారు. ఉత్తరాదికి చెందిన ఆటవిక జాతులైన ఆ ఆర్య జాతులు తమ శీతల స్వభూలని విడిచి, దక్షిణ ప్రాంతాలకి దిగి వచ్చి మధ్యధరా యూరొప్ లోను, ద్రావిడ భారతంలోను అప్పటికే విలసిల్లిన నాగరిక జాతులతో కలిసిపోయారు.

కాని వేదంలో ఏ ఆధారాల మీద అయితే ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని రూపొందించారో, ఆ ఆధారాలు కడు బలహీనమైనవి, వాటి ప్రాముఖ్యత అనిశ్చితమైనది. వాస్తవంలో అలాంటి దండయాత్ర ప్రస్తావన వేదంలో ఎక్కడా లేదు. ఆ వాదనలో చాలా భాగం ఆర్య, అనార్య శబ్దాల మధ్య తేడా మీద స్థాపించబడింది, కాని ఆ తేడా సంస్కృతికి సంబంధించినదే గాని జాతికి సంబంధించినది కాదనిపిస్తుంది[3]. ఆర్యుల ప్రత్యేక లక్షణం ఒక రకమైన ఉపాసనా పద్ధతి అని, ఒక రకమైన అధ్యాత్మిక సంస్కృతి అని వేద ఋక్కుల పరిభాష స్పష్టంగా సూచిస్తోంది. తేజం కోసం, తేజో శక్తుల కోసం ఉపాసన, సత్యనిష్ఠ (ఋతం) మీద ఆధారపడ్డ జీవనశైలి, అమరత్వం (అమృతం) కోసం తపన – ఇవి ఆ సంస్కృతి యొక్క ముఖ్య లక్షణాలు. ఋతం, అమృతం అనేవి ఆ సంస్కృతిని నిర్వచించే మూలశబ్దాలు. ఇక్కడ జాతి భేదాల ప్రస్తావన ఎక్కడా ఉన్నట్టు లేదు. ప్రస్తుతం భారతంలో జీవించే ప్రజానీకంలో చాలా మంది మరింత ఉత్తర ప్రాంతాల నుండి దిగి వచ్చిన వారు అయ్యుండొచ్చు గాక. ఇంకా చెప్పాలంటే తిలక్ గారు చెప్పినట్టు ఆర్క్ టిక్ ప్రాంతం నుండి కూడా వచ్చి ఉండొచ్చు. అయితే అటు వేదంలో గాని, ఇటు ప్రస్తుత భారతీయుల రూపురేఖల్లో గాని[4], అలాంటి వలస

---

[3] దస్యులు నల్లని మైఛాయ గల వారని, ముక్కులేని వారని, అందుకు భిన్నంగా ఆర్యులు తెల్లని చర్మం వారని, బారైన ముక్కు గల వారని కొంత వాదన జరిగింది. ఈ భేదాన్ని నిశ్చయంగా ఆర్య దేవతలకి, దస్య శక్తులకి మధ్య తేడాని, తేజోమయ శక్తులకి, అంధకార శక్తుల మధ్య తేడాతో పోల్చుతూ అన్వయించవచ్చు. పైగా 'అనాసః' అన్న పదానికి అర్థం ముక్కు లేకపోవడం కాదు. పోనీ అదే నిజం అనుకున్నా అది ద్రావిడ జాతులకి వర్తించదు. బారైన ముక్కు విషయంలో ద్రావిడ జాతుల వారు ఉత్తరాదికి చెందిన ఆర్యులకి ఏ మాత్రం తీసిపోరు.

[4] ప్రాచీన భాషాశాస్త్ర (philology) పరమైన భారతీయ జాతుల వర్గీకరణ గురించి మనకి బాగా తెలుసు. అలాంటి వర్గీకరణ మీద ఆధారపడ్డ రిస్లీ గారి కల్పనల గురించి కూడా తెలుసు. కాని మరింత అధునాతనమైన మానవజాతి శాస్త్రం (ethnology) ఈ భాషా సంబంధిత వర్గీకరణలన్నిటికీ త్రోసి పుచ్చుతూ, భారతీయ ద్వీపకల్పం మీద అనాదిగా ఒక ఏకైక, సమజాతీయమైన జాతి నివసిస్తున్నదని సూచిస్తోంది.

ప్రయత్నం వేద కాలంలో జరిగింది అనడానికి గాని, తెల్లని చర్మం గల కిరాత జాతులు ఎక్కడి నుండో దిగి వచ్చి అప్పటికే సనాగరికులైన, ద్వీపకల్ప వాసులైన ద్రావిడ జాతులతో అంచెలంచెలుగా కలిసిపోయారు అనడానికి దాఖలాలు లేవు.

అంతేకాక మన వద్ద ఉన్న ఆధారాలని బట్టి ఆదిమ ఆర్య సంస్కృతులు (కెల్ట్, ట్యూటన్, గ్రీక్, భారతీయ సంస్కృతులకి ఏదో సామాన్య మూలం ఉందని తలపోసినా కూడా) అనాగరకమైన కిరాత సంస్కృతులు అని కచ్చితంగా చెప్పలేకపోతున్నాము. బాహ్యజీవనంలో, బాహ్యజీవన వ్యవహారాల నిర్వహణలో ఒక రకమైన నిర్మలమైన, సరళమైన నిరాడంబరత, దేవతల ఉపాసనలో, దేవతలతో సంబంధాలలో, ఆ సంబంధాల విభావనలో ఒక విధమైన నిర్దిష్టత, ప్రజ్వలితమైన స్పష్టత – ఇవి ఆర్యసంస్కృతికే ప్రత్యేకమైన లక్షణాలు. మరింత ఐహికమైన, పార్థివమైన ఈజిప్ట్, చాల్డియా ప్రాంతాల నాగరికతలతోను, అక్కడి గూఢ విద్యలు, రహస్య తంత్రోపాసనలతోను కూడుకున్న సంస్కృతులకి ఆర్య సంస్కృతికి మధ్య తేడా తేటతెల్లంగా కనిపిస్తుంది. కాబట్టి అలాంటి ఆర్యసంస్కృతికి చెందిన లక్షణాలు ఒక మహోన్నత ఆంతరిక సంస్కృతికి చెందిన లక్షణాలు కావని చెప్పడానికి లేదు. అంతేకాక ఒక మహోత్కృష్టమైన అధ్యాత్మిక సంస్కృతికి చెందిన దాఖలాలు మనకు అడుగడుగునా ఎదురవుతూ సాధారణ సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తాయి. ప్రాచీన కెల్టిక్ జాతులలో ఒక గొప్ప తత్వచింతనా సాంప్రదాయం ఉండి ఉండొచ్చుననే అనుకోవాలి. ఆ జాతులలో ఇంకా పురాతన దశలకి చెందిన అధ్యాత్మిక, లోజ్ఞాన పరాయణమైన సంస్కృతి యొక్క గాఢమైన ముద్ర ఇప్పటికీ కనిపిస్తోందంటే, అలాంటి దీర్ఘకాలిక ఫలితాలని సాధించిన సంస్కృతి ఎంత ప్రాచీనమైనదో, సుస్థిరమైనదో, చిరంతనమైనదో ఊహించవచ్చు. ప్రాచీన గ్రీస్ లో అదే విధంగా హెలెనిక్ జాతి ఆర్ఫిక్, ఎల్యుసీనియన్ ప్రభావాలకి లోనై ఉండి ఉండొచ్చునని అనుకోవచ్చు. నేడు మనకు అందుబాటులో ఉన్న గ్రీకు పురాణం, సున్నితమైన భావబీజాలతో అలరారుతూ, అలనాటి ఆర్ఫిక్ బోధనాసాంప్రదాయపు చిన్నెలన్నో తనలో సంతరించుకుంది. వివిధ ప్రపంచ నాగరికతలలో ఈ రకమైన ఒరవడులని పరిశీలిస్తే, మన వైదిక పూర్వజుల లక్షణాలని, వారు నాటిన భావబీజాలని భారతీయ సంస్కృతి కూడా యుగాలుగా సంరక్షించి భద్రంగా మనకి ఇప్పుడు ప్రసాదించిందని అనుకోక తప్పదు. ఆధునిక మానవుడి వ్యక్తిత్వ భేదాలపైన, అతడి చింతనపై, కళపై, మతం పైన, అంత

ప్రగాఢమైన ముద్రవేసి, అసమాన జీవశక్తితో తొణికిసలాడిన ఆ ప్రప్రథమ సంస్కృతులు కేవలం ఆటవిక కిరాత సంస్కృతులు కానేరవు. ప్రగాఢమైన, బ్రహ్మాండమైన పూర్వచారిత్రక యుగాల నాటి అభివృద్ధికి అవి నిదర్శనాలు.

మానవాళి పురోగతికి చెందిన ఈ తొలిదశలని తులనాత్మక పౌరాణిక శాస్త్రం బాగా నిర్లక్ష్యం చేసింది. ఆ విధంగా పురాతన మానవ సాంప్రదాయాల పట్ల మన అవగాహనని విరూపం చేసింది. ఆదిమానవుడికి ప్లేటోకి, లేదా ఉపనిషత్తులకి మధ్య మరేమీ లేదనే అవగాహన మీద, సిద్ధాంతం మీద ఆ ప్రయత్నం స్థాపించబడింది. ఆ అవగాహన ప్రకారం అలనాటి ఆటవికులు తటాలున ఒక శుభదినానా మేలుకుని ప్రకృతిలో ఉదయం, రాత్రి, సూర్యుడు మొదలైన విడ్డూరాలు, విచిత్రాలు ఉంటాయని గుర్తించారట. అలాంటి మొరటైన, అనాగరిక భావాల ఆధారంగా, అతిశయమైన ఊహాశక్తిని ఊతంగా చేసుకుని తమ చుట్టూ ఉండే ఉనికిని వివరించే ప్రయత్నం చేశారట. ఆ ప్రయత్నం లోనుండి తొలినాటి మతసాంప్రదాయాలు ఆవిర్భవించాయట. అలా ప్రకృతిని చూసి తెగ మురిసిపోయే శైశవ దశ నుండి ఒక్క అంగలో గ్రీకు తాత్వికులని, వేదాంత ఋషులని చేరుకున్నారట. హెలెనిస్టులు హెలెనేతర సాంప్రదాయాలని అర్థం చేసుకోవడం కోసం తులనాత్మక పౌరాణిక శాస్త్రాన్ని సృష్టించారు. అయితే అసలు ఆ అవగాహనే గ్రీకు మానసం పట్ల ఒక తప్పుడు అవగాహన మీద ఆధారపడింది. అలాంటి శాస్త్రం అవలంబించిన విధానం కేవలం విశృంఖల ఊహాగానమే తప్ప, కుదురైన వైజ్ఞానిక పరిశోధనా ప్రయాస కాదు.

ఆ విధానం నుండి వచ్చిన ఫలితాలు పరిశీలిస్తే, అల్లకల్లోలమైన భావచిత్రాలు కనిపిస్తాయి, అర్థంపర్థం లేని అన్వయాలు ఎదురవుతాయి. ఎక్కడా సంగతత్వంగాని, సంసక్తతగాని కనిపించదు. నానా రకాల వివరాలు విచ్చలవిడిగా పరుగులు పెడుతూ ఉంటాయి. ఒక దాంతో ఒకటి చిక్కులు పడుతూ ఉంటాయి. వాటి ప్రమాణం కోసం గాలిస్తే వాటన్నిటికీ ఆదిమూలమైన విశృంఖల ఊహాగానం తప్ప మరేమీ కనిపించదు. అసలు ఈ అసంగతత్వమే సత్యానికి ప్రమాణం అని కూడా కొందరు వాదించారు. అసలు అంత పురాతన పౌరాణిక కవితా సృష్టికి సారమే వట్టి గందరగోళం అయినప్పుడు, దానికొక తార్కికమైన,

క్రమబద్ధమైన వివరణని వెదకబూనడం కూడా పెద్ద పొరబాటే అవుతుందని కొందరు మహాపండితులు బల్లగుద్ది వాదించారు. అదే నిజమైతే మరి తులనాత్మక పౌరాణిక శాస్త్రానికి ఒక దన్నుగాని, ప్రమాణం గాని ఏమీ ఉండదు. ఎలాంటి సిద్ధాంతమైనా అక్కడ చెల్లిపోతుంది. ఎందుకంటే ఒక రకమైన కల్లోలమయ కవిత్వం కన్నా మరో రకం కల్లోలమయ కవిత మిన్న అనుకోవడం అర్థరహితమే అవుతుంది.

తులనాత్మక పౌరాణిక శాస్త్రం చేసే నిరాధారిత వ్యాఖ్యానంలో కూడా ఉపయుక్తమైనది ఎంతో వుంది. కాని దాని ఫలితాలు సుస్థిరంగా, విశ్వసనీయంగా ఉండాలంటే, అది మరింత లోతైన పునాదులు గల మతవిజ్ఞానం మీద, దాని విధానాలని స్థాపించవలసి ఉంటుంది. ప్రాచీన మతాలు కూడా సహజమైన, సజీవమైన భావవ్యవస్థల మీద స్థాపించబడినవి అని గుర్తించాలి. ఆధునిక భావవ్యవస్థలకి మల్లె అవి కూడా సంసక్తమైనవని, సంగతమైనవని అర్థం చేసుకోవాలి. ఆ ప్రాచీన మత సాంప్రదాయం నుండి, తత్వ చింతన నుండి ఆధునిక మతాల వరకు, తత్వచింతన వరకు క్రమబద్ధమైన పురోగమనం జరిగిందని సులభంగా గుర్తించగలుగుతాము. ఇలాంటి దృక్పథంతో, మనోభావంతో మనకి లభ్యమైన సమాచారాన్ని శోధిస్తే గాని, మానవ చింతన యొక్క, విశ్వాసం యొక్క పురోగమన రేఖని అర్థం చేసుకోలేము. గ్రీకు పేర్లకి, సంస్కృత పేర్లకి మధ్య సంబంధాలు ఎత్తి చూపగానే సరిపోదు. హెరాక్లిస్ చితి అస్తమిస్తున్న సూర్యుడికి చిహ్నమని, గ్రీకు పౌరాణిక పాత్రలైన పారిస్, హెలెన్ లకి వేదాల్లోని సరమ, పణులతో సారూప్యం వుందనే సూచన గొప్ప ఊహాశక్తికి సంకేతం కావచ్చునేమో గాని, - ఆ సూచన రేపు నిజమని తేలినా కూడా - దాని వల్ల ఒనగూరే ఫలితమేమీ ఉండదు. అదే విధంగా సూర్యుడు, తారల గాధని ఒక ప్రత్యేకమైన తీరులో అన్వయించి, ఆ అన్వయాన్ని ప్రతీ మానవ సాంప్రదాయానికి, నమ్మకానికి, అంతేకాక ప్రతీ చారిత్రక ఘట్టానికి చిద్విలాసంగా, సునాయాసంగా వర్తింపజేస్తూ పోయారు[5]. ఇలాంటి

[5] ఒక గొప్ప పండితుడి ప్రకారం యేసు, అతడి పన్నెండుగురు ముఖ్య శిష్యులు సూర్యుడు, పన్నెండు మాసాలకి ప్రతీకలు. అలాగే నెపోలియన్ జీవితాన్ని సూర్యుడు గాధకి ప్రతీకగా అన్వయించిన ప్రయత్నాలు కూడా ఉన్నాయి.

ప్రయత్నాలన్నీ కేవలం అతితెలివితో చేసిన ఊహాగానాలే తప్ప ఇందులో ఏదైనా సత్యాంశం వుందా అన్నది సందేహమే.

ఇక శబ్దవ్యుత్పత్తి శాస్త్రం విషయానికి వస్తే దాని ప్రస్తుత స్థితిలో దాని నుండి మనకి పెద్దగా ఒరిగేది ఏమీ ఉండదు. పందొమ్మిదవ శతాబ్దపు పరిస్థితితో పోల్చితే ఆధునిక శబ్దవ్యుత్పత్తి శాస్త్రం ఎంతో ఎదిగింది అనడంలో సందేహం లేదు. నిరర్థక ఊహాగానం ఉన్నచోట అది చక్కని క్రమబద్ధతని ప్రవేశపెట్టింది. భాషారూపాల పట్ల మరింత నిర్దిష్టమైన అవహాహనని తెచ్చింది. శబ్దాల కూర్పులో విధివిధానాలని తేటతెల్లం చేసింది. ఒకే పదం గాని, లేదా అనుబంధపదాల సమాహారం గాని, అన్యభాషలలో ఎలాంటి రూపాలు ఎత్తుతాయి, అన్యభాషల పరిణామ క్రమంలో ఎలాంటి మార్పులు ఎదురవుతాయి మొదలైన వాటికి సంబంధించిన నియమావళిని ఆ శాస్త్రం స్పష్టంగా స్థాపిస్తుంది. కాని దాని విజయాలు అక్కడితో ముగిసిపోతాయి. కాని అది ఇప్పటికీ ఒక పరిపూర్ణమైన భాషా శాస్త్రాన్ని మనకి అందివ్వలేకపోయింది. కొన్ని శతాబ్దాల పాటు ఎనలేని కృషి చేసిన ఓ పేరుమోసిన శబ్దశాస్త్రవేత్త తన రంగం గురించి మాట్లాడుతూ “మన కుటిల అనుమానాస్పద శాస్త్రాలు” అంటూ పెదవిరిచాడు. అనుమానాస్పద శాస్త్రం అసలు శాస్త్రమే కాలేదు. కాబట్టి మరింత నిర్దిష్టమైన, కుదురైన జ్ఞానాన్ని కోరేవారు తులనాత్మక శబ్దవ్యుత్పత్తి శాస్త్రాన్ని అసలొక శాస్త్రంగానే పరిగణించరు.

ఇంతవరకు శబ్దవ్యుత్పత్తి శాస్త్రం మనకి అందించిన ఫలితాలలో గొప్ప విశ్వసనీయత గలిగినవేవీ లేవనే చెప్పాలి. పరిమితమైన వినియోగం గల ఒకటి రెండు సూత్రాలు తప్ప స్థిరమైన, సమగ్రమైన పునాది వంటిది కనిపించదు. నిన్నగాక మొన్న వేదంలో ‘వరుణ’ శబ్దం, గ్రీకులో స్వర్గం అనే అర్థం గల ‘ఔరనోస్’ అనే శబ్దానికి అభిన్నం అని వాదించారు. కాని నేడది శబ్దవ్యుత్పత్తిలో దోషమని కొట్టిపారేశారు. రేపు మళ్లీ పాత వాదాన్ని పునఃస్థాపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అలాగే ‘పరమే వ్యోమన్’ అనే వైదిక శబ్దసమూహాన్ని చాలా మంది ‘మహోన్నత స్వర్గం’ అని అనువదిస్తారు. కాని ‘ఋక్కులు’ (The Riks) అనే ఓ అద్భుత, ఆశ్చర్యకర రచనలో శ్రీ టీ. పరమశివ అయ్యర్ ఆ పదజాలాన్ని ‘అత్యధమ బిలం’ గా అనువదిస్తారు. మరి ‘వ్యోమన్’ అంటే “బద్దలు కొట్టడం, చీలిక, భద్రత లేకపోవడం, (ఉమ)”; ఈ విషయంలో ఆయన వాదించే తీరు ఆధునిక శబ్దవ్యుత్పత్తి శాస్త్రవేత్తల తీరుకి

సన్నిహితంగా వుంది. “భద్రత లేకపోవడం” అన్న పదజాలానికి అర్థం చీలిక కాదని, మానవ భాషల నిర్మాణం ఆ తీరులో జరగదని వాళ్లకి అర్థం కాదు. భాషల నిర్మాణాన్ని, సహజ వికాసాన్ని శాసించే మూలసూత్రాలని శబ్దవ్యుత్పత్తి శాస్త్రం కనుక్కోలేకపోయింది. అది చాలనట్టు మరో పక్క కళ్లేలు తెంచుకున్న ఊహాగానం, అతిశయమైన, దారితప్పిన పాండిత్యప్రకర్ష – ఈ రెండూ ఆ శాస్త్రం అధోగతి పట్టేలా చేశాయి. ఇలాంటి పరిస్థితిలో ‘పరమే వ్యోమన్’ అంటే ‘మహోన్నత స్వర్గ’మా లేక ‘అధఃపాతాళ’మా తేల్చుకోలేని చిక్కు సమస్య ఏర్పడుతుంది. అలాంటి దోషభూయిష్టమైన శబ్దవ్యుత్పత్తి శాస్త్రం వేదార్థ శోధనకి మార్గదర్శకం కాలేదన్నది స్వయం విదితం.

వేదాధ్యయనంలో ఐరోపా పాండిత్యానికి ఇవ్వబడ్డ అతిశయమైన ప్రాధాన్యానికి కారణం వైజ్ఞానిక విషయాలలో ఐరోపా సాధించిన విజయాలేనని ముందుగా గుర్తించాలి. నిర్దిష్టమైన, కచ్చితమైన విధానాలతో కూడుకున్న భౌతిక శాస్త్రాలకి, వేదాధ్యయనానికి పునాదులుగా ఉన్న మరింత అసంపూర్ణమైన, అపరిపక్వమైన శాస్త్రాలకి మధ్య ఎనలేని భేదం వుందన్నది పచ్చి నిజం. వైజ్ఞానిక శాస్త్రాలు పునాదులలో పటిష్ఠమైనవి, సాధారణీకరణలో తొందరపాటు లేనివి, నిర్ణయాలలో సుస్థిరమైనవి; కాని వేదాధ్యయనంలో వాడే ఈ శాస్త్రవిభాగలు పలుచని ఆధారాల మీద, పెళుసైన పునాదుల మీద, అతిశయమైన ఊహాగానం మీద స్థాపించబడినవి. వాటి ఆరంభంలో గొప్ప ప్రతిభ కనిపించొచ్చు గాక. కాని వాటి నుండి స్థిరమైన నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. కుదురైన విజ్ఞానాన్ని సూచించే ఒక లీలామాత్రమైన ఆకారం ఉందేమోగాని, అలాంటి విజ్ఞానానికి ఉండాల్సిన పరిపాకం ఇంకా ఏర్పడలేదు.

వీటన్నిటి బట్టి చూస్తే ఇప్పటికీ వేదాన్ని అన్వయించే సమస్య ఒక తేలని సమస్యగానే మిగిలిందని చెప్పాలి. ఈ విషయంలో నిజమైన పురోగతి సాధించగల ఏ ప్రయత్నమైనా హర్షణీయమే. భారతీయ పండితవర్గం నుండి అలాంటి ప్రయత్నాలు మూడు జరిగాయి. వాటిలో రెండు ఐరోపా పరిశోధనా విధానాలనే అనుసరించాయి. వాటి నుండి ఎన్నో కొత్త సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. ఆ సిద్ధాంతాలు నిజమని తేలితే, బాహ్యార్థ పరంగా వేదబుక్కుల పట్ల మన అవగాహనలో లోతైన మార్పు వస్తుంది. వేదాల్లో మన ఆర్కిటిక్ స్వగృహం (Arctic home in the Vedas) అనే పుస్తకంలో శ్రీ తిలక్, ఐరోపా పాండిత్యం

సూచించిన మార్గాన్నే అనుసరిస్తూ పూర్తిగా కొత్త అన్వయాన్ని ప్రతిపాదించాడు. వేదాల్లోని ఉషస్సుని, వైదిక గోవులని, వేదాల్లో ఇవ్వబడ్డ తిథుల వివరాలని విశ్లేషించి, ఒక హిమ యుగంలో ఆర్య జాతులు ఆర్కిటిక్ ప్రాంతాల నుండి దిగి వచ్చారని వాదిస్తాడు. శ్రీ టీ. పరమశివ అయ్యర్ మరింత సాహసోపేతమైన మార్గాన్ని అవలంబిస్తూ అసలు ఋగ్వేదం అంతా భౌగోళిక పరిణామ చరిత్ర యొక్క ప్రతీకాత్మక వర్ణన అని, జీవప్రపంచం ఘనీభవించిన హిమయుగం లోనుండి మళ్లీ కొత్త జన్మనెత్తుతున్న భూతలాన్ని వేదం వర్ణిస్తోందని ఆయన సిద్ధాంతం. శ్రీ అయ్యర్ యొక్క సిద్ధాంతాలని, వాదాలని సమగ్రంగా స్వీకరించడం సాధ్యం కాకపోయినా, అహి వృత్రుడి గాథ మీద, సప్త నదుల ఆవిర్భావం మీద ఆయన సిద్ధాంతం నూతన కాంతులు ప్రసరిస్తుంది. ఆయన సిద్ధాంతం సమకాలీన సిద్ధాంతాల కన్నా మరింత సంసక్తంగా, సంభావ్యంగా తోచుతుంది. శ్రీ తిలక్ భావజాలంతో శ్రీ అయ్యర్ సిద్ధాంతాలని మేళవిస్తే, ఓ కొత్త బాహిరమైన వేదాన్వయానికి అది నాంది కాగలదు. వేదం యొక్క భౌతిక మూలాల గురించి, అలనాటి ఆర్యుల భౌతిక పరిసరాల గురించి తేలని ఎన్నో చిక్కు సమస్యల గురించి ఆ సమ్మేళనం ఎన్నో చక్కని వివరణలు ఇవ్వగలదు.

ఇక మూడవ భారతీయ ప్రయత్నం ఇంకా పాతదే అయినా, నా ప్రస్తుత లక్ష్యానికి అది మరింత సన్నిహితంగా వస్తుంది. ఆర్యసమాజానికి సంస్థాపకుడైన స్వామి దయానందుడు వేదాన్ని ఒక మహత్తర అధ్యాత్మిక ప్రామాణిక గ్రంథంగా పునఃస్థాపించే ప్రయత్నం చేశాడు. నిరుక్తాన్ని ఆధారంగా చేసుకుని, ప్రాచీన భారతీయ శబ్దజాలాన్ని స్వేచ్ఛగా, సహజంగా ప్రయోగించే సాంప్రదాయాన్ని ఆయన స్వీకరించాడు. అసలు ఆయనే గొప్ప సంస్కృత పండితుడు కనుక తత్సంబంధిత సమాచారాన్ని గొప్ప దక్షతతో వినియోగించాడు. ప్రాచీన సంస్కృతానికి చెందిన ఒక ప్రత్యేక లక్షణాన్ని ఆయన చాలా ఒడుపుగా, సృజనాత్మకంగా వాడుకున్నాడు. ఆ లక్షణాన్నే సాయణుడు "బహుళార్థకమైన భాషాశబ్దాలు" అంటూ ప్రస్తావిస్తాడు. వేద ఋషుల ప్రత్యేక విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ఈ సూక్ష్మాన్ని కచ్చితంగా అనుసరించాల్సిన అవసరం ఉంది.

అధ్యాత్మిక, నైతిక, వైజ్ఞానిక సత్యానికి వేదాలు ప్రామాణిక అభివ్యక్త రూపాలు అనే భావన దయానందుడి అన్వయం అంతటికీ ఆధారంగా నిలిచింది. దాని అధ్యాత్మిక బోధన యొక్క సారం ఏకేశ్వర వాదం – వైదిక దేవతలంతా ఒకే దైవం యొక్క అనేక నామాలు. వారంతా

ఆయన బహుళాత్మక శక్తికి ప్రతిరూపాలు. ప్రకృతిలో ఆయన శక్తుల లాస్యాన్ని మనం దర్శించగలుగుతాము. వేదాల యొక్క నిజమైన అంతరార్థాన్ని వొడగన గలిగితే, ఆధునిక పరిశోధన కనుక్కున్న వైజ్ఞానిక సత్యాలన్నిటినీ తెలుసుకోగలుగుతాము.

అలాంటి సిద్ధాంతాన్ని నిరూపించడం బహు కష్టమని వేరే చెప్పనక్కర్లేదు. దేవతలంతా ఒకే విశ్వాత్మ యొక్క వివిధ నామాలని, ఆ విశ్వాత్మ విశ్వానికి అతీతుడని, ఋగ్వేదం స్పష్టంగా చెప్తుంది. అంతేకాక వేద ఋక్కుల బట్టి దేవతలు ఒకే దైవం యొక్క వివిధ నామాలు మాత్రమే కాక, వివిధ రూపాలు, శక్తులు, వ్యక్తిత్వాలు కూడా నని తెలుస్తోంది. వేదం ప్రకటించే ఏకేశ్వరవాదంలో అద్వైతవాదం, సర్వాత్మవాదం కూడా ఇమిడి వున్నా, ఇది ఆధునికుల కరకైన, కఠోరమైన దేవతావాదంతో సమానం కాదని గుర్తించాలి. వేదపాఠాన్ని బలవంతంగా వక్రపరిస్తే తప్ప అలాంటి పెళుసైన, పేలవమైన అన్వయాన్ని పుట్టించడం సాధ్యం కాదు.

భౌతిక శాస్త్ర విషయాలలో కూడా ప్రాచీన జాతులకి మనం ఊహించే దాని కన్నా అధునాతనమైన పరిజ్ఞానం ఉండేదని ఒప్పుకోవాల్సి ఉంటుంది. ప్రాచీన ఈజిప్షియన్లు, చాల్డియన్లు కాలాంతరంలో ఆధునిక విజ్ఞానం పునరావిష్కరించిన ఎన్నో విషయాలని ముందే కనుగొన్నారని, వారికి తెలిసినవి, ఆధునిక విజ్ఞానం ఇంకా తెలుసుకోనివి ఇంకా ఎన్నో సత్యాలు ఉన్నాయని మనకి ప్రస్తుతం తెలుసు. ఇక ఖగోళవిజ్ఞానంలో ప్రాచీన భారతీయులు తక్కువవారేమీ కారు. వైద్య రంగంలో కూడా వారి ప్రతిభ ఎనలేనిది. హైందవ వైద్య విజ్ఞానానికి, రసాయనిక విజ్ఞానానికి పరదేశీ మూలాలు ఉన్నాయని కూడా అనిపించడం లేదు. భౌతిక విజ్ఞానానికి చెందిన ఇతర శాఖలలో కూడా వారికి ఆది నుండి కూడా అధునాతనమైన పరిజ్ఞానం ఉండేది. కాని వైజ్ఞానిక విషయాలలో స్వామి దయానందుడు ప్రతిపాదించిన వేదదర్శనాన్ని నిరూపించడం బహు కష్టమైన కార్యం.

వేదంలో నేను తలపెట్టిన శోధన అంతా ఈ మూలసూత్రం మీద ఆధారపడి వుంది – వేదానికి రెండు ముఖాలు ఉన్నాయి. ఆ రెంటికీ సన్నిహితమైన సంబంధం వున్నా వాటిని వేరువేరుగా ఉంచాల్సి వుంది. వేద ఋషులు తమ చింతన నంతటికీ ఒక విధమైన సమాంతర వాదం మీద స్థాపించారు. ప్రతీ వేలుపుని ఒక పక్క అంతశ్శక్తి గాను, మరో పక్క

ప్రకృతి గతమైన బాహ్య శక్తి గాను అన్వయించడం జరుగుతుంది. ద్వంద్వార్థాలతో కూడుకున్న ఒక వ్యవస్థతో వారు వేదార్థాన్ని వ్యక్తం చేశారు. ఒకే పరిభాషతో వేలుపు యొక్క ఉభయ ముఖాలని ఉపాసించేవారు. కాని బాహ్యార్థం కన్నా అంతరార్థానిదే పై చేయి అవుతుంది. అంతరార్థమే మరింత సర్వవ్యాపకమై, సంసక్తమై ఉంటుంది. వేదం యొక్క ముఖ్యోద్దేశం అధ్యాత్మిక ప్రకాశం, ఆత్మవికాసం. కాబట్టి ఆ అంతరార్థాన్ని ముందు ఆవిష్కరించవలసి వుంది.

వేదాన్వయంలో ప్రాచీన మరియు ఆధునిక ప్రయత్నాలు కూడా ఈ లక్ష్యసాధనలో ఎంతో ఉపకరిస్తాయి. సాయణుడు, యాస్కుడు బాహ్యాచారం, కర్మకాండ మొదలైన సాంప్రదాయక విషయాల గురించి, తత్సంబంధిత ప్రతీకల గురించి ఎన్నో వివరాలని, వివరణలని అందిస్తారు. ప్రాచీన వేద ఋషుల అధ్యాత్మిక, తాత్విక భావజాలాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఆ తరువాత వచ్చిన ఉపనిషత్తులు ఎన్నో విలువైన సూచనలిస్తాయి. వారి అధ్యాత్మిక అనుభవ ధార వెనుక ఉన్న విధానాన్ని అవి మనకి ప్రసాదిస్తాయి. తులనాత్మక పరిశోధనకి అవసరమైన కీలక పద్ధతులని ఐరోపా పాండిత్యం మనకి అందిస్తుంది. అయితే ఆ పద్ధతులని ఇంకా పరిపూర్ణం గావించాల్సి వుంది. అయితే ప్రస్తుతం లభ్యమైన శోధనాసామగ్రిని అవి మరింత బలోపేతం చెయ్యగలవు. ఆ విధానాలు మరింత పటిష్ఠం అయితే అవి వేదానికి ప్రస్తుతం కొరవడుతున్న మేధోగత పునాదిని, వైజ్ఞానిక నిశ్చయత్వాన్ని అందివ్వగలవు. ఋషుల భావజాలంలో ఒక మూలరహస్యాన్ని ఛేదించి దయానందుడు మనకి అందించాడు. అది ఉన్నది ఒకే ఆత్మ అన్న భావన, వివిధ వేలుపులంతా అతని అనేకముఖమైన ఏకత్వానికి చెందిన వివిధ నామరూపాలు మాత్రమేనన్న భావన.

అర్వాచీన కాలపు సాహిత్యం నుండి మనకి అంత సహకారం అందుతున్నప్పుడు ఆ ప్రాచీన ప్రపంచాన్ని పునరావిష్కరించడంలో మనం విజయం సాధించగలమేమో. వేదం అనే ముఖద్వారం లోంచి ప్రవేశించి ఆ పూర్వచారిత్రక యుగంలోకి తొంగి చూడగలమేమో.

అధ్యాయం 4

అధ్యాత్మిక సిద్ధాంతానికి పునాదులు

వేదార్థాన్ని విశదీకరించే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాలంటే అందుకు మూలాల కోసం వేదభాషలోనే గాలించాలి. వేదం అంతా నిండి వున్న ప్రతీకల, మూర్తుల అంతరార్థం తెలియాలంటే అందుకు దిశానిర్దేశం వేదఋక్కుల నుండే రావాలి. ఋషులు ఎంచుకున్న మూర్తుల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అర్థం చేసుకోకుండా వైదిక ప్రతీకల గురించి కల్లబొల్లి కల్పనలు అల్లితే, సిద్ధాంతంలో గొప్ప పాండిత్యం కనిపిస్తుందేమో కాని, అది గాలిలో కట్టిన మేడల చందమే అవుతుంది.

కాబట్టి వేదం హృదయంలో ఆంతరిక భావజాలపు సారం ఏదైనా వుందో లేదో తేల్చుకోవడం మన ప్రథమ కర్తవ్యం అవుతుంది. అటు పిమ్మట వేదసూక్తాలు అందించే అంతరంగ ఆధారాల సహాయంతో సాధ్యమైనంత మేరకు వైదిక వేల్పుల యొక్క ప్రతీకలని, అధ్యాత్మిక క్రియలని సక్రమంగా అన్వయించాలి. వేదంలో ప్రతీ పదానికి స్థిరమైన, చంచలాలు లేని, శబ్దశాస్త్రంలో లోతుగా వేళ్లూని వున్న, ప్రతీ సందర్భానికి సహజంగా అతికే అర్థాన్ని తెలుసుకోవాలి. మరి వేదఋక్కుల భాష అచంచలమైనదని ముందే చెప్పుకున్నాం. నిర్దోషమైన ఉచ్చారణా

సాంప్రదాయంతో అది సంరక్షించబడింది. సనాతనమైన సాంప్రదాయాన్ని, అనాది అయిన అనుభవ ధారని అది వ్యక్తం చేస్తోంది. వేద ఋషుల భాష చంచలమై ఉంటే, వారి భావ జాలం స్థిరమైన ఆధారం లేక కల్లోలమయమై ఉంటే, వారి భావాల అన్వయంలో మనం చూపించే చొరవని, చంచలతని కొంతవరకు ఒప్పుకోవచ్చు. కాని వేదఋక్కులు చెప్పే సాక్ష్యం ఈ ధోరణికి పూర్తిగా విరుద్ధంగా వుంది. కాబట్టి మూలంలో ఎంత నిర్దిష్టత వుందో, దాని అన్వయంలో కూడా అంతే నిర్దిష్టత ఉండాలన్నది న్యాయసమ్మతం. వైదిక మతానికి చెందిన వివిధ పదాల, భావాల మధ్య స్థిరమైన సంబంధం ఉందన్నది స్వయం విదితం. అన్వయంలో అసంసక్తత, సంధిగ్ధత ఉన్నాయంటే, అన్వయకారుడికి వైదిక పదాల మధ్య సంబంధాల మీద గట్టి పట్టు లేదన్న మాటే.

ఆ విధంగా ఈ తొలి అధ్యయనాలు క్షుణ్ణంగా జరిగితే, వేద ఋక్కులని అనువదించి, దాని సహాయంతో చేసిన వేదాన్వయం అన్ని సందర్భాల్లోను ఇంపుగా పొసగుతోందని నిరూపించగలిగితే, వేద ఋక్కుల వరుస క్రమంలో ఒక సంసక్తమైన తార్కిక భావపరంపర ఉందని ప్రదర్శించగలిగితే, దాని వల్ల వేదంలో ఒక ప్రాచీనమైన తత్వరూపం మన ఎదుట సాక్షాత్కరిస్తే, మన ప్రతిపాదనకి ఒక సముచిత స్థానం ఉందన్న మాటే. అటువంటి ప్రతిపాదన ఇతర ప్రతిపాదనలని వ్యతిరేకించినప్పుడు, వాటితో అది పోటీపడగలదు; తక్కిన ప్రతిపాదనలతో దానికి పొత్తు కుదిరినప్పుడు వాటిని పరిపూరించగలదు. అలాంటి ప్రయత్నం వల్ల వేదం అతి ప్రాచీనమైన భారతీయ అధ్యాత్మిక చింతనని వ్యక్తం చేస్తోందని, వేదాంతం కన్నా, పురాణం కన్నా ముందు వచ్చిందని, వాటికి అది తల్లి వంటిదని తేలిందంటే, మన ప్రతిపాదనని మరింత బలపరచినట్టు అవుతుంది.

అంత విస్తారమైన, క్షుణ్ణమైన అధ్యయనాన్ని ఈ కాసిన్ని అధ్యాయాలలో పొందుపరచడం సాధ్యం కాదు. నాకు ప్రసాదించబడ్డ వేదరహస్యాన్ని, దానికి సంబంధించిన సాధనా మార్గాన్ని, అందులోని ముఖ్యమైన మైలురాళ్లని, సూచనప్రాయంగా వర్ణించడమే ఈ అధ్యాయాల లక్ష్యం. అసలు మొదట నా మనసులో ఇలాంటి సిద్ధాంతం ఎలా అంకురించిందో వివరిస్తే, నేను నడిచిన మార్గం ఎటువంటిదో పాఠకుడికి తేటతెల్లం అవుతుంది. అంతేకాక

పాఠకుడు కావాలనుకుంటే నేను అవలంబించిన వాదనా సరళి గాని, నమ్మిన పూర్వభావనలు గాని సరైనవో కావో తానే పరీక్షించి తేల్చుకోవచ్చు.

వేదాన్ని సొంతంగా అధ్యయనం చేసే ప్రయత్నాన్ని మొదలుపెట్టకముందు, నేను కూడా చాలా మంది భారతీయులకి మల్లె, ఐరోపా పాండిత్యాన్ని, దాని నిర్ణయాలని ఉదాసీనంగా స్వీకరించాను. వేద ఋక్కుల అధ్యాత్మిక అంతరార్థాన్నే కాక, వాటి చారిత్రక, జాతీయ అర్థాన్ని కూడా కూడా ఐరోపా పాండిత్యానికి అనుగుణంగానే మొదట్లో అర్థం చేసుకున్నాను. తదనుగుణంగా, సాధారణ, ఆధునిక హైందవ అభిప్రాయానికి అనుసారం, భారతీయ అధ్యాత్మికతకి, చింతనకి అత్యంత ప్రాచీన మూలాలు ఉపనిషత్తులని అంగీకరించాను. కాబట్టి ఋగ్వేదపు ఆధునిక అనువాదాలు పరిశీలించినప్పుడు, మన జాతి చరిత్రకి సంబంధించిన ఓ ముఖ్యమైన కావ్యంగా పరిగణించానే గాని, దాన్ని ఒక సజీవ అధ్యాత్మిక అనుభవధారకి లిఖిత రూపంగా గుర్తించలేకపోయాను.

భారతీయ యోగ మార్గాన్ని అనుసరిస్తూ కొన్ని రకాల సాధనలు చేస్తున్నప్పుడు మొట్టమొదటి సారిగా వైదిక చింతనతో నా పరిచయం ఏర్పడింది. తెలియకుండానే నా వికాస క్రమం మన పూర్వీకులకి తెలిసిన కొన్ని ప్రాచీన ఆత్మవికాస మార్గాల దిశగా మొగ్గు చూపింది. కొన్ని అధ్యాత్మిక అనుభవాలని సూచించే పదాలు నా మనసులో సహజంగా ఉద్భవించసాగాయి. పదే పదే వస్తూ ఆ పదాలు నా మదిలో స్థిరపడసాగాయి. అలా స్ఫురించిన పదాలలో ఇల, సరస్వతి, సరమ అనే ముగ్గురు స్త్రీ శక్తుల పేర్లు ప్రధానంగా కనిపించాయి. మన లోజ్ఞానాత్మక హేతువుకి చెందిన నాలుగు సామర్థ్యాలలో మూడింటిని ఈ మూడు శక్తులు సూచిస్తున్నాయి. ఆ మూడు సామర్థ్యాలు - ఆత్మప్రకాశనం, స్ఫూర్తి, లోజ్ఞానం. ఆ మూడింటిలో రెండు పేర్లు నాకు వైదిక దేవతలుగా ముందు నాకు పెద్దగా తెలియదు. కేవలం పౌరాణిక పాత్రలుగా – సరస్వతి చదువుల తల్లిగాను, ఇల చంద్రవంశానికి జనని గాను – ఆ నామాలని అంతకు ముందు ఎరుగుదును. సరమ పేరు కూడా సుపరిచితమే. కాని ఆ పేరు విన్నప్పుడు నా మదిలో మెదిలిన రూపానికి, వైదిక దివ్య

శునక రాజానికి మధ్య సంబంధాన్ని మొదట్లో గుర్తించలేకపోయాను. ఆ పేరుని నేను మొదట్లో గ్రీకు పురాణానికి చెందిన ఆర్గైవ్ హెలెన్ పేరుతో పోల్చుకున్నాను. కిరణాలనే గోవులు చీకటి శక్తులనే గుహలోకి చొచ్చుకుపోయి కనుమరుగైనప్పుడు వాటిని వెతుక్కుంటూ ఉదయించిన భౌతిక ఉషస్సుతో మాత్రమే మొదట్లో ఆ పేరును పోల్చుకోగలిగాను. కాని వేదరహస్యం పట్టుచిక్కాక, భౌతిక తేజం యొక్క అధ్యాత్మిక అర్థం అవగతం అయ్యాక, సరమ యొక్క అసలు అర్థం తెలిసింది. ఉపచేతనా మానస గుహలలోకి చొచ్చుకుపోయి అక్కడ నిర్బంధించబడ్డ అద్భుత ప్రకాశనాలు భళ్ళున పెల్లుబికేలా చేయగల లోజ్ఞానమే సరమ అని అర్థమయ్యింది. కాని అప్పటికి నాకు తెలిసిన వేదరహస్యం ఇంకా అసంపూర్తిగానే తోచింది. పేరు యొక్క అర్థాన్ని గుర్తించానే గాని, దాని ప్రతీకలోని అంతరార్థాన్ని ఇంకా తెలుసుకోలేకపోయాను.

నేను దక్షిణ భారతంలో గడపిన రోజుల్లోనే నా ఆలోచనలు మొట్టమొదట వేదం మీదకి మళ్లాయి. అంతవరకు ఆర్యులు ఉత్తరాది వారని, ద్రావిళ్లు దక్షిణాది వారనే జాతీయ విభజన నిజం అని ఎంతో మందిలాగానే నేను నమ్మాను. ఒక తరుణంలో ఆ నమ్మకం మీద గట్టి దెబ్బ కొట్టే రెండు అనుభవాలు ఎదురయ్యాయి. ఆర్యులకి, ద్రావిళ్లకి భౌతిక రూపురేఖల్లో తేడా ఉందనే భావన మీద, బలమైన సంస్కృత భాషా ప్రభావం గల ఉత్తరాది భాషలకి, సంస్కృతేతర తత్వం గల దక్షిణాది భాషలకి మధ్య తేడా ఉందనే భావన మీద ఆ విభజన ఆధారపడిందని అనుకునేవాణ్ణి. అయితే భారత ద్వీపకల్పం అంతటా సమంగా విస్తరించిన ఒక ఏకైక జాతి – దాన్ని ఇండో – ఆఫ్ఘన్ జాతి అనో, ద్రావిడ జాతి అనో పిలవొచ్చు – ఒకటి ఉండేదనే సిద్ధాంతాలు కొన్ని కాలాంతరంలో ప్రతిపాదించబడ్డాయి. అలాంటి సిద్ధాంతాలతో కూడా నాకు పరిచయం ఉన్నా వాటికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే దక్షిణ భారతంలో జీవించిన తొలి నాళ్లలోనే తమిళ జాతివారిలోనే "ఆర్య" రూపురేఖలు గల వ్యక్తులని ఎన్నో సార్లు గమనించాను. అలాంటి వారు కేవలం బ్రాహ్మణులలోనే కాక, ఇతర కులాలలోను, తెగలలో కూడా ఎదురయ్యారు. మహారాష్ట్ర, గుజరాత్, హిందుస్తాన్ ప్రాంతాలకి చెందిన నా మిత్రులని పోలిన రూపు రేఖలు గల వారు అక్కడ ఎన్నో సార్లు కనిపించారు. నా జన్మభూమి అయిన బెంగాల్ కి చెందిన వారిని పోలిన రూపురేఖలు గల వారు కూడా కాస్త అరుదుగా అయినా నిశ్చయంగా తారసపడేవారు. ఉత్తర భారతం నుండి

నానా తెగల వాళ్లకి చెందిన ప్రజాసముద్రం దక్షిణ భారతంలోకి ప్రవేశించి అక్కడి స్థానిక తెగలని ముంచెత్తినట్టు అనిపించింది. దక్షిణ భారతీయ ప్రాంతానికి చెందిన స్వాభావికమైన ఆకృతి అనేది ఒకటి వుందని అనుకున్నా, దాన్ని ఇదమిత్థంగా నిర్ణయించడం అంత సులభం అనిపించలేదు. వివిధ జాతుల మధ్య ఎన్ని రకాల సమ్మేళనాలు జరిగినా, భౌతిక, సాంస్కృతిక లక్షణంలో[6] అనన్యమైన ఒక జాతి భారత దేశం మొత్తం వ్యాపించిందని అర్థమయ్యింది. అసలు మానవజాతి శాస్త్రానికి చెందిన కొంత నిరాధారిత కల్పన[7] కూడా ఈ దిశలోనే మొగ్గు చూపుతున్నట్టు కనిపిస్తోంది.

మరైతే ఆర్య, ద్రావిడ జాతుల మధ్య శబ్దశాస్త్రవేత్తలు పుట్టించిన విభజన మాటేమిటి? అది ఇట్టే ఆవిరైపోతుంది. ఆర్యుల దండయాత్ర అనేది జరిగిందని ఒప్పుకున్నట్లయితే, ఆ జాతి భారతావని అంతా పెద్ద ఎత్తున వ్యాపించి ఇక్కడి ప్రజల భౌతిక రూపురేఖలని మార్చి ఉండొచ్చు. అట్లా కాక కాస్త తక్కువ నాగరికత కలిగిన జాతి చిన్న చిన్న బృందాలుగా వలస వచ్చి ఉంటే, వారు ఇక్కడి జనసముద్రంలో విలీనమైపోయి ఉండొచ్చు. అలాంటి జాతి సనాగరికులై, ఘన నగర నిర్మాతలై, సుసంపన్న వ్యాపారులై, గొప్ప మానసిక, అధ్యాత్మిక సంస్కృతితో భారత ద్వీపకల్పం అంతా అప్పటికే విస్తరించి విలసిల్లిన జాతి మీద తమ

---

[6] ఇక్కడ జాతి అన్న పదాన్ని వాడడానికి సందేహిస్తున్నాను. జాతి అనే పదాన్ని నిర్వచించడం మామూలుగా అనుకునే దాని కన్నా బహుకష్టం. జాతిని నిర్ణయించడంలో ఆధునిక మానసం చేసే తీవ్ర విభజనలు పూర్తిగా అప్రస్తుతం అనిపిస్తుంది.

[7] వివిధ మానవజాతుల మధ్య భేదాలని విశ్లేషించే మానవజాతి శాస్త్రం చేసే కల్పనలు సమంజసమైనవని ముందు అసలు ఒప్పుకోవాలి. మానవ జాతి శాస్త్రానికి పునాది రాయి వంటి ఒక సూత్రం కపాలం యొక్క ఆకారం. కపాల ఆకారం అనువంశికంగా మారదని ఆ సూత్రం చెప్తుంది. అయితే సూత్రాన్ని కూడా ఈ రోజుల్లో ప్రశ్నిస్తున్నారు. ఆ సూత్రం మాయమైతే దాంతో పాటు ఆ శాస్త్రం మొత్తం అవిరైపోతుంది.

భాషతో, మతంతో, భావజాలంతో, కట్టుబాట్లతో అధిగమించ గలిగిందని అనుకోవాల్సి ఉంటుంది. అలాంటి మహత్యం సాధ్యం కావాలంటే ఆ దండయాత్ర చేసిన వారు మరింత సంస్కారవంతమైన భాష, మరింత సృజనాత్మకమైన మనస్సు, మరింత శక్తివంతమైన మతసాంప్రదాయం కలిగినవారై ఉండాలి.

రెండు భిన్న జాతులు ఉన్నాయన్న సిద్ధాంతానికి ఆధారంగా భాషా భేదాలు ఎప్పుడూ ఉండనే ఉన్నాయి. కాని ఈ దిశలో వినియోగించబడ్డ తర్కం కాస్త గందరగోళంగా కనిపిస్తుంది. తమిళ భాషా శబ్దాలనే తీసుకుంటే మొదటి చూపులో అవి సంస్కృత శబ్దాల కన్నా చాలా భిన్నంగానే కనిపిస్తాయి. కాని ఎన్నో సందర్భాలలో నేను శుద్ధ తమిళ శబ్దాలని, లేదా శబ్ద జాతులని తీసుకుని, వాటి విశ్లేషణ ఆధారంగా సంస్కృతానికి, దానికి సోదరతుల్యమైన లాటిన్ కి మధ్య సంబంధాలని కనిపెట్టగలిగాను. అలాగే కొన్ని సార్లు గ్రీకుకి, సంస్కృతానికి మధ్య కూడా సంబంధాలు కనిపించాయి. కొన్ని సార్లు తమిళ శబ్దం, కేవలం సంబంధాన్ని సూచించడమే కాక, పరసస్పర సంబంధం గల శబ్దజాలంలో అంతవరకు లోపించిన లంకెగా ప్రత్యక్షమయ్యింది. ఆ విధంగా ఈ ద్రావిడ భాష యొక్క అధ్యయనం చేత ఆర్య భాషల మూలాలని, వాటి పిండోత్పత్తి క్రమాన్ని మొట్టమొదటి సారిగా పొడచూడలిగాను. ఈ విషయంలో నా పరిశోధనని ఒక స్థిరమైన సత్యాన్ని స్థాపించే వరకు కొనసాగించలేకపోయాను. కాని ద్రావిడ, ఆర్య భాషా జాతులు మాత్రం అందరూ అనుకునే దాని కన్నా సన్నిహితమైనవని మాత్రం స్థిరంగా చెప్పగలను. అంతేకాక ఆ రెండు భాషా జాతులు కూడా మరింత ప్రాచీనమైన, విస్మృతమైన భాష నుండి ఆవిర్భవించాయని కూడా అనిపిస్తుంది. అదే నిజమైతే, ద్రావిడ భారతం మీద ఆర్యులు దండయాత్ర చేశారనే సిద్ధాంతానికి ఇక ఆధారాలు అంటూ ఏవైనా మిగిలితే, వాటి కోసం వేద ఋక్కులలోనే వెతకవలసి ఉంటుంది.

ఆ విధంగా రెండు ప్రయోజనాలని దృష్టిలో పెట్టుకుని నేను మొట్టమొదటి సారిగా వేదాధ్యయనానికి పూనుకున్నాను. అయితే మొదట్లో ఆ అధ్యయనం లోకి మరీ లోతుగా దిగే ఉద్దేశం లేకపోయింది. అయితే వేదాల్లో చెప్పబడ్డ ఆర్యులకి, దస్యులకి మధ్య జాతిభేదం వుందన్న వాదనలోను, దస్యులకి స్థానికులకి మధ్య సంబంధం వుందన్న వాదన లోను పెద్దగా బలం లేదన్న విషయం నాకు త్వరలోనే అర్థమయ్యింది. కాని ఆ గీర్వాణ గీతాలలో

ప్రగాఢమైన అధ్యాత్మిక చింతనా సంపదలు నిక్షిప్తమై ఉన్నాయన్న ఆవిష్కరణ నాకు మరింత ప్రధానంగా తోచింది. లోగడ నేను పొందిన కొన్ని అధ్యాత్మిక అనుభూతులని వేదమంత్రాలు వివరించగలుగుతున్నాయి అన్న గుర్తింపు నా దృష్టిలో వేదాన్ని మరింత ఎత్తుకు తీసుకువెళ్లింది. అంతేకాక నా అనుభవాలని వివరించగల సాహిత్యం నాకు ఐరోపా తత్వ చింతనలో గాని, యోగసాహిత్యంలో గాని, వేదంతంలో గాని తారసపడలేదు. ఉపనిషత్తులకి చెందిన కొన్ని ప్రగాఢ భాగాల విషయంలో కూడా వేద మంత్రాలు అద్భుతంగా బోధించగలిగాయి. పౌరాణిక సాహిత్యంలో కూడా ఇప్పుడు ఎన్నో అంశాలు కొత్త కోణం నుండి కనిపించి భాసిస్తున్నాయి.

నేను ఈ ఫలితాన్ని సాధించే ప్రయత్నంలో సాయణుడి వ్యాఖ్యానం గురించి నాకు అంతగా తెలియకపోవడం ఎంతో పనికొచ్చింది. వేదంలో తరచు తారసిల్లే ఎన్నో పదాలకి స్వేచ్ఛగా వాటి సహజ అర్థాన్ని ఇవ్వగలిగాను. ఉదాహరణకి – ధీ అంటే ఆలోచన లేదా అవగాహన, *మనస్* అంటే మనస్సు, *మతి* అంటే ఆలోచన, తలంపు లేదా మనోస్థితి, *మనీషా* అంటే బుద్ధి, *ఋతం* అంటే సత్యం. అలాగే మరి కొన్నిటికి వాటి కచ్చితమైన అర్థాన్ని ఇవ్వగలిగాను – *కవి* అంటే ద్రష్ట, *మనీషీ* అంటే తాత్వికుడు, *విప్ర* లేదా *విపశ్చిత్* అంటే విరాజమానమైన మనస్సు గలవాడు. అలాగే మరింత లోతైన శోధన చేసి కొన్ని పదాల గూఢార్థాలని తెలుసుకోగలిగాను. ఉదాహరణకి అలాంటివే రెండు పదాలని తీసుకుంటే – *దక్ష* అనే పదాన్ని సాయణుడు శక్తి అనే అర్థంలో ప్రయోగించాడు, *శ్రవస్* అనే పదాన్ని సంపద, ఆహారం, ప్రఖ్యాతి అనే అర్థంలో తీసుకున్నాడు. వేదం యొక్క అధ్యాత్మిక సిద్ధాంతాన్ని సృష్టించాలనుకుంటే అది ఈ పదాల యొక్క సహజ అర్థాన్ని తెలుసుకున్నప్పుడే సాధ్యమవుతుంది.

ధీ, *ఋతం* మొదలైన పదాలకి సాయణుడు అనేక విధాలైన అర్థాన్ని ఆపాదిస్తాడు. వేదం యొక్క అధ్యాత్మిక అన్వయంలో ముఖ్య స్థానాన్ని ఆక్రమించే *ఋతం* అనే పదాన్ని సాయణుడు కొన్ని సార్లు "సత్యం" అనే అర్థంలోను, మరి కొన్ని సార్లు "యాగం" అనే అర్థంలోను, ఇంకొన్ని సార్లు జలం అనే అర్థంలో కూడా ప్రయోగించడం జరిగింది. అధ్యాత్మిక అన్వయంలో దానికి సత్యం అనే అర్థమే సరిగ్గా సరిపోతుంది. *ధీ* అనే పదాన్ని సాయణుడు

“ఆలోచన” అని, “ప్రార్థన” అని, “కర్మ” అని, “ఆహారం” అని ఇకా రకరకాల అర్థాల్లో ప్రయోగిస్తాడు. అధ్యాత్మిక అన్వయంలో దానికి ఆలోచన లేదా అవగాహన అనే అర్థం సమంజసంగా ఉంటుంది. మరెన్నో వేదశబ్దాల విషయంలో కూడా అలాగే జరిగింది. అంతేకాక పదాల మధ్య సూక్ష్మభేదాలని చెరిపేసి వాటిని వాటి సర్వసామాన్య అర్థంలో వాడే ధోరణి సాయణుడిలో కనిపిస్తుంది. మనో వృత్తిని సూచించే పదాలు అన్నిటినీ అతడు “ప్రజ్ఞ” అనే పదంతో సూచిస్తాడు. అలాగే బలం యొక్క అనేక రూపాలని సూచించే పదాలని (అలాంటివి మరి వేదంలో కోకొల్లలు), శక్తి అనే పదంతో అన్వయిస్తాడు. కాని వేదాల్లో కనిపించే అద్భుత వైవిధ్యం గల శబ్దభేదం నాకు మొదట్లోనే ఎంతో అబ్బురపాటు కలిగించింది. కాబట్టి సన్నిహితార్థం గల శబ్ద సమూహం ఉన్నప్పుడు, సందర్భాన్ని బట్టి నిర్దిష్టమైన పదాన్ని వాడడం చాలా ముఖ్యమని తెలుసుకున్నాను. అసమాన కవితాశక్తి గల వేదర్షులు పదాలని విచ్చలవిడిగా, విచక్షణా రహితంగా వాడుతారని అనుకోవడం పొరబాటే అవుతుంది. ప్రతీ పదాన్ని ఆచితూచి, వాటి అర్థాన్ని నిశితంగా గ్రహించి, సందర్భోచితంగా వాడుతారాని అనుకోవడమే సముచితమౌతుంది.

ఈ విధమైన ఆలోచనా సరళిని అనుసరిస్తూ, శబ్దాల యొక్క, సమాసాల యొక్క సహజ, స్వయం విదిత అర్థాన్నే అంటిపెట్టుకుని ముందుకు సాగాను. ఆ ప్రయత్నం వల్ల శ్లోకాలే కాక, మొత్తం వేద భాగాలే పూర్తిగా తేటతెల్లం కాసాగాయి. అసలు మొత్తం వేద స్వరూపమే నా మనో ఫలకం మీద సాక్షాత్కరించింది. అసమాన తత్వ సంపద, అద్భుత అధ్యాత్మిక అనుభవ ధార నాకు వేదంలో నిలువెల్లా గోచరించింది. కొన్ని చోట్ల సూచనప్రాయంగాను, మరి కొన్ని చోట్ల సువిస్తారంగానూ ఆ ఐశ్వర్యం ప్రత్యక్షమయ్యింది. మరో విషయం ఏమిటంటే వేదంలో కొన్ని పదాలకి సాధారణమైన, స్పష్టమైన అధ్యాత్మిక అన్వయం ఉంటుంది. కాని మరి కొన్నిటికి ఒక పక్క బాహిరమైన, పార్థివమైన అర్థాన్ని గాని, మరొక పక్క ఆంతరికమైన, అధ్యాత్మికమైన అర్థాన్ని గాని సందర్భాన్ని బట్టి ఇవ్వడానికి వీలవుతుంది. ఉదాహరణకి *‘రాయె’, ‘రయి’, ‘రాధస్’, ‘రత్న’* వంటి పదాలని ఒక పక్క స్థూలమైన ఐశ్వర్యాన్ని సూచించేవిగాను మరొక పక్క ఆంతరికమైన ఆనందాన్ని సూచించేవిగాను స్వీకరించవచ్చు. ఇలాంటి పదాలు అంతరంగానికి, బహిరంగానికి ఒకేసారి వర్తిస్తాయి. అలాగే *‘ధన’, ‘వాజ’, ‘పోష’* వంటి పదాలు బాహ్యమైన, ఆంతరికమైన నిండుదనాన్ని, జీవన వృద్ధిని

సూచిస్తాయి. మొదట వేదంలో వాడబడిన పదంగా 'రాయె' అనే పదం ఉపనిషత్తులలో అధ్యాత్మిక ఆనందం అనే అర్థంలో వాడబడుతుంది. మరి మూలగ్రంథమైన వేదంలో కూడా ఆ పదాన్ని అదే అర్థంలో ఎందుకు వాడకూడదు? అలాగే 'వాజె' అన్న పదం అధ్యాత్మిక అన్వయం అపాదించబడ్డ మరెన్నో పదాలతో పాటు వస్తుంది. కాబట్టి ఆ పదంతో పాటు వచ్చే పదాలకి ఒక పక్క అధ్యాత్మిక అన్వయాన్ని అందిస్తూ, ఆ ఒక్క పదానికి మాత్రం భౌతిక సమృద్ధి అనే స్థూలమైన అర్థాన్ని ఇవ్వడం అసంగతంగా ఉంటుంది. కాబట్టి ఈ పదాలన్నిటికీ వేదంలో ప్రతీ చోట అధ్యాత్మిక అర్థాన్ని ఇవ్వడం సహేతుకం అవుతుంది.

ఈ విధమైన ప్రయత్నాన్ని నియమబద్ధంగా చేస్తూ పోతే, కేవలం ప్రత్యేక ఋక్కులు మాత్రమే కాకుండా, వేద కాండాలే కాకుండా, అసలు మొత్తం వేదమే అధ్యాత్మిక పరిమళంతో గుబాళిస్తుంది. వైదిక యజ్ఞం ఒక ప్రతీకాత్మక కృత్యం అన్న విషయాన్ని సమ్మతిస్తే, ఈ పరివర్తన ఎన్నో చోట్ల సంపూర్ణంగా కనిపిస్తుంది. గీతలో యజ్ఞం అనే పదాన్ని ప్రతీకాత్మకంగా ప్రయోగించడం కనిపిస్తుంది. దేవతలకి, లేదా పరమాత్మకి సమర్పించబడ్డ కర్మలని అన్నిటినీ, అవి బాహిరమైనా, ఆంతరికమైనా వాటిని యజ్ఞంగానే గీత పరిగణిస్తుంది. ఇక్కడ మనకి ఒక ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది. యజ్ఞం అనే పదాన్ని ఆ విధంగా ప్రయోగించే ఆచారం కాలాంతరంలో వచ్చిన తత్వచింతనా సాంప్రదాయం వల్ల వచ్చిందని అనుకోవాలా? లేదా తొలుత వైదిక యజ్ఞంలో కూడా అలాంటి భావన ఉందనుకోవాలా? వేదంలో ఎన్నో ఋక్కులలో యజ్ఞం అనే పదం యొక్క ప్రతీకాత్మక ప్రయోగం స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆ అర్థం తెరమాటున దాగినా, సులభంగానే అవగతమవుతుంది. ఇక్కడ మనకి ఒక ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది. యజ్ఞం అనే పదం మొదట్లో బాహ్యాచారానికే పరిమితమై, కాలాంతరంలో ప్రతీకాత్మక అన్వయాన్ని సంతరించుకుందా? లేక వేదం మొత్తంలో దాని ప్రతీకాత్మక అర్థమే స్వీకరించబడినా, అది కొన్ని చోట్ల గుప్తంగా ఉంటూ మరి కొన్ని చోట్ల మరింత సులభంగా తేటతెల్లం అవుతోందా? అధ్యాత్మిక అర్థాన్ని చాటే శ్లోకాలు వేదంలో పదే పదే తారసిల్లకపోయి ఉంటే, మొదటి అన్వయాన్నే స్వీకరించవలసి ఉంటుంది. కాని వేదంలో ఋక్కుఋక్కులోను అధ్యాత్మిక అంతరార్థం పదే పదే ధ్వనిస్తుంది. అయితే యజ్ఞం చేసే వ్యక్తి కొన్ని చోట్ల మనిషి అయితే, మరి కొన్ని చోట్ల దేవత అవుతాడు. ఈ

విషయంలోనే అన్వయంలో కొంత అస్పష్టతకి తావు ఏర్పడుతోంది. ఈ ఆలోచనా సరళిని అనుసరిస్తూ వైదిక కర్మకాండని ప్రతీకాత్మకంగా అన్వయిస్తూ ముందుకి సాగాను.

అయితే అధ్యాత్మిక అన్వయాన్ని సాధించాలని బయల్దేరితే మొదట్లోనే ఒక సవాలు ఎదురవుతుంది. అంతవరకు నేను పదాల యొక్క, వాక్యాల యొక్క పైపై అర్థాన్ని తీసుకుని, సహజ పద్ధతిలో ముందుకు సాగాను. కాని ఒక దశలో నాకు ఆ బాహ్యార్థాన్ని అతిక్రమించవలసిన అవసరం కనిపించింది. నిష్కర్షగా శోధించాలని అనుకున్నప్పుడు కొంత సంధిగ్ధం ఎదురవుతుంది. ఎంత ఆచితూచి ముందుకి సాగినా అన్వయం సముచితమేనా, న్యాయబద్ధమేనా అని ప్రశ్నించుకోవలసి వస్తుంది.

వైదిక యజ్ఞంలో మూడు అంశాలు ఉంటాయి - యాజ్ఞికుడు (యజ్ఞం చేసేవాడు), నైవేద్యం (యజ్ఞంలో సమర్పించబడినది), యజ్ఞఫలం. (దేవతని, మంత్రాన్ని కాసేపు పక్కన పెడదాము.) యజ్ఞం అనేది దేవతలకి సమర్పించబడ్డ కర్మ అనుకుంటే, 'యజమాని' అనే పదం ఆ కర్మని చేసేవాడు అనుకోవడం సహజంగా అనిపిస్తుంది. యజ్ఞం అనేది ఒక కర్మ – అది బాహ్యమైనది కావచ్చు, ఆంతరికమైనది కావచ్చు. 'యజమాన' అనేది ఆ కర్మని చేసే వ్యక్తి, లేదా ఆత్మ. అయితే యజ్ఞానికి అధ్వర్యం వహించే పురోహితులు కూడా ఉంటారు. వారిని 'హోతా', 'ఋత్విజ' 'పురోహిత', 'బ్రహ్మ', 'అధ్వర్యు' అని అనేక పేర్లతో పిలుస్తారు. యజ్ఞాన్ని ప్రతీకాత్మకంగా అన్వయిస్తున్నప్పుడు వారి పాత్ర ఏమిటి? యజ్ఞం మొత్తం ఒక ప్రతీక అనుకున్నప్పుడు, అందులోని ప్రతీ అంశానికి ఒక ప్రతీకాత్మక అన్వయం ఉండాలి. దేవతలే పురోహితులై యజ్ఞానికి అధ్వర్యం వహిస్తున్నట్టు వేదంలో ఎన్నో చోట్ల చెప్పబడింది. కొన్ని చోట్ల స్పష్టంగా ఏదో మానవేతర శక్తి అధ్వర్యం వహిస్తున్నట్టు వర్ణించబడింది. అయితే వేదంలో ఎన్నో చోట్ల మన వ్యక్తిత్వంలోని అంశాలకే మానవీయమైన రూపాన్ని ఆపాదించి వ్యక్తీకరించడం కనిపిస్తుంది. ఈ నియమాన్ని వ్యతిరేక దిశలో వర్తింపజేస్తే, బహిరంగంలో యజ్ఞాన్ని అధ్వర్యం వహించే పురోహితుడు, మనలోనే ఉన్న ఏదో మానవేతర శక్తిని ప్రతినిధి అని అనుకోవలిసి ఉంటుంది. కాబట్టి యజ్ఞానికి అధ్వర్యం చేసే వారి వివిధ కర్మల యొక్క

అధ్యాత్మిక అంతరార్థాన్ని ఇప్పుడు నిర్ణయించవలసి వుంది. ఇక్కడే మనకి వైదిక పరిభాష ఎన్నో చక్కని సూచనలిస్తుంది. ఉదాహరణకి "పురోహిత" అనే పదానికి అర్థం "ముందు ఉంచబడ్డ" ప్రతినిధి అని వస్తుంది. ఆ సందర్భంలో తరచు అగ్నిదేవుడి ప్రస్తావన వస్తుంది. ఇక్కడ అగ్ని అంటే మానవతత్వంలో దాగిన దైవేచ్ఛకి ప్రతీక. యజ్ఞంలో సమర్పించబడ్డ కర్మలన్నిటినీ ఆ అగ్నిదేవుడే స్వీకరిస్తాడు.

యజ్ఞంలో సమర్పించబడ్డ అంశాల అంతరార్థాన్ని అర్థం చేసుకోవడం మరింత కష్టం. ఉదాహరణకి సోమపానం యొక్క ప్రయోజనం గురించి, ప్రభావం గురించి శబ్దశాస్త్రం చేసే సూచనల బట్టి, ఆ పదం యొక్క పర్యాపదాలను బట్టి కొంతవరకు అర్థం చేసుకోవచ్చునేమో. కాని యజ్ఞంలో "ఘృతం" అంటే నెయ్యిని సమర్పించే ఆచారాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వేదంలో మాత్రం ఆ పదం యొక్క ప్రయోగం దాని ప్రత్యేక ప్రతీకాత్మక ప్రాముఖ్యతని పదే పదే ప్రకటించుకుంటోంది. ఉదాహరణకి స్వర్గం నుండి బొట్టుబొట్టుగా స్రవించే నేతిని గాని, ఇంద్రుడి అశ్వాల నుండి స్రవించే నేతిని గాని, లేదా మనస్సు లోనుండి స్రవించే నేతిని గాని ఎలా అర్థం చేసుకోవాలి? పైపైన చూస్తే ఇది పూర్తిగా అసంగతమైన ప్రేలాపనలా కనిపిస్తుంది. ఆ పదప్రయోగం చేసిన కవి దాన్ని కేవలం ఒక భౌతిక పదార్థంలా కాక ప్రతీకాత్మక దృష్టితోనే వాడుతున్నాడని అనుకుంటే తప్ప ఆ పదానికి వేదంలో ఇవ్వబడ్డ వివిధ అర్థాలన్నీ ఒకదాంతో ఒకటి పొసగవు. అయితే సందర్భాన్ని బట్టి పదాల అర్థాన్ని రకరకాలుగా స్వీకరించొచ్చు. ఉదాహరణకి *ఘృత* అనే పదాన్ని కొన్నిసార్లు నెయ్యి గాను, మరి కొన్ని సార్లు నీరుగాను వాడుతారు. అలాగే *మనస్* అనే పదం కొన్ని సార్లు మనస్సును, మరి కొన్ని సార్లు ఆహారాన్ని, రొట్టెని కూడా సూచిస్తుంది. ఘృతం అనే పదాన్ని పదే పదే ఆలోచన, లేదా మనస్సును సూచిస్తున్నట్టుగా వాడారు. వేదంలో స్వర్గం అనేది మనస్సుకి ప్రతీక అయితే, ఇంద్రుడు విరాజమాన మానసానికి ప్రతీక. అతడి రెండు అశ్వాలు ఆ మానసం యొక్క జంటశక్తులకి ప్రతీకలు. అందుకే వేదం ఎన్నో చోట్ల బుద్ధిని (*మనీషా*) శుద్ధమైన ఘృతం రూపంలో దేవతలకి అర్పించడం గురించి తేటతెల్లంగా మాట్లాడూతుంది (*ఘృతం న పూతం మనీషాం*). ఘృతం అనే పదం యొక్క పలు శబ్దశాస్త్రీయ ప్రాముఖ్యతలలో మరొకటి ఉంది – అది 'నిండైన వెచ్చని తేజం'. ఇలాంటి సూచనలని ఆధారంగా చేసుకుని నెయ్యి అనే ప్రతీక

యొక్క అధ్యాత్మిక అంతరార్థాన్ని నిర్ధారించగలిగాను. యజ్ఞం యొక్క ఇతర అంశాల విషయంలో కూడా ఇదే సూత్రం, ఇదే విధానం పని చేస్తుందని తెలుసుకున్నాను.

పైపైన చూస్తే యజ్ఞ ఫలాలు కూడా ఐహికమైన విషయాల లాగానే గోచరిస్తాయి - ఆవులు, అశ్వాలు, బంగారం, సంతానం, పురుషులు, భౌతిక బలం, యుద్ధంలో విజయం మొ॥ ఇక్కడే సమస్య మరింత జటిలం అవుతుంది. వేదంలో ఆవు చాలా విడ్డూరమైన జంతువని, అది ఈ లోకపు సామాన్య పశువు కాదని నేను ఏనాడో గమనించాను. 'గో' అనే పదానికి ఆవు అని, అలాగే కాంతి అని కూడా అర్థం వుంది. వేదంలో ఎన్నో చోట్ల ఆ శబ్దాన్ని వాడినప్పుడు ఆవు అనే ప్రతీకని ముందు ఉంచుతున్నా, నిజానికి కాంతి అనే అర్థంలోనే వాడడం జరిగింది. సూర్యుడి గోవులు అనే ప్రతీకలో ఈ విషయం మనకి స్పష్టంగా కనిపిస్తుంది. హోమర్ కవి వర్ణించిన 'అహర్పతి ఆలమందలు' (kine of Helios). అధ్యాత్మికంగా చూస్తే భౌతిక కాంతిని జ్ఞానానికి, ముఖ్యంగా దైవీ జ్ఞానానికి ప్రతీకగా వాడొచ్చు. కాని ఈ ప్రతిపాదనని పరీక్షించి, నిరూపించేదెలా? వేదంలో ఎన్నో చోట్ల నేపథ్యంలో భావన అంతా అధ్యాత్మికంగా ఉంటుంది – మధ్యలో ఈ ఆవు అనే పదం మాత్రం పొంతన లేకుండా పొడుచుకొచ్చినట్టు ఉంటుంది. ఇంద్రుణ్ణి సోమపానం చేయడం కోసం పరిపూర్ణ రూపాలని నిర్మించేవాడిగా ఉపాసించడం జరుగుతుంది; ఆ పానంతో పరవశించిన వేలుపు "గో ప్రదాత" అవుతాడు; అప్పుడు మనం ఆతని మహోన్నత చింతనలని చేరుకోగలుగుతాము. ఆతణ్ణి పరిప్రశ్నించి సత్యాన్ని తెలుసుకుంటాము, ఆతని నిర్మల వివేచన మనకు మహోన్నత శ్రేయస్సును ప్రసాదిస్తుంది. అలాంటి సందర్భంలో ఆ ఆవులు మామూలు భౌతిక పశువులు కాజాలవని, వాటిని భౌతిక కాంతిగా కూడా భావించలేమని అర్థమవుతుంది. ఒక తరుణంలో మాత్రం వైదిక గోవు యొక్క అధ్యాత్మిక అంతరార్థం నా మదిలో స్పష్టంగా మెదిలింది. అప్పుడా అర్థాన్ని వేదంలో ఆ పదం వచ్చిన ప్రతీ చోటా వర్తింపజేసి చూశాను. ప్రతీ సందర్భంలోను ఆ అర్థం సరిగ్గా, సజావుగా సరిపోతోందని గుర్తించాను.

ఆవు (గో) మరియు గుర్రం (అశ్వ) అనే పదాలు కూడా ఒకదాంతో ఒకటి ముడివడి ఉండడం కనిపిస్తుంది. ఉష (అంటే ఉదయం) 'గోమతి అశ్వవతి' అనే పదజాలంతో వర్ణించబడింది. యజ్ఞం చేసినవాడికి ఉష ఆవులని, అశ్వాలని ప్రసాదిస్తుంది. భౌతికమైన ఉషస్సుకి వర్తింపజేసినప్పుడు, గోమతి అనే పదానికి అర్థం 'కాంతికిరణ సంయుక్తమైన' అని చెప్పుకోవచ్చు. మానవ చేతనలో జరిగే ప్రకాశనానికి అది చక్కని చిత్తరువు. అలాగే అశ్వవతి అనే పదం కేవలం భౌతికమైన తురగాన్ని సూచించడం లేదు. దానికొక అధ్యాత్మిక ప్రాముఖ్యత కూడా ఉండాలి. వైదిక అశ్వంలోని అంతరార్థాన్ని శోధించిన మీదట నాకొక విషయం అర్థమయ్యింది. గో అనే శబ్దం తేజస్సుని లేదా చైతన్యాన్ని, అశ్వ అనే పదం శక్తిని లేదా బలాన్ని సూచిస్తున్నాయి. వైదిక, లేదా వేదాంతిక చింతన ప్రకారం ఈ పదాలు ఉనికిలోని అన్ని వ్యవహారాలకి చెందిన ద్విముఖాలని సూచిస్తాయి.

దీన్ని బట్టి ఒకటి స్పష్టం అవుతోంది. వైదిక యజ్ఞం యొక్క రెండు ఫలాలు, గోసంపద మరియు అశ్వసంపదలు, అసమాన మానస ప్రకాశనానికి, అతిశయ జీవన శక్తికి ప్రతీకలు. దీన్ని బట్టి ఆలోచిస్తే ఈ రెండు ప్రధాన ఫలాలతో పాటు, వైదిక కర్మకి ఫలితంగా దక్కే ఎన్నో ఇతర ఫలాలకి కూడా ఏదో అధ్యాత్మిక ప్రాముఖ్యత ఉంటుందనిపిస్తుంది. ఆ ప్రాముఖ్యత ఏమిటో ఇప్పుడు నిర్ణయించాల్సి వుంది.

వైదిక ప్రతీకాత్మకతలో మరో ముఖ్యమైన విషయం లోకాల పరంపర, దేవతల క్రియలు. *'వ్యాహృతులు'* అనే వైదిక భావనలో లోకాల ప్రతీకాత్మకతకి చెందిన రహస్యాన్ని మొదట గుర్తించాను. *"ఓం భూః భువః స్వః"* అనే మంత్రంలో ఆ మూడు వ్యాహృతులు పేర్కొనబడ్డాయి. నాల్గవ వ్యాహృతి అయిన 'మహస్' కి, ఋతం అనే అధ్యాత్మిక భావనకి మధ్య సంబంధాన్ని కూడా గుర్తించాను. ఋషులు మూడు విశ్వైక విభజనలని గుర్తిస్తారు – మొదటిది భూమి లేదా పృథ్వి, రెండవది అంతరిక్షం అని పిలువబడే మధ్యతలం, మూడవది ద్యౌః అని పిలువబడే స్వర్గం; ఇవి కాక ఇంకా విశాలమైన స్వర్గం కూడా వుంది. దీన్ని 'బృహద్ ద్యౌః' అంటారు. దీన్నే బృహద్ లోకం అని లేదా కేవలం బృహత్తు అని కూడా పిలుస్తారు. మరి

కొన్ని సందర్భాల్లో దీన్ని మహా జలం లేదా 'మహో అర్ణః' అని కూడా అంటారు. ఈ బృహత్తు నే కొన్ని సార్లు "ఋతం బృహత్" అని, లేదా "సత్యం ఋతం బృహత్" అనే పదత్రయంతోను కూడా సూచిస్తారు. మూడు లోకాలకి మూడు వ్యాహృతులతో ఎలాగైతే సంబంధం వుందో, బృహత్తుకి, సత్యానికి సంబంధించిన నాల్గవ లోకం ఉపనిషత్తులో చెప్పబడ్డ 'మహస్' అనబడే నాల్గవ వ్యాహృతికి చెందినది. ఇక పౌరాణిక పరిభాషలో ఈ నాలుగింటికి పరిపూరకంగా మరో మూడు వస్తాయి – 'జనః, తపః, సత్యం.' హైందవ విశ్వవిజ్ఞానంలో ఈ మూడు పదాలు మూడు పరంధామాలని సూచిస్తాయి. వేదంలో కూడా మూడు పరంధామాలు ఉన్నాయి కాని వాటి పేర్లు ఇవ్వబడలేదు. కాని వేదాంతిక, పౌరాణిక పరిభాషలో ఏడు ప్రపంచాలు, ఏడు అధ్యాత్మిక తత్వాలకి, లేదా ఏడు అస్తిత్వభేదాలకి సంబంధిచినవై ఉంటాయి. అవి – సత్, చిత్, ఆనంద, విజ్ఞాన, మనస్, ప్రాణ, అన్న. ఇప్పుడు విజ్ఞానం అనబడే కేంద్ర తత్వం, మహస్ అనబడే విశాల ప్రపంచం – ఇవి ఉనికి యొక్క సత్యాన్ని సూచించే వైదిక ఋతంతోను, బృహత్తు తోను సమానం. పౌరాణిక వ్యవస్థలో ఆరోహణా క్రమంలో మహస్ తరువాత జన అనబడే దివ్యానంద మయమైన ప్రపంచం వస్తుంది. వేదంలో కూడా ఋతం, అంటే సత్యం, మయస్ అనబడే ఆనందం దిశగా పైకి తీసుకుపోతుంది. కాబట్టి ఈ రెండు వ్యవస్థలు ఒక్కటేనని స్థిరంగా నమ్మొచ్చు. ఏడు ఆత్మగతమైన, చైతన్య పరమైన తత్వాలు, ఏడు వస్తుగతమైన ప్రపంచాలుగా రూపుదేలాయనే భావనకి ఈ రెండు వ్యవస్థలు అద్దం పడుతున్నాయి. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని వేదంలో చెప్పబడ్డ ప్రపంచాల పరంపరని, తత్సంబంధితమైన చేతనా తలాల పరంపరని అర్థం చేసుకోగలిగాను. ఆ విధంగా వైదిక వ్యవస్థ మొత్తం నా మనసులో తేటతెల్లమయ్యింది.

ఇన్ని విషయాలని ప్రథమంగా నిర్ధారించుకున్నాక ఇక తక్కిన సంగతులని సహజంగా, సులభంగా, నిర్ధారించుకోడానికి వీలయ్యింది. అసత్తు ఉన్నచోట సత్యాన్ని స్థాపించి, పరిమితమైన, విభాజితమైన అంతర్యంలో పూర్ణత్వాన్ని, అనంతతని సాధించి, ఆ విధంగా మానవాత్మను మర్త్యస్థితి నుండి అమరత్వ స్థితికి ఉద్ధరించడమే వేద ఋషుల ముఖ్యోద్దేశం అనే నేను ముందే గుర్తించాను. పదార్థంలో నాటుకున్న మనో ప్రాణాల మర్త్య స్థితే మృత్యువు. అనంతమైన సత్, చిత్, ఆనందాలతో కూడుకున్న స్థితే అమరత్వం. దివి – భువి, మనసు

– దేహం అనబడే ఆకాశాల జంట, అంటే రోదసిని, అధిగమించిన మానవుడు, సత్యం యొక్క అనంతతని అంటే మహస్ ని, అలాగే దివ్యానందాన్ని చేరుకుంటాడు. మన పూర్వజులైన ప్రాచీన ఋషులు కనుగొన్న "మహత్తర మార్గం (మహస్పథః)" ఇదే.

నేను అర్థం చేసుకున్న దాని బట్టి దేవతలు కాంతిజన్యులు, ఆదిత్యులు, అనంతాత్మజులు; వేదంలో దేవతల వర్ణన బట్టి చూస్తే వాళ్లు మనిషికి సమృద్ధిని కలుగజేస్తారు, తేజస్సును ప్రసాదిస్తారు, జలాల పూర్ణత్వాన్ని అతడిపై కురిపిస్తారు, అతడిలోని సత్యాన్ని బలపరుస్తారు, అతడి లోపల దివ్యప్రపంచాలని రూపుదిద్దుతారు, అవరోధాలెన్ని ఎదురైనా అతణ్ణి పరమావధి దిశగా, సంపూర్ణానందం దిశగా గైకొనిపోతారు. వారి వ్యవహారాల బట్టి, గుణవాచకాల బట్టి, వారిని వర్ణించే గాథల అంతరార్థాన్ని బట్టి, ఉపనిషత్తులలోను, పురాణాలలోను వారి గురించి ఇవ్వబడ్డ సూచనల బట్టి, అడపాదడపా గ్రీకు గాథల నుండి కూడా తెలుసుకోదగ్గ వివరాల బట్టి ఆ దేవతల ప్రత్యేక క్రియలేమిటో తెలుసుకోవచ్చు. ఇక వారిని వ్యతిరేకించే దుష్టశక్తులని తీసుకుంటే, వాళ్లు ఆచ్ఛాదకులు, వృకులు, భక్షకులు, నిర్బంధకులు, ద్వికారులు, అవరోధకులు. ఆ పేర్లు చాటుకున్నట్లే, దేవతల సంపూర్ణత్వానికి, స్వేచ్ఛకి ప్రతికూలంగా పని చేసే శక్తులివి. వృత్ర, పాణి, అత్రి, రాక్షస, సంబర, వల, నముచి మొదలైన ఈ శక్తులు, వక్రమైన చారిత్రక అవగాహన గల ఆధునిక చింతన ఊహించినట్టు, ద్రావిడ రాజులో, దేవతలో కారు. మన పూర్వీకుల అధ్యాత్మిక చింతనతో పొంతన గల భావాలకి వాళ్లు ప్రతిరూపాలు. ఉన్నతమైన శ్రేయస్సుకి, అధమమైన వాంఛకి మధ్య గల ఘర్షణకి వాళ్లు ప్రతినిధులు. ఋగ్వేదంలో వర్ణించబడ్డ ఈ మంచి చెడుల మధ్య కలహం గురించి, మరింత కటువైన నైతిక దృష్టితో మన పొరుగువారు, సన్నిహితులు అయిన జోరాష్ట్రియన్ ల ప్రాచీన కావ్యాలలో కూడా వర్ణించబడింది. ఈ జోరాష్ట్రియన్ ల తత్వం కూడా ప్రాచీన ఆర్య సాంప్రదాయంలో వేళ్లూని ఉండొచ్చు.

వేదంలో కనిపించే క్రమబద్ధమైన ప్రతీకాత్మకత, ఋషులకి దేవతలకి మధ్య వ్యవహారాలని వర్ణించే గాథలకి కూడా విస్తరించిన విషయం కూడా ఒక దశలో గుర్తించాను. కొన్ని గాథలకి నిశ్చయంగా ప్రకృతి నిబద్ధమైన, లేదా ఖగోళవైజ్ఞానికమైన ప్రాముఖ్యత ఉండి ఉండొచ్చు. అయినా కూడా వాటి మూల భావన స్థానంలో ఆధ్యాత్మిక అన్వయం ప్రతిక్షేపించబడడం కనిపిస్తుంది. ఒకసారి వైదిక ప్రతీకల అంతరార్థం తెలిసిందంటే, ఈ గాథల వెనుక ఉన్న అధ్యాత్మిక లక్ష్యం కూడా సులభంగా పట్టు చిక్కుతుంది. వేదంలో ప్రతీ భాగం తక్కిన అన్ని భాగాలతోను గాఢంగా అనుసంధానమై ఉంటుంది. కాబట్టి వేదాన్వయం విషయంలో మనం

ఒక ప్రత్యేక పద్ధతిని అవలంబించినప్పుడు, ఆ శోధనని దాని చిట్టచివరి అంచుల వరకు తీసుకుపోవాలి. వైదిక భావజాలం అంతా గొప్ప పటుత్వం గల చేతులు, కడు ఒడుపుగా నేసిన నేతలు. వాటి విశ్లేషణలో, అధ్యయనంలో ఏ మాత్రం పొరబాటు జరిగినా భావం అంతా రసాభాస అవుతుంది.

ఆ విధంగా నా మదిలో వేదం సహజంగా, స్వయంభువుగా ఆవిర్భవించింది. ఒక ప్రగాఢ అధ్యాత్మిక సాధనా మార్గం తెలిసిన ఒక అతి ప్రాచీన ఆత్మిక సాంప్రదాయంగా నాలో సాక్షాత్కరించింది. దాని చింతనలో గందరగోళం లేదు, దాని సారాంశంససేమిరా ఆదిమం కాదు. అలవిగాని ఆటవిక ఆచారాల కలగూరగంప అసలే కాదు. అదొక అఖండమైన కృతి. లక్ష్యంలో, సారంలో ఆత్మచేతనమైన పావన కావ్యం. అయితే పార్థివ దృష్టితో కూడిన ఒక మేలిమి తెర దాని అర్థాన్ని దాచుతుంది. ఆ తెర కొన్ని సార్లు దళసరిగా ఉంటుంది. కొన్ని చోట్ల పారదర్శకంగా ఉంటుంది. కాని వేదం దాని మహోన్నత అధ్యాత్మిక లక్ష్యం నుండి ఒక్క క్షణం కూడా దృష్టిని మరల్చదు.

అధ్యాయం 5

వేదంలో శబ్దశాస్త్ర విధానం

కుదురైన శబ్దశాస్త్రీయ పునాది మీద స్థాపించబడని వేదాన్వయంలో పటుత్వం ఉండదు. అంత సుదూరమైన గతానికి చెందిన భాషలో రాయబడ్డ ఆ మహాకావ్యం జటిలమైన శబ్దశాస్త్రీయ సవాళ్లనే విసురుతుంది. పాతకాలపు భారతీయ పండితులు చేసిన ఊహాగానాల మీద పూర్తిగా ఆధారపడడం నిశిత బుద్ధికి కొంచెం కష్టమే. ఆధునిక శబ్దశాస్త్రం మరింత కుదురైన, శాస్త్రీయమైన పునాది కోసం పాటుపడుతుంది అన్నమాట నిజమే. కాని దానికి అలాంటి పునాది ఇంకా పట్టుచిక్కలేదు.

అధ్యాత్మికంగా వేదాన్ని అన్వయించే ప్రయత్నంలో రెండు ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతాయి. వాటిని శబ్దశాస్త్ర విధానాలతోనే ఎదుర్కోవడానికి వీలవుతుంది. ఆ అన్వయం కోసం వేదంలో తారసిల్లే ఎన్నో పారిభాషిక పదాలకి క్రొంగొత్త అర్థాలని ఆవిష్కరించవలసి ఉంటుంది. ఊతి, అవస్, వయస్ వంటి పదాలు ఆ కోవకి చెందినవే. ఈ పదాలకి మనం ఆపాదించే అర్థాలన్నీ ఒక పరీక్షలో మాత్రం కచ్చితంగా నెగ్గుతాయి. ఈ పదాలు ప్రతీ సందర్భంలోను సరిగ్గా ఇముడుతూ, కోరుకున్న అర్థంతో సరిగ్గా సరిపోతూ, ఒకే పదానికి ఒక్కోచోట ఒక్కొక్క అర్థాన్ని ఇవ్వాల్సిన అగత్యం నుండి మనను కాపాడుతాయి. ఆద్యంతం స్థిరమైన శిల్పం గల వేదంలో పదాలు అలాంటి పరీక్షకి తట్టుకోవడంలో ఆశ్చర్యం లేదు. కాని అది మాత్రం సరిపోదు. ఈ కొత్త అర్థానికి శబ్దశాస్త్రపరమైన సమర్థింపు ఏమిటో తెలుసుకోవాలి. ఒకే పదం అనేక అర్థాలని ఎలా సంతరించుకోగలదో చెప్పగలగాలి. అధ్యాత్మిక అన్వయం సూచించే అర్థం ఒకటైతే, పాతకాలపు వయ్యాకరణులు, లేదా మరింత అర్వాచీనులైన సంస్కృత పండితులు, సూచించే అర్థం మరొకటి కావడం ఎలా

సాధ్యమవుతుందో చెప్పగలగాలి. ఇవన్నీ సాధ్యం కావాలంటే మన ప్రస్తుత పరిజ్ఞానపు పరిధిని దాటుకుని, శబ్దశాస్త్ర విధానాలని మరింత పటిష్ఠమైన శాస్త్రీయ పునాది మీద ఉంచాలి.

మరో విషయం ఏమిటంటే, వేదం యొక్క అధ్యాత్మిక అన్వయం కొన్ని ముఖ్యమైన పదాలకి ఇవ్వబడ్డ ద్వంద్వార్థాల మీద ఆధారపడి ఉంతుంది. సంస్కృత సాహిత్యంలో సాంప్రదాయబద్ధంగా వాడబడుతున్న ఒక ముఖ్యమైన అలంకారం ఇది. కాస్త అర్వాచీన సాహిత్యంలో దీన్ని అతిశయంగా ప్రయోగించారు. దీన్నే మనం శ్లేషాలంకారం అంటాము. శ్లేషని కృత్రిమంగా, అతిగా ప్రయోగించిన సందర్భాలని ఆధారంగా తీసుకుని, వేదంలో శ్లేష ప్రయోగం విరివిగా జరగడం వల్ల, ఆ సాహిత్యం కాస్త అర్వాచీనమైన, ఆధునికమైన సంస్కృతికి చెంది ఉండవచ్చని పొరబడే అవకాశం వుంది. కాని అతి ప్రాచీనమైన ఆ కృతిలో ఆ అలంకారాన్ని అంత విస్తృతంగా ప్రయోగించడంలోని ఉద్దేశం ఏమై ఉంటుంది? పైగా వేదంలో దాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రయోగించడం జరుగుతుంది. సంస్కృత మూల శబ్దాల్లో ఒక్కొక్క శబ్దానికి పలు అర్థాలు ఉంటాయి. మూలశబ్దాల ఈ "బహుళార్థకత"ని ఒడుపుగా వాడుకుంటూ, వేదంలో పదం పదంలోను వీలైనంత భావాన్ని గుప్పించే ప్రయత్నం జరిగింది. ఇలాంటి ప్రయోగం వల్ల వేదాన్వయంలో అసాధారణమైన సవాళ్లు ఎదురవుతాయి. ఉదాహరణకి అశ్వ అనే పదం సాధారణంగా గుర్రాన్ని సూచిస్తుంది. దాన్ని ప్రాణశక్తికి చిహ్నంగా వాడారు. మనసుకి, పదార్థానికి మధ్య లంకెగా పని చేస్తూ, సగం మానసికం, సగం పార్థివం అయిన చేతనకి, ప్రాణవాయువుకి చిహ్నంగా వాడారు. ఇదే మూలశబ్దాన్ని బలం, ప్రోద్బలం, ప్రీతి, ప్రాప్తి అనే అర్థాల్లో కూడా వాడొచ్చు. ప్రాణాశ్వం అనే ప్రతీకలో ఈ అర్థాలన్నీ ఏకమవుతూ ప్రాణశక్తి యొక్క ముఖ్యలక్షణాలకి అద్దం పడతాయి. ఆర్యులైన మన పూర్వజులు ఆధునిక భాషా సాంప్రదాయాన్నే అనుసరించి ఉంటే, ఆధునికులని పోలిన అభ్యుదయ దశలో ఉండి ఉంటే, వారు వాడిన భాష అలా ఉండేది కాదు. కాబట్టి ఆర్యులు వాడిన ఆ ప్రాచీన భాషలో ఏదో ప్రత్యేకత ఉందని అనుకోవలసి ఉంటుంది. వేద ఋషుల దృష్టిలో పదాలు కేవలం భావాలపై కప్పిన పెళుసైన ప్రతీకలు కావు. వారి దృష్టిలో పదాలు సజీవ శక్తులు. ఆధునిక భాషా శబ్దాలకి భిన్నంగా, ఆ పదాలు అనేకమైన భావభేదాలని

సులభంగా, స్వేచ్ఛగా ప్రతిబింబించగలవు. కాబట్టి ఋషుల దృష్టిలో వారు వాడిన శబ్దాలంకారాలు కృతకమైనవో, కృత్రిమమైనవో కావు. లోతైన అధ్యాత్మిక భావాలని వ్యక్తం చెయ్యడం కోసం ఎప్పటికప్పుడు కొత్త, అనువైన, కుదురైన పదాల కోసం గాలించే ఆ మహాకవులకి అవి సహజ, సమున్నత సాధనాలు. కుసంస్కారుల చేతికి చిక్కకుండా ఆ గుహ్యసూత్రాలని దాచి ఉంచగల తరుణోపాయాలు. వేదభాషలోని మూలరహస్యం ఇదేనని నా నమ్మకం. అలనాటి ఆర్యుల భాష, బయటికి స్పష్టమైన, కచ్చితమైన, భౌతిక అర్థం కలిగి, లోపల మాత్రం గుహ్యమైన, అధ్యాత్మికమైన అంతరార్థం కలిగిన ఒక ప్రత్యేకమైన దశలో ఉండేది. ఆ భాష యొక్క వికాస క్రమాన్ని శోధిస్తే ఈ సత్యం తేటతెల్లం అవుతుందని నా విశ్వాసం.

తమిళ పదాల విషయంలో నేను చేసిన మొట్టమొదటి అధ్యయనం నన్ను ప్రాచీన సంస్కృత భాష యొక్క మూలల దాకా తీసుకుపోయింది. ఆ అధ్యయనంలో పడి, ఆర్య, ద్రావిడ భాషా శబ్దాల మధ్య సంబంధాలు తెలుసుకోవాలని బయల్దేరిన నేను, ఆ లక్ష్యాన్ని తాత్కాలికంగా మరచిపోయి, అసలు మానవ భాషా వికాసాన్ని శాసించే నియమాలని శోధిస్తూ ముందుకు సాగాను. ఆ నియమాలే శబ్ద శాస్త్రం శోధించవలసిన మొట్టమొదటి లక్ష్యం కావాలని అప్పుడు అనిపించింది.

ఆధునిక శబ్దశాస్త్రం వేసిన మొదటి మెట్లలో కొన్ని తప్పటడుగులు పడినందున, ఆ శాస్త్రంలో సత్యం పాలు తక్కువ, కల్పన పాలు ఎక్కువ అనే అభియోగపు నీడలు పడ్డాయి. ఆ కారణం చేత విషయం అసలు శబ్ద శాస్త్రం అనేదే సాధ్యం కాదనే వరకు వెళ్లింది. ఆధునిక విజ్ఞానం స్థిరంగా స్థాపించిన విషయం అంటూ ఏదైనా ఉంటే అది భూమి మీద ప్రతీ విషయాన్ని కొన్ని ప్రకృతి ధర్మాలు శాసిస్తాయనే సత్యం, ఒక పరిణామ ప్రక్రియ రూపుదిద్దుతుందనే సత్యం. వాక్కు యొక్క అధ్యాత్మిక మూలాలు ఎలాంటివైనా గాని, మానవ భాషగా దాని బాహ్యమైన వ్యక్తీకరణ బట్టి చూసే అది కూడా పరిణామ ప్రక్రియ చేత రూపుదిద్దబడ్డ ఒక జీవం అని గుర్తించాలి. అయితే భాషలో ఎప్పుడూ ఒక మానసిక అంశం కలిసి ఉంటుంది కనుక, పూర్తిగా భౌతికమైన వస్తువుల కన్నా అది మరింత నమ్యంగా, స్వేచ్ఛగా, నిరంతరం పరిస్థితులకి అనుగుణంగా దానినదే సవరించుకుంటూ ఉంటుంది. అయితే మానసిక ప్రక్రియలలో కూడా, వాటిలో కొంత చంచలత, వైవిధ్యం కనిపించినప్పటికీ, వాటిని కూడా కొన్ని మనోధర్మాలు

పాలిస్తూ ఉంటాయి. కాబట్టి భాషా వికాసాన్ని కూడా కొన్ని ధర్మాలు శాసిస్తుంటాయి. తగినంత సమాచారం చేతికి చిక్కితే, మూలరహస్యం అంతుచిక్కితే, ఆ ధర్మాలని సులభంగా కనుక్కోగలము. సంస్కృత భాషలో ఆ మూలరహస్యం ఉందనిపిస్తుంది. ఆ భాషా చరిత్రలో తగినంత సమాచారం మన శోధన కోసం వేచి వుందనిపిస్తుంది.

శబ్ద శాస్త్రం చేసిన మొట్టమొదటి పొరబాటు భాష యొక్క బాహ్యమైన అంశాలకే పరిమితం కావడం. సన్నిహిత భాషలలో భాషా ధ్వనుల మధ్య, వ్యాకరణ విశేషాల మధ్య సంబంధాలు పట్టుకోవడం మీదనే దాని ధ్యాస ఉంటుంది. కాని నిజమైన విజ్ఞానం ఎప్పుడూ విషయం యొక్క మూలాల వద్ద, దాని జన్యస్థానం వద్ద శోధిస్తుంది. పరిశీలన పైపైన ఉంటే పైపై ఫలితాలే వస్తాయి. పైపొరలని ఛేదించి లోతుగా శోధించినప్పుడే అసలు సత్యం అర్థమవుతుంది. భాష లోతుల్లో పని చేసే మూలప్రక్రియలని అర్థం చేసుకుంటేనే దాని వర్తమాన స్వరూపం తెలుస్తుంది. ఎన్నో సాధ్యమైన భాషారూపాలలో మనకి ప్రస్తుతం తెలిసినవి కాసిన్ని మాత్రమే నని అర్థమవుతుంది. ఆ కారణం చేత మానవ భాష యొక్క ప్రాచీన రూపాలని అర్థం చేసుకున్నప్పుడే ఆసలైన శబ్దవిజ్ఞానాన్ని ఆవిష్కరించ గలుగుతాము.

పైన సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ నేను చేసిన పరిశోధనల వివరాలు అన్నిటినీ ఒక చిన్న అధ్యాయంలో కుదించడానికి వీలుపడదు. వైదిక అన్వయానికి సంబంధించిన ఒకటి రెండు అంశాలని మాత్రం ఇక్కడ క్లుప్తంగా చర్చిస్తాను. అసలు ఆ కాసిన్ని విషయాలని కూడా ఇక్కడ ఏకరువు పెట్టడానికి కారణం చెప్తాను. పాఠకుల మనసులో నేను ప్రతిపాదించే సిద్ధాంతం పట్ల కొన్ని అపోహలు ఉండొచ్చు. వైదిక పదాలకి సాంప్రదాయకంగా ఇవ్వబడ్డ అర్థాల నుండి పైదొలగుతూ నేను చేసిన ప్రతిపాదనలన్నీ కేవలం విశృంఖల ఊహాగానాలని, అభూతకల్పనలని వారు సందేహించవచ్చు. అలాంటి అభూతకల్పనలే అసలు ఆధునిక శబ్దవిజ్ఞానంలో బలహీనతలుగా దాపురించాయి. కాని నేను చేయబోయే ప్రతిపాదనలకి మూలాలు పైన చెప్పిన పరిశోధనలో ఉన్నాయని పాఠకులకి బోధపరచడం కోసం కొన్ని సంగతులు ఇక్కడ విన్నవిస్తున్నాను.

పదాలు కృత్రిమమైన వస్తువులు కావని, మొక్కలలా, జంతువులలా వాటికీ వృద్ధి, వికాసం ఉంటుందని నా పరిశోధనల వలన తెలిసింది. కొన్ని బీజశబ్దాల నుండి వికాసం చెందిన శబ్దాలే పదాలు. ఆ బీజ శబ్దాల నుండి కొన్ని మూలశబ్దాలు ఏర్పడ్డాయి. వాటి నుండి సువిస్తారమైన శబ్దసంతతి పెల్లుబికింది. పలు తరాలుగా ఆ శబ్దసంతతి సామాన్య భావచరిత్ర గల తెగలుగా, కూటములుగా, కుటుంబాలుగా వెల్లివిరిసింది. ఆదిమానవుడి యొక్క నాడీజన్య మనస్సు కొన్ని ఐంద్రియ విలువలకి, కొన్ని వాక్ శబ్దాలకి మధ్య అనుసంధానాలని కల్పించింది. అలాంటి అనుసంధానం లోంచి భాష ఉద్భవించింది. అలా అనుసంధానం చేసే ప్రక్రియ కూడా కృత్రిమమైనది కాదు. అదొక సహజ ప్రక్రియ. కొన్ని సరళ, అధ్యాత్మిక సూత్రాలు ఆ ప్రక్రియని శాసిస్తాయి.

ఆదిలో భాషా శబ్దాలు భావాలని వ్యక్తం చేయడం కోసం వాడేవారు కారు. కొన్ని సామాన్యమైన సంవేదనలకి, భావావేశాలకి తుల్యమైన వాగ్ధ్వనులవి. భాష నాడులలో పుట్టింది, మేధలో కాదు. ఈ సత్యాన్ని వైదిక ప్రతీకలతో చెప్పాలంటే, మానవ భాషని మొదట తీర్చిదిద్దింది ఇంద్రుడు కాదు, అగ్ని, వరుణులు. ప్రాణిక వ్యవహారాలలోంచి మనస్సు ఉద్భవించింది. ఐంద్రియ సంవేదనలతో, ఐంద్రియ ప్రతిచర్యలతో కూడుకున్న పునాది మీద మనిషి బుద్ధి నిలబడింది. ప్రాణిక స్ఫోటాలుగా జనించి, అవిస్పష్టమైన ఐంద్రియ భావాలుగా ఏర్పడ్డ పదాలు, కచ్చితమైన ప్రతీకలుగాను, నిశితమైన మేధోజన్య అర్థాలుగాను వికాసం చెందాయి.

ఆదిలో పదం అనేది ఒక ప్రత్యేకమైన భావనతో ముడిపడి ఉండేది కాదు. దానికి కేవలం ఒక సామాన్య లక్షణం లేదా గుణం ఉండేది. దాన్ని అనేక ప్రయోజనాల కోసం, పలు అర్థాలలో ప్రయోగించడానికి వీలయ్యేది. ప్రతీ పదం దాని గుణాన్ని, తత్ఫలితాలని మరెన్నో సన్నిహిత పదాలతో పంచుకునేది. ఆ విధంగా కొన్ని శబ్ద జాతులు, శబ్ద కుటుంబాలు ఊపిరి పోసుకున్నాయి. ఆ పదాల మధ్య ఒక విధమైన సాంఘిక జీవనం ఏర్పడింది. ఆ కూటమిలో కొంత సామాన్యమైన భావజాలం చలామణిలో ఉండేది. ఆ కూటమిలో పదాల ప్రత్యేకత ఏదో ప్రత్యేక అర్థాన్ని వ్యక్తం చెయ్యడంలో లేదు. కొన్ని కేంద్ర భావాలని అనేక విధాలుగా వ్యక్తం చెయ్యగలగడంలోనే ఆ పదం యొక్క ప్రత్యేకత వుంది. భాషాచరిత్ర యొక్క తొలి దశలలో పదాల యొక్క ఈ సాంఘిక జీవన వ్యవస్థ కాస్తా వ్యక్తిగత లక్షణాలు గల పదాల వ్యవస్థగా

పరిణామం చెందింది. మొదట్లో ఈ సాంఘిక విభజనలో ఎంతో వెసులుబాటు ఉండేది. కాని క్రమంగా విభజన కఠోరంగా, కఠినంగా మారింది. క్రమేపీ పద కుటుంబాలు, ఆ తరువాత ప్రత్యేక పదాలు వాటి ప్రత్యేక అస్తిత్వాన్ని సంతరించుకున్నాయి. ఇక భాష యొక్క సహజ వికాసపు చివరి దశల్లో, శబ్దం భావానికి నిబద్ధం అయిపోయింది. దీనంతటి తాత్పర్యం ఏమిటంటే భాష యొక్క తొలి దశల్లో శబ్దం భావం కన్నా మిన్న స్థాయిలో ఉండేది; శబ్దం భావాన్ని శాసించేది. కాని కాలాంతరంలో వాటి స్థానాలు తారుమారు అయ్యాయి. భావం అతిముఖ్యం అయ్యింది, శబ్దం అప్రధానం అయిపోయింది.

భాషాచరిత్ర యొక్క తొలిదశలలో కనిపించే మరో లక్షణం కూడా వుంది. ఆ దశలో భాష తక్కువ సంఖ్యలో కొన్ని ముఖ్యమైన సర్వసామాన్యమైన, సార్వత్రికమైన భావాలని మాత్రమే వ్యక్తం చేస్తుంది. ఉదాహరణకి తేజం, చలనం, స్పర్శ, పదార్థం, వ్యాప్తి, బలం, వేగం మొదలైనవి. క్రమేపీ భావం యొక్క పదునులో, వైవిధ్యంలో వృద్ధి జరుగుతూ వచ్చింది. సామాన్యం నుండి ప్రత్యేకానికి, అస్పష్టం నుండి నిర్దిష్టానికి, భౌతికం నుండి మానసికానికి, మూర్తి నుండి అమూర్తానికి – ఈ ధోరణిలో వికాసం జరిగింది. సజాతీయ విషయాల వల్ల కలిగే గొప్ప వైవిధ్యం గల సంవేదనలని వ్యక్తం చేసే వైఖరి నుండి, సజాతీయమైన విషయాల, అనుభూతుల, కర్మల మధ్య తేడాని నిశితంగా వ్యక్తం చేసే దిశగా భాష వృద్ధి చెందింది. భావాలు మారనివే అయినా వాటి మధ్య అనేకవిధమైన అనుసంధానం జరుగుతూ ఉండడం చేత భాషా వికాసం జరిగింది. ఆ భాషని వాడే మనుషులు, వాళ్ల అనుభవాలు, వాళ్లు జీవించిన పరిస్థితులు, పర్యావరణాలు ఆ భాషా వికాసానికి ఒక క్రమాన్ని, ఒక స్థిరత్వాన్ని ఆపాదించాయి. అందువల్ల ఆ వికాసం కొన్ని నియత ధర్మాల అనుసారం జరుగుతున్నట్టు కనిపిస్తుంది. పర్యావరణపు వత్తిళ్లకి ప్రకృతి స్పందించినప్పుడు ఆ స్పందనలో ఒక క్రమం కనిపిస్తుంది. కాలానుగతంగా ఆ స్పందన ఒక అలవాటుగా స్థిరపడినప్పుడు అదే ప్రకృతి ధర్మంలా కనిపిస్తుంది. మరి ప్రకృతి ధర్మం అంటే అది గాక మరేమిటి?

భాషావికాసం లోని క్రమం ఆధారంగా వేదాన్వయం పట్ల కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. అసలు ముందుగా సంస్కృత భాషలో వాక్కుకి, అర్థానికి మధ్య సంబంధాన్ని శాసించే ధర్మాలని అర్థం చేసుకుంటే, ఆ భాషలోని శబ్దకుటుంబాలని సూక్ష్మంగా పరిశీలిస్తే, వ్యక్తిగత పదాల యొక్క గత చరిత్రని చాలా వరకు నిర్ణయించవచ్చు. భాషా చరిత్ర యొక్క వివిధ దశలని తీసుకుంటే, ప్రత్యేక పదాలు ఏఏ దశలలో ఎలాంటి అర్థాలని తీసుకున్నాయో, తేల్చి చెప్పొచ్చు. కొన్ని సార్లు ఒకే పదానికి పూర్తిగా పరస్పర వ్యతిరేకమైన భావాలని ఆపాదించడం ఎందుకు జరుగుతుందో కూడా తెలుసుకోవచ్చు. ప్రాచీన ఆర్యభాషల వికాసాన్ని శాసించే భాషానుసంధాన ధర్మాలని ప్రయోగిస్తూ, పదాల యొక్క విస్మృత అర్థాలని మళ్లీ ఆవిష్కరించవచ్చు. ఆ విధంగా పదాల అర్థాన్ని తెలుసుకునే ప్రయత్నంలో పూర్తి ఊహాగానానికి తావివ్వక, ఒక స్థిరమైన పునాది మీద నిలబడి వైదిక భాష యొక్క అన్వయాన్ని కొనసాగించవచ్చు.

అయితే ఒకటి. ఒక వేద శబ్దానికి గతంలో ఒక ప్రత్యేక అర్థం ఉండేది కనుక, వేద పాఠంలో ఆ పదానికి ఆ అర్థాన్ని నిస్సంకోచంగా వర్తింపజేయవచ్చు నన్న నియమం ఏమీ లేదు. అయితే వేదంలో ఆ సందర్భంలో ఆ పదం ఫలానా అర్థాన్ని స్వీకరించే అవకాశం ఎక్కువ అని మాత్రం చెప్పగలం. ఇక ఆ పదం వేదంలో వివిధ భాగాల్లో కనిపించినప్పుడు ఆయా సందర్భాలని తులనాత్మకంగా పరిశీలించి ఆ పదానికి సముచితమైన అర్థమేమిటో నిర్ణయించాలి. ఆ విధంగా నిర్ణయింపబడ్డ అర్థం ఆ పదం వచ్చిన సందర్భాన్ని చక్కగా వివరించగలుగుతుందని నా అనుభవంలో మళ్లీ మళ్లీ గమనించాను. అంతేకాక సందర్భోచితంగా నిర్ణయించబడ్డ అర్థం, భాషా చరిత్ర యొక్క పరిశోధన వల్ల తెలిసిన అర్థం రెండూ ఒక్కటి కావడం కూడా పదే పదే కనిపిస్తుంది. దీని వల్ల వేదాన్వయంలో సంపూర్ణమైన నిశ్చయత్వం కాకపోయినా, ఒక నైతికమైన నిశ్చయత్వం ఏర్పడుతోందని చెప్పగలము.

మరో విషయం ఏమిటంటే అంకుర దశలో ఉన్న మానవ భాషల ముఖ్యమైన లక్షణం ఒకటుంది. ఒకే పదానికి ఎనలేని సంఖ్యలో అర్థాలు ఉండడం కనిపిస్తుంది. అలాగే ఒకే భావాన్ని వ్యక్తం చెయ్యడానికి ఎన్నో పదాలు ఉంటాయి. క్రమేపీ ఏపుగా పెరిగిన పదాల పంట

కొంత కోతకి గురయ్యింది. నిరిష్టత కోసం, పొందిక కోసం ప్రాకులాడే బుద్ధి యొక్క జోక్యం పెరిగింది. పదాల యొక్క అర్థాన్ని ధరించే సత్తా క్రమంగా అణగారింది. పద ప్రయోగంలో తగు వైవిధ్యం ఉండాలని ఒక పక్క ఒప్పుకుంటూనే, మరో పక్క పదాలలో వలసినంత పొందిక ఉండాలనే నియమం ప్రప్రథమ భాషా నియమం అయిపోయింది. కాని సంస్కృత భాష ఈ చిట్టచివరి వికాస దశలని అసలు చేరుకోనేలేదు; అంతకు ముందే పలు ప్రాకృత మాండలికాలలో విలీనమైపోయింది. అయితే దాని ఆధునిక రూపాలలో కూడా ఆ భాషలో పర్యాయపదాల ఐశ్వర్యం స్పష్టంగా కనిపిస్తుంది. నానా అలంకారసంయుక్తమైన పద ప్రయోగం ఆ భాషలో సాధ్యమైనట్టు అన్యభాషల్లో జరగడం బహు కష్టం. ముఖ్యంగా ద్వంద్వార్థాల ప్రయోగం అంటే శ్లేషాలంకారంలో సంస్కృతానికి సాటిలేదు.

సంస్కృత భాషా వికాసంలో వైదిక సంస్కృతం ఇంకా ముందటి దశ అవుతుంది. దాని బాహ్యా లక్షణాలలో కూడా అది తక్కిన ప్రాచీన భాషలు అన్నిటి కన్నా తక్కువ స్థిరత్వాన్ని కలిగి వుంటుంది. అనేక విధాలైన ఆకృతులతో, అలంకారాలతో, విభక్తులతో విలసిల్లుతూ ఉంటుంది. కాలరూపాల, కారకాల ప్రయోగంలో గొప్ప సూక్ష్మతని, నమ్యతని ప్రదర్శిస్తుంది. ఇక భాష యొక్క అధ్యాత్మిక ముఖాన్ని తీసుకుంటే అప్పటికి ఇంకా పూర్తిగా సుస్థిర రూపాన్ని దాల్చలేదు, బుద్ధి ప్రభావం వల్ల వచ్చే కఠిన, కఠోర రూపాలని దాల్చలేదు. వైదిక ఋషుల దృష్టిలో శబ్దం అనేది ఒక సజీవ శక్తి, ఒక సృజనాత్మక, కాల్పనిక శక్తి. భాషా శబ్దం అనేది కేవలం భావాన్ని సూచించే ప్రతీక కాదు. అసలు అదే భావానికి జన్య స్థానం. ఆ శబ్దం లోనే దాని మూలాల స్మృతి దాగి వుంది. దాని గతాన్ని గురించిన స్పృహ మిగిలి వుంది.

శబ్దం యొక్క ఈ ప్రాచీన జ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని ఋషులు తమ భాషని వాడారు. ఇంగ్లీష్ లో (తెలుగులో) మనం “ wolf (తోడేలు)” అని గాని, “cow (ఆవు)” అని గాని పదాన్ని వాడినప్పుడు మనం ఆ పదాలు సూచించే జంతువుల గురించి ప్రస్తావిస్తున్నాం. కాని ఆ జంతువుని సూచించడానికి ఆ ప్రత్యేకమైన శబ్దాన్ని ఎందుకు వాడుతామో మనకి తెలియదు. ఆ జంతువుకి ఆ పదం వాడడం ఆ భాషలో ఒక ఆనవాయితీ కనుక వాడుతాం.

కాని వేద ఋషుల దృష్టిలో "వృకం" అంటే చించేది, ఛిన్నం చేసేది. కాబట్టి అది తోడేలుని సూచిస్తుంది. అలాగే "ధేను" అనే శబ్దానికి అర్థం వృద్ధి కలిగించేది, పోషించేది. కనుకనే అది ఆవుని సూచిస్తుంది. కాని ఇక్కడ మౌలికమైన, సామాన్యమైన అర్థానిదే పై చేయి అవుతుంది. ప్రత్యేకమైన అర్థం ద్వితీయ స్థానంలో ఉంటుంది. ఆ కారణం చేతనే ఋషులు ఈ సామాన్య పదాలని గొప్ప ఒడుపుతో, వెసులుబాటుతో ప్రయోగించగలిగారు. కొన్ని సందర్భాల్లో తోడేలు యొక్క, ఆవు యొక్క ప్రతీకని ప్రధానంగా ముందు ఉంచుతూ, కొన్ని చోట్ల మరింత సార్వత్రికమైన భావానికి కేవలం ఊతంగా వాడుతూ, కొన్ని చోట్ల ఒక అధ్యాత్మిక భావనకి కేవలం మాతృకగా వాడుతూ, కొన్ని చోట్ల ఆ ప్రతీకని పూర్తిగా పక్కన పెడుతూ వాళ్లు ముందుకు సాగారు. ఈ రకమైన ప్రాచీన భాషా విజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని ఋషులు వాడిన వైదిక చిహ్నావళిని అర్థం చేసుకోవాలి. మరింత స్థూలమైన, నిర్దిష్టమైన పదాల ప్రయోగంలో కూడా అలాంటి విధానమే కనిపిస్తుంది. ఉదాహరణకి "ఘృతం" (నేయి), "సోమం" (పవిత్ర మధుపానం), వంటి పదాలలో కూడా అలాంటి భావమే గోచరిస్తుంది.

అంతేకాక ఒకే పదానికి పలు అర్థాలు ఉన్నప్పుడు, ఆధునిక భాషల్లో జరిగినట్టు కాకుండా, వెనకటి రోజుల్లో ఆ వివిధ అర్థాల మధ్య విభజన అంత తీవ్రంగా ఉండేది కాదు. ఉదాహరణకి "ఇంగ్లీష్" లో fleet అనే పదానికి నౌకాసముదాయం అనే అర్థం వుంది. అలాగే వేగం అనే అర్థం కూడా వుంది. మనం fleet అనే పదాన్ని మొదటి అర్థంలో వాడినప్పుడు, మనం నౌకల వేగం గురించి ఆలోచించము. అలాగే రెండవ అర్థంలో వాడినప్పుడు అలలపై వేగంగా పయనిస్తున్న ఓడలని ఊహించుకోము. కాని వైదిక భాషా ప్రయోగంలో సరిగ్గా ఇదే జరుగుతుంది. అలాగే "భగ" అనే పదానికి ప్రీతి అని, పంచుకోవడం అని అర్థాలు ఉన్నాయి. వైదిక మనస్తత్వానికి ఈ రెండు వేరు వేరు పదాలు కావు. ఒకే పదం రెండు విభిన్న ప్రయోజనాలకి నోచుకుంది. కాబట్టి ఋషులు ఆ పదాన్ని వాడినప్పుడు బాహాటంగా ఒక అర్థాన్ని ఉద్దేశిస్తూ, నేపథ్యంలో మరో అర్థాన్ని మనసులో పెట్టుకుంటూ ఆ పదాన్ని సులభంగా ప్రయోగించగలిగేవారు. కొన్ని సార్లు రెండు అర్థాలని ఏకకాలంలో పరస్పర సమర్థన కలిగేలా ప్రయోగించేవారు. ఉదాహరణకి "చనస్" అనే పదానికి "ఆనందం, ప్రీతి" అనే అర్థాలు వున్నాయి. కాబట్టి స్థూల దృష్టికి ఆ పదం దేవతలకి సమర్పించబడ్డ ఆహారం

అనే అర్థం స్ఫురించేలా ఋషులు దాన్ని వాడేవారు. కాని లోదృష్టి గల వారికి ఆ పదం ఆనందం అనే అర్థంలోను, దివ్యమైన ఆనందం భౌతిక చేతనలోకి ప్రవేశించినప్పుడు కలిగే ఆహ్లాదం అనే అర్థంలోను స్ఫురిస్తుంది. ఆ కారణం చేతనే సోమపానం దేవతల ఆహారం గాను, ఆనందానికి వైదిక ప్రతీక గాను అర్థమవుతుంది.

ఈ రకమైన భాషా ప్రయోగం వేద ఋక్కులలో ప్రతీ చోట మనకి దర్శనమిస్తుంది. ఇలాంటి అద్భుత భాషా సాధనాన్ని వాడుకుంటూ ఆ ప్రాచీన ద్రష్టలు తమ మహత్కార్యంలో ఎదురైన సవాలుని సులభంగా అధిగమించగలిగారు. సాధారణ ఉపాసకుడికి అగ్ని అంటే వైదిక హోమాగ్నికి చెందిన దేవత కావచ్చు, లేదా భౌతిక ప్రకృతిలో కనిపించే తేజం, తాపం అనే తత్వాలు కావచ్చు. ఇంకా అజ్ఞాన దశలో ఉన్న వారికి ఆ పదం కోర్కెలు తీర్చి, "సకలైశ్వర్యాలని ప్రసాదించే" ఒక అతిమానవ జీవిని సూచించవచ్చు. కాని మరింత లోతైన అవగాహన గల వారికి ఆ దేవత యొక్క ప్రగాఢమైన అధ్యాత్మిక క్రియల గురించి తెలిపేదెలా? సమాధానం ఆ పదంలోనే వుంది. ఎందుకంటే అగ్ని అంటే బలవంతమైనది, తేజోవంతమైనది, శక్తివంతమైనది, విరాజమానమైనది. కాబట్టి అంతరదృష్టి గల వారికి ఆ పదం లోకాలని నిర్మించే విరాజమాన శక్తిని, మనిషిని అత్యున్నత స్థానానికి ఉద్ధరించే శక్తిని, ఒక బృహత్కార్యానికి కర్తని, మానవ యజ్ఞానికి పురోహితుణ్ణి తలపిస్తుంది.

కాబట్టి ఈ వివిధ దేవతా మూర్తుల రూపాలన్నీ ఒకే విశ్వదేవుడి విభిన్న రూపాలేనని ఎలా గుర్తుంచుకోవాలి? దేవతల పేర్లని గమనిస్తే అవి నిజానికి వట్టి నామధేయాలు కావని, విశేషణాలని, వర్ణనలని సులభంగా గ్రహించవచ్చు. పరమాత్మ యొక్క ప్రేమ, సామరస్యాల ముఖమే మిత్రుడు. ఆనందానికి పతి భగుడు, తేజానికి స్వామి సూర్యుడు. సమస్త విశ్వానికి ఆధారంగా నిలిచి దాన్ని తీర్చి దిద్దే దివ్యమైన విశాలత్వం, విమలత్వం – అదే వరుణుడు. "ఉన్నది ఒక్కటే," నంటాడు దీర్ఘతముడు. "దానిసే విప్రులు అనేక విధాలుగా కొలుచుకుంటారు. ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని అంటారు; లేదా అగ్ని, యముడు, మాతరిశ్వుడు అంటారు." తొలి రోజుల్లో వేదాధ్యయనం చేసేవారికి ఈ సత్యాన్ని ఇలా

విడమర్చి చెప్పవలసిన అవసరం ఉండేది కాదు. దేవతల పేర్లలోనే వారి ప్రాముఖ్యత తేటతెల్లం అయ్యేది. ఈ మహత్తర మౌలిక సత్యం అధ్యాయుల స్మృతి ఫలకం మీద స్థిరంగా కలకాలం నిలిచేది.

కాని తదుపరి యుగాల్లో ఋషులు వాడిన ఈ భాషా సాధనం జ్ఞాన సంరక్షణకి అవరోధంగా నిలిచింది. భాషా లక్షణం క్రమంగా మారింది. భాష దాని తొలి నమ్యతని కోల్పోయింది. వెనకటి అంతర్భావం క్రమంగా ఆవిరైపోయింది. శబ్దం కుంచించుకుపోయి దాని కఠిన బాహ్యార్థానికే పరిమితం అయిపోయింది. ఆనందానికి చిహ్నమైన సోమపానం కేవలం ఒక భౌతిక పానీయం స్థాయికి దిగి వచ్చింది; హోమంలో పోసే నేయి కేవలం పౌరాణిక దేవతలకి సమర్పించబడ్డ స్థూల నైవేద్యం అయ్యింది; ఇక అగ్గికి, మబ్బుకి, మెరుపుకి చెందిన సాములందరూ, కేవలం స్థూలశక్తి, పైపై నిగారింపు తప్ప మరేమీ లేని వేల్పులుగా మిగిలారు. అక్షరం మిగిలిందే గాని, ఆత్మ అణగారిపోయింది. ప్రతీక, బాహ్య రూపం మిగిలినా, అందులోని ఆత్మ ఆ పైతొడుగులని వీడి ఎటో వెళ్లిపోయింది.

అధ్యాయం 6

అగ్ని – సత్యం

ఋగ్వేదంలోని వివిధ భాగాలన్నిటిలోను ఒక ఏకత్వం ద్యోతకం అవుతూ ఉంటుంది. దాని పది మండలాలలోను దేన్ని తీసుకున్నా ఒకే సారం, ఒకే భావజాలం, ఒకే చిత్రజాలం, ఒకే పదజాలం సాక్షాత్కరిస్తాయి. లక్షణంలో, వ్యక్తిత్వంలో వాటి మధ్య కొన్ని భేదాలు లేకపోలేదు. కొన్నిట్లో వైదిక ప్రతీకావళిని మరింత నిండుగా, సూక్ష్మంగా, ప్రగాఢంగా వాడడం జరుగుతుంది. మరి కొన్నిట్లో వాటి వెనుక వున్న అధ్యాత్మిక అనుభవాన్ని, భావంలో సంక్లిష్టత లేకుండా, కవితాశిల్పంలో అతిశయమైన నగిషీ లేకుండా మరింత సూటిగా, సరళంగా వ్యక్తం చెయ్యడం జరుగుతుంది. కొన్ని సార్లు ఒకే ఋషి పాడిన గీతాలలో కూడా

కొన్నిట్లో శుద్ధ విమలత కనిపిస్తే, మరి కొన్నిట్లో ఎనలేని కవితాసంపద పొటమరిస్తుంది. కొన్ని సార్లు ఒకే ఋక్కులో కూడా హెచ్చుతగ్గులు కనిపిస్తాయి; యజ్ఞ సాంప్రదాయానికి చెందిన అతిసామాన్య ప్రతీకలతో మొదలుపెట్టి గొప్ప సంక్లిష్టత గల చింతనాగతిలో పరాకాష్టను చేరుకుంటాయి. కొన్ని సూక్తాలు తేటతెల్లంగా ఉంటాయి, భాషలో ఆధునికతకి దగ్గరగా వస్తాయి. మరి కొన్నిట్లో పాతకాలపు అస్పష్టత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వైఖరిలో, శిల్పంలో ఈ తేడాల మాట ఎలా వున్నా, అధ్యాత్మిక ఏకత్వంలో మాత్రం ఎక్కడా వన్నె పోదు. పరిభాషలో, సామాన్య సూత్రాలలో వైవిధ్యం ఎంత ఉన్నా, వాటి వల్ల భావం మాత్రం జటిలం కాదు. దీర్ఘతమ ఔచిత్యుడి ప్రగాఢ, చిరంతన శిల్పంలో నైతేనేమి, మేధాతిథి కణ్వుడి సుశ్రావ్య మధుర గీతికలలో నైతేనేమి, విశ్వామిత్రుడి ప్రబల గంభీర ఋక్కులలో నైతేనేమి, వశిష్ఠుడి విశాల సామరస్యాలలో నైతేనేమి, అన్నిట్లోను ఏకరీతిలో ఉపాసకుల పరమపవిత్ర సాంప్రదాయాన్ని కలకాలం నిలిపే బలమైన పునాది కనిపిస్తుంది.

వైదిక కృతుల యొక్క ఈ ప్రత్యేకతని ఆధారంగా చేసుకుని నేను సూచించిన అన్వయ పంథాకి నిదర్శనంగా వేదంలో ఎన్నో సందర్భాలని పేర్కొనవచ్చు. అందుకోసం పది మండలాలలోను చెదురు మొదురుగా కొన్ని సూక్తాలని తీసుకోవచ్చు, లేదా ఏకైక ఋషి చేత వ్రాయబడ్డ వేదభాగాన్ని అయినా తీసుకోవచ్చు. నేను ప్రతిపాదించే అన్వయంలోని సత్యాన్ని నిరూపించాలంటే అందుకు మరింత క్షుణ్ణమైన, కూలంకషమైన పరిశీలన కావాలి. మొత్తం పది మండలాలని నిశితంగా పరిశోధించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఉదాహరణకి 'ఋతం' అనే వైదిక శబ్దానికి నేనిచ్చే 'సత్యం' అనే అర్థాన్నే తీసుకుందాం. లేదా 'గోవు' అనే ప్రతీకకి నేనిచ్చే 'కాంతి' అనే అర్థాన్నే తీసుకుందాం. ఈ అన్వయం నిజమని నిరూపించాలంటే ఆ సత్యం అనే భావన గాని, గోవు అనే ప్రతీక గాని కనిపించిన ప్రతీ సందర్భాన్ని తీసుకుని నిశితంగా పరిశీలించాలి. అలాగే వేదంలో 'స్వర్గం' అనే అర్థం గల 'ద్యౌః' అనే శబ్దం విరాజమాన మానసానికి ప్రతీక. ఇందులో 'రోచన' అనబడే మూడు భూమికలు ఉంటాయి. ఆ విరాజమాన మానసానికి స్వామిగా ఇంద్రుడి కర్మలే వేదంలో అతడి పాత్రని వ్యక్తం చేస్తాయి. ఈ అన్వయాన్ని సమర్థించాలంటే ఇంద్రుడి ప్రస్తావన వచ్చిన శ్లోకాలన్నీ పరిశీలించాలి. వేదంలో లోకాల వ్యవస్థని కూడా అర్థం చేసుకోవాలి. అయితే ఇంద్రుణ్ణి అర్థం

చేసుకోవాలంటే ఇంద్రుడి ప్రస్తావన గురించి మాత్రమే చదివితే సరిపోదు. వేదంలో వివిధ భావాలన్నీ ఒకదాంతో ఒకటి గాఢంగా పెనవేసుకుని ఉంటాయి. కాబట్టి సత్యం అనే భావనతోను, మానవుడు మానసిక ప్రకాశనం ద్వారా ఆ సత్యాన్ని చేరుకునే ప్రయత్నంతోను సంబంధం వున్న ఇతర వైదిక దేవతల గురించి కూడా తెలుసుకోవాలి. ఆ ప్రయోజనం కోసం వైదిక సత్యం మీద, వైదిక దేవతల మీద, వైదిక ప్రతీకల మీద ప్రత్యేకమైన పరిశోధన సాగించాలని అనుకుంటున్నాను. కాని అలాంటి బృహద్ యత్నం ప్రస్తుత కృతి యొక్క పరిధిలోకి రాదు. ప్రస్తుత కృతిలో నేను కేవలం నేను అవలంబించిన విధానానికి కొన్ని నిదర్శనాలు ఇచ్చి, నా సిద్ధాంతాన్ని, దాని ఫలితాలని క్లుప్తంగా వర్ణించి దాంతో సరిపెట్టుకుంటాను.

నా విధానాన్ని ఉదహరించడం కోసం మొదటి మండలంలో మొదటి పదకొండు సూక్తాలని తీసుకుంటాను. వాటిలో నేను ప్రతిపాదిస్తున్న అధ్యాత్మిక అన్వయం ఎలా జనిపిస్తుందో నిరూపిస్తాను. ఆ అన్వయాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశీలించినప్పుడు ఆ శ్లోకాలే కాక, ఆ సందర్భంలో వచ్చే ఇరుగుపొరుగు వేద భాగాలలోనే కాక, మొత్తం ఋక్కులన్నీ ఓ కొత్త కోణంలో ఎలా కనిపిస్తాయో ప్రదర్శిస్తాను.

మనకి లభ్యమైన ఋగ్వేద సంహిత పది మండలాలుగా విభజించబడింది. వాటి కూర్పులో ఒక ద్వంద్వ విధానం అవలంబించబడింది. పది మండలాలలో ఆరు మండలాలు మాత్రం ప్రత్యేక ఋషులకో, లేక ఋషుల వంశీయులకో అంకితం గావించబడ్డాయి. రెండవ మండలం చాలా వరకు గృత్సమద ఋషి సూక్తాలకే కేటాయించబడింది. అలాగే మూడవది విశ్వామిత్రుడికి, ఏడవది వశిష్టుడికి కేటాయించబడ్డాయి. నాల్గవది వామదేవుడికి, ఆరవది భరద్వాజుడికి కేటాయించబడ్డాయి. ఐదవది అత్రి వంశజులకి కేటాయించబడింది. ఈ మండలాలు అన్నిట్లోను అగ్నికి సంబంధించిన సూక్తాలు మొదట వస్తాయి. ఆ తరువాతే ఇంద్రదేవుడికి సంబంధించిన సూక్తాలు వస్తాయి. బృహస్పతి, సూర్యుడు, రిభులు, ఉష తదితర దేవతల ఆవాహన మండలానికి అంతంలో వస్తుంది. తొమ్మిదవ మండలం మొత్తం ఒక్క సోమదేవుడికి మాత్రమే కేటాయించబడింది. ఒకటవ, ఎనిమిదవ, పదవ మండలాలలో అనేక ఋషుల సూక్తాలు కలగలిసి ఉంటాయి. కాని ఒక్కొక్క ఋషి యొక్క సూక్తాలు అవి వర్ణించే దేవతల క్రమంలో, అంటే మొదట అగ్ని, తరువాత ఇంద్రాది దేవతలు, ఈ విధంగా

అమర్చబడి ఉంటాయి. కాబట్టి మొదటి మండలం విశ్వామిత్రుడి తనయుడైన మధుచ్ఛందుడి పది సూక్తాలతో మొదలవుతుంది. పదకొండవ సూక్తాన్ని మధుచ్ఛందుడి కుమారుడైన జెట్రికి ఆపాదిస్తారు. తీరులో, తత్వంలో ఈ ఆఖరు సూక్తం మొదటి పది సూక్తాలతో ఒక్క పోలికలో ఉండడం చేత ఈ పదకొండింటిని ఒక సముదాయంగా పరిగణించవచ్చు.

వైదిక ఋక్కుల ఏర్పాటులో ఒక విధమైన ఆలోచనా క్రమం కూడా గోచరిస్తుంది. వేదంలో అంతర్లీనంగా ఉండే భావధార అంతా మొదటి మండలంలో తేటతెల్లం అవుతుంది. అత్యున్నత స్థాయికి చెందిన తాత్వికులుగా, కవులుగా పేరుమోసిన ఋషులు, ఎందరో మహానుభావులు, తొలి మండలంలోనే స్థాపించిన ప్రతీకల బాటల మీదుగా, తదుపరి మండలాలలోని చింతన తీరుగా ముందుకు సాగుతుంది. ఇక చివరిదైన పదవ మండలంలో ఇంకెందరో ఋషులు, కాస్తంత ఆధునికమైన భాషలో, వైదిక చింతనకి ఆఖరి మెరుగులు దిద్దుతారు. ఇక్కడే పురుషుడి అవతరణని వర్ణించే పురుష సూక్తం, సృష్టి కార్యాన్ని వర్ణించే శ్రీ సూక్తం మనకి లభ్యం అవుతాయి. ఇక్కడే వేదాంత తత్వానికి పునాది అయిన బ్రహ్మవాదానికి మూలాలు కనిపిస్తాయని ఆధునిక పండితులు అభిప్రాయపడతారు.

ఏదేమైనా ఋగ్వేదానికి నాంది పాడిన విశ్వామిత్రుడి పుత్ర, పౌత్రుల ఋక్కులు ఆ వేదగీతానికి తగ్గ ప్రథమ స్వరాలని పలికించాయి. మొదటి సూక్తం అగ్నిని స్తుతిస్తూ, ఆ విధంగా సత్యం అనేది మొత్తం వేదానికే కేంద్రీయమైన భావన అని తెలియజేస్తుంది. రెండవ, మూడవ సూక్తాలు కూడా ఆ భావననే సమర్థిస్తాయి. ఇక తక్కిన ఎనిమిది సూక్తాలలో ఇంద్రుడే ప్రధాన వేలుపుగా వెలుగొందుతాడు. ఒక్క సూక్తంలో మాత్రం మరుత్తులతో పాటు ఆ స్థానాన్ని పంచుకుంటాడు. ఆ సూక్తంలోనే 'సోమ', 'గోవు' అనే ప్రతీకలు మనకి కనిపిస్తాయి. విరోధశక్తి అయిన వృత్రుడి వృత్తాంతం, మానవ పురోగతికి అవరోధాలని తొలగిస్తూ, మనిషిని చీకటి నుండి వెలుగులోకి తీసుకుపోయే ఇంద్రుడి పాత్రని కూడా ఆ సూక్తం వర్ణిస్తుంది. కాబట్టి వేదం యొక్క అధ్యాత్మిక అన్వయాన్ని సాధించే ప్రయత్నంలో ఈ సూక్తాలు అత్యంత విలువైనవి.

ఐదవ స్థానం నుండి ఎనిమిదవ స్థానం వరకు అగ్నిసూక్తంలో నాలుగు శ్లోకాలు ఉన్నాయి. వీట్లో అధ్యాత్మిక అన్వయం తెరని ఛేదించుకొని స్పష్టంగా కనిపిస్తుంది.

అగ్నిర్హోతా కవిక్రతుః సత్యశ్చిత్రశ్రవస్తమః | దేవో దేవేభిరా గమత్ ||

యదఙ్గ దాశుషే త్వమగ్నే భద్రం కరిష్యసి | తవేత్ తత్ సత్య మఙ్గిరః |

ఉప త్వాగ్నే దివేదివే దోషావస్తర్ధియా వయమ్ | నమో భరన్త ఏమసి ||

రాజన్తమధ్వరాణాం గోపామృతస్య దీదివిమ్ | వర్ధమానం స్వే దమే||

ఈ పద్యంలో మనకి వేదం యొక్క అధ్యాత్మిక భావాన్ని సూచించే కొన్ని పదాలు వరుసగా కనిపిస్తున్నాయి. ఆ భావంతో మొత్తం సందర్భాన్ని తీరుగా పూరిస్తున్నాయి. కాని సాయణుడు మాత్రం కేవలం కర్మకాండ పరమైన అన్వయాన్నే సమర్థిస్తూ వచ్చాడు. అతడు అలాంటి అన్వయాన్ని ఎందుకు కోరుకుంటున్నాడో ఒకసారి పరిశీలిద్దాము. మొదటి వాక్యంలో 'క్రతు' అన్న పదానికి యజ్ఞం అన్న అర్థాన్ని తీసుకున్నా, 'కవి' అన్న పదానికి ద్రష్ట అన్న అర్థాన్ని స్వీకరించవలసి ఉంటుంది. దీన్ని బట్టి "ఎవరి కర్మ అయితే ఒక ద్రష్ట యొక్క కర్మని తలపిస్తుందో అటువంటి పురోహితుడు అగ్ని" అన్న అర్థం వస్తుంది. మొత్తం యజ్ఞం యొక్క ప్రతీకాత్మక లక్షణం ఇక్కడే మనకి స్ఫురిస్తోంది. వేదాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోడానికి అదొక భావబీజంలా పనికొస్తుంది. ఈ సమస్యని ఎలాగైనా పరిష్కరించాలనే ఉద్దేశంతో సాయణుడు, కవి అనే పదానికి ద్రష్ట అనే అర్థాన్ని ఇవ్వకుండా జాగ్రత్త పడుతూ పూర్తిగా వేరే అర్థాన్ని సూచిస్తాడు. యజ్ఞం యొక్క నిజమైన ఫలాన్ని ప్రసాదిస్తాడు కనుక అగ్ని అంటే నిజం లేదా సత్యం అన్న అర్థాన్ని తీసుకుంటాడు. అలాగే శ్రవస్ అనే పదానికి "ప్రతీతి" అన్న అర్థాన్ని తీసుకుంటూ, అగ్ని గొప్ప ప్రతీతి గల వాడు అన్నట్టుగా అన్వయిస్తాడు. అలాంటి అన్వయం వల్ల ఏర్పడే వైరుధ్యాన్ని నివారించడం కోసం అగ్ని అంటే ఐశ్వర్యం అన్న అర్థాన్ని తీసుకున్నా మరింత మేలైన ఫలితం వచ్చేది. అప్పుడు ఐదవ శ్లోకం యొక్క అర్థాన్ని ఇలా వ్యక్తం చేయొచ్చు – "అగ్ని అనే పురోహితుడు, యజ్ఞంలో

సక్రియంగా ఉండేవాడు, (ఫలదానంలో) సత్యవంతుడు – అనేకమైన సిరులు గలవాడు, - దేవతలలో దేవతగా అతణ్ణి రానీ."

ఆరవ ఋక్కుని వివరించే ప్రయత్నంలో వ్యాఖ్యాత ఒక వికారమైన, విడ్డూరమైన ఆలోచనా పంథాని ఎంచుకుంటాడు. అసలు మొత్తం సూక్తం యొక్క ఆలోచనా స్రవంతికే ఆ అన్వయం అడ్డుపడుతుంది. "(వివిధమైన సంపద రూపంలో) ఏ మంచిని అయితే నీవు యాజ్ఞికుడికి ప్రసాదిస్తావో, అదంతా నీదే. ఓ అంగీరసుడా! ఇది తథ్యం." అంటే ఈ విషయంలో ఇక సందేహం లేదని తెలియజేస్తున్నట్టు అవుతుంది. అగ్ని యాజ్ఞికుడికి పలు సిరులు ప్రసాదిస్తే, యాజ్ఞికుడు కూడా అగ్నికి మరెన్నో యజ్ఞాలు చేస్తాడు. ఆ విధంగా ఇటు యాజ్ఞికుడికి, అటు దేవుడికి కూడా మంచి జరుగుతోంది. కాబట్టి ఈ భావాన్ని మరింత సముచితంగా ఇలా వ్యక్తం చెయ్యొచ్చు – "యాజ్ఞికుడికి నీవు మేలుని కలుగజేస్తావు. అదే నీ సత్యం, ఓ అంగీరసుడా!" ఆ విధంగా హోమాగ్నికి దేవత అయిన అగ్నిదేవుడికి వర్తింపజేసిన 'సత్యం' అనే పదం యొక్క అర్థాన్ని సూటిగా, సరళంగా అర్థం చేసుకోవచ్చు. యాజ్ఞికుడికి తప్పనిసరిగా మంచిని ప్రసాదించడం అగ్ని యొక్క నిజ స్వభావం.

ఏడవ శ్లోకాన్ని కూడా కర్మకాండ పరంగా అన్వయించడం పెద్ద కష్టం కాదు. అయితే అందులో ఈ పదజాలం మాత్రం కాస్త విడ్డూరంగా తోచుతుంది. "సాష్టాంగాన్ని *భరిస్తూ* మేము వస్తున్నాం." ఈ పదజాలంలో భరించడం అంటే కేవలం చెయ్యడం అనే అర్థాన్ని తీసుకుంటూ సాయణుడు ఇలా వివరిస్తున్నాడు - "అనుదినం, రాత్రనక పగలనక, నీకు సాష్టాంగపడాలనే ఆలోచనతో నీ వద్దకు వస్తున్నాం." ఇక ఏడవ శ్లోకంలో 'ఋతస్య' అనే పదానికి సత్యం అనే అర్థాన్ని తీసుకుంటూ, ఆ సత్యమే యజ్ఞం యొక్క చరమ లక్ష్యం అంటాడు. "ప్రభావంతుడవు, యజ్ఞానికి రక్షకుడవు, సత్యానికి (అంటే దాని చరమ ఫలానికి) ప్రదాతవు, నీ స్వగృహంలో వర్ధిల్లుతావు." ఇక్కడ 'ఋతం' అనే పదాన్ని యజ్ఞం అనే అర్థంలో తీసుకుంటే, భావం మరింత సుగమం అవుతుంది. "యజ్ఞంలో రాజిల్లే నీవు, యజ్ఞానికి రక్షకుడవు, నిత్య ప్రకాశివై నీ స్వధామంలో వర్ధిల్లుతావు." అగ్ని యొక్క "స్వధామం" అంటే

యజ్ఞం జరిగే చోటు అని వ్యాఖ్యాత వివరిస్తాడు. ఎందుకంటే ఆ చోటిని సంస్కృతంలో "అగ్ని గృహం" అని పలు చోట్ల వ్యవహరిస్తూ ఉంటారు.

ఆ విధంగా కాస్తంత కుస్తీ పడితే పూర్తిగా కర్మకాండ పరమైన అన్వయాన్ని ఇవ్వడానికి వీలవుతుంది. గొప్ప అధ్యాత్మిక భావసంపద దాగి వున్న శ్లోకాలలో కూడా బొత్తిగా పేలవమైన, అర్థరహితమైన తాత్పర్యాన్ని రాబట్టడానికి వీలవుతుంది. అలా ఎంత ఒడుపుగా నడచుకున్నా ఆ ప్రయత్నంలోని కృత్రిమత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వేదంలో సొంతమూ 'కవి' అనే పదానికి ఇవ్వబడ్డ సరళమైన అర్థాన్ని అవతల పారేసి ఒక అవాస్తవికమైన అర్థాన్ని దానికి ఆపాదించాలని చూస్తున్నాం. అలాగే వేదం ఎంతో సన్నిహితమైన 'సత్యం', 'ఋత' అనే పదాలని విడ్డోడు చేసి 'ఋత' అనే పదం మీద ఒక పొసగని అర్థాన్ని రుద్దుతున్నాం. ఈ ప్రయత్నంలో మనం ఋషులు ప్రసాదించిన సహజమైన భావజాలాన్ని మొండిగా త్రోసిపుచ్చుతున్నాం.

ఇందుకు పూర్తిగా విరుద్ధమైన మార్గాన్ని అవలంబిస్తూ, పదాల యొక్క పూర్తి అధ్యాత్మిక అర్థాన్ని తీసుకుంటూ ఇప్పుడు ముందుకు నడుద్దాం. సంస్కృతంలో 'క్రతు' అంటే పని లేదా కర్మ. దీన్ని ఎక్కువగా త్యాగం అనే అర్థంలో వాడుతారు. దీనికి శక్తి లేదా బలం, పనిలో సామర్థ్యం అనే అర్థం కూడా వుంది (ఇది గ్రీకు పదం 'క్రటోస్' ని తలపిస్తుంది). అధ్యాత్మికంగా చూస్తే సమర్థవంతమైన పని వెనుక ఉన్నదే ఇచ్ఛ. ఈ పదానికి మనసు, బుద్ధి అనే అర్థాలు కూడా ఉన్నాయి. సాయణుడు ఈ 'క్రతు' అనే పదాన్ని ఆలోచన, జ్ఞానం అనే అర్థాలలో కూడా వాడుతాడు. శ్రవస్ అనే పదానికి స్థూలార్థం వినికిడి. ఆ ప్రథమ అర్థం నుండి దాని ద్వితీయ అర్థమైన 'పలుకుబడి' అనే అర్థం వస్తుంది. కాని అధ్యాత్మికంగా చూస్తే శ్రవస్ అనే సంస్కృత పదం శ్రవణ, శ్రుతి, శ్రుత అనే ఇతర పదాల వద్దకి తీసుకు వెళ్తుంది. ఈ పదాలన్నిటి సామాన్య అర్థం 'స్ఫుట జ్ఞానం'. అంటే స్ఫూర్తి చేత, ఆంతరికంగా వెల్లడైన జ్ఞానం. దృష్టి మరియు శ్రుతి, చూపు మరియు వినికిడి, అంటే అంతరంగ ప్రకాశనం లేదా అంతరంగ ప్రబోధం చేత వెల్లడైన జ్ఞానం అన్న మాట. ఈ రెండూ కూడా అతిమానస సామర్థ్యం యొక్క రెండు ముఖ్యమైన శక్తులు. సత్యం అనే అర్థంలో మనం అన్వయించే వైదిక శబ్దం 'ఋతం' యొక్క అసలు అర్థం ఈ అతిమానస సామర్థ్యమే. అయితే శ్రవస్ అనే పదాన్ని శబ్దశాస్త్రజ్ఞులు సాధారణంగా ఈ అర్థంలో చూడరు. వేదం వినికిడి చేత తెలుసుకున్నది, శ్రుతి, అన్న అర్థంలో

తీసుకుంటారు. ప్రస్తుత సందర్భంలో ఆ పదానికి ఈ అర్థాన్నే ఇద్దాం. ఎందుకంటే 'పలుకుబడి' అనే అర్థం ఈ సందర్భంలో పూర్తిగా అర్థరహితంగా, అసంగతంగా తోచుతుంది. అలాగే 'నమస్' అనే పదానికి కూడా అధ్యాత్మికమైన, అంతరికమైన అర్థాన్ని అందివ్వొచ్చు. ఈ పదానికి స్థూలార్థం 'వంగడం.' దేవత ముందు సాష్టాంగపడి భక్తిభావంతో నమస్కరించడం అనే అర్థంలో ఈ పదాన్ని తీసుకోవచ్చు. కాబట్టి 'ఆలోచన చేత అగ్నికి నమస్కరించడం' గురించి ఋషి అంటున్నప్పుడు, దాన్ని ఆంతరికమైన ఆత్మసమర్పణ అనే అర్థంలో తీసుకోవాలని వేరే చెప్పనక్కర్లేదు.

పై చర్చని బట్టి నాలుగు శ్లోకాల తాత్పర్యాన్ని ఇలా ఇవ్వొచ్చు –

"ఉపాసనకి పురోహితుడవైన ఓ అగ్నీ! కర్మల వెనుక నీ సంకల్పం సత్యమైనది, బహుముఖమైన స్ఫూర్తితో రాజిల్లేవాడవు, వేల్పులలో వేలుపుగా అరుదెంచు.

యాజ్ఞికుడికి నీవు ఒనగూర్చే మంచి, ఓ అంగీరసుడా! అదే నీ స్వాభావిక సత్యం.

ఓ అగ్నీ! అనుదినం, రాత్రయినా, పగలైనా ఆలోచన చేత నీకు ఆత్మసర్పణ చేసుకుంటున్నాము, -

మా యాగాలలో ప్రజ్వలించే నీకు (లేదా యాగానికి అధ్వర్యం వహించే నీకు), సత్యానికి, సత్యప్రకాశనానికి రక్షకుడవు, నీ స్వగృహంలో వర్ధిల్లుతావు."

పై అనువాదంలో దోషం ఎక్కడ వస్తోందంటే మనం 'సత్యం', 'ఋతం' అనే రెండు పదాలని ఒకే పదంతో అనువదించాము. కాని వేదంలో 'సత్యం, ఋతం, బృహత్' అనే పదత్రయం మనకి తారసిల్లుతుంది. కాబట్టి వైదిక తత్వంలో ఆ రెండు పదాల మధ్య తేడా వుందన్న విషయం తేటతెల్లం అవుతోంది.

అంత గాఢమైన భక్తిభావంతో కొలువబడుతూ, అంత విశాలమైన, ప్రగాఢమైన క్రియలు గల ఆ అగ్ని దేవుడు ఇంతకీ ఎవరు? ఎవడైతే సత్యానికి సంరక్షకుడో, ఎవని కర్మ చేత సత్యం ప్రకాశితం అవుతుందో, ఎవని సంకల్పమైతే ఒక ద్రష్ట యొక్క సంకల్పం ఔతుందో, ఎవని దివ్య ప్రజ్ఞ అయితే అనేకముఖమైన స్ఫూర్తిని కలిగిస్తుందో ఆ అగ్ని దేవుడు ఎవరు? అతడు

సంరక్షిస్తున్న సత్యం ఏమిటి? రాత్రనక, పగలనక అతణ్ణే చింతిస్తూ, ఆత్మసమర్పణా భావంతో తనని ఆశ్రయించే యాజ్ఞికుడికి అతడు ప్రసాదించే మంచి ఏమిటి? అతడు ప్రసాదించే కానుకలు కనకం, అశ్వాలు, గోవులు తదితర ఐహిక వస్తుసంజాతమా? లేక అతడు అందించేవి మరేవో దివ్యసిరులా?

ఈ లక్షణాలన్నీ హోమాగ్నికి చెందినవి కావని సులభంగా తెలుస్తుంది. మరే ఇతర భౌతిక అగ్నికి గాని, తాపానికి గాని, తేజానికి గాని ఈ గుణాలు ఉండవు. కాని వేదంలో సాంతమూ ఈ హోమాగ్ని అనే ప్రతీకని స్థిరంగా నిలపడం జరిగింది. మనకి ఇక్కడ కనిపిస్తున్న అధ్యాత్మిక ప్రతీకావళిలో హోమాగ్ని, హోమం, హోత ముువ్వురూ మరింత లోతైన ప్రబోధానికి బాహ్య చిహ్నాలు మాత్రమే. కాబట్టి ఆ ప్రతీకలని చివరికంటా స్థిరంగా నిలపడం అతి ముఖ్యం అని వేదం భావించింది.

ఉపనిషత్తులకి చెందిన వేదాంత బోధనలో సత్యం యొక్క ఒక ప్రత్యేక భావన మనకు తరచు ఎదురవుతుంది. వేద ఋక్కుల నుండి గ్రహించబడ్డ భావన 'సత్యం, ఋతం, బృహత్' అనే సూత్రం రూపంలో వ్యక్తమవుతుంది. సత్యం అంటే సత్యమైనది, ఋతం అంటే సరైనది, బృహత్ అంటే సువిశాలమైనది. వేదం ప్రస్తావించే సత్యం ఆనందానికి, అమరత్వానికి గొని పోతుంది. ఉపనిషత్తులలో కూడా సత్య మార్గం చేతనే ఋషి లేదా కవి అతీత స్థితిని చేరుకుంటాడు. అసత్యం నుండి, మర్త్యస్థితి నుండి బయటపడి, అమరత్వాన్ని పొందుతాడు. కాబట్టి ఈ విషయంలో వేదంలోను, వేదాంతంలోను కూడా ఒకే భావన తెలుపబడిందని అని మనం అనుకోవచ్చు.

సత్యానికి చెందిన ఈ అధ్యాత్మిక భావన ప్రకారం, సత్యం అంటే దివ్యమైన సారానికి చెందిన సత్యం, బాహ్యప్రపంచం నుండి ఇంద్రియ సంవేదల ద్వార రాబట్టే సత్యం కాదని గుర్తించాలి. అది ఉనికికి చెందిన నిజం లేదా సత్యం; అది కర్మలలో ఋజుత్వం లేదా ఋతం. అంటే దివ్యమైన ఆత్మిక స్థితి మనో దేహాల ఋజు వర్తనాన్ని శాసిస్తోంది; అది బృహత్, అంటే అనంతం నుండి సేరుగా, నిర్దోషంగా వెలువడే విశ్వైక సత్యం. అలాంటి వర్తనానికి చెందిన చైతన్యం కూడా అనంతమే. ఎన్నో పరిమితులతో కూడుకున్న ఇంద్రియ మనస్సుకి చెందిన

చైతన్యం వంటిది కాదిది. ఒకటి భూమం అంటే విశాలంగా ఉంటుందని, రెండవది అల్పం అంటే సంకుచితంగా ఉంటుందని చెప్పబడింది. ఈ అతిమానస లేదా సత్య చైతన్యానికి ఇవ్వబడ్డ మరో పేరే మహస్, అంటే మహత్తరమైనది, విశాలమైనది. ఇక బాహ్యప్రపంచానికి, ఇంద్రియ సంవేదనకి చెందిన వాస్తవాలన్నీ వట్టి బూటకాలు (అనృతమ్, అంటే నిజం కానిది, మనో దేహాలలో సత్యం తప్పుగా వర్తించడం వల్ల ఏర్పడేది). నిజాన్ని తెలుసుకునేందుకు మనం ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే మూడు సాధనాలని వాడుతాము. వీటికి సంబంధంగా సత్య చైతన్యానికి మూడు సామర్థ్యాలు ఉన్నాయి. అవి *దృష్టి, శ్రుతి, వివేకమ్.* దృష్టి అంటే సత్యాన్ని సూటిగా దర్శించగలగడం. శ్రుతి అంటే సత్యాన్ని సూటిగా వినగలగడం. వివేకం అంటే సరైన మార్గాన్ని సూటిగా వివేచన చెయ్యగలగడం. అతిమానస చైతన్యాన్ని తెలుసుకుని, దాని ద్వార ఈ సామర్థ్యాల్ని పొందిన వాడే కవి, లేదా ఋషి. *సత్యం, ఋతం* అనే ఈ భావనలని ఇప్పుడు మనం వేదం యొక్క మొదటి సూక్తానికి వర్తింపజేయాలి.

వేదం ఎప్పుడూ అగ్నిని తేజం, బలం అనే దాని రెండు ముఖాలతో చూపిస్తుంది. లోకాలని నిర్మించే దివ్యమైన బలం అగ్ని. ఆ బలం ఎప్పుడూ పరిపూర్ణమైన జ్ఞానంతో పని చేస్తుంది. ఎందుకంటే అది *జాతవేదస్* – అన్ని జన్మలూ తెలిసినది. *విశ్వాని వయునాని విద్వాన్* – అంటే అది అన్ని అభివ్యక్తాలని, దృగ్విషయాలని తెలిసినది. లేదా అని దివ్య ప్రజ్ఞ యొక్క సమస్త రూపాలని, చర్యలని తనలోనే భరించేది. దేవతలు అగ్నిని మర్త్యులలో అమరుడిగా, మానవుడిలోని దివ్య బలంగా స్థాపించారు. ఆ సాఫల్య శక్తి చేత వారు మనిషిలో తమ విధులు నెరవేర్చుకుంటారు. ఆ విధికి ప్రతీకే హోమం.

అధ్యాత్మికంగా చూసినప్పుడు దైవప్రజ్ఞ యొక్క ప్రేరణతో పని చేసే దైవసంకల్పమే అగ్ని అని మనం అర్థం చేసుకోవచ్చు. ఆ సంకల్పము అగ్ని రెండూ వేరు కావు. సత్య చైతన్యం యొక్క సక్రియమైన, సఫలదాయకమైన బలమే అగ్ని. కవిక్రతుః అనే పదంలోని అంతరార్థం అదే. ఒక ద్రష్టకి సహజంగా ఉండే సంకల్పబలం కలవాడు అగ్ని. కవిక్రతుః అంటే సత్యచైతన్యానికి చెందిన జ్ఞానం లోనుండి జనించే కర్మలు. అందులో దోషం లేశమైనా ఉండదు. అగ్నిని వర్ణించే విశేషణాలే ఈ అన్వయాన్ని స్థిరంగా సమర్థిస్తాయి. అగ్ని సత్యం – అంటే తత్వంలో

నిజమైన వాడు. తన యొక్క, సమస్త సృష్టి యొక్క సత్యసారాన్ని కుదురుగా వశం చేసుకున్నవాడు కనుక ఆ సత్యాన్ని ప్రతీ కర్మలోను, కదలికలోను పూర్తిగా చొప్పించగల సామర్థ్యం గల వాడు. సత్యం, ఋతం రెండూ కలిగిన వాడు. అంతేకాక అతడు *చిత్రశ్రవస్తమః*, ఋతం లోనుండి గొప్ప ప్రకాశంతో, వైవిధ్యంతో కూడిన ప్రేరణలు పెల్లుబుకుతాయి. వాటి సహాయంతో పరిపూర్ణమైన పరిశ్రమను చెయ్యడానికి వీలవుతుంది. హోమాన్ని చేసేవాడిగా (హోతృ), అగిహోత్రుడిగా ఇవన్నీ అగ్ని యొక్క లక్షణాలు. సత్యాన్ని పనిలో (*కర్మ* లేదా *అపస్*) ప్రవేశ పెట్టగల సామర్థ్యం అగ్నికి చెందినది. బాహ్యమైన కర్మకాండలో హోమాగ్నికి ఎలాంటి ప్రాధాన్యత వుందో, తదనుగుణమైన ఆంతరికమైన చర్యలో అగ్నికి కూడా అటువంటి ప్రాధాన్యత వుంది. ఆంతరిక హోమంలో, సమైక్యమైన తేజంతో, బలంతో కూడుకున్న ఆంతరికమైన అగ్ని యొక్క ప్రమేయం వల్ల మర్త్యమూర్తికి అమృతమూర్తికి మధ్య అనుసంధానం జరుగుతుంది, అనుబంధం ఏర్పడుతుంది. అలా అనుసంధానం జరుపుతాడు గనుకనే ఎన్నో చోట్ల అగ్నిని దూతగా వర్ణించడం జరుగుతుంది.

కాబట్టి అగ్నిని ఎలాంటి హోదాలో హోమంలోకి ఆహ్వానిస్తున్నారో చూద్దాం. "దేవతల్లో దేవతగా, అతణ్ణి రానీ" అంటుంది వేదం. 'దేవో దేవేభిర్' అనే పదజాలంతో అగ్ని యొక్క దివ్యత్వాన్ని చాటుతోంది. అగ్నిని మనుషుల్లో దేవుడిగా, మర్త్యుల్లో అమరుడిగా, దివ్య అతిథిగా వర్ణిస్తుంది. దాని అధ్యాత్మిక అంతరార్థాన్ని ఈ విధంగా వ్యక్తం చేద్దాం – "దివ్యశక్తుల్లో దివ్యశక్తిగా అతణ్ణి రానీ." వేదం యొక్క బాహ్యార్థం ప్రకారం దేవతలంతా భౌతిక ప్రకృతికి చెందిన శక్తుల యొక్క మానవీకృత రూపాలు. అంతరార్థం ప్రకారం దేవతలంతా ప్రకృతి యొక్క ఇచ్ఛ, మనస్సు మొదలైన ఆంతరిక శక్తుల యొక్క విశ్వజనీన రూపాలు. అయితే వేదంలో ఎప్పుడూ ఈ శక్తుల యొక్క సాధారణ మానవీయ చర్యలకి (*మనుస్వత్*) వాటి దివ్య రూపాలకి మధ్య తేడా ప్రదర్శించబడుతుంది. మనిషి దేవతలకి చేసే ఆంతరిక ఆత్మసమర్పణ ద్వార తన మానసిక వృత్తులని దివ్యంగా మార్చుకోగలడు, మర్త్య మానవుడు అమరుడు కాగలడు. ఆ విధంగా మొదట మనుషులుగా అవతరించిన రిభులు, లేదా మానవ సామర్థ్యాలకి ప్రతినిధులైన రిభులు, కర్మలలో పరిపూర్ణతని (*సుకృత్యాయ, స్వపస్యాయ*) సాధించి, దివ్యులైనారు. మనిషి దైవానికి నిరంతరం ఆత్మసమర్పణ

చేసుకోవడం, దైవం నిరంతరం మనిషి లోకి దిగి రావడం – ఈ ప్రక్రియకే హోమం ఒక భౌతిక ప్రతీక అవుతోంది.

పరిపూర్ణమైన సత్యం, సన్మార్గం (సత్యం – ఋతం) అనే తత్వాల మీద స్థాపించబడ్డ ఆనందమే ఆ అమరత్వ స్థితి. ఈ దృక్పథంతోనే మనం తదుపరి శ్లోకాన్ని అర్థం చేసుకోవాలి. "ఓ అగ్నీ! హోతకు నీవు ఒనగూర్చే మంచి (ఆనందం), అదే నీ సత్యం." మరో విధంగా చెప్పాలంటే ఈ సత్యం యొక్క సారమే అగ్ని యొక్క నైజం. ఆ స్థితిలో చెడు నుండి విమోచనం కలుగుతుంది. పరిపూర్ణమైన శ్రేయస్సు, ఆనందాలతో కూడుకున్న స్థితి నెలకొంటుంది. ఆ స్థితి ఋతం వల్ల కలుగుతుంది. అగ్నిహోత్రుడి అధ్వర్యంలో మనిషి హోమం చేసినప్పుడు ఆ మర్త్యుడిలో అలాంటి స్థితి సృష్టింపబడుతుంది. '*భద్రం*' అంటే మంచిది, శుభమైనది, ఆనందమయమైనది అని అర్థం. ఆ పదానికి ప్రత్యేకంగా లోతైన ప్రాముఖ్యత ఏమీ లేదు. కాని *ఋతం* అనే పదానికి మల్లె ఆ పదం కూడా వేదంలో ఒక ప్రత్యేకమైన అర్థంలో వాడబడుతుంది. ఒక శ్లోకంలో (V.82) ఆ పదాన్ని 'పీడకలకి (*దుఃష్వప్న్యం*) విరుద్ధమైనది' అన్న అర్థంలో వాడడం జరిగింది. అంటే 'ఋతం' కాని అబద్ధపు చైతన్యం, అంటే *దురితం*, చెడుకి, బాధలకి ఆధారభూతమైన చైతన్యం అన్నమాట. కాబట్టి భద్రం అంటే '*సువితం*' అనే పదానికి తుల్యమైనది. సువితం అంటే సన్మార్గం, సద్వర్తనం, సత్య స్థితికి (ఋతం) చెందిన మంచి, ఆనందం. ఈ ఆనందానికి మరో సందర్భంలో వాడబడ్డ మరో పదం '*మయస్*.' సత్యచైతన్యానికి ప్రతినిధులు అయిన దేవతలని వేదం '*మయోభువః*' అంటుంది. అంటే తమ అంతర్యంలో అటువంటి ఆనందాన్ని సదా ధరించేవారు. కాబట్టి వేదాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే, అందులో ప్రతీ భాగం వేరే అన్ని భాగాల మీద ప్రకాశాన్ని వెదజల్లుతుంది. మేలితెరలు దృష్టికి అడ్డుపడినప్పుడే వేదం అంతా అసంగతంగా, అల్లకల్లోలంగా కనిపిస్తుంది.

తదుపరి శ్లోకంలో యాగం సఫలం కావడానికి అవసరమైన నిబంధనలు చెప్పబడతాయి. అగ్ని ప్రతీకగా నిలిచిన ఆ దివ్యసంకల్పానికి, ఆ దివ్య ప్రజ్ఞకి మానవుడు అనుదినం, అహోరాత్రాలు, తన చిత్తంలో ఆరాధనా పూర్వకంగా ఆత్మసమర్పణ కావాలి – అదే ఆ

నిబంధన. *'నక్తోషాసా'* అంటే అహోరాత్రాలు అనే పదం కూడా, వైదిక దేవతలకి మల్లె, ప్రతీకాత్మకమైనది. దాని అర్థం సమస్త చేతనా స్థితులలోను, అవి ప్రకాశవంతమైనవైనా, అంధకారమయమైనవి అయినా, సదా ఆ ఆత్మసమర్పణా భావం స్థిరంగా ఉండాలి, ఆంతరిక వ్యవహారాలన్నీ దివ్య పాలనకి అధీనమై ఉండాలి.

మరి రాత్రయినా, పగలైనా హోమంలో అగ్ని ఎప్పుడూ నిండుగా ప్రజ్వరిల్లుతాడు. అతడు మనిషిలోని సత్యానికి, ఋతానికి రక్షకుడు. దాన్ని చీకటి శక్తుల నుండి కాపాడుతాడు. చిత్తంలో గాఢాంధకారం అలముకున్న స్థితులలో కూడా అగ్ని రగులుతూ కాంతులు కురిపిస్తాడు. ఆ విధంగా ఎనిమిదవ సూక్తంలో క్లుప్తంగా సూచించబడ్డ భావాలు ఋగ్వేదంలో సాంతమూ అగ్నిని ఉద్దేశించిన సూక్తాలలో పదే పదే ఆవృతమవుతాయి.

చివరిలో అగ్ని తన స్వధామంలో ఎదిగి వర్ధిల్లుతున్నట్లుగా చెప్పబడింది. ఇక్కడ స్వధామం అంటే వైదిక గృహస్థు ఇంట్లో ఉండే హోమాగ్ని మందిరం అనే వివరణ ఇప్పుడు మనకు తృప్తి కలిగించదు. అందుకు వేరే అన్వయం కోసం మనం వేదం లోనే వెదకాలి. ఇది మొదటి మండలంలో 75 వ సూక్తంలో మనకు లభిస్తుంది.

యజా నో మిత్రావరుణా, యజా దేవాన్ ఋతం, బృహత్ ।

అగ్నే యక్షి స్వం దమమ్ ॥

"ఓ మిత్రుడా, వరుణుడా, మా కోసం ఈ యజ్ఞాన్ని సమర్పించు. దేవతలకి, సత్యానికి, బృహత్తుకి మా యజ్ఞాన్ని సమర్పించు. ఓ అగ్నీ! నీ స్వగృహానికి యజ్ఞాన్ని సమర్పించు."

ఇక్కడ *'ఋతం, బృహత్'* అనే పదాలు, *'స్వం దమమ్'* అనే పదాలు యజ్ఞం యొక్క లక్ష్యాన్ని వ్యక్తం చేస్తున్నట్టు కనిపిస్తున్నాయి. ఇలాంటి వర్ణన వైదిక పరికల్పనతో పూర్తిగా

పొసగుతోంది. వేదంలో ఎన్నో చోట్ల యజ్ఞం అనేది దేవతల దిశగా చేసే ప్రయాణంగా వర్ణించబడింది. ఆ యాత్రలో యాత్రికుడు మానవుడు. సత్యం, తేజం, ఆనందాల దిశగా పయనిస్తున్న మనిషి. కాబట్టి సత్యం అన్నా, బృహత్తు అన్నా, అగ్ని యొక్క స్వధామం అన్నా – అన్నిటి అర్థం ఒక్కటేనని స్పష్టంగా తెలుస్తోంది. అగ్ని తదితర దేవతలంతా సత్యంలో నుండి ఆవిర్భవించారని, ఆ బృహత్తులో, ఎల్లలు లేని సీమలో వారు సదా కొలువై ఉన్నారని ఎన్నో చోట్ల వేదం చెప్తుంది. కాబట్టి ఈ సూక్తంలో మనకి వస్తున్న తాత్పర్యం ఏమిటంటే మనిషిలో దివ్య సంకల్పానికి, దివ్య బలానికి ప్రతీక అయిన అగ్ని, ఎల్లలన్నీ కల్లలయ్యే తన విశాల నిజసీమ అయిన సత్య చైతన్యంలో (*ఉరావ్ అనిబాధే*) వర్ధమానుడవుతాడు.

ఆ విధంగా వేదం యొక్క మొదటి సూక్తంలోని నాలుగు శ్లోకాలలోనే వేద ఋషుల యొక్క ప్రధాన భావనలన్నీ మనకి పరిచయం చెయ్యబడుతున్నాయి. దివ్య, అతిమానస సత్య చైతన్యం అనే భావన, కల్లలలో అల్లలాడే మనిషి మనసుని ఆ కూపం లోనుండి పైకి తీసేందుకు గాను సత్య శక్తులలైన దేవతలని ఉపాసన చేసే భావన, ఆ సత్య సిద్ధి చేత పరిపూర్ణమైన శ్రేయస్సు, ఆనందాలతో కూడుకున్న ఒక అమరత్వ స్థితిని చేరుకోవచ్చుననే భావన, మనకి ఉన్న దాన్ని యజించి, ఆంతరికంగా సమర్పించి, మర్త్య స్థితి నుండి అమరత్వాన్ని చేరుకోవచ్చుననే భావన – ఈ భావజాలపు బీజాలన్నీ ఆదిలోనే మనకి ఎదురవుతున్నాయి. ఈ కేంద్రభావాల చుట్టూ తక్కిన వైదిక చింతన అంతా తీరుగా అమర్చబడి వుంది.

అధ్యాయం 7

వరుణమిత్రులు – సత్యం

వేదంలో మొదటి సూక్తంలోనే మనకి సత్యానికి చెందిన ఒక మహోన్నత భావన ఎదురయ్యింది. ఆ భావన ప్రకారం అతిమానస చైతన్యం వల్ల అమరత్వ, ఆనంద సిద్ధి కలుగుతుంది. వేద ఋషుల భావ ప్రపంచంలో అదే ముఖ్య భావన అయితే ఆ భావన వేదంలో పదే పదే మనకి తారసపడుతూ, మరెన్నో ఇతర అధ్యాత్మిక భావాలని జనింపజేయాలి. తదుపరి సూక్తంలోనే, ఇంద్రుణ్ణి, వాయువుని కీర్తిస్తూ మధుచ్ఛందుడు పాడిన గీతంలో, మనకి మరో స్పష్టమైన, అనుల్లంఘనీయమైన భావన ఎదురవుతుంది. వెనకటి అగ్నిసూక్తంలో కన్నా ఇందులో ఋతం అనే భావనకి మరింత ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. ఆ సూక్తంలోని ఆఖరి మూడు ఋక్కులు ఇలా ఉన్నాయి.

మిత్రం హువే పూతదక్షం వరుణం చ రిషాదసం ।

ధియం ఘృతాచీం సాధంతా ॥

ఋతేన మిత్రావరుణావృతావృధావృతస్పృశా ।

క్రతుం బృహంతమాశాతే ॥

కవి నో మిత్రావరుణా, తువిజాతా ఉరుక్షయా ।

దక్షం దధాతే అపసం ॥

పైన ఇవ్వబడ్డ శ్లోకాలలో మొదటి ఋక్కులో '*దక్ష*' అనే పదం కనిపిస్తుంది. దీన్ని సాయణుడు 'శక్తి' అని అన్వయిస్తాడు. అయితే దీనికి అధ్యాత్మిక అన్వయం కూడా వీలవుతుంది. ఆ తరువాత '*ఘృత*' అనే పదం విశేషణ రూపంలో '*ధియం ఘృతాచీం*' అనే పదయుగళంలో కనిపిస్తుంది. ఈ శ్లోకాలని ఈ విధంగా అనువదించవచ్చు. "శుద్ధ శక్తి గల (లేదా శుద్ధ వివేచన గల) మిత్రుని, మన శత్రువులని నిర్జించి మనలో ప్రబుద్ధమైన అవగాహనను కలుగజేసే వరుణుని, నేను ఆవాహన చేస్తున్నాను."

రెండవ ఋక్కులో ఋతం అనే పదం మూడు మార్లు వస్తుంది. *బృహత్, క్రతు* అనే పదాలు కూడా వస్తాయి. వేదం యొక్క అధ్యాత్మిక అన్వయంలో ఈ పదాలకి నేను ఎంతో ప్రాముఖ్యత నిస్తున్నాను. ఇక్కడ క్రతువు అంటే యజ్ఞం లేదా సఫలమయ్యే కృషి. ఈ రెండవ అర్థానికి సమర్థింపుగా వేదంలోనే మరో చోట 'ఓ బ్రహ్మాండమైన యజ్ఞం చేత వరుణ, మిత్రులు సత్యాన్ని చేరుకున్నారు, లేదా సత్యాన్ని ఆనందిస్తారు' (*యజ్ఞం బృహంతం ఆశాతే*) అని చెప్పబడింది. కాని ఈ పోలికతో అన్వయం నిర్ద్వంద్వంగా తేలదు. ఎందుకంటే ఒక సందర్భంలో యజ్ఞం గురించి చెప్పబడింది, రెండవ సందర్భంలో ఆ యజ్ఞాన్ని చెయ్యగల శక్తి యొక్క తీరు గురించి చెప్పబడింది. కాబట్టి పైన చెప్పుకున్న శ్లోకాన్ని యదాతథంగా ఇలా అనువదించవచ్చు – "సత్యం చేత మిత్ర వరుణులు, సత్యవర్ధనులై, సత్యస్పృశ్యులై, ఓ బృహత్తర కార్యాన్ని ఆనందిస్తారు, లేదా సాధిస్తారు." "బృహత్తర కార్యానికి" అనే బదులు "బ్రహ్మాండమైన శక్తిని" అని కూడా అనువదించవచ్చు.

చివరిగా ఇక మూడవ ఋక్కులో మనకి 'దక్ష' అనే పదం కనిపిస్తుంది; ఇక కవి (*ద్రష్ట*) అనే పదాన్ని *క్రతు* (కర్మ లేదా ఇచ్ఛ) అనే పదంతో మధుచ్ఛందుడు ముందే ముడిపెట్టాడు; ఇక సత్యం అనే భావన వుంది. ఉరుక్షయ అనే పదం కూడా ఉంది – ఇక్కడ ఉరు అంటే విశాలమైన లేదా విస్తారమైన అని అర్థం. దీన్ని బృహత్తు అనే పదంతో పోల్చవచ్చు. ఈ పదాన్నే అగ్ని యొక్క "స్వధామం" అయిన సత్య చైతన్య తలాన్ని, లేదా లోకాన్ని సూచించడానికి వాడుతారు. కాబట్టి ఈ శ్లోకాన్ని యదాతథంగా ఇలా అనువదించవచ్చు – "ద్రష్టలు, అనేకజులు, విశాలధాములు అయిన మిత్ర, వరుణులు కార్యాన్ని సాధించగల శక్తిని (లేదా వివేచనను) మన కోసం నిలుపుతారు."

మొదటి సూక్తంలో ఎదురైన భావనలే కచ్చితంగా అదే క్రమంలో, అదే పదజాలంతో రెండవ సూక్తంలో మనకి ఎదురవుతున్నాయి. అయితే ఈ సందర్భంలో వాటి ప్రయోజనం వేరు. ఇక శుద్ధమైన వివేచన, లేదా విరాజమానమైన ప్రజ్ఞ (*ధియం ఘృతాచీం*), యజ్ఞంలో సత్యం యొక్క ప్రభావం (*అపస్*) మొదలైన భావాలు కొత్త నిర్దిష్టతను ప్రవేశపెడుతూ, వేదంలోని కేంద్ర భావాల మీద క్రొంగొత్త కాంతులు విరజిమ్ముతాయి.

ఈ శ్లోకాలలో ఒక్క 'దక్ష' అనే పదం యొక్క అన్వయంలోనే కొంత సంధిగ్ధం ఏర్పడుతోంది. దీన్ని సాయణుడు 'శక్తి' అన్న అర్థంలో అనువదిస్తాడు. దక్ష అనే పదానికే కాక దానికి సన్నిహితమైన *దశ్, దిశ్, దః* వంటి ఇతర శబ్దాలకి కూడా మూలశబ్దం ఒకటే. ఆ శబ్దానికి అర్థం తీవ్రంగా ఒత్తిడి చెయ్యడం, గాయపరచడం, ముఖ్యంగా విభజించడం, కోయడం, నుగ్గు చెయ్యడం, కాల్చడం. బలాన్ని సూచించే ఎన్నో పదాలలో ఇలాంటి గాయపరిచే శక్తి, ఒక యోధుడి యొక్క దమనుడి యొక్క మహోగ్ర బలం అనే భావం ఉంటుంది. హింస చేత అవనిని ఆక్రమించి ఈ భూమి మీద తన కంటూ ఒక చిర స్థానాన్ని కల్పించుకోవాలని చూసే ఆదిమనవుడు గౌరవించే బలం వంటిదది. సాధారణ సంస్కృత పదమైన 'బలం'లో మనకి ఈ భావన కనిపిస్తుంది. గ్రీకు పదాలైన '*బల్లో*' (దెబ్బ కొడతాను), '*బెలోస్*' (ఆయుధం) వంటివి ఆ మూలశబ్దం నుండి వచ్చినవే. '*దక్ష*' అనే పదంలోని భావం కూడా అదే మూలం నుండి వచ్చింది.

అయితే ఈ సందర్భంలో విభజన అనే భావన భాషా వికాస సిద్ధాంతాలలో ఒక పూర్తిగా భిన్నమైన ఆలోచనా పథానికి గొనిపోతుంది. ఎందుకంటే మనిషికి మానసిక భావనలని సూచించే పదాలు కావలసి వచ్చినప్పుడు, ఆ మానసిక చలనానికి ప్రతీక కాగల భౌతిక చర్యని సూచించే పదాలని ఎంచుకోవడం పరిపాటే. కాబట్టి భౌతికమైన విభజన లేక వేర్పాటు అనే బావనని, మానసికమైన విచక్షణ లేదా వివేచన అనే భావనతో ముడిపెట్టడం జరిగింది. మొదట్లో ఆ భావన దృష్టిపరమైన వివేచనగా మొదలై, క్రమంగా మానసికమైన వివేచనగా పరిణమించింది. *'విద్'* అనే మూలశబ్దానికి అర్థం సంస్కృతంలో కనుక్కోవడం లేదా తెలుసుకోవడం అయితే, గ్రీకు, లాటిన్ భాషల్లో అదే శబ్దానికి అర్థం చూడడం. *'దృశ్'* అనే మూలశబ్దానికి అర్థం చూడడం. అయితే మొదట్లో దాని అర్థం చీల్చడం, చించడం, వేరు చెయ్యడం; అలాగే చూడడం అనే అర్థం గల *'పశ్'*అనే శబ్దానికి కూడా అలాంటి భావమే ఉంది. దీనికి చాలా సన్నిహితమైన మూడు మూలశబ్దాలని పరిశీలిస్తే విషయం మరింత విపులం అవుతుంది – *'పిస్'* అనే శబ్దానికి అర్థం గాయపరచడం, లేదా ధృఢంగా నిలవడం; *'పిష్'* అనే శబ్దానికి అర్థం గాయపరచడం, లేదా పొడి చెయ్యడం, పిండి చెయ్యడం; *'పిశ్'* అనే శబ్దానికి అర్థం తీర్చి దిద్దడం, రూపుదిద్దడం, నిర్వహించడం, లేదా విడిభాగాలుగా వేరు చెయ్యడం. ఈ వివిధ భావాలన్నీ కూడా వాటికి మూలంలో ఉన్న వేరు చెయ్యడం, విభజించడం అనే భావానికి రూపాంతరాలే. ఆ భావం నుండి వ్యుత్పత్తి చెందిన ఎన్నో పదాలని తీసుకోవచ్చు. *'పిశాచ'* అంటే దెయ్యం, *'పిశునత'* అంటే ఒక పక్క కటువుగా, క్రూరంగా, దుష్టంగా, ద్రోహబుద్ధితో, హాని చెయ్యాలనే ఉద్దేశం కలిగిన అనే భావం వస్తుంది. మరో పక్క అదే పదానికి వివేచన అనే అర్థానికి సన్నిహితంగా "సూచించే, ప్రదర్శించే, వ్యక్తం చేసే, విదితం చేసే" అనే అర్థాలు కూడా ఉన్నాయి. అలాగే గాయపరచడం, వేరు చెయ్యడం, వెదజల్లడం అనే అర్థాలు గల *'కృ'* అనే శబ్దానికి పోలికగా వేరు చేస్తాను, ఎంపిక చేస్తాను, నిర్ణయిస్తాను, నిర్దేశిస్తాను అనే అర్థం గల గ్రీకు పదం *'క్రినో'* ని తీసుకోవచ్చు. 'దక్ష' అనే పదానికి కూడా అలాంటి చరిత్రే వుంది. అది *'దశ్'* అనే మూలశబ్దానికి సన్నిహితమైనది. దీనికి దగ్గరగా లాటిన్ లో *డోసియో* (బోధిస్తాను) అనే పదాన్ని, గ్రీకులో *డోకియో* (ఆలోచిస్తాను, నిర్ణయిస్తాను) అనే పదాన్ని, అలాగే *డోకాజో* (పరిశీలిస్తున్నాను, ఫలానా

ఉద్దేశం కలిగి వున్నాను) అనే పదాన్ని కూడా చెప్పుపోవచ్చు. అలాగే '*దిశ్*' అనే మరో మూలశబ్దానికి సన్నిహితంగా సూచించడం, బోధించడం అనే అర్థం గల '*దేక్ను మి*'అనే గ్రీకు పదాన్ని తీసుకోవచ్చు. అసలు దక్ష అనే పదానికి ఇంచుమించు సరిసమానమైన గ్రీకు పదం '*డోక్సా*' యొక్క అర్థం అభిప్రాయం, తీర్పు. అలాంటిదే '*దెక్సియోస్*' అనే మరో పదానికి తెలివైన, చురుకైన, కుడి అనే అర్థాలు ఉన్నాయి. సంస్కృతంలో '*దక్ష్*' అనే శబ్దానికి గాయపరచడం, హతమార్చడం అనే అర్థాలే కాక సమర్థవంతమైన అనే అర్థం కూడా ఉంది. '*దక్ష*' అనే విశేషణానికి అర్థం తెలివైన, కౌశలమైన, సమర్థవంతమైన, తగిన, అప్రమత్తమైన అనే అర్థాలు ఉన్నాయి; దక్షిణ అనే పదానికి, *దెక్సియోస్* కి మల్లె, తెలివిన, ఒడుపైన అనే అర్థాలే కాక, కుడి అనే అర్థం కూడా వుంది; అలాగే దక్ష అనే నామవాచకానికి బలం అనే అర్థం మాత్రమే కాక, కపటమైన, హానికారకమైన అనే అర్థాలే కాక, మనోస్థైర్యం మొదలైన అర్థాలు కూడా ఉన్నాయి. వీటికి పోలికగా '*దశా*' అనే పదానికి మనస్సు, అవగాహన అనే అర్థాలు ఉన్నాయి. ఈ ఆధారాలన్నీ కలిపి చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. దక్ష అనే పదానికి ఒకప్పుడు వివేచన, తీర్పు, విచక్షణాత్మక బుద్ధి మొదలైన అర్థాలు ఉండేవి. కాబట్టి మానసిక వివేచన అనే అర్థం నుండి మానసిక శక్తి అనే అర్థం పరిణమించింది. అంతేగాని భౌతికశక్తి అనే భావన మానసికశక్తిగా పరిణమించలేదు.

కాబట్టి వేదంలో '*దక్ష*'అనే శబ్దానికి మూడు రకాల అర్థాలని ప్రదానం చెయ్యొచ్చు. మొదటిది సామాన్యంగా బలం. ఇంకా ప్రత్యేకంగా చెప్పాలంటే మనోబలం, వివేకం, లేదా విచక్షణా శక్తి. '*దక్ష*' అనే పదాన్ని తరచు '*క్రతు*' అనే పదంతో ముడి పెట్టడం జరుగుతుంది; ఋషులు ఆ రెండిటినీ కలిపి కోరుకుంటారు – *దక్షాయ క్రతవే*, అంటే "సమర్థవంతమైన, సఫలదాయకమైన బలం," లేదా "సంకల్పం, విచక్షణ." మనోవృత్తులని వర్ణించే ఎన్నో సందర్భాలలో ఈ పదం పదే పదే కనిపిస్తుంది. చివరిగా మనం దక్షిణా దేవిని తీసుకోవలసి ఉంటుంది. ఈమె దక్షుడికి స్త్రీ రూపం కావచ్చు. దక్షుడు తానే ఒక దేవత. తదనంతరం పురాణాల్లో ప్రజాపతులలో ఒకడుగా మనకి పరిచయం అవుతాడు. ఇక జ్ఞానం యొక్క అభివ్యక్తీకరణతో సంబంధం వున్న దక్షిణాదేవి వుంది. దివ్యమైన ఉషస్సుకి ప్రతీకగా నిలిచి, ఆంతరిక ప్రకాశాన్ని ప్రసాదించే ఉషాదేవికి ఈ దక్షిణాదేవికి సంబంధం వుంది. ఋతం లేదా

సత్య చైతన్యానికి చెందిన నాలుగు శక్తులకి ప్రతీకలుగా నలుగురు దేవతలు ఉన్నారు. వారిలో ముగ్గురు ఇల, సరస్వతి, సరమ అనే దేవతలు ప్రఖ్యాతి గల వారు. వారిలో నాలుగవ దేవత దక్షిణా దేవి అని నేను ప్రతిపాదిస్తున్నాను. ఇల సత్యదర్శనానికి, లేదా అంతఃప్రకాశనానికి ప్రతీక. సరస్వతి సత్య శృతికి, స్ఫూర్తికి, దివ్యవాణికి ప్రతీక. సరమ లోజ్ఞానానికి ప్రతీక. ఇక దక్షిణ విభాజకమైన, లోజ్ఞానాత్మకమైన విచక్షణకి ప్రతీక. కాబట్టి దక్ష అంటే విచక్షణ – అది మనోతలంలో వ్యక్తమయ్యే మానసిక విచక్షణ కావచ్చు, లేదా ఋత తలానికి చెందిన లోజ్ఞానాత్మకమైన విచక్షణ కావచ్చు.

ఇంతవరకు మనం పరిశీలించిన మూడు ఋక్కులు ఒక సూక్తానికి చివర్లో వస్తాయి. అందులో మొదటి మూడు వాయు దేవుణ్ణి మాత్రమే అనన్యంగా వర్ణిస్తాయి, తదుపరి మూడు ఇంద్రుణ్ణి, వాయు దేవుణ్ణి కలిపి వర్ణిస్తాయి. ఋక్కుల యొక్క అధ్యాత్మిక అన్వయం ప్రకారం ఇంద్రుడు మనోబలానికి ప్రతీక అని ముందు ముందు చూస్తాము. ఇంద్రియాలకి ఆ పేరు ఆ దేవుడి నుండే వచ్చింది. అతడి ప్రత్యేక లోకం స్వర్లోకం. సూర, సూర్య తదితర శబ్దాలకి సన్నిహితంగా ఉన్న ఈ 'స్వర్' అనే పదానికి సూర్యుడు, లేదా ప్రకాశవంతమైన అనే అర్థం వస్తుంది. వైదిక 'వ్యాహృతుల'లో అంటే, వైదిక లోకాలలో మూడవది అయిన ఈ లోకం నిర్మలమైన, నిరంధకారమైన మానసానికి ప్రతీక. ఋతానికి చెందిన ప్రకాశం మనస్సు మీద ప్రసరించినప్పుడు ఏర్పడే ప్రకాశానికి చిహ్నం సూర్యుడు; స్వర్లోకం అంటే ఆ ప్రకాశాన్ని నేరుగా స్వీకరించగల మనో చైతన్యానికి పేరు. ఇక వాయువు అంటే అది ప్రాణశక్తితోను, జీవశక్తితో ముడిపడి వున్న తత్వం. మానసిక శక్తులకి ఎలాగైతే ఇంద్రుడు ఆలంబనగా ఉన్నాడో, ఆ మానసిక శక్తులకి ఆధారభూతమైన నాడీజన్య వృత్తులని వాయుదేవుడు శాసిస్తాడు. ఈ ఇరువురు దేవతల ప్రభావంతోనే మనిషి యొక్క సామాన్య మనోవృత్తి జరుగుతుంది. ఋక్కులో ఈ ఇరువురు దేవతలని వచ్చి సోమపానం చెయ్యమని ఆహ్వానిస్తారు. ఈ సోమరసం ఆనందాతిరేకానికి ప్రతీక. ఇందుకు ఆధారాలు వేదంలో పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా తొమ్మిదవ మండలంలో నూరు పైగా ఋక్కులు సోమదేవుణ్ణి స్తుతిస్తాయి. అతిమానస చైతన్యం నుండి సత్యం లేదా ఋతం ద్వార మనస్సులోకి ప్రవేశించిన ఆనందానికి ప్రతీక ఈ సోమదేవుడు. ఈ అన్వయాలని స్వీకరిస్తే మొత్తం ఋక్కు యొక్క అన్వయాన్ని సులభంగా వశం చేసుకోవచ్చు.

సోమరసపు ప్రవాహ ప్రభావం వల్ల చైతన్యంలో ఇంద్రుడు, వాయువు మేల్కొంటారు. అంటే పై నుండి దిగి వచ్చే అమరత్వపు హ్లాదం యొక్క, ఆనందం యొక్క, అమృతం యొక్క ప్రభావం వల్ల మానవ మనస్తత్వంలో కలిసి పని చేసే మనోశక్తి, ప్రాణశక్తులు మేలుకొంటాయి. తమ మానసిక, ప్రాణ శక్తుల పూర్ణత్వంలోకి వాళ్లు ఆ ఆనందస్రవంతిని ప్రవహించనిస్తారు - *చేతథః సుతానాం వాజినీవసూ*. అలా స్వీకరించబడ్డ ఆనందం మర్త్య ప్రపంచంలోకి అమర చైతన్యపు ఆగమనానికి రంగం సిద్ధం చేస్తుంది. ఆ క్రొంగొత్త కర్మధారలో పాల్గొనమని ఇంద్రుడు, వాయువు ఆహ్వానించబడతారు. ధీశక్తి సహాయంతో ఆ ప్రయత్నాన్ని వేగంగా పరిపూర్ణం గావించమని ఆదేశించబడతారు - *ఆ యాతం ఉపనిష్కృతం మక్షూ ధియా*. ఎందుకంటే ధీ అంటే మరి ఆలోచనాశక్తి, ధీశక్తి, అవగాహనాశక్తి. ఇంద్ర, వాయువులు ప్రతీకలుగా నిలిచిన సామాన్య మనస్తత్వానికి, ఋతం లేదా సత్య చైతన్యానికి మధ్య వంతెనలా నిలుస్తుందా ధీశక్తి.

సరిగ్గా ఈ దశలోనే వరుణుడు, మిత్రుడు ప్రవేశిస్తారు. వారి ప్రమేయంతో మనం పరిశీలిస్తున్న వేద భాగం మొదలవుతుంది. అధ్యాత్మిక అన్వయం సహాయం లేకుండా సూక్తం యొక్క మొదలుకి, కొసకి మధ్య సంబంధం అర్థం కాదు. అలాగే వరుణ – మిత్రుల జంట మధ్య గాని, ఇంద్ర – వాయువుల జంట మధ్య గాని సంబంధం అర్థం కాదు. ఆ అన్వయంతో ఈ రెండు సంబంధాలు తేటతెల్లం అవుతాయి. నిజానికి ఆ రెండు సంబంధాలు ఒక దాని మీద ఒకటి ఆధారపడతాయి. సూక్తం యొక్క తొలి భాగంలో వాయువు ప్రతీకగా ఉన్న ప్రాణశక్తుల సంసిద్ధత గురించి చెప్పబడుతుంది. మొదటి మూడు ఋక్కుల లోను వాయువు యొక్క ఆవాహన కనిపిస్తుంది. ఆ తరువాత మానవ మానసిక ప్రవృత్తి మీద సత్య చైతన్యం యొక్క ప్రభావానికి ప్రతీక అయిన ఇంద్ర – వాయువుల గురించి చెప్పబడుతుంది; ఇక చివర్లో మానసిక ప్రవృత్తి మీద సత్యం యొక్క ప్రభావం గురించి, ఆ ప్రభావం చేత ధీశక్తి పరిపూర్ణం కావడం గురించి, ఆ ధీశక్తి యొక్క వృత్తి విస్తరించి వృద్ధి చెందడం గురించి చెప్పబడుతుంది.

మనిషి మనస్సు మీద, ప్రవృత్తి మీద సత్యం యొక్క చర్యకి ప్రతీకలుగా నిలిచిన నలుగురు దేవతలలో ఇరువురు వరుణ మిత్రులు.

వేదం యొక్క శైలి ప్రకారం, ఒక భావతరంగాన్ని వదిలి నుండి మరో భావతరంగంలోకి ప్రవేశిస్తున్నప్పుడు, ఆ మార్పుని సూచిస్తూ మొదటి భావతరంగం ఆఖర్లో కనిపించిన ఒక ముఖ్యమైన పదాన్ని రెండవ భావతరంగంలో పలు మార్లు వాడడం జరుగుతుంది. ఈ 'ప్రతిధ్వని సూత్రం' యొక్క ప్రయోగం ఋక్కులు అన్నిట్లో తరచు కనిపిస్తుంది. ఋషులందరూ ఈ విధానాన్ని వాడారు. ఈ సందర్భంలో ఆ సంధి శబ్దం 'ధీ' – అంటే ఆలోచన లేదా బుద్ధి. 'ధీ' అనే శబ్దానికి మరింత సామాన్యమైన 'మతి' అనే శబ్దానికి మధ్య తేడా వుంది. 'మతి' అంటే మరింత సామాన్యమైన మనస్తత్వం, లేదా మానసిక చర్య. ఇది కొన్ని సార్లు ఆలోచనని, ఇంకొన్ని సార్లు తలంపుని, మరి కొన్ని సార్లు మొత్తం మానసిక స్థితిని సూచిస్తుంది. ధీ అంటే బుద్ధిబలం; ఆ అవగాహనా శక్తి తన వద్దకి వచ్చిన అంశాలు అన్నిటినీ తీరుగా సమీకరించి, నిర్వచించి, అన్నిటినీ తమ నిజస్థానాలలో నిలుపుతుంది. ఎన్నో సార్లు ధీ అంటే బుద్ధి యొక్క, లేదా ఒక ప్రత్యేక ఆలోచన యొక్క, లేదా ఆలోచనల యొక్క చర్యని సూచిస్తుంది. ఆలోచన చేతనే ఇంద్రుణ్ణి, వరుణుణ్ణి ప్రాణిక మనస్తత్వాన్ని మార్చమని ఆవాహన చెయ్యడం జరుగుతుంది – నిష్కృతం ధియా. కాని ఆలోచన అనే ఈ సాధనాన్ని పరిపూర్ణం చెయ్యాలి, పునీతం చెయ్యాలి, దానికి పదును పెట్టాలి. అప్పుడే మనస్సు సత్య చైతన్యంతో సంబంధాన్ని ఏర్పరచుకోగలుగుతుంది. ఆ లక్ష్యం కోసమే సత్య శక్తులైన వరుణ, మిత్రులని ఆవాహన చెయ్యడం జరుగుతుంది. *ధియం ఘృతాచీం సాధంతా* – "విమల విరాజిత చింతనని సాధించు."

'ఘృత' అనే పదం అనే పదం వేదంలో ప్రయోగించబడడం ఇదే మొదటి సారి. విశేషణాత్మక రూపంలో అది ప్రయోగించబడింది. ఇక్కడ ఆ పదం ధీ అనే పదానికి పర్యాయపదంగా వాడబడడం విశేషం. వేదంలో వేరే చోట్ల ఆ పదాన్ని మనస్, మనీషా తదితర పదాలతో అనుబంధంగానో, లేదా మనోవృత్తిని సూచించడం కోసమో వాడడం జరిగింది. ఘృ అనే శబ్దం మండువేసవినో, ప్రచండాగ్నినో తలపించే తీక్షణమైన ప్రకాశాన్ని, తాపాన్ని సూచిస్తుంది.

దానికి చిలకరించడం, అలమడం అనే అర్థం కూడా వుంది (గ్రీకు పదం *క్రియో* అటువంటిదే). అది ఎలాంటి ద్రవాన్ని అయినా సూచిస్తుంది. ముఖ్యంగా చిక్కని, ప్రకాశవంతమైన ద్రవాన్ని సూచిస్తుంది. ఘృతానికి గల ఈ ద్వంద్వార్థాన్ని వేద ఋషులు అద్భుతంగా వాడుకున్నారు. బయటికి మాత్రం ఆ పదంతో హోమంలో పోసే నేయిని సూచిస్తూ, లోపల మాత్రం విరాజమాన చింతనకి ఆధారంగా నిలిచే నిండైన, తేజోవంతమైన మనోస్థితిని, మేధని, ఆ పదంతో సూచించారు. కాబట్టి *ధియం ఘృతాచీం* అంటే ధగధగ వెలిగే మనోవృత్తితో పూర్ణమైన మేధ అన్న మాట.

బుద్ధిలో ఈ విధమైన స్థితిని పరిపూర్ణం చేసే వరుణ, మిత్రులని పేరు చేసే రెండు లక్షణాలు ఉన్నాయి. మిత్రుడు పూతదక్షుడు, పరిశుద్ధమైన వివేచన గలవాడు; వరుణుడు రిశాదసుడు, శత్రువులని నిర్జించేవాడు. వేదంలో ఎక్కడా కేవలం అలంకారప్రాయమైన స్తుతివాక్యాలు ఉండవు. ప్రతీ పదానికి ఒక కచ్చితమైన ప్రయోజనం ఉంటుంది. ఆ పదం వున్న వాక్యంతోను, దాని నేపథ్యంలో ఉండే భావధారతోను ఆ పదానికి కచ్చితమైన సంబంధం ఉంటుంది. సత్య చైతన్యానికి బుద్ధి పరిపూర్ణంగా, ప్రకాశవంతంగా అద్దం పట్టాలంటే అందుకు రెండు అవరోధాలు ఉన్నాయి. మొదటిది విచక్షణలో, వివేచనలో మాలిన్యం. దీని వల్ల సత్యం యొక్క గ్రహింపులో గందరగోళం ఏర్పడుతుంది. సత్యం ఎప్పుడూ అసంఖ్యాకమైన భావసామరస్యాల చేత, భావసంధుల చేత పరిపూర్ణంగా వ్యక్తం గావించబడి, వృద్ధి చెందుతుంది. అలా సత్యం యొక్క వృద్ధికి అడ్డుపడే శక్తులే రెండవ జాతి అవరోధాలు. వేదంలో ఎలాగైతే దేవతలంతా సత్యచైతన్యం నుండి దిగి వచ్చి విశ్వసామరస్యాలని తీర్చిదిద్ది, మనిషి యొక్క ప్రగతిశీలమైన వృద్ధికి దన్నుగా నిలిచే చైత్యశక్తులో, ఆ లక్ష్యాలకి అడ్డుపడుతూ పని చేసే విరోధ శక్తులని దస్యులు, వృత్రులు ఇలా పలు పేర్లతో పిలుస్తారు. ఈ శక్తులు దేవతల పనిని పాడుచేస్తాయి, వారి వరాలకి అడ్డుపడతాయి, వారి గతిని పరిమితం చేస్తాయి. వేదంలో వరుణుడు ఎప్పుడూ విశాలతకి, విమలతకి పేల్పుగా ప్రదర్శించబడతాడు; కాబట్టి మనిషిలో అతడు ఒక సచేతన శక్తిగా కొలువై ఉన్నపుడు, మనిషి గతిలో పాపాన్ని, పతనాన్ని, పంకిలాన్ని ప్రవేశపెట్టే బలాలని వరుణుడు జయిస్తాడు. అతడు రిశాదసుడు, వృద్ధికి అడ్డుపడే శత్రువుని జయిస్తాడు. వరుణుడి లాగానే మిత్రుడు

కూడా సత్యానికి, తేజానికి చెందిన శక్తి. ముఖ్యంగా వైదిక మయస్సుకి పునాదులైన ప్రేమ, ఆనందం, సామరస్యాలకి అతడు ప్రతీక. వరుణుడి విమలతతో కలిసి పని చేస్తూ ఆ విమలతకి పదునైన వివేచనని ప్రసాదిస్తాడు. నానా రకాల అపశ్రుతులని, అయోమయాలని రుపుమాపి, ధృవమైన, ద్యుతిపూర్ణమైన మేధోవృత్తికి బాటలు వేస్తాడు.

ఇలాంటి పురోగతి వల్ల సత్య చైతన్యం లేదా ఋతం మానవ మనస్తత్వం మీద పని చేయగలుగుతుంది. ఋతం యొక్క ప్రభావాన్ని సాధనంగా వాడుతూ (*ఋతేన*), మనిషిలో సత్యం యొక్క కర్మధార వృద్ధి చేస్తూ (*ఋతావృధా*), మనోచైతన్యం సత్య చైతన్యాన్ని స్పృశించగలిగేలా (*ఋతస్పృశా*), వశం చేసుకోగలిగేలా పాటుపడుతూ, మిత్ర వరుణులు బృహత్తరమైన ఇచ్ఛాశక్తిని ప్రసరిస్తూ ఆనందిస్తారు (*క్రతుం బృహంతం ఆశాథే*). ఆంతరికమైన ఆత్మసమర్పణ యొక్క వాహనం సంకల్పం. అయితే ఆ సంకల్పం సత్యంతో సామరస్యమై ఉంటుంది. పరిపూతమైన వివేచన యొక్క కనుసన్నలలో నడుస్తుంది. సత్య చైతన్యం యొక్క బృహత్తులోకి సంకల్పం ఇంకా ఇంకా లోతుగా ప్రవేశిస్తున్న కొద్ది, అసలు ఆ సంకల్పమే ఇంకా ఇంకా విస్తారమై, బృహత్తరమవుతుంది. దాని దృష్టికి అడ్డుపడే కంటి నఘాలు కరిగిపోతాయి. పనికి అడ్డుపడే అడ్డంకులు ఎగిరిపోతాయి. ఎలాంటి ఎల్లలుగాని, అవరోధాలు గాని లేని పరమవిశాలతలో అది పని చేస్తుంది (*ఉరావ్ అనిబాధే*).

ఆ విధంగా వేద ఋషులు సదా ప్రాధాన్యత నిచ్చే తేజం, శక్తి అనే రెండు ఆవశ్యకతలు సాధించబడతాయి. మొదటిది జ్ఞానపూర్వకంగా పని చేసే సత్యం యొక్క తేజం (*ధియం ఘృతాచీం*). రెండవది సఫలమైన, స్వప్రకాశమైన సంకల్పంతో పని చేసే సత్యం యొక్క బలం (*క్రతుం బృహంతం*). సూక్తం యొక్క ఆఖరు శ్లోకం మిత్ర, వరుణుల పూర్ణ సత్యాన్ని వెల్లడి చేస్తుంది (*కవీ తువిజాతా ఉరుక్షయా*). కవి అంటే సత్య చైతన్యాన్ని సాధించి దాని సహజ లక్షణాలైన దృష్టి, స్ఫూర్తి, లోజ్ఞానం, వివేచనలని కలిగిన వాడని అంతకు ముందే తెలుసుకున్నాం. *తువిజాత* అంటే “అనేకమైన జన్మ కలిగిన” అని అర్థం. *తువి* అనే శబ్దానికి తొలి అర్థం శక్తి లేదా బలం. ఫ్రెంచ్ భాషలో “force” అనే పదానికి అనేకం అనే అర్థం కూడా వుంది. కాని వేదంలో దేవతల పుట్టుక అంటే ఎప్పుడూ వారి అభివ్యక్తీకరణ అని అర్థం. కాబట్టి

“తువిజాత” అంటే “అనేకవిధమైన అభివ్యక్తీకరణ.” నానా రూపాలలో, వృత్తులలో అభివ్యకం కావడం. *ఉరుక్షయ* అంటే బృహత్తులో వసించడం. ఈ భావన ఋక్కులలో పదే పదే ఎదురవుతుంది. *ఉరు* అంటే బృహత్తుకి తుల్యమైన పదం. అది సత్య చైతన్యం యొక్క ఎల్లలు లేని స్వేచ్ఛని సూచిస్తుంది. ఋతం యొక్క వర్ధమాన చర్యల వల్ల మనిషిలో విశాలత, విమలత, ఆనంద, సామరస్యాల అభివ్యక్తీకరణ జరుగుతుంది. ఆ అభివ్యక్తీకరణ అనంత కోటి రూపాలు తీసుకుంటుంది. అది ఋతం యొక్క విశాలతలో స్థిరమై ఉంటుంది. అతిమానస చైతన్య శక్తులని ప్రయోగిస్తుంది.

సత్యశక్తుల ఈ అభివ్యక్తీకరణ వివేచనకి అనుగుణంగానే జరుగుతుంది – *దక్షం దధాతే అపసం.* శుద్ధి గావించబడి, సమర్థించబడ్డ ఈ వివేచన సత్యభావనకి అనుగుణంగా, సత్యం యొక్క శక్తిగా పని చేస్తుంది. ఇంద్ర, వాయువుల వృత్తులని పరిపూర్ణం గావిస్తుంది. కర్మలలో దోషాన్ని తొలగించి, చింతనలో సందేహాలని దీర్చి, సంకల్పాన్ని బలపరిచి ఫలితాలని సఫలం చేస్తుంది.

ఈ అన్వయాన్ని సమర్థించడం కోసం నాల్గవ మండలం లోని, పదవ సూక్తంలోని ఒక ఋక్కుని పరిశీలిద్దాము.

అదా హ్యగ్నే క్రతుర్ భద్రస్య దక్షస్య సాధోః ।

రథీర్ ఋతస్య బృహతో భభూత ॥

“కావున ఓ అగ్నీ! నీవు ఆనందకరమైన సంకల్పానికి, పరిపూర్ణకరమైన వివేచనకి, బృహత్తు అయిన సత్యానికి రథశారథివి!” మొదటి మండలంలోని, మొదటి ఋక్కులో కూడా మనకి అదే భావన ఎదురవుతుంది. సత్య చైతన్యం యొక్క స్వభావం సమర్థవంతమైన సంకల్పం – *కవిక్రతుః.* ఆనందమయ స్థితిలో ఆ సంకల్పం శుభాన్ని (*భద్రం*) సాధిస్తుంది. ‘*దక్షస్య సాధోః*’ అనే పదయుగళంలో, రెండవ ఋక్కు యొక్క ఆఖర్లో వచ్చే ‘*దక్షం అపసం*’ అనే పదయుగళానికి మారురూపమే కాక వివరణ కూడా కనిపిస్తుంది. ఆ రెండు పదాల జంటలు మానవుడి అంతర్యంలో పని చేస్తూ పరిపూర్ణతని సాధించే వివేచనని సూచిస్తున్నాయి. శక్తి, జ్ఞానాల యొక్క, సంకల్పం (*క్రతు*), వివేచన (*దక్ష*) ల యొక్క వృత్తుల యొక్క చరమ

ఫలితంగా బృహత్తర సత్యాన్ని చేరుకోవడం జరుగుతుంది. ఆ విధంగా అవే పదాలని, అవే భావాలని, భావాల మధ్య సంబంధాలని పదే పదే ప్రస్తావిస్తూ వేద ఋక్కులు ఒకదాన్నొకటి సమర్ధించుకుంటూ ఉంటాయి. వేదం మొత్తానికి పునాదిగా నిలిచే భావజాలమే లేకపోతే ఇది సాధ్యం కాదు. కవి, క్రతు, దక్ష, భద్రం, ఋతం తదితర పదాలన్నీ ఆ మౌలిక భావాలని తెలిపే శబ్దాలు. ఋక్కులలోనే నిక్షిప్తమైన ఆధారాలన్నీ ఈ పదాలకి అర్ధం అధ్యాత్మికమైనదని తేటతెల్లం చేస్తున్నాయి. లేకుంటే ఆ పదాలు వాటి స్థిరమైన అర్ధాన్ని కోల్పోతాయి. వాటి మధ్య ఉన్న కచ్చితమైన సంబంధాలు అర్ధం కావు. పదే పదే వచ్చే వాటి ప్రస్తావనలోని ప్రయోజనం కనిపించదు.

ఇక రెండవ ఋక్కులో కూడా మొదటి ఋక్కులో ఉండే మౌలిక భావనలు మళ్లీ కనిపిస్తాయి. క్రమంగా పరిపూర్ణమవుతున్న మానవ మనస్తత్వం అతిమానస చైతన్యం లేదా సత్య చైతన్యం దిశగా పురోగమిస్తోంది అన్న కేంద్ర భావన మీదనే వైదిక బోధన అంతా స్థాపించబడి వుంది. మొదటి సూక్తంలో అలాంటి పురోగతి యజ్ఞం యొక్క లక్ష్యం అని, అదే అగ్ని యొక్క సహజ లక్షణం అని చెప్పబడుతుంది. ఇక రెండవ ఋక్కు ఇంద్ర వాయువులు, మిత్ర వరుణులు మానవ చేతన ఆ లక్ష్య సాధన కోసం సంసిద్ధం చేసే క్రమాన్ని వర్ణిస్తుంది. ఆనంద ప్రభావం చేత, ప్రవర్ధమానమైన సత్యం యొక్క ప్రభావం చేత సాధారణ మానవ చేతన సంస్కరింబడే తీరుని వర్ణిస్తుంది.

వేదంలో రెండు కేంద్ర భావాలు పదే పదే కనిపిస్తాయి. మొదటిది మనిషి మనస్సుని, దేహాన్ని సంస్కరించడం. రెండవది సత్య, ఆనందాల ప్రాప్తి చేత మనిషిలో భగవత్ తత్వం యొక్క, అమరత్వం యొక్క సాఫల్యం కలగడం. వేదంలో ఈ భావయుగళపు లహరులే లయబద్ధంగా సర్వత్రా ప్రవహిస్తూ ఉంటాయి.

అధ్యాయం 8

అశ్వినులు – ఇంద్రుడు – విశ్వదేవులు

మధుచ్ఛందుడి మూడవ సూక్తం కూడా సోమ యజ్ఞాన్నే వర్ణిస్తుంది. అంతకు ముందు రెండవ సూక్తంలో ఉన్నట్లు గానే మూడేసి శ్లోకాలు కలిసి వస్తాయి. వాటిలో మొదటిది అశ్వినులని, రెండవది ఇంద్రుణ్ణి, మూడవది విశ్వదేవులని, నాల్గవది సరస్వతిని వర్ణిస్తాయి. ఈ సూక్తంలో కూడా ఆఖర్లో సరస్వతిని ఆవాహన చెయ్యడం జరుగుతుంది. అందులోని అధ్యాత్మిక అంతర్యం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. లోగడ వేదరహస్యాన్ని విప్పి చెప్పిన శ్లోకాల కన్నా ఇందులోని అర్థం తేటతెల్లంగా ఉంటుంది.

అయితే ఈ సూక్తం మొత్తంలో ఎన్నో అధ్యాత్మిక సూచనలు కనిపిస్తాయి. ఈ సూచనలకి, వేదఋషుల ప్రకారం మానవాత్మ యొక్క మూడు ప్రధాన లక్ష్యాలకి మధ్య లోతైన సంబంధం కనిపిస్తుంది. ఆ మూడు ప్రధాన లక్ష్యాలలో మొదటిది చింతన, దాని విజయాల వల్ల కలిగే అద్భుత అంతఃప్రకాశనాలు. రెండవది కర్మ, సకలాభీష్టాలని సాధించగల దాని సర్వశక్తత. మూడవది ఆనందం, దాని పరమోత్కృష్టమైన ఆత్మిక పారవశ్యాలు. ఈ మూడు లక్ష్యాల మధ్య సన్నిహిత సంబంధాన్నే కాక ఏకత్వాన్ని పొడచూశారు వేద ఋషులు. మన భావ-

కర్మ దివ్యం అయ్యిందంటే ఆ మూడు తత్వాల మధ్య ఏకత్వం బట్టబయలు అవుతుంది. అలా ముందుకు సాగుతుంటే ఆ మూడు తత్వాల సమైక్య చలనం మరింత పరిపాకం చెందుతుంది. గోవు, అశ్వం, సోమ రసం – ఈ మూడు ఈ త్రివిధ యజ్ఞానికి ప్రతీకలు. గోవు నుండి పుట్టే ఘృతం యొక్క సమర్పణ, అశ్వం యొక్క సమర్పణ (అశ్వమేధం), సోమరసం యొక్క సమర్పణ – ఈ మూడు ఆ యజ్ఞం యొక్క ప్రధాన రూపాలు లేక అంశాలు. ఇక చివరిగా అంత ప్రధానం కాకపోయినా అన్నపు ముద్ద యొక్క సమర్పణ కూడా వుంది. అది దేహానికి, లేదా పదార్థానికి ప్రతీక కావచ్చు.

అశ్వారూఢులైన అశ్వినీ దేవతల జంట యొక్క ఆవాహనతో మొదలుపెడదాము. మధ్యధరా ప్రాంత పౌరాణిక గాధలకి చెందిన కాస్టర్, పాలీడ్యూసస్ దేవతలతో వీరిని పోల్చుకోవచ్చు. తులనాత్మకంగా పురాణాలని అధ్యయనం చేసేవారు ఈ దేవతాద్వయాన్ని ఆకాశంలో కనిపించే రెండు తారలతో పోల్చుతారు. దివిసీమని అలంకరించే తారామణుల అందరిలోకి ప్రాచీన ఆర్యులు ఈ ఇరువురికి ప్రత్యేకమైన ప్రాధాన్యత నిచ్చారు. మనం అధ్యయనం చేస్తున్న సూక్తంలో వారు ఇరువురిని ఎలా వర్ణిస్తున్నారో చూద్దాం. “అశ్వినులు! వేగవంతులు, విలాసవంతులు, అమితానందమయులు.” (*ద్రవత్పాణి శుభస్పతి పురుభుజా”*) *రత్న, చంద్ర* తదితర పదాలకి మల్లె, *శుభ* అనే పదం కూడా తేజాన్ని గాని, ఆనందాన్ని గాని సూచించగలదు. కాని ఈ సందర్భంలో అది ‘అమితానందమయ’ (*పురుభుజా*) అనే విశేషణంతో పాటు, “ఆనందాన్ని గ్రోలు” అనే క్రియావాచకంతో (*‘చనస్యతం’*) పాటు వస్తుంది. కాబట్టి దాన్ని ఆనందం లేదా సమృద్ధి అనే అర్థంలో తీసుకోవచ్చు.

ఆ తరువాత ఆ దేవతా ద్వయాన్ని “అశ్వినులు, దివ్యాత్ములు, బహుళకర్ములు, ఆలోచనాధరులు” అంటూ వర్ణిస్తారు. “శక్తివంతమైన ఆలోచనతో” వాళ్లు మంత్రోక్తిని స్వీకరించి, ప్రీతి చెందుతారు అని కూడా చెప్పబడింది. “*పురుదంససు నరా శవీరయా ధియా ధిష్ణ్యా.*” వేదంలో నృ అనే శబ్దం కేవలం మనిషికే కాదు, దేవతలకి, మానవులకి కూడా వర్తిస్తుంది. మొదట్లో ఆ శబ్దాన్ని శక్తివంతమైన, సక్రియమైన అనే అర్థంలో వాడేవారని

అనుకుంటాను. క్రమేపీ అది పురుషుడు అనే అర్థాన్ని తీసుకుంది. మగ దేవతలకి, సక్రియులైన దివ్యాత్ములకి, దివ్యబలాలకి (పురుషస్) ఆ పదాన్ని వర్తింపజేయడం జరిగింది. అందుకు భిన్నంగా ఆ దేవతల శక్తులైన స్త్రీమూర్తులని '*గ్నా*' అనే శబ్దంతో సూచించారు. ఋషుల చిత్తంలో ఆ భావం ఇంకా స్థిరంగా మిలిగిపోయినట్టు కనిపిస్తుంది. ఉదాహరణకి *నృమ్ణ* అంటే బలం, *నృతమ నృణాం* అంటే అతిశక్తివంతమైన దివ్యశక్తులు. అలాగే "*శవస్*" అనే పదం, దాని విశేషణం అయిన "*శవీర*" అనే పదం కూడా శక్తి అనే భావనని తలపించినా, ఎప్పుడూ జ్వాల, లేదా కాంతి అనే భావనకి అనుబంధంగానే దాన్ని ప్రయోగించారు. కాబట్టి "*శవీర*" అనే పదాన్ని "*ధీ*" (బుద్ధి)కి, ప్రచండ కాంతులు విరజిమ్మే ఆలోచనా శక్తికి, సరైన ప్రతీకగా తీసుకోవచ్చు. "*ధిష్ణ్యా*" అనే పదానికి "*ధిషణా*" అనే పదంతో సంబంధం వుంది. వాటి అర్థం ధీశక్తి. దాన్ని శాయణుడు "*బుద్ధిమంతౌ*" అంటే బుద్ధిమంతుడు అనే అర్థంలో అన్వయిస్తాడు.

అలాగే అశ్వినులని "పనిలో సమర్థులు, సంచలిత శక్తులు, మహోగ్ర వేగవంతులు" ("*దస్రా నాసత్యా రుద్రవర్తానీ*") అంటూ వేదం వర్ణిస్తుంది. "*దస్ర*", "*దస్మ*" అనే వైదిక విషేషణాలని సాయణుడు కాస్త నిర్లక్ష్యంగా "వినాశకమైన" అనో లేక "సుందరమైన" అనో లేక "సమృద్ధమైన" అనో తన మనసుకి తోచినట్టు అనువదిస్తాడు. ఆ పదాలని నేను "*దస్*" అనే మూలశబ్దంతో ముడిపెడతాను. ఆ శబ్దాన్ని నేను కోయడం, విభజించడం అనే అర్థంలో తీసుకోవడం లేదు. అలా తీసుకున్నట్లయితే నాశనం చెయ్యడం, పంచడం అనే అర్థాలు ఉత్పన్నం అవుతాయి. అలాగే 'వివేచన చెయ్యడం, చూడడం' అనే అర్థంలో కూడా తీసుకోవడం లేదు. దీన్ని తీసుకుంటే సాయణుడు ఇచ్చిన "సుందరమైన", దర్శనీయమైన అనే అర్థం వస్తుంది. అందుకు భిన్నంగా చెయ్యడం, రూపుదిద్దడం, సాధించడం అనే అర్థంలో నేను తీసుకుంటున్నాను. రెండవ ఋక్కులో "*పురుదంససా*" అనే పదం ఇటువంటిదే. "*నాసత్య*" అనేది పైత్రుక నామము అని కొందరు అభిప్రాయ పడతారు; పాత కాలపు వైయాకరణులు ఆ పదానికి "నిజం, అబద్ధం కాదు" అనే కృతకమైన అర్థాన్ని ఆపాదించారు. కాని నేను "*నస్*" అంటే కదలడం అనే అర్థాన్ని స్వీకరిస్తున్నాను. అశ్వినులు అశ్వపతులు అని మనం గుర్తుంచుకోవాలి. చలనాన్ని వర్ణించే విశేషణాలతో వారిని వర్ణిస్తుంది వేదం.

“వేగపాదులు”, “మహోగ్ర వేగవంతులు” మొదలైన పదాలతో వారిని వర్ణిస్తారు. గ్రీకోలాటిన్ పౌరాణిక సాంప్రదాయంలో కాస్టర్, పోలక్స్ దేవతలు సముద్రయానం చేసే నావికులని తుఫానుల నుండి, పడవమునకల నుండి రక్షిస్తారు. అదే విధంగా అశ్వినులు ఋషులని నౌకలో భద్రంగా గొనిపోతారని, నడిసంద్రంలో వారిని మునగకుండా కాపాడతారని వేదం చెప్తుంది. కాబట్టి “*నాసత్యా*” అంటే నౌకా యానాన్ని, యాత్రని శాసించే దేవతలు, చలనాన్ని నియంత్రించే బలాలు అనుకోవచ్చు. అలాగే “*రుద్రవర్తాని*” అనే పదాన్ని ఆధునిక పండితులు “ఎర్రని బాటలో నడిచే” అనే అర్థంలో అనువదించారు. ఇది తారలకి సరిగ్గా సరిపోతుందని వాదన. ఇలాంటిదే మరో పదం కూడా ఉంది – “*హిరణ్యవర్తని*” - అంటే బంగారు లేక మెరిసే బాట గల అని అర్థం. “*రుద్ర*” అనే పదానికి ఒకప్పుడు “మెరిసే, చిక్కని రంగు గల, ఎర్రని” మొదలైన అర్థాలు ఉండొచ్చు గాక. ఉదాహరణకి “*రుష్*”, “*రుశ్*”, “*రుధిర*” (రక్తం, ఎర్రని), మొదలైన పదాలు చెప్పుకోవచ్చు. ఇక లాటిన్ శబ్దాలు రూబర్ (ruber), రూటిలస్ (rutilus), రూఫస్ (rufus) మొదలైన వన్నీ ఎరుపుని సూచించే పదాలే. అలాగే దివిని, భువిని రెండిటినీ సూచించే ద్వంద్వార్థం గల వైదిక పదం “*రోదసి*” ని తీసుకుందాం. దీన్ని కూడా దివిని, భువిని సూచించే “రజస్”, “రోచన” తదితర పదాలకి మల్లె, “మెరిసే” అనే అర్థంలో తీసుకోవచ్చు. అయితే మరో విషయం ఏమిటంటే ఈ కోవకి చెందిన పదాలలోను, వాటి నుండి ఉత్పన్నమైన మెరెన్నో పదాలలో కూడా, గాయం, హింస అనే భావం తరచు అంతర్లీనంగా కనిపిస్తుంది. ఇక “రుద్ర” అనే పదానికి “ఎరుపు” అనే అర్థాన్ని ఎలా తీసుకోవచ్చో, “ఉగ్రమైన,” “హింసాత్మకమైన” అనే అర్థాన్ని కూడా తీసుకోవచ్చు. అశ్వినులని “హిరణ్యవర్తనీ” అనే కాక “రుద్రవర్తనీ” అని కూడా వర్ణిస్తారు. అంటే వాళ్లు కాంతిశక్తి మాత్రమే కాక ప్రాణశక్తి సంభూతులు కూడా అని అర్థం చేసుకోవచ్చు. మొదటి అర్థం ప్రకారం వాళ్లు ప్రచండ హిరణ్మయ వేగం కలవారు. రెండవ అర్థం ప్రకారం వాళ్లు మహోగ్ర చలనం కలవారు. ఒక ఋక్కులో (V.75.3) ఈ రెండు వర్ణనలూ కలుస్తాయి – “రుద్రా హిరణ్యవర్తనీ.” మహోగ్రంగా కాంతిబాటల వెంట కదిలేవారు. కాబట్టి ఈ పదాలని తారల పరంగా అన్వయిస్తూ, తారలు ఎర్రనివే గాని బంగారు బాటల వెంట కదులుతున్నాయి అని అన్వయిస్తే, అర్థం అనర్థానికి దారితీస్తుందని వేరే చెప్పనక్కర్లేదు.

ఆ విధంగా ఆకాశంలో మెరిసే ఇరు చిరు తారలకి ఈ మూడు శ్లోకాల్లో ఎన్నో అసాధారణమైన అధ్యాత్మిక క్రియలు ఆపాదించబడ్డాయి. అశ్వినుల భౌతిక మూలం ఇదే అయితే, గ్రీకు పురాణంలో జరిగినట్లు గానే వాళ్లు తమ నక్షత్ర తత్వాన్ని ఎప్పుడో పోగొట్టుకున్నారు; ఉదయానికి దేవత అయిన ఎథీనా దేవతకి మల్లె వాళ్లు ఒక అధ్యాత్మిక ప్రయోజనాన్ని, లక్షణాన్ని సంతరించుకున్నారు. అశ్వినులు అశ్వారూఢులు. అశ్వం జీవశక్తికి, ప్రాణశక్తికి చిహ్నం. వారు ఇద్దరికీ సామాన్య లక్షణం ఏమిటంటే వాళ్లు ప్రీతికి అధిష్ఠాన దేవతలు, మధువు కోసం గాలించే మధుసాధకులు. వాళ్లు వైద్యులు – వృద్ధాప్యం ఉన్న చోట యవ్వనాన్ని, అనారోగ్యం ఉన్నచోట ఆరోగ్యాన్ని, అనాకారం ఉన్నచోట సుందరాకృతిని ప్రతిక్షేపిస్తారు. వారి మరో లక్షణం చలనం – సువేగమైన, ఉధృతమైన, ఉగ్రమైన, ఎదురులేని చలనం. వారి అద్భుతమైన, అజేయమైన రథం ఎంతో ప్రశంసకి నోచుకుంది. ఉధృతమైన వేగంతో తమ బాటలలో కదిలేవారుగా వారు వర్ణించబడతారు. మనసులా, వీచికలా, విహంగంలా వేగంగా కదులుతారు (V.77.3, మరియు 78.1). తమ రథంలో వారు నిండైన, పండంటి సంతృప్తిని మనిషికోసం తీసుకువస్తారు. మయస్ అంటే ఆనందానికి నిర్మాతలు వాళ్లు. ఈ వర్ణనల బట్టి అశ్వినులు దివ్య శక్తుల జంట అని, వాళ్ల పని మనిషిలోని ప్రాణజీవిని, నాడీమండలాన్ని పటిష్ఠం చేసి, వారి కర్మలని, ప్రీతిని సంవర్ధనం చెయ్యడం అని మనకి అర్థమవుతోంది. అయితే వాళ్లు సత్యానికి, సుబోధమైన కర్మకి, సక్రమమైన ఆనందానికి చెందిన శక్తులు. వాళ్లు ఉదయంతో పాటు ఆవిర్భవించే శక్తులు. ఆత్మార్ణవం లోంచి పైకి లేచే సమర్థ శక్తులు. వాళ్లు దివ్యులు కనుక ఊర్ధ్వలోకాలకి చెందిన ఆనందాలని సుస్థిరంగా మానసీకరించ గలుగుతారు. తమ ధీశక్తితో నిజమైన తత్వాన్ని, నిజమైన ఐశ్వర్యాన్ని పొడచూడగలుగుతారు.

యా దస్రా సింధుమాతరా, మనోతరా రయీణాం;

ధియా దేవా వసువిదా. (I.46.2)

సత్యం యొక్క తేజమే తత్వంగా, సారంగా గల ఆ మహత్తర ప్రయాసకి వాళ్లు గొప్ప ప్రోద్బలాన్ని ఇచ్చి మనిషిని చీకటి నుండి దూరంగా గొనిపోతారు.

యానః పీపరదశ్వినా, జ్యోతిష్మతీ తమస్తిరః ।

తాం అస్మే రాసాథాం ఇషమ్ ॥ (I.46.6)

వాళ్లు తమ నౌకలో మనిషి మనస్సుకి చెందిన చింతనలకి, స్థితులకి ఎంతో దూరంగా అవతలి తీరానికి తీసుకుపోతారు. అంటే అతిమానస చైతన్యానికి చేర్చుతారు – నావా మతీనాం పారాయా (I.46.7). సత్యానికి వేలుపు అయిన సూర్యుడి తనయ సూర్యాదేవి వారి ప్రియవధువుగా వారి రథాన్ని అధిరోహిస్తుంది.

ప్రస్తుత సూక్తంలో అశ్వినులు అతివేగవంతులైన ఆనంద దేవతలుగా వర్ణించబడతారు. అనేకవిధాలైన ఆనందాలని వారు ప్రసాదిస్తారు. యజ్ఞంలో పాత్రత వహించే ప్రబల శక్తులని వారు ఆనందిస్తారు. *యజ్వరీర్ ఇషో... చనస్యతం*. ఈ ప్రబల శక్తులు సోమపానం వల్ల పుట్టుకొచ్చాయి, అంటే దివ్యమైన ఆనంద స్రవంతి వల్ల జనించాయి. చైతన్యంలో నవనిర్మాణాలు రూపొందించగల సముచిత పదాలు, *గిరః*, అప్పుడప్పుడే ఏర్పడుతున్నాయి. యజ్ఞపీఠం సిద్ధంగా వుంది. సోమపానానికి చెందిన అద్భుత రసాలన్నీ పుట్టుకొస్తున్నాయి[8]. మహోగ్ర ప్రయాస కోసం అశ్వినులు ముందుకొస్తారు – *పురుదంససా నరా*. మంత్ర శబ్దాలని వారు ఆనందిస్తారు. మేధస్సుతో స్వీకరించి గ్రహిస్తారు. ప్రచండమైన ఆలోచనతో అక్కడి నుండి తమ కర్మధారని వెలువరిస్తారు[9]. యజ్ఞంలో సోమరసం యొక్క ఆహుతిని స్వీకరించడానికి వస్తారు. యజ్ఞ కర్మని సఫలం (*దస్రా*) చెయ్యడం కోసం వస్తారు. వారి ఉధృత చలనంలోని ఆనందాన్ని (*రుద్రవర్తనీ*) ప్రసాదించడం కోసం వస్తారు. అవరోధాలని అధిగమిస్తూ తమ బాటలో ఎదురులేక ముందుకు దూసుకుపోతారు. మహత్తర మానవ పయనానికి (*నాసత్యా*), ఆర్య ప్రయాణానికి అధిష్ఠాన దేవతలు వారు. కాబట్టి అశ్వారూఢులైన అశ్వినులు ముఖ్యంగా మనకి ప్రసాదించేది శక్తి అనే భావం సూక్తంలో సాంతమూ మనకు ఎదురవుతుంది. యజ్ఞ శక్తులని వారు ఆనందిస్తారు. మంత్ర శబ్దాన్ని

---

[8] యువాకవః సుతా వృక్తబర్హిషః

[9] శవీరయా ధియా ధిష్ణ్యా వనతం గిరః.

వారు శక్తివంతమైన ఆలోచన స్థాయికి ఉద్ధరిస్తారు. యోగమార్గంలో వారి మహోగ్ర చలనాన్ని యజ్ఞానికి ఫలంగా ప్రసాదిస్తారు. వారు ప్రసాదించే శక్తి యొక్క ముఖ్య ప్రయోజనం కర్మలలో సాఫల్యం, పయనంలో వేగం. ఆ విధంగా అధ్యాత్మిక అన్వయాన్ని అవలంబిస్తే ఋషుల ఆలోచనలన్నీ ఎంత సంసక్తంగా, అర్థవంతంగా, నిశితంగా, స్పష్టంగా కనిపిస్తాయో మరొక్కసారి మనం చూడొచ్చు. అసమాన ప్రజ్ఞకి, ప్రగాఢమైన జ్ఞానానికి వేదం పరాకాష్ఠ అని అప్పుడు అర్థమవుతుంది. అధ్యాత్మిక దృష్టి వేదాన్ని అవకతవకగా, తప్పుల తడకలుగా అన్వయించే అగత్యం నుండి మనని కాపాడుతుంది.

ఆ విధంగా మొదటి మూడు శ్లోకాల తాత్పర్యాన్ని ఇలా చెప్పుకోవచ్చు.

"ఓ అశ్వినీ దేవతాలారా! వేగవంతులై, విలాసవంతులై, ఆనందమయులై, యజ్ఞంలోని శక్తులని స్వీకరించి ఆనందించండి."

"ఓ అశ్వినీ దేవతలారా! వివిధమైన కార్యసిద్ధిని ఒనగూర్చగల పురుషాత్ములు మీరు. ఓ ధీమంతులారా! ప్రబలమైన, ప్రకాశవంతమైన ఆలోచనాశక్తి చేత మంత్రశబ్దాలని స్వీకరించి ఆనందించండి. "

"యజ్ఞపీఠాన్ని తీరుగా అమర్చాను. గొప్ప శక్తి గల సోమరసాలని పిండి వెలికి తీశాను. కార్యసాఫల్యాన్ని ప్రసాదించే మీరు, మహోగ్రచలన శక్తితో, ప్రచండ వేగంతో మీ బాటలలో వారిని చేరుకోండి."

రెండవ ఋక్కులో చేసినట్లే, మూడవ ఋక్కులో కూడా నాడీమండలం మీద, ప్రాణశక్తుల మీద ప్రభావాన్ని చూపించే దేవతల ఆవాహనతో ఋషి ప్రారంభిస్తాడు. కాని అక్కడ ప్రాణశక్తులు ప్రసాదించి, జీవనాశ్వాలని తీసుకువచ్చే వాయు దేవుణ్ణి ప్రార్థిస్తాడు. కాని ఇక్కడ ఆ ప్రాణశక్తులని శాసించి, ఆ అశ్వాల మీద స్వారీ చేసే అశ్వినులని పిలుస్తున్నాడు. రెండవ ఋక్కులో అతడు నాడీజన్యమైన, ప్రాణికమైన చర్యతో బయల్దేరి మానసిక చర్యను చేరుకుంటాడు. రెండవ పాదంలో ఇంద్రుడి మహత్తుని ఆవాహన చేస్తాడు. ఆనందరసాల

స్రోతస్సులు అతణ్ణే కోరుకుంటాయి – "*సుతా ఇమే త్వాయవః*"; తేజోమానసం తమని ఆక్రమించి తమ అంతర్యంలో తన వ్యవహారాలు జరుపుకోమని ఆహ్వానిస్తాడు; వారు పునీతులు. "*అణ్వీభిస్ తనా*" – అనే పదాలని "వేళ్లలో, శరీరంలో" వారు పునీతులు అనే అర్థంలో సాయణుడు అన్వయిస్తాడు. కాని దాని భావం మరోలా స్ఫురిస్తోంది – విమల మానసం యొక్క సూక్ష్మమైన ఆలోచనా శక్తుల ప్రభావం చేత వారి భౌతిక చేతన కూడా పవిత్రమయ్యింది. ఎందుకంటే ఆ "పది వేళ్లు", అసలు అవి వేళ్లేనని అనుకుంటే, అవి అశ్వినుల సతియై, సూర్యుడి కొమరిత అయిన సూర్యాదేవి యొక్క వేళ్లు. తొమ్మిదవ మండలంలోని మొదటి ఋక్కులో, ఋషి మధుచ్ఛందుడే ఈ భావనని మరింతగా విపులీకరిస్తాడు. కాని ఈ సందర్భాంలో మాత్రం క్లుప్తంగా ప్రస్తావిస్తాడు. సోమదేవుణ్ణి ఉద్దేశిస్తూ ఇలా అంటాడు – "సూర్య తనయ తన గాలన పాత్ర లోంచి ప్రవహించే నీ సోమరసాన్ని పునీతం చేస్తుంది" (*వారేణ శశ్వతా తనా*). వెంటనే ఇలా కూడా అంటాడు – "సూక్ష్మరూపులు తమ మహత్తర ప్రయాసలో దశ వధువులని, సురలోకపు సోదరీమణులని వశం చేసుకుని వారిని దాటుతారు." ఆ వాక్యాన్ని వింటున్నప్పుడు ఆలోచనాసీమని దాటించగల అశ్వినుల నౌక గుర్తుకు రాక మానదు. వేదంలో స్వర్గం శుద్ధ మనో చైతన్యానికి ప్రతీక అయితే, భూమి భౌతిక చైతన్యానికి ప్రతీక. విమల మనోసీమలో వసించే సోదరీమణులే ("*అణ్వీః*") పదుగురు వధువులు ("*దశ యోషణః*"). వారే పదుగురు పోతగాళ్లు ("*దశ క్షిపః*") ఎందుకంటే వాళ్లే సోమరసాన్ని వశం చేసుకుని దాన్ని వేగంగా గొనితెస్తారు. వేదంలో పలుమార్లు ప్రస్తావించబడ్డ దశ కిరణాలు ("*దశ గావః*") కూడా వాళ్లేనేమో. సూర్యుడికి మనుమలు గాను, వారసులు గాను కూడా వర్ణించబడతారు – "*నప్తీభిర్ వివశ్వతః*" (IX.14.5.). వాళ్లు చేసే శుద్ధి క్రియలలో ఏడు రకాల ఆలోచనా చైతన్యం ("*సప్త ధీతయః*") వారికి తోడ్పడుతుంది. "సోమ దేవుడు తన ప్రచండ రథాలతో, తన సూక్ష్మమైన ధీశక్తులతో ("*ధియా అణ్వ్యా*") పురోగమించి, ఇంద్రుడి యొక్క సుసిద్ధ క్షేత్రాన్ని చేరుకుంటాడు. గొప్ప వైవిధ్యంతో కూడిన ఆలోచనా శక్తులతో అమరులు కొలువుండే దివ్య బృహత్తును చేరుకుంటాడు" (IX. 15.1,2).

ఏషా పురూ ధియాయతే, బృహతే దేవతాతయే ।

యత్రామృతాస ఆసతే॥

వేద ఋషుల సోమపానం ఎంత ప్రతీకాత్మకమో, దాని చుట్టూ ఎన్ని అధ్యాత్మిక భావనలు పెనవేసుకుని ఉన్నాయో తెలియజేయడానికే విషయాన్ని ఇంత విపులంగా చర్చించాను. తొమ్మిదవ మండలాన్ని క్షుణ్ణంగా చదివితే, అందులోని ప్రతీకల ఐశ్వర్యాన్ని, సర్వత్ర పరవళ్లు తొక్కే అధ్యాత్మిక భావజాలాన్ని గుర్తించినప్పుడు ఈ విషయం స్పష్టం అవుతుంది.

అయితే ఇక్కడ సోమరసం వల్ల కలిగే శుద్ధి కార్యం అంత ముఖ్యం కాకపోవచ్చు. అంతకన్నా ముఖ్యమైనది ఇంద్రుడి అధ్యాత్మిక ప్రభావం. చిత్రమైన కాంతులని వెలయించేవాడిగా ఇంద్రుడు ఇక్కడ స్తుతించబడతాడు – "*ఇంద్ర చిత్రభానో.*" సోమరసాలు అతణ్ణి కోరుకుంటాయి. ఆలోచన యొక్క ప్రోద్బలం వల్ల అతడు వస్తాడు. అంతర్యంలో వెలుగొందే ధీమంతుడి ప్రోద్బలం అతడు ముందుకు కదులుతాడు – "*ధియేషితో విప్రజూతః.*" ఏ ఆత్మిక ఆలోచనలని అయితే ఆనంద రసాలని పిండితీసిన ఋషి తన భాష ద్వార, మంత్రోక్తుల ద్వార వ్యక్తం చెయ్యాలని చూస్తున్నాడో ఆ ఆత్మిక ఆలోచనల దిశగా ఇంద్రుడు కదులుతాడు – "*సుతావత ఉప బ్రహ్మాణి వాఘతః.*" విరాజమాన మనోబలానికి చెందిన ప్రచండ వేగంతో, శక్తితో అతడు దూసుకు వస్తాడు. ఆ ఆలోచనలతో తన మహత్తర అశ్వాలని వశం చేసుకుంటాడు - "*తూతుజాన ఉప బ్రహ్మాణి హరివః.*" సోమ రస సమర్పణ లోని ఆనందాన్ని భరించమని, ధరించమని ఋషి అతణ్ణి ప్రార్థిస్తాడు – "*సుతే ధధిశ్వ నశ్ చనః.*" ఆనందం యొక్క ప్రభావం చేత అశ్వినులు ప్రాణమండలం లోని ప్రీతిని పెంచి ఉత్తేజపరిచారు. విరాజమాన మానసంలో ఆనందం స్థిరంగా నిలవాలంటే అందుకు ఇంద్రుడి ప్రమేయం అవసరం. లేకుంటే ఆ ఆనందం చైతన్యం నుండి చేజారిపోతుంది.

"ఓ ఇంద్రా! నీ ప్రచండ కాంతులతో దిగిరా! ఈ సోమరసాలు నిన్నే కోరుకుంటున్నాయి; సూక్ష్మ శక్తుల చేత అవి పునీతమై, వ్యాప్తి చేత శరీరాన్ని కూడా పునీతం చేస్తున్నాయి."

“ఓ ఇంద్రా! మనస్సు ప్రోద్బలంతో రా! కాంతులీనే ధీమంతుడి ప్రోద్బలంతో ముందుకు రా. నా ఆత్మిక చింతనలని చేరుకో. సోమ రసాలని పిండి తీసిన నేను వాటిని వాక్కు రూపంలో వ్యక్తం చేయగోరుతున్నాను.”

“ఓ ఇంద్రా! ఉధృత వేగంతో నా ఆత్మిక చింతనలని చేరుకో. ఓ మేలిమి అశ్వాల స్వామీ! ఈ సోమరసాల ఆనందాన్ని స్థిరంగా నీలో ధరించు.”

తదనంతరం ఋషి తన దృష్టిని విశ్వదేవుల మీదకి మళ్లిస్తాడు. విశ్వదేవులు అంటే సమస్త దేవతా సమూహం. విశ్వదేవులు అంటే ఒక ప్రత్యేక దేవతల వర్గమా లేక కేవలం సమస్త దేవతల సమూహమా అన్న విషయంలో కొంత వివాదం వుంది. నా ఉద్దేశంలో ఆ పదానికి అర్థం సమస్త దివ్య శక్తుల సమూహం; ఎందుకంటే వారు ఆవాహన చేయబడ్డ ఋక్కుల్లోని పదజాలాన్ని బట్టి ఆ అర్థమే నాకు సమంజసంగా తోచుతోంది. ఈ ఋక్కులో ఇంద్ర, అశ్వినుల వ్యవహారాలని సంపూర్ణం గావిస్తూ, వాటిని బలపరుస్తూ రంగప్రవేశం చెయ్యమని విశ్వదేవులకి పిలుపు నివ్వడం జరుగుతుంది. ఇందులో వారి కూటమి మొత్తం యజ్ఞానికి కదిలి రావాల్సి వుంది. యాజ్ఞికుడు సమర్పించే సోమ రసాన్ని వారి తమలో తాము పంచుకుని, వారంతా తమ తమ ప్రత్యేక దివ్య విధులని ఆనందంగా నిర్వర్తించాలి – *విశ్వే దేవసా ఆ గత, దాశ్వాంసో దాశుషః సుతం.* తదుపరి ఋక్కులో అదే పిలుపుని మరింత ఆర్తిగా ఇవ్వడం జరుగుతుంది – సోమార్పణాన్ని అందుకోవడం కోసం వారు తీవ్రవేగంతో దిగిరావాలి – తూర్ణయః. మానవుడి భౌతిక ప్రకృతిని తన దివ్యత్వాన్ని వేరు చేసే అనేక చైతన్య తలాలని (“జలాలని”) దాటుకుంటూ అరుదెంచాలి. దివికి భువికి మధ్య సంభాషణకి అడ్డుపడే ఆ చైతన్య తలాలని దాటుకుంటూ రావాలి – *అప్తురః సుతం ఆ గంతా తూర్ణయః.* సాయం వేళ తమ గోశాలలకి ఆతురంగా తిరిగొచ్చే గోవులకి మల్లె వారు రావాలట – “ఉస్రా ఇవ స్వసరాణి.” ఆ విధంగా సంతోషంగా ఏతెంచిన అతిథులు, యజ్ఞాన్ని స్వీకరించి దానికి అండగా నిలవాలి. యజ్ఞం యొక్క లక్ష్యం నెరవేరే వరకు, దివ్యులని, దివ్యధామాన్ని, సత్యాన్ని, బృహత్తును చేరేవరకు తోడుగా నిలవాలి – *మేధం జుషంత వహ్నయః.*

ఏ గుణగణాలని పురస్కరించుకుని విశ్వదేవులు సోమ యజ్ఞానికి ఆహ్వానించబడ్డారో, ఆ గుణగణాలని కీర్తించే స్తోత్రనామాలు అన్నిట్లోను ఆ సామాన్యత స్పష్టంగా కనిపిస్తుంది. ఆ నామాలన్నీ ఆ దేవతా వర్గానికి ఉమ్మడిగా వర్తిస్తాయి. వేదం అంతటా కూడా వారిని అలా ఒక సమూహంగానే స్తుతించడం జరుగుతుంది. మనిషికి వారు మేలు చేస్తారు, సమృద్ధిని కలిగిస్తారు, అతడి కృషికి మద్దతు నిస్తారు, పనిలో సహకరిస్తారు – "*ఓమాసశ చర్షణీధృతో.*" సాయణుడు ఈ పదాలని రక్షకులు, పోషకులు అనే అర్థంలో అన్వయిస్తాడు. అయితే నేను సూచించే అన్వయానికి పూర్తి సంజాయిషీ ఇక్కడ ఇవ్వబోవడం లేదు. నేను అవలంబిస్తున్న శబ్దవ్యుత్పత్తి విధానం గురించి ముందే వివరించాను. "*అవ, అవస, ఊతి, ఊమ*" తదితర పదాలని ప్రతీ సందర్భంలోను రక్షణ అనే అర్థంలో అన్వయించడాన్ని అసలు సాయణుడే ఒప్పుకోలేదు. పైగా ఒకే పదానికి వివిధ సందర్భాల్లో ఎంతో వైవిధ్యంతో కూడిన, బొత్తిగా పొంతన లేని అర్థాలని ఇవ్వడం జరిగింది. ఉదాహరణకి *చర్షణి, కృష్టి* వంటి పదాల జంటని మానవుడు అనే అర్థంలో తీసుకోవడం సమంజసంగానే అనిపించొచ్చు. కాని "*విచర్షణి, విశ్వచర్షణి, విశ్వకృష్టి*" మొదలైన పదాలకి కూడా అలాంటి అర్థాన్ని ఇవ్వడం అసంగతంగా తోచుతుంది. సాయణుడే "*విశ్వచర్షణి*" అనే పదానికి "సార్వదర్శక" అని అన్వయిస్తాడు గాని, "సర్వ మానవ" అనే అర్థాన్ని సూచించడు. వైదిక శబ్దాల అన్వయంలో అలాంటి అర్థం పర్థంలేని విసుర్లు నేను అంగీకరించను. "అవ" అనే శబ్దాన్ని సంపాదించుకోవడం, అట్టేబెట్టుకోవడం అనే అర్థంలో తీసుకోవచ్చు; భరించు, రక్షించు అనే అర్థాన్ని కూడా తీసుకోవచ్చు; అలాగే కావడం, సృజించడం; వృద్ధి చెయ్యడం, పెంచడం, ఎదగడం, వర్ధిల్లడం; సంతోషించడం, సంతోషపెట్టడం; అన్ని అర్థాల్లోకి వేదంలో ముఖ్యంగా వృద్ధి చెయ్యడం, పోషించడం అనే భావమే ప్రధానంగా నాకు కనిపిస్తోంది. "చర్ష్" మరియు "కృష్" అనే శబ్దాలు "చర్" మరియు "కృ" అనే మూలశబ్దాల నుండి పుట్టాయి. ఆ రెండు శబ్దాల్లోను చెయ్యడం అనే అర్థం వుంది. ప్రయాసభరితమైన కృషి, లేక కదలడం, ఈడ్వడం, దున్నడం అనే భావం "కృష్" అనే శబ్దంలో ధ్వనిస్తుంది. కాబట్టి "చర్షణి," మరియు "కృష్టి" అనే పదాలకి అర్థం అటువంటి ప్రయాసభరితమైన పని చేసేవాళ్లు. అలాంటి మరెన్నో పదాలలో (కర్మ, అపస్, కార, కీరి, దువస మొ॥) ఇవి రెండు. వైదిక ప్రయాసని, యజ్ఞ కర్మని, ఆర్తితో మనిషి చేసే

కృషిని, ఆర్యుడి "అరతి"ని, నిరతిని సూచించడం కోసం ఆ పదాలని వేదంలో పదే పదే వాడారు.

మనిషికి చెందిన సమస్త సౌభాగ్యాన్ని, సంపదని పోషించి పెంచడం, బృహత్తరమైన సత్య చైతన్యానికి చెందిన పూర్ణత్వంలోకి, ఐశ్వర్యంలోకి అతడి వృద్ధిని సాధించడం, తన మహత్తర, ప్రయాసలో, కృషిలో తనకి తోడుగా నిలవడం – ఇదీ వైదిక వేల్పుల నిరంతర తాపత్రయం. తరువాత వారిని "*అప్తురః*" అంటారు. అంటే నీటిని దాటించేవారు. దీనినే సాయణుడు నీటిని ప్రసాదించే వాళ్లు అని అనువదిస్తాడు. అంటే "వర్ష ప్రదాతలు" అనే అర్థంలో తీసుకుంటాడు. అయితే వైదిక దేవతలు అంతా వర్ష ప్రదాతలు అన్నది నిజమే. అది దివి నుండి కురిసే సంపదల "వృష్టి." కొన్ని చోట్ల ఆ నీటిని సౌరజలాలుగా కూడా వర్ణించారు. "స్వర్వతీర్ అపః" - అంటే విరాజమానమైన స్వర్లోకపు ("*స్వర్*") తేజాన్ని గొనితెచ్చే జలాలు. ఆ పదజాలం ("*స్వర్వతీర్ అపః*") బట్టి చూస్తే, వేదం చెప్పే సముద్రం, జలాలు సచేతన జీవికి, ఆ జీవి యొక్క సమగ్ర చేతనకి, ఆ చేతనలోని చలనాలకి ప్రతీకలు. దేవతలు ఆ జలాలతో, ముఖ్యంగా ఊర్ధ్వ జలాలతో, దివి లోకపు జలాలతో, సత్య స్రోతస్సులతో ("*ఋతస్య ధారాః*"), ఎన్నో అవరోధాలని అధిగమిస్తూ, మానవ చేతనని పూరిస్తారు. కాబట్టి వారంతా "*అప్తురః*." కాని మానవుడు కూడా జలాలని దాటి సత్య చైతన్యంలో ఉన్న తన స్వధామాన్ని చేరుకుంటాడని చెప్పబడింది. ఆ దాటించేవారు దేవతలు. అయితే ఈ సందర్భంలో ఉద్దేశించబడ్డ అర్థం ఇదేనా కాదా అన్న విషయంలో కొంత సందేహం వుంది. ఎందుకంటే ఇక్కడ "*అప్తురః... తూర్ణయః*" అన్న పదాలు దగ్గర దగ్గరగా ఉన్నాయి. ఆ సాన్నిహిత్యానికి ఏదో ప్రత్యేకత వుంది.

దేవతలు ఆగంతకుల దాడులకి అతీతులు, దుష్టశక్తుల ప్రభావానికి అతీతులు. వారి సచేతన జ్ఞానం చేసే సృజనాత్మక కల్పనలకి, అంటే మాయకి, వారు బద్ధులు కారు. స్వేచ్ఛగా సర్వత్ర చరిస్తారు. తమ లక్ష్యాన్ని సుస్థిరంగా చేరుకుంటారు – "*అస్రిధ ఎహిమాయాసో అద్రుహః."* వేదంలో ఎన్నో చోట్ల యజ్ఞం యొక్క, క్రతువు యొక్క, ఈ యాత్ర యొక్క, తేజో వృద్ధి యొక్క, జలాల సమృద్ధి యొక్క లక్ష్యం ఏమిటో చెప్పబడింది. ఆ లక్ష్యం సత్య చైతన్యాన్ని,

అంటే ఋతాన్ని, చేరుకోవడం. సత్య చైతన్య సిద్ధి చేత ఆనందాన్ని, అంటే మయస్సుని, పొందడం. ఈ పదాలు సామాన్యంగా అనంతమైన, సమగ్రమైన సత్య చైతన్యానికి వర్తిస్తాయి. ఈ ఋక్కులన్నీ సత్య ప్రాప్తినే వర్ణిస్తున్నాయి. విశ్వదేవులు మనిషిని పెంచుతారు. తన మహత్తర కృషిలో తనకి తోడుగా నిలుస్తారు. స్వర్లోకపు జలాలని, సత్య ధారలని తనకి తెచ్చి ప్రసాదిస్తారు. సత్య చైతన్యం యొక్క సంపూర్ణమైన, సువిస్తారమైన ప్రభావాన్ని, దాని విశాల విజ్ఞాన పరికల్పనలని (“మాయాః”) మనిషికి బోధిస్తారు.

“*ఉస్రా ఇవ స్వసరాణి*” అనే పదజాలాన్ని నేను వీలైనంత బాహ్యార్థంలో అనువదించాను. కాని వేదంలో కవితాత్మకమైన ఉపమాలంకారాన్ని కేవలం అలంకారప్రాయంగా ఎప్పుడూ వాడరు. అలాంటి అలంకారాన్ని ప్రతీకగా వాడుతూ, ద్వంద్వార్థ ప్రయోగంతో, అధ్యాత్మిక అంతర్భావం మరింత ఇనుమడించేలా చూస్తారు. వేదంలో “గో” అనే శబ్దం లాగానే, ఆవు లేక ఎద్దు అనే అర్థాలు గల, “ఉస్ర” అనే శబ్దాన్ని కూడా ద్వంద్వార్థంలోనే వాడారు. ఆ పదానికి అధ్యాత్మిక భావం తేజోమయులు, ప్రకాశవంతులు అని తీసుకోవచ్చు. మనిషిలో సత్యం యొక్క విరాజమాన శక్తులు అనే అర్థంలో ఆ పదాన్ని వాడారు. తేజోమయులైన విశ్వదేవులు సోమరసం కోసం వచ్చి శాంతి, ఆనందాలతో పూరితమైన తమ నిజస్థానాలని ఆక్రమిస్తారు – “*స్వసరాణి*.” “స్వస్” అనే శబ్దం, “సస్” అనే శబ్దానికి మల్లె, విశ్రాంతినే కాకా అనందాన్ని కూడా సూచిస్తాయి. మనిషిలో అశ్వినులు ప్రాణిక, మనోవృత్తులని సంసిద్ధం చేశాక, ఇంద్రుడు శుద్ధ మనోవృత్తిని తీర్చిదిద్దాక, సత్య శక్తులైన ఆ విశ్వదేవులు మనిషిలోని ఆనంద స్రవంతుల లోనికి ప్రవేశిస్తారు.

“కర్తకు తన కర్మలో సహకరించే విశ్వదేవులారా! మీరు విచ్చేసి నేను పంచుతున్న సోమరసాన్ని విభజించండి.”

“జలాలను మా కోసం తెచ్చి ఇస్తున్న ఓ విశ్వదేవులారా! నా సోమరస నివేదనలని స్వీకరిస్తూ, తేజోమయులై వచ్చి తమ ఆనందమయ నిజపీఠాలని ఆక్రమించండి.”

“ఓ విశ్వదేవులారా! మీరు అజేయులు, అనఘులు! మీ జ్ఞాన రూపాల్లో స్వేచ్ఛగా చరించే మీరు, నా యజ్ఞానికి అరుదెంచి దాన్ని ఉద్ధరించండి.”

ఇక సూక్తం యొక్క చివర్లో మనకొక ముఖ్యమైన సూచన కనిపిస్తుంది. యజ్ఞం యొక్క లక్ష్యం, సోమరస నైవేద్యం యొక్క లక్ష్యం, అశ్వినుల కృషికి పరాకాష్ఠ, మనోవేదికపై ఇంద్రుడి ప్రభావం యొక్క ప్రయోజనం, మనోప్రాణ సీమల్లో విశ్వదేవుల పనిలోని ఉద్దేశం – అన్నీ ఒక్కటే. అదే సత్య చైతన్యం. సూక్తానికి ఆఖర్లో వచ్చే మూడు ఋక్కులు సరస్వతిని, దివ్య వాక్కుని స్తుతిస్తున్నాయి. ఆ వాక్కు సత్య చైతన్యం నుండి ప్రవహించే స్ఫూర్తి ధార. ఆ శ్లోకాల తాత్పర్యం ఇలా జాలువారుతోంది –

“అనేక రూప విలాసినియై, ఘనమైన భావసంపదతో రాజిల్లుతూ, పునీతం గావించే సరస్వతి మన యజ్ఞాన్ని కాంక్షించుగాక!”

“ఆనందమయ సత్యధారలని చిలికించే ఆమె, మేల్కొంటున్న చైతన్యంలో సత్యమైన మనోచలనాలని కలిగిస్తూ, సరస్వతి మన యజ్ఞాన్ని ఉద్ధరిస్తుంది.”

“సరస్వతి తన దృష్టితో చైతన్యాన్ని మేలుకొలిపి ఋతం యొక్క బ్రహ్మాండమైన ఉప్పెనను పుట్టిస్తుంది, చింతన నంతటినీ కాంతిమయం గావిస్తుంది.”

ఈ స్పష్టమైన, సుబోధకమైన ముక్తాయింపు అంతకు ముందు వచ్చిన దానంతటి మీద కాంతులు కురిపిస్తుంది. వైదిక యజ్ఞానికి, ఒక ప్రత్యేకమైన మానసికస్థితి లేక ఆత్మస్థితికి మధ్య సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. అలాగే నేతిని, సోమరసాన్ని నైవేద్యం చెయ్యడానికి, తేజోమయమైన చింతనకి, నిండైన భావసంపదకి, ప్రబుద్ధమానసానికి, సత్యం దిశగా మొగ్గు

చూపే చిత్తానికి మధ్య సంబంధాన్ని ఎత్తిచూపుతుంది. ఇక్కడ శ్రుతికి అధిష్ఠాన దేవత అయిన సరస్వతీ మూర్తి ఆవిష్కరించబడుతోంది. వైదిక నదులకి, ఆంతరిక చేతనా స్థితులకి మధ్య సంబంధాన్ని స్థాపిస్తోంది. చిత్రవిచిత్ర ప్రతీకలతో, నానా ద్వంద్వార్థాలతో ఉద్దేశపూర్వకంగా ఎంతో గందరగోళం సృష్టించిన వేద ఋషులు ఈ సందర్భంలో మాత్రం గొప్ప విరాజమానమైన సూచనని వెల్లడి చేస్తూ, తమ మూలరహస్యం దిశగా మనను చేయిపట్టుకుని తీసుకుపోతున్నారు.

అధ్యాయం 9

సరస్వతి – ఆమె నెచ్చెలులు

వేదం అనుసరించే ప్రతీకాత్మక పద్ధతి సరస్వతీదేవి వర్ణనలో అత్యంత స్పష్టంగా విదితమవుతుంది. ఎందరో ఇతర దేవతల విషయంలో బాహ్యాంతర అర్థాల మధ్య ఒక

విధయమైన సమతౌల్యాన్ని పాటించడం జరిగింది. కొన్ని సందర్భాల్లో అఛ్ఛాదన కాస్త పారదర్శకంగా ఉంటుంది, కొన్నిట్లో అంచులు కాస్త పక్కకి తొలగించడం జరుగుతుంది. వినికిడి గల వారికి శ్రుతి వినిపిస్తుంది. కాని తెరని పూర్తిగా తొలగించిన సందర్భాలు మరెక్కడా లేవు. అగ్ని అంటే కేవలం హోమాగ్ని లోంచి పుట్టే అగ్గి యొక్క భౌతిక తాపానికి, తేజానికి ప్రతీక మాత్రమేనా అని సందేహం కలగవచ్చు. ఇంద్రుడు అంటే కేవలం ఆకాశానికి, వర్షానికి, భౌతిక కాంతికి ప్రతీక అయిన వేలుపు మాత్రమేనా అని అనిపించొచ్చు. వాయువు అంటే గాలికి, మహా అయితే శ్వాసకి ప్రతీక అయిన దేవుడు అనుకోవచ్చు. ఇక నిమ్న జాతి దేవతల విషయంలో అయితే ఇటువంటి భౌతిక అన్వయం మరింత సందేహాత్మకంగా కనిపిస్తుంది. ఎందుకంటే వరుణుడు అంటే వేద పరంగా అన్వయించ బడ్డ యురేనస్ దేవతో, నెప్ట్యూన్ దేవతో కాడని, ఎన్నో ముఖ్యమైన నైతిక క్రియలు గల దేవత అని స్పష్టంగా తెలుస్తుంది. మిత్ర, భగదేవులకి కూడా అదే విధంగా అధ్యాత్మిక పార్శ్వం వుంది. మనసుతో రూపాలు సృష్టించి, పనులతో అమరత్వానికి పునాదులు వేసే రిభులని మరి ప్రకృతి బద్ధమైన పౌరాణిక అన్వయాల సంకెళ్లలో పట్టి బంధించలేము. అసలు వైదిక కవుల గీతాల మూలంలోనే ఎంతో గందరగోళం వుందని వాదిస్తూ సమస్యని పక్కకి నెట్టేయగలమేమో. కాని సరస్వతి మాత్రం అలాంటి త్రోసివేతను సహించదు. నిశ్చయంగా, నిస్సందేహంగా ఆమె వాగ్దేవి, దివ్యమైన శ్రుతికి, స్ఫూర్తికి అధిష్ఠాన దేవత.

విషయం దీనికే పరిమితమై ఉంటే, వేదం గురించి మనకొక సామాన్యమైన, స్వయం విదితమైన వాస్తవం మాత్రమే తెలిసి ఉండేది. వేద ఋషులు కేవలం ప్రకృతిని ఆరాధించే కిరాత జాతులు కారని, మేధోజన్య, అధ్యాత్మిక కల్పన వారికి సాధ్యమని, వాళ్లు సృష్టించిన ప్రతీకలు కేవలం ప్రకృతిజన్య చిహ్నాలు కావని, వారు వర్ణించే ప్రపంచం కేవలం సస్య, బహిరంగ ప్రపంచం కాదని, ఆ ప్రతీకలలో మానసిక, అధ్యాత్మిక సారం వుందని మనకి తెలుస్తోంది. ఒక ప్రాచీన మతసాంప్రదాయం యొక్క చరిత్రని భౌతిక స్థితి నుండి అధ్యాత్మిక స్థితికి పురోగమిస్తున్నట్టుగా ఊహించుకోవచ్చు. పూర్తిగా ప్రకృతి నిబద్ధమైన జీవనం నుండి బయల్దేరి, ప్రకృతి పట్ల, ప్రపంచం పట్ల, మరింత నైతిక, అధ్యాత్మిక దృక్పథాన్ని అవలంబించే సంస్కృతి దిశగా పురోగమిస్తున్నట్టుగా ఊహించుకోవచ్చు. అయితే చరిత్ర పట్ల ఇలాంటి అవగాహన సరైనదని ఈ రోజుల్లో చాలా మంది అంటున్నా అది పూర్తిగా నిజమని అనడానికి

లేదు[10]. ఏదేమైనా వేద ఋషులు దేవతల పట్ల భౌతిక, ప్రకృతి గత, అవగాహన నుండి నైతిక, అధ్యాత్మిక అవగాహన దిశగా పురోగమిస్తున్నారని మాత్రం నిశ్చయంగా చెప్పొచ్చు. సరస్వతి కేవలం వాగ్దేవి మాత్రమే కాదు, ఆర్యావర్తంలోని ఏడు ముఖ్యమైన నదులలో ఆమె ఒకతె. కాబట్టి ఆ నదికి, దివ్య వాక్కుకి మధ్య అనుసంధానం ఎలా జరిగిందన్న ప్రశ్న తప్పక వస్తుంది. వేద సూక్తాల్లో ఈ రెండు భావనల మధ్య సంబంధం ఎలా వ్యక్తమవుతుంది? మరో విషయం. సరస్వతి ప్రాధాన్యతకి కారణం కేవలం ఆమెలోనే లేదు, ఇతర దేవతలతో ఆమె సంబంధంలో వుంది. ఈ సంగతులన్నీ శీఘ్రంగా పరిశీలించి వాటి నుండి ఏమి నేర్చుకోగలమో చూద్దాం.

నదికి, కవితాభినివేశానికి మధ్య పోలిక చూసే ధోరణి గ్రీకు పురాణంలో కూడా కనిపిస్తుంది. అయితే అక్కడ జ్ఞాన దేవతలని (Muses) నదులుగా తలపోయరు. ఒక ప్రత్యేక భౌతిక సెలయేటితో మాత్రం వారికి లీలామాత్రమైన సంబంధం ఉంది. ఆ సెలయేటి పేరు హిపోక్రీన్ (Hippocrene). ఆ నదికి మూలం అశ్వం. ఆ పేరు ఎలా వచ్చిందో తెలియాలంటే పెగసస్ (Pegasus) అనే దివ్యాశ్వం యొక్క గిట్టల నుండి ఆ నది పుట్టిందన్న పౌరాణిక గాథను తలచుకోవాలి. ఆ అశ్వం తన గిట్టలతో ఒక కొండని పొడిస్తే అది పొడిచిన చోటి నుండి కవితాధారలు చివ్వున పెల్లుబికాయట. ఈ గాథ కేవలం గ్రీకులు చెప్పుకునే పిట్టకథ మాత్రమేనా, లేక దానికి మరింత లోతైన అర్థం ఏదైనా వుందా? అందులో చెప్పబడ్డ ధారలు కవితా స్ఫూర్తికి ప్రతీకలే అయ్యుంటే, మొత్తం గాథకి ఏదో అధ్యాత్మిక అన్వయం ఉండితీరాలి. కొన్ని అధ్యాత్మిక వాస్తవాలకి పూసిన భౌతిక చిన్నెల పూత అయ్యుండాలి. పెగసస్ అనే గ్రీకు శబ్దాన్ని, ఆర్యుల భాషాధ్వనుల పరంగా తర్జుమా చేస్తే, 'పాజస' అనే శబ్దం వస్తుంది. ఇది 'పాజస' అనే సంస్కృత పదం అని స్పష్టంగా తెలుస్తోంది. ఈ పదానికి మూలార్థం బలం, లేదా చలనం. కొన్ని సార్లు పదఘట్టన అనే అర్థం కూడా వస్తుంది. గ్రీకులో ఆ పదానికి సెలయేరు అనే అర్థం గల 'పేగే' (pege) అనే శబ్దమూలంతో సంబంధం వుంది. కాబట్టి ఈ పదాన్ని గ్రీకు

---

[10] అధ్యాత్మిక భావాల ఆదిమ, ప్రప్రథమ చరిత్రని నిర్ణయించడానికి కావలసిన బలమైన ఆధారాలు మన వద్ద ఉన్నాయని నేను అనుకోను. మనకి తెలిసిన ఆధారాల మేరకు ప్రప్రథమ సాంప్రదాయాలలో అధ్యాత్మిక అంశం, ప్రకృతిగతమైన అంశం కలిసే ఉన్నాయి. ఈ రెండు ముఖాలలో అధ్యాత్మిక ముఖం మొదట పుట్టినా కూడా, బొత్తిగా అనాగరికమైన కిరాత జాతుల్లో కూడా (ఉదాహరణకి ఉత్తర అమెరికాకి చెందిన తెగలలో కూడా) అధ్యాత్మిక అంశం పూర్తిగా రూపుమాసిపోలేదు. కాని ఆ బోధన పూర్వచారిత్రమైనది కావచ్చునేమో గాని, ఆదిమమైనది, అనాగరకమైనది ససేమిరా కాదని గుర్తుంచుకోవాలి.

పౌరాణిక గాధ నేపథ్యంలో చూస్తే ఉధృతమైన చలనంతో కూడుకున్న కవితా స్ఫూర్తి అనే భావన స్ఫురిస్తుంది. అలాగే వైదిక ప్రతీకలని చూస్తే అశ్వం అనే ప్రతీక గొప్ప జీవనోత్సాహానికి, జీవశక్తికి, ప్రాణశక్తికి సంబంధం కలిగి వుంది. ఈ ప్రతీక చైతన్యాన్ని సూచించే తదితర ప్రతీకలతోను, చిత్రాలతోను ముడివడి వుంది. “అద్రి” అంటే కొండ, లేక బండ, బాహ్య ప్రపంచానికి, ఇంకా ప్రత్యేకించి భౌతిక ప్రపంచానికి ప్రతీక. ఆ కొండ లోనుండి సూర్యుడి పశువులు పుట్టుకొస్తున్నాయి, జలాలు వెలువడి ప్రవహిస్తున్నాయి. ఆ కొండని పితికితే పుట్టేవే సోమరసపు మధుధారలు అని వేదం చెప్తుంది. కాబట్టి గుర్రం తన గిట్టతో కొండని మోదితే కవితాధారలు వెలువడుతున్నాయన్న భావన ఇదే అధ్యాత్మిక భావన యొక్క రూపాంతరం అని స్పష్టంగా తెలుస్తోంది. అలాంటి అధ్యాత్మిక గుర్తింపుని కవితా రూపంలో వ్యక్తం చేసే సామర్థ్యం అటు ప్రాచీన గ్రీకులకి, ఇటు ప్రాచీన భారతీయులకి కూడా ఉండే ఉంటుంది అనుకోవడంలో తప్పు లేదు.

గ్రీకు దేవతలకి వైదిక దేవతలకి మధ్య పోలికని శోధించే క్రమంలో మరి కాస్త ముందుకు వెళదాం. దివ్యాశ్వాన్ని ఎక్కి బెలెరస్ అనే దుష్టమృగాన్ని సంహరించిన బెలెరొఫోన్ అనే యోధుడికి, కాంతిని కాజేసే వలుడు అనే దుష్టుణ్ణి హతం చేసిన వలహనుడైన ఇంద్రుడికి మధ్య సంబంధం ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే పెగసస్ గాధని ఈ విధంగా అన్వయించినప్పుడు ప్రాచీనుల ఆలోచనాపైఖరి గురించి కొన్ని ప్రాథమిక విషయాలు వెల్లడి అవుతాయంతే. కవితా ధారలని తలచుకున్నప్పుడు వారి మనసుల్లో భౌతిక ప్రవాహం స్ఫురిస్తుందని తెలుస్తుందంతే. సరస్వతి అంటే “స్రవంతి, జాలువారే ప్రవాహం”. కాబట్టి ఆ పదం అటు నదికే కాక, కవితా స్ఫూర్తికి కూడా ఇంపుగా వర్తిస్తుంది. కాని కవితాస్ఫూర్తికి, ఒక ప్రత్యేకమైన భౌతిక నదికి మధ్య పోలిక వుందనే భావన వెనుక ఆలోచన ఏమిటి? పైగా వేదంలో ఆ పవిత్రమైన స్ఫూర్తితో జోడించబడినది కేవలం ఒక ప్రత్యేకమైన నది కాదు. ఎందుకంటే వేద ఋషుల మనసుల్లో ఏడు నదులు ఎప్పుడూ కలిసే ప్రవహిస్తాయి. ఆ నదీమూలాలని కప్పేస్తూ వృత్రాసురుడు వాటి ప్రవాహానికి అడ్డుపడినప్పుడు, ఇంద్రుడు కొట్టిన దెబ్బకి వృత్రుడు దారితొలగితే, ఆ నదులన్నీ ఒక్కసారిగా కలిసే పెల్లుబుకుతాయి. కాబట్టి సప్తధారలతో కూడుకున్న ఆ ప్రవాహంలో ఒక్క నదికి మాత్రమే ప్రత్యేకమైన అధ్యాత్మిక ప్రాధాన్యత కలిగి, తక్కిన నదులన్నీ పంజాబ్ లో ఏటేటా వర్షాకాలంలో ఏర్పడే

పిల్లకాలువలని అనుకోవడం అసంభవం అవుతుంది. కాబట్టి సరస్వతి యొక్క అధ్యాత్మిక అంతర్యంలోనే మొత్తం వైదిక జలాలు అన్నిటి యొక్క అధ్యాత్మిక ప్రాముఖ్యత దాగి వుంది[11].

సరస్వతికి కేవలం ఇతర నదులతో మాత్రమే కాదు ఇతర దేవతలతో కూడా ఆమెకు సంబంధం వుంది. వారిలో భారతి, ఇళ ముఖ్యులు. కాలాంతరంలో వచ్చిన పౌరాణిక సాంప్రదాయంలో సరస్వతి వాక్కుకి, చదువుకి, కవిత్వానికి అధిష్ఠాన దేవత. భారతి ఆమె యొక్క పలు నామాలలో ఒకటి. కాని వేదంలో భారతి, సరస్వతి వేరు వేరు దేవతలు. భారతిని మహి అని కూడా అంటారు – అంటే విశాలమైనది, మహత్తరమైనది, బృహత్తరమైనది. ఇళ, మహి లేదా భరతి, సరస్వతి – ఈ దేవతా త్రయాన్ని ఎప్పుడూ కలిపే ఆవాహన చెయ్యడం జరుగుతుంది. యజ్ఞంలోకి రమ్మని అగ్ని దేవుడు వివిధ దేవతలని ఈ విధంగా ఆహ్వానిస్తున్నాడు.

ఇళా, సరస్వతీ, మహీ, తిస్రో దేవీ మహిర్భువః

బర్హిః సీదంత్వస్రిధః

“అక్షతమైన గమనము కలిగిన ఇళ, సరస్వతి, మహి అనే దేవతా త్రయము, ఆనందప్రదాతలై ఈ యజ్ఞ పీఠమును అలంకరించుగాక!”

తప్పటడుగు గాని, దుష్ఫలితము (దురితం) గాని, పాపము గాని, దోషము గాని లేని చలనము గలవారని పై శ్లోకం వారిని కొనియాడుతోందని నాకు అనిపిస్తోంది. ఇదే సూత్రం పదవ మండలంలో, 110 వ సూక్తంలో ఇలా మరింత విపులీకరించబడింది –

ఆ నో యజ్ఞం భారతీ తూయం ఏతు,

ఇళా మనుశ్వద్ ఇహ చేతయంతీ;

[11] కాలాంతరంలో వచ్చిన భారతీయ చింతనలో ఈ నదులకి ఒక ప్రత్యేక ప్రతీకాత్మక అర్థం వుంది. ఉదాహరణకి గంగ, యమున, సరస్వతులకి, వాటి సంగమానికి తంత్రవిద్యలో ఒక ప్రతీకాత్మక అర్థం వుంది. యోగవిద్యలో కూడా వీటిని వాడినా వాటి అర్థం వేరు.

తిస్రో దేవీర్ బహిర్ ఏదం స్యోనం,

సరస్వతీ స్వపసః సదంతు.

"మా యాగానికి భారతి త్వరపడి రావాలి, మా మానవ చేతనలో (లేదా జ్ఞానంలో, అవగాహనలో) ఇళ మేలుకోవాలి, మరియు సరస్వతి – ఆ ఆనందపీఠాన్ని అధిష్ఠించిన ముప్పురు దేవతలు పనిలో నిమగ్నులై వున్నారు."

సరస్వతి ప్రసాదించే కవితా స్ఫూర్తికి సన్నిహితమైన క్రియలు ఈ ముగ్గురు దేవతలకి ఉన్నాయన్న విషయం పోను పోను మరింత స్పష్టం అవుతుంది. సరస్వతి అంటే వాక్కు, స్ఫూర్తి. ఆ స్ఫూర్తి నా ఉద్దేశంలో ఋతం నుండి, అంటే సత్య చైతన్యం నుండి వస్తుంది. భారతి, ఇళ కూడా అదే వాక్కు యొక్క, జ్ఞానం యొక్క రూపాంతరాలు అయ్యుండాలి. మధుచ్ఛందుడి ఎనిమిదవ సూక్తంలో ఒక ఋక్కు వుంది. అందులో భారతిని మహి అనే పేరుతో సంబోధించడం జరుగుతుంది.

ఏవా హ్యస్య సూనృతా, విరప్శీ గోమతీ మహీ;

పక్వా శాఖా న దాశుషే.

"ఆ విధంగా మహి ఇంద్రుడి కోసం కిరణపూర్ణం అవుతుంది. పలు సిరులతో పల్లవిస్తూ, సత్యంలో పరవశిస్తూ, పక్వానికి వచ్చిన తరుశాఖలా యాజ్ఞికుడి కోసం సిద్ధంగా ఉంటుంది."

వేదంలోని కిరణాలు సూర్యుడి కిరణాలు. ఆ దేవత భౌతిక తేజానికి చెందిన దేవత అనుకోవాలా, లేక "గో" అనే శబ్దాన్ని 'ఆవు'గా అనువదించి, ఆవులతో నిండుగా వున్న మహి యాజ్ఞికుడికి ఆవులని ప్రసాదించడానికి సిద్ధంగా వుందనుకోవాలా? ఇక్కడే సరస్వతి యొక్క అధ్యాత్మిక లక్షణం అటువంటి అసంగతమైన అన్వయం నుండి మనని కాపాడుతుంది. అంతేకాక అది ప్రకృతి బద్ధమైన అన్వయాన్ని కూడా త్రోసిపుచ్చుతుంది. యజ్ఞంలో సరస్వతికి సహచరిగాను, వాగ్దేవికి సహోదరిగాను వర్ణించబడ్డ మహి,

కాలంతరంలో పౌరాణిక యుగంలో ఆమెతో అభిన్నమైనట్టుగా వర్ణించబడడాన్ని బట్టి, వేదంలో కాంతి ఎప్పుడూ జ్ఞానానికి, ఆత్మప్రకాశనానికి ప్రతీక అని మరొక్క సారి స్పష్టంగా తెలుస్తోంది. పరంజ్యోతికి, సువిశాల తేజానికి (బృహజ్జ్యోతి), సత్యమైన తేజానికి (ఋతంజ్యోతి) సూర్యుడు ప్రతీక. *ఋతం* మరియు *బృహత్* అనే పదాల మధ్య సంబంధం వేదంలో సాంతం ద్యోతకమవుతూ ఉంటుంది.

ఈ శ్లోకాలు అన్నిట్లోను మనకు ఒక మహత్తరమైన, విరాజమానమైన చైతన్య స్థితి గురించిన వర్ణన కనిపిస్తోంది. ఆ చైతన్య స్థితి విశాలమైనది (*బృహత్*), ఆత్మపరంగా సత్యవంతమైనది (*సత్యం*), కర్మపరంగా సత్యవంతమైనది (*ఋతం*). ఆ చైతన్యం దేవతలకి చెందినది. ఈ సత్య చైతన్యం గల వాడు కనుకనే అగ్నిని *ఋతచిత్* అంటారు. ఇటువంటి సూర్యుడి కిరణాలతో పూర్ణమైనది మహి; అటువంటి ప్రకాశాన్ని ఆమె తనలో ధరించి ఉంటుంది. పైగా ఆమె *సూనృత*, ఆమె వాక్కు ఆనందమయ సత్యాన్ని వ్యక్తం చేస్తుంది. అలాగే ఆనందమయ సత్యానికి ప్రేరణ నిచ్చేదిగా సరస్వతిని కూడా వర్ణించడం జరిగింది – *చోదయిత్రీ సూనృతానాం*. చివరిగా ఆమె "*విరప్శీ.*" గొప్ప సమృద్ధితో ప్రఫుల్లమవుతుంది. విశాలత ఆ సత్యం యొక్క లక్షణం అని ఆ పదం తెలుపుతోంది (*ఋతం బృహత్*). మరో ఋక్కులో (I.22.10) ఆమెను "*వరూత్రీ దిషణా*" అని వర్ణించారు. అంటే విశాలంగా ఆవరించే ధీశక్తి అన్నమాట. కాబట్టి మహి అంటే సత్యం యొక్క విరాజమాన విస్తృతి. ఆమె ఆ విస్తృతికి, బృహత్తుకి, ప్రతీక. తనలోనే సత్యాన్ని (*ఋతం*) ధరించిన అతిచేతన. కాబట్టే ఆమె యాజ్ఞికుడికి పక్వానికి వచ్చిన ఫలాలతో భారంగా వున్న తరుశాఖ వంటిది.

ఇళ కూడా సత్యాన్ని తెలిపే శబ్దమే; కాలాంతరంలో ఆమె పేరుకి అర్థం వాణి అనుకుని పొరబడడం జరిగింది. సరస్వతి చైతన్యాన్ని సరైన ఆలోచనల దిశగాను, సరైన మనోస్థితుల దిశగాను మేల్కొలుపుతుంది – *చేతన్తీ సుమతీనాం*. అదే విధంగా ఇళ కూడా చైతన్యంలో జ్ఞానాన్ని మేల్కొలుపుతుంది (*చేతయన్తీ*). శక్తితో నిండి వున్న ఆమె (*సువీరా*) జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆమెకు సూర్యదేవుడితో కూడా సంబంధం వుంది. ఉదాహరణకి ఒక ఋక్కులో (V.4.4.) సత్య తేజానికి ప్రభువై, ఇళతో అనన్యచిత్తుడైన సూర్యుడి కిరణాల సహాయంతో శ్రమించమని అగ్నిదేవుణ్ణి ఆవాహన చెయ్యడం జరుగుతుంది – *ఇళయా సజోషా యతమానో రశ్మిభి సూర్యస్య*. ఆమె సూర్యుడి పసులకి, అంటే కిరణాలకి మాత.

శోధించి సాధించేదని ఆమె నామానికి అర్థం. ఋతం, ఋషి అనే పదాల మధ్య సంబంధం ఆమె పేరులో కూడా ధ్వనిస్తుంది. కాబట్టి సత్యాన్ని చేరుకునే ద్రష్ట యొక్క దర్శనమే ఇళ.

సరస్వతి 'శ్రుతి'కి, అంటే సత్యం యొక్క వినికిడికి ప్రతీక. ఇళ 'దృష్టి'కి సత్య దర్శనానికి ప్రతీక. దృష్టి, శ్రుతి అనేవి ఋషి యొక్క, కవి యొక్క, సత్యద్రష్ట యొక్క రెండు ముఖ్యమైన సామర్థ్యాలు కనుక, ఇళకి సరస్వతికి మధ్య సాన్నిహిత్యాన్ని అర్థం చేసుకోవచ్చు. భారతి లేదా మహి సత్య చైతన్యం యొక్క వైశాల్యానికి ప్రతీక. మానవుడి యొక్క సంకుచిత మనస్తత్వంలోకి ముందు ఈ వైశాల్యం ప్రవేశించి, ఆ మనస్తత్వాన్ని విస్తరింపజేసి, ఆ తరువాత తన ఇద్దరు సోదరీ శక్తులని ప్రవేశపెడుతుంది. కాలాంతరంలో ఈ సునిశితమైన, సూక్ష్మమైన భేదాలన్నీ విస్మరించబడ్డాయి. వేదవిజ్ఞానం విస్మృతికి లోనై భారతి, సరస్వతి, ఇళ అంతా ఏకమై పోయారు.

ఈ ముప్పురు దేవతలు మనిషిలో ఆనందాన్ని (*మయస్*) జనింపజేస్తారని కూడా చెప్పబడింది. వేద ఋషుల దృష్టిలో సత్యానికి, ఆనందానికి ఉండే చిరంతన సంబంధం గురించి ముందే ఎన్నో చోట్ల ప్రస్తావించాను. మానవ చేతనలో సత్యమైన, అనంతమైన చైతన్యం మేలుకొన్నప్పుడే, బాధలతో, యాతనలతో కూడుకున్న ఈ దుస్స్వప్నం నుండి, ఈ విభాజిత భవలోకం నుండి మేలుకుని మనిషి ఆనందమయ స్థితిని చేరుకుంటాడు. ఆ ఆనందమయ స్థితినే *భద్రం* (ప్రేమ), *మయస్* (ఆనందం), *స్వస్తి* (శుభకరమైన స్థితి) మొదలైన పదాలతోను, అంతేకాక మరింత సామాన్యార్థం గల *వార్యం, రయిః, రాయః* మొదలైన పదాలతోను వేదం సూచిస్తుంది. వేదఋషి దృష్టిలో సత్యం అనేది ఒక ద్వారం లేదా మార్గం వంటిది, ఆ మార్గానికి గమ్య స్థానం లేదా చరమలక్ష్యం ఆనందం. మరోలా చెప్పుకోవాలంటే సత్యం పునాది, ఆనందం పరమసిద్ధి.

ఆ విధంగా సరస్వతి యొక్క తత్వం గురించి, ఆమె అధ్యాత్మిక అంతరార్థం గురించి, ఇతర సన్నిహిత దేవతలకి ఆమెకి మధ్య సంబంధం గురించి చెప్పుకోవచ్చు. మరైతే అదే పేరు గల వైదిక నదికి, ఆ నదితో సంబంధం గల మరి ఆరు సెలయేళ్లకి మధ్య సంబంధం ఎటువంటిది?

వైదిక సాంప్రదాయంలోనే కాక ఎన్నో ప్రాచీన సాంప్రదాయాలలో ఏడు సంఖ్యకి ఎంతో ప్రాముఖ్యత వుంది. ఆ సంఖ్య వేదంలో ఎన్నో చోట్ల తలెత్తుతుంది – ఏడు ఆనందాలు (*సప్త రత్నాణి*); ఏడు అగ్నులు, లేదా అగ్నికీలలు (*సప్త అర్చిషః, సప్త జ్వాలాః*); ఏడు భావనా శక్తులు (*సప్త ధీతయః*); ఏడు కిరణాలు లేదా గోవులు, లేదా అజేయమైన గోవు యొక్క ఏడు రూపాలు, దేవమాత అదితి (*సప్త గావః*); ఏడు నదులు, ఏడుగురు తల్లులు, లేదా ఏడు గోవులు (*సప్త మాతరః, సప్త ధేనవః*). ఈ సందర్భంలో కిరణాలని, గోవులని ఒకే పదంతో సూచించడం జరుగుతుంది. పైన చెప్పబడ్డ ఏడు విషయాల కూటములన్నీ వైదిక విశ్వరచనకి చెందిన ఏడు తత్వాలతో సంబంధం కలిగి వున్నాయి. గొప్ప బుద్ధికుశలత గల ప్రాచీనులకి ఈ తత్వాల గురించిన చింతన పట్ల ఎంతో మక్కువ ఉండేది. ప్రాచీన భారత తత్వచింతనలో ఈ తత్వాల సంఖ్య ఒకటితో మొదలై ఇరవైని దాటిన సందర్భాలు ఉన్నాయి. వైదిక చింతనలో కొన్ని అధ్యాత్మిక మూలసూత్రాలని బట్టి ఈ తత్వాలని గుర్తించడం జరిగింది. మరి ఋషుల దృష్టిలో ఉనికి మొత్తం సచేతనమైన ఆత్మలో జరిగే చలనమే. ఆధునిక దృష్టికి ఈ వర్గీకరణలన్నీ నిస్సారమైనవిగా తోచవచ్చు. కాని అది నిజం కాదు. ఆ వర్గీకరణలన్నీ ఒక సజీవమైన అధ్యాత్మిక సాంప్రదాయంతో ముడివడి ఉన్నాయి. ఆ ప్రాచీన, సుదూర గతానికి చెందిన భావవ్యవస్థని అర్థం చేసుకోవాలంటే ఆ అధ్యాత్మిక సాంప్రదాయాన్ని కుడా అర్థం చేసుకోవాలి.

వేదంలో కొన్ని మూలసూత్రాలు పలువిధాలుగా నిర్వచించబడ్డాయి. ఒక ఏకైక తత్వం సమస్తానికి ఆధారంగా ముందుగా గుర్తించబడింది; ఆ ఏకంలో రెండు తత్వాలు ఇమిడి ఉన్నాయి – దైవికం - మానవీయం, మర్త్యం – అమరం. ఈ రెండు సంఖ్య మరెన్నో ఇతర తత్వాల జంటలలో కనిపిస్తుంది – భువి-దివి, మనసు-దేహం, పురుషుడు – ప్రకృతి. ఈ పురుష ప్రకృతులే సమస్త జీవులకి తండ్రిగాను, తల్లిగాను భావింపబడ్డారు. ఆ భువి, దివుల జంటను మళ్ళీ ఒకే సహజ శక్తి యొక్క రెండు మారురూపాలుగా, అంటే మనోచైతన్యం, భౌతిక చైతన్యంగా పరిగణించినప్పుడు, ఆ శక్తులని తల్లి దండ్రులుగా కాక, ఇద్దరు తల్లులుగా భావించడం జరుగుతుంది. ఈ సూత్ర త్రయాన్ని మళ్ళీ రెండు విధాలుగా గుర్తించడం జరిగింది. మొదటిది దివ్యమైన అస్తిత్వం, చైతన్యం, ఆనందాలతో కూడుకున్న సచ్చిదానందం. రెండవది మనో, ప్రాణ, దేహాలతో కూడుకున్న త్రివిధమైన ఇహలోకం. ఈ మనో, ప్రాణ,

దేహాలు అనే పునాదుల మీదనే వేదాలలోను, పురాణాలలోను చెప్పబడ్డ లోకత్రయం స్థాపించబడింది. కాని మామూలుగా గుర్తించబడ్డ పూర్తి సంఖ్య ఏడు. మూడు దివ్య, పరమ తత్వాలని మూడు ఐహిక తత్వాలతో కలిపి, రెంటికీ వంతెనలా పని చేసే సత్య చైతన్యాన్ని (*ఋతం బృహత్*), కాలాంతరంలో విజ్ఞానం గాను, మహస్ గాను వర్ణించబడ్డ తత్వాన్ని ప్రవేశపెట్టినప్పుడు - మొత్తం కలిసి ఏడు సంఖ్య వస్తుంది. ఈ మహస్ అనే పదం విశాలమైన అని అర్థం గలది కనుక ఇది బృహత్ అనే పదంతో సమానం. ఇలాగే, ఐదు, ఎనిమిది, తొమ్మిది, పది, ఆఖరుకి పన్నెండు తత్వాలతో కూడుకున్న వర్గీకరణలు కూడా ఉన్నాయి. కాని అవన్నీ మనకిప్పుడు అప్రస్తుతం.

ఈ తత్వాలన్నీ అవిభాజ్యమైనవి, సర్వవ్యాపకమైనవి కనుక వాటిని ప్రకృతిలో భాగమైన ప్రతియొక్క సృష్టికి వర్తింపజేయవచ్చు. ఉదాహరణకి మనస్సును వివిధ తలాలకి వర్తింపజేసినప్పుడు ఆ తలాలని ఏడు మనోతలాలుగా వర్ణించవచ్చు. ఆ మనోతలాలని వరుసగా పార్థివ మనస్సు, ప్రాణిక మనస్సు, శుద్ధ మనస్సు, సత్య మనస్సు గాను, చివర్లో వాటన్నిటికీ పరమావధి అయిన తలాన్ని "*పరమా పరావత్*" గాను, ఇలా వరుసగా నిర్వచించవచ్చు. అలాగే ఏడు కిరణాలు, లేదా ఏడు గోవులే అదితి, పరమ జనని, పరమ ప్రకృతి, అనంత చైతన్యం. కాలాంతరంలో వచ్చిన ప్రకృతి లేదా శక్తి అనే భావాలకి మూలం. తొలినాళ్ల భావజాలంలో జగజ్జనని గోవు అయితే పురుషుడు వృషభం. జగజ్జనని తన జగద్ వ్యాప్తమైన కర్మధారలో ఏడు తలాలలోను చైత్య శక్తిగా వ్యక్తమవుతుంది. అలాగే ఏడు నదులు కూడా పురాణాలు చెప్పిన ఏడు ఆత్మిక లోకాలకి సంబంధించిన చైతన్య స్రవంతులు. మానవ చేతనలో వాటి పూర్ణ ప్రవాహమే అతడి ఉనికికి నిండుదనాన్ని ఇస్తుంది, అతడి అంతర్యాన్ని పూరిస్తుంది, అతడి శక్తిని ప్రబలం గావిస్తుంది. వైదిక ప్రతీకలతో చెప్పుకోవాలంటే అతడి గోవులు ఏడు నదుల జలాలని సేవిస్తాయి.

అలాంటి ప్రతీకావళిని స్వీకరిస్తే, అలాంటి భావనలు అప్పట్లో ఉండేవని ఒప్పుకుంటే, ప్రాచీన ఆర్యులు జీవించిన పరిసరాలు, అప్పటి జీవన సరళి ఎలా ఉండేదో అర్థమవుతుంది.

(థియసాఫికల్ తత్వచింతన వల్ల "plane", అంటే తలం, అనే భావన మనకి ఎలా అలవాటయ్యిందో, వైదిక ప్రతీకలు ఆర్యుల జీవన పరిసరాలతో అంత సహజంగా సరిపోతాయని తెలుస్తుంది.) ఏడు నదులలో సరస్వతి ఒక నది ఎందుకయ్యిందో స్పష్టమవుతుంది. ఎందుకంటే ఆమె సత్య తత్వం (ఋతం లేదా మహస్) నుండి జనించిన స్రోతస్సు. ఉదాహరణకి మన మూడవ సూక్తం ఆఖర్లో వేదం ఆ తత్వం గురించి "మహో అర్ణస్" (మహత్తర జలాశయం) అంటుంది. దీన్నే మరి కొన్ని చోట్ల "*మహాన్ అర్ణవః*" అని కూడా అంటుంది. "మహస్" అనే పదానికి మూలం ఎక్కడుందో ఇక్కడ తెలుస్తుంది. సరస్వతికి ఈ మహత్తర జలాశయానికి మధ్య చాలా దగ్గరి సంబంధం వుందని ఈ మూడవ సూక్తంలో తెలుస్తుంది. ఈ సంబంధాన్ని మరింత సూక్ష్మంగా పరిశీలించాకనే వైదిక గోవులకి, ఇంద్ర దేవుడికి మధ్య సంబంధాన్ని, అలాగే సరస్వతికి దగ్గరి బంధువైన సరమ దేవతతో సంబంధాన్ని శోధిద్దాము. ఈ సంబంధాలన్నీ వివరంగా అర్థం చేసుకుంటే తప్ప స్వర్గాధీశుడైన ఒక మహోన్నత వైదిక దేవతని స్తుతించే మధుచ్ఛందుడి ఇతర ఋక్కులని అర్థం చేసుకోలేము. మన సిద్ధాంతం ప్రకారం ఆ దేవత మనోబలానికి, ముఖ్యంగా మనిషిలో ఉన్న దివ్యమైన, స్వయంప్రకాశమైన మనస్సుకి ప్రతీక.

అధ్యాయం 10

ప్రతీకలుగా సముద్రాలు నదులు

మధుచ్ఛందుడి మూడవ సూక్తంలోని మూడు ఋక్కులలో సరస్వతిని ఈ విధంగా ఆవాహన చేస్తాడు –

పావకా నః సరస్వతీ వాజేభిర్వాజినీవతి ।

యజ్ఞం వష్టు ధియావసుః ॥

చోదయిత్రీ సూనృతానాం చేతన్తీ సుమతీనాం।

యజ్ఞం దధే సరస్వతీ॥

మహో అర్ణః సరస్వతీ ప్రచేతయతి కేతునా।

ధియో విశ్వా విరాజతి॥

సత్యం యొక్క ఏ శక్తిని అయితే మనం స్ఫూర్తి అంటున్నామో, ఆ శక్తికి సరస్వతి ప్రతీక అని మనం అర్థం చేసుకున్నప్పుడు మొదటి రెండు వాక్యాలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. సత్యం నుండి వచ్చే స్ఫూర్తి అసత్యాన్ని పారద్రోలి మనిషిని పునీతం చేస్తుంది. ప్రాచీన భారతీయ చింతన ప్రకారం మరి పాపం అంటే కేవలం అసత్యమే. పాపం అంటే తప్పుదోవ పట్టిన చిత్తం, తప్పు దోవలో పోతున్న సంకల్పం, కర్మ. మన పట్ల, మన జీవితం పట్ల మనకి ఉండే అవగాహనలో మౌలికంగానే ఒక అసత్యం వుంది. లేదా ఆ అవగాహన కలుషం గావించబడింది. మన ఆలోచన మార్చుకోమని ప్రోత్సహించే ఒక తేజంగా, ఒక వాక్కుగా సత్యం మన అనుభవంలోకి వస్తుంది. మనకి మన పట్ల, మన పరిసరాల పట్ల ఓ సరికొత్త అవగాహనని ప్రసాదిస్తుంది. ఆలోచనలో సత్యం ఉంటే దృష్టిలో సత్యం ఉంటుంది. దృష్టిలో సత్యం ఉంటే ఆత్మలో సత్యం ఉంటుంది. ఆత్మలో సత్యం ఉంటే అది సహజంగా భావంలోకి, సంకల్పంలోకి, చర్యలోకి ప్రవహిస్తుంది. నిజానికి సమస్త వేదానికి కీలకమైన భావన ఇదే.

స్ఫూర్తికి ప్రతీక అయిన సరస్వతి గొప్ప విరాజమాన ఐశ్వర్యంతో, ప్రగాఢ భావసంపదలతో నిండుగా ఉంటుంది. ఆమె యజ్ఞాన్ని ఉద్ధరిస్తుంది. మానవ చేతన మేలుకున్నప్పుడు దివ్యత్వానికి చెందిన స్పృహ కలుగుతుంది. అప్పుడు ఆ చేతనలో సత్యంతో అనుగుణమైన భావాలు, ఆలోచనలు కదులుతాయి. అటువంటి చేతనలో ఆమె తన కాంతులు కురిపిస్తుంది. ఆ కాంతుల ప్రభావం వల్ల చేతనలో గొప్ప సత్యాలు ఆవిర్భవిస్తాయి. వేద ఋషుల ప్రకారం వాటి ఆవిర్భావం వల్లనే మనిషి అసత్యం నుండి, దౌర్బల్యం నుండి, బంధాల నుండి విముక్తుడవుతాడు. పరమానంద సీమల ద్వారాలు అతడి కోసం తెరుచుకుంటాయి.

సరస్వతి మనిషిలో అసలైన దృష్టిని (*కేతు*), - అది సాధారణమైన మర్త్య మానవ దృష్టి కాదు, అది దివ్యమైన దృష్టి (*దైవ్య కేతు*) – మేల్కొలిపి, ఆ విధంగా సత్య చైతన్యం యొక్క మహత్తర ప్రవాహాన్ని మానవ చేతనలోకి ప్రవేశపెడుతుంది. ఆ చైతన్యంతో మన ఆలోచనలు అన్నిటినీ ప్రకాశవంతం గావిస్తుంది. వేదఋషులు వర్ణించే ఈ సత్య చైతన్యం అతిమానస తలం అని జ్ఞాపకం ఉంచుకోవాలి. అదొక ఆత్మశిఖరం (*అద్రేః* సాను). సాధారణ ఉనికికి అందనంత ఎత్తులో ఉన్న ఆ శిఖరాన్ని ప్రయాస మీదట అధిరోహించాలి. అది మన జాగృత చేతనలో భాగం కాదు. అతిచేతనా నిద్రలో మన నుండి గుప్తంగా ఉన్న స్థితి అది. సరస్వతి

ప్రసాదించే నిరంతర స్ఫూర్తి స్రవంతి చేత మన చేతనలో సత్యం మేలుకొని, మన ఆలోచనలు ప్రకాశవంతం అవుతాయని మధుచ్ఛందుడు గానం చేసినప్పుడు ఆ మాటలలోని అర్థం ఇప్పుడు మనకి తెలుస్తుంది.

ఈ వాక్యాన్ని వ్యాకరణ దృష్టితో చూసినప్పుడు కాస్త వేరేగా అనువదించడానికి వీలవుతుంది. "*మహో అర్ణస్*" అన్న పదజాలంలో సరస్వతి ఉద్దేశించబడింది అనుకుంటే, ఆ శ్లోకాన్ని ఈ విధంగా అనుదవించవచ్చు – "మహా నది అయిన సరస్వతి అవగాహన చేత మనలో జ్ఞానాన్ని జాగృతం చేసి, మన భావాలు అన్నిట్లోను భాసిస్తుంది." సాయణుడు తలపోసినట్లు ఈ పదజాలానికి అర్థం ఒక మహా నది అని, పంజాబ్ ప్రాంతం లోని ఒక నది అని అనుకుంటే, అర్థం అల్లకల్లోలం అవుతుంది. అయితే ఆ పదజాలాన్ని గొప్ప స్ఫూర్తి స్రవంతిగా అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ సత్య చైతన్యపు మహా సముద్రం యొక్క ప్రస్తావన లేదు. అయితే మరి కొన్ని చోట్ల మాత్రం ఒక బ్రహ్మాండమైన వరద యొక్క బృహత్తర బలంతో (*మహ్నా మహతో అర్ణవస్య*) దేవతలు పని చేస్తున్నారని చెప్పబడింది. అయితే ఇక్కడ సరస్వతి ప్రస్తావన లేదు. ఆ పదాలు ఆమెను ఉద్దేశిస్తున్నాయా అన్నది కాస్త సందేహమే. వేదాల్లో సరస్వతి ఇంద్రుడి యొక్క నిగూఢ ఆత్మగా చెప్పబడింది. మరి సరస్వతి కేవలం ఉత్తరాదికి చెందిన నది అనుకుంటే, ఇంద్రుడు ఆకాశంలో ఉండే దేవుడు అనుకుంటే, ఆ వర్ణన పూర్తిగా అర్థరహితమవుతుంది. కాని ఇంద్రుడు విరాజమాన మానసానికి ప్రతీక అనుకుంటే, సరస్వతి అతిమానస సత్యం యొక్క రహస్య తలం నుండి పెల్లుబుకే స్ఫూర్తి స్రవంతి అనుకుంటే సముచితార్థం ఏర్పడుతుంది. కాని "*మహ్నా మహతో అర్ణవస్య*" అనే పదాలని "సరస్వతి యొక్క గొప్పదనం చేత" అని అనువదించినప్పుడు దేవతల కూటమిలో సరస్వతికి అతి ముఖ్యమైన స్థానాన్ని ఆపాదించినట్లు అవుతుంది. అది అసంభవం. దేవతలు సత్యానికి అనుగుణంగా (*ఋతేన*) పని చేస్తారు అని వేదం ఎన్నో చోట్ల చెప్తుంది. కాని సత్యంతో అనుసంధానమై వున్న ఎందరో దేవతలలో సరస్వతి కూడా ఒక దేవత. వారందరిలోకి ముఖ్యమైనదని, విశ్వజనీనమైనదని చెప్పడానికి లేదు. కాబట్టి నేను సూచించిన అన్వయం వేదం అంతటా వ్యాపించిన చింతనతో సరిపోతోంది. ఇతర వేదభాగాలలో ఆ పదజాలం కనిపించిన సందర్భాలలో కూడా ఆ అన్వయం పొసగుతోంది.

పైన చెప్పుకున్న మహా జలాశయాన్ని సరస్వతి అనుకున్నా, సత్య సముద్రం అనుకున్నా, ఒక్కటి మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. వేద ఋషులు జలాశయం అన్న చిత్రాన్ని – అది నది కావచ్చు, సముద్రం కావచ్చు – ప్రతీకాత్మకంగానే వాడారని, అదొక అధ్యాత్మిక ప్రతీక అని తెలుస్తోంది. ఆ ధోరణిలో ఇంకా శోధిస్తూ పోతే ఏమవుతుందో చూద్దాం. వేదపురాణాలలోనే కాక, అసలు హైందవ కృతులలో సామాన్యంగా ఉనికి సమస్తాన్ని ఒక సాగరంగా అభివర్ణించడం కనిపిస్తుంది. వేదం రెండు జలాశయాల గురించి చెప్తుంది – ఒకటి ఉన్నతం, రెండవది నిమ్నం. ఒకటి ఉపచేతనా సముద్రం, అంధకారమయమైనది, అవ్యక్తమైనది. రెండవది అతిచేతనా సముద్రం – ఇది విరాజిత, సనాతన అభివ్యక్తి, కాని మానవ మానసానికి అతీతమైనది. నాల్గవ మండలంలోని ఆఖరు ఋక్కులో వామదేవుడు ఈ రెండు సముద్రాల గురించి మాట్లాడతాడు. ఒక తీయని కెరటం కడలి లోంచి పైకి లేస్తుందని, సోమరసంతో (*అంశు*) నిండి ఆ అల పైనెక్కి పైపైకి పోతూ అమరత్వాన్ని పొందొచ్చని అంటాడు. ఆ సోమరసం లేదా కెరటం విమలతకి, లేదా స్పష్టతకి రహస్య నామం (ఘృతస్య, కరిగించిన వెన్న); అదే దేవతల నాల్క; అదే అమరత్వానికి నాభి.

సముద్రాద్ ఊర్మిర్ మధుమాన్ ఉదారద్

ఉపాంశునా సమ్ అమృతత్వమ్ ఆనట్ |
ఘృతస్య నామ గుహ్యం యద్ అస్తి

జిహ్వా దేవానామ్ అమృతస్య నాభిః

పై శ్లోకాలలో సముద్రం, తేనె, సోమరసం, నెయ్యి మొదలైనవన్నీ అధ్యాత్మిక ప్రతీకలు అనుకోవడంలో సందేహం లేదనుకుంటాను. ఇక్కడ వామదేవుడి ఉద్దేశంలో ఏ హిందూ మహా సముద్రం లోంచో, బంగాళా ఖాతపు ఉప్పు నీటి లోంచో ఓ మధు కెరటం పెల్లుబికిందని కాదు. పోనీ ఆ మధురసపు కెరటం ఇండస్ నది లోంచో, గంగా నది లోంచో పుట్టిందని, ఆ మధురసం నిజానికి నెయ్యి అని కూడా ఇక్కడ తాత్పర్యం కాదు. మన ఉపచేతన

లోతుల్లోంచి ఒక తీయని ఆనంద కెరటం పైకి తన్నుకొస్తుందని ఆయన ఉద్దేశం. విమలమైన మనస్సు యొక్క కర్మ వెనుక ఉండే రహస్య యదార్థమే ఆ ఆనందం. ఏ ఆనందానికి సోమదేవుడు ప్రతీకగా ఉన్నాడో, ఆ ఆనందమే మనస్సుగా, ఇంద్రియ సంవేదనలుగా మారిందని వేదంతం కూడా బోధిస్తుంది. మానసిక సంవేదనలు అన్నిట్లోను ఉనికిలో రహస్యంగా ఉండే ఒక ఆనందం దాగి ఉంటుందని, ఆ ఆత్మరహస్యాన్ని ఆ విధంగా వ్యక్తం చేస్తోందని ఇక్కడ మనకు అర్థమవుతోంది. కాబట్టి ఆనందాన్ని దేవతల నాలుకగా ఊహించుకోవచ్చు. ఆ నాలుకతో వారు ఉనికిలోని తీయదనాన్ని రుచిచూస్తారు. ఆ నాభి చుట్టూ అమరత్వపు స్థితి లేదా దివ్య స్థితికి చెందిన వ్యవహారాలన్నీ సమీకృతమవుతాయి. వామదేవుడు ఇంకా ఇలా అంటాడు – "ఆ రహస్య విమలతని వ్యక్తం చేద్దాము – ఉనికి లోతుల్లో దాగిన ఆనందాన్ని, ఆ సోమరసాన్ని, వెలికి తీద్దాము. దైవేచ్ఛకి, సచేతన శక్తికి, మన ఆత్మవిభుడికి ప్రతీక అయిన అగ్నికి సమర్పణలతో, నివేదనలతో మనం చేసే విశ్వయజ్ఞంతో ఆ ఆనందాన్ని కాపాడుకుందాము. అతడే [అగ్ని] నాలుగు కొమ్ముల విశ్వవృషభం. అతడు మానవ చేతనలో పుట్టిన ఆత్మసంకల్పాన్ని విన్నప్పుడు, అతడు ఆనందం యొక్క రహస్య నామాన్ని దాని రహస్య స్థానం నుండి వెలికి తీస్తాడు. "

వయం నామ ప్ర బ్రవామా ఘృతస్య

అస్మిన్ యజ్ఞే ధారయామా నమోభిః;

ఉప బ్రహ్మా శృణవక్ చస్యమానం,

చతుఃశృంగో అవమీద్ గౌర ఏతత్.

మరి మధువు, నేయి ప్రతీకలైతే అసలు యజ్ఞం కూడా ప్రతీకాత్మకమేనని అర్థం చేసుకోవాలి. వామదేవుడి చేత విరచితమైన ఈ రకమైన ఋక్కులలో, సామాన్యంగా కర్మకాండ పరంగా

వర్ణిస్తూ వేద ఋషులు అల్లిన మెలిమి తెర ఇట్టే కరిగిపోతుంది. అంతవరకు గుప్తంగా ఉండిపోయిన వేదాంత సత్యం, వేదరహస్యం భళ్లున సాక్షాత్కరిస్తుంది.

వామదేవుడు తాను వర్ణిస్తున్న సముద్రం ఎటువంటిది అన్న విషయంలో సందేహానికి తావివ్వడు. ఐదవ ఋక్కులో దాన్ని హృదయ సముద్రం (*హృదయాత్ సముద్రాత్*) అంటూ వర్ణిస్తాడు. అందులోంచి విమల ఝరులు (*ఘృతస్య ధారాః*) ఉద్భవిస్తాయి. మనస్సులోను, అంతర హృదయంలోను అవి ఇంకా ఇంకా పునీతమవుతూ ప్రవహిస్తాయి (*అంతర్ హృదా మనసా పూయమానాః*). ఇక ఆఖరు ఋక్కులో ఉనికి మొత్తం త్రివిధమైన పీఠం మీద స్థాపించబడింది అంటాడు. మొదటిది అగ్ని పీఠం – వెనకటి ఋక్కులని బట్టి అది సత్య చైతన్యం అని మనకి తెలుసు. అదే అగ్ని యొక్క స్వగృహం (*స్వం దమమ్ ఋతం బృహత్*). రెండవ పీఠం హృదయం, లేక సముద్రం, ఇదే హృదయ సముద్రం. మూడవది మానవ జీవనం.

ధామన్ తే విశ్వం భువనమ్ అధి శ్రితమ్,

అంతః సముద్రే హృదయంతర్ ఆయుషి.

పైన అతిచేతన, కిందన ఉపచేతనా సముద్రం, రెంటి మధ్యన ప్రాణుల జీవనం – వైదిక భావనలో ఉనికి స్వరూపం ఇదే.

పారే విమల నదుల యొక్క, ఎగసే తేనెల కెరటాల యొక్క గమ్య స్థానం అతిచేతనా సముద్రం. హృదయం లోపల వున్న ఉపచేతనా సముద్రం వాటి నాందిస్థానం. ఊర్ధ్వ సముద్రాన్ని ‘సింధు’ అనే శబ్దంతో సూచిస్తారు. ఆ పదానికి అర్థం నది కావచ్చు, సముద్రం కూడా కావచ్చు; ఈ ఋక్కులో మాత్రం ఆ పదానికి అర్థం నిశ్చయంగా సముద్రమే. ఈ

విమల నదుల గురించి వామదేవుడు ఎంత చక్కని భాషలో వర్ణిస్తాడో చూద్దాం. ఒక గోవులో (*గవి*) పాణులు త్రివిధాలుగా దాచిన స్పష్టతని (*ఘృతం*) దేవతలు వెతికి సాధించారు అని ముందుగా అంటాడు. వేదం ఇక్కడ 'గో' అన్న శబ్దాన్ని గోవు అని, కాంతి అని ద్వంద్వార్థంలో వాడుతోంది అన్నది తేటతెల్లం. గోవు ఇక్కడ బాహ్య ప్రతీక మాత్రమే, దాని అంతరార్థం కాంతి. పణులు గోవులని దొంగలించి దాచిపెట్టిన కథనం వేదంలో తరచు కనిపిస్తుంది. సముద్రం ఒక అధ్యాత్మిక ప్రతీక అయినట్టే – హృదయ సముద్రం (సముద్రే హృది) – సోమరసం అధ్యాత్మిక ప్రతీక అయినట్టే, కరిగించిన వెన్న అధ్యాత్మిక ప్రతీక అయినట్టే, పణులు ఆవులో దాచిన కరిగించిన వెన్నని దేవతలు వెతికి పట్టుకోవడం కూడా ఒక ప్రతీక మాత్రమే అయ్యుండాలని, ఆ ప్రతీక కేవలం భౌతిక కాంతి కాక అధ్యాత్మిక ప్రకాశనం అయ్యుండాలని అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఆవు నిజానికి అదితి, ఉపచేతనలో దాగిన అనంత చైతన్యం. మూడు రకాల ఘృతం అంటే మూడు అంశాలతో కూడుకున్న స్పష్టత – మొదటిది తనలో దాగిన ఆనందాన్ని కనుగొన్న విముక్తమైన ఇంద్రియ సంవేదన, రెండవది ఆలోచనా మానసం లోజ్ఞానాన్ని, తేజస్సుని చేరుకోవడం, మూడవది అత్యున్నత సత్యం, పరమోత్కృష్టమైన అతిమానస దర్శనం. ఋక్కు యొక్క రెండవ భాగంలో ఈ సంగతి తేటతెల్లం అవుతోంది – "ఒకదాన్ని ఇంద్రుడు పుట్టించాడు, ఒక దాన్ని సూర్యుడు పుట్టించాడు, ఒకదాన్ని వేనుడి లోనుండి సహజ వికాసం చేత దేవతలే తీర్చిదిద్దారు." ఇంద్రుడు ఆలోచనా మనస్సుకి స్వామి, సూర్యుడు అతిమానస కాంతికి ప్రభువు, వేనుడే సోమరసం, మానసిక ఆత్మానందానికి స్వామి, ఇంద్రియ మనస్సుకి సృష్టికర్త.

ఈ సందర్భంలో పణులు అంటే అధ్యాత్మిక విరోధులు అని, అంధశక్తులు అని గమనించాలి. అంతేకాని వాళ్లు ద్రావిడ దేవతలో, ద్రావిడ జాతులో, ద్రావిడ వర్తకులో కారు. తదుపరి సూక్తంలో వామదేవుడు ఘృతం గురించి మాట్లాడుతూ అది హృదయ సముద్రంలో వంద బందీఖానాలలో కనపడకుండా శత్రువుల చేత దాచబడిందని అంటాడు. దీని అర్థం హృదయ సముద్రం లోనుండి, లేదా మామూలు సముద్రం లోనుండి, నేతి నదులు (పోనీ నీటి నదులే అనుకోండి) బయటికొచ్చి ప్రవహిస్తున్నప్పుడు వాటిని దుష్టులైన ద్రావిళ్లు నూరు పంజరాలలో ఆర్యులకి, ఆర్య దేవతలకి కనపడకుండా బంధించారని మాత్రం ససేమిరా కాదు.

ఇక్కడ శత్రువుని పణి అన్నా, లేదా వృత్రుడు అన్నా అది కేవలం ఒక అధ్యాత్మిక భావన మాత్రమే నని, అల్లకల్లోలమైన గాథలవ్యూహంలో భారత చరిత్రని గందరగోళం చెయ్యాలని మన పూర్వీకులు బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయత్నం కాదని గుర్తుంచుకోవాలి. ఋక్కులలో తను వాడిన ప్రతీకల మీద జరిగిన తప్పులతడకల అన్వయాల గురించి వింటే వామదేవ ఋషి దిగ్భ్రమ చెందుతాడేమో. ఘృతం అంటే కేవలం జలం అనుకున్నా, హృదయ సముద్రం అంటే కేవలం ఒక కమ్మని కాసారం అనుకున్నా, ద్రావిళ్లు నదులకి అడ్డుగా ఎన్నో ఆనకట్టలు కట్టి ఆర్యులకి ఆ నదీజలాలు కనపడకుండా దాచారని అనుకున్నా పెద్దగా ఉపయోగం ఉండదు. పోనీ పంజాబులోని నదులన్నీ ఒకే విశాలమైన, హృదయంగమమైన సరస్సులోకి ప్రవహిస్తున్నాయని అనుకున్నా, గొప్ప చతురులైన ద్రావిళ్లు ఆ నదీ జలాలని మూడు విధాలుగా ఓ ఆవులో దాచి, ఆ ఆవుని మళ్ళీ ఓ చీకటి గుహలో దాచారని అనుకోవడం అసంగతంగా తోచుతుంది.

"హృదయ సముద్రం లోంచి అవి వెలువడతాయి" అంటాడు వామదేవుడు. "వంద పంజరాలలో అవి కనపడకుండా శత్రువు చేత బంధించబడ్డాయి; ప్రవిమల స్రవంతుల కోసం నేను ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే వాటి మధ్యలో ఒక పసిడి తీగ దాగి వుంది. పారే నదులలో అవి ప్రవహిస్తూ లోన హృదయంలో, మనస్సులో పునీతం అవుతాయి; కుశలుడైన రౌతు అదిలిస్తున్నట్టు ఆ విమల తరగలు గమిస్తాయి; ఆర్ణవం (సింధు, ఊర్ధ్వ సాగరం) ఎదుట విస్తరించిన బాట మీద మహనీయ తత్వాలు పయనిస్తాయి. ప్రచండ శక్తి కలిగి, ప్రాణశక్తి చేత పరిమితమైన విమల తరంగాలు ప్రవహిస్తాయి; కళ్లేలు తెంచుకుని దూసుకుపోయే గుర్రాల్లా అవి తరంగాల చేత పోషించబడి కదులుతాయి." ఇది ప్రగాఢమైన అధ్యాత్మిక అంతరార్థం గల కవిత అని చూడగానే తెలుస్తుంది. కుమతులకి కనపడకుండా గజిబిజి ప్రతీకల మేలిమి తెర అడ్డుపడుతుంది. పదునైన లోదృష్టి ఉన్న వారికే విషయం విదితమవుతుంది. అతడు చెప్పదలచుకున్నది ఏమిటంటే మన ఆలోచనల మాటున దివ్యజ్ఞానం సదా ప్రవహిస్తూనే ఉంటుంది. కాని మన అంతఃశత్రువులు మన మానసిక అంశాలని కేవలం ఐంద్రియ చర్యలకి, ఐంద్రియ సంవేదనలకి మాత్రమే పరిమితం చేస్తాయి. మన ఆత్మతరంగాలు అతిచేతనా సీమ ఎల్లల మీద పదే పదే పడుతున్నా, మన ఐంద్రియ మనస్సు యొక్క ప్రాణిక చర్యలు అడ్డుపడుతూ ఆ ఆత్మతరంగాలని రహస్యంగా

ఉంచుతున్నాయి. అవి కళ్లెం వేసి గట్టిగా అదుపు చెయ్యబడ్డ గుర్రాల వంటివి. కాంతి తరంగాలు ఆ గుర్రాలని పూర్తిగా పోషించినప్పుడే అవి తమ కళ్లేలు తెంచుకుని, దేని నుండి అయితే సోమరసం వెల్లివిరుస్తుందో, దేని నుండి అయితే యజ్ఞం ఆవిర్భవిస్తుందో ఆ మహత్తర తత్వం దిశగా దూసుకుపోతాయి.

యత్ర: సోమః సూయతే యత్ర యజ్ఞో

ఘృతస్య ధారా అభి తత్ పవన్తే.

మధుపూర్ణమైన ఆ తత్వమే లక్ష్యం – ఘృతస్య ధారా మధుమత్ పవన్తే; అది ఆనందం, దివ్యమైన పారవశ్యం. ఆ లక్ష్యం సింధు, అది అతిచేతనా సముద్రం. ఈ విషయం ఆఖరి ఋక్కులో వామదేవుడు స్పష్టం చేస్తాడు – "నీ తీయని తరంగాన్ని మేము రుచి చూడాలి. జలాలు ఒకటైనప్పుడు ఏర్పడే శక్తిలో అది దాగి వుంది." ఇక్కడ "నీవు" అన్న పదం అగ్నిని ఉద్దేశిస్తోంది – ఆ అగ్ని దైవీ పురుషుడు, నాలుగు కొమ్ముల విశ్వవృషభుడు.

అపామ్ అనీకే సమిథే య ఆభృతస్,

తమ్ అశ్యామ మధుమన్తం త ఊర్మిమ్.

ఉపచేతనకి సంబంధించిన ఈ మౌలిక భావనని వేద ఋషులు శ్రీ సూక్తం లో (X.129) లో ఇలా వర్ణిస్తారు. "ఆదిలో చీకటి యెదలో చీకటి దాగి వుంది, మనోచైతన్య విరహితమైన సముద్రం… దాని లోనుండి దాని శక్తి యొక్క మహత్తు చేత ఏకం జనించింది. లోనున్న కోర్కె వల్ల దాంట్లో మొదటి కదలిక ఏర్పడింది. అదే మనస్సులో ఏర్పడ్డ మొదటి బీజం. అసమాన ధీమంతులు అసత్ లోతుల్లో సత్ యొక్క మూలాలని కనుగొన్నారు; ఉద్దేశపూర్వకమైన ప్రయాస చేత, ఆలోచనా మనస్సు చేత దాన్ని వారు హృదయంలో

కనుగొన్నారు; వారి కిరణం క్షితిలో విస్తరించింది; పైన ఏదో ఉంది, కిందన ఏదో ఉంది.” వామదేవుడి ఋక్కులో ఉండే భావజాలమే ఇక్కడ కూడా కనిపిస్తోంది కాని ఇక్కడ ప్రతీకల అడ్డుతెర లేదు. ఉపచేతనా సముద్రం లోనుండి ఏకం ఆవిర్భవిస్తుంది, అది హృదయంలో మొదట కోర్కె రూపంలో పుడుతుంది; హృదయ సముద్రంలో అతడు అవ్యక్త ఆనంద రేఖగా, అస్తిత్వానందంగా వ్యక్తమవుతాడు; ఈ కోర్కె అనే తొలిబీజం పిమ్మట ఐంద్రియ మనస్సుగా అవతరిస్తుంది. ఉపచేతనాంధకారం లోనుండి ఉనికిని, సచేతన ఆత్మని రూపొందించడానికి కావలసిన సాధనాలని దేవతలు కనుగొన్నారు; హృదయంలో దాన్ని కనుగొని ఆలోచన చేత, ఉద్దేశపూర్వకమైన ప్రేరణ చేత (ప్రతీష్య) దాన్ని పెంచి పోషించారు. “ప్రతీష్య” అనే మాటకి అర్థం మానసిక వాంఛ. ఈ మానసిక వాంఛకి, ఉపచేతనలో పుట్టే అవిస్పష్టమైన వాంఛకి (ఇది కేవలం ప్రకృతి గతమైన ప్రాణిక చలనం మాత్రమే) మధ్య తేడా వుందని గుర్తించాలి. అలా వారు సృష్టించిన అస్తిత్వం, వేరే రెండు అస్తిత్వాల మధ్య, క్షితిజసమాంతరంగా విస్తరించింది; కిందన ఉపచేతన యొక్క చీకటి నిద్ర, పైన అతిచేతన యొక్క తేజోమయ రహస్యం. ఊర్ధ్వ, నిమ్న సముద్రాలివే.

వైదిక ప్రతీకలు పురాణాలకి చెందిన ఎన్నో ప్రతీకల విషయంలో కూడా లోతైన రహస్యాలు వెల్లడి చేస్తున్నాయి. ముఖ్యంగా క్షీరసముద్రంలో, అనంతుడనే సర్పపు శయ్య మీద, శయనించే విష్ణువు రూపాన్నే తీసుకుందాం. ఎవడో ఆకాశ రాకాసి సూర్య, చంద్రులని కబళించడం వల్ల గ్రహణాలు ఏర్పడతాయని నమ్మే వెర్రిబాగుల వాళ్లయిన హైందవ అర్చకులు రాసిన ఊహాగానే పురాణాలని కొందరు వాదించవచ్చు. కాబట్టి సృష్టి చేయని కాలంలో, పరమపురుషుడు ఒక భౌతిక దేహంలో, ఒక భౌతికమైన పాము మీద, పాల సముద్రంలో నిద్దరోతుంటాడని ఆ అమాయకులు సులభంగా నమ్మగలరని అనుకోవచ్చు. కాబట్టి ఆ పిట్టకథల వెనుక ఏదో అధ్యాత్మిక అంతరార్థం ఉందనుకోవడం వట్టి అపోహ అని కొందరు వాదిస్తారు. వారికి నా సమాధానం ఇదే. అలాంటి అర్థాల కోసం ఎక్కువ దూరం గాలించనక్కర్లేదు. మరీ ఉద్దేశపూరితంగా గుడ్డిగా ఉండాలనుకునే వారికి తప్ప అందరికీ కనిపించేలా ఎన్నో రహస్యాలని వారు ఆ ప్రతీకలలో స్పష్టంగా, విశదం చేశారు. విష్ణువు సర్పానికి వారు ఇచ్చిన పేరు అనంతుడు; అనంతం అంటే అంతులేనిది. కాబట్టి సృష్టిలేని

యుగాలలో సర్వవ్యాపి అయిన విష్ణువు అనంతపు వలయాల మీద నిద్రిస్తుంటాడు. ఇక ఆ సముద్రం సనాతమైన అస్తిత్వానికి ప్రతీక. ఆ అస్తిత్వం బహుతీయనిది, ఆనందపూర్ణమైనది. ఇక ఆ సముద్రంలోని తీయని పాలకి, వామదేవుడి ఋక్కులోని మధువుకి, లేదా తేనెకి మధ్య పెద్దగా తేడా లేదు.

కాబట్టి వేదంలోను, పురాణంలోను కూడా ఒకే విధమైన ప్రతీకల ప్రయోగం కనిపిస్తుంది. వారి దృష్టిలో సముద్రం అనంత, సనాతన ఉనికికి ప్రతీక. అలాగే వారి దృష్టిలో నది అంటే ఆత్మలోనుండి పెల్లుబికే ఒక చైతన్య ధార. ఏడు నదులలో ఒక నది అయిన సరస్వతి సత్య చైతన్యం నుండి వెలువడే స్ఫూర్తి స్రవంతి. కాబట్టి తతిమా నదులు కూడా అధ్యాత్మిక ప్రతీకలేనని అనుకోవడంలో తప్పులేదు.

అయితే మనం పూర్తిగా సిద్ధాంతం మీద, ప్రతిపాదనల మీద, - అవి ఎంత బలంగా, విశ్వసనీయంగా తోచినా, - ఆధారపడనక్కర్లేదు. వామదేవుడి ఋక్కులో చూసినట్టు "*ఘృతస్య ధారాః*" అంటే నేతి ప్రవాహాలో, నీటి ప్రవాహాలో కావు. అవి అధ్యాత్మిక ప్రతీకలు. అలాగే ఏడు నదుల విషయంలో కూడా అదే అధ్యాత్మిక అన్వయానికి ఇతర ఋక్కులలో కూడా సమర్థింపు దొరుకుతుంది. అందుకు తార్కాణంగా మూడవ మండలంలో, మొదటి సూక్తంలో ఋషి విశ్వామిత్రుడు అగ్నిని స్తుతిస్తూ పాడిన గీతాన్ని తీసుకుందాం. అక్కడ ఏడు నదుల గురించి విశ్వామిత్రుడు అవి స్పష్టత యొక్క నదులని వామదేవుడు వాడిన మాటల వంటి మాటల్లోనే వర్ణిస్తాడు. పూర్తిగా భిన్నమైన సందర్భాల్లో ఈ ఇద్దరు పరమ కవుల గీతాలలో ఐక్యత కనిపిస్తోంది.

అధ్యాయం 11

ఏడు నదులు

వేదం తరచు జలాల గురించి, నదుల గురించి, ముఖ్యంగా దివ్య జలాల గురించి మాట్లాడుతుంటుంది – "*ఆపో దేవీః*" లేదా "*ఆపో దివ్యాః.*" అప్పుడప్పుడు విరాజమానమైన సౌర ప్రపంచానికి చెందిన కాంతిని కలిగిన జలాల గురించి కూడా మాట్లాడుతుంది – "*స్వర్వతీర్ అపః.*" దేవతల చేత సాధించబడ్డ జలప్రవాహం, లేదా దేవతల సహాయంతో మనిషి సాధించిన జల ప్రవాహం అనే ప్రతీక పదే పదే కనిపిస్తుంది. మానవుడు ఆకాంక్షించే మూడు మహోన్నత విజయాలు ఉన్నాయి. వాటిని దేవతలు వృత్రులతోను, పణుల తోను పోరాడి గెలిచి పెడతారు. అవి పశువులు, జలాలు, సూర్యుడు లేదా సౌరప్రపంచం – "*గా అపః స్వః.*" అయితే ఇక్కడ ప్రస్తావించ బడేది నింగి నుండి కురిసే వర్షమా, లేక ద్రావిళ్ల చేత ఆక్రమించబడ్డ ఉత్తరాది నదులా అన్న ప్రశ్న వస్తుంది. వృత్రులని కొన్ని సార్లు ద్రావిళ్లుగాను, ద్రావిళ్లు పూజించే దేవతలు గాను కూడా వర్ణించడం జరుగుతుంది. అలాగే పశువులు అంటే ప్రాంతీయ చోరులు ఆర్యుల నుండి దొంగలించినవా? ఆ పశువులని దొంగలించిన పణులు కొన్ని సార్లు ద్రావిళ్లు అయితే, మరి కొన్ని సార్లు ఆ ద్రావిళ్లు పూజించే దేవతలు. ఇలాంటి అన్వయం సరైనదేనా లేక వీటి వెనుక మరేదైనా అధ్యాత్మిక అంతరార్థం వుందా? "స్వర్" ని జయించడం అంటే మబ్బు తెర అడ్డుపడ్డ సూర్యుణ్ణి, లేక గ్రహణంలో కనుమరుగైన సూర్యుణ్ణి తిరిగి ఆ చీకటి బంధం నుండి రక్షించడమా? కనీసం ఈ సందర్భంలో ఆ సూర్యుణ్ణి ఆర్యుల నుండి కాజేసి దాచింది "నల్లని మైఛాయ గల", "ముక్కు లేని" మానవజాతులు మాత్రం కారు. పోనీ "స్వర్" ని జయించడం అంటే యజ్ఞం చేత స్వర్గాన్ని జయించడం అనుకోవాలా?

ఏదేమైనా ఇలా ఆవులు, జలాలు, సూర్యుడు లేదా ఆవులు, జలాలు, ఆకాశం అనే విడ్డూరమైన మిశ్రమం వెనుక ఉన్న రహస్యం ఏమిటి? ఇక్కడ పశువులని సూచించే "*గాః*" అనే శబ్దానికి ఆవులు అని, కిరణాలు అని కూడా అర్థం వుంది. కాబట్టి అవి సత్యసూర్యుడిలో, కాంతిసూర్యుడిలో వేళ్లూని వున్న ఉన్నత చైతన్యం నుండి పుట్టే ప్రకాశనాలు అనుకుంటే సమంజసంగా ఉంటుందేమో? మరి స్వర్ అంటేనే ఆ అమరధామం కాదా? ఆ అమరధామాన్ని పాలించే కాంతి, సత్యం లేదా సర్వప్రకాశక సూర్యుణ్ణే వేదం విశాల సత్యం అంటే "*ఋతం బృహత్*" అని పిలుస్తోంది కదా? మరి ఆ దివ్యజలాలు, - "*ఆపో దేవీః*", "*దివ్యాః*" లేదా "*స్వర్వతీః*" – అమర తలం నుండి మర్త్య మనస్సు మీద కురిసే ఉన్నత చైతన్య ధారలు కావా?

అయితే ప్రత్యేకమైన అధ్యాత్మిక అన్వయం లేనట్టుగా కనిపించే సూక్తాలు ఎన్నో ఉన్నాయన్నది వాస్తవమే. ఒక సూక్తాన్ని వర్షం కోసం ప్రార్థన లాగానో, వర్షం యొక్క స్తుతి లాగానో అర్థం చేసుకోవచ్చు. మరో సూక్తాన్ని పంజాబ్ లో నదీ తీరాల వద్ద యుద్ధం యొక్క వర్ణనలా ఊహించుకోవచ్చు. కాని ప్రత్యేక సూక్తాలని, వేదభాగాలని వేరు వేరుగా అన్వయిస్తూ పోతే సమగ్ర వేదస్వరూపం అర్థం కాదు. వేదం సమంజసంగా, సంసక్తంగా అర్థం కావాలంటే దాన్ని సమగ్ర రూపంలో అన్వయించాలి. సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించడం కోసం '*స్వర్*', '*గాః*' మొదలైన పదాలకి ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క అర్థాన్ని ఆపాదిస్తూ పోవచ్చు. నిజానికి సాయణుడి విధానం అలాగే ఉంటుంది. ఉదాహరణకి '*గాః*' అన్న శబ్దాన్ని కొన్ని చోట్ల ఆవులుగాను, కొన్ని చోట్ల కిరణాల గాను, మరి కొన్ని చోట్ల కాస్త హాస్యభరితంగా జలాలుగాను అన్వయిస్తాడు[12]. అలాంటి అన్వయ విధానం కేవలం "హేతువాద నిబద్ధమైన," లేక "లౌకిమైన" అన్వయాన్ని అందించినంత మాత్రాన అది సహేతుకం అయిపోదు. అలా అన్వయిస్తూ పోతే మనకి ఎలాంటి అర్థం కావాలంటే అలాంటి

---

[12] అదే విధంగా అతడు అత్యంత ప్రధానమైన ఋతం అనే వైదిక శబ్దాన్ని కొన్ని చోట్ల త్యాగం అనే అర్థంలోను, కొన్ని చోట్ల సత్యం అనే అర్థంలోను, మరి కొన్ని చోట్ల నీరు అనే అర్థం లోను వాడతాడు. ఇంత వైవిధ్యంగల అర్థాలని ఒకే ఋక్కులో కేవలం ఐదు లేక ఆరు శ్లోకాలలో వాడడం జరుగుతుంది.

అర్థాన్ని సాధించగలము. కాని నిష్పక్షపాతంగా, వస్తుగత దృష్టితో చూసినప్పుడు అలాంటి అన్వయం వల్ల ఏర్పడే వేదార్థం సముచితమైనదిగా తోచదు.

కాని మరింత సుసంగతమైన అర్థం కోసం ప్రయత్నించినప్పుడు భౌతిక దృష్టికి ఎన్నో తీరని సవాళ్లు ఎదురవుతాయి. ఉదాహరణకి దివ్య జలాలని (“*ఆపో దేవీః*”, “*ఆపో దివ్యాః*”) ఉద్దేశిస్తూ వశిష్ఠుడు విరచించిన ఒక ఋక్కులో (VII.49) , రెండవ శ్లోకంలో ఇలా అంటాడు – “ఆ దివ్య జలాలు కాల్వలలో ప్రవహించనీ, స్వయం జాతం కానీ, కడలి వైపు సాగే వాటి ప్రవాహం పునీతమైనది, పావకమైనది – ఆ జలాలు నన్ను పోషించు గాక.” ఈ సందర్భంలో అర్థం చాలా తేటతెల్లంగా ఉందని వాదించవచ్చు. ఇక్కడ కేవలం భౌతిక జలాల గురించి, పార్థివ నదుల గురించి, కాల్వల గురించి చర్చ జరుగుతోంది. ఇక “*ఖనిత్రిమాః*” అన్న పదానికి అర్థం “తవ్వడం” అనుకుంటే ఆ జాబితాలో బావులని కూడా చేర్చుకోవచ్చు. వశిష్ఠుడు తన ఋక్కులో “*దివ్యాః*” (దివ్యమైనది) అన్న పదాన్ని కేవలం అలంకార ప్రాయంగా, స్తుతి శబ్దంగా వాడాడు అనుకోవాల్సి ఉంటుంది. లేదా ఋక్కుని వేరేలా అన్వయిస్తూ ఇక్కడ మూడు విధాలైన జలాలు వర్ణించబడ్డాయని చెప్పుకోవచ్చు – స్వర్గ జలాలు అంటే వర్షం, బావుల జలాలు, నదీ జలాలు. అయితే మొత్తం ఋక్కుని చదివినప్పుడు ఈ అర్థం పొసగదని ఇట్టే అర్థమవుతుంది. ఉదాహరణకి ఆ అర్థం ఇలా ఉంటుంది –

“ఆ దివ్య జలాలు నన్ను పోషించుగాక. నిరంతర చలనము కలిగి, అన్నిటినీ పునీతము చేసే చలిత వరద లోనుండి పుట్టిన మహోన్నత సముద్రం. వజ్రాయుధుడు, వృషభుడు అయిన ఇంద్రుడు దెబ్బ కొట్టిన చోటి నుండి పెల్లుబికిన సముద్రం. తవ్విన కాల్వలలోనైనా, స్వయంజాతమైనా ప్రవహించే దివ్యజలాల గమనం అంతా మహార్ణవం దిశగానే – ఆ దివ్యజలాలు నన్ను పోషించుగాక. వాటి మధ్య నుండి వరుణాధిపుడు జీవరాశుల నిజానిజాలని పరిశీలిస్తున్నాడు. తేనెపూరితమై, పునీతమై, పావకమైన జలాలవి. ఆ దివ్యజలాలు నన్ను పోషించుగాక. దేనిలోనైతే వరుణాధిపుడు, దేనిలోనైతే సోముడు, దేనిలోనైతే దేవతలంతా శక్తి సమ్మోహితులు అవుతారో, దేనిలోలోనైతే వైశ్వానరుడైన అగ్ని ప్రవేశిస్తాడో, ఆ దివ్యజలాలు నన్ను పోషించుగాక.”

ఇక్కడ వశిష్ఠుడు వర్ణిస్తున్న జలాలు, లోగడ వామదేవుడు తన ఋక్కులలో చెప్పిన ప్రవంతులు రెండూ ఒకటేనని స్పష్టంగా తెలుస్తోంది. సముద్రం లోనుండి జనించి సముద్రంలోకి ప్రవహించే జలాలు, కడలి లోనుండి పైకెగసే తేనెకెరటం, అందరి ఎదలో దాగిన వరద, విమల స్రోతస్సులు – "*ఘృతస్య ధారాః*" మహోత్కృష్టమైన విశ్వచైతన్యం యొక్క వరదలవి. ఆ చైతన్యం లోనుండి వరుణుడు జీవకోటి యొక్క మంచి చెడ్డలు గమనిస్తుంటాడు – ఈ ఆఖరు విషయాన్ని భౌతికమైన వర్షానికి గాని, భౌతిక సముద్రానికి గాని వర్తింపజేయలేం అన్నది గమనించాలి. వేదంలో వర్ణించబడ్డ వరుణుడు భారతీయ నెప్ట్యూన్ దేవత కాడు. అలాగే ఐరోపా పండితులు ఊహించినట్టు అతడు ఆకాశానికి ప్రతీక అయిన గ్రీకు దేవత ఒరనోస్ కూడా కాడు. అతడు ఆకాశపు బృహత్తుకి, ఊర్ధ్వ సముద్రానికి, ఎల్లలు లేని ఆత్మసీమకి, దాని విమలతకి ప్రతీక; మరో చోట ఏమని చెప్పబడిందంటే ఆ బృహత్తులో అతడు ఆ పథరహిత అనంతతలో సత్యదేవుడు అయిన సూర్యుడి సహాయంతో పలు బాటలు నిర్మిస్తే, ఆ బాటల వెంట కాంతి కదిలిందట. ఆ స్థితిలో నిలిచి అతడు మర్త్య చేతనలోని నిజాల, అబద్ధాల మిశ్రమాన్ని పరిశీలిస్తుంటాడు. ఇంద్రుడు చైతన్యాన్ని దొలిచి ఈ దివ్యజలాలు భూమి మీదకి ప్రవహించేలా చేశాడు – వేదంలో సర్వత్ర ఈ వర్ణనని ఏడు జలాలకి వర్తింపజేయడం జరుగుతుంది.

వశిష్ఠుడి ప్రార్థనలో వర్ణించబడ్డ జలాలు, వామదేవుడి మహత్తర ఋక్కులో చెప్పబడ్డ జలాలు ("*మధుమాన్ ఊర్మిః, ఘృతస్య ధారాః*") ఒక్కటేనన్న విషయంలో ఏదైనా సందేహం ఉంటే ఆ సందేహాన్ని వశిష్ఠుడి మరో సూక్తం (II.47) తొలగిస్తుంది. నలభై తొమ్మిదవ ఋక్కులో అతడు ఆ దివ్యజలాలు తేనెలూరుతాయని ("*మధుశ్చుతః*"), ఆ శక్తిని పొందిన ఆనందంలో దేవతలు మదమెక్కి ("*ఊర్జం మదంతి*") ఉంటారని అంటాడు. దీన్ని బట్టి ఆ తేనె లేదా తీయదనం (*మధు*) సోమరసంతో సమానమని, ఆ ఆనందంలోనే దేవతలు పరవశిస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. కాని నలభై ఏడవ ఋక్కులో ఆ విషయాన్ని మరింత స్పష్టం చేస్తాడు.

"ఓ జలమ్ములారా! మీ సమున్నత తరంగాన్ని, ఇంద్రుడి పానీయాన్ని, పరమపురుషుణ్ణి ఉపాసించే సాధకులు సాధిస్తారు. ఆ అమలమైన, అనఘమైన, ప్రవిమలమైన, మధు తరంగాన్ని ("*ఘృతప్రుషం మధుమంతమ్*") నేడు మమ్మల్ని ఆనందించనీయండి. ఓ జలమ్ములారా! జలాల తనయుడు (*అగ్ని*), చురుకైన చలనము గలవాడు, మీ తేనెల కెరటాన్ని పోషించుగాక; మీ తరంగ మహిమ వల్ల ఇంద్రుడు వసువులతో కలిసి పరవశిస్తున్నాడు. పరమపురుషుణ్ణి ఉపాసించే మమ్మల్ని ఆ ఆనందాన్ని రుచిచూడనీయండి. నూరు పావనుల ద్వార వడపోయబడ్డ జలాలు, స్వాభావికంగా ఆనందమయమై, దివ్యమై, దేవతల చలనానికి గమ్యం (పరమార్ణవం) దిశగా ప్రవహిస్తున్నాయి. అవి ఇంద్రుడి కర్మలకి అడ్డుపడవు – నదులకి విమలమైన ("*ఘృతవతీ*") నైవేద్యాన్ని ఒసగుతాయి. ఏ నదులనైతే సూర్యుడు తన కిరణాల నుండి రూపొందించాడో, ఏ నదుల నుండి అయితే ఇంద్రుడు ఒక చలిత తరంగాన్ని తవ్వితీశాడో, ఆ నదులు మాకోసం మహోత్కృష్టమైన శ్రేయస్సును సాధించుగాక. ఓ దేవతలారా! ఈ ఆనంద స్థితులతో మమ్మల్ని సదా రక్షించండి."

ఇక్కడ మనకి వామదేవుడి 'తేనెలూరే కెరటం' ("*మధుమాన్ ఊర్మిః*") ఎదురవుతుంది. ఈ తేనె, ఈ మాధుర్యమే సోమరసమని, ఇంద్రుడి పానీయం అని ఇక్కడ స్పష్టంగా చెప్పబడింది. "*శతపవిత్రాః*" అనే పదప్రయోగంతో ఈ భావన మరింత బలపడింది. వైదిక పరిభాషలో ఆ పదం సోమరసాన్ని మాత్రమే సూచించగలదు. ఆ పదజాలం నదులని సూచిస్తుందని, అందులో నుండి తేనెతరంగం ప్రవహించేలా ఇంద్రుడు చేశాడని, వృత్రుడిని చంపిన వజ్రాయుధంతో ఇంద్రుడు పర్వతాన్ని దొలిచి ఆ తేనెతరంగం ప్రవహించేలా బాటని వేశాడని ఇక్కడ మనం గుర్తించాలి. ఆవర్తకుడు, ఆక్రమదారుడు అయిన వృత్రుడు తన గుప్పెటలో బంధించిన ఏడు నదులని ఇంద్రుడు విడిపించి భూమి దిశగా ప్రవహింపజేశాడు.

సోమరస భరితమైన కెరటాలు కలిగి, "*ఘృతం*"తో, శక్తితో ("*ఊర్జ్*") నిండిన ఈ నదులు ఏమై ఉంటాయి? దేవతల చలనాలకి గమ్యమైన ఆ పరమ లక్ష్యం దిశగా ప్రవహిస్తూ, మానవుడికి మహోన్నతమైన మేలు చేసే ఆ జలాలు ఎటువంటివి? అవి నిశ్చయంగా పంజాబులోని

నదులు కావు. వేద ఋషులు ఎంత అసంగతంగా, అల్లకల్లోలంగా ఆలోచించారని అనుకున్నా అలాంటి అర్థాన్ని మనం తీసుకోలేము. పరమార్ణవం నుండి ప్రవహించే సత్యం, ఆనందం – అవే ఈ జలాలని స్పష్టంగా తెలుస్తోంది. ఆ నదులు భువిలో కాదు, దివిలో ప్రవహిస్తాయి; మనబోటి మర్త్యులు జీవించే పృథ్వీ చేతనలోకి ఆ నదులు కిందికి ప్రవహించకుండా ఆవర్తకుడు, ఆక్రమదారుడు అయిన వృత్రుడు అడ్డుపడతాడు. అప్పుడు దివ్యమనస్కుడైన ఇంద్రుడు తన ఉరుములతో, మెరుపులతో ఆ ఆవర్తకుణ్ణి దునుమాడి, పృథ్వీ చేతన యొక్క శిఖరాల మీద దారి దొలిచి, ఆ జలాలు ప్రవహించేలా ఏర్పాటు చేస్తాడు. వేదఋషుల చింతనకి, భాషకి అదే సరైన, సమంజసమైన, సహేతుకమైన వివరణ అనిపిస్తుంది. ఇక మిగతాదంతా వశిష్ఠుడి వల్ల మనకి తేటతెల్లం అవుతోంది; సూర్యుడు తన కిరణాలతో సృష్టించిన ఈ జలాలు, ధరాగత చలనాలకి మల్లె పరమ మానసం అయిన ఇంద్రుడి పనులకి అడ్డుపడవు. మరోలా చెప్పాలంటే ఆ జలాలు బృహత్తరమైన సత్యానికి ("*ఋతం బృహత్*") చెందిన జలాలు. ఈ సత్యమే ఆనందాన్ని ప్రసాదిస్తుందని మనం ఎన్నో సార్లు గమనించాము. ఋక్కులలో ఎన్నో చోట్ల (ఉ॥ V.12.2., "ఓ సత్య దర్శీ! సత్యాన్ని అనన్యంగా దర్శించు! సత్యం లోనుండి పలు ప్రవంతులని వెలికి తీయి!") ఈ జలాలని 'సత్య జలాలు' ("ఋతస్య ధారాః") అని పేర్కొనడం జరిగింది. ఆ సత్యజలాలు మానవుడి మహోన్నతమైన మేలును కలుగజేస్తాయి. మహోన్నతమైన మేలు అంటే దివ్యమైన అస్తిత్వం లోని మహదానందం.

అయితే పైన చెప్పుకున్న ఋక్కులలో గాని, వామదేవుడి శ్లోకాలలో గాని ఎక్కడా ఏడు నదుల పేర్లు పేర్కొనబడలేదు. కాబట్టి విశ్వామిత్రుడి అగ్ని సూక్తంలో, రెండవ శ్లోకం నుండి పద్నాల్గవ శ్లోకం వరకు శ్లోకాలని ఒకసారి పరిశీలిద్దాము. ఈ వేదభాగం కాస్త బారైనదే కాని దీన్ని ఇక్కడ వివరంగా ఉదహరించడం ముఖ్యం.

ప్రాఞ్చం యజ్ఞం చకృమ వర్ధతాం గీః సమిద్భిర్ అగ్నిం నమసా దువస్యన్ |
దివః శశాసుర్ విదథా కవీనాం గృత్సాయ చిత్ తవసే గాతుమ్ ఈషుః || 3-001-02

మయో దధే మేధిరః పూతదక్షో దివః సుబన్ధుర్ జనుషా పృథివ్యాః |
అవిన్దన్న్ ఉ దర్శతమ్ అప్స్వ్ అన్తర్ దేవాసో అగ్నిమ్ అపసి స్వసౄణామ్ || 3-001-03

అవర్ధయన్ సుభగం సప్త యహ్వీః శ్వేతం జజ్ఞానమ్ అరుషమ్ మహిత్వా |
శిశుం న జాతమ్ అభ్య్ ఆరుర్ అశ్వా దేవాసో అగ్నిం జనిమన్ వపుష్యన్ || 3-001-04

శుక్రేభిర్ అఙ్గై రజ ఆతతన్వాన్ క్రతుమ్ పునానః కవిభిః పవిత్రైః |
శోచిర్ వసానః పర్య్ ఆయుర్ అపాం శ్రియో మిమీతే బృహతీర్ అనూనాః || 3-001-05

వవ్రాజా సీమ్ అనదతీర్ అదబ్ధా దివో యహ్వీర్ అవసానా అనగ్నాః|
సనా అత్ర యువతయః సయోనీర్ ఏకం గర్భం దధిరే సప్త వాణీః || 3-001-06

స్తీర్ణా అస్య సంహతో విశ్వరూపా ఘృతస్య యోనౌ స్రవథే మధూనామ్ |
అస్థుర్ అత్ర ధేనవః పిన్వమానా మహీ దస్మస్య మాతరా సమీచీ || 3-001-07

బభ్రాణః సూనో సహసో వ్య్ అద్యౌద్ దధానః శుక్రా రభసా వపూంషి |
శ్చోతన్తి ధారా మధునో ఘృతస్య వృషా యత్ర వావృధే కావ్యేన || 3-001-08

పితుశ్ చిద్ ఊధర్ జనుషా వివేద వ్య్ అస్య ధారా అసృజద్ వి ధేనాః |
గుహా చరన్తం సఖిభిః శివేభిర్ దివో యహ్వీభిర్ న గుహా బభూవ || 3-001-09

పితుశ్ చ గర్భం జనితుశ్ చ బభ్రే పూర్వీర్ ఏకో అధయత్ పీప్యానాః |
వృష్ణే సపత్నీ శుచయే సబన్ధూ ఉభే అస్మై మనుష్యే ని పాహి || 3-001-10

ఉరౌ మహాఅనిబాధే వవర్ధాపో అగ్నిం యశసః సం హి పూర్వీః |
ఋతస్య యోనావ్ అశయద్ దమూనా జామీనామ్ అగ్నిర్ అపసి స్వసౄణామ్ || 3-001-

అక్రో న బభ్రిః సమిథే మహీనాం దిదృక్షేయః సూనవే భాఋజీకః |
ఉద్ ఉస్రియా జనితా యో జజానాపాం గర్భో నృతమో యహ్వో అగ్నిః || 3-001-12

అపాం గర్భం దర్శతమ్ ఓషధీనాం వనా జజాన సుభగా విరూపమ్ |
దేవాసశ్ చిన్ మనసా సం హి జగ్ముః పనిష్ఠం జాతం తవసం దువస్యన్ || 3-001-13

బృహన్త ఇద్ భానవో భాఋజీకమ్ అగ్నిం సచన్త విద్యుతో న శుక్రాః |
గుహేవ వృద్ధం సదసి స్వే అన్తర్ అపార ఊర్వే అమృతం దుహానాః || 3-001-14

"పరమాన్ని చేరుకునేందుకు గాను యజ్ఞం చేస్తున్నాం. మా వాక్కు సంవర్ధనం కానీ. అగ్గిని రాజేసి, అగ్ని దేవుడికి ఆత్మసమర్పణ గావించుకుని, ఆ దేవుణ్ణి తన కర్మలలో ప్రవేశపెట్టారు. ద్రష్టల అవగాహనలని వారు దివిలో వ్యక్తం చేశారు. వాక్కు కోసం తపిస్తూ శక్తివంతంగా సాగే అతడి గమనాన్ని వారు కోరుకున్నారు."

"ధీ శక్తి పూర్ణుడై, విచక్షణ చేత విమలుడై, జన్మతః దివికి భువికి పరిపూర్ణ స్నేహితుడై (లేక పరిపూర్ణ నిర్మాతయై), అతడు ఆనందాన్ని స్థాపిస్తాడు. జలాలలో, సోదరీమణుల కర్మలలో అభివ్యక్తమైన అగ్నిని దేవతలు కనుగొన్నారు."

"ఆనందాన్ని సంపూర్ణంగా ఆనందించే ఆతనిని ఏడుగురు మహిమాన్వితులు సంవర్ధనం చేశారు. అతడు జన్మతః తెల్లని వాడు, వృద్ధి చేత ఎర్రబడ్డాడు. ఇప్పుడే పుట్టిన పసికందు

చుట్టూ అశ్వినుల వలె, ఆతని చుట్టూ వారు చరించారు, శ్రమించారు; జనన సమయంలో అగ్నికి దేహాన్ని ఒసగారు దేవతలు.”

“విమల, విరాజిత దేహంతో అతడు విస్తరించి, మధ్యలోకాన్ని సృష్టించాడు. ప్రజ్ఞకు విమల విభుల సాయంతో కర్మేచ్ఛను పునీతం చేశారు. జలాల చుట్టూ వెలుగుని వలిపెంగా తొడిగి తనలోనే వెలితిలేని అద్భుత బృహత్తును రూపుదాల్చుకున్నాడు.

“దేవలోకపు మహిమాన్వితుల చుట్టూ అతడు చరించాడు, వారు అతనిని కబళించలేదు, అతడూ వారిని అధిగమించలేదు – వారు వస్త్రభూషితులు కారు, అలాగని నగ్నంగానూ లేరు. సప్తవాణులై, సనాతనులై, నిత్యయవ్వనులైన సహోదరీమణులు ఒక పసికందును గాంచారు.”

“విమలత్వపు గర్భంలో, తీయదనపు స్రవంతులలో అతడి రాశులు విశ్వైక రూపాలని దాల్చి విస్తరించాయి. సుపోషకమైన నదులు ఇక్కడ తమని తామే పోషించుకున్నాయి. విజేత అయిన దేవత యొక్క ఇరువులు తల్లులు బృహత్తరులై, సామరస్యం చెందారు.”

“ఆ తల్లులకి పుట్టిన ఓ శక్తిమంతుడవైన పసివాడా! నీ మధుర విరాజిత అద్భుత రూపాలతో సాక్షాత్కరించినావు; తీయదనాల, విమలత్వపు ధారలు ఊరుతున్నాయి; సకల సంపదల వృషభుడు ప్రజ్ఞ చేత వృద్ధి చెందినాడు.”

“తన తండ్రికి చెందిన సిరులకి మూలం ఎక్కడుందో అతడు పుట్టుకతోనే కనుగొన్నాడు. అతడు తన ధారలని వెలువరించాడు, తన నదులని విస్తరింపజేశాడు. నమ్మకస్తులైన

సహచరులతో, సురలోకపు మహిమాన్వితుల సాయంతో అతడు రహస్య ధామాలలో ఆతని చలనాన్ని గమనించాడు. అయితే వాటి నిగూఢతలో అతడు తనను తాను మరచిపోలేదు."

"తండ్రి యొక్క శిశువును, ఆతని కన్నవారి సంతతిని కూడా అతడు ధరించాడు. వృద్ధి చెందుతున్న ఎందరో జనముల నుండి అతడు పోషణ అందుకున్నాడు. ఈ పరిశుద్ధ పురుషుడిలో, మానవుడిలోని ఆ జంట శక్తులు (దివి, భువి) తమ ప్రభువును, ప్రియతముడిని కనుగొన్నారు; ఆ ఇరువురినీ నీవు కాపాడుకో."

"ఎల్లలు లేని బృహత్తులో అతడు అమాంతంగా విస్తరించాడు; పలు జలాలు విజయవంతంగా అగ్నిని పెంచాయి. సత్యానికి మూలంలో అతడు విశ్రమించాడు; అవిభాజితులైన సోదరీమణుల ప్రయాసలో అక్కడ తన స్వధామాన్ని ఏర్పరచుకున్నాడు."

"వస్తువులలోని ప్రోద్బలంగా, వాటి సంరక్షకుడిగా అతడు మహిమాన్వితుల సంగమంలో ఉంటాడు. గొప్ప ప్రకాశనం కోసం శోధిస్తాడు, తిన్నని కిరణాలు గల వాడు, సోమ రసాన్ని పిండి తీయగలవాడు. విరాజితులకి తండ్రి అయిన అతడు, వారికి ఇప్పుడు కొత్త జననాన్ని ప్రసాదిస్తున్నాడు – జలాలకి శిశువు, ఘనుడు, బలోత్తముడు అయిన అగ్ని."

"జలాల యొక్క ప్రత్యక్ష జననానికి, భూమి యొక్క వృద్ధికి, ఆనంద దేవత, పరమానందమయి, పలు విధాల జన్మని ప్రసాదించింది. మనస్సు చేత అతనిలో దేవతలు ఐక్యం అయ్యారు. అతణ్ణి వారు తన పనిలో ప్రవేశపెట్టారు. పూర్ణ శక్తితో అవతరించిన అతడు ప్రచండ కార్యానికి సిద్ధమయ్యాడు."

“ఆ బృహత్తర ప్రకాశాలు భావంతుడైన అగ్నిని అంటిపెట్టుకుని వున్నాయి. తీక్షణమైన మెరుపుల్లా అతడి చుట్టూ అల్లుకున్నాయి; అతడి నుండి అతడి స్వధామంలో, రహస్య స్థలాలలో వృద్ధి చెందుతూ, ఎల్లలు లేని బృహత్తులో అమృతత్వాన్ని పితికి తీశాయి.”

పైన చెప్పుకున్న వేదభాగం యొక్క అర్థం ఏమైనా ఒక్కటి మాత్రం నిజం. దానికొక అధ్యాత్మిక అంతరార్థం వుందని, అది కేవలం ఆటవిక తెగల ఆచారాలని, బలిపూజలని పొగడే మోటు కవితలు కావన్నది మాత్రం నిజం. ఇక్కడ ఏడుగురు సోదరీమణులుగా చెప్పబడ్డ ఏడు నదులు పంజాబు ప్రాంతంలోని ఏడు నదులు కావన్నది స్పష్టం. ఏ జలాలలో అయితే దేవతలు కంటికి కనిపించే అగ్నిని కనుగొన్నారో ఆ జలాలు భౌతిక, పార్థివ జలాలు కావన్నది స్పష్టం. అలాగే ఏ అగ్ని అయితే జ్ఞానం చేత ఎదుగుతాడో, సత్యం యొక్క మూలాన్ని స్వగృహంగా చేసుకుని అక్కడ విశ్రమిస్తాడో, ఏ అగ్ని అయితే దివిని, భువిని ఇరువురు భార్యలుగా, ప్రేయసులుగా స్వీకరిస్తాడో, ఏ అగ్ని అయితే ఎల్లలు లేని బృహత్తులో తన స్వస్థానంలో దివ్యజలాల చేత పోషింపబడతాడో, తీరమే లేని అనంతసీమలో వసిస్తూ ప్రకాశవంతులైన దేవతలకి మహోత్కృష్టమైన అమరత్వాన్ని ప్రసాదిస్తాడో, ఆ అగ్ని భౌతికమైన అగ్ని కాలేడు. పైన చెప్పుకున్న వేదభాగంలో వేద బోధలోని అధ్యాత్మిక, అధిభౌతిక, మానసిక లక్షణం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇక్కడ వేదరహస్యం ఉపరితలానికి అడుగుననో, కర్మకాండ అనే తెరచాటునో ప్రచ్ఛన్నంగా లేదు. స్పష్టంగా, తేటతెల్లంగా కనిపిస్తోంది. దాని మీద ఒక మేలిమి ముసుగు లేకపోలేదు. అయితే ఆ ముసుగు పారదర్శకమైన ముసుగు. విశ్వామిత్రుడి ఋక్కులో నదులని వర్ణించిన పదజాలాన్ని ఇక్కడ జ్ఞాపకం తెచ్చుకోవచ్చు – “ముసుగు దాల్చలేదు, నగ్నం గానూ లేదు.”

పైన చెప్పబడ్డ జలాలు, వామదేవుడి ఋక్కులోను, వశిష్ఠుడి ఋక్కులోను చెప్పబడ్డ జలాలు రెండూ ఒక్కటేనని స్పష్టంగా చూడొచ్చు. ఆ జలాలకి స్పష్టతతోను, తేనెలతోను సంబంధం వుంది – “*ఘృతస్య యోనౌ స్రవథే మధూనామ్ ... శ్చోతన్తి ధారా మధునో ఘృతస్య*.” అవి సత్యం వద్దకి గొనిపోతాయి, అసలు అవే సత్యానికి మూలాలు. అవి

అనవధికమైన, ఎల్లలు లేని బృహత్తులోనే కాక ఇక్కడ భూమి మీద కూడా ప్రవహిస్తాయి. అవి ఆవులని (*ధేనవః*), అశ్వాలని (*అశ్వాః*) పోషిస్తున్నట్టుగా వర్ణించబడ్డాయి. వాగ్దేవి యొక్క ఏడు వాగ్ధారలుగా (*సప్త వాణీః*) వాటిని వర్ణించారు. ఆ వాక్కు అదితి యొక్క సృజనాత్మక శక్తి. వేదంలోఆ అదితిని, లేదా పరా ప్రకృతిని గోవుగాను, అలాగే పురుషుణ్ణి వృషభుడు (వృషన్) అంటే ఎద్దుగాను వర్ణించడం జరిగింది. అవి ఆత్మ యొక్క ఏడు ధారలు, అనన్య సచేతన చైతన్యంలోని చలనాల యొక్క ఏడు స్రవంతులు.

వేదం ఆదిలోనే, మధుచ్ఛందుడి ఋక్కులలో మనం పొడ చూసిన కాంతిరేఖల ఆధారంగాను, మనం అవలంబించిన ప్రతీకాత్మక అన్వయ విధానం వల్ల మనకి తెలుస్తున్న క్రొంగొత్త సత్యాల ఆధారంగాను, పైన కడు విడ్డూరంగా, రహస్యంగా, ప్రశ్నార్థకంగా తోచిన శ్లోకావళి, చాలా తేటతెల్లంగా, స్పష్టంగా కనిపిస్తోంది. అదే విధంగా ప్రస్తుతం అగమ్యగోచరంగా తోచే ఎన్నో ఇతర వేద భాగాలు కూడా ఈ పద్ధతిలో శోధిస్తూ పోతే వాటి అంతరార్థాన్ని వెల్లడించగలవు. ముందుగా అగ్ని యొక్క అధ్యాత్మిక పాత్రని నిర్దేశించాలి – ఒక హోతగా, యోధుడిగా, శ్రామికుడిగా, సత్యసాధకుడిగా, మానవుడి కోసం ఆనందాన్ని గెలిచిపెట్టే దేవుడిగా అగ్ని పాత్రని అర్థం చేసుకోవాలి. ఋగ్వేదంలో మొదటి ఋక్కులో, మధుచ్ఛందుడి శ్లోకాలలో అగ్ని యొక్క స్వభావం స్పష్టంగా వర్ణించబడింది. "ద్రష్ట యొక్క పనుల వెనుక సంకల్పం, వివిధమైన స్ఫూర్తి సిరులతో నిండి ఉంటుంది." అగ్నిదేవుడు, సర్వదర్శి, చైతన్యశక్తిగా అభివ్యక్తం అవుతాడు. లేదా మరి కాస్త ఆధునికమైన పరిభాష వాడాలంటే దివ్య సంకల్పంగా, విశ్వసంకల్పంగా అభివ్యక్తం అవుతాడు. ముందు ప్రచ్ఛన్నంగా ఉండి క్రమంగా సనాతన ప్రపంచాలని నిర్మిస్తాడు. ఆ తరువాత అభివ్యక్తమై, "జన్మించి," మనిషిలోని సత్యాన్ని, అమరత్వాన్ని పెంచి పెద్దచేస్తాడు.

ఇక్కడ విశ్వామిత్రుడి మాటల్లోని తాత్పర్యం ఏమిటంటే, దేవతలు మనుషులు కూడా ఆంతరిక సమర్పణ చేత తమలోని అగ్నులు రాజేసి దివ్య శక్తిని పెంచుకుంటారు; ఆరాధన చేత, ఆత్మసమర్పణ చేత దాన్ని పని చేయనిస్తారు; ద్రష్టల యొక్క ప్రజ్ఞని స్వర్గంలో, అంటే ద్యౌస్ అనే పదంతో ప్రతీకాత్మకంగా సూచించబడ్డ శుద్ధమనోసీమలో వ్యక్తం చేస్తారు. అంటే మనస్సు కన్నా అతీతమైన సత్య చైతన్యాన్ని మనస్సులో వ్యక్తం చేస్తారు. దివ్య శక్తి ప్రసారం కావడానికి ఒక బాటని ఏర్పరచడం కోసం వాళ్లు మనస్సుకి అతీతమైన వాక్కు యొక్క

ఆత్మవ్యక్తీకరణ కోసం కృషి చేస్తారు. దివ్య సంకల్పం తన కర్మలలో (*కవిక్రతుః*) దివ్యజ్ఞానాన్ని రహస్యంగా కలిగి ఉంటుంది. ఆ దైవేచ్ఛ మనిషిలోని మానసిక, భౌతిక చైతన్యాన్ని (*దివః పృథివ్యాః*) పోషిస్తుంది. బుద్ధిని బలపరుస్తుంది, వివేకాన్ని విమలం చేస్తుంది. ఆ విధంగా అవి పెరిగి పెరిగి "ద్రష్టల ఎరుకని" తెలుసుకునే స్థాయికి ఎదుగుతాయి. ఆ విధంగా అతిచేతనమైన సత్యం మనలో సచేతనమై ఆనందానికి (vs. 2-3) పునాదులు వేస్తుంది.

ఇక తక్కిన వేదభాగం అంతా ఆ దివ్య చైత్యశక్తి అయిన అగ్ని యొక్క ఆరోహణను వర్ణిస్తుంది. మర్త్యులలో అమరుడైన ఈ దేవుడు మనిషిలోని సాధారణ సంకల్ప, జ్ఞానాల స్థానంలో నిలుస్తాడు. ఆ స్థితి నుండి మర్త్య భౌతిక చేతనను సత్య, ఆనందాల అమరత్వపు స్థాయికి ఉద్ధరిస్తాడు. వేద ఋషులు మానవుడి యొక్క ఐదు జన్మల గురించి, లేదా ప్రాణుల వ్యవహారాలు సాగే ఐదు ప్రపంచాల గురించి చెప్తారు – *పంచజనాః, పంచక్షితీః* లేదా *క్షితీః*. ద్యౌస్ శుద్ధ మానసిక చేతనని సూచిస్తే, పృథివి శుద్ధ భౌతిక చేతనను సూచిస్తుంది. ఈ రెంటి మధ్య రెండు తలాలని సంధిస్తూ ప్రాణిక లేదా నాడీ చైతన్యమైన అంతరిక్షం విస్తరించి ఉంటుంది. ద్యౌస్ మరియు పృథివి అనేవి కలిసి రోదసి అవుతాయి – ఇవి రెండూ మన రెండు సీమలు. కాని ఈ రెంటికీ అతీతంగా పోవాలి, అప్పుడే మనం శుద్ధ మానసం కన్నా ఉన్నతమైన మరో స్వర్గంలోకి ప్రవేశాన్ని పొందుతాము – ఆ బృహత్తే అనంత చైతన్యమైన అదితికి పునాది (*బుధ్న*). ఆ బృహత్తే సత్యం. అది పరమోత్కృష్టమైన లోకత్రయానికి ఆధారంగా ఉంటుంది. అగ్ని యొక్క, విష్ణువు యొక్క, పవిత్రమైన జనని, అదితి యొక్క పరమ పదాలవి (*పదాని, సదాంసి*). ఆ బృహత్తు లేదా సత్యమే అగ్ని యొక్క నిజధామంగా చాటబడింది (*స్వం దమమ్, స్వం సదః*). ఈ ఋక్కులో అగ్ని భూమి నుండి తన స్వధామానాని ఆరోహిస్తున్నట్టుగా వర్ణించబడింది.

ఆ దివ్యశక్తిని దేవతలు జలాలలో, సోదరీమణుల చర్యలలో పొడచూడగలిగారు. అవే సత్యం యొక్క సప్తధారలు. మన ఆత్మ శిఖరాల నుండి ఇంద్రుడు కిందికి తెచ్చిన దివ్యజలాలు. భూమి తన ఉద్భిజాలలో (ఓషధీః) దాచుకున్న రహస్యం. భూమి తన ఎడదలో దాచుకున్న ఆ విషయం, దివి, భువి అనే రెండు *అరణుల* (*అరణీః*) ఒత్తిడిచేత, బయటికి వెలువడుతుంది. అందుకే ఆ విషయాన్ని భూమి ఉద్భిజాల శిశువు అని, దివికి, భువికి శిశువు అని

అంటారు. శుద్ధ మనస్సు భౌతిక చేతన మీద పని చేస్తున్నప్పుడు ఎదుర్కొనే బాధల వల్ల, సమస్య వల్ల, మనిషిలో ఆ అమర శక్తి ఉత్పన్నం అవుతుంది. కాని ఆ దివ్యజలాలలో అగ్ని గోచరమవుతాడు. తన పూర్ణ శక్తితో, తన పూర్ణ జ్ఞానంతో, తన పూర్ణ ఆనందంతో, ధవళ, విమల రూపంలో, తన చర్యలతో అరుణాకృతి దాల్చుతూ ఎదుగుతాడు (v. 3). పుట్టుకతోనే దేవతలు అతడికి శక్తిని, శోభని, శరీరాన్ని ప్రసాదిస్తారు; ఏడు మహానదులు అతడి ఆనందాన్ని పోషిస్తాయి. ఆ నవశిశువు మీదుగా అవి ప్రవహిస్తూ అశ్వమాతల (అశ్వాః) వలె అతగాడిని కాపు కాస్తాయి (v. 4).

మామూలుగా పాడియావులుగా (*ధేనవః*) వర్ణించబడే ఆ నదులని ఇక్కడ ఆడు గుర్రాలుగా (*అశ్వాః*) వర్ణించడం జరిగింది. ఆవు అనేది జ్ఞాన రూపంలో ఉండే చైతన్యానికి ప్రతీక అయితే, గుర్రం అనేది బలం రూపంలో ఉన్న చైతన్యానికి ప్రతీక. అశ్వం లేదా గుర్రం జీవశక్తికి చిహ్నం. అగ్ని మీద పని చేస్తూ భూమి మీద ప్రవహించే నదులు జీవన శక్తిస్రవంతులు అవుతాయి. జీవన గతులకి, జీవనోద్ధతికి, ప్రాణశక్తికి అవి చిహ్నాలు. ఆ ప్రాణశక్తే కదులుతుంది, ఆకాంక్షిస్తుంది, ఆనందిస్తుంది. అగ్ని అనే ప్రతీక కూడా ఆరంభంలో భౌతికమైన ఉష్ణంగా, బలంగా కనిపించినా, దాని ద్వితీయ రూపంలో అశ్వంగా అభివ్యక్తమై, ఆ తరువాత దైవీ అగ్నిగా పరిణమిస్తుంది. జలాల శిశువుగా అగ్ని సాధించే మొదటి ఫలితం, తన పూర్ణ రూపాన్ని, విస్తృతిని, విమలతని మధ్య లోకానికి, అంటే ప్రాణతలానికి (*రజ ఆతతన్వాన్*) ఆపాదించడం. మనిషిలోని నాడీజీవనాన్ని అతడు పరిపూతం చేస్తాడు, తన విమల విరాజిత అంగాలతో దాన్ని ప్రభావితం చేస్తాడు. అందులోని ప్రేరణలని, కోర్కెలని ఉద్ధరిస్తాడు, సత్యం యొక్క ప్రజ్ఞ యొక్క (*కవిభిః పవిత్రైః*) శుద్ధ అతిచేతనా శక్తులతో కర్మల (*క్రతుమ్*) వెనుక సంకల్పాన్ని పరిశుద్ధం చేస్తాడు. ఆ విధంగా అతడు తన సువిస్తార వైభవాలని ప్రదర్శిస్తాడు. చెదరిన కోర్కెల, కాముకతల కుటిల వలయం నుండి బయటపడి, దివ్యజలాలకి సహజమైన జీవనాన్ని వ్యక్తం చేస్తాడు.

ఆ విధంగా సప్తధారలు గల జలాలు పైకెగసి శుద్ధ మనోవృత్తిగా మారుతాయి. అవే స్వర్గలోకపు మహిమాన్వితులు. అక్కడ ఆ జలాలు ప్రప్రథమ, సనాతన, నిత్యయవ్వన శక్తులుగా వ్యక్తమౌతాయి. ధారలు వేరైనా వాటి మూలం ఒకటే. అవన్నీ అతిచేతనా సత్యం అనే గర్భం నుండి జనించిన సంతతే. దివ్యమానసం లోనుండి వెలువడ్డ సృజనాత్మక వాక్కుకి చెందిన ఏడు మూల శబ్దాలు ("సప్త వాణీః"). శుద్ధమానసానికి చెందిన జీవనం నాడీజీవనం వంటిది కాదు. తన మర్త్య జీవనాన్ని నిలబెట్టుకోడానికి చుట్టూ ఉన్నవాటిని భక్షించి బతుకుతుంది నాడీజీవనం. శుద్ధ మానస జలాలు భక్షించే లక్షణం కలవి కావు. అలాగని అవి పొరబాటు చెయ్యవు కూడా. అక్కడ సనాతన సత్యం మానసిక రూపాల మేలి ముసుగును దాల్చి ఉంటుంది. ఆ కారణం చేతనే వాటి గురించి "ముసుగు దాల్చలేదు, నగ్నం గానూ లేదు" అని చెప్పడం జరిగింది.

కాని ఇది ఆఖరి దశ కాదు. ఆ మానసిక స్పష్టత (ఘృతస్య) జన్మస్థానం లేదా గర్భం లోకి శక్తి ఆవిర్భవిస్తుంది. అందులోకి దివ్యమైన తియ్యందనపు స్రవంతులు ప్రవహిస్తాయి (*స్రవథే మధూనాం*). అక్కడ అది దాల్చే రూపాలు విశ్వజనీన రూపాలు, విశాల, అనంత చైతన్య సందోహాలు. ఆ కారణం చేత పై నుండి దిగి వచ్చే మహోన్నత మాధుర్యం దిగువ లోకాలని చెందిన పోషక నదులని పోషిస్తుంది. సర్వసమర్థమైన సంకల్పం యొక్క ఇద్దరు జననులైన మానసిక, భౌతిక చైతన్యాలు పరిపూర్ణమై, సమానమవుతాయి. అనంతమైన ఆనందం చేత పోషించబడి, సత్య తేజం చేత సామరస్యం గావించబడతాయి. అవి అగ్ని యొక్క పూర్తి ధాటిని భరిస్తాయి. ప్రజ్వలించే అతడి మెరుపులని, అతడి విశ్వైక రూపాల శోభని, హ్లాదాన్ని భరిస్తాయి. ఎక్కడైతే ఆ స్వామి, పురుషుడు, సకల సిరుల వృషభుడు అతిచేతనా సత్యం యొక్క ప్రజ్ఞ చేత పోషించబడతాడో, అక్కడ విమల స్రవంతులు, పరమానంద స్రవంతులు సదా ప్రవహిస్తుంటాయి (vs. 7-8).

ఆ స్వామి, పురుషుడు, అతడే అన్నిటికీ తండ్రి; అన్నిటికీ చెందిన రహస్య మూలంలో, అతిచేతనలో అతడు దాగి వుంటాడు; అగ్ని తన తోటి సహదేవతలతో పాటు, సప్తధారల జలాలతో పాటు అతిచేతనలోకి ప్రవేశిస్తాడు. ఆ ప్రయత్నంలో మన సచేతనమైన ఉనికి

నుండి మాయమైపోకుండా, అన్నిటికీ పితరుడైన ఆ మూలంలో ఉండే మధురసిరులని తెచ్చి జీవతలం మీద వాటిని కురిపిస్తాడు. ఆ తండ్రే కొడుకు అవుతాడు, దివ్యుడైన కుమారుడవుతాడు, పూర్ణ పురుషుడు అవుతాడు, అనన్యుడు అవుతాడు. మానవుడిలోని ఆత్మగా విశ్వజనీనుడై విలసిల్లుతాడు. మనిషిలోని మానసిక, భౌతిక చేతనలు అతణ్ణి తమ స్వామిగా, ప్రియతముడిగా స్వాగతిస్తాయి; అనన్యుడే అయినా అతడు నదుల యొక్క అనేకముఖ చలనాన్ని, విశ్వశక్తుల బాహుళ్యాన్ని ఆనందిస్తాడు (vs. 9-10).

అప్పుడు మనకి మరో విషయం స్పష్టంగా వివరించబడుతుంది. ఏ అనంతతలోకైతే అతడు ప్రవేశించాడో, ఏ అనంతతలోనైతే అతడు ఎదుగుతున్నాడో, ఏ అనంతతలోనైతే అనేక జలాలు తమ లక్ష్యాన్ని (*యశసః*) చేరుకుని అతణ్ణి పోషించాయో, ఆ అనంతతే హద్దుల్లేని బృహత్తు. సత్యం అక్కడే జన్మిస్తుంది. అతి తీరం లేని అనంతం. అదే అతడి సహజ పీఠం. ఇప్పుడు ఆ స్థలాన్నే అతడు తన స్వధామంగా చేసుకున్నాడు. అక్కడ ఏడు నదులు, లేక ఏడు సోదరీమణులు, కలిసికట్టుగా పని చేస్తారు. భూమి మీద, ఈ మర్త్యలోకంలో జరిగినట్టు కాకుండా, వేర్పాటు లేకుండా, ఒకే మూలం కలిగినట్టుగా, విభజన లేని సహచరులలా (*జామీనామ్ అపసి స్వసౄణామ్*) పని చేస్తారు. ఆ మహిమాన్వితుల సమాగమంలో అగ్ని అన్నిట్లోను చరిస్తూ, అన్నిటినీ భరిస్తాడు; అతడి చూపుల కిరణాలు ఋజురేఖల్లో పయనిస్తాయి. నిమ్నలోకాల వక్రత వాటిని తాకదు. ఎవని వల్లనైతే జ్ఞాన ప్రకాశనం కలుగుతుందో, ఎవని నుండి అయితే ప్రభాత పశుసంజాతం ఆవిర్భవిస్తుందో, అతడు ఇప్పుడు వాటికి ఈ పరమ జన్మని ప్రసాదిస్తాడు; అతడు వాటిని దివ్యజ్ఞానంగా, అమృత చైతన్యంగా మార్చివేస్తాడు (vs. 11-12).

అయితే ఇది అతడి నూతన జన్మే కాక ఆఖరు జన్మ కూడా. పుడమి మొలకల నుండి శక్తికుమారుడిగా జన్మించినవాడు, జలాల శిశువుగా జన్మించినవాడు, అనేక ఆకృతులలో ఇప్పుడు ఆనంద దేవతకి జన్మించాడు. ఆ దేవి తీరంలేని అనంతంలో వెలసిన పూర్ణానందమయి, దివ్య చేతనానందమయి. మానవుడిలోని దేవతలు, లేదా దివ్య శక్తులు మనస్సుని సాధనంగా చేసుకుని, అతణ్ణి అక్కడ చేరుకుని, అతడి చుట్టూ పెనవేసుకుని, లోకంలో అతణ్ణి ఈ కొత్త ఘనతర అవతారంలో, ఓ మహత్కార్యంలో ప్రవేశపెడతారు. ఆ బృహత్ చైతన్యం నుండి వెల్లివిరిసే ఆ ప్రచండ తేజాలు ఈ దివ్యశక్తి యొక్క మేలిమి కాంతులై

భాసిస్తాయి. అక్కడి నుండి అతిచేతనలో, తీరం లేని బృహత్తులో, తన స్వధామంలో, మానవుడి కోసం అమరత్వాన్ని ఆకర్షిస్తాయి.

వేదంలో ఏడు నదులు, జలాలు, పంచలోకాలు మొదలైన ప్రతీకల అంతరార్థం అటువంటిది. అగ్ని యొక్క అవతరణకి, ఆరోహణకి అర్థం ఊర్ధ్వగతిలో సాగే మానవుడి అంతరంగ యాత్ర. మానవుడు తనలోనే దేవతలకి ప్రతిరూపాలని నిర్మించుకుంటూ అంచెలంచెలుగా మహత్తర ఆత్మశిఖరాన్ని (సానోః సానుమ్) ఆరోహిస్తాడు. ఈ విషయాన్ని ఒకసారి గ్రహించి గోవు యొక్క ప్రతీకని, సోమరసం యొక్క ప్రతీకని అర్థం చేసుకున్నామంటే, దేవతల యొక్క అధ్యాత్మిక క్రియల పట్ల కొంత అవగాహనని కల్పించుకున్నామంటే, ఈ ప్రాచీన గీతాల యొక్క అల్లకల్లోలపు, తప్పులతడకల అన్వయాలన్నీ ఇట్టే ఆవిరైపోతాయి. అప్రయత్నంగా, అతిసులభంగా ఆ ప్రాచీన ఋషుల విరాజమాన బోధనలోని అంతర్యం, ఆ వేద రహస్యం, మన చిత్తంలో సాక్షాత్కరిస్తుంది.

అధ్యాయం 12

ప్రభాత పశుసంజాతం

వైదిక పరిభాషలో ఏడు నదులని, లేదా జలాలని (*ఆపః*) సామాన్యంగా సప్త మాతలుగా, ఏడు పాడియావులుగా (*సప్త ధేనవః*) వర్ణించడం జరుగుతుంది. అసలు ఆపః అన్న పదంలోనే ఒక రహస్యమైన ద్వంద్వార్థం ఉంది; ఎందుకంటే 'అప్' అనే మూల శబ్దానికి కదలిక అన్న అర్థం వుంది. దాని నుండే కదులుతుంది కనుక జలం అన్న అర్థం వచ్చి ఉండొచ్చు. అదే పదానికి 'జన్మను ఇచ్చే' అన్న అర్థం కూడా ఉంది. ఉదాహరణకి '*అపత్య*' అంటే శిశువు. దక్షిణ భారత భాషల్లో 'అప్పా' అంటే తండ్రి. వేదంలోని సప్త జాలాలు అస్తిత్వపు జలాలు; ఉనికిలో సమస్తమూ ఆ తల్లుల నుండే పుడుతుంది. ఇటువంటిదే మరొక పదజాలం కూడా మనకి ఎదురవుతుంది – *సప్తగావః* – అంటే ఏడు ఆవులు, లేదా ఏడు కాంతులు. దీనికి సన్నిహితమైన 'సప్తగు' అనే విశేషణానికి అర్థం ఏడు కిరణాలు. 'గు' (*గవః*) మరియు 'గో' (*గావః*) అనే శబ్దాలకి వేదంలో ఆవులు, లేదా కాంతులు అనే ద్వంద్వార్థం వుంది. ప్రాచీన భారత తత్వచింతనలో ఉనికి, మరియు చైతన్యం రెండూ ఒకే తత్వం యొక్క రెండు ముఖాలు. ఏ అనంత అస్తిత్వం నుండి అయితే దేవతలు జన్మిస్తారో, ఆ తత్వాన్ని అదితి గా, జగన్మాతగా కొలుస్తారు. ఆమెకు ఏడు పేర్లు, ఏడు పీఠాలు (ధామాని). ఆ తల్లిని అనంత చైతన్యంగా, గోవుగా, ఏడు కాంతులుగా (*సప్త గావః*) వ్యక్తమయ్యే ప్రథమ తేజంగా కూడా గుర్తిస్తారు. కాబట్టి ఏడు ముఖాలు కలిగిన అస్తిత్వాన్ని ఒక దృక్పథంతో చూస్తూ సముద్రం (*సప్తధేనవః*) లోనుండి పైకెగసే ఏడు నదులుగా వర్ణించవచ్చు. లేదా మరో దృక్పథం నుండి చూస్తే సర్వాన్ని సృష్టించే తండ్రి అయిన సూర్య సావిత్రి యొక్క ఏడు కిరణాలుగా (*సప్తగావః*) కూడా వర్ణించవచ్చు.

గోవు అనే ప్రతీక వైదిక ప్రతీకలు అన్నిట్లోకి అతి ముఖ్యమైనది. కర్మకాండ పరాయణులకి గోవు అంటే కేవలం భౌతికమైన ఆవు మాత్రమే స్ఫురిస్తుంది. అలాగే '*అశ్వ*' అనే దాని సహచర శబ్దాన్ని విన్నప్పుడు వారికి భౌతికమైన గుర్రం తప్ప మరేమి స్ఫురించదు. అలాగే '*ఘృత*' అన్నప్పుడు నీరు అనో, నేయి అనో స్ఫురిస్తుంది. '*వీర*' అన్నప్పుడు కొడుకు అనో, సేవకుడు అనో స్ఫురిస్తుంది. కాబట్టి ఉషని ఉద్దేశించి ఋషి '*గోమద్ వీరవద్ దేహి రత్నమ్ ఉషో అశ్వావతీ* అని ప్రార్థించినప్పుడు, స్థూల దృష్టితో చూసే వ్యాఖ్యాతకి అందులో "కొండంత సిరితో పాటు ఆవులు, గుర్రాలు, సేవకులు" కావాలనే మొర మాత్రమే ధ్వనిస్తుంది. అట్లా కాకుండా ఇవన్నీ ప్రతీకాత్మకం అని తెలుసుకున్నప్పుడు, అర్థం ఇలా మారిపోతుంది –

“మాలో విజయ సామర్థ్యాన్ని, మహోగ్ర బలాన్ని కలిగిన, కాంతిపూర్ణమైన ఆనందమయ స్థితిని స్థిరంగా నిలుపు.” కాబట్టి వేద ఋక్కులలో గో అనే శబ్దం యొక్క అర్థం విషయంలో ఒక స్థిర నిర్ణయానికి రావాలి. అది ప్రతీకాత్మకం అని ఋజువైతే, దాంతో పాటు వచ్చే ఎన్నో ఇతర పదాలు – *అశ్వ* (గుర్రం), *వీర* (మనిషి, యోధుడు), *అపత్య* లేదా *ప్రజా* (సంతతి), *హిరణ్య* (బంగారం), *వాజ* (సమృద్ధి, సాయణుడి ప్రకారం ఆహారం) – కూడా అటువంటి ప్రతీకాత్మక అన్వయానికి నోచుకుంటాయని అనుకోవచ్చు.

వేదంలో ఆవు అనే ప్రతీక తరచు ఉషస్సుతోను, సూర్యుడితోను ముడిపడి ఉంటుంది. పణులు గుహలో దాచిన ఆవులని ఇంద్రుడు, బృహస్పతి కలిసి సరమ అనే కుక్క సాయంతో, అంగీరస ఋషుల తోడ్పాటుతో రక్షించి బయటకు తెచ్చే గాథలో కూడా ఆవులకి ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఉషస్సు అనే భావన, అంగీరస ఋషుల గాథ – ఈ రెండూ వేదసాంప్రదాయపు హృదయంలోనే ఒదిగి వున్నాయి. వేదరహస్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఈ రెండూ అతిముఖ్యమైన అంశాలు అని కూడా అనుకోవచ్చు. కాబట్టి మన శోధనకి స్థిరమైన ఆధారం కావాలంటే, ఈ రెండు అంశాలని ముందు క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఉషాదేవిని ఉద్దేశించి చెప్పబడ్డ వేదమంత్రాలని చూచాయగా పరిశీలించినా కూడా ప్రభాత పశుసంజాతం అనే ప్రతీక, సూర్యుడి పశుసంజాతం అనే ప్రతీక ఈ రెండూ కాంతికి ప్రతీకలు అన్న విషయంలో సందేహం లేదని తెలుస్తుంది. ఈ ఋక్కుల మీద వ్యాఖ్యానించిన సాయణుడు కూడా అదే పదాన్ని కొన్నిసార్లు ఆవుగాను, మరి కొన్నిసార్లు కిరణాలు గాను అన్వయించడం జరిగింది. అన్వయం సంసక్తంగా ఉండాలన్న నియమాన్ని అలా అలవోకగా గాలికి వదిలేశాడు వ్యాఖ్యాత. సత్యం అనే అర్థం గల ఋతమ్ అనే పదం లాగానే, గో అనే పదానికి జలం అనే అర్థం కూడా ఉందని కొన్ని చోట్ల అంటాడు. నిజానికి ఈ పదాన్ని ద్వంద్వార్థంలో తీసుకోవచ్చు అన్నది స్పష్టంగా తెలుస్తోంది. “కాంతి” అన్నది దాని అంతరార్థం, “ఆవు” అనేది దాని బాహ్యార్థం లేక స్థూలార్థం.

కొన్ని సందర్భాల్లో “కిరణాలు” అనే అర్థం మరింత స్ఫుటంగా కనిపిస్తుంది. ఉదాహరణకి ఒక ఋక్కులో మూడవ శ్లోకంలో (I.7) మధుచ్ఛందుడు ఇంద్రుణ్ణి స్తుతిస్తూ ఇలా అంటాడు – “దూరదృష్టి కోసం ఇంద్రుడు సూర్యుణ్ణి స్వర్గం వరకు ఆరోహింపజేస్తాడు. తన కిరణాలతో

పర్వతం మీద సంచరింపజేస్తాడు (*వి గోభిర్ అద్రిమ్ ఐరయత్*)." అదే సమయంలో సూర్య కిరణాలే సూర్యుడి ఆలమందలు కూడా. ఒడిస్సీ గాధలో ఒడిసియస్ సహచరుల చేత చంపబడ్డ హీలియోస్ పశువులవి. హెర్మిస్ ని ఉద్దేశిస్తూ హోమర్ కవి రాసిన పద్యంలో హెర్మిస్ తన సోదరుడు అపోలో నుండి కాజేసిన పశువులవి. శత్రువైన వలుడి చేత, పణుల చేత తస్కరించబడ్డ ఆవులవి. మధుచ్ఛందుడు ఇంద్రునితో "వలుడు ఆవులని దాచిన గోతిని నీవు తెరువగలిగావు," అని అన్నప్పుడు, వలుడు దాస్తాడని, కాంతిని సంగ్రహిస్తాడని, అలా కాజేయబడ్డ కాంతిని ఇంద్రుడు తిరిగి సాధించి యాజ్ఞికుడికి ప్రసాదిస్తాడని అర్థం. పోయిన లేదా దోచుకోబడిన ఆవులని తిరిగి సాధించే వృత్తాంతపు ప్రస్తావన వేదంలో తరచు కనిపిస్తుంటుంది. పణుల యొక్క, అంగీరస ఋషుల యొక్క గాధని పరిశీలించినప్పుడు ఈ భావం మరింత స్పష్టం అవుతుంది.

పైన చెప్పుకున్న రీతిలో భావస్థాపన జరిగాక, వేద మంత్రాలలో "గో"శబ్దాన్ని స్థూలంగా అన్వయించే ప్రయత్నానికి అడ్డుకట్టపడుతుంది. ద్రావిళ్ల చేత దొంగిలించబడ్డ పశుసమూహాలని తిరిగి తీసుకురమ్మని ఋషులు ఇంద్రుణ్ణి ప్రార్థించినప్పుడు, ఆ పశువులు నిజానికి సూర్యదేవుడి కిరణాలు అని అర్థం చేసుకున్నప్పుడు, ఏ చౌర్య వ్యవహారాలతోను సంబంధం లేకుండా కేవలం "ఆవుల" కోసం ప్రార్థనలు చేసిన ఇతర సందర్భాలలో కూడా "అవు" యొక్క అర్థం తేజమే అయ్యుండాలని అనుకోవలసి ఉంటుంది. ఉదాహరణకి I.4.2. లో ఇంద్రుణ్ణి వర్ణిస్తూ, అతడు పరిపూర్ణ రూపాల నిర్మాత అని, ఆవుల నుండి చక్కగా పాలు పితకడం తెలిసినవాడని, సోమరస పానము చేసిన పారవశ్యంలో అతడు "ఆవులని ప్రసాదించే" గుణం కలిగి ఉంటాడని చెప్పబడింది (*గోదా ఇద్ రేవతో మదః*). దీన్ని బట్టి ఇంద్రుడు బాగా ఆస్తిపరుడైన దేవుడని, తాగిన మైకంలో ఆవులని ఉదారంగా ఇచ్చేస్తుంటాడని భావిస్తే అర్థం పూర్తిగా రసాభాస అవుతుంది. మొదటి సందర్భంలో పాలుపితకడం అనేది కేవలం ప్రతీక అయితే, రెండవ సందర్భంలో ఆవులని ప్రదానం చెయ్యడం కూడా ఒక ప్రతీక మాత్రమేనని తెలుసుకోవాలి. వేదంలో ఇతర సందర్భాల బట్టి ఆవు కాంతికి ప్రతీక అని మనకి ఇప్పటికే తెలుసు కనుక, సోమరస పానంలో పరవశించిన ఇంద్రుడు కూడా మనకి ప్రసాదించేది కాంతి అని తెలుసుకోగలము.

ఉషని ఉద్దేశించిన ఋక్కులలో కూడా ఆవుల అర్థం తేజస్సు అనే భావన తేటతెల్లంగా కనిపిస్తుంది. ఊషాదేవిని ఎప్పుడూ "గోమతి" గా వర్ణిస్తుంది వేదం. ఆ పదానికి అర్థం కాంతిపూర్ణం. అట్లా కాకుండా ఉషస్సుని "ఆవులతో నిండినది" అని అన్వయించడం హాస్యాస్పదంగా ఉంటుంది. గోమతి అన్న పదంతో ఆగిపోకుండా వేదం ఉషని "గోమతి, అశ్వవతి" అని వర్ణిస్తుంది. అంటే ఆమెలో ఆవులే కాక, గుర్రాలు కూడా సమృద్ధిగా ఉంటాయనుకోవడం అర్థరహితం. గోశాలలో బందీగా ఉన్న ఆవులని, గోశాలని తెరిచి విడిపించినట్టు, ఆమె అంధకారాన్ని ఛేదించి లోకం మీద కాంతులు కురిపిస్తుంది. ఇక్కడ కూడా పొరబాటుకు తావు లేకుండా ఆవుని కాంతికి ప్రతీకగా అన్వయించగలుగుతాము (I.92.4). అదే ఋక్కులో (I.92), అశ్వినులని తమ రథాన్ని దిగువ దిశలో విరాజిత, హిరణ్మయ (*గోమద్ హిరణ్యవద్*) మార్గంలో పోనివ్వమని ప్రోత్సహించడం జరుగుతుంది. అంతేకాక ఉషాదేవి ఎక్కిన రథాన్ని కొన్ని సార్లు ఎర్రని ఆవులు, మరి కొన్ని సార్లు ఎర్రని గుర్రాలు (*యుంక్తే గవామ్ అరుణానామ్ అనీకమ్*) లాగుతున్నట్టుగా చెప్పబడింది (I.124.11). ఇక్కడ స్థూలార్థం వెనుక "ఎర్రని కిరణ సంజాతం" అనే ద్వితీయార్థం స్పష్టంగా స్ఫురిస్తోంది. ఆమె ఆవుల యొక్క లేదా కాంతుల యొక్క తల్లిగా వర్ణించబడింది; గవాం జనిత్రీ ఆకృతా ప్రకేతుమ్ (I.124.5). దీని అర్థం 'ఆవుల (లేక కిరణాల) తల్లి దృష్టిని సృష్టించింది.' ఇదే భావన మరో సందర్భంలో ఇలా వ్యక్తం చెయ్యబడింది – 'ఏమీ లేని చోట చూపు ఉదయించింది.' ఇక్కడ మరొక్క సారి పశువులు అంటే మెరిసే కిరణ సంజాతం అని స్పష్టంగా తెలుస్తోంది. అలాగే "మెరిసే పశు సంజాతానికి నేత్రి" గా ఆమె ప్రశంసించబడింది (*నేత్రి గవామ్*) (VII.76.6). మరో సుబోధమైన శ్లోకంలో ఈ రెండు భావనలు రంగరించబడ్డాయి. "గోవులకి జనని, దినములకి మార్గదర్శిని" (*గవాం మాతా, నేత్రీ అహ్నాం*) (VII.77.2). ఇక ఒక చోట ప్రతీక అనే మేలిముసుగుని తొలగిస్తున్నట్టుగా, గోవులు కిరణాలకి ప్రతీకలు అని వేదం స్పష్టంగా చెప్తుంది. "విడుదలైన గోవుల వలె ఆమె ఆనందమయ కిరణాలు గోచరమవుతాయి" (*ప్రతి భద్రా అదృక్షత గవాం సర్గా న రశ్మయః*) (V.52.5.). ఈ సత్యాన్ని మరింత తేటతెల్లంగా తెలిపే మరో శ్లోకం వుంది – "గోవులు

(కిరణాలు) చీకటిని తొలగించి కాంతిని విస్తరింపజేస్తాయి;" *సం తే గావస్ తమ ఆ వర్తయంతి, జ్యోతిర్ యచ్ఛంతి*[13].

అయితే ఉష ఎక్కిన రథాన్ని లాగేది కేవలం ఈ మెరిసే ఆలమందలే కావు; ఆ ఆలమందలని ఆమె యాజ్ఞికుడికి వరంగా ప్రసాదిస్తుంది; సోమరస పారవశ్యంలో ఉన్న ఇంద్రుడికి మల్లె ఆమె కూడా కాంతి ప్రదాత్రి. ఆమె దేవతల కృషిలో పాలుపంచుకుంటున్నట్టుగా వశిష్ఠుడి ఋక్కు (VII.75) చెప్తుంది. ఆ కృషి వల్ల మూసిన తలుపులు భేదించబడతాయి, బంధించబడ్డ పశువులు విడుదల గావించబడతాయి, మనుషులకి వరాలుగా ప్రసాదించబడతాయి – "సత్యవంతులైన దేవతలలో ఆమె సత్యవతియై, మహిమాన్వితులైన దేవతలలో ఆమె మహిమాన్వితయై, మొండి స్థలాలని బద్దలు కొట్టి మెరిసే పసులని ప్రదానం చేస్తుంది; ఆవులు ఉష కోసం అంబా అని ఆరుస్తాయి."–
– *రుజద్ ధృఢాని దదద్ ఉస్రియాణాం, ప్రతి గావ ఉషసం వావశంత.* వెంటనే తదుపరి శ్లోకంలో యాజ్ఞికుడిలో ఒక ఆనందమయ తేజోపూర్ణమైన (గోవులతో నిండిన), శక్తి పూర్ణమైన (అశ్వాలతో నిండిన) స్థితిని కుదురుగా కలుగజేయమని, మరెన్నో ఇతర భోగాలని ప్రసాదించమని ఆమెను వేడుకోవడం జరుగుతుంది – *గోమద్ రత్నమ్ అశ్వావత్ పురుభోజః.* కాబట్టి ఉష ప్రసాదించే వరాలు తేజోసమూహాలు. వలుడు, పణులు దృఢమైన ప్రదేశాలలో దాచి వుంచిన గో, అశ్వ సంపదలని దేవతలు, అంగిరస ఋషులు తిరిగి సాధిస్తారు. ఋషులు వేడుకొనే సంపదలు ఆ కాంతుల సిరులేనని స్పష్టంగా తెలుస్తోంది. ఏడవ శ్లోకంలో ఉష ప్రసాదించే గోవులు, ఎనిమిదవ శ్లోకంలో ఋషులు ఇమ్మని ప్రార్థించే గోవులు – ఈ రెండూ వేరని తలపోయడం అసంభవం. ఒక శ్లోకంలో కాంతి అనుకున్నది, తదుపరి శ్లోకంలోనే ఆవు కాలేదు. మాట నోరు జారగానే విషయం విస్మరించేటంత మతిమరుపు ఋషులకి ఉంటుందని అనుమానించనక్కర్లేదు.
కొన్ని సార్లు వాళ్లు ప్రార్థించేది సుప్రకాశమైన ఆనందం కోసమో, సుప్రకాశమైన ఐశ్వర్యం కోసమో కాదు; వాళ్లు కోరేది సుప్రకాశమైన శక్తి కోసం – "ఓ సురతనయా! సూర్యుడి కిరణాలతో పాటు మాకు సుప్రకాశమైన ప్రేరణలని ప్రసాదించు. *గోమతీర్ ఇష ఆ వహా దుహితర్ దివః, సాకం సూర్యస్య రశ్మిభిః* (V.79.8)." "మెరిసే తినుబండారాలు" అన్నట్టుగా

[13] వేదంలో గో అంటే కాంతి అన్న విషయంలో అసలు సందేహమే రాకూడదు. ఉదాహరణకి వృత్రుడు కాంతి చేత, గవా, వధించబడ్డాడు అన్నప్పుడు, అక్కడ ఆవు ప్రసక్తే రాదు. ఆవుని ప్రతీకగా వాడుకుంటూ ద్వంద్వార్థాన్ని ఎలా ప్రయోగించారు అన్నదే ఇక్కడ ప్రశ్న.

శాయణుడు దీన్ని అన్వయిస్తాడు. కాని మరి సూర్యకిరణాలతో పాటు ఉష ప్రసాదించేది భాసించే భోజనం అనడం అర్థరహితం అని వేరే చెప్పనక్కర్లేదు. “ఇష్” అన్న శబ్దానికి అర్థం ఆహారం అనుకుంటే, ఆ పదబంధాని “గోమాంసపు ఆహారం” అని అన్వయించవలసి వస్తుంది. ప్రాచీన కాలంలో గోమాంస భోజనం నిషిద్ధ కాదన్న విషయం బ్రాహ్మణాల నుండి మనకు తెలుస్తోంది. అయితే ఇక్కడ ఉద్దేశించబడిన అర్థం సాయణుడి అనుకున్నది కాదన్న విషయం ఋగ్వేదంలోనే మరో శ్లోకం చేత నిరూపించబడుతోంది. ఆ శ్లోకంలో సుప్రకాశమైన ప్రేరణలు ఇచ్చి అంధకార సీమ యొక్క ఆవలి గట్టుకు దాటించమని అశ్వినీ దేవతలని ప్రార్థించడం జరుగుతుంది. *యా నః పీపరద్ అశ్వినా జ్యోతిష్మతీ తమస్ తిరః, తామ్ అస్మే రాసాథామ్ ఇషమ్* (I.46.6).

ఈ ఉదాహరణల బట్టి గోవు అంటే తేజస్సు అనే భావన వేదంలో సర్వత్ర ఎలా వ్యాపించి వుందో స్పష్టంగా చూడగలము. అయితే ఇక్కడ మరో సందేహం కలుగవచ్చు. ఆవు అంటే తేజం అని అనుకున్నా, అది కేవలం పగటి పూట కనిపించే భౌతిక కాంతి అని వేదం యొక్క ఉద్దేశంగా స్వీకరించాలా? ఆవు కేవలం ఉషాకాంతికి చిహ్నం అనుకుని, ఆ కాంతి మళ్లీ ఆత్మప్రకాశానికి చిహ్నం అనుకుంటే, అలాంటి ద్వంద్వ ప్రతీకని తీసుకోవలసిన అగత్యం ఏం వచ్చింది? అలాంటప్పుడు ఋషులు ప్రార్థిస్తున్నది ఆత్మప్రకాశం కోసం కాదని, కేవలం ఉషాకాంతుల కోసమని అనుకుంటే సరిపోదా?

ఇలాంటి అభ్యంతరాలు ఎన్నో లేవదీయొచ్చు. కొన్నిటికి సమాధానాలు అంత సులభం కూడా కాదు. వేదమంత్రాలు భారతావనిలో విరచించబడ్డాయని అనుకుంటే, అవి వర్ణించే ఉషస్సులో భరతఖండానికి చెందిన పగలు అనుకుంటే, అవి చెప్పే రాత్రి కేవలం పది పన్నెండు గంటలు ఉండే రేయి అనుకుంటే, వేదఋషులు రాత్రి అన్నా, చీకట్లో పొంచి ఉండే రక్కసులన్నా భయంతో వణికిపోయే ఆదిమ, ఆటవిక జాతి వారని తలపోయాల్సి ఉంటుంది. రాత్రి తరువాత పగలు నియమం ప్రకారం వస్తుందనే ప్రాథమిక ధర్మం (మరి ఈ సత్యం ఎన్నో సూక్తాలలో చక్కగా కీర్తించబడింది) కూడా తెలియని అజ్ఞానులని, తమ ప్రార్థనల వల్ల, యజ్ఞాల వల్ల మాత్రమే సూర్యుడు దివిసీమలో ప్రత్యక్షమయ్యాడని, ఉష తన చెల్లెలు రేయి

యొక్క కౌగిటి నుండి విడిపించుకోగలగిందని అనుకునే అమాయకులని అనుకోవాల్సి ఉంటుంది. కాని దేవతల కృత్యాలు ధర్మమార్గాన్ని తిరుగులేకుండా అనుసరిస్తాయని, ఉషాదేవి నిరతం సత్యాన్ని, సనాతన ధర్మాన్ని అనుసరిస్తుందని మరి వారే అన్నారు! "మేము ఈ చీకటి ప్రాంతానికి ఆవలి గట్టును చేరుకున్నాం," అని ఋషులు సంతోషంగా ఎలుగెత్తి చాటినప్పుడు, అతడు వర్ణిస్తున్నది కేవలం తెల్లవారే నిద్రనుండి మేల్కొనే వైనాన్ని మాత్రమేనా? ఉదయానే యజ్ఞం చెయ్యడానికి కూర్చునే వేదఋషులు అప్పటికే వచ్చేసిన పగటి కాంతి కోసం ప్రార్థిస్తున్నారని అనుకోవాలి. ఇవన్నీ అసంగత విషయాలని కొట్టిపారేసినా, ఇక్కడ మరో ప్రకటన మనకి ఎదురవుతుంది. ఎనిమిది, తొమ్మిది నెలల పాటు నిష్ఠగా ఉపాసించాకనే పోయిన కాంతి తిరిగి వశమయ్యిందని, మరుగుపడ్డ సూర్యుడు మళ్లీ కనిపించాడని అంగీరస ఋషులు చాటుతారు. అలాగే పితరులు కాంతిని ఆవిష్కరించిన వృత్తాంతం గురించిన ప్రస్తావన పదే పదే వస్తుంది – "మన పితరులు నిగూఢ కాంతిని కనుగొన్నారు. వాళ్ల ఆలోచనలలోని సత్యంతో వాళ్లు ఉషోదయాన్ని కలుగజేశారు." *గూఢం జ్యోతిః పితరో అన్వనిందన్, సత్యమంత్రా అజనయన్ ఉషాసమ్* (VII.76.4). ఏ కావ్యంలోనైనా, కృతిలోనైనా అలాంటి శ్లోకం మనకి ఎదురైతే, దానికి నిస్సంకోచంగా మానసికమైన, అధ్యాత్మికమైన అర్థాన్ని ఆపాదిస్తాము; మరి వేదం మినహాయింపు ఎందుకు కావాలి?

అలా కాకుండా వేద ఋక్కులని అనితరంగా ప్రకృతి పరమైన వివరణని మాత్రమే ఇవ్వాలని నిర్ణయించుకుంటే, వేదంలో చెప్పబడ్డ రేబవళ్లు భారతావనికి చెందిన రాత్రి పగలు కాలేవు; అంగీరస ఋషుల గురించి, రేబవళ్ల గురించి ఋషులు చేసిన వర్ణనలు ఒక్క ఆర్కిటిక్ ప్రాంతంలో మాత్రమే చెల్లుతాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో మన జన్మభూమికి చెందిన స్మృతులు వేదం యొక్క స్థూలార్థంలోకి ప్రవేశించే అవకాశం లేకపోలేదు. అలాంటి ఆర్కిటిక్ సిద్ధాంతం ఒకటి ఉన్నా అది వేదం యొక్క అంతరార్థాన్ని, అధ్యాత్మిక అన్వయాన్ని తిరస్కరించదని గుర్తించాలి.

ఉదాహరణకి అశ్వినులని ఉద్దేశించి ప్రస్కణ్వ కణ్వుడు రాసిన ఋక్కునే (I.46) తీసుకుందాం. చీకటి యొక్క ఆవలిగట్టుకు తీసుకుపోయే ఒక ప్రకాశవంతమైన ప్రేరణ గురించి అది మాట్లాడుతుంది. ఈ ఋక్కుకి రాత్రి, పగలు అనే వైదిక భావనతో సన్నిహితమైన సంబంధం వుంది. ఎన్నో స్థిరమైన వైదిక ప్రతీకల ప్రస్తావన అక్కడ వస్తుంది. సత్య పథం గురించి, నదులని దాటడం గురించి, సూర్యోదయం గురించి, ఉషకి అశ్వినులకి మధ్య సంబంధం గురించి, సోమరసం యొక్క అధ్యాత్మిక ప్రభావం గురించి, దాని సాముద్రికమైన సారం గురించి – ఇలా ఎన్నో ముఖ్యమైన అంశాల ప్రస్తావన వస్తుంది.

"అదివో! అనుపమానమైన ఉషస్సు ఆనందపూర్ణమై దివిసీమలో వెల్లివిరుస్తోంది; మీ బృహత్తును నేను గుర్తిస్తున్నాను, సాగరం మీ తల్లి, మనస్సుకి ఆవల ఉన్న ఆనందాలని సాధించి, మీ కృషిలో జయించారు, ఆలోచన చేత ఆ అద్భుత సారాన్ని కనుగొన్నారు... ఆ మహాయాత్రకు మీరు వేలుపులు, శబ్దానికి మీరు మానసిక రూపాన్ని ఇస్తారు, ఇదుగో ఇది మీ ఆలోచనలని కరిగిస్తుంది, - ఈ సోమరసాన్ని జృంభణంగా సేవించండి; ఓ అశ్వినులారా! ఈ చీకటిని దాటించగల విరాజమాన ప్రేరణను ఇవ్వండి. మనస్సుకి ఆవల, ఆలోచనలకి ఆవలి తీరానికి మా కోసం మీ ఓడలో పయనించండి. ఓ అశ్వినులారా! మీ రథాన్ని పూన్చండి, ఈ రథమే స్వర్గంలో తెడ్లు గల ఓ బృహత్తరమైన నౌకగా మారిపోతుంది, ఆ నౌకలో ఆ నదులని దాటగలరు; ఆలోచనతో ఆనందపు శక్తులని పూన్చారు. స్వర్గసీమలో సోమరసం యొక్క ఆనంద శక్తులే జలాల స్థానంలో అక్కడ వున్న అద్భుత పదార్థం. కాని మిమ్మల్ని కప్పి వుంచే మేలి ముసుగును ఎప్పుడు తొలగిస్తారు? సోమరసానందంలోనే మరి కాంతి జనించింది; - చీకట్లో దాగిన సూర్యుడు హిరణ్యం కోసం తన నాలుక చాచాడు. ఆవిర్భవించిన సత్య పథం మీదుగా పయనించి మేము ఆవలి తీరాన్ని చేరగలుగుతాము; వినువీధిలో ఓ సువిస్తారమైన మార్గం ప్రత్యక్షమయ్యింది. సాధకుడు ఆత్మపరంగా ఇంతింతై ఎదుగుతాడు. సోరమస పానపు హ్లాదంలో అశ్వినులు పరవశిస్తుంటే వారిని పదే పదే అభివ్యక్తం చేస్తాడు. సర్వప్రకాశకమైన సూర్యునిలో వసిస్తూ, సోమరస పానము చేస్తూ, శబ్ద మహిమ చేత ఆనంద సృష్టలై మానవాళిలోకి ప్రవేశించండి. సమస్త విశ్వాలూ వ్యాపించిన మీరు, నానా చీకట్లని జయించి సత్యాన్ని ఆవిష్కరిస్తుంటే, మీ మహిమ వల్ల ఉషస్సు మా

ముందుకు వస్తుంది. ఓ అశ్వినులారా! మీరు ఇరువురూ పానము చేయండి, నిత్య వర్ధమానులై అనఘమైన పూర్ణత్వాన్ని కలిగిన మీ ఇరువురూ మాకు శాంతిని అందివ్వండి."

వైదిక తత్వం లోని ముఖ్య భావనలని, ప్రతీకలని మనసులో పెట్టుకుంటే పైన ఇవ్వబడ్డ వర్ణన చాలా సహజంగా, సులభంగా అర్థమవుతుంది. ఇక్కడ రాత్రి ఆంతరికమైన అంధకారానికి ప్రతీక అన్నది స్పష్టంగా తెలుస్తోంది; ఉషోదయం వల్ల చీకటిలో దాగిన సత్యాలు వెల్లడి అవుతాయి. అంతవరకు కనుమరుగైన సూర్యుడు మళ్లీ ప్రత్యక్షం కావడం అనే ప్రతీక ఎన్నో సందర్భాల్లో ఎదురవుతుంది. అంతర్ధానమైన సూర్యుణ్ణి దేవతలు, అంగీరస ఋషులు తిరిగి సాధించిన వృత్తాంతం ఆ కోవకి చెందినదే. ఇక్కడ సూర్యుడు అంటే సత్యం. అది హిరణ్మయ తేజం దిశగా అగ్నికీలలని విసురుతుంది. ఎందుకంటే హిరణ్యం, అంటే బంగారం, ఊర్ధ్వలోకపు తేజానికి స్థూలప్రతీక. అది సత్తెపు బంగారం. మామూలు బంగరు కాసుల కోసం కాదు, ఈ మహదైశ్వర్యం కోసమే వేద ఋషులు దేవతలని ప్రార్థిస్తారు. ఆంతరిక అంధకారం తొలగి ఆంతరిక ప్రకాశం నెలకొనే అద్భుత పరివర్తన అశ్వినుల వల్లనే సాధ్యమవుతుంది. మనో, దేహాలలో ఆనందం అనే అమృత పానాన్ని పూరించి, అక్కడ ఆ పానీయాన్ని సేవించి, మనో, ప్రాణ శక్తులకి ఆనందమయమైన ఊర్ధ్వగమనాన్ని అందిస్తారు ఆ దేవతలు. అభివ్యక్త వాణికి వాళ్లు మానసిక రూపును తొడుగుతారు. ఈ చీకటి నుండి బయటికి లాగి శుద్ధ మనోసీమ లోనికి మనకి తీసుకుపోతారు. అక్కడ ఆనందశక్తులని వాళ్లు కార్యోన్ముఖులని చేస్తారు. కాని వాళ్లు స్వర్గ జలాలని కూడా దాటగలుగుతారు. ఎందుకంటే వాళ్లు సోమరస మహిమతో అన్ని రకాల మానసిక నిర్మాణాలని రద్దు చేయగలుగుతారు. మనస్సనే తెరని పక్కకి తొలగిస్తారు. మనస్సుకి ఆవల సాధించబడే ఆఖరు విజయాన్ని, చేరే ఆఖరు గమ్యాన్ని వాళ్లు నదులని దాటడంగా వర్ణించారు. శుద్ధ మానసం అనే స్వర్గం ద్వార పయనిస్తూ, సత్య పథం వెంట సాగుతూ ఆవలి గట్టును చేరుతారు. ఆ పరాత్ పరమైన గమ్యాన్ని (*పరమా పరావత్*) చేరినప్పుడు మాత్రమే మన ఈ సుదీర్ఘ మానవ యాత్ర నుండి విశ్రాంతి లభిస్తుంది.

ఈ ఋక్కు లోనే కాక ప్రతీ చోట ఉష సత్య ప్రదాయినిగా వర్ణించబడుతుంది. అసలు ఆమెయే సత్యం యొక్క ప్రభ. ఆమె దివ్య ఉషస్సు. భౌతికమైన సూర్యోదయం పార్థివ ప్రపంచంలో ఆమె యొక్క ప్రతీక మాత్రమే.

అధ్యాయం 13

ఉష – సత్యం

ఉషాదేవిని తరచు గోవులకి మాతగా వర్ణించడం జరుగుతుంది. గోవు భౌతిక కాంతిని సూచించే వైదిక ప్రతీక అనుకుంటే, ఆమెను భౌతిక ఉదయ కిరణాలకి మూలంగా, మాతగా భావించాల్సి ఉంటుంది. లేదంటే గోవు అధ్యాత్మిక ప్రకాశనానికి ప్రతీక అనుకుంటే, ఉషని ఆ ఆంతరిక ప్రకాశనాన్ని కలిగించగల శక్తిగా తలచుకోవాలి. అయితే వేదంలో దేవతలకి తల్లి అయిన అదితిని ఒక పక్క గోవు గాను, మరో పక్క విశ్వజననిగాను కూడా వర్ణించడం జరుగుతుంది. పరమ తేజమైన ఆమె నుండే సమస్త కాంతులు వెలువడతాయి. అధ్యాత్మికంగా చూస్తే అదితి పరమ, అనంత చైతన్యం. ఆమె దేవతలకి జనని. ఆమె ప్రతిపక్షంలో దను లేదా దితి నిలిచి వుంది. ఈమె వృత్రాది దానవుల తల్లి. విభాజిత

చైతన్యానికి పేరు. దేవతలకి, మానవ ప్రగతికి విరోధులైన వారు దానవులు. మరింత విస్తారమైన అర్థాన్ని తీసుకుంటే, భౌతికం నుండి ఊర్ధ్వతలాలకి చెందిన చైతన్యాల విశ్వైకరూపాలకి ప్రతీక. ఏడు ఆవులు – *సప్త గావః* – ఆమె యొక్క పలు రూపాలు. కాబట్టి జగజ్జననికి ఏడు నామాలు ఉన్నాయని, ఏడు పీఠాలు ఉన్నాయని చెప్పబడింది. గోవులకి తల్లి అయిన ఉషాదేవి, అదితి యొక్క, ఆ పరమ చైతన్యం యొక్క, పరమ తేజం యొక్క ఒక రూపం లేదా శక్తి అయ్యుండాలి. ఈ విషయం వేదంలో స్పష్టంగా చెప్పబడింది (I.113.19) – "*మాతా దేవానామ్ అదితేర్ అనీకమ్.*" దేవతలకి తల్లి, అదితి యొక్క రూపం (లేదా బలం).

కాని ఉన్నతమైన, అవిభాజ్యమైన చైతన్యం తెచ్చే ఉదయం సత్యం యొక్క మహోదయం; ఉష ఆ మహోదయానికి ప్రతీక అయితే, ఋగ్వేదపు ఋక్కులలో ఆమె ఋతం అంటే సత్యం యొక్క ప్రస్తావనతో లోతుగా ముడివడి ఉండాలి. నిజంగానే అలాంటి అనుసంధానం తరచు కనిపిస్తుంది. ముందుగా గుర్తించవలసింది ఏంటంటే "సత్య పథాన్ని స్థిరంగా అనురిస్తుంది" (*ఋతస్య పంథామ్ అన్వేతి సాధు*) అన్న మాటలతో ఉష వర్ణించబడుతుంది. ఇక్కడ ఋతమ్ అన్న పదానికి కర్మకాండ పరమైన అన్వయం గాని, ప్రకృతి నిబద్ధమైన అన్వయంగాని పొసగవు. ఉష యజ్ఞ మార్గాన్ని అనుసరిస్తుంది అని గాని, జల మార్గాన్ని అనుసరిస్తుంది అనడంలో గాని అసలు అర్థం లేదు. ఇక్కడ స్వయంవిదితమైన అన్వయం నుండి తప్పించుకోవాలంటే "*పంథా ఋతస్య*" అనే పదజాలాన్ని సత్య మార్గం అనే కన్నా సూర్య మార్గం అనే పదాలతో అన్వయించడం మేలు. కాని వేదం నిజానికి సూర్యుడు ఉష యొక్క మార్గాన్ని అనుసరిస్తున్నట్టుగా వర్ణిస్తుంది. నిజానికి ఇది మరింత సహజమైన భావన, ఎందుకంటే అది భౌతికమైన ఉదయాన్ని వర్ణిస్తుంది. అంతేకాక ఇతర శ్లోకాలలో ఆ పదజాలానికి అర్థం సత్య మార్గం కాకపోయినా, అక్కడ అధ్యాత్మిక అన్వయం జోక్యం చేసుకుంటుంది. ఇక్కడ అధ్యాత్మిక అన్వయం ఏమిటంటే ఆత్మప్రకాశనం అనే ఉషస్సు సత్యం యొక్క, లేదా సత్యానికి స్వామి అయిన సూర్య సావిత్రి యొక్క మార్గాన్ని అనుసరిస్తుంది.

మరో చోట (I.124.3) అదే భావన ఆవృత్తమైనా, ఈ సారి మరింత లోతుగా స్పష్టంగా వ్యక్తమవుతుంది. *ఋతస్య పంథామ్ అన్వేతి సాధు, ప్రజానతీవ న దిశో మినాతి.* "ఎరిగిన దాని వలె ఆమె సత్య మార్గాన సాగుతుంది, ఆమె గతికి ఎల్లలు లేవు." ఇక్కడ *దిశః* అన్న పదం ద్వంద్వార్థంలో వాడబడిందని గుర్తించాలి. ఉష సత్య మార్గాన్ని అనుసరిస్తుంది. ఆమెకి ఆ జ్ఞానం, లేక గ్రహింపు వుంది కనుక ఆమె, ఏ బృహత్తుకి అయితే ఆమె తేజోరూపమై వుందో, ఆ బృహత్తు మీద ఎల్లలు విధించదు. ఈ ఋక్కు యొక్క అసలు అర్థం ఇదే నని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఐదవ మండలంలోని ఒక ఋక్కును తీసుకుంటే ఈ విషయం స్పష్టమవుతుంది. ఒక శ్లోకంలో ఉషని "*ద్యుతద్ యామానం బృహతీం ఋతేన ఋతావరీం స్వర్ ఆవహంతీమ్* (విరాజమాన గమనం కలిగి, సత్యం వల్ల విస్తారమై, పరమ సత్యంతో అనుసంధానమై, తనతో స్వర్ ను తీసుకువస్తుంది)" అని వర్ణించడం జరిగింది. ఇక్కడ బృహత్తు యొక్క భావన, సత్యం యొక్క భావన, స్వర్లోకపు సౌరతేజం యొక్క భావన కనిపిస్తున్నాయి. ఈ భావనలన్నీ కేవలం భౌతికమైన వేకువజాముతో ముడివడి వున్న భావనలు కావు. అలాగే మరో శ్లోకాన్ని (VII.75.1) కూడా పరిశీలిద్దాము. "దివిసీమలో జనించిన ఉష సత్యం చేత దారి తెరిపిస్తుంది, మహత్తును వ్యక్తం చేస్తుంది." (వ్యుషా *ఆవో దివిజా ఋతేన, ఆవిష్కృణ్వాన మహిమానమ్ ఆగాత్*). ఇక్కడ కూడా మళ్లీ సత్యం యొక్క బలం చేత ఉష అన్నిటినీ ప్రకటిస్తున్నట్టుగా,   ఒక రకమైన బృహత్తును అభివ్యక్తం చేస్తున్నట్టుగా వర్ణించబడింది.

ఇక చివరిగా ఇదే భావన మరోలా వ్యక్తం చెయ్యబడింది. అయితే ఇక్కడ సత్యాన్ని అనిశ్చితార్థానికి తావిచ్చే 'ఋతం' అనే పదంతో కాక '*సత్యా*' అన్న పదంతో వ్యక్తం చెయ్యడం జరిగింది. *సత్యా సత్యేభిర్ మహతీ మహద్భిర్ దేవీ దేవేభిర్* (VII.75.7). ("సత్యవంతులైన దేవతలకి మల్లె తన ఆత్మలో సత్యవంత అయిన ఉష, బృహత్తరులైన దేవతలలా బృహత్తును కలిగి వుంది.") ఇక్కడ ఉష యొక్క "సత్యానికి" వామదేవుడు ఒక ఋక్కులో (IV. 51) ఎంతో ప్రాధాన్యత నిస్తాడు. ఎందుకంటే ఇక్కడ అతడు ఉషస్సుల గురించి చెప్పినప్పుడు "సత్యం చేత పూన్చ బడ్డ అశ్వాలతో తక్షణమే సమస్త లోకాలూ వ్యాపించిన"ట్టుగా (*ఋతయుగ్భిర్ అశ్వైః*) (VI.65.2) వర్ణించడమే కాక, "సత్య జాతమైనవి

కనుక శుభమై, సత్యమై ఉంటాయి" (*భద్రా ఋతజాతసత్యాః*) అని కూడా వర్ణించడం జరిగింది. అలాగే మరో శ్లోకంలో "సత్య పీఠం నుండి మేలుకున్న దేవతలు"గా వర్ణించడం జరిగింది.

ఇక్కడ *భద్రా, ఋతా* అన్న పదాల మధ్య సన్నిహితమైన సంబంధం సూచించబడింది. అగ్నిని స్తుతించే మధుచ్ఛందుడి ఋక్కులో కూడా ఇలాంటి భావజాలమే ఎదురవుతుంది. వేదాన్ని ఈ విధంగా అధ్యాత్మికంగా అన్వయిస్తున్నప్పుడు సత్యమే ఆనందానికి మార్గం అనే ప్రాచీన భావన మనకు అడుగడుగునా ఎదురవుతుంది. సత్యం యొక్క ప్రకాశనానికి ప్రతీక అయిన ఉష మరి తప్పనిసరిగా ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ప్రసాదిస్తుంది. ఉష ఆనందదాయిని అన్న భావన మనకి వేదంలో పదే పదే ఎదురవుతుంది. వశిష్ఠుడు ఆ విషయాన్ని ఎంతో చక్కగా వర్ణిస్తాడు – "అనేకముఖమైన, అపేక్షితమైన ఆనందాన్ని నీవు ఉపాసకుడికి ప్రసాదిస్తావు" (*యా వహసి పురు స్పార్హం రత్నం న దాశుషే మయః*) (VII.81.3).

వైదిక పరిభాషలో ఒక సర్వసామాన్యమైన పదం '*సూనృతా*' అనే పదం. "సౌమ్యమైన, సత్యమైన భాష" అన్నట్టుగా సాయణుడు దీన్ని అనువదిస్తాడు. సామాన్య ప్రయోగంలో దీన్ని "ప్రియమైన సత్యాలు" అన్న అర్థంలో వాడుతుంటారు. ఉషస్సును కొన్ని సార్లు '*ఋతావరీ*' (సత్యంతో నిండి వున్నది) అన్న పదంతోను, మరి కొన్ని సార్లు '*సూనృతావరీ*' అన్న పదంతోను వర్ణిస్తారు. ఆమె వచ్చి తన నిజమైన, ప్రియమైన మాటలను పలుకుతుంది (*సూనృతా ఈరయంతీ*). ఎలాగైతే లోగడ ఆమె భాసించే పశుసంజాతానికి నేత్రిగాను, పగళ్లకి నేత్రిగాను వర్ణించబడిందో, అలాగే ప్రియమైన సత్యాలకి ప్రకాశవంతమైన నేత్రిగా, *భాసవతీ నేత్రీ సూనృతానామ్* (I.92.7), కూడా వర్ణించబడింది. ఎలాగైతే వేదఋషుల చిత్తంలో కాంతికి, కిరణాలకి, గోవులకి, మధ్య లోతైన సంబంధం వుందో, అదే విధంగా సత్యం అనే భావన కూడా స్పష్టంగా మరో ఋక్కులో (I.92.14) వ్యక్తమవుతోంది – గోమతి అశ్వావతి విభావరి ... సూనృతావతి. "ఓ ఉషాదేవీ, కాంతులీనే నీ పశువులతో,

అశ్వాలతో, సువిస్తారమైన తేజంతో, ప్రియమైన సత్యాలతో." ఇలాగే మరో చోట కలిసికట్టుగా కనిపించే ఈ పదజాలం యొక్క ప్రాధాన్యత మరింత తేటతెల్లం అవుతుంది. *అశ్వావతీర్, గోమతీర్ విశ్వసువిదః.* ఉషస్సులు తమ వేగంతో (అశ్వాలు), తమ తేజంతో (గోవులు), అన్నిటిపట్ల సరైన ఎరుకని కలిగి ఉంటాయి.

ఋగ్వేదంలో ఉష అనే భావన యొక్క అధ్యాత్మిక అన్వయానికి చెందిన సూచనలు మరెన్నో ఉన్నాయి. ఉషను మేలుకుంటున్న సద్దర్శనంగా, స్థిరపడుతున్న సత్కర్మగా తరచు వర్ణించడం జరిగింది. గోతమ రాహుగణుడు అమెను ఇలా వర్ణిస్తున్నాడు – "ఆ దేవత సమస్త లోకాలని తిలకిస్తుంది. మహత్తర దర్శన శక్తి గల ఆమె నయనం సువిస్తారంగా భాసిస్తుంది. సమస్త జీవలోకంలోను చలనం తెచ్చి జాగృతం చేస్తుంది. సమస్త చింతనకి ఆమె వాక్కుని ప్రసాదిస్తుంది" - *విశ్వస్య వాచమ్ అవిదన్ మనాయోః* (I.92.9). ఇక్కడ ఉష జీవనాన్ని, మనస్సుని వాటి సంపూర్ణ విశాలతలోకి విడుదల చేస్తుంది. అయితే ఇక్కడ ఋషి కేవలం పృథ్వీ జీవనాన్ని భౌతికంగా మేలుకొలిపే ఉదయాన్ని వర్ణిస్తున్నాడని భావిస్తే పొరబాటే అవుతుంది. ఇక్కడ ఉష ప్రసాదించే దృష్టి, *చక్షుః*, అనేది కేవలం భౌతిక దృష్టి అని అనుకున్నా కూడా, మరి కొన్ని సందర్భాలలో ఆ పదానికి బదులు *కేతుః* (అంటే మానసికమైన గుర్తింపు, విషయాన్ని మానసికంగా గ్రహించడం) అనే పదం వాడబడింది. ఉషని *ప్రచేతాః* అని వర్ణించారు, అంటే అభిజ్ఞాన శక్తిని కలిగి వున్నది. కాంతులకి మాత అయిన ఆమె, మనసులో అభిజ్ఞాన శక్తిని కలుగజేస్తుంది; *గవాం జనిత్రీ అకృతా ప్రకేతుమ్* (I.124.5). అసలు ఆమెయే ఆ అభిజ్ఞాన శక్తి – "ఏమీ లేని చిమ్మ చీకటిలో ఇప్పుడు ఆ అభిజ్ఞాన శక్తి జనించి విస్తారమైన వేకువగా విలసిల్లింది," *వి నూనమ్ ఉచ్ఛాద్ అసతి ప్ర కేతుః* (I.124.11). ఆమె తన అభిజ్ఞాన శక్తి చేత హితవైన సత్యాలని వశం చేసుకుంటుంది, *చికిత్విత్ - సూనృతావరీ* (IV.52.4).

ఈ దృష్టి, ఈ అభిజ్ఞానం అమరత్వానికి చెందిన దృష్టి అని కూడా వేదం చెప్తుంది – *అమృతస్య కేతుః* (III.61.3). ఆ తేజం అమర చైతన్యానికి మరో పేరైన సత్యానికి, ఆనందానికి చెందిన తేజం. వేదంలో రాత్రి అనే పదం అవిద్యామయమైన, అజ్ఞానమయమైన చైతన్యాన్ని సూచిస్తుంది. తడుముకుంటూ, తొట్రువడుతూ సాగే గమనాన్ని, పొరబాటుకు, పాపానికి అలవాటుపడ్డ కర్మని సూచిస్తుంది. తేజం అనే పదం సత్యానికి, ఆనందానికి గొని పోయే

విరాజమానమైన ఉన్నత చైతన్యాన్ని సూచిస్తుంది. దురితం, సువితం అనే వ్యతిరేకార్థం గల పదాల జంట తరచు ఎదురవుతూ ఉంటుంది. దురితం అంటే పొరబడడం, తొట్రువడడం, పాపంలో, దుష్కర్మలో, సంకటంలో ఇరుక్కోవడం. సువితం అంటే సన్మార్గంలో ముందుకు సాగడం. ఆ పదం హితమైన, సంతోషకరమైన విషయాన్ని వ్యక్తం చేస్తుంది. కాబట్టి సన్మార్గంలో ప్రయాణిస్తే వచ్చే ఆనందాన్ని అది సూచిస్తుంది. కాబట్టి వశిష్ఠుడు ఉషాదేవి గురించి ఇలా అంటాడు (VII.78.2) – "దివ్యమైన ఉష తన తేజంతో నానా రకాల చీకట్లని, చెడుని పారద్రోలుతుంది" (*విశ్వా తమాంసి దురితా*). అలాగే ఎన్నో శ్లోకాలలో ఆ దేవి మనుషులని మేల్కొలిపి, సన్మార్గంలో ముందుకు నడిపిస్తుందని, ఆనందానికి గొనిపోతుందని వర్ణించబడింది - *సువితాయ*.

కాబట్టి ఆమె హితమైన సత్యాలకి నేత్రి మాత్రమే కాదు. ఆమె అధ్యాత్మిక ఐశ్వర్య ప్రదాయిని, ఆమె ఆనంద దాయిని. సత్య సాధన చేత మాత్రమే మనిషికి దక్కే ఆనందాన్ని ఆమె ప్రసాదిస్తుంది – *ఏషా నేత్రీ రాధసః సూనృతానామ్* (VII.76.7). ఋషులు కోరుకునే ఐశ్వర్యాలు స్థూలమైన సంపదల ముసుగులో ప్రకటింపబడ్డాయి. నిజానికి ఆ ఐశ్వర్యం – *గోమద్ అశ్వావద్ వీరవద్*. మరోలా చెప్పాలంటే అది – *గోమద్ అశ్వావద్ రథవచ్ చ రాధః*. *గో* అంటే ఆవు, *అశ్వ* అంటే గుర్రం, *ప్రజా* లేదా *అపత్య* అంటే సంతతి, నృ లేదా *వీరా* అంటే పురుషుడు లేదా యోధుడు, *హిరణ్య* అంటే బంగారం, *రథ* అంటే రథం, *శ్రవస్* అంటే స్థూలమైన అన్వయం ప్రకారం ఆహారం లేదా కీర్తి. ఇవన్నీ వేద ఋషులు కోరుకునే ఐశ్వర్యం లోని వివిధ అంశాలు. ఇంతకన్నా ఐహికమైన సిరులు మరేవీ ఉండవేమో. మోటైన ఆటవిక జాతుల వారు తమ ఆదిమ వేలుపులని ఇలాంటి ధరాగత వస్తు సంజాతం కోసం తప్ప మరి దేని కోసం వేడుకుంటారు? కాని హిరణ్య అనే పదాన్ని ఇక్కడ స్థూలమైన పసిడి అనే అర్థంలో కాక మరోలా వాడారని గుర్తించవచ్చు. అలాగే ఉషస్సుతో ముడివడ్డ ఆవులు కాంతికి ప్రతీకలని అంతకు ముందే గుర్తించాము. ఆ కాంతి మానసిక దృష్టికి సంబంధించిన కాంతి అని, ఆనందాన్ని తెచ్చే సత్యానికి సంబంధించిన కాంతి అని కూడా అర్థం చేసుకున్నాము. అలాగే అశ్వ అనే ప్రతీక తరచు గోవు అనే ప్రతీకతో అనుసంధానమై కనిపిస్తుంది. ఉషని గోమతి, అశ్వవతి అని వర్ణిస్తారు. ఒక శ్లోకంలో (VII.77.3) వశిష్ఠుడు వేదంలో అశ్వం అనే భావనని ఎంతో శక్తివంతంగా, స్పష్టంగా వర్ణిస్తాడు –

దేవానాం చక్షుః సుభగా వహన్తి శ్వేతం నయన్తి సుదృశీకమశ్వమ్ ।

ఉషా ఆదర్శి రశ్మిభిర్వ్యక్తా చిత్రమఘా విశ్వమను ప్రభూతా ॥

““మంగళకరమైన దేవతల కటాక్షాన్ని ప్రసాదిస్తూ, పరిపూర్ణ దృష్టి గల శ్వేతాశ్వాన్ని తోలుతూ, అసంఖ్యాక సిరులతో, విశ్వమంతా తన జననాన్ని అభివ్యక్తం గావించుకుంటూ, కోటికిరణాలతో సంపూర్ణంగా వ్యక్తమవుతోంది ఉష.” ఇక్కడ శ్వేతాశ్వం (ఈ ప్రతీక దృష్టి శక్తితో కూడుకున్న సంకల్పం గల అగ్ని దేవుణ్ణి – *కవిక్రతు* – పరిపూర్ణ దృష్టితో పని చేసే దైవేచ్ఛని సూచిస్తుంది, V.1.4) అనేది కేవలం ప్రతీక అని సులభంగా గుర్తించొచ్చు. ఆమె గొనితెచ్చే “అసంఖ్యాక సిరులు” కూడా ప్రతీకాత్మకమే. అవి భౌతిక సిరిసంపదలు కావు.

ఉషని ‘*గోమతీ, అశ్వావతీ, వీరవతీ*’ అనే పదాలతో వర్ణిస్తారు. ఇక్కడ గోమతి, అశ్వవతి అనేవి ప్రతీకాత్మక పదాలు. వాటి అర్థం “ఆవులతో నిండివున్న, గుర్రాలతో కూడుకున్న” అని కాదు. గోమతి అంటే జ్ఞాన ప్రకాశంతో భాసిస్తున్న అని అర్థం, అశ్వవతి అంటే ప్రచండమైన శక్తితో కూడుకున్న అని అర్థం. అలాగే వీరవతి అంటే “వీరులు తోడుగా వున్న” అని అర్థం కాదు, విజయశక్తితో కూడుకున్న అని అర్థం. ఈ విషయం మరో శ్లోకంలో స్పష్టం అవుతుంది (1.113.18) – *యా గోమతీర్ ఉషసః సర్వవీరాః ... తా అశ్వదా అశ్నవత్ సోమసుత్వా*. దీని అర్థం ఇది కాదు – “ఉష ఆవులతో, మనుషులతో, పరిచారకులతో నిండి వుంటుంది. సోమాహుతి చేసిన మనిషి, అశ్వప్రదాతలకి మల్లె ఆ వరాలన్ని పొందుతాడు.” ఇలాంటి అన్వయం అసంగతంగా, అర్థరహితంగా తోచుతుంది. ఇక్కడ ఉష అంటే మన అంతర్యంలో జరిగే మహోదయం. గొప్ప వైవిధ్యభరితమైన, సంపూర్ణమైన ఆత్మస్థైర్యాన్ని, శక్తిని, చైతన్యాన్ని, ఆనందాన్ని ఆమె ఉపాసకుడికి ప్రసాదిస్తుంది. ఆత్మప్రకాశనాలతో రాజిల్లుతుంది, సకల శక్తులతో తొణికిసలాడుతుంది. మానవుడికి గొప్ప జీవశక్తిని ప్రసాదిస్తుంది. ఆ శక్తితో బృహత్తర జీవనానికి చెందిన అనంతమైన ఆనందాన్ని పొంది మానవుడు తరించగలడు.

కాబట్టి ‘*గోమద్ అశ్వావద్ వీరవద్ రాధః*’ అనే పదాలని ఇకపై స్థూలార్థంలో తీసుకోవడం సాధ్యం కాదు. వైదిక పరిభాష మరేదో సత్యాన్ని సూచిస్తోంది. కాబట్టి దైవదత్తమైన ఈ

సిరిసంపదలకి సంబంధించిన సందర్భాన్ని కూడా అధ్యాత్మిక దృష్టితో అర్థం చేసుకోవాలి. సంతతి, బంగారం, రధాలు అన్నీ కూడా ప్రతీకాత్మకమే. *శ్రవస్* అంటే కీర్తో, ఆహారమో కాదు. అది దివ్య శ్రుతి చేత, దివ్యదృష్టి చేత సత్యాన్ని తెలుసుకున్నప్పుడు కలిగే ఉన్నత జ్ఞానం. అది ఇంద్రియాల చేత, బుద్ధి చేత తెలుసుకోగలిగే జ్ఞానం కాదు. '*రాధో దీర్ఘశ్రుత్తమమ్, రయిం శ్రవస్యుమ్*'. అది అధ్యాత్మిక ఆనంద సిరులతో నిండిన అంతరంగ స్థితి. మహోన్నత జ్ఞానం దిశగా అది మనను గొనిపోతుంది. అలాంటి స్థితిలో ఎంతో దూరంగా విస్తరించిన శ్రుతి శక్తి చేత అనంతం నుండి వచ్చే వాక్ ప్రకంపనలని గుర్తించవచ్చు. కాబట్టి ఉష అనే అద్భుత, మహిమాన్విత ప్రతీక వేదాన్ని స్థూలంగా, కర్మకాండ పరంగా, అజ్ఞానంగా అన్వయించకుండా మనను రక్షిస్తుంది. దారి తప్పి అంధకారంలో కూరుకుపోకుండా మనని వెనక్కు లాగుతుంది. మూసిన ద్వారాలని తెరిచి ప్రగాఢ వేద విజ్ఞాన ప్రపంచంలోకి మనకి ప్రవేశాన్ని ఇస్తుంది.

అధ్యాయం 14

గోవు – అంగిరస గాధ

ఇంతవరకు గోవు అనే ప్రతీకని వేదార్థాన్ని తెలిపే మూలసూత్రంగా తీసుకుని శోధన కొనసాగించాము. ఆ మార్గంలో ఇంకా ముందుకి సాగితే అంగీరస ఋషుల గాథ మనకి తారసిల్లుతుంది. వైదిక గాథలు అన్నిట్లోకి అతి ముఖ్యమైనదిగా ఆ గాథ మనకి సాక్షాత్కరిస్తుంది.

వేదమంత్రాలు ప్రధానంగా మనిషికి హితులు, స్నేహితులు అయిన కొందరు "ఆర్య" దేవతలని ఆవాహన చేసే గీతాలు. ఆ గీతాలు పాడే గాయకులు – వారిని కవి అని, ఋషి, అని విప్ర అని రకరకాలుగా పిలుస్తారు – కోరుకునేవి కొన్ని మహోన్నతమైన వరాలు (*వర*, *వార* అని కూడా అంటారు). *రయి*, *రాధస్* మొదలైన పదాలతో సూచించే ఈ వరాలు, భౌతిక దృష్టితో చుస్తే ఐహిక సిరులుగా తోచుతాయి గాని, అధ్యాత్మికంగా చూస్తే అవి సమున్నతమైన ఆత్మానందాన్ని సూచిస్తాయి. ఆ సమిష్టి కృషిలో తన వంతుగా మనిషి యజ్ఞం చేస్తాడు, వాక్కును పలుకుతాడు, సోమరసాన్ని, నేతిని (ఘృత) ధారపోస్తాడు, ఆ యజ్ఞం లోంచి దేవతలు ఉద్భవిస్తారు. వాక్కు చేత, సోమరసం చేత, నేతి చేత వారు వృద్ధి చెందుతారు. అలా రెట్టించిన ఉత్తేజంతో, సోమపానపు పారవశ్యంలో, సమ్మోహనంలో దేవతలు యాజ్ఞికుడు కోరుకున్న లక్ష్యాలని సాధించి పెడతారు. అలా సమకూరిన ఐశ్వర్యంలో రెండు అంశాలు ఉన్నాయి – ఒకటి గోవు, రెండవది అశ్వం. ఇవి గాక వేరే వరాలు కూడా ఉన్నాయి. అవి *హిరణ్య* అంటే బంగారం, *వీర* అంటే మనుషులు, లేదా యోధులు, *రథ* అంటే రథాలు, *ప్రజా* లేదా *అపత్య* అంటే సంతతి. అసలు యజ్ఞానికి కావలసిన సామగ్రిని (అగ్ని, సోమరసం, ఘృతం) కూడా దేవతలే సమకూరుస్తారు. మళ్లీ వాళ్లే యజ్ఞానికి హోతలుగా, పావకులుగా, ఉద్ధారకులుగా, యుద్ధంలో వీరులుగా విచ్చేస్తారు. ఇక్కడ యుద్ధం ప్రసక్తి ఎందుకు వస్తుందంటే మరి యజ్ఞాన్ని, యజ్ఞ వాణిని ద్వేషించేవారు కొందరు ఉంటారు. వాళ్లు యాజ్ఞికుణ్ణి అటకాయిస్తారు, అతడి సంపదలని కొల్లగొడతారు. దేవతలే యోధులై అలాంటి యజ్ఞ ద్వేషుల నుండి యాజ్ఞికుణ్ణి రక్షిస్తారు. కాబట్టి దేవతల వరాలు కుదురుగా నిలవాలంటే అందుకు కొన్ని నిబంధనలు అమలు కావాలి. అవి ఉష ఆగమనం లేదా సూర్యోదయం, స్వర్గసీమ నుండి కురిసే పెనువృష్టి, ఇక చివరిగా దేవలోకపు మహిమాన్వితులుగా వేద ఋషులు వర్ణించిన ఏడు నదులు. అయితే ఇలా ప్రాప్తించిన

సిరులు – ఆవులు, గుర్రాలు, పసిడి, పరిచారకులు, రథాలు, సంతానం మొ॥ - అన్నీ కూడా చరమ లక్ష్యాలు కావు. ఇవన్నీ కూడా అన్య ప్రపంచాలకి దారులు తెరవగల సాధనాలు మాత్రమే. స్వర్లోక ప్రాప్తి, అద్భుత సౌరలోకాలకు ఆరోహణ, సత్య పథం మీదుగా ముందుకు సాగి మహోన్నత తేజాన్ని, సురలోకపు ఆనందాన్ని సాధించడం – ఇవీ యాజ్ఞికుడి పరమ లక్ష్యాలు. ఆ విధంగా మర్త్య జీవి అమరత్వాన్ని సాధిస్తాడు.

వేదంలోని గొప్పదనం అంతా అక్కడే వుంది. పౌరాణికంగా, కర్మకాండ పరంగా వేదాన్ని అన్వయించే సాంప్రదాయం అనాదిగా వుంది. దానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనక్కర్లేదు. స్థూలంగా చెప్పుకోవాలంటే, మనిషి ఇహంలోను, పరంలోను ఆనందాన్ని, ఐశ్వర్యాన్ని అనుభవించాలంటే అందుకు యజ్ఞవిధులని ఆచరించడం తన ముఖ్య కర్తవ్యం అన్నది వేదం యొక్క సారం. ఇక ఆధునికుల అన్వయాన్ని బట్టి వేదంలో సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఉదయం, పవనం, అగ్ని, ఆకాశం, నదులు మొదలైన ఇతర ప్రకృతిగత అంశాలని మనిషి మూర్తీభవింపజేసి, మానవీకరించి వాటిని ఆరాధిస్తాడు. యజ్ఞం చేసి దేవతలని ప్రసన్నం చేసుకుని వారి నుండి సకల సిరులని పొందుతాడు. మానవ, ద్రావిడ విరోధుల నుండి, తదితర దుష్ట శక్తుల నుండి తన సంపదలని రక్షించమని దేవతలని వేడుకుంటాడు. ఇక మరణానంతరం దేవతలతోపాటు స్వర్గ ప్రాప్తిని ప్రసాదించమని ప్రార్థిస్తారు. మోటైన సంస్కారం గల వారికి ఈ వాదనలన్నీ ఎంత సమంజసంగా తోచినా, వేదాన్ని విరచించిన ఋషుల దృష్టిలో వేదం యొక్క అంతరార్థం ఇది కాదు. వేద యుగానికి చెందిన ప్రబుద్ధ మనస్కుల (*కవి, విప్ర*) ఉద్దేశం అది కాదు. వారి దృష్టిలో భౌతిక వస్తువులు, అభౌతిక వస్తువులకి ప్రతీకలు మాత్రమే. గోవులు కాంతిపుంజాలు, దివ్యమైన ఉష యొక్క ప్రభాత కిరణాలు. అశ్వాలు, రథాలు బలానికి, ప్రచండ గమనానికి ప్రతీకలు. బంగారం కూడా తేజమే, దివ్యభానుడి మెరిసే సిరి. అదే నిజమైన తేజం – *ఋతం జ్యోతిః*. యజ్ఞం వల్ల ప్రాప్తించిన ఐశ్వర్యమే కాక, అసలు యజ్ఞకర్మ యావత్తు మానవ జీవనానికి చరమ లక్ష్యమైన అమరత్వ సిద్ధి కోసం మనిషి చేసే ప్రయాసకి ప్రతీక. వేద ఋషి కోరుకునేది మానవాత్మ యొక్క సమృద్ధి, సంస్కరణ. అతడి జీవన ప్రయాసలో దేవతలు ఊపిరి పోసుకుంటారు. శక్తి, సత్యం, తేజం, ఆనందం వృద్ధి చెందుతాయి. అలా సంతత విస్తరణ చేత మానవాత్మ దివ్య ద్వారాలని (*దేవీర్ ద్వారః*) చేరుకుంటుంది. అతడి వేడుకోలుకి స్పందించి ద్వారాలు తెరుచుకుంటాయి.

భూమికి, స్వర్గానికి అతీతమైన పరమానంద సీమలోకి, దివ్యధామంలోకి మానవాత్మ ప్రవేశిస్తుంది. ఆ ఆరోహణా క్రమమే అంగీరస ఋషుల గాధ.
దేవతలందరూ అజయులే. గోవులు, అశ్వాలు తదితర దివ్యమైన సిరులని ప్రసాదించగల సమర్థులే. ఈ యుద్ధ క్రీడలో అందరికన్నా ఉన్నత స్థానంలో ఉన్న ఇంద్ర భగవానుడు మనిషి కోసం తేజాన్ని, శక్తిని గెలిచి తెచ్చిస్తాడు. కాబట్టి ఇంద్రుణ్ణి తరచుగా పశువులకి పాలకుడిగా (*గోపతి*) సంబోధిస్తుంటారు. అసలు కొన్ని సందర్భాలలో తానే స్వయంగా గోవుగాను, అశ్వంగాను సాక్షాత్కరిస్తాడు. అతడు వృషభుడు, ఆవుల మధ్య ఎద్దు వంటివాడు. మనుషులు కోరుకునే పశుసంపద అతడే. ఒక శ్లోకంలో (VI.28.5) ఇలా చెప్పబడింది – "ఓ మానవులారా! ఈ గోవులన్నీ ఇంద్రుడి స్వరూపాలే. ఆ ఇంద్రుణ్ణే నేను మనఃపూర్వకంగా, హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను." ఈ విధంగా ఆవులకి, ఇంద్రునికి మధ్య అభిన్నతను చూడడం చాలా ముఖ్యం. మధుచ్ఛందుడు ఇంద్రుని కీర్తించిన గీతాలలో ఈ సత్యాన్ని మళ్లీ పరిశీలిద్దాం.

అయితే సామాన్యంగా ఋషుల భావన ప్రకారం ఈ రకమైన ఐశ్వర్యాన్ని అర్జించే ప్రయత్నంలో దస్యులు అనబడే ఒక రకమైన విరోధ శక్తులతో పోరాటం అవసరం అవుతుంది. ఈ దస్యుల ఐశ్వార్యాన్ని కొన్ని సార్లు బలప్రయోగం చేత వారిని నిర్జించి జయించవలసి ఉంటుంది. మరి కొన్ని సార్లు ఆ దస్యులు ఆర్య వీరుడి నుండి ఆ సిరులని దొంగలించినప్పుడు, ఆ ఆర్యుడు దేవతల సహాయంతో వారిని జయించి తనవైన సిరులని తిరిగి సాధిస్తాడు. ఆ విధంగా గోవులని హరించి దాచి వుంచే దస్యులని పణులు అంటారు. ఈ పణుల అన్న పదానికి ఆదిలో కర్తలు, వ్యవహర్తలు, దళారులు అన్న అర్థం ఉండి ఉండొచ్చు; ఆయితే కాలక్రమేణా ఆ పదం "లోభులు" అన్న అర్థాన్ని సంతరించుకుంది. వలుడు అనే రాక్షసుడు వారి పాలకుడు. ఆ పదం "ఆవరించేవాడు, లేదా మూసి వుంచేవాడు" అనే అర్థాన్ని సూచిస్తుంది. అలాగే వృత్రుడు అంటే విరోధి, అవరోధకుడు, ఆవరించి కబళించేవాడు. వేదంలో వీలైనంత ఆదిమ చరిత్రని పొడచూడాలని ఉవ్విళ్లూరే ఎంతో మంది పండితులు, పాణులు ద్రావిళ్లు అని, వలుడు వారి నేత అని, వారి వేలుపు అని సునాయాసంగా వ్యాఖ్యానించారు. అయితే కొన్ని చెదురు మొదురు శ్లోకాల్లో మాత్రమే అలాంటి అన్వయాన్ని సమర్థించడానికి వీలవుతుంది. ఎన్నో చోట్ల ఋషులు వాడిన అసలు పదాలకి ఈ కల్పనకి మధ్య పొంతన కనిపించదు. అన్వయం కాస్తా అంతన పొంతన లేని

గందరగోళానికి దిగజారుతుంది. అలాంటి అసంగతికి నిదర్శనాలు ఇప్పటికే కొన్ని చోట్ల చూశాము. పోగొట్టుకుపోయిన గోవుల గాధలని ఇంకా లోతుగా పరిశీలిస్తే ఈ విషయం ఇంకా వివరంగా అర్థమవుతుంది.

కొండల్లో ఒక గోతిలో (*బిల*) వసిస్తాడు వలుడు. ఇంద్రుడు, అంగీరస ఋషులు అతణ్ణి వెంటాడి అక్కడ పట్టుకుని అతడి సంపదలని వెళ్లగక్కేలా చేస్తారు. మరి అతడు గోవుల వలుడు – *వలం గోమంతమ్*. పణులు కూడా తాము దొంగిలించిన పశువులని కొండ గుహలో దాస్తారని వేదం వర్ణిస్తుంది. ఆ గుహే వాళ్ల రహస్య కారాగారం (*వవ్ర*), వాళ్లు దాచే పశువుల కొట్టం (*వ్రజ*). కొన్ని సార్లు ఆ స్థలాన్ని '*గవ్యమ్ ఊర్వమ్*' అని కూడా వర్ణిస్తారు. స్థూలంగా చూస్తే అది 'ఆవులతో కూడిన వైశాల్యం.' సూక్ష్మార్థాన్ని తీసుకుంటే అది 'విరాజమాన విస్తారం.' అవి మెరిసే పసులు అనే విశాల సిరులు. పోయిన ఆ సంపదని తిరిగి సాధించడం కోసం యజ్ఞం చెయ్యాలి. అంగీరసులు గాని, లేదా బృహస్పతి మరియు అంగీరసులు కలిసి గాని, మంత్రాన్ని ఉచ్ఛరించాలి. సరమ అనే సురలోక శునకం పణులు గుహలో దాచిన ఆవులని వెతికి పట్టుకోవాలి. సోమరస పానంతో బలం పుంజుకున్న ఇంద్రుడు తన సహచరులైన అంగీరస ఋషులతో పాటు, ఆ బాటని అనుసరిస్తూ, గుహలోనికి చొచ్చుకుపోయి, కొండలోని మొండి బండలని బద్దలు కొట్టి, పణులని జయించి, పశువులని బయటికి తోలుకు వస్తాడు.
ఈ ప్రతీకాత్మక గాధని అన్వయం చేసే ముందు కొన్ని ముఖ్యమైన అంశాలని తప్పనిసరిగా గుర్తించాలి. వేదంలో ఇప్పటికి ఇంకా ఈ గాధ ఒక స్థిరమైన పౌరాణిక గాధ స్థాయికి ఎదగలేదు. సందర్భోచితంగా ఈ గాధ వెనుక ఉన్న ప్రతీకలని వాడడం జరిగింది. కొన్ని సందర్భాల్లో ఆ గాధ యొక్క పౌరాణిక ముసుగును పక్కన బెట్టి, మంత్రాన్ని గానం చేసే ఋషి యొక్క వ్యక్తిగత ఉపాసనకి చిహ్నంగా వాడుకోవడం జరిగింది. ఎందుకంటే పోయిన పశువులని తిరిగి సాధించే కార్యాన్ని ఇంద్రుడు ఎలాంటి పరిస్థితుల్లోనైనా సాధించగల సమర్థుడు. అందుకే వేదంలో ఇంద్రుణ్ణి గోవుల కోసం వెతికే వాడు (*గవేషణ*), పోయిన సంపదలని తిరిగి సాధించేవాడు అంటారు. ఈ సందర్భంలో మాత్రం ప్రత్యేకించి అంగీరస ఋషుల సహాయంతోను, అంగీరసుల పద్ధతిలోను, పోయిన గోవులని సాధిస్తాడు.

మరి కొన్ని సందర్భాలలో పోయిన ఆవులని ఇంద్రుడు తిరిగి సాధించినంత మేరకే కథ నడుస్తుంది. ఇక అందులో సరమ గురించి గాని, అంగీరసుల గురించి గాని, ఆవుల గురించి గాని ప్రస్తావన ఉండదు. అంతేకాక ప్రతీ సందర్భంలో ఆవులని సాధించేది ఇంద్రుడు మాత్రమే కానక్కర్లేదు. ఉదాహరణకి ఐదవ మండలంలోని రెండవదైన అగ్ని సూక్తంలో, అత్రుల సూక్తం ఒకటి వస్తుంది. అందులో గాయకుడు పోయిన గోవులు అనే ప్రతీకని తనకే వర్తింపజేసుకుంటూ ఆ ప్రతీకలోని అంతరార్థాన్ని బట్టబయలు చేస్తాడు. పుడమితల్లి గర్భంలో అగ్ని అనాదిగా బందీగా ఉన్నాడట. ఆమె అగ్నిని దివి అనే తండ్రికి ఒసగడానికి అంగీకరించడం లేదట. అలా ఆమె అగ్నిని ఒక కుటిల స్థితిలో చిరకాలం కుదించి (పేషీ) ఉంచిందట. చిట్టచివరికి పుట్టేసరికి అగ్ని విశాలంగా, బృహత్తరంగా (మహిషీ) మారిపోయాడట. అగ్నిజననం విరాజమాన పశువుల యొక్క సాక్షాత్కారానికి, అభివ్యక్తీకరణకి ముడి పెట్టబడింది. “స్వర్ణదంతుడై, విమల విరాజితుడై, తన అస్త్రాలకి పదును పెడుతున్న ఒక వీరుని దూరం నుండి పొడచూశాను. అతనికి అమృతాన్ని (అమర రసమైన సోమం) పలు విడి భాగాలుగా ప్రసాదించాను; ఇంద్రుని తోడు లేని వాళ్లు, వాక్సిద్ధి లేని వాళ్లు నన్నేమి చేయగలరు? అసంఖ్యాకమైన పశువులు మెరుస్తూ, పరవశిస్తూ ఆ మైదానం అంతా కనిపించాయి; అతడు జనించాడు కనుక వాటిని మళ్లీ ఎవరూ కాజేయలేదు; ముదుసలి ఆవులు కూడా మళ్లీ యవ్వనాన్ని పొందాయి.” ఇంద్రుని తోడు లేక, వాక్కు ప్రాప్తించక, మెరిసే పశువులని దొంగలించలేక నిస్సహాయ పరిస్థితిలో ఉన్నారు దస్యులు. ప్రచండ తేజుడైన అగ్ని జననానికి ముందు మరి పరిస్థితి వేరేగా ఉండేది. “గోవుల నుండి నా శక్తిని (మర్యకమ్; నా సైన్యం, నా వీరులు) దూరం చేసిన వారెవరు? వాళ్లకి (నా మనుషులకి) తోడుగా నిలిచి కాపాడగల యోధుడు లేడు. ఎవరైతే వాళ్లని నా నుండి కాజేశారో వాళ్లని విడుదల చెయ్యాలి. అతడు ఎరిగిన వాడు. మన పశువులని తోలుకు వస్తున్నాడు.”

మళ్లీ యవ్వనాన్ని పొందిన ఆ ముసలి ఆవులు, ఆ మెరిసే పశువులు ఇంతకీ ఏమిటి? అవి నిశ్చయంగా భౌతికమైన పశువులు కావు. ఏ యమునా నది ఒడ్డునో, ఏ ఝీలం నది ఒడ్డునో సంచరించే పశువులు ససేమిరా కావు. బంగరు దంష్ట్రలు గల యుద్ధ దేవత పోయిన గోవులని తిరిగి సాధించి తెస్తున్న దృశ్యానికి, ఆ భౌతిక నదీతీరాలకి పొంతన కుదరదు. కాబట్టి ఆ వర్ణన తప్పనిసరిగా ఏదో దివ్యప్రకాశనానికి చెందిన ప్రతీక మాత్రమే

అయ్యుంటుంది. అంధకార శక్తులు కాజేసిన కిరణాలవి. వాటిని దివ్యంగా తిరిగి సాధించినది ఏదో భౌతికమైన నిప్పు కాదు. కుటిల భౌతిక ప్రపంచంలో దాగిన ఒక మహోజ్వల శక్తి అది. ఆ శక్తి యాజ్ఞికుడికి స్పష్టమైన, సుతేజమైన మనోవృత్తి సాధ్యమయ్యేలా చేస్తోంది.

కాబట్టి చీకటి గుహలోంచి పోయిన ప్రకాశాలని తిరిగి సాధించగల దేవత కేవలం ఇంద్రుడొక్కడే కాడు. ఆ విజయాన్ని సాధించగల మరి కొందరు వేలుపులని కూడా కొన్ని ఋక్కులు స్తుతిస్తాయి. అలాంటి వేలుపులలో మరొక వేలుపు ఉషాదేవి, ఈ పశువులకి జనని. “సత్యమైన దేవతలలో సత్యమై, ఘనమైన దేవతలలో ఘనమై, యజ్ఞదేవతలలో యజ్ఞదేవతయై, ఆమె మొండి అవరోధాలని బద్దలుకొట్టి మెరిసే పశువులని విడిపిస్తుంది. ఉషని చూసి ఆవులు అంబా అన్నాయి (VII.75.7).” ఆ సామర్థ్యం గల మరో దేవత అగ్నిదేవుడు. కొన్ని సార్లు స్వయంగాను, కొన్ని సార్లు ఇంద్రునితో కలిసి అగ్ని యుద్ధం చేస్తాడు. “ఓ ఇంద్రా! ఓ అగ్నీ! మీరు ఇరువురు ఆవుల కోసం పోరాడారు. (VI.60.2). ఆ పోరాటం మరి కొన్ని సార్లు సోముడితో కూడా సాగుతుంది. “ఓ అగ్నీ, ఓ సోముడా, పణుల నుండి గోవులని కాజేసినప్పుడు మీ శౌర్యం ఎటువంటిదో తెలుస్తోంది (I.93.4).” మరో సందర్భంలో సోముడు ఇంద్రునితో చేయికలిపి ఈ విజయంలో పాల్గొంటాడు. “శక్తిలోంచి పుట్టిన ఆ దేవత, ఇంద్రుని సహాయంతో, పణిని నిలువరించగలిగాడు.” దస్యుల మీద యుద్ధం చేసే దేవతలు సాధించగలిగేవన్నీ సాధించాడు (VI.44.22). అశ్వినులకి కూడా అదే విజయం సాధించిన ఘనత దక్కుతుంది – “మీరు ఇరువురూ కలిసి పశువులతో నిండి వున్న గోశాల ద్వారాలని భేదించారు (VI.62.11).” అలాగే మరో చోట (I.112.18) “ఓ అంగీరసుడా! (కొన్ని సార్లు ఇరువురు అశ్వినులని ఒక్కటిగా ఆ పేరుతో పిలవడం జరుగుతుంది) గోవుల శ్రేణి బయటికి వస్తున్న ద్వారం లోంచి ముందు మీరు చొచ్చుకుపోతారు. మనోవృత్తిలో ఆనందాన్ని పొందుతారు.” ఇక్కడ గోవుల శ్రేణి అంటే బయటికి ప్రవహిస్తున్న కాంతి స్రవంతి అన్న భావన కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఈ విజయం వెనుక ఉన్న విజేతగా బృహస్పతి ప్రస్తావన తరచు వస్తుంటుంది. “పరమాకాశంలో మహోన్నత తేజంగా మొదట ఆవిర్భవించిన బృహస్పతి, ఏడు నోళ్లతో, ఏడు కిరణాలతో, అనేక జన్మలు కలిగిన బృహస్పతి, చీకటిని పారద్రోలాడు; అతడు తన ఆతిథేయునితో పాటు స్తుభ్ ని వశం చేసుకుంటాడు. ఆ ఋక్కు తన కేకతో వలుణ్ణి వ్రయ్యలు చేసింది. యజ్ఞాన్ని వేగవంతం చేసే మెరిసే పశువులని బృహస్పతి తన కేకతో పైకి త్రోలాడు.

అతడిని స్పందిస్తూ ఆ పశువులు అంబా అన్నాయి (IV.50).” అలాగే VI.73.1/3 లో “నగధ్వంసకుడు, ప్రథమ జాతుడు, అంగీరసుడు అయిన బృహస్పతి...బృహస్పతి సిరులని (వసూని) జయించాడు, పశువులతో నిండుగా ఉన్న గోశాలలని జయించాడు.” బృహస్పతికి మల్లె ఋక్కులని గానం చేసే మరుత్తులు కూడా, కాస్త పరోక్షంగానైనా, ఈ దివ్య విజయంలో పాల్గొంటారు. “ఓ మరుద్గణాలారా! మీరు ఎవరినైతే పోషిస్తున్నారో అతడు గోశాలని భేదిస్తాడు” (VI.66.8). మరో చోట కూడా మరుత్తుల ఆవుల ప్రస్తావన వస్తుంది (I.38.2). పోషించే తత్వం గలిగి, సూర్యభగవానుడి స్వరూపం అయిన పుషణుణ్ణి కూడా పోయిన ఆవులని తిరిగి సాధించడం కోసం ఉపాసిస్తారు. “పుషణుడు మా గోవులని అనుసరించు గాక, మా యుద్ధాశ్వాలని సంరక్షించుగాక... ఓ పుషణుడా! మా ఆవులని వెంటాడు...పోయిన మా పశువులని మా వద్దకి తిరిగి తోలుకురావాలి.” కొన్ని చోట్ల సరస్వతి కూడా పణులని నిర్జిస్తుంది. మధుచ్ఛందుడి ఋక్కులో (I.11.5) ఒక ప్రబల చిత్రం మనకి తారసిల్లుతుంది – “ఓ వజ్రాయుధుడా! వలుడు ఆవులని దాచి ఉంచిన గోతిని నీవే తెరిచావు. నిర్భయులైన దేవతలు ప్రచండ వేగంతో నీలోకి ప్రవేశించారు (తమ శక్తిని నీలోకి ప్రవేశపెట్టారు).”

పైన చెప్పుకున్న ఉదాహరణలు అన్నిటినీ కలిపి కుట్టగల మూల సూత్రం ఏదైనా ఉందా? లేక ఋషులు ఏ విధమైన క్రమం, నియమం లేకుండా నానా రకాల దేవతలని పోయిన పశువులని తిరిగి తెచ్చే పనిలో ప్రవేశపెడుతున్నారా? ఈ ప్రశ్నలకి సమాధానం తెలుసుకోవాలంటే ఇలాంటి ప్రత్యేక సందర్భాల వలయంలో చిక్కుకోకుండా, వేదం మొత్తాన్ని సమగ్ర దృష్టితో చూడాలి. అలా చూడగలిగితే మనకొక సరళమైన మూల సూత్రం కనిపిస్తుంది. పోయిన గోవులని తిరిగి తెచ్చే సమస్య నిజానికి మరింత విస్తారమైన ప్రతీకావళిలో ఒక చిన్న భాగం మాత్రమే. వాటిని యజ్ఞ సమయంలో అగ్ని దేవుడు తిరిగి సాధిస్తాడు. ఎందుకంటే ఇక్కడ అగ్ని అనేది యాజ్ఞికుడి శక్తికి చిహ్నం. యాజ్ఞికుడి వాక్కు చేత ఆ విజయం సాధ్యమవుతుంది. మరి బృహస్పతి వాక్కుకి పితరుడు. మరుత్తులు ఆ వాక్కుకి గాయకులు లేదా బ్రహ్మలు (*బ్రహ్మాణో మరుతః*). సరస్వతి ఆ వాక్కుకి స్ఫూర్తి. సోమరసం చేత ఆ విజయం సాధ్యమవుతుంది, ఎందుకంటే సోమదేవుడు ఆ సోమరసానికి దేవత, అశ్వినులు ఆ రసానికి అన్వేషకులు, ప్రదాతలు, పానీయులు. ఇక పశుసందోహాలు కాంతి సందోహాలు. ఆ కాంతి సూర్యుడి వల్ల ఉష నుండి వస్తుంది. ఆ సూర్యుడికి మరో పేరే

పుషణుడు. ఇక చివరిగా ఈ దేవతలు అందరికీ అధినేత ఇంద్రుడు. కాంతికి విభుడు. విరాజమానమైన స్వర్లోకానికి రారాజు. విరాజిత, లేక దివ్యమైన మానసానికి అతడు ప్రతీక. సమస్త దేవతలు అతని లోనికి ప్రవేశించి దాగిన కాంతిని అతడు వెల్లడి చేసే ప్రయత్నంలో పాల్గొంటారు. కాబట్టి ఒకే విజయాన్ని ఇందరు దేవతలకి ఆపాదించడం ఎందుకు సమంజసమో ఇక్కడ మనకు అర్థమవుతుంది. వలుడి మీద దెబ్బ కొట్టడానికి దేవతలంతా ఇంద్రుడి లోనికి ప్రవేశించారు అని మధుచ్ఛందుడు వర్ణించినప్పుడు ఆ ప్రతీకలోని అంతరార్థం ఇప్పుడు మనకు అర్థమవుతుంది. కాబట్టి ఈ విషయంలో ఇష్టారాజ్యంగానో, అల్లకల్లోలంగానో భావప్రకటన జరగలేదు. సమగ్రతలో, సంసక్తతలో వేదం పరిపూర్ణంగా, సర్వాంగసుందరంగా అలరారుతుంది.

అంతేకాక వైదిక యజ్ఞ కర్మ యొక్క ప్రభావంలో కాంతిని జయించడం అనేది ఒక భాగం మాత్రమే. ఆ విజయాన్ని ఆధారంగా చేసుకుని అమరత్వ సిద్ధి కోసం కావలసిన అన్ని వరాలని (*విశ్వా వార్యా*) దేవతలు సాధించి పెట్టాలి. రహస్య ప్రకాశాలు బట్టబయలు కావడం అనేది ఆ వరాలలో ఒక్కటి మాత్రమే. గోవు అంటే తేజం ఎంత ముఖ్యమో, అశ్వం అంటే బలం కూడా అంతే ముఖ్యం. వలుణ్ణి జయించి అతడి పట్టులో చిక్కుకున్న కాంతిని తప్పక విడిపించాలి. అలాగే వృత్రుణ్ణి వధించి జలాలని విడుదల చెయ్యాలి. మెరిసే పశువులు బహిర్గతం కావడం అంటే ఉషోదయం అవుతోందని, సూర్యుడు ఉదయిస్తున్నాడని అర్థం. ఇక యజ్ఞం, అగ్ని, సోమం లేకుంటే ఇవన్నీ అసంపూర్ణమే అవుతాయి. ఇవన్నీ కూడా ఒకే సమగ్ర కర్మధారంలోని వివిధ అంశాలు. ఒక సంపూర్ణ విజయం యొక్క చిహ్నాలు. అవన్నీ సాధించడం అంటే బృహత్తర సత్యం బహిర్గతం అవుతోందని, తేజోమయ లోకమైన స్వర్లోకం ప్రాప్తిస్తోందని అర్థం. ఆ లోకాన్నే కొన్ని సార్లు విస్తారమైన మరో ప్రపంచం అని (‘*ఉరుమ్ ఉ లోకం*’ లేదా క్లుప్తంగా ‘*ఉ లోకం*’) అంటారు. ఋగ్వేదంలో వివిధ భాగాలలో వివిధ ప్రతీకలు వేరువేరుగా పరిచయం అవుతున్నప్పుడు వాటన్నిటి అంతరార్థం అర్థం కావాలంటే వాటి వెనుక ఉన్న ఐక్యత ముందు అర్థం కావాలి.

ఆ విధంగా అంతకు ముందు చర్చించుకున్న ఒక ఋక్కులో (VI.73) మూడు శ్లోకాలలో పైన చెప్పుకున్న మూడు ప్రతీకలని ఏకీకరించడం జరుగుతుంది. వేదం యొక్క ప్రతీకాత్మకతలో అంతర్లీనంగా ఉండే ఐక్యతని తెలుపడం కోసం ఈ శ్లోకాలని స్మృతి

సాధనాలుగా (mnemonic) వాడుకోవచ్చని అనిపిస్తుంది. "నగధ్వంసకుడు, ప్రథమ జాతుడు, సత్యవశుడు, అంగీరసుడు అయిన బృహస్పతి, అర్ఘ్యాన్ని అర్పించి, ఇరు ప్రపంచాలలోను వ్యాపించి, (సూర్యుని) తాపంలో, తేజంలో వసిస్తూ, మన పితరుడు, వృషభంలా భీకరంగా గర్జిస్తూ ఇరు లోకాలని కదిలిస్తున్నాడు. యాత్రికుడైన మానవుడి కోసం బృహస్పతి ఆ మరో ప్రపంచాన్ని రూపొందించి దేవతలని ఆహ్వానించాడు. వృత్ర బలాలని నిర్జించి నగరాల ద్వారాలు తెరిపించాడు. బృహస్పతి అతడి కోసం నిధులని జయిస్తాడు. గోవులతో నిండిన గోశాలని గెలుస్తాడు. అజేయమైన స్వర్లోకంపై విజయాన్ని కోరుకుంటాడు. తేజోమయమైన ఋక్కులతో (*అర్కైః*) బృహస్పతి శత్రువును నిర్జిస్తాడు." అనేకముఖమైన ప్రతీకావళిలో అంతర్లీనమైన ఐక్యత ఇక్కడ ప్రస్ఫుటమవుతోంది.

పైన బృహస్పతి శ్లోకంలో వ్యక్తం కాని ఒక భావన మరింత గుహ్యమైన భాషలో మరో చోట వ్యక్తమవుతోంది. ఇక్కడ ఉషస్సు యొక్క భావన, సూర్యునిలో కాంతి యొక్క నవ్య జననం అనే భావన చక్కగా విపులీకరించబడుతోంది. అది సోముడి స్తుతిలో వస్తుంది. అందులోని ప్రథమ వాక్యాలని అంతకుముందే (VI.44.22) ఉదహరించడం జరిగింది. "బలం లోనుండి పుట్టిన దేవత ఇంద్రుడి సహచరుడిగా, పణిగా నిలిచాడు; అశుద్ధుడైన (విభాజిత ఆత్మ గల) అతడి తండ్రి నుండి అతణ్ణి, అతడి యుద్ధాస్త్రాలని, అతడి జ్ఞానాకృతులని (మాయాః) బలవంతంగా కాజేయడం జరుగుతుంది; ఉషస్సుల వేలుపుగా అతణ్ణి తీర్చిదిద్దారు; తేజోమూర్తి అయిన సూర్యుడిలో అతణ్ణి సృష్టించారు; త్రివిధమైన తత్వం (అమరత్వానికి చెందిన) గల సురవైభవం లోను (స్వర్ కి చెందిన త్రిలోకాలు), రహస్యమైన అమరత్వానికి చెందిన మూడు లోకైక విభాగాలలోను అతణ్ణి కనుగొన్నారు. (ఇది అమృతాన్ని పలుభాగాలు చేసి పంచే గాధ, అగ్నిని స్తుతించే అత్రుల ఋక్కులో ఇది వస్తుంది; మూడు స్థాయిలలో మూడు విధాలుగా చేసే సోమరసపు నైవేద్యం అంటే ఇదే. ఆ మూడు స్థాయిలు దేహం, ప్రాణం, మనసు, *త్రిషు సానుషు*.) దివిలోను, భువిలోను అతడికి విశాలమైన ఆధారం వుంది, ఏడు కిరణాలు పూన్చిత రథం అతడే; గోవులు ప్రసాదించే నిండైన సిరులు (*మధు, ఘృత*) అతడి శక్తి చేతనే నిలుపబడతాయి, పది చలనాలకి జన్యస్థానం అతడే." ఇలాంటి శ్లోకాలని చదివిన ఎంతో మంది మేధావులు, ప్రబుద్ధులు ఇవన్నీ గొప్ప ప్రతీకాత్మబుద్ధుల చేత, అధ్యాత్మికుల చేత రచించబడ్డ మహా వాక్యాలని, ప్రకృతిని ఆరాధించే

కిరాత జాతుల చేతనో, సంస్కారవంతులైన వేదాంతి ద్రావిళ్ల పైన దాడి చేయ వచ్చిన ఆర్యుల చేతనో రాయబడ్డవి కావని, గుర్తించలేకపోవడం ఆశ్చర్యకరం.

ఈ ప్రతీకలు కలిసికట్టుగా ప్రత్యక్షమయ్యే మరి కొన్ని వేదభాగాలని వేగంగా పరిశీలిద్దాము. ముందుగా కొండగుహలో పశువుల శాల అనే ప్రతీకని తీసుకుందాం. ఇందులో గోవు, అశ్వం ఎప్పుడూ కలిసే ఉంటాయి. ఇక్కడ గోవులని వెతికిపెట్టమని, అశ్వాలని రక్షించమని పుషణుణ్ణి ప్రార్థించడం జరుగుతుంది. ఆర్యులకి చెందిన ఈ రెండు రకాల సంపదల విషయంలో దొంగల భయం ఎప్పుడూ అంత ఎక్కువగా ఎందుకు ఉంటుంది? వేదం ఏమంటుందో చూద్దాం. "ఓ వీరుడా (ఇంద్రుడు)! సోమరస పారవశ్యంలో నీవు గో, అశ్వాల శాలని ఒక నగరంలా భేదించావు" (VIII.32.5). "వేవేల గోవులని, అశ్వాలని మా కోసం విడిపించు" (VIII.34.14). "ఓ ఇంద్రుడా! నీకు వశమైన గోవుని, అశ్వాన్ని, అక్షయమైన ఆనందాన్ని, పణికి కాక, యాజ్ఞికుడికి ప్రసాదించు." "పని పాటా చెయ్యకుండా, దేవతల కోసం వెతకకుండా, నిద్రలో జోగే వాడిని, తన తమస్సులో మునిగి నాశనం కానీ. అటు పిమ్మట శాశ్వతంగా మాలో సంపద సంవర్ధనం కానీ" (VIII.97.2, 3). మరో ఋక్కులో గోవుల, అశ్వాల సంపదని పణులు చెరపట్టినట్టుగా వర్ణించబడుతుంది. ఈ పణులు అనే శక్తులు ఎప్పుడు గోవుల, అశ్వాల సిరులని కోరుకుంటారు, వాటిని దోచుకుంటారు, కాని తమోగుణం వల్ల వాటిని వాడుకోరు. దివ్యమైన ప్రయత్నాన్ని (వ్రత) చెయ్యరు. అలాంటి శక్తులు నాశనం కావాలి, నిర్జించబడాలి. అప్పుడు అవి యాజ్ఞికుడి వశం అవుతాయి. గోవుని, అశ్వాన్ని ఎప్పుడూ ఒక గుప్త, నిర్బంధ నిధిగా వర్ణించడం జరుగుతుంది. దివ్య ప్రయాస చేత వాటిని కనుగొని, విడిపించాల్సి ఉంటుంది.

మెరిసే పశువుల విజయంతో పాటు, ఉష, సూర్యుల జననానికి సంబంధించిన విజయం కూడా తోడై ఉంటుంది. ఈ విషయాన్ని వేరే అధ్యాయంలో పరిశీలిద్దాం. పశువులతో కలిపి పరిశీలించినప్పుడు, ఉష, సూర్యుడు జలాలు అవుతారు; వృత్రుడిపై విజయం వల్ల జలాలు విడుదల కావడం, వలుడి పరాజయం వల్ల పశువులు విడుదల కావడం – ఈ రెండూ ఒక దాంతో ఒకటి ముడివడ్డ గాథలు. మరి కొన్ని చోట్ల (ఉదాహరణకి I.32.4) వృత్ర సంహారం సూర్యుడి యొక్క, ఉష యొక్క, స్వర్లోకం యొక్క ఆవిర్భావానికి మొదటి మెట్టుగా చెప్పబడుతుంది. మరి కొన్ని చోట్ల కొండ ముఖం తెరుచుకోవడం వల్ల జలాలు

ప్రవహించినట్టు చెప్పబడుతుంది. ఇలాంటి సందర్భాన్ని మరింత సామాన్యంగా ఈ శ్లోకాలలో వర్ణించడం జరిగింది – (VII.90.4) "అమేయమై, అనాహతమైన ప్రభతో ఉషస్సులో భళ్లున మేల్కొన్నాయి; ధ్యానం చేత వాళ్లు బృహత్తర కాంతిని కనుగొన్నారు; ఆకాంక్ష గల వారు గోవుల బృహత్తుని తెరిచారు. వారి కోసం స్వర్గం నుండి జలాలు ప్రవహించాయి. (I.72.8) "సదాలోచన చేత స్వర్గానికి చెందిన మహిమాన్వితులు (ఏడు నదులు) సత్యాన్ని తెలుసుకున్నారు, ఆనంద ద్వారాన్ని తెలుసుకున్నారు. గోవుల బలమైన బృహత్తును సరమ కనుక్కున్నది. దాంతో మానవ జాతి ఆనందాలని చవిచూసింది." ఇంద్రుని గురించి, మరుత్తుల గురించి ఈ శ్లోకంలో (I.100.18) - "అతడు తన మెరిసే సహచరులతో క్షేత్రాన్ని గెలిచాడు, సూర్యుణ్ణి గెలిచాడు, జలాలని గెలిచాడు." అగ్ని గురించి మరో శ్లోకంలో (V.14,4) – "అగ్ని జనించి, జ్వలించి, కాంతి చేత, చీకటి చేత దస్యులని జయించాడు; అతడు గోవులని, జలాలని, స్వర్లోకాన్ని కనుగొన్నాడు." ఇంద్రుని, అగ్నిని స్తుతించే మరో శ్లోకంలో (VI.60.2) – "మీరు ఇరువురు గోవుల కోసం, జలాల కోసం, స్వర్లోకం కోసం కలహించారు. జలాలు జయించబడ్డాయి; ఓ ఇంద్రుడా, ఓ అగ్నీ, మీరు (మా కోసం) లోకాలని, స్వర్లోకాన్ని, విరాజమాన ఉషస్సులని, జలాలని, గోవులని ఏకం చేశారు." ఇంద్రుని పై శ్లోకంలో (I.32.12) – "ఓ వీరుడా! నీవు నిశ్చయంగా గోవుని జయించావు, నీవు నిశ్చయంగా సోమాన్ని జయించావు; ఏడు నదులని విడిపించి ప్రవహించనిచ్చావు."

తదుపరి విభాగంలో ఇంద్రుని విజయాలలో సోమరసాన్ని, గోవులని కలిపే ప్రస్తావించడం జరుగుతుంది. సామాన్యంగా సోమరస సమ్మోహన శక్తితోనే ఇంద్రుడి గోవులని జయిస్తాడు; ఉదాహరణకి (III.43.7) సోమరస "సమ్మోహనంలోనే గోశాలలని తెరిపించగలిగావు." (II.15.8) "అంగీరసుల స్తుతి చేత నీవు వలుణ్ణి వధించాడు, కొండలోని మొండి బండలని బద్దలు కొట్టాడు; దాని కృత్రిమ అవరోధాన్ని వ్రయ్యలు చేశాడు; సోమరస మైకంలో ఇంద్రుడు ఇవన్నీ సాధించగలిగాడు." కొన్ని సార్లు ఆ పనిలో క్రమం తారుమారు అవుతుంది. తేజస్సు సోమరసానందాన్ని గొనితెస్తుంది. మరి కొన్ని సార్లు రెండూ కలిసే వస్తాయి (I.62.5). "ఓ కార్యశూరుడా! అంగీరసుల స్తుతి చేత, సూర్యుడి వల్ల ఉషని రప్పించావు, సోముడి వల్ల గోవులని సాధించావు."

అగ్ని కూడా సోమరసం లాగానే యజ్ఞంలో ఒక ముఖ్యమైన అంశం. కాబట్టి ఈ వివిధ అంశాల మధ్య సంబంధాలని తెలిపేటప్పుడు అగ్నిని కూడా జోడించడం జరుగుతుంది (VII.99.4) - "యజ్ఞం కోసం సువిస్తారమైన ఆ మరో లోకాన్ని (యజ్ఞం యొక్క లక్ష్యంగా) నిర్మించావు. సూర్యుడికి, ఉషస్సుకి, అగ్నికి జన్మ నిచ్చావు." III.31.15 లో ఇంచుమించు అదే సూత్రం కనిపిస్తుంది, ఒక్క పథం అనే మాట మాత్రం అదనంగా వస్తుంది. అలాగే VII.44.3. లో గోవు అనే భావన అదనంగా వస్తుంది.

పైన చెప్పుకున్న ఉదాహరణలని బట్టి వేదంలోని వివిధ ప్రతీకలు, గాధలు ఎలా లోతుగా ముడివడి ఉన్నాయో అర్థమవుతుంది. అంగీరసుల, పణుల గాధని ప్రత్యేకంగా, మిగతా గాధలతో సంబంధం లేకుండా పరిశీలించినట్లయితే, వేదాన్ని సమగ్రంగా అన్వయించే సూత్రం మన పట్టుజారిపోతుంది.

అధ్యాయం 15

పోయిన సూర్యుడు – పోయిన గోవులు

కనిపించని సూర్యుణ్ణి, కనిపించని ఉషని తిరిగి సాధించే గాధ ఋగ్వేదపు ఋక్కుల్లో పదే పదే ఎదురవుతూ ఉంటుంది. కొన్ని సార్లు సూర్యుణ్ణి కనుగొనే వృత్తాంతం ఉంటుంది, మరి కొన్ని సార్లు సూర్యుడి లోకమైన స్వర్లోకంపై విజయం వర్ణించబడుతుంది. స్వర్ అనే పదాన్ని సాయణుడు సూర్యుడికి పర్యాయ పదంగా తీసుకున్నాడు. కాని వేదంలో ఎన్నో శ్లోకాలని బట్టి స్వర్ అనే పదం సామాన్యమైన భువికి, దివికి ఆవల ఉన్న ఒక అద్భుత పరంధామాన్ని సూచిస్తుంది. కొన్ని సార్లు నిజంగానే ఆ పదాన్ని సూర్యుడికి, ఆయన ప్రకాశంతో వెలుగొందే లోకానికి పర్యాయపదంగా ప్రయోగించబడింది. దివి నుండి కిందికి ఉరికే ఝురులని, ఇంద్రుని చేత, అతడి కటాక్షాన్ని పొందిన మర్త్యుల చేత, జయింపబడి, భోగింపబడే జలాలని,

స్వర్వతీర్ అపః అన్నారు. *అపః* అనే పదాన్ని భౌతికమైన జలాలుగా అన్వయించిన సాయణుడు, *స్వర్వతీః* అనే పదానికి మరో అర్థాన్ని గాలించాడు. ఆ పదాన్ని *సరణవతీః* (కదిలేది) అన్నట్టుగా అన్వయించాడు. కాని ఇది బలవంతంగా, అసహజంగా చొప్పించిన అన్వయం. ఇంద్రుడి రాయిని స్వర్గలోకపు శిలగా (*స్వర్యమ్ అస్మానమ్*) వర్ణించారు. దాని కాంతి సౌరలోకపు కాంతితో రాజిల్లే కాంతి. ఇంద్రుడు మరి *స్వర్పతి*, తేజోమయమైన *స్వర్* లోకానికి పతి.

సామాన్యంగా పోయిన గోవులని తిరిగి సాధించే పని ఇంద్రుడికి ఆపాదించబడుతుంది. కొన్ని సార్లు అంగీరస ఋషుల సహాయంతోను, మంత్ర ప్రయోగంతోను, యజ్ఞ ప్రభావంతోను, ఆ ఫలితం సాధించబడుతుంది. కొన్ని సార్లు అగ్ని, సోమరసపు పాత్ర కూడా ఉంటుంది. అదే విధంగా సూర్యుణ్ణి కనుగొనే ప్రయత్నంలో కూడా ఇదే శక్తుల ప్రమేయం ఉంటుంది. అంతేకాక ఈ రెండు ప్రయత్నాలకి అవినాభావ సంబంధం వుంది. సూక్ష్మంగా చూస్తే ఇవన్నీ కూడా ఒకే విస్తార కర్మధారలో వివిధ అంశాలని అనిపిస్తుంది. అందుకు వేదంలోనే ఎన్నో ఆధారాలు కనిపిస్తాయి. ఉష యొక్క సూర్యుని యొక్క రహస్య కిరణాలే గోవులు. ఆ కిరణాలని చీకటి గుప్పెట నుండి విడిపించడం అంటే, చీకట్లో దాగిన సూర్యుడు ఉదయించడమే. ఈ పరిస్థితులలోనే కాంతి పూర్ణ పరంధామం అయిన స్వర్లోక ప్రాప్తి సాధ్యమవుతుంది. అందుకు యజ్ఞం అవసరం. ఈ దేవతలందరి సహాయం అత్యవసరం. ఈ సంగతులన్నీ వేదం స్పష్టంగా తెలుపుతోంది. అంతేకాక వైదిక పరిభాష దివ్య తేజోమయ శక్తికి, దివ్య సత్యానికి చెందిన స్వర్లోకానికి ప్రతీక సూర్యుడు అని సూచిస్తోంది. మరి దివ్య సత్యం యొక్క సాధనే వేద ఋషుల చరమ లక్ష్యం, వేద ఋక్కుల చర్చాంశం. ఈ నిర్ణయం దిశగా తీసుకుపోయే అంశాలని ఇప్పుడు క్లుప్తంగా చర్చిస్తాను.

మొట్టమొదట మనం గుర్తించవలసింది ఏంటంటే వేద ఋషుల చిత్తంలో సూర్యుడు మరియు స్వర్ అనే భావనలు, లోతైన సంబంధం వున్నా పూర్తిగా భిన్నమైన భావనలు. ఉదాహరణకి సోముణ్ణి, ఇంద్రుణ్ణి స్తుతిస్తూ భరద్వాజుడు రాసిన ఋక్కులో (VI.72.1) ఇలా ఉంటుంది – "నీవు సూర్యుని కనుగొన్నావు, స్వర్ ని కనుగొన్నావు, నానా చీకట్లని, అవరోధాలని

పరిహరించావు.” అలాగే ఇంద్రుణ్ణి ఉద్దేశించి, ఇంద్రుని యొక్క, అంగీరసుల యొక్క విజయాలని కొనియాడుతూ, వామదేవుడు రాసిన ఋక్కులో (IV.16) – “ఋక్కుల ప్రకాశం (అర్కైః) చేత స్వర్ కనుగొనబడినప్పుడు, అది పూర్తిగా గోచరమైనప్పుడు, వాళ్లు (అంగీరసులు) ఆ మహత్తర కాంతిని చీకట్లోంచి వెల్లడి చేసినప్పుడు, అతడు (ఇంద్రుడు) ఆ చీకట్లని వాటి పట్టుసడలేలా చేసి, మనుషులకి దృష్టిని ప్రసాదించాడు.” మొదటి సందర్భంలో స్వర్, మరియు సూర్యుడు వేరు వేరు తత్వాలని, స్వర్ అనేది కేవలం సూర్యుడికి మరోపేరు కాదని అర్థమవుతుంది. కాని స్వర్ ని కనుగొనడం, సూర్యుణ్ణి కనుగొనడం రెండూ చాలా సన్నిహితమైన విజయాలని, రెండిటి ఫలితం చీకటి పైన, అవరోధాల పైన విజయం అని అర్థమవుతుంది. ఇక రెండవ సందర్భంలో స్వర్ యొక్క ఆవిష్కరణ వల్ల, ప్రకటన వల్ల ఒక మహత్తర కాంతి చీకట్లోంచి వెలువడుతుంది. దీనికి సమాంతరమైన మరి కొన్ని శ్లోకాల్లో చీకట్లో దాగిన సూర్యుణ్ణి అంగీరస ఋషులు కనుగొన్న వైనం వర్ణించబడింది. అంగీరసులు తమ మంత్ర శక్తి చేత సూర్యుణ్ణి కనుగొన్నారు. అంగీరసుల మంత్ర (అర్కైః) ప్రభావం చేత స్వర్ కూడా కనుగొనబడి, ప్రకటించబడుతుంది. స్వర్ యొక్క సారం ఒక మహత్తర కాంతి అని, ఆ తేజమే సూర్యుడి తేజమని దీన్ని బట్టి తెలుస్తోంది.

స్వర్ అనే పదం సూర్యుణ్ణి గాని, తేజస్సును గాని, ఆకాశాన్ని గాని సూచిస్తుందని పొరబడే అవకాశం వుంది. కాని వెనకటి ఋక్కులని బట్టి ఆ పదం ఒక లోకాన్నే సూచిస్తోందని మనకి అర్థమవుతోంది. అది స్వర్గ నరకాలకి ఆవల ఉన్న లోకంగా, రోదసికి ఆవల ఉన్న లోకంగా తరచు ప్రస్తావింపబడుతుంది. దాన్నే సువిస్తార లోకం (ఉరు లోక), మరో విశాల లోకం (ఉరు ఉ లోక), లేదా మరో లోకం (ఉ లోక) అన్న పేర్లతో వ్యవహరిస్తారు. బృహత్తర కాంతితో, అనవధిక భయరహిత స్వేచ్ఛతో కూడుకున్న లోకంగా ఆ లోకం పరిచయం చేయబడుతుంది. అక్కడ గోవులు అంటే సూర్యుడి కిరణాలు స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి. కనుక VI.47.8 లో ఇలా చెప్పబడుతుంది – “నీవు నీ జ్ఞానంతో మమ్మల్ని విశాల లోకం దిశగా గొనిపోతున్నావు. అభయమై, జ్యోతిర్మయమైన ఆ స్వర్ లోకంలో స్వస్థత కలుగుతుంది.” (*స్వర్ జ్యోతిర్ అభయం స్వస్తి*). III.2.7. లో అగ్ని వైశ్వానరుడు భువిని, దివిని, బృహత్తరమన స్వర్లోకాన్ని పూరిస్తున్నట్టుగా వర్ణించబడింది – *ఆ రోదసీ అపృణద్ ఆ స్వర్ మహత్*. అలాగే విష్ణువును స్తుతించే ఒక ఋక్కులో వశిష్ఠుడు ఇలా అంటాడు – “ఓ

విష్ణుదేవా! ఈ భువిని, దివిని నీవు స్థిరంగా నిలుపుతున్నావు. (సూర్యుని) కిరణాలతో భూమిని అన్ని పక్కలా ఒడిసి పట్టుకున్నావు. మీరు ఇరువురు యజ్ఞం కోసం (లేక యజ్ఞం ఫలితంగా) ఆ విశాలమైన మరో లోకాన్ని (ఉరుమ్ ఉ లోకమ్) సృష్టించారు. దాంతో సూర్యుడికి, ఉషకి, అగ్నికి జన్మనిచ్చారు." యజ్ఞానికి ఫలితంగా, తీర్థయాత్రకి అంతంలో, ఒక విశాలమైన స్వధామాన్ని చేరుకుంటాం. ఆ స్వధామమే యజ్ఞాన్ని సక్రమంగా చేసేవారు చేరుకునే మరో లోకం – *సుకృతాం ఉ లోకం*. భువి నుండి దివికి దూతగా బయల్దేరిన అగ్ని, అక్కడ తన ఆత్మతో ఆ బృహత్తర స్వధామం అంతా వ్యాపిస్తాడు – *క్షయం బృహంతం పరి భూషతి* (III.3.2). వేద ఋషులు కోరుకునే ఆనందంతో, ఐశ్వర్యంతో నిండిన ప్రపంచమది – "జాతవేదుడవైన ఓ అగ్నీ! యజ్ఞ కర్మలు సక్రమంగా చేసేవారి కోసం నీవు ఆనందమయమైన ఆ మరో లోకాన్ని నిర్మించి ఇస్తావు. అక్కడ అశ్వాలతో, సుతులతో, వీరులతో, గోవులతో కూడుకున్న నిండైన స్థితిని ప్రసాదిస్తావు (V.4.11)." ఆ కాంతి చేతనే ఆ ఆనంద ప్రాప్తి కలుగుతుంది. సూర్యుణ్ణి, ఉషని, పగళ్లని పుట్టించిన అంగీరసులు ఆ విధంగా మానవ జాతి కోరుకునే సిరులని చేరుకోగలిగారు – "స్వర్ ని జయించిన ఇంద్రుడు, పగళ్లకి జన్మనిచ్చాడు. ఆర్తిగొన్న వారి (*ఉశిగ్భిః* అన్న పదాన్ని నృ అనే శబ్దానికి మల్లె మానవులని, దేవతలనే కాక, కొన్ని సార్లు ప్రత్యేకించి అంగీరసులని సూచించడానికి వాడారు) సాయంతో అటకాయించిన సైన్యాన్ని జయించాడు. ఆ విధంగా పగళ్ల దృశ్యం (*కేతుం అహ్నామ్*) మనుషులకి కనిపించేలా చేశాడు. మహత్తరమైన ఆనందం కోసం కాంతిని కనుగొన్నాడు." – *అవిందజ్ జ్యోతిర్ బృహతే రణాయ* (III.34.4).

వీటన్నిటి బట్టి చూస్తే వేదం యొక్క విశ్వదర్శనానికి, అమెరికా ఖండంలో నివసించే రెడ్ ఇండియన్ల విశ్వదర్శనానికి మధ్య పోలిక ఉన్నట్టు అన్వయించుకోవచ్చని అనిపిస్తుంది. భూమికి, ఆకాశానికి ఆవల ఉండే విశాలమైన భౌతిక విశ్వంలో, సూర్య కిరణాలతో ప్రకాశితమయ్యే విశాల ప్రపంచంలో, మానవుడు భయం, సంకోచం లేకుండా జీవించొచ్చని, అడ్డు అదుపు లేకుండా ఆవులని, గుర్రాలని, మగ సంతతిని, పరిచారకులని పొందచ్చని ఊహించుకోవచ్చు. కాని ఇక్కడ మనం ముఖ్యంగా తెలుసుకోవలసినది ఏమిటంటే వేదం యొక్క అసలు అర్థం ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. మనకు తెలిసిన విశాల భౌతిక విశ్వం,

ఇక్కడ చెప్పబడ్డ విశాల లోకం – *బృహద్ ద్యౌః లేదా స్వర్* – రెండూ పూర్తిగా భిన్నం. ఈ సత్యం ఎన్నో చోట్ల ప్రకటించబడింది. ఉదాహరణకి I.36.8. లో ఇలా చెప్పబడింది – "మనుషులు ఆ ఆవర్తకుణ్ణి సంహరించి, భువిని, దివిని దాటి, ఆ విశాల లోకాన్ని తమ నెలవుగా చేసుకున్నారు." *ఘ్నంతో వృత్రం అతరన్ రోదసీ అప ఉరు క్షయాయ చక్రిరే.* ఈ స్వర్గాతీత బృహత్తు, ఆ అనవధిక తేజం, ఓ అతిమానస స్వర్గం. అతిమానస సత్యానికి చెందిన స్వర్గం. అది అమరమైన ఆనందానికి చెందిన లోకం. అక్కడి కాంతి సత్యానికి చెందిన కాంతి. మన కళ్లని కప్పిన ఒక చీకటి వల్ల ఆ స్వర్గం కనిపించకుండా పోతోంది. దాన్ని కనుగొని ప్రత్యక్షమయ్యేలా చెయ్యాలి. అది ఉష యొక్క జననం వలన, సూర్యోదయం వలన సాధ్యమవుతుంది. సౌర పశుసందోహాలు తమ రహస్య గుహ నుండి బయటికి తన్నుకు వచ్చినప్పుడు సాధ్యమవుతుంది. యజ్ఞంలో సఫలీకృతులు అయిన జీవులు *స్వర్దృశ్* మరియు *స్వర్విద్* అవుతారు. అంటే స్వర్ యొక్క ద్రష్టలు, మరియు స్వర్ యొక్క ఆవిష్కర్తలు, లేదా జ్ఞాతలు అవుతారు. ఎందుకంటే *విద్* అనే మూల శబ్దానికి కనుక్కోవడమని, సాధించడమని, తెలుసుకోవడమని పలు అర్థాలు ఉన్నాయి. ఒకటి రెండు చోట్ల కాస్త తక్కువ సంధిగ్ధార్థం గల *జ్ఞా* అనే మూలశబ్దాన్ని *విద్* కి ప్రత్యామ్నాయంగా వాడడం జరిగింది. కాబట్టి ఆ బృహత్తర లోకం లేదా స్వర్ ని సరిగ్గా అన్వయించడం వేదం యొక్క అన్వయంలో కీలకం అవుతుంది. ఆ అన్వయంలోనే వేదం అనేది కిరాత జాతుల పాశవిక జానపద గీతమా లేక అతి ప్రాచీన జ్ఞాన సాహిత్యమా అన్న విషయం బయట పడుతుంది. నూరుకి పైగా శ్లోకాలలో ఈ బృహత్తర లోకానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. వాటన్నిటినీ ఆ అధ్యాయాలలో చర్చించడం అసంభవం. కాబట్టి ఆ తరువాత అంగీరస ఋక్కులని చర్చించే సందర్భంలో ఈ సంగతులని మళ్లీ పరిశీలిద్దాం.

సూర్యుడి యొక్క, ఉష యొక్క జననం స్వర్లోకాన్ని చూడడానికి, చేరుకోడానికి ప్రథమ నియమం అని దీన్ని బట్టి మనకు అర్థమవుతోంది. వేదంలో గాధలకి, ప్రతీకలకి ఎందుకంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందో ఇక్కడే మనకు తెలుస్తోంది. చీకటి లోంచి కాంతిని వెలికి తెచ్చే ఆ *సత్య మంత్రం* ఎందుకంత ముఖ్యమో దీన్ని బట్టి తెలుస్తోంది. ఆ విజయాన్ని సాధించగల వారు ఇంద్రుడు, అంగీరసులు. వేదంలో ఈ సత్యాన్ని ప్రస్తావించే శ్లోకాలు కోకొల్లలు. ఇంద్రుడు, అంగీరసులు స్వర్లోకాన్ని, లేదా సూర్యుణ్ణి కనుక్కున్నట్టు (*అవిన్దత్*), దాన్ని

ప్రభావంతం గావించినట్టు (*అరోచయత్*), దానికి జన్మ నిచ్చినట్టు (*అజనయత్*) (యజ్ఞంలో దేవతలు అభివ్యక్తం కావడాన్ని వేదం ఆ దేవతల జననంగా వర్ణిస్తుంది), దాన్ని జయించి వశం చేసుకున్నట్టు (*సనత్*) చెప్పబడుతుంది. కొన్ని సందర్భాల్లో కేవలం ఇంద్రుడి పేరు మాత్రమే ప్రస్తావించబడుతుంది. అతడే చీకట్లోంచి కాంతిని పుట్టించగల వాడు. సూర్యుడికి జన్మ నీయగలవాడు (*క్షపాం వస్తా జనితా సూర్యస్య* – III.49.4). సూర్యుని యొక్క, ఉష యొక్క పుట్టుకకి కారణమైన వాడు (II.12.7). ఇంకా ప్రస్ఫుటంగా మరో చోట సూర్యుని యొక్క, స్వర్గం యొక్క, ఉష యొక్క జననాలని ఒక దరికి తెచ్చేవాడు అని చెప్పబడింది (VI.30.5). అతడు (ఇంద్రుడు) తన వెలుగుల చేత ఉషని ప్రకాశింపజేస్తాడు, అతడు తన వెలుగుల చేత సూర్యుని ప్రజ్వలింపజేస్తాడు - *హర్యన్నుషసమ్ అర్చయః సూర్యం హర్యన్నరోచయః* (III.44.2). ఇవీ అతడి మహోజ్వల విజయాలు – జజాన సూర్యం ఉషసమ్ సుదంసాః. (III.32.8). తన కాంతులీనే సహచరులతో కలిసి అతడు సమస్త క్షేత్రాన్ని వశం చేసుకుంటాడు (మరి ఆ క్షేత్రంలోనే కదా తొలుత అత్రి వెలిగే గోవులని పొడచూడలిగాడు?), సూర్యుని గెలుస్తాడు, జలాలని జయిస్తాడు – *సనత్ క్షేత్రం శక్తిభిః శ్విత్న్యేభిః సనత్ సూర్యం సనద్ అపః సువజ్రః* (I.100.18). పగళ్లకి పుట్టుకనిచ్చి స్వర్ ని జయించేది (స్వర్షా) కూడా అతడే. వేదంలో ఎన్నో శ్లోకాలలో సూర్యుడి జననం ప్రస్తావింపబడినప్పుడు, ఆ శ్లోకాలని వేరువేరుగా తీసుకుంటే, ఆ ప్రస్తావన దేవతల చేత సూర్యుడి యొక్క ప్రథమ సృష్టిని సూచిస్తోందని తలపోసే అవకాశం వుంది. కాని ఆ శ్లోకాలు అన్నిటినీ కలిపి తీసుకుంటే వేరే అర్థం వస్తుంది. ఆ పుట్టుక ఉషా సమేతంగా జరిగే తన పుట్టుకే, చీకట్లోంచి వెలువడే తన పుట్టుకే. యజ్ఞం చేతనే తన పుట్టుక జరుగుతుంది – *ఇంద్రః సుయజ్ఞ ఉషసః స్వర్ జనత్* (II.21.4). "ఇంద్రుడు తీరుగా యజ్ఞం ఆచరించి ఉషస్సులకి, స్వర్లోకానికి జన్మనిచ్చాడు." అది మానవ ప్రమేయం చేతనే సాధ్యమవుతుంది – *అస్మాకేభిర్ నృభిః సూర్యం సనత్* – మన "మనుషుల" చేత అతడు సూర్యుణ్ణి గెలుస్తాడు (I.100.6). ఎన్నో ఋక్కులలో అది అంగిరసుల కృషి చేత సాధ్యమైనట్టుగా చెప్పబడుతుంది. కొండని బద్దలు కొట్టి గోవులని విడిపించిన ఫలితంతో అది ముడివేయబడుతుంది.

పై వాదనల దృష్ట్యా సూర్యుణ్ణి కనుగొనడం అంటే, రోజు ఉదయానే ఆకాశం (ఇంద్రుడు) సూర్యుణ్ణి కనుగొనే భౌతిక వృత్తాంతం కాదని స్పష్టం అవుతుంది. కటిక చీకటిలో కూడా కాంతిని కనుగొనగలడు (*సో అంధే చిత్ తమసి జ్యోతిర్ విదత్*) అని ఇంద్రుణ్ణి స్తుతించినప్పుడు, అక్కడ ప్రస్తావించబడ్డ కాంతి అగ్ని, సోముడు కనుక్కున్న కాంతి మాత్రమేనని తెలుస్తోంది. సకల ప్రాణులకి హితమైన ఏకైక కాంతి (*అవిద్దతం జ్యోతిర్ ఏకం బహుభ్యః*). పణుల నుండి గోవులని విడుదల చేసినప్పుడు పుట్టిన కాంతి (I.93.4) "దేవత కోసం దేవతగా, సత్యాన్ని పోషించే వారు పుట్టించిన జాగృత కాంతి". పితరులైన అంగీరసులు సత్య మంత్రాలని ప్రయోగించి ఉషకి జన్మనిచ్చినప్పుడు పుట్టిన రహస్య కాంతి (*గూఢం జ్యోతిః*). వైవస్వత మనువు చేత గాని, కశ్యపుడి చేత గాని విరచించిబడిన పవిత్ర ఋక్కు ఒకటుంది (VIII.29.10). సమస్త దేవతలని ఉద్దేశించిన ఆ ఋక్కులో కూడా ప్రస్తావించబడ్డ కాంతి అదే. "వారిలో కొందరు ఋక్కుని గానం చేస్తూ ఘనమైన సామన్ ని స్మరించి, ఆ విధంగా సూర్యోదయాన్ని కలుగజేస్తారు." మానవ సృష్టికి పూర్వం జరిగినట్టుగా దాన్ని వర్ణించలేదు. ఎందుకంటే ఒక ఋక్కులో (VII.91.1) ఇలా చెప్పబడింది. "మా ప్రణతుల చేత దేవతలు వర్ధిల్లుతారు. అనాదులు, అనింద్యులు అయిన వారు, చీకటి శక్తుల వశమైన మనుజుల కోసం ఉషని పుట్టించి, సూర్యుని ప్రకాశింపజేస్తారు." అంగీరస ఋషులు పది నెలల పాటు యజ్ఞం చేసి చీకట్లో దాగిన సూర్యుని కనుగొంటారు. ఈ గాథకు గాని, ప్రతీకకు గాని మూలం ఏదైనా కావచ్చు. అది అతి ప్రాచీనమైన గాథ. దీర్ఘ కాలం సూర్యుడు చీకట్లో కనుమరుగైన దశలు ఉంటాయని ఆ గాథ సూచిస్తుంది. భారతీయ ఆర్యుల లోనే కాదు, అమెరికా ఖండానికి చెందిన మాయన్ జాతి సంస్కృతిలో కూడా ఆ గాథ వంటిది కనిపిస్తుంది. ఈ మాయన్ జాతి ఈజిప్షియన్ సంస్కృతి కన్నా మరింత ప్రాచీనమైన, మరింత ప్రాథమికమైన సంస్కృతిలా కనిపిస్తుంది. అక్కడ కూడా సూర్యుడు ఎన్నో నెలల పాటు చీకట్లో కనుమరుగైన కథలు వినిపిస్తాయి. అప్పుడు ఆ సంస్కృతికి చెందిన విప్రులు (వారు అంగీరస ఋషులా?) తమ ప్రార్థనలతో మాయమైన సూర్యుణ్ణి తిరిగి రప్పిస్తారు. వేదంలో ఆ కాంతిని మొట్టమొదట తిరిగి సాధించినవారు అంగీరసులు అని పిలువబడే ఏడుగురు ఋషులు. వారే ప్రాచీన మానవ పితరులు. వారి ప్రభావం వల్ల, పాత్రత వల్ల ఆ సంఘటన మానవ అనుభవంలో మళ్లీ మళ్లీ ఆవృత్తం అవుతుంటుంది.

పై విశ్లేషణలో మనకి రెండు గాధలు ఎదురవుతున్నాయి. ఒకటి పోయిన సూర్యుణ్ణి యజ్ఞ కర్మ చేత, మంత్ర ప్రభావం చేత తిరిగి తెచ్చే గాధ. రెండవది మంత్రం చేత పోయిన గోవులని తిరిగి సాధించే గాధ. ఈ రెండు విజయాలని ఇంద్రుడు, అంగీరస ఋషులు కలిసి సాధించారు. ఆ రెండు గాధలు నిజానికి ఒక్కటే. గోవులకి, ఉషకి మధ్య సంబంధాన్ని చర్చించే సందర్భంలో ఈ రెండు గాధలకి మధ్య అభిన్నతని ముందే చాటాము. గోవులు ఉషా కిరణాలకి, సూర్య మయూఖాలకి ప్రతీకలు. అవి భౌతికమైన పశువులు కావు. పోయిన ఆవులు మాయమైపోయిన రవి కిరణాలు. వాటిని తిరిగి తెచ్చే ప్రయత్నం పోయిన సూర్యుణ్ణి తిరిగి ఆవిష్కరించే ప్రయత్నంలో మొదటి మెట్టు. అయితే ఇప్పుడు ఆ అభిన్నతని నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా వేదముఖంగా నిరూపించాలి.

గోవులే తేజస్సని, అవి దాచబడ్డ గోశాల కటిక చీకటి అని వేదం స్పష్టంగా చెప్తోంది. అంతకు ముందు ఉదహరించబడ్డ శ్లోకంలో (I.92.4), గోవుల యొక్క, గోశాల యొక్క ప్రతీకాత్మకత ప్రకటించబడింది - "ఒక గోశాల ద్వారాలు తెరిచినట్టు ఉష చీకటి తలుపులు తెరిచింది." అంతే కాదు. గోవులని రక్షించే ప్రతీకకి, కాంతిని కనుగొనే ప్రయత్నానికి మధ్య లంకె గురించిన ప్రస్తావన పదే పదే వస్తుంది (I.93.4). "మీరు ఇరువురు పణుల నుండి గోవులని దొంగలించారు... అయినా అందరి కోసం అనన్య కాంతిని సాధించారు." అలాగే మరో చోట (II.24.3) – "దేవతలలో అతి దివ్యుల కోసం సాధించాల్సిన కార్యమది. స్థిరమైన ప్రదేశాలు కూలదోయబడ్డాయి. ధృఢమైన స్థలాలు బలహీనమయ్యాయి. బృహస్పతి తన మంత్రాన్ని (బ్రహ్మణా) ప్రయోగించి గోవులని (కిరణాలని) పైకి తోలి, వలుణ్ణి వధించి, చీకటిని తప్పించి, స్వర్ ని ప్రత్యక్షం గావించాడు." అంతే కాదు. V.31.3. లో మరో విషయం కూడా చెప్పబడింది. "చీకటి క్రమ్ముకున్న గోశాలలోకి కౌశలంగా పాలు పితికే వారిని పంపాడు. కాంతిని ప్రసరించి సమస్తాన్ని ఆవరించిన చీకటిని భేదించాడు." ఇక వేదంలో ఋషులు అవలంబించిన శైలి గురించి ఏవైనా సందేహాలు ఉంటే, అటు ఆవుల నుండి ఇటు సూర్యుడి వద్దకి, ఇటు చీకటి నుండి అటు ద్రావిళ్ల గుహల లోకి, చెంగు చెంగున గంతులు వేసే అస్థిరమతులు ఋషులు అనే అభిప్రాయం ఎవరికైనా ఉంటే, ఈ శ్లోకం (I.33.10) ఆ అభిప్రాయాన్ని పటాపంచలు

చేస్తుంది. “వృషభుడైన ఇంద్రుడు వజ్రాయుధాన్ని తన సహచరుడిగా చేసుకున్నాడు.” అలాగే మరో చోట “దాన్ని ప్రయోగించి (యుజమ్) కాంతి సహాయంతో కిరణాలని (ఆవులని) చీకటి లోంచి పితికి వెలికి తెచ్చాడు.” ఇక్కడ వజ్రాయుధం ‘స్వర్య అశ్మా’ అని గుర్తుంచుకోవాలి. అందులో స్వర్లోకపు కాంతి నాటుకుని ఉంటుంది. అలాగే IV.51.2 లో పణుల ప్రసక్తి వస్తుంది. “వాళ్లు (ఉషస్సులు) కాంతి భళ్లున వెల్లుబికేలా చేస్తారు, పునీతం గావిస్తారు, గోశాల తలుపులు తెరిపిస్తారు, చీకటి ద్వారాలు తెరిపిస్తారు – *వ్రజస్య తమసో ద్వారా*. ఇన్ని ఆధారాలు కనిపిస్తున్నా గోవుల, పాణుల గాధని ఒక చారిత్రక గాధగా చిత్రించాలని ప్రయత్నిస్తే, వేదం చెప్పే సత్యాన్ని నిర్లక్ష్యం చేసి, వేరే అసంబద్ధమైన దృక్పథాన్ని బలవంతంగా చొప్పించినట్టు అవుతుంది. లేదంటే పణులు దాచిన మహోన్నతమైన ఐశ్వర్యం (*నిధిం పాణీనాం పరమం గుహా హితమ్* – II.24.6), కేవలం ఐహికమైన సంపద కాదని ఒప్పుకోవాలి. *పరుచ్ఛేప దైవోదసి* అన్నట్లు (I.130.3) అది “చీకటి గుహలో దాచబడ్డ సురలోకపు పెన్నిధి. అనంత శిలలో పసి పులుగులా, గోశాలలా దాగిన నిధి.” (*అవిన్దద్ దివో నిహితం గుహా నిధిం వెర్ న గర్భం పరివీతమ్ అశ్మని అనన్తే అన్తర్ అశ్మని, వ్రజం వజ్రీ గవాం ఇవ సిషాసన్*).

ఆ రెండు గాధల మధ్య అభిన్నతను తెలిపే శ్లోకాలు కోకొల్లలు. వాటిలో కొన్ని సామాన్యమైన వాటిని మాత్రమే ఇక్కడ ఉదహరిస్తాను. ఒక ఋక్కులో ఈ గాధను గురించి విపులమైన వర్ణన ఉంటుంది (I.62) – “ఓ ఇంద్రా! ఓ మహానుభావా! దశాగ్వులతో (అంగీరసులతో) కలిసి ఒక్క కేకతో వలుడిని చీల్చిచెండాడావు. సూర్యునితో ఉషస్సులని, సోమరసంతో గోవులని సాధించావు.” అలాగే మరో శ్లోకంలో (VI.17.3) – “ఋక్కులను అవధరించు, మంత్రాలతో వృద్ధి చెందు. సూర్యుని వ్యక్తం కానీ, అరిని లయం కానీ, ఓ ఇంద్రా! గోవులని వెలికి తీసుకురా!” ఇటువంటిదే మరో శ్లోకం (VII.98.6) – “రవినయనంతో చూసినప్పుడు నీ చుట్టూ కనిపించే గోసంపద అంతా నీదే. ఓ ఇంద్రా! గోవులకి నీవే స్వామివి” (గవామ్ అసి గోపతిర్ ఏక ఇంద్రా). సరమను, గోవులని ఉద్దేశించిన మరో ఋక్కులో (III.3.1.) ఇంద్రుడు ఎటువంటి గోవులకి స్వామిగా నున్నాడో తెలుస్తోంది – “విజయులు (ఉషస్సులు) ఆతని అనుసరించారు, చీకట్లో దాగిన మహత్తర కాంతిని తెలుసుకున్నారు. ఉషస్సులు పైకెగసి తనని చేరుకుంటున్నాయని తెలిసిన ఇంద్రుడు ఆవులకి ఏకైక విభుడు అయినాడు” (*పతిర్*

గవామ్ అభవద్ ఏక ఇంద్రః). ఆ ఋక్కు మరెన్నో సంగతులు తెలుపుతుంది. సత్య మార్గాన్ని అవలంబించిన సప్తర్షులైన అంగీరసులు గోవులని తమ కఠిన కారాగారం నుండి విడుదల చేశారని చెప్తుంది. ఎరిగిన సరమ కొండ గుహలోకి వచ్చింది, అక్షరమైన పశుసంజాతపు వాణిని తెలుసుకొంది. అలాగే ఉషస్సులకి, సువిస్తారమైన స్వర్లోకపు కాంతి యొక్క ఆవిష్కరణకి మధ్య సంబంధం కూడా అటువంటిదే (VII.90.4). "ఉషస్సులు పరిపూర్ణ కాంతిని భళ్లున వెలువరించాయి, వారు (అంగీరసులు) ధ్యానం చేత విశాల కాంతిని (ఉరు జ్యోతిః) కనుగొన్నారు; అపేక్ష గల వారు గోవుల బృహత్తును తెరిపించారు. వాటిపైన సురలోకపు జలాలు ప్రవహించాయి."

అదే విధంగా ఈ శ్లోకంలో II.19.3. పగళ్లు, సూర్యుడు, ఆవుల ప్రస్తావన వస్తుంది – "అతడి జననానికి సూర్యుణ్ణి తెచ్చాడు, ఆవులని కనుగొన్నాడు, చీకటి గుప్పెట లోంచి పగళ్లు బయటపడేలా చేశాడు." IV.1. లో కూడా పగళ్లు, ఆవులు ఒక్కటేననే సూచన కనిపిస్తోంది – "ఆ గోసాయిలకి కొండే గోశాల, బందీలుగా పడి వున్న మెరిసే జీవాలని వాళ్లు పైకి అదిలించారు, వారి పిలుపు విని ఉషస్సులు స్పందించాయి." లేదంటే ఇక్కడ ఉషస్సులు అంటే "మన మానవ పితరులు" అయిన అంగీరసులు అనుకోవాల్సి ఉంటుంది. ముందు శ్లోకంలో వారి ప్రస్తావన వస్తుంది. వారే గోవులని పైకి అదిలిస్తారు. VI.17.5. లో గోశాలని తెరిపించడం గురించి, సూర్యుని విడిపించడం గురించి వస్తుంది. "నీవు సూర్యుణ్ణి, ఉషని ప్రకాశించేలా చేశావు. మొండి ప్రదేశాలని భేదించావు. గోవులని కప్పి వుంచిన మహానగాన్ని పునాదుల వద్ద కదిలించావు." చివరిగా ఈ శ్లోకం (III.39) ఆ రెండు ప్రతీకల మధ్య అభిన్నతని వాటిని పేర్కొనే గాధల ఆధారంగా స్పష్టంగా చాటింది. "(పాణులకి చెందిన) గోవుల కోసం పోరాడిన వీరిని, ఈ పితరులని, మర్త్యులలో నిందించగలవారు (నా ఉద్దేశంలో ఇక్కడ 'నిరోధించగలవారు' అని ఉంటే బావుంటుంది) ఎవరూ లేరు. మహిమాన్వితుడైన ఇంద్రుడు, కర్మలకి రాజైన ఇంద్రుడు వారి కోసం బలంగా మూయబడ్డ గోశాలలని తెరిపించాడు. స్నేహితుడితో స్నేహితులైన నవాగ్వులు తమ మోకాళ్ల మీద గోవులని వెన్నంటుతూ ఉంటే, పదుగురైన దశాగ్వులతో పాటు ఇంద్రుడు చీకట్లో దాగిన అసలైన సూర్యుణ్ణి (లేదా సత్యాన్ని) కనుగొన్నాడు." ఇక్కడ వర్ణన చాలా స్పష్టంగా వుంది. ఇక్కడ

ఆవులు అంటే పణుల నుండి విడిపించబడ్డ ఆవులు. అంగీరసులు కొండగుహలో తమ మోకాళ్ల మీద పాకుతూ వెళ్లి పట్టి తెచ్చిన ఆవులు. వాటిని కనుక్కున్న వారు ఇంద్రుడు, అంగీరసులు. వారినే ఇతర ఋక్కులలో నవాగ్వులని, దశాగ్వులని కూడా అంటారు. కొండ గుహలో దాచబడ్డ పణుల గోశాలలలోకి చొరబడి సాధించబడినది, ఆర్యులు దొంగలించిన సిరి కాదు - అది “చీకట్లో దాగిన సూర్యుడు.”

కాబట్టి ఒక్కటి మాత్రం సుస్పష్టం. వేదం వర్ణించిన గోవులు, పాణులు దొంగలించిన గోవులు, వారిని వెంటాడి, వారితో పోరాడి ఋషులు తిరిగి సాధించిన గోవులు, యజ్ఞం చేసి మంత్రం జపించి జయించబడ్డ గోవులు, ఎగసిపడే అగ్నికీల చేత, దివ్యత్వాన్ని పెంచే మంత్రాక్షరం చేత, దైవోన్మత్తత కలిగించే సోమరసం చేత సాధించబడ్డ గోవులు – ఈ గోవులన్నీ తేజానికి ప్రతీకలే. వీటికి సంబంధించిన ఆంతరిక అర్థాన్ని సూచించే మరి కొన్ని వైదిక పదాలని (గో, ఉస్రా, ఉస్రియా) తీసుకుంటే వాటి అర్థం విరాజితాలు, ప్రకాశాలు, సూర్యుని పశుసంజాతాలు, ఉషస్సు యొక్క తేజోరూపాలు అని అనువదించవలసి వస్తుంది. ఈ నిష్కర్షతో వేదాన్వయం యొక్క ఒక మూలస్తంభాన్ని స్థిరపరచడానికి వీలయ్యింది. స్థూలప్రకృతిని పూజించే కిరాత రచన స్థాయి నుండి వేదాన్ని ఉద్ధరించి ఓ పవిత్ర, ప్రతీకాత్మక కావ్యంగా ప్రకటించడానికి వీలయ్యింది. ఆ కావ్యం సూర్యారాధనని, సూర్యోదయారాధనని తెలుపుతోంది. అంతర్జ్యోతిని, మన అజ్ఞాన కుహరంలో దాగిన సూర్యుణ్ణి, ఆ నిజమైన సూర్యుణ్ణి (సత్యం సూర్యమ్) ప్రకటిస్తోంది. పులుగు పసిగుడ్డులా, దివ్య హంసలా, భౌతిక ప్రపంచమనే అనంత శిలలో (అనంతే అంతర్ అశ్మని) దాగిన సూర్యుణ్ణి ఆరాధించే సాంప్రదాయాన్ని బోధిస్తోంది.

ఈ అధ్యాయంలో ఇంతవరకు చీకట్లో దాగిన సూర్యుడి కిరణాలే గోవులు అనే భావనని సమర్థించే ఆధారాలనే ఏకమనస్కంగా శోధిస్తూ వచ్చాను. ఆ ఆవులకి సత్య తేజానికి, జ్ఞానభానుడికి మధ్య సంబంధం అంతకు ముందే చెప్పుకోబడ్డ ఒకటి రెండు శ్లోకాలలో తేటతెల్లం అయ్యింది. అయితే అలా చెదురు మొదురు శ్లోకాల కన్నా, అంగీరసుల ఋక్కులని సమగ్రంగా అధ్యయనం చేస్తే, ఆ సంబంధం యొక్క పూర్ణ స్వరూపం కనిపిస్తుంది. చూచాయగా కనిపించే స్పష్టంగా దర్శనమిస్తుంది. అందుకోసం మనం అంగీరస

ఋషులని మరి కాస్త క్షుణ్ణంగా పరిశీలించాలి. అంతేకాక గుహలలో గుహ్యంగా వసిస్తూ, అంధకారానికి బంధువులై బతుకుతూ, మెరిసే పసులని తమ గుప్పెట్లో దాచుకునే ఆ విచిత్ర జీవులని, - పణులని – కూడా మరింత లోతుగా అర్థం చేసుకోవాలి.

అధ్యాయం 16

అంగిరస ఋషులు

వేదంలో అంగిరస్ అన్న శబ్దం రెండు రూపాల్లో వస్తుంది – మొదటిది అంగిర, రెండవది అంగిరస్. అయితే అంగిరస్ అనేది మరింత తరచుగా కనిపిస్తుంది. అంతేకాక పితృనామక శబ్దమైన అంగిరస అనే శబ్దం వేదంలో పలు మార్లు బృహస్పతిని సూచించడానికి వాడబడింది. కాలాంతరంలో భృగు తదితర అంగిరస ఋషులని ఒక ప్రత్యేక ఋషి కూటమికి ఆది ఋషులుగా పరిగణించడం జరిగింది. ఆ కూటమికి అంగిరస ఋషులు పితృదేవులతో సమానం. ఆ కూటమినే అంగిరసులు అంటారు. అదే విధంగా అత్రి మహర్షి పేరును స్వీకరించిన ఋషి కూటమిని అత్రులు అంటారు, భార్గవ ఋషికి చెందిన కూటమిని భార్గవులు అంటారు. వేదంలో ఆ విధంగా అత్రులు, భృగులు, కణ్వులు ఇలా పలు ఋషి కూటములు ఉన్నాయి. అగ్నిని స్తుతించే ఒక అత్రి సూక్తాన్ని నిజానికి అంగిరస ఋషులు

రచించారని అంటారు (V.11.6). మరో శ్లోకాన్ని భృగులకి ఆపాదిస్తారు (X.46.9)[14]. మొట్టమొదటి అంగిరస ఋషులని మానవ పితరులుగా (*పితరో మనుష్యాః*) తరచు వర్ణిస్తారు. వాళ్లు కాంతిని కనుగొన్నారు, సూర్యుణ్ణి ప్రకాశింపజేశారు, సత్యలోకానికి ఆరోహించారు. పదవ మండలానికి చెందిన కొన్ని సూక్తాలలో వారిని యముడితో అనుసంధానమై ఉన్న కొందరు దేవతామూర్తులుగా వర్ణించారు. ఆ మండలంలో యముడు తదుపరి సూక్తాలలో మాత్రమే ప్రధానంగా కనిపిస్తాడు. బర్హిస్ అనబడే పవిత్ర దర్భల మీద ఆసీనులై వారి దేవతలతో సమానంగా యజ్ఞఫలాన్ని స్వీకరిస్తారు.

అంగిరస ఋషుల ప్రాధాన్యత అక్కడితో ఆగిపోతే, గోవులని కనుగొనడంతో వారి కర్తవ్యం తీరిపోతే, సమస్య అంత జటిలం కాకపోవును. కాని వాళ్లు మహత్తర పూర్వీకులు, వైదిక సాంప్రదాయానికి సంస్థాపకులు. వారి వంశజులు వారి దివ్యత్వాన్ని చాటారు. దీర్ఘకాలిక ఆర్కిటిక్ రాత్రి లోనుండి ఉషను, సూర్యుణ్ణి బయటి తెచ్చే ప్రయత్నంలో నైతేనేమి, కాంతిని సత్యాన్ని సాధించే ప్రయత్నంలో నైతేనేమి అంగిరసుల పేర్లు దేవతల పేర్లతో సదా అనుసంధానమై ఉంటాయి. అంతేకాక అంగిరసుల గాధలో మరిన్ని లోతైన అంశాలు కొన్ని ఉన్నాయి. అంగిరసులు కేవలం దివ్యులైన మానవ పితరులు మాత్రమే కాదు. సుర లోకపు ఋషులుగా, సురసుతులుగా, అసుర శక్తులుగా, వీరులుగా, మహా ప్రభువుగా (*దివస్ పుత్రాసో అసురస్య వీరాః* – III.53.7) మన ముందుకు వస్తారు. అంగిరసులు ఏడుగురు కనుక ఇరాన్ పౌరాణిక సాంప్రదాయంలో అహురా మజ్దా తో అనుసంధానమైన ఏడుగురు దేవతలకి వీరికి మధ్య పోలిక సహజంగా కనిపిస్తుంది. ఇక మరి కొన్ని చోట్ల అయితే వారు పూర్తిగా ప్రతీకాత్మకంగా గోచరిస్తారు. ఆది అంగిరసులైన అగ్నిపుత్రులుగా, అగ్నిశక్తులుగా, ప్రతీకాత్మక కాంతి యొక్క, జ్వాల యొక్క శక్తులుగా వ్యక్తమవుతారు. ఇక మరి కొన్ని చోట్ల ఆ ఏడుగురూ ఏకమై సప్తముఖ అంగిరసుడిగా, తన తొమ్మిది లేదా పది కిరణాలతో (*నవగ్వే అంగిరే దశగ్వే సప్తాశ్యే*) దర్శనమిస్తాడు. ఆతని వల్లనే ఉష తన సంపూర్ణ ఆనందంతో,

[14] అంగిరస ఋషులని అగ్ని యొక్క జ్వాలాశక్తులని, భృగులని సూర్యుడి యొక్క సౌరశక్తులని అనుకోవచ్చు.

ఐశ్వర్యంతో పరిఢవిల్లుతుంది. అయితే ఇవన్నీ కూడా ఒకే అంగిరస కూటమి యొక్క వ్యక్తరూపాలే. లక్షణంలో, కర్మలో వారి మధ్య అభిన్నత స్పష్టంగా కనిపిస్తుంది.

ఒక పక్క దైవికంగా, మరొక పక్క మానవీయంగా కనిపించే ఈ ఋషుల యొక్క ద్విముఖ స్వభావానికి రెండు పరస్పర విరుద్ధమైన వివరణలు ఇవ్వడానికి వీలవుతుంది. వారు ఆదిలో మానవ ఋషులే అయ్యుండొచ్చు. కాలంతరంలో వారి వంశజులు వారిని దైవసమానులుగా కొలిచి, వారికి ఒక దివ్యమైన పితృత్వాన్ని, దివ్యమైన ప్రయోజనాన్ని ఆపాదించి ఉండొచ్చు. లేదా వాళ్లు మొదట్లో దైవాంశసంభూతులై ఉండొచ్చు, తేజం యొక్క, జ్వాల యొక్క విభూతులు అయ్యుండొచ్చు. కాలాంతరంలో వారిని మానవజాతికి పితరులుగా, సమస్త జ్ఞానానికి ఆవిష్కర్తలుగా కొలిచి మానవీకరించి ఉండొచ్చు. ఆదిమ పౌరాణిక సాంప్రదాయాలలో ఈ రెండు రకాల ప్రక్రియలకి ఆనవాళ్లు కనిపిస్తాయి. ఉదాహరణకి గ్రీకు పురాణంలో కాస్టర్, మరియు పాలిడ్యూసస్ లు, వారి సోదరి హెలెన్ – జూస్ దేవుడి పిల్లలైనా ముగ్గురూ మనవమాత్రులే. మరణానంతరమే వాళ్లు దైవికమైన హోదాని పొందుతారు. కాని వాస్తవానికి మొదట్లో ముగ్గురూ దేవతలే అయ్యుండొచ్చు. కాస్టర్ మరియు పాలీడ్యూసస్ లు కవలలు. అశ్వారూఢులు సముద్ర యానం చేసే నావికులకి సంరక్షకులు. వైదిక అశ్వినులకి వారికి మధ్య చాలా సాన్నిహిత్యం వుంది. అశ్వినులు కూడా వారి పేరు సూచించినట్లు అశ్వారూఢులే. ఒక చక్కని రథం వారి వాహనం. వారు కూడా కవలలే. సముద్రం నుండి భుజ్యుని రక్షిస్తారు. విశాల సముద్రాలని దాటించే తారకులు. ఉషకి సోదరులు. గ్రీకు దేవత హెలెన్ ఉష ఇద్దరూ ఒక్కరే కావచ్చు. వీరికి, దేవలోకపు శునకం అయిన సరమ కి మధ్య కూడా అభిన్నత ఉండచ్చు. వీరికి మళ్లె దక్షిణా దేవి కూడా ఉషకి ప్రతిరూపం కావచ్చు. రెండు కూటములలోను ఈ దేవతలకి గాని, లేదా దైవాంశసంభూతులకి గాని ఒక దశలో కొన్ని అధ్యాత్మిక క్రియలు ఆపాదించబడి ఉండొచ్చు. అలాంటి విధానాన్ని వినియోగించి బహుశా గ్రీకుల మతం ఉషతో సమానురాలైన ఏథీన్ ని జ్ఞానదేవత గాను, సూర్యుడితో సమానుడైన అపోలోని దివ్య గాయకుడిగాను, కవి గాను, కవితా స్ఫూర్తికి, భవిష్యద్ జ్ఞానానికి అధిష్టాన దేవతగాను మార్చి ఉండొచ్చు.

గ్రీకు పురాణంతో పోల్చితే వైదిక సాంప్రదాయంలో మరో ధోరణి కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది – అది అన్నిటినీ ప్రతీకాత్మకంగా వ్యక్తం చేసే ధోరణి. అలనాటి ఋషుల ఆలోచనా సరళిలో ఆ తత్వం ప్రధానంగా ఉండేది కాబోలు. వారి సొంత పేర్లు, రాజుల పేర్లు, యాజ్ఞికుల పేర్లు, సాధారణ జీవన ఘట్టాలు, - ఇలా అన్నిటినీ ప్రతీకలుగా మార్చి, వాటిలో దాగి వున్న ఏదో రహస్య అర్థాన్ని వెలికి తీయడం వారికి అలవాటు. కిరణం మరియు ఆవు అని రెండు అర్థాలు గల గో అనే శబ్దం యొక్క ద్వంద్వార్థాన్ని వారు వాడుకున్న తీరును చూశాము. గ్రామీణ జీవనంలో ప్రధానమైన ఐశ్వర్య చిహ్నామైన ఆవుని, దేవతల నుండి వారు కోరుకునే ప్రధాన అధ్యాత్మిక ఐశ్వర్యానికి చిహ్నంగా ఎలా వాడుకున్నారో చూశాము. అలాగే వారి పేర్లని కూడా వారి హోదాని గాని, అధ్యాత్మిక స్థితిని గాని తెలిపే పదాలుగా వాడుకున్నారు. ఉదాహరణకి గౌతమ అనే పేరుకి అర్థం 'అత్యంతమైన ప్రకాశం గలవాడు'. *గవిష్ఠిర* అంటే 'తేజంలో స్థిరంగా నాటుకుని ఉండేవాడు' అని అర్థం. అలాగే బాహ్య అనుభవాలని, అంతరంగ అనుభవాలని, తమ సొంత అనుభవాలని, ఇతర ఋషుల అనుభవాలని కూడా ప్రతీకాత్మకంగా వ్యక్తీకరించారు. ఉదాహరణకి శునశ్శేపుడి గాథలో యజ్ఞ సమయంలో శునశ్శేపుణ్ణి బలిపీఠం మీద కట్టేసినట్టు కథ నడుస్తుంది. అయితే ఋగ్వేదం ఆ గాథని ప్రతీకాత్మకంగా వాడుతుంది. మూడు పాయలు గల పాపపు పాశం చేత కట్టబడి ఆత్మ బందీగా ఉంటుందని, అగ్ని, సూర్య, వరుణుల దైవీశక్తుల కలయిక చేత ఆ ఆత్మకి విముక్తి పొందుతుందని ప్రతీకాత్మకంగా వేదం ఆ కథలోని అంతరార్థాన్ని బోధిస్తుంది. కుత్స, కణ్వ, ఉషనస్ కావ్య తదితర ఋషివర్యుల పేర్లన్నీ కొన్ని ప్రత్యేక అధ్యాత్మిక అనుభవాలని, విజయాలని సూచించే సార్థకనామాలై, తాహతులో దేవతలకి తులతూగేలా చేశాయి. ఈ రకమైన అధ్యాత్మిక ప్రతీకాత్మకత వల్లనే ఏడుగురు అంగిరస ఋషులు ఒక పక్క తమ చారిత్రక, మానవీయ లక్షణాన్ని పోగొట్టుకోకుండానే, మరో పక్క దివ్యశక్తులుగా, అధ్యాత్మిక జీవన ప్రతినిధులుగా నిలిచారు. ఇప్పుడు అంగిరసుల వ్యక్తిత్వానికి చెందిన ఈ మూడు అంశాలని, అంటే ఈ మూడు ప్రతీకలని – గోవులనే ప్రతీక, చీకట్లో దాగిన సూర్యుడు, ఉషస్సు అనే ప్రతీకలు – క్షుణ్ణంగా పరిశీలిద్దాము.

వేదంలో అంగిరస శబ్దాన్ని మొట్టమొదట, ఉష, గోవులకి సంబంధించిన ప్రతీకని వివరించడం కోసం ఒక విశేషణంగా వాడారు. తరువాత ఆ శబ్దం అగ్ని యొక్క పేర్లలో ఒకటిగా పరిచయం అవుతుంది. ఇంద్రుడు అంగిరస్ అయినట్టు చెప్పబడుతుంది. బృహస్పతి అంగిరస్ అని, అంగిరస అని పిలవడం జరుగుతుంది. ఇది కేవలం అలంకారం కోసమో, పౌరాణిక నామంగానో వాడిన పేరు కాదు. ఆ పేరు వెనుక ఒక లోతైన అధ్యాత్మిక అంతరార్థం వుంది. అశ్వినులని కూడా సామూహికంగా అంగిరసులుగా ప్రస్తావించడం జరుగుతుంది. కాబట్టి వేదంలో అంగిరస శబ్దం కేవలం ఒక ఋషి వంశాన్ని సూచించడమే కాక, ఒక అధ్యాత్మిక భావనని కూడా సూచిస్తోంది. దాన్నొక పేరుగా ప్రయోగించినప్పుడు కూడా ఆ పేరు లోని అంతరార్థం యొక్క గుర్తింపుతోనే ఆ పేరును వాడడం జరుగుతుంది. అసలు వేదంలో ఎక్కడ పేర్లు వాడడం జరిగినా, ముఖ్యంగా దేవతల, ఋషుల, రాజుల పేర్ల విషయంలో, ఆ పేర్ల యొక్క అంతరార్థాన్ని గుర్తించి ఆ అవగాహనతోనే ఆ పేర్లని వాడుతున్నట్టు కనిపిస్తుంది. ఇంద్ర శబ్దాన్ని తరచు ఒక పేరుగా వాడినా, వైదిక పద్ధతిని తెలిపే ఎన్నో తార్కాణాలు కనిపిస్తాయి. ఉదాహరణకి ఉషని "*ఇంద్రతమా, అంగిరస్తమా*" అంటారు. అంటే "ఇంద్ర పూర్ణమైన," "అంగిరస పూర్ణమైన" అని అర్థం చేసుకోవాలి. అలాగే పణులని "*అనింద్రాః*" అంటారు. అంటే "ఇంద్రుడు కాని" వారని అర్థం. ఈ పదజాలం ఇంద్ర, అంగిరసులకి స్వాభావికమైన లక్షణాలు కలిగిన, లేక లేని స్థితులని సూచిస్తున్నాయి. ఇలాంటి అవగాహనని ఆధారంగా చేసుకుని అంగిరసుల స్వభావం గురించి, క్రియల గురించి ఎంత వరకు అర్థం చేసుకోగలమో చూద్దాము.

అంగిరస అన్న పదం అగ్ని అన్న పదానికి సన్నిహితమైనది. ఎందుకంటే రెండూ అంగ్ అనే మూలశబ్దం నుండి ఉత్పన్నం అయ్యాయి. ఈ అంగ్ అనే శబ్దం అగ్ అనే పదానికి నాసీకృత రూపం. ఈ రెండు శబ్దాలు శక్తివంతమైన స్థితిని, మనోస్థితిని, చలనాన్ని, క్రియని, కాంతిని[15] సూచిస్తాయి. వీటిలో ఆఖరుదైన ప్రకాశవంతమైన, ఉజ్వలమైన తేజం అనే భావన నుండి అగ్ని (అగ్ని), అంగతి (అగ్ని), అంగార (మండే నిప్పుకణిక), అంగిరస్ (మెరిసే, జ్వలించే)

---

[15] స్థితి అన్న అర్థం కోసం అగ్ర (అంటే మొదటిది, పైనున్నది) అనే పదాన్ని తీసుకోవచ్చు. ఇలాంటిదే ఒక గ్రీకు పదం (అగన్ అంటే అతిగా) కూడా వుంది. తలపు కోసం గ్రీకు పదం అగపే ని (అంటే ప్రేమ), అలాగే సంస్కృత పదం అంగన (అంటే స్త్రీ) ని తీసుకోవచ్చు; చలనం, చర్య అనే అర్థం గల పదాలని సంస్కృతంలో, గ్రీకు, లాటిన్ భాషల్లో ఎన్నిటినో ఎంచుకోవచ్చు.

అనే పదాలు పుట్టాయి. వేదంలోనే కాక బ్రాహ్మణాల సాంప్రదాయంలో కూడా అంగిరసుల మూలం అగ్నితో లోతుగా ముడివడి ఉంది. బ్రాహ్మణాలలో కూడా అగ్ని అంటే మంట అని, అంగిరసులు అంటే మండే నిప్పు కణికలు (అంగారాః) అని చెప్పబడింది. వేదంలో కూడా వాళ్లు అగ్ని యొక్క కీలలని, మెరుపులనే భావన ధ్వనిస్తుంది. X.62 లో అంగిరస ఋషులని ఉద్దేశించిన ఒక ఋక్కులో, వాళ్లు అగ్ని పుత్రులని, వివిధ రూపాలలో స్వర్గం అంతటా వాళ్లు జన్మించారని చెప్పబడింది. కాని వెంటనే తదుపరి వాక్యంలో వారందరినీ ఏకవచనంలో ఇలా సంబోధించడం జరుగుతుంది – "*నవగ్వో ను దశగ్వో అఙ్గిరస్తమో సచా దేవేషు మంహతే*" అంటే నవకిరణయుతమై, దశకిరణయుతమై, "అత్యంత అంగిరసమైన" ఈ అంగిరస వంశపు వారు దేవతలతో సంపూర్ణంగా వెలుగొందుతారు. ఇంద్రుని సహాయంతో వారు ఆవులని, అశ్వాలని వాటి పశుశాల నుండి విడిపిస్తారు. యాజ్ఞికుడికి వారు ఎనిమిది చెవులు గల సంతతిని ప్రసాదిస్తారు. ఆ విధంగా వారు దేవతలలో శ్రవస్ లేదా దివ్యమైన శ్రవణ శక్తిని, సత్యం వద్దకి గొనిపోయే అభినివేశాన్ని కలుగజేస్తారు. స్వర్గానికి చెందిన దివ్యాగ్ని యొక్క మహోజ్వల కీలలే అంగిరస ఋషులు అని దీన్ని బట్టి మనకి అర్థమవుతోంది. వారు తొమ్మిది కిరణాలు కలిగి, అటుపై పది కిరణాలు కలిగి, అత్యంత "అంగిరసు"లవుతారు. అంటే దివ్యాగ్ని యొక్క ప్రచండ తేజోవిలాసాన్ని వ్యక్తం చేస్తారు. ఆ విధంగా వారు నిర్బంధితమైన కాంతిని, శక్తిని విడుదల చేసి అతిమానస జ్ఞానాన్ని సృష్టిస్తారు.

ఈ రకమైన ప్రతీకాత్మక అన్వయాన్ని ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, అసలు ప్రతీకాత్మకత అంటూ ఉందని మాత్రం ఒప్పుకోవాలి. ఈ అంగిరసులు మానవ యాజ్ఞికులు కారు. వారు స్వర్గానికి చెందిన అగ్ని పుత్రులు. అయితే వారి ప్రభావం మాత్రం పితరులైన మానవ అంగిరసులకి సంబంధించినది, *పితరో మనుష్యాః*. వారు పలు రూపాలలో జన్మిస్తారు, *విరూపాసః*. దీన్ని బట్టి వారంతా అగ్నిబలం యొక్క వివిధ రూపాలేనని అర్థమవుతుంది. అయితే ఇంతకీ ఏమిటా అగ్ని అన్న ప్రశ్న వస్తుంది. అది ప్రత్యేకించి యజ్ఞంలో రగిలే అగ్నా, లేక సాధారణ అగ్నా, లేక మరేదో పవిత్రమైన అగ్నా అన్నది తేల్చుకోవాలి. ఆ పవిత్రాగ్నినేనా వేదం "దివ్య సంకల్పం గల హోత" అని వర్ణిస్తుంది? ఆ

విమలాగ్ని నేనా వేదం "కవిలా సత్యవంతమైన కర్మలు చేస్తూ ప్రవిమల తరళ స్ఫూర్తితో వెలిగేవాడు" (*అగ్ని ర్ హోతా కవిక్రతుః సత్యశ్ చిత్రశ్రవస్తమః*) అని కొనియాడుతుంది? అది అగ్నితత్వమే ననుకుంటే, దాని ప్రచండ కాంతి సూర్యుడికి చెందినదే అయ్యుండాలి. ఆ సూర్యుడి కిరణాలే దిశదిశలా ప్రసరిస్తూ ఇంద్రుడనే ఆకాశంతో కలిసి ఉషస్సుని కలుగజేస్తాయి. అంగిరస గాధకి చెందిన వివరాలని, పరిస్థితులని పరిశీలిస్తే దానికి మరే విధమైన అన్వయమూ సాధ్యం కాదు. అయితే అంగిరస ఋషులకి మరో ముఖం కూడా వుంది. వారు ద్రష్టలు, వేద మంత్ర గాయకులు. సూర్యుడికి, ఉషకి మాత్రమే కాక బృహస్పతికి కూడా చెందిన శక్తులు వారు.

వేదంలో మరో చోట (VI.6.3-5) దివ్యమైన అంగిరసులకి, అగ్ని యొక్క మహోజ్వల కీలలకి మధ్య అభిన్నత చాలా స్పష్టంగా చాటబడింది. "సర్వత్ర వ్యాపించిన ఓ విమల తరళ అగ్నిదేవా! పవనాల చేత చోదించబడ్డ నీ ప్రవిమల తేజం విస్తరించనీ! దివ్యమైన నవకిరణాలని (*దివ్యా నవాగ్వాః*) బలవంతంగా అధిగమించి వనాలని[16] భోగించి (*వనా వనంతి),* అంటే 'ఐహిక వస్తు సంజాతాన్ని అమితంగా ఆనందించు' అనే అంతరార్ధం ఇక్కడ స్ఫురిస్తోంది) వాటిని తీవ్రంగా ఛిన్నాభిన్నం చేయి. ఓ విమల తేజోమయా! ప్రచండమై, ప్రవిమలమై అవి అవనిని అధిగమిస్తాయి[17], నీ అశ్వాలు దిశదిశలా దౌడు తీస్తాయి. నీ సంచారం బృహత్తరంగా భాసిస్తూ పలు వన్నెలు గల (పృష్ణి అనే ఆవు, ఆమె మరుత్తుల తల్లి) ఆ ఉన్నత స్థాయి దిశగా వాటిని చోదిస్తుంది. (దివిలోను భువిలోను) ద్వివిధముగా నీ కీల ఎగసిపడుతుంది, గోవుల కోసం యుద్ధం చేసే వృషభం నుండి వెలువడే మెరుపులా దూసుకుపోతోంది." ఋషులకి అగ్ని కీలలకి మధ్య ఏకత్వాన్ని ఎందుకనో సాయణుడు త్రోసిపుచ్చుతున్నట్టు కనిపిస్తుంది. అందుకే 'నవాగ్వ' అంటే 'నవజాతమైన కిరణాలు' అని అన్వయిస్తాడు. కాని మరి ఇక్కడ '*దివ్యా నవాగ్వాః*' అన్నా, (X.62) లో స్వర్గంలో పుట్టిన అగ్ని పుత్రులు అన్నా ఇరువురూ ఒక్కరేనని స్పష్టంగా తెలుస్తోంది. దీనికి నిర్ధారణ కావాలంటే మారో వాక్యాన్ని తీసుకోవచ్చు. నవాగ్వుల ప్రభావంలో కనిపించే అగ్ని చర్య

[16] సాయణుడి ప్రకారం ఇవి యజ్ఞంలో వాడే కట్టెపుల్లలు.

[17] సాయణుడి ప్రకారం దీని అర్థం పుడమి జుట్టు గొరగడం.

ఇంద్రుడి వజ్రాయుధంలా ఉంటుందని ఒక చోట చెప్పబడింది. గోవుల కోసం యుద్ధం చేసే వృషభుడి నుండి పుట్టే మెరుపుల్లా ఉంటుంది. ఆ అగ్నికీలలు స్వర్గమనే పర్వత గర్భంలో దాగిన చీకటి శక్తులపై దాడి చేసి జయిస్తాయి. అగ్ని యొక్క, నవాగ్వుల యొక్క పురోగమనం ఇక్కడ పర్వతారోహణలా (*సాను పృశ్నేః*), ధరావ్యాప్త సంచారంలా వర్ణించబడింది.

ఇక్కడ జ్వాల, కాంతి అనే ప్రతీకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దివ్యాగ్ని కీలలు ముందు ధరాతలాన్ని క్రమ్ముకుని, అటుపై సురలోకపు తటిల్లతలుగా మారి, అద్భుత సౌరశక్తులుగా పరిణమిస్తాయి. వేదంలో అగ్ని అంటే సూర్య కాంతి మాత్రమే కాదు, అది జలాలలో దాగిన జ్వాల, భూమిపై వెలసిన వెలుగు. అగ్నిబలాలకి ప్రతిరూపాలైన అంగిరస ఋషులు ఈ అనేకవిధాలైన క్రియలని నిర్వర్తిస్తారు. యజ్ఞసమయంలో రాజేయబడ్డ దివ్యాగ్ని అక్కడ సురలోకంలో ఇంద్రుడికి తన మెరుపు శస్త్రానికి కావలసిన పదార్థాన్ని, దివ్య శిలని (*స్వర్య అశ్మా*) ప్రసాదిస్తుంది. ఆ ఆయుధంతో ఇంద్రుడు చీకటి శక్తులని నిర్జించి గోవులని జయించి, సౌర కాంతులని ప్రభవింపజేస్తాడు.

ఈ దివ్యాగ్ని కీలలకి మూలమైన అగ్ని, అంగిరసులకి పితరుడు మాత్రమే కాదు. వేదం అతణ్ణి అంగిరసులలో ప్రథముడుగా, ఆదిపురుషుడిగా కొనియాడుతుంది – *ప్రథమో అంగిరాః*. ఈ వర్ణన బట్టి వైదిక కవులు మనకు ఏం తెలుపుతున్నారు? భగభగ రగిలే ఆ వేలుపుని వర్ణించే ఈ నామధేయాలని అర్థం చేసుకోవాలంటే వేదంలోని కొన్ని శ్లోకాలని గమనించాలి. మొదటి విషయం ఏంటంటే ఈ నామధేయం "శక్తిపుత్రుడు" అనే అగ్ని యొక్క మరో స్థిర నామధేయంతో జోడింపబడుతుంది - "*సహసః సూనుః, ఊర్జో నపాత్*." VIII.60.2 అగ్నిని ఉద్దేశించి ఇలా అంటుంది – "ఓ అంగిరసుడా! శక్తి పుత్రుడా!" (*సహసః సూనో అంగిరః*). అలాగే VIII.84.4 లో – "ఓ అగ్ని అంగిరసుడా! శక్తిపుత్రుడా!" – *అగ్నే అంగిరా ఊర్జో నపాత్*. అలాగే V.11.6 లో "ఓ అగ్నీ! ప్రతీ వనాన్ని (*వనే వనే*) వెదికి ఒక రహస్య ప్రదేశంలో (*గుహా హితం*) దాగిన నిన్ను అంగిరసులు కనుగొన్నారు." '*వనా వనంతి*' అనే పదాలలో దాగిన గూడార్థాన్ని అంతకు ముందే గుర్తించాము. ఆ పదాలని "ప్రతీ భోగ వస్తువులోను" అని

అన్వయించుకోవచ్చు. "నీవు మథనం లోంచి పుట్టిన మహాశక్తివి. ఓ అంగిరసుడా! ఎరిగినవారు నిన్ను శక్తిపుత్రుడు అంటారు." – "*స జాయసే సహో మహత్ త్వామ్ ఆహుః సహసస్ పుత్రం అంగిరాః.*" అంగిరస అనే పదం పట్ల వైదిక అవగాహనలో శక్తి అన్న భావన ప్రధానంగా స్ఫురిస్తుంది. స్థితిలో, క్రియలో, గమనంలో, తేజంలో, అనుభూతిలో శక్తిని కలిగి ఉండడం అనేది అంగిరస పదంలోని మూల లక్షణం. అగ్, మరియు అంగ్ అనే మూలశబ్దాల నుండి అగ్ని మరియు అంగిరః అనే పదాలు ఎలా వచ్చిందీ అంతకు ముందు చెప్పుకున్నాం. ఈ పదాలలో శక్తి మాత్రమే కాక తేజం కూడా స్ఫురిస్తుంది. కాబట్టి అంగిరసులు రగిలే కాంతిశక్తులు.

అయితే ఇంతకీ ఏమిటా కాంతి? అది భౌతికమా, లేక ప్రతీకాత్మకమా? భౌతిక కాంతిని మానసిక, అధ్యాత్మిక ప్రకశానికి ప్రతీకగా వాడే సాంప్రదాయం అన్ని భాషల్లో సర్వసామాన్యంగా కనిపిస్తుంది. కాబట్టి ఆ పాటి ప్రతీకాత్మక చింతన వేద కవులకి సాధ్యం కాదని అనుకోవడం పొరబాటే అవుతుంది. వేదం "తేజోమయులైన ఋషుల" (*ద్యుమంతో విప్రాః*) గురించి మాట్లాడుతుంది. ద్రష్టని సూచించే '*సూరి*' అన్న పదానికి శబ్ద వ్యుత్పత్తి ప్రకారం సూర్యుడితో సంబంధం వుంది. I.31.1.లో అగ్ని దేవుడి గురించి ఇలా చెప్పబడింది – "ఓ అగ్నీ! నీవు అంగిరసులలో ప్రథముడివి. నీవు ద్రష్టవు. విమల హితుడవు. దేవతలలో దేవుడవు. నీ శ్రమ లోంచి మెరిసే బరిసెలు గల మరుత్తులు జన్మిస్తారు. జ్ఞానంతో పని చేసే ద్రష్టలు వారు." కాబట్టి అగ్ని అంగిరసులు అనే భావనలో రెండు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి – ఒకటి జ్ఞానం, రెండవది చర్య. విరాజమానుడైన అగ్ని, విరాజమానులైన అంగిరసులు జ్ఞానాన్ని పొడచూడగల ద్రష్టలు (*ఋషి, కవి*); ఆ జ్ఞాన తేజం సహాయం చేత మహోగ్రులైన మరుత్తులు పనిచేస్తారు. ఎందుకంటే వాళ్లు అగ్ని యొక్క స్వాభావిక వృత్తి (*వ్రత*) లోంచి అభివ్యక్తం అవుతారు. మరి అగ్నికి దర్శన శక్తితో కూడుకున్న సంకల్పం (*కవిక్రతుః*) ఉంటుందని అంతకు ముందే గుర్తించాము. ఆ చర్య అతిమానస జ్ఞానం (*శ్రవస్*) అనుసారం పని చేస్తుంది. ఎందుకంటే 'కవి' అంటే ఆ అతిమానస జ్ఞానం అని అర్థం, కేవలం మేధోజన్య జ్ఞానం కాదు. మరైతే అగ్ని అంగిరస అనే ఆ మహత్తర శక్తి (*సహో మహత్*) ఇంతకీ ఏమిటి? అది తేజం, బలం సమరసమై పని చేసే ఆ మహోజ్వలమైన దివ్యచైతన్యం. జ్ఞానం చేత పని చేస్తారు అనే మరుత్తుల వర్ణన (*కవయో విద్మనా అపసః*) కూడా పై వివరణతో

సరిపోతోంది. అలాగే ఉష అంటే భౌతిక సూర్యోదయం కాదని, అది దివ్యమైన ఉషస్సు అని, ఆమె గోవులు సూర్యకిరణాలని, ఉషాకిరణాలని, పరిఢవిల్లుతున్న దివ్య చైతన్యం యొక్క ప్రకాశమని, సూర్యుడు దివాకరుడని, ఆ కారణం చేత జ్ఞానవిభుడని, స్వర్ అంటే దివికి భువికి ఆవలనున్న సౌరప్రపంచం అని, దివ్యమైన సత్యానికి, ఆనందానికి చెందిన లోకమని, వేదంలో కాంతి జ్ఞానానికి ప్రతీక అని, దివ్య సత్యం యొక్క ప్రకాశనమని నిశ్చింతగా నిర్ధారించొచ్చు. దీన్ని బట్టి వేదంలో కాంతి యొక్క మరో ముఖమైన జ్వాల, దివ్య చేతనా శక్తికి, అతిమానస సత్యానికి ప్రతీక అని కూడా ఊహించడానికి సాధ్యమవుతుంది.

మరో శ్లోకంలో (VI.11.3) "అంగిరసులు అందరిలోకి ప్రతిభావంతుడైన విప్రుడి" ని(*వేపిష్ఠో అంగిరసాం విప్రః*) గురించిన ప్రస్తావన వస్తుంది. అయితే ఆ ప్రస్తావన ఎవరి గురించో స్పష్టంగా అర్థంకాదు. *వేపిష్ఠో విప్రః* అన్న పదబంధాన్ని పట్టించుకోకుండా సాయణుడు 'వేపిష్ఠ' అన్న పదాన్ని 'అత్యంతమైన' అన్న అర్థంలో తీసుకుంటాడు. కాబట్టి వేపిష్ఠో విప్రః అంటే అత్యంత ప్రతిభావంతుడు అని అన్వయిస్తాడు. అంటే ఈ శ్లోకాన్ని విరచించిన భరద్వాజుడు తనని తాను దేవతల యొక్క "అసమాన ప్రశంసకుడ"ను అంటూ ప్రశంసించుకుంటున్నాడని ఊహించవలసి వస్తుంది. కాని ఆ అన్వయం కాస్త సందేహాత్మకంగా వుంది. ఇక్కడ యజ్ఞానికి హోత అగ్ని; ఇక్కడ దేవతలకి అంటే స్వయంగా తన ప్రతిరూపానికి ("*తన్వం తవ స్వామ్*"), మరుత్తులకి, మిత్రుడికి, వరుణుడికి, భువికి, దివికి యజ్ఞం చేస్తున్నది అతడే. "నీలో స్థిరంగా నిలిచి సకల సిరులతో నిండి వున్నా కూడా నా ఆలోచన, దేవతలని, దివ్య జన్మలని కోరుకుంటోంది. అంగిరసులలో అత్యంత ప్రతిభావంతుడైన ఋషి తీయని గానాన్ని గానం చేసినప్పుడు, ఋక్కుని గానం చేసిన గాయకుడి కోసం, ఆ యజ్ఞం దేవతలని చేరుకోవాలని కోరుకుంటోంది." ఒక విధంగా చూస్తే అంగిరసుల అందరిలోకి అత్యంత ప్రతిభావంతుడైన ఋషి అగ్నేనని ఇక్కడ అనిపిస్తుంది. కాని ఈ వర్ణన బృహస్పతికి ఆపాదిస్తే మరింత సమంజసంగా ఉంటుందని కూడా వాదించవచ్చు.

ఎందుకంటే బృహస్పతి కూడా అంగిరసులలో ఒకడు. ఒక దశలో అంగిరసులలో ఒకడవుతాడు. మెరిసే పశువులని గెలిచే ప్రయత్నంలో అతడు అంగిరసులతో కలిసి పని చేస్తాడని అంతకు ముందే గుర్తించాము. ఆ సహవర్తనంలో అతడు పవిత్ర 'బ్రహ్మ' శబ్దానికి పతి అయిన బ్రాహ్మణస్పతి అవుతాడు. అతడి భీకర నినాదం వల్ల వలుడు వ్రయ్యలు

అవుతాడు. అతడి పిలుపుకి స్పందిస్తూ ఆవులు అంబా అని పలుకుతాయి. అగ్ని యొక్క బలాలైన ఈ ఋషులు అతడి లాగానే 'కవిక్రతు' అవుతారు. దివ్య తేజోవంతులైనవారు దివ్యశక్తితో పని చేస్తారు. వాళ్లు ఋషులు మాత్రమే కాదు, వైదిక యుద్ధంలో వారు యోధులు - *దివస్ పుత్రాసో అసురస్య వీరాః* (III.53.7). వారు దివి పుత్రులు, మహా ప్రభువు యోధులు. ఒక శ్లోకం (VI.75.9.) వారిని ఇలా వర్ణిస్తోంది – "తీయదనంలో (ఆనందలోకంలో) వసించే పితరులు విశాలమైన ఆవిర్భావాన్ని స్థాపిస్తారు. దుస్తర ప్రదేశాలలో కదులుతూ, శక్తివంతులై, ప్రగాఢమతులై,[18] తమ శరాల శక్తితో, అజేయులై, రిపువర్గాలని అణగదొక్కుతారు." తదుపరి శ్లోకం వారిని ఈ పదజాలంతో వర్ణిస్తుంది – "*బ్రాహ్మణాసః పితరః సోమ్యాసః*"[19]. దివ్యవాణి మాత్రమే కాక ఆ దివ్య స్ఫూర్తి వల్ల కలిగే జ్ఞానం కూడా వారి సొంతం అని ఈ శ్లోకం చెప్తోంది. ఆ దివ్యవాణినే *సత్యమంత్రం* అంటారు. ఆ భావన చేతనే, లేక ఆ భావనలోని సత్యం చేతనే అంగిరసులు ఉషని జనింపజేసి, పోయిన సూర్యుడు మళ్లీ ఉదయించేలా చేస్తారు. ఆ మంత్రాన్నే '*అర్క*' అని కూడా అంటారు. ఈ పదానికి శ్లోకం అని, తేజం అని, సూర్యుడు అని పలు అర్థాలు ఉన్నాయి. ఏ సత్యానికైతే సూర్యుడు స్వామిగా కొలువున్నాడో, ఆ సత్యాన్ని వ్యక్తం చేసే తేజోమయమైన మంత్రం. సత్యం దాని రహస్య పీఠం నుండి వెలువడి వ్యక్తం కావడం, సూర్యుడి లోంచి వెలువడుతున్న కిరణసందోహాల ప్రవాహంగా అభివర్ణించబడింది. ఈ పరిణతినే ఒక శ్లోకం (VII.36.1) ఇలా వర్ణిస్తోంది – "సత్య పీఠం లోనుండి మంత్రాన్ని వెలువడనీ. సూర్యుడు తన కిరణాల రూపంలో గోవులని విడుదల చేస్తున్నాడు." *ప్ర బ్రహ్మైతు సదనాద్ ఋతస్య, వి రశ్మిభి ససృజే సూర్యో గాః.*" సూర్యుడి లాగానే దాన్ని వశపరచుకోవాలి. దాన్ని సాధించే ప్రయత్నంలో (*అర్కస్య సాతౌ*), అలాగే సూర్యుణ్ణి సాధించే ప్రయత్నంలో (*సూర్యస్య సాతౌ*), స్వర్ ని సాధించే ప్రయత్నంలో (స్వర్సాతౌ) దేవతలు సాయం చెయ్యాలి.

---

[18] X.62.5 లో అంగిరసులని అగ్ని పుత్రులుగా వర్ణించిన విధాన్ని స్మరించాలి. రూపం వేరైనా ప్రగాఢమైన జ్ఞానం గల వారు, *గంభీరవపేసః*

[19] వేదంలో బ్రాహ్మణ అనే శబ్దానికి అర్థం ఇదే ననిపిస్తుంది. ఆ పదం కచ్చితంగా వృత్తిరీత్యా, లేక జన్మతః బ్రాహ్మణులైన వారిని సూచించదు. పితరులు అంటే ఇక్కడ ఋషులే కాక వీరులు కూడా. ఋగ్వేదంలో చాతుర్వర్ణాలు ఒక్కచోటే ప్రస్తావించబడ్డాయి – కాస్త ఆలస్యంగా వచ్చినా అత్యంత ప్రగాఢమైన పురుషసూక్తంలో.

అంగిరసుడిలో ఉన్నది కేవలం అగ్ని శక్తి మాత్రమే కాదు. అతడిలో బృహస్పతి శక్తి కూడా వుంది. బృహస్పతిని పలు మారులు అంగిరస అన్న పేరుతో ప్రస్తావించడం జరిగింది. ఉదాహరణకి ఈ శ్లోకంలో (VI.73.1) ఇలా వుంది - *యో అద్రిభిత్ ప్రథమజా ఋతావా బృహస్పతిర్ ఆంగీరసో హవిష్మాన్,* "బృహస్పతి, నగభేది (పణుల గుహ వున్న పర్వతాన్ని భేదించినవాడు), మొదట పుట్టినవాడు, సత్యవంతుడు అయిన అంగిరసుడికి నమోవాకాలు." అలాగే మరో శ్లోకం (X.47.6.) బృహస్పతికి, అంగిరసుడికి మధ్య ఏకత్వాన్ని మరింత స్పష్టం చేస్తుంది – *ప్ర సప్తగుమ్ ఋతధీతిం సుమేధాం బృహస్పతిం మతిర్ అచ్ఛా జిగాతి య ఆంగీరసో నమసా ఉపసద్యః.* "సప్త కిరణాలు కలిగి, సత్యమైన చింతన కలిగి, పరిపూర్ణ ప్రజ్ఞ కలిగి, అంగిరసుడైన బృహస్పతిని నా ఆలోచన సమర్పణా భావంతో సమీపిస్తోంది." మరో శ్లోకంలో (II.23.18.) గోవులని, జలాలని విడుదల చేసే నేపథ్యంలో బృహస్పతిని అంగిరసుడిగా ఉద్దేశించి సంబోధించడం జరుగుతుంది. "నీ మహిమ వల్ల పర్వతం రెండుగా చీలి దారి విడిచింది. గోవులని గోశాల లోనుండి పైకి విడుదల చేశావు. ఇంద్రుడు నీకు సహచరుడు కాగా చీకటి క్రమ్ముకున్న వరద నీటిని నీవు బయటకు రానిచ్చావు." వృత్ర గాథలో భాగమైన నీటిని విడుదల చేసే వృత్తాంతానికి, అలాగే అంగిరస ఋషుల, పణుల గాథలో భాగమైన గోవులని విడుదల చేసే వృత్తాంతానికి మధ్య సన్నిహితమైన సంబంధం వుంది. ఇక్కడ వృత్రుడు, పణులు ఇరువురూ చీకటి శక్తులే. ఇక్కడ ఆవులు సత్యం యొక్క తేజానికి చిహ్నాలు, సత్యమైన కాంతులు కురిపించే సూర్యుడు. సత్యం తద్... సూర్యమ్. అంతటా ఆవరించిన వృత్రుడు చీకట్ల నుండి విడుదలైన జలాలని కొన్ని చోట్ల సత్య స్రోతస్సులుగాను (*ఋతస్య ధారాః*), మరి కొన్ని చోట్ల స్వర్ యొక్క జలాలుగాను (*స్వర్వతీర్ అపః*), విరాజమాన సౌరప్రపంచం గాను వర్ణిస్తారు.

కాబట్టి అంగిరసుడు అంటే కవిక్రతువైన అగ్ని యొక్క శక్తిస్వరూపంగా గుర్తించాలి. అతడు అగ్ని యొక్క మహత్తర జ్వాల. యజ్ఞానికి హోతగా ఈ లోకంలో జన్మించిన ఒక మహత్తర శక్తి. అతడు మానవయాత్రకు నేత. మర్త్యులలో అమరుడిగా దేవతలు ఆ అద్భుత శక్తిని ఇక్కడ స్థాపించారు అంటాడు వామదేవుడు (IV.1). ఇక్కడ ఒక మహత్కార్యాన్ని (*అరతి*) సాధించే అద్భుత శక్తి. అంతేకాక అతడిలో బృహస్పతి శక్తి వుంది. సప్తకిరణ సంయుక్తుడు, సత్య చింతన కలిగినవాడు. అతడు ఆలోచించే సత్యాన్ని అతడి సప్తకిరణాలు స్థిరంగా

నిలుపుతాయి (*ఋతధీతిమ్*). ఆ దేవతను గురించి ఒక శ్లోకం (IV.50.4-5) ఇలా వర్ణిస్తుంది – "ఒక మహోన్నత స్వర్గంలో మొట్టమొదట బృహస్పతి ఆవిర్భవించి ఒక పరమ కాంతికి జన్మనిస్తాడు. అనేక రూపాలు కలిగి, సప్తముఖుడై, సప్తకిరణ సంయుక్తుడైన (*సప్తాస్యః సప్తరశ్మిః*) ఆ దేవుడు తన నినాదంతో చీకటిని పారద్రోలుతాడు. అతడు తన పరివారంతో, ఋక్ మరియు ష్టుభ్ ల (తేజోమయమైన శ్లోకం, దేవతలని ధృవపరచే ఛందస్సు) సహాయంతో, ఒక కేకతో వలుణ్ణి నాశనం చేశాడు." ఇక్కడ బృహస్పతి పరివారం అంటే అంగిరస ఋషులు అని అర్థం చేసుకోవాలి. వాళ్లు తమ నిజమైన మంత్రంతో (*సుష్టుభా ఋక్వతా గణేన*) అసమాన విజయాన్ని సాధిస్తారు.

ఇంద్రుణ్ణి కూడా ఒక అంగిరసుడిగాను, అంగిరస లక్షణాలు గలవాడి గాను వర్ణిస్తారు. "అతడు అంగిరసులతో పాటు అంగిరసతముడు అవుగాక, వృషభాలలో వృషభుడు అవుగాక (వృషభం మగబలానికి లేక పురుషుడికి (నృ) చిహ్నం, దీనితో పోల్చి చూస్తే కిరణాలు, జలాలు ఆవులు అవుతాయి (*గావః, ధేనవః*)), స్నేహితులలో స్నేహితుడు అవుగాక, *ఋక్* ని కలిగిన వారిలో మహోన్నతుడు అవుగాక (ఋగ్మిభిర్ ఋగ్మి), సహయాత్రికులలో (*గాతుభిః*, సత్యానికి, బృహత్తుకు గొనిపోయే మార్గాన ముందుకు సాగే జీవాత్ములు) అత్యుత్తముడు అవుగాక. మన శ్రేయస్సు కోసం ఇంద్రుడు మరుత్తులతో (*మరుత్వాన్*) చేతులు కలపనీ." ఇక్కడ (I.100.4.) ఇవ్వబడ్డ నామధేయాలన్నీ అంగిరస ఋషులకి సరిగ్గా సరిపోతాయి. ఆ అంగిరసత్వాన్ని సూచించే లక్షణాలన్నీ ఇంద్రుడు తనలోనే పోతపోసుకోవాల్సి వుంది. కాబట్టి III.31.7. లో "అసమాన ప్రజ్ఞ గలవాడు (*విప్రతమః*, ఈ పదం VI.11.3. లో వచ్చే *వేపిష్ఠో అంగిరసాం విప్రః* అనే పదజాలాన్ని తలపిస్తోంది), స్నేహితుడై (*సఖియాన్*, ఆ మహాయుద్ధంలో అంగిరసులు స్నేహితులు, సఖులు) ముందుకు సాగాడు (*ఆగచ్ఛద్*, సరమ సూచించిన మార్గంలో, *గాతుభిః*). సత్కర్మ చేసే సాధకుడి కోసం పర్వతం తన అంతరంగంలోని (గర్భం) అంశాలని వెళ్లగక్కింది. యువతతో శూరుడిగా నిలిచి (*మర్యో యువభిః*, ఇక్కడ యవ్వనం అంటే అక్షయమైన, అమేయమైన

శక్తి అన్న భావన స్ఫురిస్తుంది), అతడు సకల సిరులని కోరి గెలిచాడు (ససాన మఖస్యన్). ఆ విధంగా మంత్రాన్ని జపిస్తూ (అర్చన్) అతడు అంగిరసుడు అయ్యాడు.” అంగిరస లక్షణాలన్నీ తనలో పోత పోసుకున్న ఇంద్రుడు సూర్యుడికి, సత్యానికి చెందిన విశాల స్వర్లోకానికి విభుడు అన్న సంగతి గుర్తుంచుకోవాలి. మెరిసే జోడు గుర్రాల (*హరీ*) నెక్కి అతడు దిగి వస్తాడు. ఒక శ్లోకంలో ఆ గుర్రాలని సూర్యస్య కేతూ అని పిలుస్తారు. దర్శన శక్తికి చెందిన రెండు బలాలకి ఆ గుర్రాలు సంకేతాలు. వాటి సహాయంతో నిశిపుత్రులతో యుద్ధం చేస్తాడు, యాత్రికుడికి తోడుగా నిలుస్తాడు. వేదం యొక్క అంతరార్థాన్ని శోధించే ప్రయత్నంలో మనం ఇంతవరకు నడిచిన బాట సరైనదే అనుకుంటే, ఇంద్రుడు అంటే మనిషిలో పుట్టిన దివ్యమానసానికి సంకేతం అని అన్వయించాలి. ఇంద్రుడు పరమ శక్తిమంతుడు[20]. వాక్కు చేత వృద్ధి చెంది సోమం చేత పూర్ణ దివ్యత్వాన్ని సంతరించుకుంటాడు. ఈ వృద్ధి కాంతి యొక్క విజయం చేత, వృద్ధి చేత నిరాఘాటంగా కొనసాగుతుంది. విరాజిత పశుసంజాతానికి పతిగా ఇంద్రుడు చివరికి సాక్షాత్కరిస్తాడు. “*ఇన నయనం*”తో వాటిని దర్శిస్తాడు. సకల జ్ఞాన ప్రకాశనాలకి విభుడైన దివ్య మానసమై నిలుస్తాడు.

అంగిరసుడైన ఇంద్రుడు మరుత్వంతుడు అవుతాడు. మరుత్తులు అతడికి అధీనం అవుతారు, అతడికి సహచరులౌతారు. పెను తుఫానుకి, పర్జన్యానికి వెనుక నున్న మహత్తర, మహోగ్ర వేల్పులు మరుత్తులు. జీవలోకపు ప్రభుడైన వాయుదేవుని ఉధృత శక్తిని తమలో పోతపోసుకున్న వారు మరుత్తులు. ఆ శక్తికి అగ్ని శక్తి అయిన కవిక్రతువుని కూడా జోడించుకున్నవారు. కాబట్టి వారు జ్ఞానాన్ని పునాదిగా చేసుకుని పని చేసే ద్రష్టలు (*కవయో విద్మనా అపసః*). అంతేకాక వారు దివ్యమైన ప్రాణశక్తి చేత, దేవలోకపు పర్జన్య గర్జన చేత సాంప్రదాయ నిబద్ధమైన విధానాలని, కృత్రిమ అవరోధాలని ధ్వంసం చేస్తారు (*కృత్రిమాణి రోధాంసి*). ఆ అవరోధాలే నిశిపుత్రులకి మూర్తిరూపాలు. మరుత్తుల తోడ్పాటుతో ఇంద్రుడు వృత్రుడిని, దాస్యులని నాశనం చేస్తాడు. వేదం యొక్క గూడార్థ పరంగా చూస్తే మరుత్తులు జీవశక్తులకి ప్రతీకలు. ఆ శక్తులే నాడీజన్యమైన, ప్రాణశక్తులకి ఆధారంగా

---

[20] అంతేకాక “ప్రకాశవంతుడు” కూడా. ఉదాహరణకి ఇందు అంటే చంద్రుడు; ఇన అంటే వైభవమైన, సూర్యుడు; ఇంధ్ అంటే నిప్పు రాజేయు.

నిలుస్తాయి. ఆ శక్తులు ఆలోచన యొక్క ప్రభావాన్ని సంవర్ధనం చేసి, మర్త్య చేతన యొక్క వృద్ధికి తోడ్పడి, సత్యానందాల దిశగా మానవ చేతన యొక్క విస్తరణకి బాటలు వేస్తాయి. అంతేకాక మరుత్తులు కూడా అంగిరస లక్షణాల అనుసారం (*అంగిరస్వత్*) పని చేస్తారని ఒక చోట (VI.49.11) చెప్పబడింది. "ఓ మరుత్తులారా! యవ్వనవంతులై, ద్రష్టలై, యజ్ఞాన్ని పాలించే శక్తులు మీరు. మంత్రాన్ని జపిస్తూ సమున్నత స్థలానికి (ఇది భూమి మీద ఒక సముచిత స్థలం కావచ్చు, లేదా ఒక పర్వతం కావచ్చు, *అధి సాను పృశ్నేః*, ఇది బహుశా *వరస్యామ్* అన్న అర్థంలో వాడబడి ఉంటుంది) విచ్చేయండి. అంగిరసులలా[21] మీరు సరైన దిశలో (*గాతు*, మార్గం మీద) కదిలే శక్తులు. అప్రకాశమైన దాంట్లో (*అచిత్రమ్*, పలువన్నెల ఉదయకాంతులు దూరని చోటు, మన సామాన్య అచేతన యొక్క చీకటి) కూడా మీరు ఆనందాలని చిలికిస్తారు." ఇక్కడ అంగిరసుల ప్రభావంలో కనిపించే లక్షణాలన్నీ కనిపిస్తున్నాయి – శాశ్వత యవ్వనం, అగ్నిశక్తి (*అగ్నే యవిష్ఠ*), మంత్రోచ్చారణ, మంత్రసిద్ధి, ఋష్యత్వం, యజ్ఞకర్మ, సన్మార్గాన సక్రమ గమనం. ఆ గమనమే సత్య లోకానికి, భావంతమైన, బృహత్తరమైన ఆనందానికి గొనిపోతుంది. మరో చోట (X.78) మరుత్తుల గురించి ఇలా కూడా చెప్పబడింది – "సామ ఋక్కులు తెలిసిన వారు (మరుత్తులు), సకల రూపాలని దాల్చుతారు. (*విశ్వరూపా అంగిరసో న సామభిః*)"

ఈ ఉధృత చర్య, చలనం అంతటికీ వెనుకనున్న ప్రోద్బలం ఉషాదేవి. ఉషకి కూడా *అంగిరస్తమా* అని, *ఇంద్రతమా* అని నామాలు ఉన్నాయి. అగ్ని శక్తి, అంగిరస శక్తి ఇంద్రుడి వజ్రాయుధంలోను, ఉషాకిరణాల లోను అభివ్యక్తం అవుతుంది. అంగిరస శక్తి యొక్క ఈ ముఖం గురించి మరింత విపులంగా చెప్పే కొన్ని శ్లోకాలు ఉన్నాయి. వాటిలో మొదటిది VII.79.2-3. "స్వర్గం అంచుల వరకు ఉషస్సులు తమ కిరణాలని ప్రసరిస్తాయి. కార్య శూరులైన మనుషుల్లా వారు శ్రమిస్తారు. సూర్యుడు తన చేతులు చాచినట్టు ఉషస్సులు తమ కిరణాలని చాచి చీకట్లని పారద్రోలుతాయి. ఉష ఇంద్రుడి శక్తితో (*ఇంద్రతమ*)

[21] ఇక్కడ సాయణుడు అంగిరస్ అనే పదానికి కదిలే కిరణాలు (అజ్ అంటే మరి చలనం) లేక అంగిరస ఋషులు అనే అర్థాన్ని తీసుకుంటాడు. ఆ మహా పండితుడు తన భావాల తార్కిక పర్యవసానాలని ధైర్యంగా అనుసరిస్తూ పోయి వుంటే ఆధునిక సిద్ధాంతాన్ని లీలామాత్రంగానైనా ఆవిష్కరించగలిగి ఉండేవాడు.

పరిఢవిల్లుతుంది, ప్రభవిల్లుతుంది. సకల సిరులతో నిండి వున్న ఆమె, మన ఆనందమయ విలాసం కోసం ఆమె సుజ్ఞాన ప్రేరణలకి జన్మనిస్తుంది. సురపుత్రి అయిన ఆ దేవి, అంగిరస్తమురాలై, యాజ్ఞికుడికి సకల సిరులని ప్రసాదిస్తుంది." ఉషాదేవి అధీనంలో ఉన్న సిరులన్నీ తేజస్సుకి, శక్తికి, సత్యానికి చెందిన సంపదలే; ఇంద్ర శక్తితో నిండి వున్న ఆమె, దివ్య విరాజిత మానసానికి మూర్తిరూపమైన అయిన ఆ దేవి, ఆ మనస్సుకి చెందిన ప్రేరణలని ప్రసాదించి (*శ్రవాంసి*) ఆనందం దిశగా గొనిపోతుంది. తనలో వెలిగే మహోజ్వలమైన అంగిరస శక్తితో ఆమె, సన్మార్గాన నడుస్తూ సత్కర్మలు చేసే వారిపై తన ఐశ్వర్యాన్ని కురిపిస్తుంది – *ఇత్థా నక్షంతో అంగిరస్వత్*.

ఇక రెండవ సందర్భం ఈ శ్లోకంలో (VII.75) తారసపడుతుంది. "దివిజ అయిన ఉష సత్యం సహాయంతో (చీకటి తెరలని) తెరిపించి, బృహత్తుని (*మహిమానమ్*) అభివ్యక్తం చేస్తుంది. చేటుని, చీకటిని (*ద్రుహస్ తమః*), ప్రేమరాహిత్యాన్ని ఆమె దరిజేరనీయదు. అంగిరసత్వంతో పూర్ణమైన ఆమె (మహా యాత్రకి చెందిన) బాటలని బట్టబయలు చేస్తుంది. ఓ ఉషాదేవీ! నేడు బృహత్తర ఆనందానికి (*మహే సువితాయ*) గొనిపోయే యాత్రని మాలో మేల్కొలుపు. ఒక బృహత్తర ఆనందమయ స్థితి కోసం నీ సిరులని పంచిపెట్టు. ఓ మానవత్వమా, ఓ దివ్యత్వమా! స్ఫూర్తిజన్యమైన జ్ఞానంతో (*శ్రవస్యుమ్*) వైవిధ్య భరితమైన (*చిత్రమ్*) జ్ఞానాన్ని మాలో స్థిరపరుచు. కనిపించే ఉషస్సుకి చెందిన జిలుగులు పలువన్నెల వెలుగును దాల్చి అమరమై మా ముందుకు వచ్చాయి. దివ్యకర్మలకి నాంది పలికి అవి అంతరిక్షం అంతటా వ్యాపిస్తాయి." (*జనయంతో దైవ్యాని వ్రతాని, ఆపృణంతో అంతరిక్షా వ్యస్థుః*). చీకటిని పారద్రోలి, బాటలని ప్రస్ఫుటం చేసి, ఉషా కిరణాలని విరజిమ్మే ఈ ప్రయత్నంలో అంగిరస శక్తి యొక్క ప్రభావాన్ని యాత్రతో జోడించడం కనిపిస్తుంది. దుష్ట శక్తులు (గుహలో దాగిన చీకటి శక్తులు) మనుషులకి తలపెట్టే కీడుకి (*ద్రుహ్వా*, అంటే కీడు లేదా కీడును తలపెట్టే వారు) పణులు చిహ్నాలు. ఇక్కడ యాత్ర అంటే దివ్యమైన ఆనందానికి, అమరానంద స్థితికి గొనిపోయే బాట. వర్ధమానమైన తేజం, బలం, జ్ఞానాల వల్ల ఆ యాత్ర వీలవుతుంది. ఉష

యొక్క దివ్య కిరణాలు మనిషిలో దివ్య కర్మలకి బీజాలు వేసి, దివికి భువికి నడుమ ఉండే అంతరిక్ష ప్రాంతాన్ని ఆ కర్మలతో పూరిస్తాయి. ఇక్కడ అంతరిక్షం అంటే వాయుదేవుడి అధీనంలో ఉండే ప్రాణిక తలాలు. భౌతిక జీవికి, శుద్ధ మనో జీవికి మధ్య వారధిగా నిలిచే ఆ తలాలే అంగిరస శక్తులు అని అనుకోవచ్చు. అవి కూడా దివ్యకర్మలని అనఘంగా నిలిపి సత్యాన్ని సంరక్షిస్తాయి (*అమర్ధంతో దేవానాం వ్రతాని*). మరి దివ్యమైన ఉషస్సుని మర్త్య ప్రపంచంలో ప్రవేశపెట్టడం వారి పని. అప్పుడే ఏకకాలంలో దివ్యము, మానవీయము అయిన ఆ దేవి, మర్త్యులలో మానవీయమైన ఆ దేవి (*దేవీ మర్త్యేషు మానుషీ),* తన సిరులని ఇక్కడ కురిపిస్తుంది.

అధ్యాయం 17

ఏడు తలల యోచన - స్వర్లోకం - దశగ్వులు

వేదబుక్కుల పరిభాష అంగిరస ఋషుల యొక్క రెండు ముఖాలని వర్ణిస్తుంది. ఒక ముఖం వేదంలో ప్రతీ చోట కనిపించే బాహ్యార్థం. సూర్యుడు, అగ్ని, ఉష, గోవు, అశ్వం, సోమరసం, యజ్ఞం మొదలైన భౌతిక ప్రతీకలతో వైదిక పరిభాష ప్రకృతిగతమైన వర్ణనని, అన్వయాన్ని అల్లుతూ పోతుంది. ఆ ప్రతీకల నుండి అంతరార్థాన్ని వెలికి తీస్తుంది. అంగిరసులు

అగ్నిపుత్రులు, ఉషాకిరణాలు, సోమరస పానకులు, ప్రదాతలు, ఋక్కుల గాయకులు, నిత్యయవ్వనులు, చీకటి శక్తులని నిర్జించి వారి నుండి సూర్యుణ్ణి, గోవులని, అశ్వాలని తదితర సంపదలని మనకోసం గెలిచి తెచ్చే వీరులు. అంతేకాక వారు సత్య ద్రష్టలు, సత్యాన్ని శోధించి, కనుగొని, భాషలో వ్యక్తం చెయ్యగల సమర్థులు. ఆ సత్యశక్తి తోనే వారు మనకోసం విశాలమైన తేజోలోకాన్ని, అమరలోకాన్ని గెలిచి ప్రసాదిస్తారు. ఆ లోకాన్నే వేదం సత్యం, ఋతం, బృహత్ అని వర్ణిస్తుంది. ఆ లోకమే అగ్నికి నిజధామం. భౌతిక ప్రతీకలు, వాటి అధ్యాత్మిక అంతరార్థం రెండూ లోతుగా పెనవేసుకుని ఉంటాయి. కాబట్టి రెండిటినీ వేరు చెయ్యడం కుదరదు. దీన్ని బట్టి సత్యం, ఋతం స్వధామంగా కలిగిన అగ్ని నిజానికి స్వాభావికంగా ఋతానికి, సత్యానికి చెందిన అగ్ని అని, సత్యం చేత జయించబడ్డ ఆ కాంతి కేవలం భౌతిక తేజం కాదని, సత్య మార్గాన నడుస్తూ సరమ కనుగొన్న గోవులు నిజానికి భౌతిక పశువులు కావని, గుర్రాలు కేవలం ద్రావిళ్లని కొల్లగొట్టి ఆర్యులు గెలిచిన సంపదలు కావని, ఉష కేవలం భౌతికమైన ప్రొద్దుపొడుపు కాదని, పణులు, వృత్రుడు కాపు కాస్తున్న చీకటి కేవలం భరత వర్షానికో, ఆర్కిటిక్ ప్రాంతినికో చెందిన చీకటి కాదని అర్థం చేసుకోక తప్పదు. కాబట్టి ఈ ప్రతీకల మాటున దాగిన అసలైన అర్థాన్ని ఆవిష్కరించి, కాంతులీనే ఈ దేవతా కూటమి యొక్క, దివ్యులై, కాంతిమతులైన ఆ ఋష్యశ్రేణి యొక్క అసలైన తత్వాన్ని బోధించగల ఒక సముచిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాల్సిన అవసరం కనిపిస్తోంది.

అంగిరస ఋషులు దివ్యులు మానవీయులు అయిన ద్రష్టలు. ప్రాచీన లోకంలో ఇలాంటి ద్వంద్వ లక్షణం కలిగి ఉండడం అంత అరుదైన విషయమేమీ కాదు. వేదంలో కూడా అది కేవలం ఋషులకే పరిమితం కాదు. వైదిక దేవతల విషయంలో కూడా వారి క్రియలలో ఒక ద్వంద్వ లక్షణం ఉంటుంది. అంతర్యంలో దివ్యులు, సనాతనులు అయిన వారు, మర్త్యలోకంలో మానవులలో పని చేస్తూ గొప్ప ఎత్తులకి ఆరోహిస్తుంటారు. ఇలాంటి లక్షణం ప్రస్ఫుటంగా ఉషాదేవికి ఇలాంటి మాటలతో ఆరోపించబడింది – "మర్త్యులలో మానవ దేవత" (*దేవీ మర్త్యేషు మానుషి*). కాని అంగిరస ఋషుల ప్రతీకలలో ఈ ద్వంద్వ లక్షణం వారితో అనుసంధానమై వున్న పౌరాణిక సాంప్రదాయం వల్ల మరింత సమస్యాత్మకం అవుతుంది. పౌరాణికంగా చూస్తే వారు మానవ పితరులు, తేజస్సుకి ఆవిష్కర్తలు, వారే మార్గం, వారే

గమ్యం. వైదిక సాంప్రదాయం పట్ల, వైదిక ప్రతీకావళి పట్ల మనం ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం మీద ఈ సమస్య ప్రభావం ఎలా ఉంటుందో చూద్దాం.

అంగిరస ఋషులని సాధారణంగా ఏడుగురు ఋషులుగా (*సప్తవిప్రాః*) వర్ణిస్తారు. వీరే పురాణాలలో పేర్కొనబడ్డ సప్తర్షులు. భారతీయ ఖగోళశాస్త్రంలో సప్తర్షిమండలాన్ని అలంకరించిన తారలు వీరే[22]. వీరిని నవగ్వులు అని, దశగ్వులు అని కూడా పేర్కొంటారు. ప్రాచీన పితరులని ప్రస్తావించే ఒక శ్లోకంలో (VI.22) వారు నవగ్వులైన సప్తర్షులు అని చెప్పబడింది (*పూర్వే పితరో నవగ్వాః సప్త విప్రాసో*). కాని మరి III.39.5 లో నవగ్వులు, దశగ్వులు అని రెండు వర్గాల గురించిన ప్రస్తావన వస్తుంది. ఆ రెండవ కూటమిలో పది మంది ఉంటే, మొదటి కూటమిలో తొమ్మండుగురు ఉంటారని ఊహించవచ్చు. *సఖా హ యత్ర సఖిభిర్ నవగ్వైర్, అభిజ్ఞ్వా సత్వభిర్ గా అనుగ్మ న్; సత్యం తద్ ఇంద్రో దశభిర్ దశగ్వైః సూర్యం వివేద తమసి క్షియంతం.* "అక్కడ స్నేహితుడు తన స్నేహితులైన నవగ్వులతో కలిసి, గోవులని అనుసరిస్తూ ఇంద్రుడు పది మంది దశగ్వులతో కలిసి సత్యాన్ని కనుగొన్నాడు, చీకట్లో దాగిన సూర్యుణ్ణి కూడా కనుగొన్నాడు." ఇందుకు భిన్నంగా IV.51లో అంగిరసులని సమిష్టిగా వర్ణిస్తూ "సప్తముఖులు, లేక సప్తగ్రీవులు, నవకిరణులు, దశకిరణులు," అంటుంది (నవగ్వే అంగిరే దశగ్వే సప్తాస్యే). X.108.8 లో నవగ్వ అంగిరసులతో ముడివడి వున్న ఆయస్యుడు అనే మరో ఋషి ప్రస్తావన వస్తుంది. X.67 లో ఈ ఆయస్యుడి గురించి వర్ణిస్తూ మన పితరుడు సత్యం లోనుండి జనించిన ఏడు ముఖాల చింతనను కనుగొన్నాడని అంటూ ఇంద్రుణ్ణి కీర్తించడం కనిపిస్తుంది. నవగ్వులు ఏడుగురా, తొమ్మండుగురా అన్న విషయాన్ని బట్టి ఆయస్యుడు ఎనిమిదవ ఋషి గాని, పదవ ఋషి గాని కావాల్సి ఉంటుంది.

వైదిక సాంప్రదాయం ప్రకారం అంగిరస ఋషులలో రెండు వర్గాల వారు ఉంటారు – వీరిలో నవగ్వులు నొమ్మిది నెలల పాటు యజ్ఞం చేసిన వారైతే, దశగ్వులు పది నెలల పాటు యజ్ఞం చేస్తారు. ఈ అన్వయం ప్రకారం నవగ్వులు అన్న పదాన్ని "తొమ్మిది ఆవుల" అని,

[22] అయితే పురాణాలలో వీరికి ఇచ్చిన పేర్లు, వైదిక సాంప్రదాయంలో ఇవ్వబడ్డ పేర్లు ఒక్కటి కాకపోవచ్చు.

దశగ్వులు అన్న పదాన్ని "పది ఆవుల" అని అన్వయించవలసి వస్తుంది. ఇక్కడ ఆవు అంటే ముప్పై పగళ్ల మొత్తం అంటే ఒక నెలతో సమానం అని అర్థం చేసుకోవాలి. కాని ఈ సాంప్రదాయక అన్వయాన్ని వ్యతిరేకిస్తున్నట్టుగా ఋగ్వేదంలో ఒక చోట మాత్రం సులభంగా తెలుస్తుంది. V.45 లోని ఏడవ శ్లోకంలోను, తరువాత పదకొండవ శ్లోకంలోను మనకి తెలుస్తున్నది ఏమిటంటే పది నెలల పాటు మంత్రాలని వల్లించి యజ్ఞం చేసింది దశగ్వులు కారని, నవగ్వులని తెలుస్తోంది. ఏడవ శ్లోకం ఇలా ఉంటుంది – "*అనునోద్ అత్ర హస్తయతో అద్రిర్, ఆర్చన్ యేన దశ మాసో నవాగ్వః; ఋతం యతీ సరమా గా అవిన్దద్, విశ్వాని సత్యా అంగిరాశ చకార.*" "ఇక్కడే చేతి తోపునకు శిల అరిచింది (లేదా కదిలింది). దాని వల్ల నవగ్వులు పది నెలల పాటు మంత్రాలు వల్లించారు; సత్యం దిశగా పయనిస్తున్న సరమ గోవులని కనుక్కుంది; అంగిరసులు చేసినవన్నీ నిజమయ్యాయి." పదకొండవ శ్లోకంలో ఆ భావన మళ్లీ వ్యక్తమయ్యింది – "*ధియం వో అప్సు దధిశే స్వర్షాం, యయాతరన్ దశ మాసో నవాగ్వాః; అయా ధియా స్యామ దేవగోపా, అయా ధియా తుతుర్యామ అతి అంహః*". "జలాలలో (అంటే ఏడు నదులలో) నీ కోసం స్వర్గాన్ని[23] స్వాధీనం చేసుకోగల ఆలోచనని నిలిపి ఉంచుతాను (సత్యం లోనుండి జనించిన ఏడు తలల యోచన మళ్లీ ఇక్కడ ప్రస్తావించబడుతోంది, అయస్యుడు కనుగొన్నది ఇదే), దాని వల్లనే నవగ్వులు పది నెలల పాటు ముందుకు సాగారు; ఈ ఆలోచన చేతనే దేవతలు సంరక్షకులు కాగలరు. ఈ ఆలోచన చేతనే మనం చెడును అధిగమించగలము." ఇక్కడ శ్లోకంలోని తాత్పర్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సందర్భంలో సాయణుడు కాస్త అర్ధమనస్కంగా దశ మాసో (v.7) అంటే 'పది నెలలు' అన్న పదాన్ని ఒక నామధేయంలా '"పదినెలల వాళ్లు" (దశగ్వులు) అనే అర్థంలో వాడాడు. ఈ అన్వయాన్ని కాస్త సందేహాత్మకంగానే వాడుతూ పదకొండవ ఋక్కులో ఆ అన్వయానికి స్వస్తి చెప్తాడు.

---

[23] సాయణుడు ఈ పదజాలాన్ని "జలం కోసం మంత్రాన్ని వల్లిస్తున్నాను", అంటే వర్షం తెప్పించడం కోసం వల్లిస్తున్నాను అన్నట్టుగా అన్వయిస్తాడు. కాని ఇక్కడ దధిశే అంటే "ఉంచుతున్నాను, నిలుపుతున్నాను" అని అర్థం. దీన్నే మానసికంగా తీసుకుంటే "మనసులో నిలుపుతున్నాను, లేక ధ్యానిస్తున్నాను" అని అన్వయించవచ్చు. ధీ అనే శబ్దం లాగానే ధిషణా అంటే ఆలోచన; కాబట్టి ధియమ్ దధిశే అంటే "ఆ ఆలోచనని ఆలోచిస్తున్నాను, లేక ధ్యానిస్తున్నాను" అని అర్థం చేసుకోవచ్చు.

మరైతే ఈ ఋక్కుని రచించిన కవి సాంప్రదాయాన్ని విస్మరించి, నవగ్వులకి, దశగ్వులకి మధ్య తేడా తెలియక సతమత మవుతున్నాడని అనుకోవాలా? అలా అనుకోవడం పొరబాటే అవుతుంది. సమస్య అంతా వేద ఋషుల దృష్టిలో నవగ్వులు, దశగ్వులు అనేవారు రెండు వేరు వేరు వర్గాలకి చెందిన అంగిరస ఋషులు అనుకోవడం వల్లనే వస్తోంది. ఆ రెండు పేర్లు అంగిరసత్వం యొక్క రెండు ముఖాలు అనుకుంటే సమస్య తీరిపోతుంది. అలా అనుకుంటే తొమ్మిది నెలల యజ్ఞ కాలాన్ని పది నెలలకి పొడిగించి నవగ్వులు, దశగ్వులు కాగలరని తలపోయడానికి వీలవుతుంది. ఋక్కులో '*దశ మాసో అతరన్*' అనే పదబంధాన్ని బట్టి పూర్తిగా పది నెలల పాటు యజ్ఞాన్ని కొనసాగించడం కష్టతరమైన పని అన్న సూచన కనిపిస్తోంది. మరి ఆ కాలంలోనే నిశిపుత్రులకి యజ్ఞాన్ని భంగం చేసే శక్తి ఏర్పడుతుంది. సౌరలోకమైన స్వర్లోకాన్ని సాధించగల ఆలోచనా శక్తితోనే ఋషులు ఆ పదినెలల యజ్ఞ కాలాన్ని విజయవంతంగా పూర్తిచెయ్యగలిగారు. ఒకసారి ఆ ఆలోచనా శక్తి కలిగిందంటే దేవతల నుండి రక్షణ దొరుకుతుంది. చెడు చేసే కీడు వారిని అంటదు. పణుల, వృత్రుల దుష్ప్రభావం వారిని తాకదు. స్వర్లోకాన్ని జయించగల ఆ ఆలోచనే ఏడు ముఖాలు గల ఆలోచన. నవగ్వులకి సహచరుడైన అయస్యుడు కనుగొన్న సత్యం నుండి ఆ ఆలోచన జనిస్తుంది. విశ్వజనీనతను పొందిన అయస్యుడు, సమస్త లోకాలలోను జన్మలని స్వీకరించి, ఒక చతుర్థ లోకం యొక్క లేదా చతుర్విధ లోకం యొక్క ఆవిర్భావం జరిగేలా చేశాడు. ఆ లోకం నిశ్చయంగా మూడు కింది లోకాలైన దౌస్, అంతరిక్ష, పృథ్వి లకి ఆవల నున్న అతిమానస లోకమే అయ్యుండాలి. కణ్వుడి కొడుకైన ఘోర మహర్షి ప్రకారం మనుషులు వృత్రుణ్ణి చంపి, రెండు రోదసులని దాటి, ఆ లోకాన్ని చేరుకుంటారు. ఆ నాల్గవ లోకం స్వర్లోకమే అయ్యుండాలి. ఏడు ముఖాల ఆలోచన కలిగిన అయస్యుడు, ఆ సిద్ధి వల్ల విశ్వజనీనుడు (*విశ్వజన్య*) అవుతాడు. ఆ పదానికి అర్థం బహుశ అన్ని లోకాలలోను వ్యాపించిన వాడు కావచ్చు, లేదా సకల జీవులతోను తాదాత్మ్యం చెందిన విశ్వజనీనుడు అయినవాడు కావచ్చు. ఒక ప్రత్యేకమైన నాల్గవ ప్రపంచాన్ని (స్వర్) అభివ్యక్తం చేసినవాడు కావచ్చు, *తురియం స్విజ్ జనయద్ విశ్వజన్యః* (X.67.1). జలాలలో స్థాపించబడ్డ ఆలోచన వల్ల నవగ్వ ఋషులు పది నెలల యజ్ఞ కాలాన్ని పూర్తి చెయ్యగలుగుతారు. కాబట్టి ఆ ఆలోచనని స్వర్వా అంటారు, అంటే స్వర్లోకపు ప్రాప్తిని ప్రసాదించేది అని అర్థం. ఇక్కడ

జలాలు అంటే ఏడు నదులేనని స్పష్టంగా తెలుస్తోంది. కాబట్టి నవగ్వలకి అయస్యుడు తోడైనప్పుడు, తొమ్మండుగురు కాస్తా పది మంది అయ్యారని ఊహించడం కష్టం కాదు. ఆ కూటమి వల్ల అయస్యుడు ఏడు ముఖాల ఆలోచనని కనుగొని, దాంతో స్వర్లోకాన్ని సాధించి తొమ్మిది నెలల యజ్ఞాన్ని పది నెలలకి పొడిగించగలిగాడని తలపోయడం కూడా సముచితమే అవుతుంది. ఆ విధంగానే నవగ్వలు దశగ్వలు అయ్యారు. ఈ సందర్భంలో పై ఆలోచనకి సన్నిహితమైన మరో ఆలోచనని ప్రస్తావించుకోవచ్చు. సోమరస పానపు సమ్మోహనంలో ఇంద్రుడు స్వర్లోకపు శక్తిని, లేదా స్వర పురుషుణ్ణి (స్వర్ణర) అభివ్యక్తం చేస్తాడని ఒక చోట చెప్పబడింది. సమ్మోహనం పది కిరణాలు కలిగినదని, విరాజమానమైనదని చెప్పబడింది (*దశగ్వం వేపయంతం*).

అంతకు ముందే పేర్కొన్న ఒక శ్లోకాన్ని బట్టి (III.39.5) పై నిర్ణయాన్ని సులభంగా సమర్థించవచ్చు. నవగ్వల సహాయంతోనే ఇంద్రుడు పోయిన పశువుల జాడ తెలుసుకో గలుగుతాడని అక్కడ చెప్పబడింది. కాని దశగ్వల సహాయంతోనే అతడు ఆ అన్వేషణను విజయవంతంగా పూర్తి చేసి చీకట్లో దాగిన సూర్యుణ్ణి అంటే సత్యాన్ని (*సత్యం తత్*) కనుక్కోగలుగుతాడు. మరోలా చెప్పాలంటే తొమ్మిది నెలల యజ్ఞం పది నెలలు అయినప్పుడే నవగ్వలు, దశగ్వలు అవుతారు. వారిలో పదవ ఋషి అయిన అయస్యుడి ఏడు ముఖాల ఆలోచన సహాయంతో సూర్యుణ్ణి కనుగొని, విరాజమాన స్వర్లోకంలో ఏకైక విశ్వజనీన దైవాన్ని ఆవిష్కరించడానికి వీలయ్యింది. ఈ స్వర్లోక విజయమే యజ్ఞం యొక్క చరమలక్ష్యం. అంగిరసులు తలపెట్టి సాధించిన మహత్కార్యం అదే.

అయితే ఇక్కడ నెలల ప్రస్తావనలో కూడా ఏదైనా అంతరార్థం వుందా? ఇక్కడ నెలలే కాక, సంవత్సరం కూడా ప్రతీక మాత్రమేనని సులభంగా అర్థం చేసుకోవచ్చు[24]. మరి సంవత్సర చక్రంలోనే పోయిన సూర్యుణ్ణి, పోయిన గోవులని తిరిగి సాధించడానికి వీలవుతుంది. ఆ సంగతిని X.62.2, తేటతెల్లం చేస్తుంది, *ఋతేనాభిన్దన్ పరివత్సరే వలమ్*. "సత్యం చేత, సంవత్సర పరిభ్రమణం చేత, వారు వలుణ్ణి భేదించారు." దీన్ని సాయణుడు "సంవత్సరం పాటు సాగిన యజ్ఞం" అని అన్వయిస్తాడు. ఈ శ్లోకం ఆర్కిటిక్ సిద్ధాంతాన్ని సమర్థించే

---

[24] పురాణాలలో యుగాలు, క్షణాలు, నెలలు మొదలైనవన్నీ ప్రతీకలేనని గుర్తించాలి. మానవ శరీరం ఒక సంవత్సరం అని చెప్పబడింది.

ప్రయత్నంలో చాలా దూరం పోతోంది. ఎందుకంటే దీని బట్టి సూర్యుడు దినానికొక సారి కాక, ఏడాదికి ఒక సారి ఉదయిస్తాడు. అయితే ఇక్కడ మనం బాహ్యార్థానికి పెద్దగా ప్రాధాన్యత నివ్వడం లేదు. దానితో మన సిద్ధాంతానికి అంతగా ప్రమేయం కూడా లేదు. సుమారు ఏడాది పాటు కొనసాగే సుదీర్ఘమైన రాత్రులతో కూడుకున్న ఆర్కిటిక్ అనుభవం, ఏడాదికో సారి జరిగే సూర్యోదయం, దినాలు, నెలలు సాగే బారైన పగళ్లు - ఈ అద్భుత భౌతిక పరిణామాలని అలనాటి ఋషులు అధ్యాత్మిక అంధకారానికి, దుర్లభమైన అంతఃప్రకాశనానికి ప్రతీకలుగా తీసుకుని వుండొచ్చుగాక. అయితే నెలల, సంవత్సరాల రూపంలో కాలాన్ని కూడా ఒక ప్రతీకగా వినియోగించే ధోరణి వేదంలో మరో చోట కూడా కనిపిస్తుంది. అందుకు ఉదాహరణగా బృహస్పతిని స్తుతించే గృత్సమదుడి ఋక్కుని (II.24) తీసుకోవచ్చు.

ఈ ఋక్కులో బృహస్పతి గోవులని తోలుతూ, దివ్య మంత్రంతో (*బ్రాహణా*) వలుణ్ణి భేదిస్తూ, చీకటిని కప్పి పుచ్చి, స్వర్ ని బహిర్గతం చేస్తున్నట్టుగా వర్ణించడం జరిగింది. అందుకు ఫలితంగా కఠిన శిలతో మూతబడి వున్న నూతి మూతిని భేదించడం జరుగుతుంది. అప్పుడు ఆ బావిలో వున్న తేనెల (*మధు*) ఊటలు, సోమరసపు తియ్యందనాలు, చివ్వున పైకి చిందుతాయి (*అస్మాస్యమ్ అవతం మధుధారమ్*). రాతి చేత మూతబడ్డ ఈ తేనె బావి ఆనందానికి ప్రతీక కావచ్చు. పౌరాణిక సాంప్రదాయంలో చెప్పబడ్డ సత్యలోకం, తపోలోకం, జనలోకం అనే ఊర్ధ్వ త్రిలోకాలకి అనుబంధితంగా మూడు తత్వాలు ఉన్నాయి – అవి సత్, చిత్–తపస్, ఆనందం. వాటన్నిటికీ ఆధారం వేదం చెప్పే స్వర్లోకం, ఉపనిషత్తులు చెప్పే మహర్లోకం, పురాణాలు చెప్పే సత్య లోకం[25]. ఈ నాలుగూ కలిసి చతుర్విధమైన నాల్గవ లోకాన్ని కల్పిస్తాయి. వీటినే ఋగ్వేదంలో నాలుగు గుహ్యమైన పరంధామాలుగాను, “నాలుగు ఊర్ధ్వ నదుల”కి మూలంగాను వర్ణించడం జరుగుతుంది. కొన్నిసార్లు మళ్లీ ఈ ఊర్ధ్వ లోకాన్ని రెండుగా విభజించడం జరుగుతుంది – ఆధారమైన స్వర్లోకం, పరమ పీఠమైన మహర్లోకం లేదా దివ్యమైన ఆనందం. దీన్ని బట్టి ఆరోహిస్తున్న జీవాత్మ చేరుకోవలసిన ఐదు లోకాలు, లేదా ఎత్తవలసిన ఐదు జన్మలు ఉన్నాయని అర్థమవుతుంది. ఇక మూడు నిమ్న

[25] ఉపనిషత్తులలోను, పురాణాలలోను స్వర్ కి ద్యౌస్ కి మధ్య తేడా లేదు; కాబట్టి సత్యలోకాన్ని సూచించడానికి మరో నాలుగో పేరుని వెతకాల్సి వచ్చింది. అలా పుట్టినదే మహర్ లోకం. తైత్తిరీయోపనిషత్తులో ఋషి మహాచమస్యుడు దాన్ని నాల్గవ వ్యాహృతిగా పరిచయం చేస్తాడు. మిగతా మూడూ స్వర్, భువర్, భుర్ లోకాలు. అంటే వైదిక పరిభాష ప్రకారం ద్యౌస్, అంతరిక్షం, పృథ్వీ.

నదులు అస్తిత్వం యొక్క మూడు నిమ్న బలాలు. అవే మూడు నిమ్న లోకాలకి ఆధారభూతమైన తత్వాలు.

స్వర్లోకాన్ని దర్శించిన వారు అందరూ ఆ రహస్యమైన తేనె బావిలోని తీపులు జుర్రుకుంటారు. అందులో నుండి పైకి తన్నుకొస్తున్న సుమధుర స్రోతస్సులని దిశదిశలా గుమ్మరిస్తారు, *తమేవ విశ్వే పపిరే స్వర్దృశో బహు సాకం సిసిచుర్ ఉత్సమ్ ఉద్రిణమ్.* ఇంద్రుడు వృత్రుని సంహరించాక పర్వతం పై నుండి కిందికి ఉరికిన ఏడు నదులే ఆ మధుర స్రవంతులు, అవే సత్యపు సెలయేళ్లు, *ఋతస్య ధారాః.* మనం ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం ప్రకారం, ఆ ఏడు నదులు సత్యంలో, ఆనందంలో దివ్యమైన సాఫల్యాన్ని చెందిన సచేతన అస్థిత్వం యొక్క ఏడు తత్వాలు. ఇక్కడ ఏడు తలల ఆలోచన అంటే దివ్య జగతికి సంబంధించిన ఏడు ముఖాల జ్ఞానం. అదే బృహస్పతి యొక్క ఏడు కిరణాల జ్ఞానం, *సప్తగుమ్.* ఏడు నదులు అంటే దివ్య చైతన్యం యొక్క ఏడు రూపాలు లేదా చలనాలు. ఇక్కడ ప్రధానంగా చెప్పబడ్డ భావన ఏమిటంటే దివ్య అస్తిత్వానికి చెందిన ఏడు చలనాలలో దివ్య చైతన్యానికి చెందిన ఏడు రూపాలు స్థిరంగా నాటుకుని ఉండాలి, *ధియం వో అప్సు దధిషే స్వర్షాం.* స్వర్లోకాన్ని జయించగల ఆలోచనని జలాలలో స్థిరంగా నిలుపుతున్నాను.

స్వర్ ద్రష్టలు స్వర్లోకాన్ని చూడడం, తేనెలూరు బావి నుండి తీపులు జుర్రుకోవడం, వాటి దివ్యజలాలని విడుదల చెయ్యడం – ఈ ప్రతీకల ముసుగు వెనుక వినూత్న భువనాలని, అద్భుత చేతనా స్థితులని మానవాళికి పరిచయం చెయ్యడం కనిపిస్తుంది. ఆ విషయం తదుపరి శ్లోకంలో (II.24.5) తెలుస్తుంది – *సనా తా కా చిద్ భువనా భవిత్వా, మాద్భిః శరద్భిర్ దురో వరంతా వః; అయతన్తా చరతో అన్యద్ అన్యద్ ఇద్, యా చకార వయునా బ్రహ్మణస్పతిః* – "కొన్ని సనాతన భువనాలు (చేతనా స్థితులు) వ్యక్తం కావాల్సి వుంది; వాటి తలుపులు ప్రస్తుతం నీకు మూసుకుపోయి వున్నాయి[26]; మాసాలు, వత్సరాలు వాటిని

---

[26] ఇక్కడ సాయణుడు "వరంత" అన్న పదానికి "తెరువబడిన" అనే అర్థాన్ని తీసుకుంటాడు. అది సంభవమే కాని మామూలుగా "వృ" అంటే మూయడం, కప్పేయడం. ముఖ్యంగా నదులు, ఆవులు బయటికి వచ్చే పర్వత ద్వారాల సందర్భాన్ని తీసుకుంటే దాని అర్థం మూయడం అంటేనే సమంజసంగా ఉంటుంది. వృత్రుడు తలుపులు మూసేవాడు. "వి వృ" మరియు "అప వృ" అంటే తెరవడం. ఏదేమైనా ఆ పదానికి అర్థం తెరవడమే అయితే అది మన సిద్ధాంతాన్ని మరింత బలపరుస్తుంది.

తెరవాల్సి వుంది; ఒక లోకం మరో లోకంలో సునాయాసంగా కదులుతోంది; వీటన్నిటికి సంబంధించిన జ్ఞానాన్ని బ్రహ్మణస్పతి అభివ్యక్తం చేశాడు." '*వయునా*' అంటే జ్ఞానం. రెండు లోకాలు అంటే దివ్యమైన భువి, దివి – వీటిని బ్రహ్మణస్పతి సృష్టించాడు. రహస్యంగా (*గుహా*) మిగిలిన నాలుగు సనాతన ప్రపంచాలు ఇవే. ఈ లోకాలు ఆత్మలో అవ్యక్తంగా, అతిచేతనంగా ఉన్న భాగాలు. ఆ లోకాలు శాశ్వతంగా (*సనా భువనా*) ఉన్నా అవి మనకి తెలియవు కనుక ఉన్నా లేనట్టే. ఆ స్థితులని వాస్తవీకరించాలి (*భవీత్వా*), సృష్టించాలి. అందుకే వేదం కొన్ని చోట్ల స్వర్లోకాన్ని గోచరింప జేయడం గురించి మాట్లాడుతుంది (*వ్యచక్షయత్ స్వః*). దాన్ని కనుగొని వశం చేసుకోవడం (*విదత్, సనత్*) గురించి, దాన్ని సృష్టించి నిర్మించడం (*భూ, కృ*) గురించి మాట్లాడుతుంది. కాల గమనం వల్ల, మాసాల, వత్సరాల గతి వల్ల, ఆ రహస్య సనాతన లోకాలు మనకి కనిపించకుండా మూతబడి వున్నాయి అంటాడు ఋషి. కాబట్టి వాటిని కనుగొని, జయించి వెల్లడి చెయ్యాలి. కాలగమనంలో మనలో వాటిని సృజించుకున్నా, ఒక విధంగా కాలానికి ఎదురొడ్డి వాటిని సృజించినట్టే అవుతుంది. నా ఉద్దేశంలో మనలోని ఆంతరిక, మానసిక కాలాన్ని వికాసం గావించుకునే ప్రయత్నానికే యజ్ఞ సంవత్సరం ప్రతీక. యాజ్ఞికుడు పది నెలల పాటు యజ్ఞం చేశాకనే ఆత్మ (*బ్రహ్మ*) మంత్రం అతడికి వెల్లడి అవుతుంది. అప్పుడే ఏడు తలల ఆలోచనని, స్వర్గాన్ని జయించగల యోచనని అతడు కనుగొన గలుగుతాడు. ఆ ఆలోచనే చివరికి వృత్రుడు, పణులు పెట్టే యాతనలని దాటిస్తుంది.

అసలు I.62 లోనే నదులకి లోకాలకి మధ్య సంబంధం అర్థమవుతుంది. ఆ ఋక్కులో ఇంద్రుడు నవగ్వుల సహాయంతో కొండని బద్దలు కొట్టడం, దశగ్వుల సహాయంతో వలుణ్ణి జయించడం మొదలైన వృత్తాంతాలు ప్రస్తావించబడతాయి. అంగిరసుల ఆవాహన చేత ప్రేరితుడైన ఇంద్రుడు ఉష, సూర్యుడు, గోవుల సహాయంతో చీకటిని పారద్రోలి, పార్థివ పర్వత పీఠాన్ని విస్తారంగా పరిచి, మహోన్నతమైన స్వర్గసీమని స్థిరంగా నిలుపుతాడు. ఉన్నత చైతన్య భూమికలకి ద్వారాలు తెరిస్తే అందుకు ఫలితంగా భౌతిక ప్రపంచం విస్తారమవుతుంది, మనోస్థితి ఉద్ధరించబడుతుంది. "ఇదే అతడు సలిపిన మహోన్నత కృషి, అతడు సాధించిన చరమ విజయం," అంటాడు ఋషి నోధుడు (*దసమస్య చారుతమమ్ అస్తి*

దంసః). "దాని వల్ల తేనెలు జాలువారే నాలుగు ఊర్ధ్వ నదులు రెండు కుటిల ప్రపంచాలని పోషించాయి," *ఉపహ్వరే యద్ ఉపరా అపిన్వన్ మధ్వర్ణసో నద్యశ్ చతస్రః*. ఇక్కడ కూడా మళ్లీ ఆ తేనెలూరే బావి అనేక స్రవంతులని కలిపి గుమ్మరిస్తోంది. దివ్యమైన అంతర్యం, దివ్యమైన చేతనా శక్తి, దివ్యమైన ఆనందం, దివ్యమైన సత్యం అనే నాలుగు ఊర్ధ్వ నదులు తమ తేనెల వెల్లువలతో కిందికి దిగి మనస్సుని, దేహాన్ని ముంచెత్తుతాయి. రోదసి అని ఉమ్మడిగా పిలువబడే ఈ రెండు ప్రపంచాలు సామాన్యంగా కుటిల ప్రపంచాలు, వక్రతకి, అసత్యానికి చెందిన ప్రపంచాలు. మరి ఋతం అంటే తిన్నగా ఉండేది, అనృతం అంటే వక్రంగా ఉండేది. అవి అలా ఉండడానికి కారణం అవి చీకటికి, విభజనకి పుత్రులైన, అంధకార శక్తులైన వృత్రుడి యొక్క, పాణుల యొక్క దుష్ప్రభావానికి ఎప్పుడూ లోనై ఉంటాయి. ఆ లోకాలు ఇప్పుడు సత్యానికి, జ్ఞానానికి (*వయునా*) మూర్తిరూపాలై వెలుగుతాయి, బాహ్య ప్రభావానికి లోనవుతాయి. "చరతో అన్యద్ అన్యద్" అన్నప్పుడు, "యా చకార వయునా బ్రహ్మణస్పతిః" అన్నప్పుడు గృత్సముడు విన్నవిస్తున్నది కూడా ఇదే. ఆ తరువాత ఋషి అయస్యుడి కృషి ఫలితాన్ని వర్ణించడం ప్రారంభిస్తాడు. ఆ కృషి వల్లనే దివి, భువి యొక్క ఏకైక సనాతన రూపం వెల్లడి అవుతుంది. అయస్యుడు తన ఋక్కులతో "ఒకే గూటిలో శాశ్వతంగా కొలువున్న (దివ్య, మానవ తత్వాలు గల) రెండిటినీ కనుగొన్నాడు. ఆ పరిపూర్ణ విజయంతో, ఇరు సతులని భోగించే భర్తలా, అతడు దివిని, భువిని[27] మహోన్నత రోదసిలో (వెల్లడి అయిన అతిచేతన, *పరమం గుహ్యమ్*) స్థిరంగా నిలిపాడు." ఆ విధంగా దివ్యం గావించబడ్డ మానసిక, భౌతిక అస్తిత్వాన్ని ఆత్మ ఆనందిస్తుంది. స్థిరమైన ఆత్మ స్థితికి చెందిన సనాతన ఆనందంలో మనస్సు, దేహం ఒకే గూటిలో రెండు పులుగుల్లా ఒదిగిపోతాయి. ఆ అనుభవాన్ని ఇంతకన్నా సొగసుగా చిత్రీకరించడం కష్టం.

[27] ఈ సందర్భంలోనే కాక మరెన్నో ఇతర వేదభాగాల్లో కూడా, అన్యద్ అన్యద్, అన్నప్పుడు అది దివిని, భువిని సూచిస్తుందని నాకు అనిపిస్తుంది. ఒకటి భౌతిక చైతన్యం మీద ఆధారపడ్డ మానవస్థితి, రెండవది పారభౌతిక లోకం మీద, దివి మీద, ఆధారపడ్డ దివ్య స్థితి.

ఈ భావాలు, పదజాలం అంతా అంతకు ముందు గృత్సముడి ఋక్కులో మనం గమనించినవే. నోధ మహర్షి దృష్టిలో అంధకారమయమైన భౌతిక చేతనకి రాత్రి ప్రతీక, విరాజమానమైన మానసిక చైతన్యానికి పగలు ప్రతీక. నోధుడి వర్ణనలో కొత్తగా జన్మించిన రేబవళ్లు దివిలోను, భువిలోను వాటి నిజచలనాలని అనుసరించి కదులుతుంటాయి, *స్వేభిర్ ఏవైః... చరతో అన్యాన్యా* (ఉదాహరణకి గృత్సముడి భాషలో '*అయతాంత చరతో అన్యద్ అన్యద్, అయతాంత* అనే వర్ణన యొక్క, '*స్వేభిర్ ఏవైః*' (అంటే అప్రయత్నంగా, సహజంగా) అనే నోధుడి పదజాలం యొక్క తాత్పర్యం ఒక్కటే). గృత్సముడి ఋక్కులోనే కాక, నోధుడి ఋక్కులో కూడా అంగిరసులు, సత్యాన్ని తెలుసుకుని, అసత్యాన్ని తిరస్కరించి, ఆ ప్రయత్నంలో స్వర్ లోకాన్ని (ఏ సత్యం నుండి అయితే వారు ఆవిర్భవించారో, ఏదైతే దివ్య పురుషులందరికి స్వధామమై వుందో, ఆ లోకాన్ని) చేరుకుంటారు. "ఎవరైతే గమ్యాన్ని చేరుకుని పణుల ఐశ్వర్యాన్ని పొందుతారో, రహస్య గుహలో దాగిన పరమ పెన్నిధిని సాధిస్తారో, జ్ఞానాన్ని తెలుసుకుని కల్లలని కనిపెడతారో, వారు తమ జన్మస్థానాన్ని తిరిగి చేరుకుని ఆ లోకంలోకి ప్రవేశిస్తారు. సత్యాన్ని తెలుసుకుని, అసత్యాన్ని పొడగన్న ఆ ఋషులు, మళ్లీ సద్గతిని పొంది మహస్స్వధాన్ని చేరుకుంటారు." అంటే సత్య మార్గాన్ని (*మహస్ పథః*), విశాల మహత్తర సీమని, ఉపనిషత్తులు చెప్పిన మహస్సుని చేరుకుంటారు.

ఇప్పుడు ఈ వైదిక ప్రతీకల చిక్కు ముడిని విప్పే ప్రయత్నం చేద్దాం. ఇక్కడ బృహస్పతి ఏడు కిరణాల మేధావి, *సప్తగుః, సప్తరశ్మిః*. అతడే ఏడు ముఖాల, ఏడు నోళ్ల అంగిరసుడు. అనేక రూపాలలో జన్మనెత్తినవాడు, *సప్తాస్యస్ తువిజాతః*, తొమ్మిది కిరణాల వాడు, పది కిరణాల వాడు. ఇక్కడ ఏడు నోళ్లు అంటే దివ్య మంత్రాన్ని (*బ్రహ్మ*) ఉచ్చరించే ఏడుగురు అంగిరసులు. ఆ మంత్రమే సత్యానికి పీఠమవుతుంది, స్వర్లోకమవుతుంది. అతడు దానికి ప్రభువు అవుతాడు (*బ్రహ్మణస్పతిః*). ఆ ఏడుగురు బృహస్పతి యొక్క ఏడు కిరణాలతో సంబంధం గలవారు. కాబట్టి వారు ఏడుగురు ఋషులు – సప్త విప్రః, సప్త ఋష్యః. వాళ్లు సామాన్యంగా ఆ ఏడు కిరణాలకి ప్రతీకలు. ఆ ఏడు కిరణాలు మళ్లీ సూర్యుడి యొక్క ఏడు విరాజమాన అశ్వాలు, *సప్త హరితః*. వాటి పూర్ణ సంగమం అయస్యుడు చెప్పే ఏడు ముఖాల చింతన అవుతుంది. దాని చింతన పోయిన సత్యపు సూర్యుని తిరిగి సాధించడానికి

వీలవుతుంది. ఆ చింతన మళ్ళీ ఏడు నదులని, అంటే దివ్యము, మానవీయము అయిన ఏడు జీవన తత్వాలని స్థాపిస్తుంది. ఆ ఏడు తత్వాలే సంపూర్ణ అధ్యాత్మిక జీవనానికి పునాది అవుతాయి. మన ఆత్మలోని ఆ ఏడు నదులని వృత్రుడు అవరోధిస్తాడు, వలుడు ఆ ఏడు కిరణాలని వశం చేసుకుంటాడు. మనలో సత్యం యొక్క అనవధికమైన అవరోహణ చేత అసత్య విదూరమైన సంపూర్ణ దివ్య చైతన్యం మన వశమైనప్పుడు, మనకి స్వర్లోకంలో సుస్థిర స్థానం దొరుకుతుంది. మన అంతర్యంలోకి దివ్యాంశాల ప్రవేశం వల్ల, చీకటికి, అసత్యానికి, మృత్యువుకి అతీతమైన దివ్య స్థితికి ఉద్ధరించబడ్డ మనస్సును, దేహాన్ని మనం ఆనందించగలుగుతాము. ఈ విజయాన్ని పన్నెండు దశలు గల ఆరోహణా యాత్రలో సాధించడానికి వీలవుతుంది. వాటికి ప్రతీకగా యజ్ఞ వత్సరంలోని పన్నెండు నెలల కాలచక్రం ప్రతిపాదించబడింది. అందులోని కాలవిభాగాలు వరుసక్రమంలో విస్తరించే సత్యానికి, వరుసగా వచ్చే పగళ్లకి చిహ్నాలు. పదవ నెలలో చరమ విజయం దక్కుతుంది. తొమ్మిది లేదా పది కిరణాలకి కచ్చితమైన అన్వయం ఏమిటి? అన్నది మరింత కఠినమైన ప్రశ్న. ప్రస్తుతానికి వాటిని తెలిపే పరిస్థితిలో లేము. అయితే ఇప్పటి వరకు మనం సాధించిన తేజం ఋగ్వేదంలో ని ముఖ్యమైన ప్రతీకలు అన్నిటినీ వివరించడానికి సరిపోతుంది.

మానవ జీవితాన్ని ఒక యజ్ఞంగా, ఒక యాత్రగా, ఒక యుద్ధంగా చిత్రీకరించే ప్రతీకాత్మకత మీద వేదం మొత్తం ఆధారపడి ఉంటుంది. వేదం ద్వార మానవుడి అధ్యాత్మిక జీవనాన్ని వర్ణించడం ఋషుల ముఖ్యోద్దేశం. అయితే ఆ భావాలకి స్థూల రూపాన్ని ఇవ్వడం కోసం, ఆ బోధనలు అర్హత లేని వారి చేతుల్లో పడరాదనే ఉద్దేశంతో, అప్పటి బాహ్యజీవనానికి చెందిన అంశాలని ప్రతీకలుగా వాడుకున్నారు. ఆ కాలంలో సామాన్య ప్రజానీకంలో చాలా వరకు పశువులని కాచి బతికేవారు, లేదా నేలని నమ్ముకుని బతికేవారు. రాజుల మధ్య, రాజ్యాల మధ్య అడపాదడపా యుద్ధాలు జరిగేవి. ఆ యుద్ధాలలో నలిగిపోయే తెగలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస పోతుండేవి. అటువంటి జీవన నేపథ్యంలో యజ్ఞం చేసి దేవతలని ప్రసన్నం చేసుకోవడం అత్యంత ప్రధానమైన, కీలకమైన అంశంగా నిలిచింది. యజ్ఞం చేసి వర్షాన్ని కురిపించి నేలని పండించేవారు. శాంతికాలంలో అవసరమైన గోవులని, యుద్ధకాలంలో అవసరమైన గుర్రాలని పొందేవారు. బంగారాన్ని, బంగరు భూమిని

సాధించేవారు. యజ్ఞం చేత యోధులు యశస్సుని, ప్రభుతని, యుద్ధంలో విజయాన్ని పొందేవారు. యజ్ఞం చేసి నేలపై, సముద్రాలపై జరిగే దుస్తర యాత్రలలో రక్షణని పొందేవారు. పెద్దగా రవాణా సదుపాయాలు గాని, సమాచార వినిమయ సాధనాలు గాని లేని ఆ రోజుల్లో, మానవ సమాజాలు చెదురు మొదురు తెగలుగా జీవించే ఆ కాలంలో యజ్ఞం చేతనే జీవన భద్రతని, భాగ్యాన్ని పొందేవారు. ఆ విధంగా అప్పటి బాహ్య జీవనంలో కనిపించే ముఖ్యమైన అంశాలని తీసుకుని ఆ మహర్షులు ఆంతరిక జీవనానికి ప్రతీకలుగా తమ మంత్ర కవితలో వాడారు. మానవ జీవితం దేవతల కోసం చేసే యజ్ఞంగా వర్ణించారు. దుస్తర జలాలని దాటే యాత్రగా వర్ణించారు. దుర్గమమైన ఆత్మదుర్గాన్ని ఆరోహించే ప్రయత్నంగా వర్ణించారు. ఇక చివరిగా శత్రుదేశాల మీద పోరాటంగా వర్ణించారు. అయితే ఆ ప్రతీకలు అన్నిటినీ వేరువేరుగా పరిగణించలేదు. యజ్ఞమే ఒక యాత్ర. ఒక దివ్యమైన సుదూర గమ్యం దిశగా చేసే యాత్ర. ఆ యాత్ర, ఆ యజ్ఞం రెండూ దుష్టశక్తుల మీద చేసే పోరాటంగా ప్రతీ చోట వేదంలో వర్ణించడం జరిగింది.

వైదిక చిత్రావళికి చెందిన ఈ మూడు కీలక అంశాలని అంగిరసుల గాథ సమన్వయపరుస్తుంది. అంగిరసులు కాంతిబాటలో నడిచే తీర్థయాత్రికులు. వారి స్వాభావికమైన ప్రభావాన్ని తరచు '*నక్షంతః*' లేదా, '*అభినక్షంతః*' అనే పదాలతో అభివర్ణిస్తుంటారు. వారు లక్ష్యం దిశగా పయనిస్తూ అత్యున్నత స్థానాన్ని చేరుకుంటారు – '*అభినక్షంతో అభియే తమ్ ఆనశుర్ నిధిమ్ పరమమ్*' ("ప్రయాణం చేసి పరమ నిధిని పొందుతారు") (II.24.6). మానవ జీవనాన్ని లక్ష్యం దిశగా మరింత పురోగమింపజేయడం కోసం వారి ప్రభావాన్ని ఆవాహన చెయ్యడం జరుగుతుంది – '*సహస్ర సావే ప్ర తిరంత ఆయుః*' (III.53.7). కాని ఈ యాత్ర ఒక అన్వేషణ వంటిది అనుకుంటే, మరుగుపడ్డ కాంతి కోసం గాలింపు అనుకుంటే, చీకటి శక్తులతో ఘర్షణ వల్ల అదొక మహా ప్రయాస గాను, ఒక యుద్ధం గాను పరిణమిస్తుంది. అంగిరసులు ఆ యుద్ధంలో మహాశూరులు, యోధులు – *గోషు యోధాః* (గోవుల కోసం, అంటే కిరణాల కోసం పోరాడే వీరులు). వారు సహయాత్రికులుగా (*సరణ్యుభిః*), స్నేహితులుగా (*సఖిభిః*), ఋషులుగా, కవులుగా (*ఋక్వభిః, కవిభిః*), యుద్ధంలో యోధులుగా (*సత్వభిః*) ఇంద్రుడు వారితో కలిసి పనిచేస్తాడు. తరచు వారిని '*నృ*' లేదా '*వీర*' అనే శబ్దాలతో సూచిస్తారు. ఉదాహరణకి ఇంద్రుడు ఒక చోట విరాజమాన

ఆలమందలని “మన వాళ్లు” (*అస్మాకేభిః*) గెలిచారు అంటాడు. వారి చేత బలాన్ని పుంజుకున్న ఇంద్రుడు యాత్రని పూర్తి చేసి గమ్యాన్ని చేరుకుంటాడు (*నక్షద్-దాభం తతురిమ్*). ఈ యాత్ర దేవశునకం అయిన సరమ కనుగొన్న మార్గం వెంట, సత్య మార్గం వెంట (*ఋతస్య పంథాః*), మహా మార్గం వెంట (*మహస్పథః*) సాగుతుంది. ఆ మార్గమే సత్యసీమల వరకు సాధకుణ్ణి గొనిపోతుంది. యాజ్ఞికుడు చేసే యాత్ర అదే. అందులోని దశలు నవగ్వుల యజ్ఞంలోని దశలు. సోమరస పానం చేత, మంత్రోచ్చారణ చేత ఆ యజ్ఞం సాధ్యమవుతుంది.

సోమరస పానం చేత శక్తిని పుంజుకుని, విజయాన్ని సాధించే వృత్తాంతం వేదంలో పదే పదే సాక్షాత్కరిస్తుంది. ఇంద్రుడు అశ్వినులు గొప్ప సోమ పానకులు. అంతేకాక అసలు దేవతలందరూ ఆ సురపానాన్ని గ్రోలివాళ్లే. అంగిరసుల విజయాల వెనుక ఉన్న శక్తి కూడా సోమపానమే. సోమరస పాన మదోన్మత్తులైన ఆయస్యుడు, నవగ్వ అంగిరసులు వస్తారంటూ సరమ పణులని హెచ్చరిస్తుంది (*ఏహ గమన్న్ ఋషస్య సోమశితా అయాస్యో అంగిరసో నవగ్వాః* (X.108.8). ఆ మహత్తర శక్తి చేతనే మనుషులు సత్య మార్గాన ముందుకు సాగుతారు. “ఓ ఇంద్రా! ఆ సోమరసోన్మత్తత చేతనే నీవు స్వర్లోకపు ప్రాబల్యాన్ని (లేదా స్వరాత్మని, *స్వర్ణరమ్*) వెలయింపజేశావు. దశకిరణాల ఆహ్లాదంతో జ్ఞానదీప్తులని చిందింపజేసి (లేదా ఆ శక్తి చేత ఆత్మ సాంతాన్ని కంపింప జేశావు, *దశగ్వమ్ వేపయంతం*) సాగరాన్ని పోషించావు. ఆ సోమరసోన్మత్తత చేతనే నీవు ఘనమైన ఏరులని తేరులలా సముద్రం దిశగా ప్రోత్సహించావు. ఆ సత్య మార్గం వెంట పురోగమించాలనే మా కోర్కెను నెరవేరనీ.” (*పంథాం ఋతస్య యాతవే తమ్ ఈమహే*) (VIII.12.2-3). సోమపానపు శక్తి చేతనే పర్వతం భేదించబడింది, నిశాచరులు నిర్జించబడ్డారు. రహస్యమైన ఊర్ధ్వ లోకాల నుండి జాలువారే తీయదనమే ఈ సోమరసం. సప్త నదులలో ప్రవహించేది అదే. పవిత్ర యజ్ఞంలో సమర్పించబడే ఘృతంలో నిక్షిప్తమై వున్నది అదే. జీవనసాగరం లోంచి ఎగసి పడే తీయని వెల్లువ అదే. ఈ చిత్రాలు అన్నిటి వెనుక ఒకే ఒక అర్థం వుంటుంది. సమస్త ఉనికి వెనుక ఒక దివ్యమైన ఆనందం దాగి వుంటుంది. ఆ ఆనందం అభివ్యక్తమై సముత్తుంగ జీవన తరంగాలన్నిటికి ఆధారమై నిలుస్తుంది. మర్త్య స్థితిని అమరం గావించగల శక్తి అదే, దేవతల అమృతం అదే.

అయితే అంగిరసుల అతి ముఖ్యమైన సొత్తు మంత్రాక్షరం; ద్రష్టత్వం వారి స్వాభావిక లక్షణం. వాళ్లు '*బ్రాహ్మణాసః పితరః సోమ్యాసః... ఋతావృధః*' (VI.75.10). వాళ్లు సోమరస పూరితులైన పితరులు. మంత్రాక్షరం వారి సొత్తు. ఆ మంత్రంతో వాళ్లు సత్యాన్ని పెంచుతారు. దివ్యమార్గాన వారిని ముందుకు తోయడం కోసం ఇంద్రుడు తానే వారి ఆలోచనలని వ్యక్తం చేసే మంత్రోచ్చారణలలో పాల్గొని, వారి ఆత్మ లోంచి వెలువడే పదాలకి సంపూర్తిని, శక్తిని ప్రసాదిస్తాడు. *అఙ్గిరసామ్ ఉచథా జుజుష్వాన్ బ్రహ్మ తూతోద్ గాతుమ్ ఇష్ణన్* (II.20.5); అంగిరసులు తమ శక్తితో, తేజంతో ఆలోచనని ప్రవర్ధమానం గావించడం వల్లనే ఇంద్రుడు తన యాత్రని విజయవంతంగా పూర్తి చేసి పర్వతాగ్రాన ఉన్న గమ్యాన్ని చేరుకోగలిగాడు. "అతనిలో మన ఆది పితరులు, సప్తర్షులు, నవగ్వులు, తమ ఐశ్వార్యాన్ని మరింత పెంచుకుంటారు. అతడు తన యాత్రలో విజయుడై, పర్వతాగ్రాన నిలిచి, అమోఘమైన వాక్కు కలిగి, ప్రజ్వలమైన ఆలోచనలతో వెలుగొందుతాడు." *నక్షద్దాభం తతురిమ్ పర్వతేష్ఠామ్ అద్రోఘవాచమ్ మతిభిః శవిష్ఠమ్* (VI.22.02). ఋక్కుని గానం చేసి మన ఆత్మ గుహలో దాగిన సౌరతేజాన్ని కనుగొన్నారు, *అర్చంతో గా అవిన్దన్*[28] (I.62.2). సప్తర్షుల గానానికి ఆధారమైన *ష్టుభ్* ఛందస్సు చేత, నవగ్వుల మంత్రాల గంభీర నినదం చేత, స్వర్ యొక్క ప్రచండ శక్తితో ఇంద్రుడు పూరించబడతాడు*, స్వరేణ స్వర్యః*. దశాగ్వుల కేకతో అతడు వలుణ్ణి వక్కలు చేస్తాడు (I.62.4). మరి ఆ కేక ఊర్ధ్వ లోకాల నినాదం, ఇంద్రుడి పర్జన్య గర్జన. తమ మార్గంలో అంగిరసుల పురోగమనం, ఊర్ధ్వ లోకాల భేరీనినాదం, *ప్ర బ్రాహ్మణో అంగిరసో నక్షంత, ప్ర క్రందనుర్ నభన్యస్య వేతు* (VII.42.1). సూర్యుణ్ణి, ఉషని, గోవుని కనుగొన్న అంగిరస బృహస్పతి యొక్క వాక్కు దివ్యవాణి, అది దేవలోకపు పర్జన్యం - *బృహస్పతిర్ ఉషసం సూర్యం గామ్ అర్కం వివేద స్తనయన్న్ ఇవ ద్యౌః* (X.67.5). సత్యమైన చింతన, సత్యమైన ఛందస్సు ద్వార వ్యక్తమైన సత్య మంత్రం వల్లనే, దాగిన కాంతిని కనుగొని, ఉషని వెల్లడి చెయ్యడానికి వీలవుతుంది, *గూఢం జ్యోతిః పితరో అన్వవిన్దన్, సత్యమంత్రా అజనయన్న్ ఉషాసమ్* (VII.76.4). ఈ అంగిరసులు సరైన, స్థిరమైన వాక్కు గలవారు, *ఇత్థా వదద్భిః అంగిరోభిః* (IV.18.5). ఋక్కును జయించిన వారు, తమ ఆలోచనని నిర్దోషంగా వ్యక్తం చెయ్యగల సమర్థులు*, స్వాధీభిర్ ఋక్వభిః*

---

[28] వేదంలో అర్చతి అంటే భాసించడం, ఋక్కుని గానం చెయ్యడం; వేద ఋక్కులలో అర్క అంటే సూర్యుడు, కాంతి.

(VI.32.2). వారు సురసుతులు, పురుషోత్తముణ్ణి సేవించే శూరులు, సత్య వాక్కు పలికేవారు, ఋజు చింతన గలవారు, విరాజమాన విజ్ఞాన పీఠాన్ని అందుకోగలవారు, యజ్ఞానికి పరంధామాన్ని మానసికంగా వ్యక్తం చెయ్యగలవారు (*ఋతం శంసంత ఋజు దీధ్యానా దివస్ పుత్రాసో అసురస్య వీరాః; విప్రం పదమ్ అంగిరసో దధాన, యజ్ఞస్య ధామ ప్రథమం మనంత* (X.67.2).

అటువంటి మంత్రకవితలోని ఉద్దేశం కేవలం గుహల్లో జీవించే ద్రావిళ్లు దొంగలించిన ఆవులని, ఒక దేవత, ఒక కుక్క దారి చూపగా ఎవరో ఆర్య ఋషులు కనుక్కున్న కథలని వెల్లడి చెయ్యడమే ననుకోవడం అసంగతం అనిపిస్తుంది. ఆర్కిటిక్ ప్రాంతాలకి చెందిన పగళ్ల వైచిత్రి పైన చెప్పుకున్న కవితల్లో కనిపించే చిత్రాలకి అర్థం చెప్పడానికి, మంత్రం, యోచన, సత్యం మొదలైన తరచుగా వినిపించే భావాలకి సంజాయిషీ చెప్పడానికి, అసత్యాన్ని జయించే ఆ మహత్తర యాత్రల అంతరార్థం వివరించడానికి సరిపోదు. ఇక్కడ మనం ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం, బయటి నుండి కృతకంగా చొప్పించినది కాక, వైదిక పరిభాష లోంచి, ఋక్కుల రహస్య సూచనల లోంచి సహజంగా ఉత్పన్నమైన ఈ సిద్ధాంతం, పైపైన చూస్తే విడ్డూరంగా, అసంగతంగా తోచే ఎన్నో వివరాలని స్పష్టంగా, సరళంగా ప్రదర్శిస్తుంది. ఒక సారి కేంద్ర భావనని గ్రహిస్తే, వేద ఋషుల మనస్తత్వాన్ని, వారి ప్రతీకల వెనుక ఉన్న మూల సూత్రాన్ని గుర్తిస్తే, విషయం తేటతెల్లం అవుతుంది. వైదిక ప్రతీకల వెనుక ఒక నిర్దిష్టమైన నియమం, విధానం కనిపిస్తుంది. తరువాత వచ్చిన ఋక్కులలో అడపాదడపా తప్ప, ఆ నియమాలని గందరగోళంగా ఉల్లంఘించడం జరగదు. ఆ నియమాలని అనుసరిస్తూ పోతే వైదిక సత్యం ప్రతీ చోట సులభంగానే దర్శనమిస్తుంది. ఎక్కడో కొన్ని చోట్ల మాత్రం ప్రతీకల మేళవింపులో కొంత పరిమితమైన స్వేచ్ఛని తీసుకోవడం జరుగుతుంది. అయితే ఎలాంటి కవితాసృష్టిలో నైనా అంత మాత్రం స్వేచ్ఛని తీసుకోకుండా ఉండడం జరగదు. వైష్ణవుల పవిత్ర కవితాసృష్టి అలాంటి స్వేచ్ఛకి తార్కాణం. కాని వైదిక చింతనలోని సారం మాత్రం ప్రతీ చోట స్థిరంగా, నిర్వికారంగా వెలుగొందుతూ ఉంటుంది.

అధ్యాయం 18

మానవ పితరులు

అంగిరస ఋషుల యొక్క ఈ లక్షణాలన్నిటి బట్టి చూస్తే వాళ్లు వైదిక వ్యవస్థలో దేవకోటికి చెందినవారిలా కనిపిస్తారు. బాహ్యంగా చూస్తే తేజస్సుకు, వాణికి, జ్వాలకి మూర్తిరూపాలుగా కనిపించినా, ఆంతరికంగా మాత్రం దేవతలకి తమ యుద్ధాలలో తోడ్పడే సత్య శక్తులుగా సాక్షాత్కరిస్తారు. కాని దివ్యద్రష్టలుగా, సురసుతులుగా, స్వామి కార్యాన్ని తీర్చే శూరులుగా ఈ ఋషివర్యులు, పురోగతి కోసం ఆకాంక్షించే మానవాళికి ప్రతిరూపాలు. వాళ్లు సురులకి సుతులు (*దేవపుత్రాః*), అగ్నికి బిడ్డలు, అనేకరూపాలు గల బృహస్పతి తనయులు అన్నది నిజమే. సత్య లోకానికి వారి ఆరోహణని వాళ్లు ఎక్కడి నుండి వచ్చారో అక్కడికే పోతున్నట్టుగా వర్ణిస్తారు. ఈ లక్షణాల బట్టి చుసినా వాళ్లని మానవాత్మకి ప్రతినిధులుగా పరిగణించొచ్చు. మరి మానవాత్మ కూడా ఆ లోకం నుండే అవతరించింది; కాబట్టి ఇప్పుడు తిరిగి అక్కడిగే ఆరోహించాల్సి వుంది. ఎందుకంటే దాని మూలంలో అది మనోజీవి. అమృతత్వానికి సుతుడు (*అమృతస్య పుత్రః*), సురశిశువు. స్వర్గంలో జన్మించినా అది ధరించిన దేహాల కారణంగా మర్త్యస్థితిని పొందింది. యజ్ఞంలో అంగిరసుల పాత్ర మానవ పాత్ర. మంత్రాన్ని ఆవిష్కరించి, దేవతలని ఆవాహన చేసేలా ఆత్మగీతాన్ని ఆలపించి, వారిని వేల రీతుల వినుతించి, నైవేద్యాన్ని సమర్పించి, సోమరసపానం చేసి, దివ్య శక్తులని పెంచి,

దివ్యమైన ఉషస్సుని జనింపజేసి, విరాజమాన సత్యం యొక్క విమల తరళ రూపాలని గెలిచి, ఆ సత్యం యొక్క రహస్య, సుదూర పరంధామానికి ఆరోహించడం – ఇదీ అంగిరసుల పని.

ఈ యజ్ఞ కర్మలో అంగిరసులు ద్వంద్వరూపంలో వ్యక్తమవుతారు[29]. ఒక పక్క వారు దివ్యులైన అంగిరసులు, *ఋషయో దివ్యాః* – కొన్ని అధ్యాత్మిక శక్తులకి ప్రతీకలై వీరు దేవతలకి మల్లె పని చేస్తుంటారు. మరో పక్క వారు మానవ పితరులు, *పితరో మనుష్యాః* – వీరు ఋభులకి మల్లె మనుషులుగా, మానవ శక్తులుగా మసలుతుంటారు. వారి తమ కృషి చేత అమరత్వాన్ని సిద్ధించుకుని, తక్కిన మానవాళికి ఆ దివ్య గమ్యాన్ని చేరే మార్గం చూపిస్తుంటారు. ఇందుకు చాలా భిన్నంగా పదవ మండలంలో యమ సూక్తంలో భృగులతోను, అథర్వులతో పాటు బర్హిషద్ పితరులుగా అంగిరసులని వర్ణించడం జరుగుతుంది. యజ్ఞంలో వారు కూడా తమ ప్రత్యేక భాగాన్ని స్వీకరిస్తారు. తక్కిన వేదంలో మారికి మరింత విశాలమైన ప్రతీకాత్మక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఘనమైన మానవ యాత్రలో వారిని ఆవాహన చెయ్యడం జరుగుతుంది. మరి మన పూర్వజులు సాధించిన మానవ యాత్ర యొక్క లక్ష్యం మర్త్య స్థితి నుండి అమరత్వాన్ని చేరుకోవడం, అసత్ నుండి సత్ ని చేరుకోవడం. ఆ మార్గంలోనే వారు తమ కింది తరాలకి దారి చూపుతున్నారు.

అంగిరసుల పని తీరు గురించి ఈ ఋక్కులలో (VII.42, VII52) మరింత వివరంగా చెప్పబడింది. వశిష్ఠుడికి చెందిన ఈ రెండు సూక్తాలలో ఒక దాంట్లో ఆ మహాయాత్రలో సహాయపడమని దేవతలని ఆవాహన చెయ్యడం జరుగుతుంది, *అధ్వర యజ్ఞ*[30]. యజ్ఞం

[29] పురాణాలు ప్రత్యేకించి రెండు రకాల పితరులని వర్ణిస్తాయి. మొదటి వర్గం వారు దివ్య పితరులు. వీరు దేవకోటికి చెందిన వారు. రెండవ వర్గం వారు మానవ పితరులు. వీరికే పిండాన్ని సమర్పించడం జరుగుతుంది. పురాణాలు మరి నిశ్చయంగా వెనకటి వైదిక సాంప్రదాయాన్నే కొనసాగించాయి.

[30] అధ్వర యజ్ఞ అనే పదాలని సాయణుడు భంగపడని యజ్ఞ అన్న అర్థంలో అన్వయిస్తాడు; కాని ఈ "భంగపడని" అనే పదాన్ని యజ్ఞాన్ని పర్యాపదంగా వాడడానికి సాధ్యపడదు. అధ్వర అనే పదానికి "ప్రయాణించే," "కదిలే" అనే అర్థం వస్తుంది. అధ్వన్ అనే శబ్దానికి మార్గం, యాత్ర అనే అర్థాలు ఉన్నాయి. ఇది అధ్ అనే వినష్ట మూలశబ్దం నుండి వచ్చింది. ఈ అధ్ అనే శబ్దానికి కదిలే, విస్తరించే, విశాలంగా, సంక్షిప్తంగా మొదలుకొని పలు అర్థాలు

ద్వారా చేసే ఆ మహాయాత్ర దేవతల స్వధామానికి గొనిపోతుంది. ఆ యాత్ర ఒక యుద్ధం కూడా. "ఓ అగ్నీ! ఈ మార్గం నీకు అనాదిగా తెలిసిన మార్గం, అతి సులభమైన మార్గం. నీ సోమరస నైవేద్యం చేత వీరుణ్ణి మోసుకు పోతూ ఉరకలు వేసే గుర్రాలని అదుపు చేయి. ఆసీనుణ్ణి అయిన నేను ఆ జన్మలని దివ్యజన్మలుగా గుర్తిస్తాను" (రెండవ ఋక్కు). ఇంతకీ ఏమిటా మార్గం? మర్త్యమైన ఈ పృథివి నుండి దేవతల పరంధామానికి గొనిపోయే మార్గమది. ఆ దివ్య ధామం నుండి దేవతలు అంతరిక్షం అంటే ప్రాణ తలం ద్వారా ఈ భూమికి దిగి వచ్చి మనిషి చేసే యజ్ఞాన్ని స్వీకరిస్తారు. ఆ యజ్ఞం చేతనే మనిషి దేవతల స్వధామానికి ఆరోహిస్తాడు. అగ్ని తన అశ్వాలని, పలు వన్నెల శక్తులని, తన దివ్యాగ్ని కీలలని, అదుపు చేస్తాడు. యజ్ఞమనే యుద్ధంలో విరోధశక్తులతో తలపడే వీరుడిలోని యుద్ధశక్తికి ప్రతీకలే ఆ అశ్వాలు. దివ్య జన్మలు అంటే దేవతలే, మానవుడి దివ్యజీవనంలో అభివ్యక్తమయ్యే దైవీశక్తులు. నాల్గవ ఋక్కులో ఈ భావన మరింత స్పష్టమవుతుంది. "ఆనందంలో నిండుగా కొలువున్న అతిథి, ద్వారాలు గల వీరుడి ఇంట్లో జ్ఞానానికి చెందిన ఎరుకని సంపాదించినప్పుడు, సంతుష్టుడైన అగ్ని ఆ ఇంట్లో స్థిరంగా కొలువైనప్పుడు, యాత్రను చేసే జీవికి సకల శ్రేయస్సులు ప్రసాదిస్తాడు."

ఉత్తమ శ్రేయస్సును, దివ్యజన్మని, పరమానందాన్ని చేరుకునే యాత్రలో తోడ్పమని ఈ ఋక్కులో అగ్నికి ఆవాహన చేస్తున్నారు. ఋక్కు మొదటి శ్లోకంలోనే యాత్రకి కావలసిన పరిస్థితులు సమకూర్చమని ప్రార్థిస్తున్నారు. అవి తీర్థయాత్రికులు చేసే యజ్ఞానికి చెందిన రూపురేఖలు అన్నమాట, అధ్వరస్య పేశః. వాటిలో మొట్టమొదటిది అంగిరసుల పురోగమనం – "మంత్రానికి హోతలైన అంగిరసులు వేగంగా ముందుకు సాగాలి. స్వర్గనినాదం (లేదా స్వర్గానికి చెందిన ఓ విషయం, మేఘం, లేదా మెరుపు) వేగంగా పురోగమించాలి. జలాలని వ్యాపింపజేసే ఆవులు వేగంగా పురోగమించాలి. ఋబ్బురోటి రాళ్లు

ఉన్నాయి. గాలి, లేదా ఆకాశం అనే అర్థాలు గల అధ్వ అనే శబ్దాన్ని బట్టి, ఇంచుమించు అలాంటి అర్థాన్నే కలిగిన అధ్వర అనే పదాన్ని బట్టి, అధ్వన్ మరియు అధ్వర అనే పదాల మధ్య సంబంధాన్ని ఊహించవచ్చు. వేదంలో ఎన్నో చోట్ల అధ్వర లేక అధ్వర యజ్ఞ అనే పదాలు ప్రయాణించడం, మార్గంలో ముందుకు సాగడం అనే అర్థాలు కలిగి ఉండడం కనిపిస్తుంది.

రెండూ వారి కార్యంలోనే పని చెయ్యాలి – ఇవన్నీ తీర్థయాత్రికుడి యజ్ఞం యొక్క రూపురేఖలు.” *ప్ర బ్రహ్మాణో అంగిరసో నక్షంత ప్ర క్రందనుర్ నభన్యస్య వేతు / ప్ర ధేనవ ఉదప్రుతో నవంత యుజ్యాతం అద్రీ అధ్వరస్య పేషః.* దివ్య వాక్కు గల అంగిరసులు, స్వర్లోకపు విరాజమాన వాణి అయిన స్వర్గ నినాదం, ఆ వాక్కు లోనుండి పెల్లుబికే పర్జన్య గర్జన, స్వర్లోకపతి అయిన ఇంద్రుడి పర్జన్య ఆయుధం చేత విడిపించబడ్డ ఏడు దివ్య జలాలు, ఆ దివ్యజలాల ప్రవాహం వల్ల వెలువడ్డ అమృతతుల్యమైన సోమరసం, - ఇవన్నీ అధ్వర్య యజ్ఞం యొక్క రూపం (పేషః) అవుతాయి. దాని ప్రథమ లక్షణం పురోగమనం. దివ్య లక్ష్యం దిశగా అన్నిటి పురోగమనం. ఆ పురోగమనం అనే భావనని మూడు క్రియావాచకాలు వ్యక్తం చేస్తున్నాయి – *నక్షంత, వేతు, నవంత.* ఇవి కాకుండా ప్రతీ వాక్యాంశం ‘ప్ర’ అనే అక్షరంతో ప్రారభం కావడం కూడా ఆ పురోగమనం అనే భావనని బలపరుస్తోంది.

కాని యాభై రెండవ ఋక్కులో భావం మరింత స్ఫుటంగా గోచరిస్తుంది. మొదటి ఋక్కు ఇలా అంటుంది – “జగజ్జని తనయులారా (ఆదిత్యాసో)! మేము సైతం అనంత జీవులు కావాలి (*అదిత్యః స్యామ*). మా దివ్యత్వంలోను, మనుష్యత్వంలోను (*దేవత్రా మర్త్యత్రా*) వసువులు మమ్మల్ని రంక్షించుగాక. ఓ మిత్రా వరుణా! మీకు వశమైన మేము మిమ్మల్ని వశం చేసుకోవాలి, ఓ దివీ భువీ! వికాసం చెంది మేము మీతో ఐక్యత పొందాలి.” *సనేమ మిత్రా వరుణా సనంతో, భవేమ ద్యావాపృథ్వీ భవంతః.* ఇక్కడ అనంతను ప్రాప్తించుకుని అనంతులం కావాలని, అదితికి బిడ్డలు కావలన్న తాత్పర్యం కనిపిస్తోంది, *ఆదిత్యః, ఆదిత్యాసో.* మిత్ర, వరుణులు ఇరువురు సూర్య సావిత్రి యొక్క బలాలు అన్న విషయం గుర్తుంచుకోవాలి. ఈ సూర్య సావిత్రి తేజస్సుకి, సత్యానికి దేవత. ఇక మూడవ ఋక్కు ఇలా అంటుంది – “తమ లక్ష్యం దిశగా వేగంగా కదిలే అంగిరసులు దివ్య సావిత్రి యొక్క ఆనందం దిశగా పయనించాలి. *యజ్ఞభుక్* అయిన మా మహాపితరుడు, మరియు దేవతలంతా ఐక్యమై హృదయంలో స్వీకరించాలి. *తురణ్యవో నక్షంత రత్నం దేవస్య సవితుర్ ఇయానాః.* దీన్ని బట్టి అంగిరసులు కాంతి దిశగా, సౌర దేవత యొక్క సత్యం దిశగా పయనించే యాత్రికులు అని తెలుస్తోంది. ఆ సౌరసత్యం నుండే పణులని గెలిచి సాధించబడ్డ కాంతులీనే గోవులు జనిస్తాయి. తేజం, సత్యం ఆధారంగా నిలిచిన ఆనందం దిశగా అంగిరసులు పయనిస్తారు. ఈ యాత్ర వల్ల దివ్యత్వం లోకి, అనంతమైన ఆత్మస్థితిలోకి (*ఆదిత్యః స్యామ*)

వికాసం చెందడం జరుగుతుంది. మనలో మిత్ర, వరుణుల చర్య వల్ల, శాంతి ఆనందాలు వృద్ధి చెందుతాయని ఈ ఋక్కులో (రెండవ శ్లోకంలో) చెప్పబడింది. దివ్యత్వంలో, మర్త్యత్వంలోను వసువులు మనల్ని సంరక్షిస్తారు.

ఈ రెండు ఋక్కులలోను సామాన్యంగా అంగిరస ఋషుల ప్రస్తావన వస్తుంది. తక్కిన ఋక్కులలో కేవలం మొట్టమొదట కాంతిని కనుగొన్న మానవ పితరుల గురించి మాత్రమే ప్రస్తావించడం జరుగుతుంది. ఆలోచనను, వాక్కుని సిద్ధించుకున్న ఆ మానవ పితరులు రహస్య, విరాజమాన ఆనందసీమలని గాలిస్తూ పయనిస్తారు. ఇంతవరకు మనం అర్థం చేసుకున్న విషయాలని దృష్టిలో ఉంచుకుని ఇంకా ముందుకు సాగుతూ ఈ మానవ పితరులని కీర్తించే మరిన్ని ప్రగాఢ, సుందర శ్లోకాలని పరిశీలిద్దాము. ముందుగా వేద ఋషులు తమ మహోన్నత లక్ష్యంగా పరిగణించే దాని సారాంశాన్ని గమనిద్దాము. ప్రాచీనులు, ప్రజ్ఞావంతులు అయిన మన పూర్వీకులు తమ తరువాత వచ్చే మర్త్య జీవుల తరాల కోసం ఆ యాత్రని, ఆ విజయాన్ని ఒక ముఖ్య లక్ష్యంగా ప్రకటించారు. చుట్టూ క్రమ్ముకున్న చీకటి (*రాత్రీ పరితక్మ్యా*) శక్తులపై విజయమే ఆ విజయం. వృత్రులు, శంబరులు, వలులు, రాక్షసులు, మహాకాయులు, నాగులు, మొదలైన ఉపచేతనా శక్తులు తేజస్సుని, శక్తిని తమ గుప్పెట్లో పెట్టుకుని, తమ అంధకారమయ, మిథ్యామయ పట్టణాలలో దాచుకుంటారు. ఆ కాంతిని, శక్తిని తమ కోసం వినియోగించుకోలేరు. అలాగని వాటి మనోజీవి అయిన మానవుడికి ఇవ్వనూ ఇవ్వరు. వారి అజ్ఞానాన్ని, చెడుని, బంధనాలని మన నుండి దూరంగా నెట్టివేస్తే సరిపోదు. వాటిని భేదించి అక్కడ దాగిన కాంతిని, మంచిని, అనంతతని వెలువరించాలి. వేసారిన ఆ అజ్ఞానంలో ఒక రహస్య జ్ఞానం, ఒక మహత్తర కాంతి, సత్యం దాగి వున్నాయి. ఆ చెడు గుప్పెట్లో ఒక అనంతమైన మంచి బందీగా పడి వుంది. చావు పొలిమేరలకి ఆవల ఒక అనవధికమైన అమరత్వానికి బీజాలు విస్తరించి వున్నాయి. ఉదాహరణకి వలుడు ఒక కాంతి వలయం. అతడి దేహం కాంతిమయం (*వలం గోమంతమ్*). అతడి గుహ నవనిధి భరితమైన నగరం (*గోవపుషం వలమ్*). ఆ దేహాన్ని ఛిన్నం చెయ్యాలి, ఆ నగరాన్ని విచ్ఛిన్నం చేసి ఆ నిధులని కొల్లగొట్టాలి. మానవాళి సాధించవలసిన కార్యం ఇదే. ఆ విజయాన్ని ఎలా సాధించాలో మన పూర్వీకులు చేసి చూపించారు. కాంతిపూర్ణులైన దేవతల సహకారంతో ఆ విజయాన్ని సాధించగలము. "మీ దేవతలకి మాకు మధ్య ఆ

పురాతన స్నేహం స్థిరంగా వర్ధిల్లుగాక. అంగిరసులు ఆ మంత్రాన్ని సరిగ్గా ఉచ్చరించినప్పుడు ధృఢంగా నిలిచిన దాన్ని మీరు కూలదోయగలిగారు. మీ మీదకి లంఘించిన వలుణ్ణి నిర్జించారు. ఓ విజయులారా! ఆ మహత్కార్యాన్ని సాధించి మూసి వున్న అతడి నగర ద్వారాలు అన్నీ తెరిచారు" (VI.18.5). ప్రాచీన మానవ సాంప్రదాయాలు అన్నిట్లోను ఆదిలో ఈ పురాతన స్మృతి ఒకటి నిలిచి ఉంటుంది. అది ఇంద్రుడు మరియు వృత్రుడు అనే సర్పం కావచ్చు. అపోలో మరియు పైథాన్ అనే సర్పం కావచ్చు. థార్ మరియు మహాకాయులు కావచ్చు. సిగర్డ్ మరియు ఫాఫ్నర్ కావచ్చు. కెల్టిక్ పురాణాలలో పరస్పరం కలహించే దేవతాకూటమి కావచ్చు. కాని ఒక్క వేదంలో మాత్రమే ఈ చిత్రాల వెనుక దాగిన రహస్య సందేశం మనకి గోచరిస్తుంది. పూర్వచారిత్రక మానవాళి ఎదలో వెలిగిన ఒక ఆశ, ఎగసిన ఒక కాంతిరేఖ మనకి సాక్షాత్కరిస్తుంది.

మనం తీసుకోబోయే మొదటి ఋక్కు (III.39) ఋషి విశ్వామిత్రుడు రచించినది. అది ప్రస్తుతం మనం చర్చిస్తున్న అంశం యొక్క కేంద్రం వద్దకు తీసుకుపోతుంది. అది మన పూర్వీకుల మేధ (*పిత్ర్యా ధీః*) యొక్క వర్ణనతో మొదలవుతుంది. పూర్వీకుల మేధ అంటే అత్రులు కీర్తించిన స్వర్లోకాన్ని సాధించిన మేధ. నవాగ్వుల కోసం అయాస్యుడు కనుగొన్న ఏడు తలల ఆలోచన. పితరులైన అంగిరసులతో సంబంధం పరంగా దాని గురించి ఇక్కడ చర్చించడం జరుగుతుంది. "ఆ ఆలోచన హృదయంలో జనించి, స్తోమగా మారి, తన ప్రభువైన ఇంద్రుడి దిశగా పయనిస్తుంది." ఇంద్రుడు విరాజమాన మానసానికి ప్రభువు, తేజోమయ లోకానికి, దాని తటిల్లతలకి రేడు. పదాలని, ఆలోచనలని తరచు గోవులుగాను, స్త్రీలు గాను అభివర్ణించడం కద్దు. ఇంద్రుడు వృషభుడు, లేక భర్త. పదాలు అతణ్ణి కోరుకుంటాయి. వాంఛిస్తూ అతడి మీద వాలుతాయి. *గిరః ప్రతి త్వామ్ ఉద్ అహాసత వృషభం పతిం* (I.9.4). వైదిక చింతన ఊహించిన చరమ లక్ష్యం విరాజమాన స్వర్లోకపు మానసం. ఉపచేతనా గుహలలో బందీలుగా ఉన్న ఆత్మప్రకాశనాలు ఆత్మ యొక్క అంతరాళాల లోనుండి పైకి తన్నుకొస్తున్న పశుసందోహాలు అన్నట్టుగా వేదభాష వర్ణిస్తుంది. స్వర్లోకానికి ప్రభువైన ఇంద్రుడే వృషభుడు, ఈ పశువులకి పతి, *గోపతిః*.

ఆ ఆలోచనని ఋషి ఇంకా ఇలా వర్ణిస్తూ వస్తాడు. "ఆ ఆలోచనని వ్యక్తం చేసినప్పుడు అది జ్ఞానాన్ని గురించిన నిండైన ఎరుక కలిగి ఉంటుంది." అది పణుల నిద్రావస్థ లోకి జారుకోదు. (*యా జాగృవిర్ విధతే శస్యమానా*); "ఓ ఇంద్రా! నీ నుండి జన్మించినది (లేక నీ కోసం జన్మించినది), దాని జ్ఞానాన్ని స్వీకరించు." ఇది వేదంలో పదే పదే కనిపించే సూత్రం. దివ్యుడైన దేవత, మనిషి లోంచి ఆవిర్భవించి తనని చేరుకుంటున్నది ఏమిటి అన్నది గుర్తించాలి, దాని గురించిన ఎరుకని సంపాదించాలి (*విద్ధి, చేతతః* మొ॥). లేకుంటే అది మనిషిలోనే మిగిలిపోతుంది. దానికిక "దేవతలని చేరుకునే" (*దేవేషు గచ్ఛతి*) అవకాశం ఉండదు. "అది ప్రాచీనం (లేక సనాతనం). అది స్వర్గం నుండి జనించినది. అది వ్యక్తమైనప్పుడు జ్ఞానంలో ఎరుకను కలిగి ఉంటుంది. తెల్లని, ఆనందమయమైన దుస్తులు దాల్చినది, అదే మనలో పితరుల ప్రాచీన మేధ (*సేయమ్ అస్మే సనజా పిత్ర్యా ధీః*). అప్పుడు ఋషి ఆ ఆలోచన లేదా మేధ గురించి ఇలా అంటాడు – "కవలలకి తల్లి, ఇక్కడ కవలలకి జన్మ నిస్తుంది. నాలుక చివర అది అవతరించి నిలుస్తుంది. ఇరు కవలల దేహాలు ఒకదాన్నొకటి పెనవేసుకుని ఉంటాయి. అవి చీకటిని హరిస్తాయి. మహోజ్వలమైన శక్తికి పునాదిలో అవి చరిస్తాయి." కాంతులీనే ఈ కవలల గురించి ఇక్కడ చర్చించను. ఎందుకంటే అది మన ప్రస్తుత చర్చాంశం నుండి దూరంగా తీసుకుపోతుంది. ఒక్కటి మాత్రం ఇప్పుడు చెప్పగలను. వేరే సందర్భంలో ఆ కవలలకి అంగిరస ఋషులకి, వారు మహోన్నత జన్మని (సత్యతలాన్ని) స్థాపించడానికి మధ్య సంబంధం వర్ణించబడుతుంది. ఇంద్రుడు స్ఫుట వాక్కుని కవలలలో స్థాపిస్తాడు అన్నట్టుగా ఆ సందర్భంలో (I.83.3) చెప్పబడింది. ఏ మహోజ్వల శక్తి యొక్క పునాదిలో వారు కదులుతుంటారో ఆ మహోజ్వల శక్తి నిశ్చయంగా తమోహరుడైన సూర్యుడే అయ్యుండాలి. ఆ పునాది సత్యానికి పునాది అయ్యుండాలి, *ఋతస్య బుధ్నః*. పైగా ఆ కవలలకి సూర్యుడి ఇద్దరు కవల పిల్లలకి (యమ, యమి) మధ్య సంబంధం ఉండే ఉండాలి. పదవ మండలంలో యముడికి అంగిరసులకి మధ్య సంబంధం ప్రకటించబడింది.

ఆ విధంగా విశ్వామిత్రుడు ప్రాచీన చింతన గురించి, దాని కవల పిల్లల గురించి ప్రస్తావించాక, ఆ చింతనకి రూపం పోసిన ప్రాచీన పితరుల గురించి, "సత్యాన్ని, చీకట్లో దాగిన సూరుణ్ణి" వారు ఆవిష్కరించి సాధించిన మహద్విజయం గురించి వర్ణిస్తాడు. "గోవుల కోసం పోరాడే ఆ

ప్రాచీన పితరులని ఆక్షేపించగలవారు మర్త్యులలో ఎవరూ లేరు (నా ఉద్దేశంలో దీనికి అర్థం మర్త్యులలో వారిని బంధించగలవారు, వారి దారికి అడ్డుపడగలవారు ఎవరూ లేరు). ఘనుడైన ఇంద్రుడు, విజయుడైన ఇంద్రుడు మూసి వున్న గోశాలలని తెరిచి గోవులని పైకి వదిలాడు. అక్కడ నేస్తులలో నేస్తుడిగా, యోధులైన నవగ్వులతో సహ పోరాడుతూ, గోవులని సూక్ష్మంగా అనుసరిస్తూ, పదిమంది దశగ్వులతో కలిసి ఇంద్రుడు సూర్యుణ్ణి (*సత్యం తద్*) కనుగొన్నాడు, చీకట్లో దాగిన సూర్యుని కనుగొన్నాడు." ప్రకాశవంతమైన పశువులపై విజయాన్ని, దాగిన సూర్యుడి ఆవిష్కరణని సాధారణంగా ఇలాంటి మాటలతోనే చిత్రిస్తారు. కాని తదుపరి శ్లోకంలో దినికి సన్నిహితమైన మరి కొన్ని చిత్రాలతో ఈ చిత్రాలని జోడించడం కనిపిస్తుంది. ఆవులు మేసే బయళ్లు, ఆవులలో దాగిన తేనె – ఈ చిత్రాలు కూడా వేదంలో ఎన్నో ఋక్కులలో కనిపిస్తాయి. "ఇంద్రుడు ఆ తేజస్వినిలో, బయళ్లలో స్థిరంగా కదిలే ఆ గోవులో దాగిన తేనెను కనుగొన్నాడు." ఇక్కడ తేజస్విని (*ఉస్రియ లేక ఉస్రా*) అనే పదం గోవు వంటి పదమే. దీనికి కూడా కిరణం లేక ఆవు అనే ద్వంద్వార్థం వుంది. వేదంలో గో అనే పదానికి దీన్ని పర్యాయపదంగా వాడుతారు. ఆవులో దాగిన ఘృతం గురించి, నెయ్యి గురించి తరచు వింటూ ఉంటాము. వామదేవుడి ప్రకారం పాణులు అక్కడ మూడు వంతుల నేతిని దాచారు. అయితే అది కొన్ని సార్లు తేనెలూరే నేయి (*మధుమద్ ఘృతమ్*) అయితే, కొన్ని సార్లు వట్టి తేనె (*మధు*) మాత్రమే. ఇక ఆవు నుండి వచ్చే ఉత్పత్తికి (*ఘృతం*), సోమపు మొక్క నుండి వచ్చే ఉత్పత్తికి మధ్య ఎంత దగ్గరి సంబంధం వుందో వేరే ఋక్కులలో చుస్తాము. మరి ఆవు అంటే ఏమిటో మనకి ఇప్పుడు స్పష్టంగా తెలుసు కనుక, ఈ విడ్డూరమైన సంబంధానికి అర్థం కూడా ఇప్పుడు స్పష్టం అవుతుంది. ఘృత అంటే మెరిసేది అనే అర్థం కూడా వుంది. మెరిసే ఆవు నుండి వచ్చే మెరిసే నేయి అన్నమాట. అది మనోచేతనలో దాగిన సచేతన జ్ఞానపు కాంతి. విరాజమాన చైతన్యంలో అది భద్రపరచబడి ఉంటుంది. గోవు యొక్క విమోచనం చేత అది విడుదల చెందుతుంది. సోమరసం అంటే ఆనందం. ఆత్మయొక్క విరాజమాన స్థితికి ఆ ఆనందానికి మధ్య వేర్పాటు లేదు. వేదం ప్రకారం మనలో మూడు మనోతలాలు ఉన్నాయి. కాబట్టి సూర్యుడు, ఇంద్రుడు, సోముడు అనే ముగ్గురు దేవతల మీద ఆధారపడ్డ మూడు ఘృతపు వంతులు ఉన్నాయి. అదే విధంగా సోమరసాన్ని కూడా పర్వతం యొక్క మూడు ఎత్తుల వద్ద (*త్రిషు సానుషు*) సమర్పించడం

జరుగుతుంది. ఆ ముప్పురి దేవతల తత్వాన్ని దృష్టిలో పెట్టుకుని గమనిస్తే ఇలాంటి ప్రతిపాదన చెయ్యొచ్చు. ఐంద్రియ మానసం నుండి సోముడు దివ్యకాంతిని విడుదల చేస్తాడు, సక్రియ మానసం నుండి ఇంద్రుడు దివ్యకాంతిని విడుదల చేస్తాడు, శుద్ధ వివేచనాత్మక మానసం నుండి సూర్యుడు దివ్యకాంతిని విడుదల చేస్తాడు. ఇక ఆవులు మేసే బయలు యొక్క అంతరార్థం గురించి మనకి ముందే తెలుసు. అది ఇంద్రుడు తన కాంతులీనే సహచరుల కోసం దస్యులని జయించి తెచ్చే క్షేత్రం. అక్కడే అత్రి అగ్నివీరుణ్ణి, మెరిసే గోవులని దర్శిస్తాడు. వాటి వల్లనే వృద్ధాప్యం యవ్వనంగా మారుతుంది. ఈ *క్షేత్రం* విరాజమాన స్వధామానికి (*క్షయ*) చిహ్నం. యజ్ఞం ద్వారా దేవతలు మానవాత్మను ఆ స్వధామానికే తీసుకుపోతారు.

అప్పుడు విశ్వామిత్రుడు ఈ ప్రతీకలు అన్నిటి వెనుక ఉన్న అంతరార్థం ఏమిటో చెప్పుకొస్తాడు. “అతడు తన దక్షిణహస్తంలో దక్షిణను (*దక్షిణే దక్షిణావాన్*) పట్టుకున్నాడు. ఆ రహస్య విషయాన్ని రహస్య గుహలో, నీళ్లలో దాచి వుంచాడు. అన్నీ సరిగ్గా తెలిసినవాడు కనుక వెలుగును చీకటిని వేరు చెయ్యగలిగాడు (*జ్యోతిర్ వృణీత తమసో విజానన్*). మనం చెడు నుండి దూరంగా తొలగాలి.” ఈ సందర్భంలో మనకి దక్షిణా దేవి ప్రత్యేకత ఏమిటో అర్థమవుతోంది. కొన్ని చోట్ల ఆ దేవి ఉషాదేవికి ప్రతిరూపంలా అనిపిస్తుంది. మరి కొన్ని చోట్ల యజ్ఞ కానుకలని పంచే శక్తిలా కనిపిస్తుంది. ఉషాదేవి దైవీ ప్రకాశనం అయితే, దక్షిణా దేవి ఉష వల్ల కలిగే వివేచనాత్మక జ్ఞానం. ఆ జ్ఞానం వల్ల మనసుకి వేలుపు అయిన ఇంద్రుడికి, సరైన దారి కనిపిస్తుంది. దాని వల్ల వెలుగుని చీకటిని, సత్యాన్ని అసత్యాన్ని, ఋజు మార్గాన్ని వక్రమార్గాన్ని (*వృణీత విజానన్*) వేరు చేసే శక్తి కలుగుతుంది. ఇంద్రుడి యొక్క కుడి, ఎడమ చేతులు జ్ఞానంలో అతడు చేసే కర్మ యొక్క రెండు బలాలు. అతడి రెండు భుజాలని గభస్తి అంటారు. మామూలుగా ఆ పదానికి అర్థం సూర్యకిరణం కావచ్చు, లేదా ముంజేయి కావచ్చు. అవి అతడి రెండు దృష్టి శక్తులు, అతడి రెండు మేలిమి గుర్రాలు (*హరీ*). వాటిని సూర్యనయనాలు (*సూర్యచక్షసా*) కలవిగాను, సూర్య దృష్టి (*సూర్యస్య కేతూ*) కలవిగాను వర్ణించడం జరిగింది. దక్షిణ శక్తికి అధిష్ఠాన దేవత దక్షిణాదేవి. అందుకే *దక్షిణే దక్షిణావాన్* అనే పదయుగళం ఏర్పడుతుంది. ఈ వివేచనా శక్తి అధ్వర్యంలోనే యజ్ఞకర్మ జరుగుతుంది. దాని వల్లనే యజ్ఞకానుకలు సక్రమంగా పంచబడతాయి. దీని

వల్లనే పణుల నుండి కొల్లగొట్టిన గుంపులు గూడిన సంపదని ఇంద్రుడికి తన కుడిచేతికే ఇముడ్చుకోడానికి వీలవుతుంది. ఇక చివరికి గుహలో మన కోసం రహస్యంగా దాచబడినది ఏమిటో, ఏ ఆత్మజలాలలో అయితే పితరుల ధీశక్తి స్థిరంగా నిలిచిందో (*అప్సు ధియం దధిషే*), ఆ ఆత్మజలాలలో రహస్యంగా దాచబడ్డ విషయం ఏమిటో, మనకి తెలియజేయబడుతుంది. ఆ వస్తువే దాగిన సూర్యుడు, మన దివ్యజీవనానికి చెందిన రహస్య తేజం అదే. జ్ఞానం చేత అది దాగిన చీకటి లోనుండి దాన్ని వెలికి తీయడానికి వీలవుతుంది. ఈ తేజం భౌతిక తేజం కాదన్న విషయం *విజానన్* అన్న పదం వల్ల తెలుస్తోంది. ఎందుకంటే సరైన జ్ఞానం చేతనే దాన్ని తెలుసుకోడానికి వీలవుతుంది. ఆ జ్ఞానం చేతనే చెడు నుండి (*దురితాద్*) దూరం కావడానికి వీలవుతుంది. కన్నుకానరాని పరిస్థితుల్లో పొరబడకుండా, తొట్రుపడకుండా ఉండడానికి ఆ జ్ఞానం వల్లనే సాధ్యమవుతుంది. సూర్యుణ్ణి కనుగొన్న క్షణం, దివ్యమైన ఉషోదయం జరిగిన మరుక్షణం చీకటి తొలగిపోతుంది, సరైన జ్ఞానం ఆత్మలో భాసిస్తుంది.

గోవులు, సూర్యుడు, తీయని సోమరసం మొదలైన విషయాల అంతరార్థం ఒకసారి అర్థమైపోతే, అంగిరసుల గాధకి, పితరుల ప్రభావానికి సంబంధించిన పరిస్థితుల స్వరూపం తేటతెల్లం అవుతుంది. ఆ అర్థం తెలియకపోతే ఆ గాధలన్నీ అల్లకల్లోలంగా, ఆటవిక తెగల మోటు ఆచారాలుగా గోచరిస్తాయి. ఆర్య, ద్రావిడ విభజన పరంగా, చారిత్రకంగా అన్వయించినా ఆ గాధలు అర్థం కావు. కాని మూల రహస్యం పట్టుచిక్కితే ఈ చిక్కుముళ్ళన్నీ ఇట్టే విడిపోతాయి. ప్రతీ ఋక్కునీ పూర్తిగా అర్థం చేసుకోవడమే కాక, వివిధ ఋక్కుల మధ్య సంబంధాల పూర్ణ స్వరూపం కనిపిస్తుంది. మూలరహస్యం తెలిస్తే ప్రతీ వాక్యం, ప్రతీ శ్లోకం, అలవోకగా చేసిన ప్రతీ ప్రస్తావన అన్నీ ఒక సమగ్రమైన, సమరసమైన బృహద్ చిత్రంలో ఇంపుగా ఇమిడిపోతాయి. ఆనందానికి ప్రతీక అయిన తేనెను, సత్య ప్రకాశానికి ప్రతీక అయిన గోవులో దాచవచ్చని ఎందుకు అన్నారో ఇప్పుడు అర్థమవుతుంది. ఆ కాంతికి మూలం అయిన సూర్యుడికి, ఆ తేనెలు మోసే గోవుకి మధ్య సంబంధం ఏమిటో తెలుస్తుంది. చీకట్లో దాగిన సూర్యుడికి, పణులపై అంగిరసుల విజయానికి, ఆ విజయం చేత గోవులని తిరిగి సాధించిన వృత్తాంతానికి మధ్య సంబంధం ఏమిటో తెలుస్తుంది. ఆ విజయాన్ని సత్యంపై విజయం అని ఎందుకంటారో తెలుస్తుంది. గోవు యొక్క పచ్చిక

బయలుకి, లేక క్షేత్రానికి అర్థమేమిటో, కాళ్లు, గిట్టలు గల ఐశ్వర్యం అంటే అర్థమేమిటో తెలుస్తుంది. అలాగే పణుల గుహ అంటే ఏమిటో, వలుడి నివాసంలో దాచబడ్డ విషయమే, జలాలలో కూడా ఎందుకు దాచబడిందో తెలుస్తుంది. అలా దాచబడ్డ దాన్ని వృత్రుడు వశం చేసుకుంటే దాన్ని ఇంద్రుడు ఎందుకు విడిపించాడో తెలుస్తుంది. అయస్యుడి ఏడు తలల మేధ, స్వర్గాన్ని జయించిన మేధ, ఏడు నదులని ఎలా వశం చేసుకుందో తెలుస్తుంది. అన్నిటినీ వివేచన చెయ్యగల జ్ఞానం గుహలో నుండి సూర్యుణ్ణి విడిపించిందని, చీకటిని వినాయించి కాంతిని ఎంచుకుందని ఎందుకు అంటారో తెలుస్తుంది. దక్షిణ అంటే ఎవరో, సరమ అంటే ఎవరో, గిట్టలు గల ఐశ్వర్యాన్ని ఇంద్రుడు తన కుడి చేతిలో ఎందుకు భరించాడో తెలుస్తుంది. ఈ నిర్ణయాలన్నీ సాధించడం కోసం మనం పదాలని ఇష్టం వచ్చినట్టు విరిచేయనక్కర్లేదు. ఒకే పదాన్ని వేరు వేరు సందర్భాలలో ఇష్టానుసారం రకరాలుగా అన్వయించనక్కర్లేదు. ఒకే పదబంధాన్ని వేరు వేరు శ్లోకాల్లో రకరకాలుగా అన్వయిస్తూ, విచ్చలవిడి అన్వయమే ఒక విధానం అన్నట్టుగా ప్రవర్తించనక్కర్లేదు. అందుకు భిన్నంగా ఋక్కులలోని పదాలని ఎంత కచ్చితంగా, క్రమబద్ధంగా అన్వయిస్తామో, వేద రహస్యం అంత స్పష్టంగా, నిర్ద్వద్వంగా, సమగ్రంగా మన ఎదుట సాక్షాత్కరిస్తుంది.

ఇంతవరకు మనం రూపొందించిన అన్వయ విధానాన్ని ఇప్పుడు వేరే ఋక్కులకి వర్తింపజేసి చూద్దాం. ముఖ్యంగా వశిష్ఠుడి ఋక్కుని (VII.76) తీసుకుని పరిశీలిద్దాం. పైపైన చూస్తే అందులో కేవలం భౌతికమైన ఉదయాన్ని వైభవోపేతంగా చిత్రీకరించినట్టు కనిపిస్తుంది. కానీ కాస్త లోతుగా చూస్తే ఆ అభిప్రాయం ఇట్టే ఆవిరైపోతుంది. అందులో ఏదో ప్రగాఢమైన సత్యం దాగి వుందన్న భావన ఋక్కులో సొంతం గోచరిస్తుంది. మనం ఇంతకుముందు కనుగొన్న మూలసూత్రాన్ని ప్రయోగిస్తే ఆ సత్యం సులభంగా అవగతమవుతుంది. మహోన్నతమైన ఉషాకాంతిలో సూర్యుడు ఉదయిస్తున్న దృశ్యం యొక్క వర్ణనతో ఋక్కు మొదలవుతుంది. దేవతల సహాయంతో అంగిరసులు ఆ మహద్విజయాన్ని సాధించారు. “విశ్వపురుషుడైన సావిత్రి దేవత జన్మలన్నిటికీ మూలమైన అమరకాంతిలోకి ఆరోహించాడు, *జ్యోతిర్ అమృతం విశ్వజన్యమ్.* యజ్ఞకర్మ చేత దేవతల నయనం జన్మించింది (మరోలా చెప్పాలంటే దేవతల దృష్టి యొక్క సంకల్పబలం

జన్మించింది). ఉష సమస్త భువనాన్ని అభివ్యక్తం చేసింది (లేదా సమస్త అస్తిత్వాలని అభివ్యక్తం చేసింది, *విశ్వమ్ భువనం*)." ఇక్కడ సూర్యుడు ఉదయించే అమర కాంతిసే పేరే సందర్భంలో సత్య తేజం (*ఋతం జ్యోతిః*) అన్నారు. వేదంలో ప్రతీ చోట సత్యాన్ని, అమరత్వాన్ని కలిపే ప్రస్తావించడం కనిపిస్తుంది. అది విశ్వజన్యుడైన (ఆత్మలో విశ్వవ్యాప్తుడైన) స్థితిలో అయస్యుడు కనుగొన్న ఏడు తలల మేధ నుండి పుట్టే జ్ఞాన తేజం. కాబట్టి ఆ కాంతిని కూడా విశ్వజన్య కాంతి అంటారు. ఎందుకంటే అది అయస్యుడు చెప్పిన నాల్గవ తలానికి (*తురియం స్విద్*) చెందిన కాంతి. ఆ తలం నుండే తక్కినవన్నీ జన్మిస్తాయి. దాని సత్యం లోనుండే తక్కినవన్నీ అభివ్యక్తమవుతాయి. అసత్యాన్ని, వక్రతని విడనాడి విశ్వజనీనంగా వ్యక్తమవుతాయి. అందుకే దాన్ని దేవతల నయనం అంటారు. ఆ దివ్య ఉషస్సు లోనుండే సమస్త జగతి ప్రఫుల్లమవుతుంది.

ఈ దివ్యదృష్టి యొక్క జననం వల్ల మనిషికి తన జీవన మార్గం ఏమిటో తెలుస్తుంది. తనతోపాటు దేవతల యాత్రలు, లేదా దేవతలను చేరుకునేందుకు గాను తను చేసే యాత్రలు (*దేవయానః*) తనకి వెల్లడి అవుతాయి. ఆ యాత్రలే తనను దివ్యజీవనం యొక్క అనంత బృహత్తు లోనికి తీసుకుపోతాయి. "దేవతల బాటలు, యాత్రలు నా ముందు ప్రత్యక్షమవుతున్నాయి. నిర్దోషమైన యాత్రలవి. ఆ గమనాలని వసువులు రూపొందించారు. ఉష నయనం వెల్లివిరిసింది. మా దరిజేరి మన నివాసాలని ఆవరించింది." వేదంలో ఎప్పుడూ గృహాన్ని ఆత్మకి నెలవైన దేహానికి చిహ్నంగా వాడుతారు. అలాగే క్షేత్రం అంటే ఆత్మ ఆరోహించే తలాలకి, ఆత్మ విశ్రమించే సీమలకి ప్రతీక. పరంధామానికి తీసుకుపోయే బాటపై మానవ యాత్ర సాగుతుంది. ఇక దేవతల యాత్రలని భంగపరచలేనిది ఏమిటో ఐదవ శ్లోకంలో మళ్లీ ఆవృత్తమైన ఆ పదజాలం తెలుపుతుంది. అదే దేవతల కర్మ. అదే ఆత్మ వికాసం చెంది సాధించవలసిన దివ్యజీవన ధర్మం. ఇక్కడే ఆర్కిటిక్ సిద్ధాంతాన్ని సమర్థించే ఒక చిత్రమైన చిత్రం మనకి ఎదురవుతుంది. "సూర్యోదయం జరగక ముందు ఎన్నో పగళ్లు గడిచాయి. ఓ ఉషాదేవీ! ఆ దినాలలో నీవు నీ ప్రియుడితో సంచరించావు గాని మళ్లీ తిరిగి రావు." రాత్రులు లేకుండా ఎన్నో పగళ్లు గడిచే ఆర్కిటిక్ ప్రాంతం ఇక్కడ చిత్రింపబడుతున్నట్టు కనిపిస్తుంది. దాని నుండి పుట్టే అధ్యాత్మిక అంతరార్థం కూడా స్పష్టంగా తెలుస్తోంది.

ఇంతకీ ఏమిటీ ఉషస్సులు? అవి పితరులైన అలనాటి అంగిరసుల కృత్యాల చేత సృజించబడ్డ వేకువలు. “సత్యాన్ని సిద్ధించుకున్న ఆ ప్రాచీన ఋషులు దేవతలతో పాటు ఆ (సోమరసపు) ఆనందాన్ని గ్రోలారు; సత్యమైన ఆలోచనను (*సత్యమంత్రా*, స్ఫూర్తిగొన్న మంత్రంగా వ్యక్తమైన సత్యమైన ఆలోచన) కలిగిన వారు ఉషస్సుకు జన్మనిచ్చారు.” మరి ఆ పథం, ఆ దివ్యపయనం పితరులని ఏ ఉషస్సు వద్దకు తీసుకుపోతుంది? వారు చేరే గమ్యం సమమైన విశాలత (*సమానే ఊర్వే*). దీన్నే మరో చోట అవధుల్లేని బృహత్తుగా (*ఉరౌ అనిబాధే*) వ్యక్తం చెయ్యడం జరిగింది. కణ్వుడి పరిభాషలో చెప్పాలంటే వృత్రుని సంహరించి భువికి, దివికి అతీతంగా పోయిన మనుషులు చేరుకునే విశాలమైన అస్తిత్వం అది. అదితి యొక్క బృహత్తర సత్యమది, అనంత జీవనమది. “ఆ సమమైన విశాలతలో వాళ్లు ఒక్కటవుతారు, తమ జ్ఞానంలో ఐక్యమవుతారు (లేదా పరిపూర్ణంగా తెలుసుకుంటారు), కాని కలిసి ప్రయాస పడరు; దేవతల కర్మలని వాళ్లు మొక్కవోనీయరు (వాటికి అడ్డుపడరు, వాటిని భంగపరచరు). వాటికి భంగం వాటిల్లకుండా వసువుల (శక్తి) చేతా వాళ్లు (తమ లక్ష్యం దిశగా) కదులుతారు.” మానవులైనా, దివ్యులైనా సరే ఆ ఏడుగురు అంగిరసులు, జ్ఞానం యొక్క, యోచన యొక్క, వాక్కు యొక్క వివిధ తత్వాలకి ప్రతీకలు. అదే బృహస్పతి యొక్క ఏడు తల చింతన, ఏడు నోళ్ల వాక్కు. సమమైన విశాలతలో, ఒక విశ్వజనీన విజ్ఞానంలో ఇవన్నీ సామరస్యం అవుతాయి. పొరబాటు వల్ల, వక్రబుద్ధి వల్ల, అసత్యం వల్ల మనుషులు దేవతల కృత్యాలకి భంగపాటు కలిగిస్తారు. ఆ కారణం చేత వారి ఆత్మలో, చేతనలో, జ్ఞానంలో గందరగోళం ఏర్పడుతుంది, ఘర్షణ జరుగుతుంది. దివ్యమైన ఉషస్సు వల్ల కళ్లు తెరుచుకున్నప్పుడు ఆ దోషాలన్నీ తొలగిపోతాయి.

దివ్యమైన, ఆనందమయమైన ఉషాదేవి ఆవాహనతో వశిష్ఠుల ఋక్కు సమాప్తమవుతుంది. ప్రభాత పశువుల నేత్రి, సమస్త సంపద్ ప్రదాత్రి, ఆనందమయి, సత్యమయి (*సూనృతానాం*) అయిన ఉషాదేవి స్తుతితో ఋక్కు అంతమవుతుంది. ఆది ఋషులు, పితరులు సాధించిన విజయాన్నే వీరు కూడా సాధించగోరుతున్నారు. దీన్ని బట్టి వీళ్లు దివ్య అంగిరసులు కారని, మానవ అంగిరసులని అర్థమవుతోంది. ఏదేమైనా అంగిరసుల గాధలోని అంతరార్థం మాత్రం ఇంతవరకు స్థిరంగా స్థాపించబడింది. అయితే ఇంతకీ పాణులు ఎవరు, దేవశునకమైన సరమ ఎవరు అన్న విషయంలో మాత్రం పూర్తి

నిర్దిష్టత లేదు. ఇప్పుడిక నాలుగవ మండలంలోని మొదటి ఋక్కుల మీదకి మన దృష్టి సారించవచ్చు. అక్కడ మానవ పితరుల గురించి, వారి మహద్విజయం గురించి ప్రత్యేకంగా వర్ణించబడింది. అంగిరసుల గాధ యొక్క ఈ ముఖం గురించి వామదేవుడి ఋక్కులు సుబోధకంగా వర్ణిస్తాయి. ఆ ఋక్కులు మొత్తం ఋగ్వేదంలోనే అత్యంత ఆసక్తికరమైనవని చెప్పుకోవచ్చు.

అధ్యాయం 19

పితరుల విజయం

దివ్యజ్యోతిని, కవిక్రతువుని, అగ్నిదేవుని ఉద్దేశించి వామదేవ ఋషి విరచించిన శ్లోకాలు మొత్తం ఋగ్వేదంలోనే అత్యంత ప్రగాఢమైన, పవిత్రమైన శ్లోకాలు. ఋషులు వాడిన ముఖ్యమైన ప్రతీకలని జ్ఞాపకం ఉంచుకుంటే వాటి అర్థం కూడా సులభంగా అవగతం అవుతుంది. ఆ ప్రతీకల పరిష్కారం లేకుండా చదివితే ఆ శ్లోకాలు మనని సంభ్రమంలో ముంచెత్తుతాయి. ప్రతీకల పరిష్కారాన్ని కచ్చితంగా అడుగడుగునా ప్రయోగిస్తేనే అర్థం పట్టుచిక్కుతుంది. లేకుంటే తాత్విక పరిభాష తెలియకుండా తత్వశాస్త్రాన్ని చదివే అధ్యాయి పరిస్థితిలా ఉంటుంది. లేదా పాణినీయ వ్యాకరణ పద్ధతి తెలియకుండా పాణిని సూత్రాలు చదివినట్టు ఉంటుంది. ఈ సందర్భంలో మానవ పితరుల గురించి వామదేవుడు ఏం చెబుతున్నాడో అర్థం చేసుకోడానికి కావలసిన పరిష్కారం ప్రస్తుతం మన వద్ద ఉంది.

ఆ మహద్విజయం ఏమిటో అర్థం చేసుకోవాలంటే పరాశర శక్త్యుడు ప్రకటించిన సూత్రాలని మనసులో స్థిరంగా నిలుపుకోవాలి – "మన పితరులు బలమైన, మొండి ప్రదేశాలని తమ మాటలతో బద్దలు కొట్టారు. అవును, అంగిరసులు కొండని తమ కేకతో భేదించారు. మనలో ఘన స్వర్గానికి బాటలు వేశారు. ఉదయాన్ని, స్వర్ ని, దివ్యదర్శనాన్ని, కాంతులీనే గోవులని కనుగొన్నారు," చక్రుర్ దివో బృహతో గాతుమ్ అస్మే, అహః స్వర్ వివిదుః కేతుమ్ ఉస్రాః" (I.71.2). ఈ మార్గమే అమరత్వానికి గొనిపోయే మార్గం అంటాడు ఋషి. "సత్ఫలాన్ని ఇచ్చే అన్ని విషయాల్లోకి ప్రవేశిస్తూ వాళ్లు అమరత్వానికి బాట వేశారు. వారి కోసం పృథివి వైభవంగా, విస్తారంగా నిలిచింది. మహనీయులతో, జనని అదితి తన తనయులతో ఉద్ధారణ కోసం అరుదెంచింది (లేదా అభివ్యక్తమయ్యింది)" (I.72.9)[31]. అంటే భౌతిక జీవి లోనికి అనంతమైన ఊర్ధ్వతలాలకి చెందిన మహత్తు ప్రవేశించింది అన్నమాట. ఆ తలాలకి చెందిన దేవోత్తముల బలం చేత భౌతిక జీవి యొక్క పరిమితులు విస్తరించబడ్డాయి. భౌతిక చేతన విస్ఫారి కాంతి ప్రభావానికి లోనయ్యింది. ఓ సరికొత్త బృహత్తులో అది స్థిరంగా నిలుపబడింది. అనంత చైతన్యం యొక్క, జనని అదితి యొక్క, దేవదేవుని దివ్యశక్తులైన ఆమె తనయుల యొక్క ప్రభావం చేత ఉద్ధరించబడింది. వేదం బోధించే అమరత్వం ఇదే.

ఈ ఆవిష్కరణని, విస్తరణని సాధించే విధానాన్ని పరాశరుడు తన గుహ్యామైన, స్పష్టమైన శైలిలో అద్భుతంగా వర్ణించాడు. "వారు సత్యాన్ని పొడగన్నారు, దాని ఆలోచనని సంవర్ధనం చేశారు. అప్పుడా ఆర్తిగొన్న జీవులు (అర్యః) తమ మేధలో దాన్ని ధరించి, దాన్ని తమ అంతర్యం అంతా ప్రసరింపజేశారు." *దధన్న ఋతం ధనయన్న అస్య ధీతిమ్, ఆద్ ఇద్ అర్యో దిధిష్వో విభృత్రాః* (I.71.3). *విభృత్రాః* అనే చిత్రం సత్యచింతనని ఆత్మ యొక్క అంగాంగాలలోను స్థిరంగా నిలుపుకోవడం అనే భావనని సూచిస్తోంది. దీన్నే సుపరిచితమైన

[31] *ఆ యే విశ్వా స్వపత్యాని తస్థుః, కృణ్వానసో అమృతత్వాయ గాతుమ్; మహ్నా మహద్భిః పృథ్వి వి తస్థే, మాతా పుత్రైర్ అదితిర్ ధాయసే వేః*

వైదిక చిత్రంతో వ్యక్తం చెయ్యాలంటే అది సప్త జలాలలోను వ్యాపించిన ఏడు తలల చింతన (*అప్సు ధియం దధిషే*). మరో చోట కూడా సరిగ్గా ఇదే పరిభాషలో ఈ సంగతి వ్యక్తం కావడం చూస్తాము. దీని వెనువెంటనే వచ్చిన ప్రతీక ఇలా అంటుంది – "కర్మలు చేసే కర్తలు నిర్దాహమైన వాటి (జలాల) దిశగా సాగుతారు. ఆనందానుభూతి వల్ల అవి దివ్యజన్మలని పోషిస్తాయి" (అతృష్యన్తీరపసో యన్త్వచ్ఛా దేవాఞ్జన్మ ప్రయసా వర్ధయన్తీః). సప్తవిధమైన ఋతచైతన్యం సప్తవిధమైన ఋతాత్మలో సంతృప్తమవుతుంది. ఆ విధంగా ఆనందం కోసం ఆత్మలోని ఆర్తిని తీర్చి అది మనలోని దివ్య జన్మలని పోషిస్తుంది. ఆ విధంగా అమరత్వం వర్ధిల్లుతుంది. ఆ విధంగా దివ్యజీవనానికి చెందిన సత్, తేజం, ఆనందం అనే మూడు తత్వాలు అభివ్యక్తం అవుతాయి. దీన్ని కాలాంతరంలో వేదాంతులు సచ్చిదానందం అని పిలిచారు.

సత్యం విశ్వజనీనంగా వ్యాపనం చెందుతుందనే భావన, మనలో దేవతలు జనించి, పని చేసి, మన మర్త్య స్థితి స్థానంలో అమరజీవనాన్ని ప్రవేశపెడతారనే భావనని పరాశరుడు చాలా చక్కగా స్పష్టం చేస్తాడు (I.68). కవిక్రతువైన అగ్ని స్వర్గానికి ఆరోహించి, స్థావరజంగమాలు అన్నిటిని కప్పిన చీకటి తెరను తొలగిస్తాడు అన్నట్టుగా వర్ణించబడింది. "అతడు తన ఆత్మోన్నతితో ఈ దేవతలు అందరినీ తనలోనే ఇముడ్చుకున్న దేవదేవుడు అవుతాడు. అప్పుడు అందరూ పరమ సంకల్పాన్ని ఆమోదించి, దానికి ఒడంబడి ఉంటారు. "ఓ దేవోత్తమా! ఈ శుష్కనేల నుండి (అంటే సత్యపు జలాల చేత తడవని ఎడారి వంటి భూతలం నుండి) సజీవ ఆత్మగా నీవు జన్మించావు. అందరూ తమ చలనాల చేత సత్యాన్ని, అమరత్వాన్ని చేరుకుని దివ్యత్వాన్ని ఆనందిస్తారు, *భజంత విశ్వే దేవత్వం నామ, ఋతం సపంతో అమృతమ్ ఏవైః.* సత్యం కోసం తపన వల్ల, సత్యపు చింతన వల్ల జీవితం విశ్వజనీనం (అది జీవన సమస్తమూ వ్యాపిస్తుంది) అవుతుంది. అందులో అందరూ తమ కర్మలని సఫలం చేసుకుంటారు, *ఋతస్య ప్రేషా ఋతస్య ధీతిర్, విశ్వాయుర్ విశ్వే అపాంసి చక్రుః.*

ఆధునిక చింతన మీద ఐరోపా పాండిత్యపు దౌర్భాగ్యపు ప్రభావం వల్ల వేదాన్ని తప్పులతడకలుగా అన్వయించే సాంప్రదాయం ఒకటి బయల్దేరింది. ఆ ప్రభావం వల్ల పంజాబులో వున్న ఏడు నదులని మన మానవ పితరులు ఊర్ధ్వలోకాల్లో సాధించిన విజయాలతో ముడిపెట్టే పొరబాటు చెయ్యబోమని భావిస్తున్నాను. అలాంటి పొరబాటుకు

తావు లేకుండా ఉండాలంటే పరాశరుడు తన నిశితమైన శైలిలో ఏమంటున్నాడో చూడాలి – "సత్యపు గోవులు (*ధేనవః* అంటే నదులని సూచించే ప్రతీక, అలాగే *గావః* మరియు *ఉస్రా* అనేవి సూర్యుడి యొక్క విరాజమాన గోవులని సూచిస్తాయి), అతణ్ణి పోషించాయి, అంబా అని అరిచాయి, నిండైన పొదుగులతో సురలోకంలో వర్ధిల్లాయి; సత్య చింతన అనే వరాన్ని ఊర్ధ్వలోకాల నుండి పొందిన నదులు విస్తారంగా, సమంగా పర్వతం అంతటా ప్రవహించాయి." (*ఋతస్య హి ధేనవో వావశానాః, స్మదూధ్నీః పీపయంత ద్యుభక్తాః; పరావతః సుమంతిం భిక్షమానా, వి సింధవః సమయా సస్రుర్ అద్రిం.*) (I.73.6). అలాగే (I.72.8) లో అన్య ఋక్కులలో నదులని సూచించే పదజాలం గురించి మాట్లాడుతూ అతడు ఇలా అంటాడు – "స్వర్గంలోని ఏడుగురు మహిమాన్వితులు ఆలోచనలో తీరుగా ముందుకు సాగుతూ, సత్యాన్నెరిగి, జ్ఞానంతో వివేచన చేసి ఆనంద ద్వారాలని కనుగొన్నారు; సరమ విరాజిత గోవుల విశాలతని, విస్తీర్ణతను కనుగొంది; ఆ కారణం చేత మనుషులు ఆనందాన్ని పొందారు." *స్వాధ్యో దివ ఆ సప్త యహ్వీ, రాయో దురో వి ఋతజ్ఞా అజానన్; విదద్ గవ్యం సరమా దృఢమ్ ఊర్వం, యేనా ను కమ్ మానుషీ భోజతే విట్.* ఇవి నిశ్చయంగా పంజాబులోని జలాలు కావు. ఇవి సురలోకపు నదులు, సత్య స్రవంతులు, సరస్వతి[32] వంటి సురసతులు. వీరు జ్ఞానం చేత సత్యాన్ని తెలుసుకుని దాని సహాయంతో మనుషుల కోసం ఆనంద ద్వారాలని తెరుస్తారు. ఇక్కడ మళ్లీ అంతకు ముందు చెప్పుకున్న ఒక విషయాన్ని మళ్లీ నొక్కి చెప్తున్నాను. గోవులని కనుక్కోవడానికి నదులు పొంగి ప్రవహించడానికి మధ్య సంబంధం వుంది. అవన్నీ ఒకే క్రియలోని రెండు భాగాలు – అది సత్యంపై, అమరత్వంపై మనుషులు సాధించే విజయం – *ఋతం సపంతో అమృతం ఏవైహీః.*

దీన్ని బట్టి అంగిరసుల విజయం సత్యం మీద, అమరత్వం మీద విజయం అన్న సంగతి, స్వర్లోకాన్నే మహాస్వర్గం (*బృహద్ ద్యోః*) అంటారన్న సంగతి, సాధారణ మానసిక, భౌతిక తలాలని సూచిందే దివి, భువి అనే తలాలకి అతీతమైన సత్యపు తలమే ఆ మహాస్వర్గం అన్న సంగతి, తేటతెల్లం అవుతోంది. అలాగే అంగిరసులు సృష్టించిన సత్య మార్గమే స్వర్లోకపు బాట అని, అదే సరమ కనుగొన్న అమరత్వపు బాట (*అమృతత్వాయ గాతుమ్*)

---

[32] I.32 లో హిరణ్యస్తూప అంగిరసుడు వృత్రుడు విడుదల చేసిన జలాలు "మనస్సును ఆరోహిస్తున్నట్టు"గా (మనో రుహాణాః) వర్ణిస్తాడు. మరో చోట జ్ఞానం గల జలాలని వర్ణిస్తాడు, ఆపో విచేతసః (I.83.1).

అని అర్థమవుతుంది. అంగిరసులు కనుగొన్న ఉష యొక్క దర్శనమే (*కేతు*) సత్య చైతన్యానికి చెందిన నిజదర్శనం అని తెలుస్తోంది. పణుల నుండి చేజిక్కించుకున్న విరాజమాన గోవులు అంటే సత్య చైతన్య ప్రకాశనాలని, అవే సత్యం మీద ఆధారపడ్డ ఆలోచనని (*ఋతస్య ధీతిః*) రూపొందించగలవని, అదే అయస్యుడి ఏడు తలల చింతన అని అవగతమవుతోంది. వేదంలో రాత్రి అంటే చీకట్లో మరుగు పడ్డ మర్త్య చేతన అని, అందులో సత్యం ఉపచేతనంగా ఉండిపోతుందని, పర్వత గుహలో దాగి ఉంటుందని తెలుస్తుంది. అలాగే ఆ చీకట్లో దాగిన సూర్యుణ్ణి తిరిగి సాధించడమంటే అంధకారబంధురమైన ఉపచేతనా స్థితి లోని సౌరసత్యాన్ని వెలికి తీయడమేనని అర్థం చేసుకోవచ్చు. భూమి దిశగా ప్రవహించే ఏడు నదులకి అర్థం, మన ఆత్మలోని సప్తముఖమైన తత్వం కర్మధారగా వ్యక్తమవుతుంటే అది మన దివ్యమైన, అమరమమైన అస్తిత్వానికి చెందిన సత్యంలో రూపుదిద్దుకోవడమేనని అర్థమవుతుంది. అదే విధంగా పణులు అంటే ఉపచేతనా స్థితి లోనుండి సత్యం యొక్క ఆవిర్భావం జరగకుండా అడ్డుపడే శక్తులని, ఆ సత్యం యొక్క ప్రకాశనాలని కాజేస్తూ మళ్లీ మళ్లీ మనిషిని ఆ ఉపచేతన అనే ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేస్తుంటాయని గ్రహించవచ్చు. అలాగే వృత్రుడు అంటే మనలోని సత్య స్రవంతుల స్వేచ్ఛా చలనాన్ని అరికట్టే శక్తి అని, మనలో సత్యం యొక్క ప్రేరణకి (*ఋతస్య ప్రేషా*), ప్రభాత ప్రోద్బలానికి (*జ్యోతిష్మతీమ్ ఇషమ్*) అడ్డుపడే శక్తి అని, ఆ ప్రోద్బలమే మనని చీకటిని దాటించి అమరత్వానికి చేర్చగలదని గుర్తించవచ్చు. అందుకు భిన్నంగా దేవతలు అంటే అదితి కుమారులైన ఆదిత్యులు, తేజోమయులైన దివ్యశక్తులు. అనంత చైతన్యమైన అదితి లోనుండి ఉద్భవించిన వాళ్లు. మన మర్త్యజీవన స్థితిలో వారి ఆవిర్భావం, ప్రభావం, దివ్యజీవనం దిశగా, దివ్యత్వం (*దేవత్వం*) దిశగా, అమరత్వం దిశగా మన ఆరోహణకి ఎంతో అవసరం. వారందరిలోకి ప్రధానుడైన అగ్ని, సత్య చేతన యొక్క కవిక్రతువైన అగ్ని, మన యజ్ఞం సఫలం అయ్యేలా చేస్తాడు. సత్య మార్గాన మనకి దారి చూపిస్తాడు. యుద్ధంలో యోధుడిగా, ప్రయాసలో సహచరుడిగా తోడు నిలుస్తాడు. మనలో అతడి ఏకత్వం, విశ్వజనీనత సకల దేవతలని మనలో నిలుపుకునేలా చేసి, అమరత్వానికి పునాది వేస్తుంది. మనం చేరుకునే సత్య తలం అతడి నిజగృహం, దేవతలందరి సహజ నివాసం. మానవాత్మ యొక్క చరమధామం. ఆ అమరత్వాన్నే ఆనంద స్థితిగా, అనంత ఐశ్వర్యంతో కూడిన అధ్యాత్మిక

స్థితిగా (*రత్న, రయి, వాజ, రాధస్* మొ॥) వర్ణించడం జరిగింది. మన దివ్యధామం యొక్క తలుపులు తెరవడం అంటే ఆనంద ద్వారాలు తెరవడమే (*రాయో దురః*). తమలో సత్యాన్ని పెంచుకునే (*ఋతావృధః*) వారికి ఆ దివ్యద్వారాలు తెరుచుకుంటాయి. ఆ ద్వారాలని సరస్వతి, ఆమె సోదరీమణులు, సప్తనదులు, సరమ మన కోసం కనుక్కుంటారు. ఇక చివరిగా బృహత్తర సత్యం యొక్క అనవధిక, అనంత సీమ అనే బయలు (*క్షేత్ర*) మీదుగా బృహస్పతి, ఇంద్రుడు మెరిసే పశువులని తోలుకుపోతూ ఆ ద్వారాల వద్దకు చేర్చుతారు.

ఒకసారి ఈ భావనలన్నీ మనసులో స్థిరంగా నిలుపుకున్నామంటే వామదేవుడి శ్లోకాలని అర్థం చేసుకోగలము. పరాశరుడు మరింత బాహాటంగా వ్యక్తం చేసిన భావసారాన్ని వామదేవుడు మరింత ప్రతీకాత్మక భాషలో వ్యక్తం చేస్తాడు. వామదేవుడి మొదటి శ్లోకాలు కవిక్రతువైన అగ్నిని ఉద్దేశించినవి. అందులో అగ్నిని మనిషికి స్నేహితుడిగా, మానవ యజ్ఞానికి నిర్మాతగా, మనిషిలో దృష్టి శక్తిని (*కేతు*), జ్ఞానాన్ని జాగృతం చేసే శక్తిగా కీర్తించడం జరుగుతుంది (*స చేతయన్ మనుషో యజ్ఞబంధుః* – IV.1.6). అలా చేసిన అగ్ని, "ద్వారాలు గల నివాసాలలో కొలువుంటూ విజయాన్ని సాధించిపెడతాడు; మర్త్య జీవుల విజయసాధనంగా ఆ దేవత అరుదెంచుతాడు" (*స క్షేతి అస్య దుర్యాసు సాధన్, దేవో మర్త్యస్య సధనిత్వం ఆప*). ఇంతకీ ఏమిటి అగ్ని సాధించి పెట్టే ఆ విజయం?అందుకు సమాధానం తదుపరి శ్లోకంలో వస్తుంది – "అగ్ని తన జ్ఞానంలో ఏ ఆనందాన్నయితే దేవతలు ఆనందిస్తున్నారో, దేని చేతనైతే అమరుల ధీశక్తి రూపొందించబడిందో, దేని చేతనైతే పితరుడైన ద్యౌస్పితుడు సత్యాన్ని వ్యక్తం చేశాడో, ఆ ఆనందం దిశగా మనలని తీసుకోపోగాక." (స తూ నో అగ్నిర్నయతు ప్రజానన్నచ్ఛా రత్నం దేవభక్తం యదస్య ధియా యద్విశ్వే అమృతా *అకృణ్వన్ ద్యౌష్ పితా జనితా* సత్యముక్షన్) ఇదే పరాశరుడు వర్ణిస్తున్న అమరత్వపు ఆనందం. అమృతమూర్తులైన దివ్యులు సత్య చింతన చేత, సత్యపు ప్రోద్బలం చేత పని చేస్తూ ఈ ఆనందాన్ని సృష్టించారు. *ఉక్షన్* అనే పదం సూచిస్తున్నట్టు, ఇక్కడ జలాలు పొంగిపొరలడం అంటే సత్యం అభివ్యక్తం కావడం. పరాశరుడు చెప్పినట్టు సత్యం యొక్క ఏడు నదులు పర్వతం మీదుగా సమంగా ప్రవహించడం అంటే ఇదే.

అప్పుడు వామదేవుడు ఆ మహత్తర, ఆదిమ శక్తి అయిన అగ్ని గురించి ఇంకా చెప్పుకుపోతాడు. సత్యంలో, దాని జలాలలో, దాని స్వగృహంలో కొలువున్న అగ్నిని ఇలా వర్ణిస్తాడు – "ప్రథముడైన అగ్ని, జలాలలో, విశాల స్వర్లోకపు పునాదిలో, దాని గర్భంలో (దాని కొలువులో, జన్మస్థలంలో, తొలిగూటిలో) జన్మిస్తాడు; శిరస్సు, పాదాలు లేకుండా, తన రెండు కొసలని దాచి వుంచుతూ, వృషభుడి ఇంట్లో తన పని మొదలెడతాడు." ఇక్కడ వృషభుడు అంటే దేవుడు, లేదా పురుషుడు, అతడి నివాసం సత్యతలం. కవిక్రతువైన అగ్ని సత్యచైతన్యంలో పని చేస్తూ ప్రపంచాలని సృష్టిస్తాడు; కాని అతడు తన కొసలని అంటే శిరస్సును, పాదాలని దాచి వుంచుతాడు; అంటే అగ్ని అతిచేతనకి, ఉపచేతనకి మధ్య పని చేస్తాడు. తన అత్యున్నత స్థితులు అతిచేతనలో దాగి వుంటే, తన అత్యధమ స్థితులు ఉపచేతనలో దాగి వుంటాయి. ఒకటి విమల తేజంలో కరిగిపోతే, రెండవది కటిక చీకటిలో కనుమరుగవుతుంది. అక్కడి నుండి అతడు ప్రప్రథమ, పరమ శక్తిగా వృషభుడి నుండి, అంటే పురుషుడి నుండి ఆవిర్భవిస్తాడు. ఆ ఆవిర్భావం ఏడు ఆనందమయ శక్తుల యొక్క, అంటే ఏడుగురు ప్రియతముల యొక్క ప్రభావం వల్ల జరుగుతుంది. "విరాజమాన జ్ఞానంతో అతడు ప్రథమ శక్తిగా వెలువడతాడు. సత్య పీఠం పైన, వృషభుడి నివాసంలో, ఆరాధ్యుడై, నిత్యయవ్వనుడై, పూర్ణరూపుడై, వెలుగొందుతుంటాడు; పురుషుడి వల్ల ఏడురుగు ప్రియతములు అతణ్ణి కంటారు."

అటు పిమ్మట ఋషి మానవ పితరుల విజయాన్ని వర్ణిస్తాడు – "అస్మాకం అత్ర పితరో మనుష్యా, అభి ప్ర సేదుర్ ఋతం ఆశుషాణాః". "ఇక్కడ మన మానవ పితరులు సత్యాన్ని అన్వేషిస్తూ ముందుకు సాగారు. కారాగారంలో బందీలుగా ఉన్న మెరిసే గోవులని, కొండ గుహలో దాగిన, దండిగ పాలిచ్చే, పాడియావులని వాళ్లు పైకి (సత్యం దిశగా) తోలారు. వారి పిలుపునకు ఉషస్సులు స్పందించాయి. వాళ్లు పర్వతాన్ని బద్దలుకొట్టి కాంతిని వెలువరించారు. వారి చుట్టూ ఉన్న ఇతరులు ఈ (సత్యాన్ని) విపులంగా చాటారు. ఆ పశువుల కాపర్లు కర్మలకి కర్తని (అగ్నిని) కీర్తించారు. కాంతిని కనుగొన్నారు. వారి ఆలోచనలలో భాసించారు. (లేదా వారి ఆలోచనల చేత పనులు సాధించారు). కాంతిని శోధించే మనసులో (గోవులు, గవ్యతా మనసా) గోవుల చుట్టూ ఆవరించిన ధృఢమైన, బలమైన కొండని బద్దలు కొట్టారు. ఆకాంక్షించే జీవాత్మలు పశువులతో నిండిన గోశాలని

తమ దివ్య మంత్రంతో, *వచసా దైవ్యేన,* తెరిపించారు.” ఇవన్నీ అంగిరస గాధకి చెందిన సర్వసామాన్యమైన చిత్రాలు. కాని తదుపరి శ్లోకంలో వామదేవుడు మరింత నిగూఢమైన భాషని వాడడం కనిపిస్తుంది. “వాళ్లు పాడియావుల పూర్వనామాన్ని ముందుగా తమ మనసులో విభావన చేశారు. జగజ్జనని యొక్క మూడేడుల పరమ పీఠాలని కనుగొన్నారు. ఆ సంగతి తెలిసిన ఆడు పశువులు దాన్ని అనుసరించాయి. కాంతిమయ గోవుని విజయవంతంగా కనుగొన్నాక వాటిలో ఒక ఎర్రనిది అభివ్యక్తమయ్యింది.” *తే మన్వత ప్రథమం నామ ధేనోస్ త్రిః సప్త మాతుః పరమాణి విన్దన్; తజ్ జానతీర్ అభ్యనూషత వ్రా ఆవిర్ భువద్ అరుణీర్ యశసా గోః.* ఇక్కడ జగజ్జనని అంటే అనంత చైతన్యమైన అదితి. ఆమెయే పాడియావు, ధేనువు. ఏడు నదులు ఆమె నుండి వెలువడే సప్తవిధ స్రవంతి. తేజోమయమైన గోవు, ఉషస్సులు ఆమె శిశువులు. ఎర్రని దూడ దివ్యమైన ఉదయం. పశువులు లేదా కిరణాలు ఆమె ప్రకాశనాలు. మూడేడుల పరమపీఠాలు (ఇవి ఉషస్సులు మానసిక ప్రకాశనాలు తెలుసుకోగలిగే స్థితులు) కలిగిన జగజ్జనని యొక్క పూర్వనామం అంటే అది దేవదేవుడి నామమే అయ్యుండాలి. ఆ దేవదేవుడే అనంతమైన అస్తిత్వం, అనంతమైన చైతన్యం, అనంతమైన ఆనందం. ఆ పీఠాలు మూడు దివ్యలోకాలు. వీటినే ఇదే ఋక్కులో అంతకు ముందు పురాణాలు చెప్పిన అగ్ని, సత్య, తపస్, జన అనే లోకాల పరమ జన్మలుగా పేర్కొనడం జరిగింది. ఈ మూడు లోకాలు దేవదేవుడి యొక్క మూడు అనంతాలతో సరిపోతాయి. వాటిలో ప్రతి ఒక్కటి మన ప్రస్తుత జగతి యొక్క సప్తసూత్రాలకి అనుగుణమైన సూత్రాలని అనుసరిస్తుంది. ఆ విధంగా సత్యం యొక్క ఉదయం[33] జరిగినప్పుడు ఆ మూడేడుల పీఠాలలో అదితి యొక్క వైభవం అంతా అద్భుతంగా అభివ్యక్తమవుతుంది. ఆ కారణం చేత మానవ పితరులు తేజాన్ని, సత్యాన్ని గెలవడం అంటే, దివ్య స్థితి యొక్క అమరత్వానికి ఆరోహించడమే. సమస్త సృష్టికి కర్త అయిన జగజ్జనని యొక్క పూర్వనామాన్ని తెలుసుకోవడమే. అస్తిత్వపు సోపానంలో ఆమె

---

[33] ఇదే భావనని మేధాతిథి కణ్వుడు (I.20.7) మూడేడుల ఆనందాలు, *రత్నాని త్రిః సప్తాని,* అనే పదజాలంతో ప్రకటిస్తాడు. గుంపులో ఏడు కలిగి, వరుసగా అలాంటి మూడు గుంపుల శ్రేణిగా వచ్చే ఆనందాలు అన్న మాట. వాటిలో ఒక్కొక్కదాన్ని రిభులు వాటి ప్రత్యేకమైన, సంపూర్ణమైన రూపంలో వ్యక్తం చేస్తారు, ఏకమ్ ఏకం సుశస్తిభిః.

మూడేడుల పరమపదాలని దాటడమే. సనాతన నగం యొకం అత్యున్నత శిఖరాలని (*సాను, అద్రి*) స్పృశించడమే అవుతుంది.

అమరత్వానికి చెందిన ఆ ఆనందాన్నే దేవతలు ఆనందిస్తారు. ఆ ఆనందాన్నే అగ్నిదేవుడు యజ్ఞం చేత సాధించవలసి వుందని వామదేవుడు అంతకు ముందే చెప్పాడు. మూడేడుల ఆనందాలతో కూడుకున్న దివ్యానందం అదే (I.20.7). వామదేవుడు ఇంకా ఇలా అంటాడు – "చీకటి నిర్జించబడింది, పునాదుల వద్ద పెకలించబడింది; స్వర్గం భళ్లున వెలిగింది (*రోచత ద్యౌః*, స్వర్లోకం యొక్క మూడు విరాజమాన లోకాల ప్రస్తావన ఇక్కడ ధ్వనిస్తోంది, *దివో రోచనాని*); దివ్యమైన ఉషాకాంతులు పైకి ఎగశాయి; మర్త్యులలోని ఋజుతని, వక్రతని సమదర్శిస్తూ (సత్యం యొక్క) విశాల క్షేత్రాలలోకి సూర్యుడు ప్రవేశించాడు. అటుపిమ్మట వారు మేలుకుని (ఋజుతని, వక్రతని, అలాగే సత్యాన్ని అసత్యాన్ని సూర్యుడు వేరు చెయ్యడం వల్ల) నిశితంగా చూడగలిగారు. స్వర్గంలో ఆనందించబడే మహదానందాన్ని అప్పుడు వాళ్లు కనుగొన్నారు (*రత్నం ధారయంత ద్యుభక్తం*). ఓ మిత్రుడా, ఓ వరుణుడా! దేవతలంతా మా నెలవులలో కొలువుండనీ, మా చింతనని సత్యం శాసించనీ" – *విశ్వే విశ్వాసు దుర్యాసు దేవా, మిత్ర ధియే వరుణ సత్యమ్ అస్తు*. ఇదే భావనలని కాస్త భిన్నమైన భాషలో పరాశరుడు వర్ణిస్తాడు. అది జగతి సమస్తమూ సత్యం యొక్క ఆలోచన, సత్యం యొక్క ప్రేరణ వ్యాపించి వుందన్న భావన. అలాగే జగతి అణువణువునా ఆనందాన్ని, అమరత్వాన్ని సాధించాలనే ప్రేరణ దాగి వుందనే భావన.

ఋక్కు ఈ విధంగా ముగుస్తుంది – "విమల కాంతితో భాసించే అగ్నిని ఈ విధంగా స్తుతించనీ. యజ్ఞం చేత మనకు అన్నిటినీ ప్రసాదించగలిగే హోత అతడు. కాంతుల గోవుల పవిత్ర పొదుగులని పిండి మనకోసం వరాలు ప్రసాదించుగాక. ఆనందాల మొక్క (సోమ వృక్షం) నుండి వచ్చే పరిశుద్ధమైన ఆహారాన్ని సర్వత్ర ప్రోక్షించుగాక. యజ్ఞఫలాన్ని స్వీకరించే దేవతలు అందరిలోకి అతడు అనంతుడు, మానవాళికి అతడు అతిథి. తనలో దేవతల వర్ధమాన అభివ్యక్తీకరణని సమ్మతించే అగ్ని, జాతవేదసుడైన అగ్ని, మనకు ఆనందాన్ని ప్రసాదించుగాక."

నాల్గవ మండలం లోని రెండవ ఋక్కులో మనకి దివ్య అంగిరసులైన ఏడుగురు ఋషులకి, మానవ పితరులకి మధ్య సారూప్యం గోచరిస్తుంది. ఆ వేదభాగానికి ముందు వచ్చే నాలుగు శ్లోకాలు (IV.2.11-14) సత్యం కోసం, ఆనందం కోసం మానవ తపనని వ్యక్తం చేస్తాయి. "జ్ఞాత అయిన అతడు జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య తేడాని వివేచన చేయుగాక. విశాల స్థాయిలని ఎరిగి, మర్త్యులని బందీలుగా ఉంచే వక్రతని గుర్తించు గాక. ఓ దైవమా, సంతతిలో సఫలమయ్యే ఆనందాన్ని మాకు ప్రసాదించు దితీ, మమ్మల్ని కాపాడు ఓ అదితీ!" ఇక పదకొండవ శ్లోకం ప్రాధాన్యత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వేదాంతంలో సుపరిచితమైన జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య వైరుధ్యం ఇక్కడ కనిపిస్తుంది. జ్ఞానాన్ని విశాలమైన, విస్ఫారిన తలాలతో పోల్చడం వేదంలో తరచు కనిపిస్తుంది. యజ్ఞం చేసి ప్రయాస పడే వారు ఆ విశాల తలాలని చేరుకుని అక్కడ ఆత్మానందంలో ఓలలాడే అగ్నిని దర్శిస్తారు (V.7.5). ఆ తలాలే అతడి విశాలమైన ఆత్మ, వాటితో అతడు తన విశాలమైన అస్తిత్వాన్ని, అనవధికమైన బృహత్తు అనే దేహాన్ని నిర్మించుకుంటాడు (V.4.6). కాబట్టి సత్య తలంలో మనం దైవం యొక్క అనంతమైన ఆత్మని చేరుకుంటాము. అక్కడే జగజ్జనని అయిన అదితి యొక్క మూడేడుల పీఠాలు ఎదురవుతాయి. అనంతంలో అగ్ని యొక్క మూడు పరమ జననాలు జరుగుతాయి, అనంతే అంతః (IV.1.7). అజ్ఞానాన్ని మాత్రం వక్రతతోను, ఎగుడు దిగుడు తలాలతోను[34] పోల్చడం జరుగుతుంది. అక్కడ మర్త్యులు బందీలుగా ఉండిపోతారు. అందుకే మర్త్యజీవనం కుటిలమై, కలుషితమై ఉంటుంది. ఆ తరువాత వచ్చే అర్ధశ్లోకంలో అజ్ఞానాన్ని దితితోను, జ్ఞానాన్ని అదితితోను జోడించడం కనిపిస్తుంది, *దితిం చ రాస్వ అదితిమ్ ఉరుష్య*. దితిని విభజన అనే అర్థం గల *దను* అనే పేరుతో కూడా పిలుస్తారు. ఆమె సంతతి అవరోధక బలాలు, వృత్రులు. వీరినే దానులు అని, దానవులని, దైత్యులు అని అంటారు. అదితి అంటే అనంతమైన అస్తిత్వం, దేవతలకి జనని. సంతతిలో సఫలమయ్యే ఆనందాన్ని ఋషి కోరుకుంటాడు. అంటే దివ్యక్రమల వల్ల కలిగే ఫలితాలని కోరుకుంటాడు. అందుకోసం మన విభాజితమైన మర్త్య స్థితిలో దాగిన సంపదలు అన్నిటినీ కొల్లగొట్టాలి. ఆ ప్రయత్నానికి

[34] చిత్తిమ్ అచిత్తిమ్ చినవద్ వి విద్వాన్; పృష్ఠేవ వీతా వృజినా చ మర్తాన్. వృజిన అంటే వక్రమైన అని అర్థం. సత్యం యొక్క సరళ ఋజుత్వానికి వ్యతిరేకంగా, అసత్యం యొక్క వక్రతను సూచించడం కోసం వేదం ఆ పదాన్ని వాడుతుంది. అయితే ఇక్కడ కవి వృ అంటే వేరు చెయ్యడం, కప్పి వెయ్యడం అనే అర్థాన్ని తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. అలాంటి బాహ్యార్థం లోని ఆ విశేషణాన్ని మర్తాన్ అనే పదంతో జోడించాలి.

వృత్రులు, పణులు అడ్డుపడుతూ, వాటిని అనంత దివ్యాత్మలో దాచి వుంచుతారు. మన సామాన్య మానవ అస్తిత్వంలో ఆ అనంత దివ్యాత్మ మనకి కానరాకుండా ఉండిపోతుంది. దను లేదా దితి బిడ్డలకి లోనై జీవించడం వల్ల అలా జరుగుతుంది. ఈ భావన ఈశోపనిషత్తులో కనిపించే ఒక భావనతో సరిగ్గా సరిపోతోంది. అమరత్వ సిద్ధి కలగాలంటే జ్ఞానాన్నే కాక అజ్ఞానాన్ని కూడా తెలుసుకోవాలి, అనన్య బ్రహ్మంలో ఏకత్వాన్నే కాక, అనేకత్వాన్ని కూడా పొడచూడగలగాలి.

ఇప్పుడు దివ్యులైన సప్తర్షుల విషయానికి వద్దాము. "అజేయులైన ఋషులు ద్రష్టను (దేవుడైన అగ్నిని) ప్రకటించారు. మనుషుల స్వధామాలలో అతణ్ణి స్థిరంగా నిలిపారు. ఓ అగ్నీ! దాని నుండి (దేహి అయిన మానవుడి నుండి), నీ కర్మ (*అర్యః*) చేత ఆకాంక్షిస్తూ, నీ వర్ధమాన చలనాల చేత అద్భుతాత్ముల (పరమాత్ముడిలో ఇమిడి వున్న దేవతలు) దర్శనాన్ని పడయదువు గాక (కవిం శశాసుః కవయోద్యదబ్ధా నిధారయన్తో దుర్యాస్వాయోః । అతస్త్వం దృశ్యం అగ్న ఏతాన్పద్భిః పశ్యేరద్భుతానర్య ఏవైః). ఇదంతా పరమాత్మ దర్శనానికి చేర్చే యాత్ర యొక్క వర్ణన. "ఓ అగ్నీ! నీవు నవయవ్వనుడవు. మంత్రోక్తిని జపించి, సోమాన్ని సమర్పించి, యజ్ఞాన్ని చేసేవాడికి నీవు (ఆ యాత్రలో) పరిపూర్ణ మార్గదర్శివి. కార్యాన్ని ఒనగూర్చే తేజోమయులకి ప్రగాఢమైన, విస్తారమైన ఆనందాన్ని ప్రసాదించి, కర్మ చేసిన వారికి (ఆ మనిషికి, *చర్షణిప్రాః*) వృద్ధిని, సాఫల్యాన్ని ప్రసాదించు. ఓ అగ్నీ! మేము మా హస్త, పాణి, దేహాలతో చేసిన దానంతటినీ సత్యచిత్తులు (అంగిరసులు) నీ తేరుగా మార్చి (దివి భువి అనేవి, *భూరిజోః*) రెండు చేతులతో నడిపిస్తారు; సత్యాన్ని సాధించగోరే వారు శోధించి దాన్ని చేరుకుంటారు (*ఋతం యేముః సుధ్యా ఆశుషాణాః*). "ఇప్పుడు ఉషాదేవి యొక్క ఏడుగురు ద్రష్టలు, మహోన్నతులైన యజ్ఞఫలదాయకులు, మాలో దేవతల జననాన్ని కలుగజేయుగాక. ఐశ్వర్యభరితమైన పర్వతాన్ని భేదించి, ఆ విధంగా మేము సురసుతులైన అంగిరసులు అవుగాక." ఇక్కడ మనకు ఏడుగురు దివ్య ద్రష్టలు విశ్వయజ్ఞానికి అధినేతలుగా మనకి స్పష్టంగా దర్శనమిస్తారు. అలాంటి యజ్ఞం చేత మనుషులు ఆ దివ్య ద్రష్టలుగా "వికాసం" చెందడం అనే భావన కూడా మనకి కనిపిస్తుంది. అంటే మనిషి ఆ దివ్యులని తనలోనే సృష్టించుకుంటాడు. ఆ దివ్యుల తత్వంలోకి అతడు వికాసం చెందుతాడు. దివి, భువి, తదితర

దేవతలు అన్నీ అతడే అవుతాడు. వేరే భాషలో చెప్పాలంటే ఆ దివ్య జననాలని (*జన్, కృ, తన్*) తన ఆత్మలోనే అవతరింపజేసుకుంటాడు.

అటు పిమ్మట ఈ రకమైన మహత్తర వికాసానికి, విజయానికి మొదటి తార్కాణంగా మానవ పితరులని పేర్కొనడం జరుగుతుంది. "ఓ అగ్నీ! ఇప్పుడు కూడా మహోన్నతులైన మా ప్రాచీన పితరులకి మల్లె, సత్యాన్నే శోధిస్తూ, దివ్యవాక్కుని వ్యక్తం చేస్తూ, స్వచ్ఛత దిశగా, తేజం దిశగా పయనించాలి; భూమిని (పార్థివ తత్వాన్ని) భేదించి వాళ్లు ఎర్రని కాంతులని (ఉషస్సులని, గోవులని) బట్టబయలు చేశారు; కర్మలలో తేజంలో పరిపూర్ణులై, దేవతలని, దివ్యులని కోరుకుంటూ, ఉక్కును కాల్చి రూపుదేల్చినట్టు జననాలని రూపుదిద్దుతూ, పావన జ్వాలగా అగ్నిని రూపొందిస్తూ, ఇంద్రుణ్ణి పెంచుతూ, వాళ్లు తేజస్సు యొక్క బృహత్తును (*గవ్యమ్ ఊర్వమ్*) చేరుకుని సాధించారు. సిరుల బయళ్లలో ఆలమందలకి మల్లె, ఓ మహనీయుడా, లోనున్న దేవతల జననాలు అభివ్యక్తమయ్యాయి; వారు ఇరువురు మర్త్యులకి చెందిన విశాలమైన వైభోగాలని (తపనలని) సాధించి, ఉన్నతమైన అస్తిత్వపు పెంపుకోసం ఆకాంక్షించారు." *ఆ యూథేవ క్షుమతి పశ్వో అఖ్యద్ దేవానాం యజ్ జనిమాన్త్య ఉగ్ర; మర్తానాం చిద్ ఉర్వశీర్ అకృప్రన్ వృధే చిద్ అర్య ఉపరస్యాయోః.* ఒక పక్క దితి సిరులని వశం చేసుకుంటూ, మరో పక్క అదితిని సంరక్షించడం అనే ద్విముఖ భావన ఇక్కడ మళ్లీ ఎదురవుతోంది. "మీ కోసం మేము పని చేశాము, పనులలో పరిపూర్ణతను సాధించాము, విశాలంగా వెలిగే ఉషస్సులు, అగ్ని యొక్క పూర్ణత్వంలో, తన అనేకముఖమైన ఆనందాలలో, ఆ దేవత యొక్క కాంతులీనే నయనంలో, తమ సత్యపు నెలవులో కొలువున్నాయి (లేదా సత్యాన్ని తమ వలిపెంగా ధరించాయి)."

IV.3.11 లో అంగిరసుల ప్రసక్తి మళ్లీ వస్తుంది. ఆ శ్లోకానికి ముందు వచ్చిన కొన్ని వర్ణనలని ఒకసారి పరిశీలిద్దాం. వేదంలో ఏ శ్లోకాన్ని అయినా దాని నేపథ్యంతో సంబంధం లేకుండా అర్థం చేసుకోవడం అసంభవం. శ్లోకం అర్థం కావాలంటే అది ఉన్న సూక్తంలోని మూలభావాలు అర్థం కావాలి, ఆ శ్లోకానికి ముందు ఏవుందో, తరువాత ఏవుందో అర్థం చేసుకోవాలి. మనుషులు అందరికి ఓ పిలుపుని ఇస్తూ సూక్తం మొదలవుతుంది. సత్యాన్ని

సాధించేందుకు గాను చేసే యజ్ఞంలో తోడ్పడే అగ్నిని తమలో ప్రతిష్ఠించుకోమంటుంది, తమలో అగ్ని యొక్క స్వర్ణరూపాన్ని (హిరణ్యరూపం, బంగారం ఎప్పుడూ సత్యం యొక్క సౌరకాంతికి, *ఋతం జ్యోతిః,* ప్రతీక) సృష్టించుకోమంటుంది. అజ్ఞానం బలపడి రూపుదేలేలోపు, *పురా తనయిత్నో ర్ అచిత్తాత్,* ఈ ప్రయత్నాన్ని పూర్తిచెయ్యమంటుంది. మనిషి కర్మలలో, చింతనలో మేలుకొమ్మని, సత్యాన్ని వ్యక్తం చెయ్యమని, అగ్ని దేవుణ్ణి ఆవాహన చేస్తుంది. "చింతనని స్థిరపరిచే సత్య చైతన్యం" - *ఋతస్య బోధి ఋతచిత్ స్వాధీః.* మరి అసత్యం అంటే సత్యాన్ని తప్పుడు స్థానంలో నిలపడమే. మనిషి తనలోని పొరబాట్లని, పాపాలని, దోషాలని వివిధ దేవతలకి, దివ్యాత్మ యొక్క దైవీబలాలకి అర్పిస్తే, అప్పుడా శక్తులు తనలోని ఆ దోషాలని తొలగిస్తాయి. పునీతుడైన మానవుడు అనంత జనని అయిన అదితి ముందు దోషరహితుడై నిలుస్తాడు – *అదితయే అనాగసః.* లేదా మరో సందర్భంలో చెప్పినట్టు అనంతమైన అస్తిత్వానికి సిద్ధమవుతాడు.

ఆ తరువాత తొమ్మిదవ, మరియు పదవ శ్లోకాలలో మానవ జీవనాన్ని, దివ్యజీవనాన్ని సమన్వయ పరచవచ్చనే భావన వ్యక్తమవుతుంది. దివ్యజీవనానికి ప్రతీక అయిన అదితి, మానవ జీవనానికి ప్రతీక అయిన దితిని తన చేతనతో, తేజంతో ముంచెత్తుతుంది, ప్రభావితం చేస్తుంది. "నేను కోరుకునే సత్యం మరో సత్యాన్ని నియంత్రిస్తుంది (అంటే మానవ సత్యాన్ని దివ్య సత్యం నియంత్రిస్తుంది), గోవు యొక్క పండిన, తీయని ఫలాలు, దాని అపక్వ ఫలాలని ప్రభావితం చేస్తాయి (మళ్లీ విశ్వచైతన్యం యొక్క అస్తితం యొక్క పరిపూర్ణ, ఆనందమయ, దివ్య ఫలాలు ఒకపక్క, అపరిపూర్ణ మానవ స్థితి మరో పక్క). ఆ నల్లనిదైన (అంధకారమయ, విభాజిత స్థితికి ప్రతీక అయిన దితి) ఆమెను (ఆ ఆవు) పునాదుల నుండి ఉబికే మెరిసే జలాలు, వాటి సహచర జలాలు పోషిస్తాయి (*జామర్యేణ పయసా*). సత్యం చేత, పురుష వృషభుడైన అగ్ని, తన స్థాయిలకి చెందిన జలాలని చల్లుతాడు, తన శిఖరాలు స్థిరంగా నిలుస్తాయి, బృహత్తు (విశాలమైన స్థలం లేదా అభివ్యక్తీకరణ) స్థాపించబడుతుంది; మెరిసే మంచి పొదుగుల నుండి ఎద్దు పాలు పితుకుతుంది." మూలం, ఆసనం, పునాది అయిన అనన్యుడి శుద్ధ విమలత ఒక పక్క, త్రిలోకాలలో జీవనం యొక్క అనేకవర్ణ విలాసం మరొక పక్క – ఈ రెండిటిని ఎదురెదురుగా వేదం పదే పదే ప్రదర్శిస్తుంటుంది. అలాగే అచ్చోసిన ఎద్దు ఒక పక్క, మెరిసే పొదుగులు మరొక పక్క – ఈ చిత్రం కూడా మరెన్నో ఇతర

చిత్రాలకి మల్లె, సత్యం చేత, అనంతం చేత పునీతమైన మానవ జీవనం అనే భావనని మరొక్క సారి పేర్కొంటుంది.

చివరిగా ఋషి విరాజమాన గోవులని, జలాలని జోడించే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రక్రియ వేదంలో ఎన్నో చోట్ల తారసపడుతుంది. “సత్యం చేత అంగిరసులు పర్వతాన్ని బద్దలు కొట్టి గోవులతో సమాగమం అయ్యారు. మానవాత్ములైన వారు ఆనందమయ ఉషస్సులో కొలువున్నారు. అగ్ని జనించినప్పుడు స్వర్ అభివ్యక్తం అవుతుంది. ఓ అగ్నీ! సత్యం చేత ఆ దివ్య, అమర జలాలు, తమ మధుర మహోధృత ప్రవాహాలతో, ఉరకలు వేసే యుద్ధాశ్వంలా సనాతనంగా ప్రవహించాయి.” అమరత్వం అనే మహద్విజయాన్ని సాధించడానికి నెరవేర్చవలసిన నాలుగు ప్రాథమిక నియమాలని ఈ నాలుగు శ్లోకాలు నిర్వచిస్తున్నాయి. అవన్నీ అధ్యాత్మికుల గూఢవిద్యకి చెందిన ప్రతీకలు. ఆ ప్రతీకల రూపంలో తమ మహోన్నత అధ్యాత్మిక అనుభవసారం అధముల చేత పడకుండా దాచారు. కాని దురదృష్టవశాత్తు భావితరాలకి కూడా అందకుండా అవన్నీ రహస్యంగా మిగిలిపోయాయి. అవి రహస్య ప్రతీకలు, దీక్ష పొందిన వారికి, జ్ఞానులకి, ద్రష్టలకి తప్ప అవి సామాన్యులకి తమలో దాగిన సత్యాన్ని వెల్లడి చెయ్యవు. ఈ సంగతిని వామదేవుడు స్వయంగా ఈ ఋక్కులోనే ఆఖరు శ్లోకంలో చాలా స్పష్టంగా ప్రకటిస్తాడు – “ఓ అగ్నీ! ఓ ఫలప్రదాతా! అన్నీ తెలిసిన నిన్ను ఉద్దేశించి ఈ రహస్య పదాలని ఉచ్చరిస్తున్నాను. ఇవి దారి చూపే పదాలు, దివ్యజ్ఞానపూర్ణమైన ఈ పదాలు విప్రులకి మాత్రమే తమ భావాన్ని వెల్లడి చేస్తాయి. తేజోమయమైన వాక్కు, చింతన కలిగిన నేను ఆ మాటలని పలికాను.” *ఏతా విశ్వా విదుషే తుభ్యం వేధో నీథాన్య అగ్నే నిణ్యా వచాంసి; నివచనా కవయే కావ్యాన్య అశంసిషమ్ మతిభిర్ విప్ర ఉక్థైః.* అర్చకులు, పురోహితులు, వయ్యాకరణులు, పండితులు, చారిత్రకులు, పౌరాణికులు – వీరెవరికీ అంతుబట్టని రహస్య శబ్దాలు! వారికి అవన్నీ వట్టి చీకటి మాటలు, అయోమయపు అవరోధాలు. కాని మహోన్నతులైన మన ప్రాచీన పితరులకి, తేజోమయులైన వారి భావి తరాలకి మాత్రం అవి పరమ పవిత్ర సత్యాలు, *నిణ్యా వచాంసి నీథాని నివచనా కావ్యాని.*

అధ్యాయం 20

సురశునకం

అంగిరస గాథలో పదే పదే ఎదురయ్యే మరి రెండు అంశాలు ఉన్నాయి. ఆ రెండు అంశాలని మరింత లోతుగా శోధిస్తే గాని, సత్యం గురించి వేదం యొక్క బోధన గురించి, ఉషను కనుగొన్న ప్రథమ పితరులు పొందిన ఆత్మప్రకాశనాల గురించి సంపూర్ణంగా అర్థం కాదు. దాని కోసం సరమ అంటే ఎవరో ముందు కచ్చితంగా తేల్చుకోవాలి. తరువాత పణుల క్రియలు ఏమిటో కచ్చితంగా తెలుసుకోవాలి. ఎందుకంటే వైదిక అన్వయంలో ఈ రెంటికి అవినాభావ సంబంధం వుంది. సరమ అంటే తేజస్సు యొక్క శక్తులలో ఒకటని, ముఖ్యంగా ఉష యొక్క శక్తులలో ఒకటని మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. వేదంలో ఇంద్రుడు, ప్రప్రథమ ఆర్య ఋషులు ఒక పక్క, గుహ పుత్రులైన గుహ్యులు మరొక పక్క – ఈ రెండు వర్గాల మధ్య జరిగే ఘర్షణ భారతీయ చరిత్రలో ఏదో ఆదిమ ఘట్టం యొక్క వక్రీకరణ మాత్రం ససేమిరా కాదు. అది వెలుగుకి, చీకటికి మధ్య జరిగే పోరాటానికి ప్రతీక. సరమ అనే దేవ శునకం మెరిసే పశువుల వెదకులాటలో ముందుండి దారి చూపిస్తుంది. అది సత్యాన్ని చేరుకునే మార్గాన్ని చూపిస్తుంది. పర్వతంలో దాగిన రహస్య గోశాలని కనిపెడుతుంది. అంటే అది మానవ మానసంలో సత్యం మేలుకొంటున్న ప్రప్రథ సంకేతం అన్నమాట. మనలో సత్యాన్ని కనుక్కోగల సామర్థ్యాలు అన్నిట్లోకి, చీకట్లో దాగిన సత్యాన్ని కనిపెట్టగల సామర్థ్యం ఏమిటి అని ప్రశ్నించుకుంటే, అందుకు సమాధానంగా లోజ్ఞానం అన్న పదమే స్ఫురిస్తుంది. అయితే సరమ, సరస్వతి ఒక్కరు కాదు. ఇరువురి పేర్లలో సారూప్యం ఉన్నా సరస్వతికి మల్లె సరమ స్ఫూర్తికి ప్రతీక కాదు. సరస్వతి సంపూర్ణ జ్ఞాన ప్రవాహాన్ని విడుదల చేస్తుంది; ఆమె మనలో ఒక మహాస్రవంతిని (*మహో అర్ణః*) జాగృతం చేస్తుంది, అసలు ఆమెయే ఆ మహాస్రవంతి అవుతుంది. ఆలోచనలు అన్నిటిని నిండైన తేజంతో పూరిస్తుంది, *ధియో విశ్వా విరాజతి*. సరస్వతి సత్య ప్రవాహాన్ని వశం చేసుకుంటుంది, ఆమెయే ఆ సత్య ప్రవాహం

అవుతుంది. కాని సరమ సత్యం దిశగా నడిచే యాత్రికురాలు, సత్యం ఆమెకి ఇంకా వశం కాలేదు. పోయిన దాన్ని ఆమె వెతికి పట్టుకుంటుంది. అలాగే ఆమె ఇళాదేవిలా, మనిషికి సత్యాన్ని బోధించే గురువు కాదు, ఆత్మప్రకాశనానికి పరాకాష్ఠ కాదు. ఎందుకంటే ఆమె వెదుకుతున్న దాన్ని కనుక్కున్నా కూడా, దాన్ని ఆమె వశం చేసుకోలేదు. ఆ సందేశాన్ని కేవలం ఋషులకి, వారికి సాయం చేసే దైవీసహచరులకి చేరవేస్తుంది. ఆ సందేశాన్ని ఉపయోగించుకుంటూ వారు కనుక్కోబడ్డ తేజాన్ని వశం చేసుకోవడం కోసం ప్రయాసపడాలి.

అసలు వేదం సరమ గురించి ఏం చెబుతుందో ముందు చూద్దాం. ఉదాహరణకి ఒక శ్లోకాన్ని (I.104.5) తీసుకుందాం. అందులో సరమ పేరు ప్రస్తావనకి రాదు. ఆ ఋక్కు అంగిరస ఋషుల గురించి గాని, పణుల గురించి గాని చెప్పదు. కాని ఆ వాక్యం మాత్రం వేదంలో సరమ యొక్క పాత్రను మాత్రం స్పష్టంగా వర్ణిస్తుంది – "ఆ మార్గదర్శి మనకి గోచరించినప్పుడు, ఎరుక కలిగిన ఆమె, అది దస్యుల ఇల్లు అన్నట్లుగా, ఆ ధామాన్ని సమీపించింది." ప్రతియత్ స్యా నీథా అదర్శి దస్యోర్, ఓకో న అచ్ఛా సదనం జానతీ గాత్. ఈ రెండూ సరమ యొక్క ముఖ్య లక్షణాలు – దృష్టికి ముందే ఆమెకి జ్ఞానం కలుగుతుంది, కాస్త సూచన ఇస్తే చాలు లోనుండి జ్ఞానం పెల్లుబుతుంది, ఆ జ్ఞానంతో ఆమె సత్యం కోసం శోధించే తక్కిన శక్తిసామర్థ్యాలకి, దివ్యబలాలకి దారి చూపుతుంది. ఆమె ఆ ధామాన్ని (సదనం) , విధ్వంసకుల నిలయాన్ని, సమీపిస్తుంది. సత్యం యొక్క ధామం (*సదనమ్ ఋతస్య*) జగతికి ఒక ధృవం అయితే, ఇది అందుకు వ్యతిరేక ధృవం. ఎలాగైతే దేవతల ధృవం తేజోపూర్ణమైన రహస్య గుహ అయ్యిందో, ఈ విధ్వంసకుల వ్యతిరేక ధృవం చీకటి గుహలో దాగి వుంటుంది, *గుహాయామ్*. మరోలా చెప్పాలంటే అతిచేతన సత్యం నుండి దిగి వచ్చిన బలం ఆమె. మనలో అంటే మన ఉపచేతనలో దాగిన తేజానికి ఆమె దారి చూపుతుంది. ఈ లక్షణాలన్నీ కచ్చితంగా లోజ్ఞానానికి (intuition) వర్తిస్తాయి.

సరమ ప్రస్తావన వేదంలో అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. ఆ కాసిన్ని సందర్భాలలో కూడా అంగిరసుల విజయంతోను, అత్యున్నత ఆత్మతలలాని చేరుకునే ప్రయాసతోను ఆ ప్రస్తావన ముడిపెట్టబడింది. వాటి అన్నిట్లోను ముఖ్యమైన సూక్తం అత్రుల సూక్తం. దీని గురించి నవగ్వ, దశగ్వ అంగిరసుల పరిశీలనలో ముందే చెప్పుకున్నాం (V.45). వీటిలో మొదటి మూడు శ్లోకాలు ఆ మహద్విజయాన్ని చక్కగా నిర్వచిస్తాయి – "వాక్కుతో సురపర్వతాన్ని

బద్దలు కొట్టి అతడు వాటిని కనుగొన్నాడు. మేలుకుంటున్న ఉషస్సు నుండి పుట్టిన కిరణాలు వెల్లడి అయ్యాయి. గోశాలలో దాగిన వాటిని అతడు బట్టబయలు చేశాడు. అప్పుడు స్వర్లోకం పైకెగసింది. ఒక దేవత మానవ ద్వారాలని తెరిచాడు. సూర్యుడు విశాలమైన శక్తిని, వైభవాన్ని సంతరించుకున్నాడు. ఆ బృహత్తు నుండి గోవుల తల్లి (ఉషాదేవి) ఎరుకతో బయలువెడలింది; నదులు వరదలయ్యాయి, వరదలు కట్టలు తెంచుకుని ప్రవహించాయి. తీరుగా మలచిన స్తంభంలా స్వర్గం స్థిరమయ్యింది. ఆ మాటలకి పర్వత గర్భంలోని అంశాలు వెలువడ్డాయి. మహత్తరుల (నదులు, లేదా ఉషస్సులు) జననానికి కారణమయ్యాయి. పర్వతం మధ్యకు చీలింది, స్వర్గం పరిపూర్ణమయ్యింది. బృహత్తును వారి భూమిపై స్థిరపరిచి, విస్తరింపజేశారు." ఇక్కడ ఋషి ఇంద్రుడి గురించి, అంగిరసుల గురించి చెప్తున్నాడు. తక్కిన సూక్తం మొత్తాన్ని పరిశీలిస్తే ఆ విషయం అర్థమవుతుంది. పరిభాషని బట్టి కూడా ఆ సంగతి తెలుస్తుంది. అంగిరసుల గాథావళిలో తరచు వాడబడే ఎంతో పదజాలం ఇక్కడ కూడా వాడబడడం కనిపిస్తుంది. ఉషోదయాన్ని, గోవుల యొక్క, సూర్యుడి యొక్క ఆవిర్భావాన్ని తెలిపే ఎన్నో పదాలు ఇక్కడ కూడా ఎదురవుతాయి. వాటి అర్థమేమిటో మనకు ముందే తెలుసు. త్రివిధమైన మన అస్తిత్వపు పర్వతశిఖరం స్వర్గాన్ని తాకుతుంది. ఆ పర్వతాన్ని ఇంద్రుడు భేదించగా అందులో దాగిన ప్రకాశనాలు వెలువడ్డాయి. ఊర్ధ్వగతిలో సాగే మెరిసే పశువుల చేత అతిచేతనా లోకమైన స్వర్లోకం అభివ్యక్తమయ్యింది. సత్యభానుడి యొక్క శక్తి, తేజోవిలాసం నలుదిశలా వ్యాపించింది. విరాజితమై, విశాలమైన అంతరంగ జ్ఞానం (*జానతీ గాత్*) లోంచి అంతరంగ ఉషస్సు పెల్లుబుకుతుంది. I.104.5 లో ఈ '*జానతీ గాత్*' అనే పదజాలాన్ని దస్యుల ఇంటికి దారి చూపించే ఆమెను సూచించడానికి వాడారు. III.31.6 లో అదే పదజాలాన్ని సరమని సూచించడానికి వాడారు. సత్య స్రవంతులు, దాని ఆత్మ లోనుండి పెల్లుబికే ప్రభావాలు, చలనాలు (*ఋతస్య ప్రేషా*), ఉరికే సెలయేళ్లు వాటి జలాల కోసం ఇక్కడ కాల్వని ఏర్పాటు చేశాయి. స్వర్గానికి ప్రతినిధి అయిన మనోజీవి పరిపూర్ణం గావించబడుతుంది, స్తంభంలా తీరుగా మలచబడి బృహత్తర సత్యానికి ఆధారంగా స్థిరంగా నిలుస్తుంది. ఉన్నత, అమర జీవనానికి చెందిన ఆ సత్యం ఇక్కడ అభివ్యక్తం అవుతుంది. ఆ సత్యం యొక్క బృహత్తు ఇక్కడ భౌతిక జీవనంలో నాటుకుంటుంది. పర్వత గర్భంలో (*పర్వతస్య గర్భః*) దాగిన అంశాలు ఏడు తలల ధీశక్తికి (*ఋతస్య ధీతిః*) చెందిన ప్రకాశనాలు.

ఆ ప్రకాశనాలు మంత్రోక్తికి స్పందనగా వెలువడ్డాయి. దాని వల్ల ఏడు మహానదుల అద్భుత జననం కలుగుతుంది. సత్యం యొక్క సారం సక్రియమైన గమనంగా (*ఋతస్య ప్రేషా*) మారగా ఏర్పడ్డ జలాలవి.

“దేవతలకు ప్రియమైన అమలిన భాషా శబ్దాలతో” ఇంద్రుణ్ణి, అగ్నిని ఆవాహన చేసిన తరువాత, అదే విధంగా పితరులకి కూడా ఆవాహన చేసి, ఆ దివ్యఫలాలు పడయమని ఋషి మనుషుల చేత ఒండొకరికి చెప్పిస్తాడు. మరి ఆ మంత్రోక్తుల చేతనే మరుత్తులు ఋషులుగా యజ్ఞం చేస్తారు, ఋషులు తమ దివ్యదృష్టితో యజ్ఞకర్మని పరిపూర్ణంగా నిర్వర్తిస్తారు (*ఉక్తేభిర్ హి ష్మా కవయః సుయజ్ఞా... మరుతో యజంతి*...). “రండి, మేధస్సులో పరిపూర్ణులం అవుదాము రండి, బాధలని, ఇక్కట్లని నాశనం చేసి, మహోన్నత శ్రేయస్సును సాధిద్దాం రండి.” *ఏ తో ను అద్య సుధ్యో భవామ, ప్ర దుచ్ఛునా మినవామ ఆ వరీయః*. “ఈ విద్వేషపూరిత అంశాలని (మన మీద దెబ్బకొట్టి, విభేదాలు కలుగజేసేవి) మన నుండి దూరంగా ఉంచుదాము. యజ్ఞపురుషునికి దగ్గరగా పయనిద్దాము. రండి, ఓ స్నేహితులారా! మేధని రూపుదిద్దుదాము (ఇది నిశ్చయంగా ఏడు తలల అంగిరస చింతనే), ఆ మేధయే జగజ్జనని (అదితి లేక ఉష), గోవులని బంధించి ఉంచే గోశాలని నిర్మూలిస్తుంది.” ఇక్కడ తాత్పర్యం చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఇలాంటి సందర్భాలలోనే వేదం యొక్క అంతరార్థం దాన్ని కప్పి ఉంచే బాహ్యార్థపు ముసుగుని కాస్తయినా పక్కకి తొలగించినట్టు కనిపిస్తుంది.

ఇక్కడే ఋషి ఒక మహత్తర, పురాతన విజయాన్ని ప్రస్తావిస్తాడు. అలనాటి విజయాన్ని మళ్లీ మనుషులు సాధించాలని ప్రోత్సహిస్తూ, అంగిరసుల విజయాన్ని, సరమ సాధించిన ఫలితాన్ని పేర్కొంటాడు. “ఇక్కడే ఒక శిలకి చలనం వచ్చింది. దాని వల్ల నవగ్వులు ఒక ఋక్కుని పది నెలల పాటు వల్లించారు. సత్యాన్ని గాలిస్తూ వెళ్లిన సరమ గోవులని కనుగొంది. అంగిరసులు సమస్తాన్ని సత్యవంతం చేశారు. అనన్య బృహత్తు ఉదయించినప్పుడు (ఉషాదేవి అనంత అదితికి చిహ్నం, *మాతా దేవానామ్ అదితేర్ అనీకమ్*) అంగిరసులు అందరూ గోవులతో కలిసి వచ్చారు (దీని అర్థం బహుశా గోవులు, లేదా కిరణాలు ప్రతీకలుగా నిలిచిన ఆత్మప్రకాశనాలు కావచ్చు). వీటికి (ఈ ప్రకాశనాలకి) మూలం ఆ పరమ జగతిలో వుంది. సత్య మార్గం చేత సరమ గోవులని కనుగొంది.” ఇక్కడ

సరమ ఋజుమార్గాన సాగుతూ సత్యాన్ని చేరుకునే వైనం కనిపిస్తుంది. అలాగే అయాస్యుడి యొక్క, బృహస్పతి యొక్క ఏడు తలల లేదా ఏడు కిరణాల చింతనకి ప్రతినిధులుగా నిలిచిన ఏడుగురు ఋషులు గుప్తంగా ఉన్న ప్రకాశనాలని కనుగొనే తీరు కనిపిస్తుంది. శక్తి చేత ఈ ప్రకాశనాలు అన్నీ ఏకం కావడం కనిపిస్తుంది. వశిష్ఠుడి భాషలో చెప్పాలంటే ఆ కలయిక సమమైన విశాలతలో (*సమానే ఊర్వే*) జరుగుతుంది. దాని నుండే జ్ఞానంతో ఉష అవతరిస్తుంది (*ఊర్వాద్ జానాతి గాత్*, v.2). అంటే బృహత్తరమైన అనన్యుడి యొక్క, లేదా అనంత చైతన్యం యొక్క ఉదయంలో జరుగుతుంది. వశిష్ఠుడు చెప్పినట్టు అవన్నీ జ్ఞానంలో ఘర్షణ లేకుండా ఏకీభావం చెందుతాయి, *సంగతాసః సం జానతే న యతన్తే మిథస్తే.* దీని అర్థం ఇతర ఋక్కులలో చెప్పినట్టుగా ఏడు ఒక్కటయ్యాయి. అవి ఏడు తలల మేధకి ప్రతీక అయిన ఏడు నోళ్లు గల అంగిరసుడిగా మారాయి. ఆ విధంగా ఏకీకరణ చెందిన అంగిరసుడు సరమ చేసిన ఆవిష్కరణ ఫలితంగా అన్నిటినీ సత్యవంతం చేస్తాడు (7 వ శ్లోకం). ఆ విధంగా సమరసమై, సమైక్యమై, పరిపూర్ణం చెందిన కవిక్రతువు అసత్యం యొక్క, వక్రత యొక్క సమస్త రూపాలని సవరించి, సమస్త చింతనని, జీవనాన్ని, కర్మని సత్యపరంగా మలచగలుగుతుంది. ఈ ఋక్కులో కూడా సరమ పని సత్యం దిశగా సూటిగా పోయే లోజ్ఞానం యొక్క చర్యతో సమానం. సందేహం యొక్క, పొరబాటు యొక్క వక్రమార్గం వెంట కాకుండా ఋజు మార్గాన ముందుకు దూసుకుపోతుంది. అది చీకటి తెరల మాటున, అసత్యపు ముసుగుల చాటున దాగిన సత్యాన్ని బట్టబయలు చేస్తుంది. ఆమె కనుగొన్న ప్రకాశనాల ఆధారంగానే ఋషి చిత్తం సత్యం యొక్క సంపూర్ణ ఆత్మ ప్రకాశనాన్ని పొందగలుగుతుంది. ఇక తక్కిన ఋక్కు ఏడు గుర్రాల సూర్యుడి గురించి చెప్తుంది. ఆ సూర్యుడు "ఒక సుదీర్ఘమైన యాత్రకి అంతంలో తన కోసం విస్తరించి వున్న ఒక క్షేత్రం" లోకి ఉదయిస్తాడు. చురుకైన పులుగు సోమరసాన్ని చేరుకోవడం అంటే అదే. యువ ఋషి విరాజిత గోసంజాతపు క్షేత్రాన్ని చేరుకోవడం అంటే అదే. "తేజోమయ సముద్రం" లోకి సూర్యుడు ఆరోహించడం అంటే అదే. "మేధావులు దారి చూపుతున్న నౌక"లా సూర్యుడు ఆ సముద్రాన్ని దాటుతాడు. వారి పిలుపునకు స్పందనగా ఆ సముద్ర జలాలు మనిషిలో అవతరిస్తాయి. ఆ ధారల ఆధారంగా అంగిరసుల సప్త విధాల చింతన మానవ ఋషిలో స్థిరపడుతుంది. ఇక్కడ సూర్యుడు అతిచేతనకి, సత్యచేతనా జ్ఞానానికి ప్రతీక. అలాగే

తేజోమయ సముద్రం అతిచేతనా సీమలకి, జగజ్జని అదితికి చెందిన మూడేడుల ధామాలకి ప్రతీక. ఈ ప్రతీకల అంతరార్థాన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. అంగిరసుల సంపూర్ణ విజయానికి ఫలితంగా కలిగే మహోన్నత సిద్ధి. సత్య సీమకై వారు సమిష్టిగా చేసే ఆరోహణ. సరమ గోసంజాతాన్ని కనుగొన్నప్పుడు అందుకు ఫలితంగా కలిగే విజయం అదే.

ఈ సందర్భంలో మరో ముఖ్యమైన ఋక్కు విశ్వామిత్రుడు విరచించినది. మూడవ మండలంలో ముప్పై ఒకటవదైన ఈ ఋక్కులో ఇలా ఉంటుంది – "అనన్య తేజోమయుడి (రుద్రదేవ) తనయుల కోసం చేసిన యజ్ఞం లోంచి ప్రచండంగా జ్వలిస్తూ అగ్ని (దివ్యశక్తి) జన్మించాడు. వారి సంతతి చాలా గొప్పది, అదొక బృహత్తరమైన జననం. ఈ యజ్ఞం వల్ల మెరిసే పశువుల చోదకుడి (ఇంద్రుడు, దివ్యమానసం) చేత గొప్ప చలనం కలుగజేయబడుతుంది. అతడి ప్రయాసలో విజయ ఉషస్సులు తోడ్పడతాయి. చీకటి లోంచి మహత్తర జ్ఞానాన్ని, తేజాన్ని వెలికి తీస్తాయి. అతడి కోసం ఉషస్సులు ఉదయిస్తాయని గుర్తించిన ఇంద్రుడు, విరాజమాన గోవులకి ఏకైక ప్రభువు అవుతాడు. ధీమంతులు భేదించిన దృఢమైన (పాణులకి చెందిన) ప్రదేశంలో దాగిన గోవులు ఇవే. మనస్సు చేత ఏడుగురు ఋషులు వాటిని ముందుకు అదిలించారు (లేదా పైకి, పరమాత్మ దిశగా తోశారు). సత్యం వద్దకు గొనిపోయే పూర్తి బాటను (గమ్యాన్ని, యాత్ర జరిగే క్షేత్రాన్ని) వాళ్లు కనుగొన్నారు. వాటిని (సత్యం యొక్క పరంధామాలాని) కనుగొన్న ఇంద్రుడు ప్రణమిల్లి వాటి లోకి ప్రవేశించాడు." (వీళా సతీర్ అభి ధీరా అతృన్దన్ ప్రాచాహిన్వన్ మనసా సప్త విప్రాః; విశ్వామ్ అవిన్దన్ పథ్యామ్ ఋతస్య ప్రజానన్న్ ఇత్ తా నమసా వివేశ). ఇదే మహత్తర జననం, ఇదే మహత్తర తేజం, ఇదే సత్య జ్ఞానం యొక్క మహత్తర దివ్య చలనం. గమ్యాన్ని చేరుకోవడంతో, దేవతలు, ఋషులు పరమ తలాలలోకి ప్రవేశించడంతో ఆ చలనం సంభవిస్తుంది. ఆ తరువాత ఈ ప్రయత్నంలో సరమ మాత్రం ప్రసక్తి వస్తుంది. "పర్వతంలో భేదించబడ్డ స్థలాన్ని కనుగొన్న సరమ, గమ్యానికి తీసుకుపోయే అవిచ్ఛిన్న దారిని ఏర్పాటు చేశాడు (బహుశా చేసింది అనాలేమో). చురుకైన చలనం గల ఆమె అక్షయ తేజుల (ఉషస్సుకు చెందిన అవధ్యమైన గోవులు) సమక్షం లోకి తీసుకుపోయింది. ఎరుకతో ఆమె ముందుకు కదిలింది, వారి కేక వైపుగా వెళ్లింది." ఇక్కడ కూడా లోజ్ఞానమే దారి చూపుతుంది. గుప్తమైన

ప్రబోధాలు పలికే సూచనల దిశగా వేగంగా ముందుకు సాగుతుంది. ధృఢమైన (వీళు, దృఢ) పర్వతంలో బద్ధలైన ప్రాంతం దిశగా కదిలి ఋషులకి ప్రవేశాన్ని కల్పిస్తుంది.

ఋక్కులో తక్కిన భాగం ఇంద్రుడి యొక్క, అంగిరసుల యొక్క విజయాలని వర్ణిస్తూ పోతుంది. "ఋషులు అందరిలోకి శ్రేష్ఠుడైన అతడు స్నేహపూర్వకంగా ముందుకు సాగాడు; పూర్ణమైన పర్వత గర్భం తనలోని అంశాలని యజ్ఞకర్త కోసం విడుదల చేసింది; మగసిరితో అతడు యువ (అంగిరసులతో) కలిసి సంపూర్ణ ఐశ్వర్యం కోసం పాటుపడి సాధించాడు, కాంతిగీతాన్ని ఆలపిస్తూ తానే అంగిరసుడు అయ్యాడు. మా కళ్ల ఎదుటనే విశ్వంలో ప్రతీ వస్తువు యొక్క ఆకారంగా, ప్రమాణంగా మారుతూ, జన్మలన్నీ తెలుసుకున్నాడు, శుష్ణుణ్ణి వధించాడు." దీన్ని మరింత సరళంగా వివరించాలంటే, దివ్యమనస్సు విశ్వంలో ప్రతీ వస్తువుకి స్పందిస్తూ ఒక ప్రత్యేక రూపాన్ని దాల్చుతుంది, ఆ వస్తువు యొక్క నిజమైన దివ్య అంతర్యాన్ని, అంతరార్థాన్ని బహిర్గతం చేసి, జ్ఞానాన్ని కర్మని తప్పుదోవ పట్టించే ఆ అబద్ధపు శక్తిని వమ్ముచేస్తుంది. "గోవుల కోసం గాలించే అతడు, పరంధామం కోసం పయనించే అతడు, ఋక్కులు గానం చేస్తూ, స్నేహితుడైన అతడు, తన స్నేహితులని సమస్త దోషాల నుండి విముక్తులని చేస్తాడు (సరైన ఆత్మవ్యక్తీకరణను ప్రసాదిస్తాడు). తేజం (గోవులు) కోసం శోధించే మనస్సుతో, కాంతులీనే మంత్రోక్తులతో వారు తమ ధామాలలోకి ప్రవేశించి, అమరత్వానికి బాటలు వేశారు (*ని గవ్యతా మనసా సేదుర్ అర్కైః కృణ్వానాసో అమృతత్వాయ గాతుమ్*). ఇదే వారి విశాలమైన ధామం, ఆ సత్యం చేతనే వారు మాసాలని (ఇవి దశగ్వుల పది నెలలు) వశం చేసుకున్నారు. సమరసమైన దృష్టి కలిగి (దోషంలేని చూపు కలిగి), వారు తమ స్వధామంలో (స్వర్ లో), (విషయాల యొక్క) ప్రాచీన బీజాల పాలని పితికి, దాన్ని సేవించి ఆనందించారు. వారి కేక (మంత్రోక్తి) సమస్త భువిని, దివిని తపింపజేసింది (అంటే జ్వలించే స్పష్టతతో సృజించింది – *ఘర్మ, తప్తం ఘృతం*, ఇవి సౌరగోవుల ఉత్పత్తులు). ధృవమైన పునాది గల దాంట్లో, గోవులలో ధీరులలా, వారు స్థిరపడ్డారు. (అంటే యుద్ధశక్తి జ్ఞానజ్యోతిలో కుదురుకుంది).

"వృత్రనాశకుడైన ఇంద్రుడు, జన్మించిన వారి చేత (యజ్ఞ సుతుల చేత), యజ్ఞ నివాళుల చేత, తేజోమయ ఋక్కుల చేత ప్రకాశవంతులని పైకి విడుదల చేశాడు; సువిశాలమై, ఆనందమయమైన గోవు (ఆ గోవు అదితి, విశాలమైన, ఆనందమయమైన అతిచేతన)

అతని కోసం కమ్మని ఆహారాన్ని తెచ్చింది, తీయని తేనెలు నేతిలో కలిపి, తన పాలగా అతడికి ప్రసాదించింది. ఆ పితరుని (దివి) కోసమే వారు విశాలమైన, విరాజితమైన ధామాన్ని రూపొందించారు. నిర్దోషమైన కర్మలు చేసే వారు దాని గురించిన పూర్తి అవగాహనను కలిగి వున్నారు. తల్లిదండ్రులని (దివిని, భువిని) విస్తారంగా భరిస్తూ, ధరిస్తూ, వారు ఆ మహోన్నత లోకంలో కొలువుండి, దాని మహదానందాన్ని స్వీకరించారు. (చెడుని, అసత్యాన్ని) తొలగించే ప్రయత్నంలో ఒక విశాలమైన మేధ అతడికి తోడ్పడుతూ, భువిలోను, దివిలోను అతడి వ్యాపనం వర్ధిల్లేలా చేస్తుంది. ఇక నిష్పక్షమైన, నిర్దోషమైన పదాలు గల ఇంద్రుడి కోసం ఎన్నో నిర్నిరోధకమైన శక్తులు బారులు తీరు ఉన్నాయి. అతడు అద్భుతమైన, అనేకముఖమైన, ఆనందమయమైన క్షేత్రాన్ని కనుగొన్నాడు (స్వర్, అదే విశాలమైన గోవుల బయలు); కదిలే ఆలమందని అతడు తన నేస్తుల కోసం ముందుకు అదిలించాడు. మానవాత్మల (అంగిరసుల) కోసం ఇంద్రుడు భాసిల్లుతూ, సూర్యుడికి, ఉషస్సుకి, పథానికి, జ్వాలకి ఏకంగా ప్రాణం పోశాడు."

ఇక తదుపరి శ్లోకాలలో అవే ప్రతీకలు మళ్లీ మళ్లీ కనిపిస్తాయి. ఆ సందర్భంలోనే వర్షానికి సంబంధించిన ఒక ప్రతీక కనిపిస్తుంది. దీని అన్వయం కొంత అపార్థానికి గురయ్యింది. "పురోజాతుణ్ణి నేను నవీకరించి జయిస్తాను. అదివ్యులైన ఆగంతకులని తొలగించి స్వర్ మాకు దక్కేలా ఏర్పాటు చెయ్యండి. పునీతం గావించే వర్షాలు మా ఎదుటే విస్తరించి (జలాల రూపంలో) ఉన్నాయి. ఆవలి తీరంలో ఉండే ఆనందమయ స్థితికి మమ్మల్ని చేర్చు. నీ తేరులో పోరాడుతూ రిపుల నుండి మమ్మల్ని కాపాడు. అలాగే గోవులని జయించగల వీరులుగా వేగంగా మమ్మల్ని తీర్చిదిద్దు. వృత్రనాశకుడు, గోవుల రేడు, మాకు (మనుషులకి) గోవులని చూపించాడు. తన రగిలే ధర్మాలతో అతడు నల్లని వారిలోకి (కాంతి రహితులైన వారు, పాణుల వంటి వారు) ప్రవేశించాడు. (మూల) సత్యం చేత వివిధ సత్యాలని ప్రదర్శిస్తూ, అతడు తన ద్వారాలన్నీ తానే తెరిచాడు." *ప్ర సూనృతా దిశమాన ఋతేన దురశ్ చ విశ్వా అవృణోద్ అప స్వాః*. దీన్ని బట్టి మనకి తెలుస్తున్నది ఏమంటే, అతడు పణుల చేత మూసి ఉంచబడ్డ మన "మానవ ద్వారాలని" భేదించి, వాటిలోకి ప్రవేశించి, ఆ విధంగా తన సొంత ప్రపంచం యొక్క, స్వర్ యొక్క, ద్వారాలని తెరిచాడు.

ఈ అద్భుతమైన ఋక్కుని నేను ఇంచుమించు సొంతం అనువదించాను. ఇది చాలా విశేషమైన ఋక్కు. ఎందుకంటే ఇది వైదిక కవిత్వం యొక్క అధ్యాత్మిక ముఖాన్ని నిశితంగా వ్యక్తం చేస్తుంది. అంతేకాక వైదిక చిత్రావళిని, వాటి నడి మధ్యలో సరమను, ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తుంది. ఋగ్వేదంలో ఎన్నో ఇతర చోట్ల సరమ ప్రస్తావన వచ్చినా అవన్నీ ఈ విభావనకు అదనంగా జతచేసేదేమీ లేదు. IV.16.8. లో ఆ ప్రస్తావన క్లుప్తంగా వస్తుంది – "నీవు కొండను చీల్చి అందులోనుండి నీళ్లు చిప్పిల్లేలా చేసినప్పుడు, సరమ నీ ముందు ప్రత్యక్షమయ్యింది. ఆ విధంగా నీవు మా కోసం, గోశాలలని తెరిచి, అమిత సంపదను కొల్లగొట్టి మాకిస్తావు. ఈ కథలన్నీ అంగిరసులు గానం చేస్తారు." వృత్రుడు కొండలో దాచిన జలాలు (7 వ శ్లోకం) కట్టలుతెంచుకున్నపుడు, సత్యధారలు చివ్వున పెల్లుబికినప్పుడు, దివ్య మానసానికి ముందు లోజ్ఞానం అభివ్యక్తమై దానికి దారి చూపిస్తుంది. ఈ లోజ్ఞానం చేతనే ఆ వేలుపు మనకు నేతగా నిలిచి, తేజస్సుని రక్షించి, పణులు గస్తీ కాసే బలమైన కోట ద్వారాల వెనుక, కఠిన శిలలో దాగిన, అపారమైన సిరులని జయించి ఇస్తాడు.

పరాశర శక్త్యుడు రచించిన ఋక్కులో (I.72) సరమ ప్రస్తావన మళ్లీ వస్తుంది. వైదిక ప్రతీకల అంతరార్థాన్ని అత్యంత స్పష్టంగా వ్యక్తం చేసిన సూక్తాలలో ఇదొకటి. పరాశరుడి ఎన్నో ఇతర ఋక్కులలో ఉన్నట్లే ఇక్కడ కూడా ఆయన ఋక్కు యొక్క అంతరార్థాన్ని కప్పి ఉంచే ముసుగు కాస్తంత పక్కకి తప్పించడంతో తృప్తిపడడు. ఋక్కు చిన్నదే కనుక దాన్ని సొంతం అనువదిస్తాను. "తన చేతిలో ఎన్నో శక్తులని (దివ్య పురుషుల శక్తులు, *నర్యా పురూణి*) పట్టుకున్న ఆతడు, అంతర్యంలో సనాతన ప్రదాత యొక్క దివ్యదర్శనాలని సృజించాడు; సకల అమరత్వాలని సమైక్యంగా సృష్టించిన అగ్ని (దివ్య) సిరులకి స్వామి అవుతాడు; పరిమితులు లేని అమరులు అందరూ, కాంక్షిస్తూ, సర్వత్ర ఉన్న లేగదూడలా (గోవు అదితి యొక్క దూడ) మనలో అతణ్ణి కనుగొన్నారు; ప్రయాస పడుతూ, దివ్యధామానికి ప్రయాణిస్తూ, స్థిరమైన ధీశక్తితో వారు అగ్ని యొక్క పరంధామాన్ని చేరుకున్నారు. ఓ అగ్నీ! మూడేళ్ల పాటు వాళ్లు (ఇవి మూడు మానసిక స్వర్గాల ద్వార సాగే పయనానికి ప్రతీకలైన మూడు ఋతువులు, లేదా మూడు కాలాలు కావచ్చు), పునీతులై, పవిత్రుడవైన నిన్ను ఘృతంతో సేవించారు. యజ్ఞ నామాలని గుర్తించి సంజాతమైన

రూపాలని (పరమ స్వర్గం దిశగా) అదిలించారు. రుద్రసుతులైన వారికి, యజ్ఞపతులైన వారికి విశాలమైన దివి యొక్క, భువి యొక్క జ్ఞానం వుంది. మర్త్యజీవి దృష్టిని పొంది పరంధామంలో నిలిచిన అగ్నిని పొడగన్నాడు. సంపూర్ణమైన ఎరుకతో (సామరస్యంతో) వాళ్లు ఆతని ముందు మోకరిల్లారు; వారు తమ భార్యలతో (దేవతల స్త్రీ శక్తులు) పాటు వంద్యుడైన అతని ముందు ప్రణమిల్లారు; తాము పునీతులై (లేదా దివికి, భువికి చెందిన పరిమితులకి అతీతంగా ఎదిగి), తమ సొంత (దివ్య, నిజ) రూపాలని సృష్టించుకుని, దృక్కుతో సంరక్షించుకుని, పరమ స్నేహితుడికి స్నేహితులై నిలిచారు. యజ్ఞ వేల్పులు నీలో రహస్యంగా దాగిన మూడేడుల నిగూఢ ధామాలని కనుగొన్నారు; ఒకే హృదయం గల వారిని అమరత్వంతో కాపాడు. నిశ్చలంగా ఉన్న పశువులని, కదిలే వాటిని కూడా కాపాడు. ఓ అగ్నీ! సమస్త లోకాలలోను సకల అభివ్యక్తులని (జన్మలని) తెలిసిన నీవు (లేదా అందరి జ్ఞానాన్ని ఎరిగిన నివు), జీవనం కోసం సతతం నీ శక్తులని స్థాపించు. దేవతల చలన మార్గాలని ఆంతరికంగా తెలుసుకున్న నీవు, వారి నిర్విరామ దూతవై, వరాలు తెచ్చావు. స్వర్గానికి చెందిన ఏడుగురు మహిమాన్వితులు (నదులు), ఆలోచనని స్థిరంగా నిలిపి, సత్యాన్ని తెలుసుకుని, ఆనంద ద్వారాలని కనుగొన్నారు; సరమ కనుక్కున్న గోవుల వేగాన్ని, వైశాల్యాన్ని (పరమ సిరులని) మానవులు ఆనందించారు; సరైన సంతతిని ప్రసాదించే వారందరిలోకి ప్రవేశించిన వారు అమరత్వానికి బాటలు వేశారు; మహిమాన్వితుల వల్ల, వారి మహత్తు వల్ల భూమి విస్తారంగా నిలిచింది; జనని అదితి తన సుతులతో సముద్ధరణ కోసం అరుదెంచింది. స్వర్గం యొక్క ఇరు నయనాలని (ఇవి సూర్యుడి యొక్క రెండు దృష్టి శక్తులు కావచ్చు, లేదా ఇంద్రుడి రెండు అశ్వాలు కావచ్చు) చేసిన అమరులు అతనిలో తేజోమయ శోభని నాటారు. విముక్త నదులు సహజంగా కిందికి ఉరుకుతాయి; ఓ అగ్నీ! ఇక్కడ దిగువన ఉన్న తేజోమయులు (గోవులు) ఎరిగిన వారు."

ఆ విధంగా పరాశరుడి సూక్తాన్ని యదాతథంగా, భాషా సౌలభ్యం కొంత కొరవడినా, అనువదించడానికి ప్రయత్నించాను. ఆ సూక్తం జ్ఞానం గురించి, సత్యం గురించి, పరాత్పరుడితో సమానమైన దివ్యజ్వాల గురించి, అమరత్వం గురించి, దేవతల యొక్క, దివ్యబలాల యొక్క ఆరోహణ గురించి బోధిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది. ఆ ఆరోహణ వారి దివ్యత్వానికి, వారి దివ్యనామాలకి, వారి నిజరూపాలకి, పరాత్పరుడికి చెందిన

మూడేడుల ధామాల యొక్క అసమాన వైభవానికి యజ్ఞం చెయ్యడం వల్ల సాధమవుతుందని కూడా ఆ ఋక్కు తెలుపుతోంది. ఇక్కడ ఆరోహణ అంటే, మనిషిలో దాగిన దివ్యబలాలు వాటి విశ్వగతమైన బాహ్య రూపాలని విడనాడి, విశ్వానికి అతీతంగా భాసించే సత్యం దిశగా చేసే ఆరోహణే. అలా కాకుంటే అసలు ఆ ఆరోహణకి అర్థమే లేదు. ఈ విధమైన దేవతా ప్రభావం చేత, మర్త్య మానవుడు జ్ఞానం యొక్క ఎరుక సంపాదించి, పరంధామంలో, చరమ గమ్యంలో నిలిచి వున్న అగ్నిని కనుక్కుంటాడని పరాశరుడే మనకు తెలియజేశాడు; *విదన్ మర్తో నేమధితా చికిత్వాన్, అగ్నిమ్ పదే పరమే తస్థివాంసమ్.* ఇటువంటి నేపథ్యంలో సరమ పని ఏమిటి? ఆమె సత్యం యొక్క బలం కాక మరేమిటి? ఆమె గోవులు దివ్య ఉషస్సు యొక్క కిరణాలు కాక మరేమిటి? పశువుల కోసం కొట్లాడుకునే ఆ పురాతన అటవిక తెగలకి, పరస్పరం దోచుకుంటూ, పశుసంపదలని దొంగలించుకుంటూ, నిరంతరం కలహాలలో మునిగితేలే మన ఆర్య, ద్రావిడ పూర్వజులకి, ఇక్కడ చెప్పబడుతున్న ప్రభాసమాన ఆంతరిక విప్లవానికి, అమరత్వ లబ్ధికి, దివ్యత్వ సిద్ధికి మధ్య సంబంధమేమిటి? యోచించి, సత్యాన్నెరిగి, రహస్య ద్వారాలని కనుక్కోగల ఆ నదులు ఇంతకీ ఏమిటి? అవి ఆకతాయి ద్రావిళ్లు ఆనకట్టలు కట్టి నిలిపేసిన పంజాబు నదులు మాత్రమేనా? అలాగే సరమ అంటే ఏ ఆర్య దౌత్యాలయాన్నో అలంకరించే పౌరాణిక చిహ్నాం మాత్రమేనా?

పదవ మండలంలో ఒక ఋక్కు పూర్తిగా సరమ దౌత్య వ్యవహారాలనే వర్ణిస్తుంది. అది సరమకి పణులకి మధ్య సంవాదాన్ని వర్ణిస్తుంది. ఇంతవరకు మనం సరమ గురించి తెలుసుకున్న దాంతో పోల్చితే కొత్త విషయాలేమీ అది తెలియజేయదు. కాని అది గుహ్య నిధుల యజమానుల స్వరూపాన్ని మరింత వివరంగా ప్రదర్శిస్తుంది. సరమను ఒక దివ్య శునకంగా చిత్రీకరించే వైనం ఇంతవరకు మనం చూసిన ఋక్కులలో పెద్దగా కనిపించదు. అలాంటి చిత్రీకరణ కాలాంతరంలో వైదిక ప్రతీకల వికాస క్రమంలో కనిపించి వుండొచ్చు. కలికి నడకలు కలిగిన కాంతులీనే దేవత సరమ అన్న విషయంలో సందేహం లేదు. పణులు ఆమెకు ఆకర్షితులై ఆమెను సోదరిగా సమాదరిస్తారు. కేవలం వారి పశువులు కాచే కావలి కుక్కగా కాదు, వారి నిధులని పంచుకునే తోబుట్టువుగా ఆదరిస్తారు. సురశునకం అనే ప్రతీక చాలా సముచితమైన ప్రతీక. ఈ గాధ లోనుండి అలాంటి భావన జనించడం చాలా

సమంజసంగా ఉంది. లోగడ ఒక ఋక్కులో ఒక తనయుడి కోసం సరమ "ఆహారాన్ని తెచ్చిస్తుంది" అని చెప్పబడింది. యజ్ఞంలో కొంత భాగం తన సంతతికి సమర్పించాలని, అలా చేస్తేనే పోయిన గోవుల కోసం గాలిస్తానని సరమ అన్నట్టుగా ఆ గాధ చెప్తుంది. అయితే ఇలాంటి అన్వయం కేవలం అనువైన వివరణ కోసం చేసిన కల్పనే తప్ప, దానికి అసలు ఋగ్వేదంలో ఎక్కడా స్థానం లేదు. "యజ్ఞంలో" ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, "ఇంద్ర, అంగిరసుల కోసం అన్వేషించే ప్రయత్నంలో సరమ తనయుడి కోసం పునాదిని కనుక్కుంది." *విదత్ సరమా తనయాయ ధాసిమ్* (I.62.3). ఇక్కడ *ధాసిమ్* అన్న పదానికి మరి అటువంటి అర్థాన్ని ఇవ్వడానికి వీలవుతుంది. అలాగే తనయుడు అంటే యజ్ఞంలో పుట్టిన తనయుడు అయ్యుండాలి. యజ్ఞంలో తనయుడు ఉద్భవించడం అనే ప్రతీక వేదంలో సర్వత్ర ఎదురవుతుంది. తనయుడు అంటే మానవ పుత్రుడే గాని, శునక సంతతి కాదని గుర్తించాలి. వేదంలో కొన్ని ఇతర సందర్భాలలో (ఉదాహరణకి I.96.4.) అలాంటి ప్రతీలు ఎదురవుతాయి. *మాతరిశ్వా పురువారపుష్టిర్ విదద్ గాతుం తనయాయ స్వర్విత్*. "కామిత వస్తువులని పెంచిన మాతరిశ్వుడు (ప్రాణదేవత, వాయుదేవుడు), తనయుడి వద్దకి గొనిపోయే మార్గాన్ని కనుగొన్నాడు, స్వర్ ని కనుగొన్నాడు." ఇక్కడ కూడా సారాంశం ఒక్కటే – తనయుడంటే కుక్కపిల్లల సముదాయం మాత్రం కాదు.

యముడి వార్తాహరులుగా పని చేసే సరమేయ శునకాలు రెండు ఉన్నాయి. వాటి ప్రస్తావన పదవ మండలం ఆఖర్లో వస్తుంది. అయితే వాటి తల్లి సరమ అన్నట్లుగా మాత్రం చెప్పబడిలేదు. ఈ కథ ప్రఖ్యాత "అంత్య క్రియల" ఋక్కులో వస్తుంది (X.14). ఋగ్వేదంలో యముడి యొక్క నిజస్వరూపం ఏమిటో, అతడి కుక్కల స్వభావం ఎటువంటిదో స్పష్టంగా తెలుస్తుంది. కాలాంతరంలో యముణ్ణి మృత్యు దేవత గాను, తనదైన యమలోకానికి ప్రభువు గాను వర్ణించడం కనిపిస్తుంది. కాని ఋగ్వేదం అతణ్ణి సూర్యుడి యొక్క రూపాంతరంగా ప్రకటిస్తుంది. మరింత అర్వాచీన యుగానికి చెందిన ఈశోపనిషత్తులో కూడా యముడి పేరు సూర్యుడికి పర్యాపదంగా వాడడం కనిపిస్తుంది. సువిస్తారంగా భాసించే సూర్యుడి కవల పిల్లల్లో ఒకడిగా యముణ్ణి వర్ణించడం కనిపిస్తుంది. అతడు ధర్మరక్షకుడు, సత్యధర్ముడు. అది అమరత్వానికి నియమం కనుక అతడు అమరత్వానికి సంరక్షకుడు.

అతడి ప్రపంచం స్వర్లోకం (స్వర్), అమరత్వపు లోకం, *అమృతే లోకే అక్షితే*. అక్కడ అక్షయ కాంతి అలరారుతుంటుందని, అక్కడ స్వర్లోకం సంస్థాపితం అవుతుందని వేదం చెబుతుంది, *యత్ర జ్యోతిర్ అజస్రం యస్మిలోకే స్వర్ హితమ్* (IX.113). X.14 లోని గీతం నిజానికి మృత్యుగీతం కాదు, అది జీవనగీతం, అది అమరగీతం. యముడు, ప్రాచీన పితరుల ఆ దివ్యసీమకి గొనిపోయే మార్గాన్ని కనుగొన్నారు. కాంతులీనే గోవులు మేసే ఆ పొలాల నుండి శత్రువు ఆ ఆవులని కాజేయలేడు, *యమో నో గాతుం ప్రథమో వివేద, నైషా గవ్యూతిరపభర్తవా ఉ, యత్రా నః పూర్వే పితరః పరేయుః*. స్వర్గారోహణ యాత్రలో ఉన్న మర్త్య జీవిని "వేగంగా పరుగు తీసి ఆ రెండు నాల్గు కళ్ల, పలువన్నెల సరమేయ శునకాలని ఓడించ" మని ప్రోత్సహించడం జరుగుతుంది. సురపథానికి ఆ శునకాలు నాలుగు కళ్ల సంరక్షకులు. వాటి దివ్యదృష్టితో ఆ మార్గంలో నడిచే మనిషిని కాపు కాస్తారు, *తే శ్వానౌ యమ రక్షితారౌ చతురక్షౌ పథిరక్షీ నృచక్షసౌ*. సురమార్గాన సాగే జీవాత్మకు తోడుగా యముడు ఆ రెండు శునకాలని నియమిస్తాడు. ఆ కుక్కలు "విశాలమైన చలనం కలవి, సులభంగా తృప్తి చెందనివి." యమరాజుకి దూతలుగా మనుషుల మధ్య సంచరిస్తాయి. ఋక్కు ఇంకా ఇలా ప్రార్థిస్తుంది – "ఈ విషాద లోకంలో ఇవి (ఈ కుక్కలు) పోయిన సంతోషాన్ని మాకు తిరిగి ప్రసాదించాలి, అప్పుడు మా మనసులు మళ్లీ సూర్యుడి మీద నిలవాలి." ఇక్కడ మళ్లీ మనకి పురాతన వైదిక భావాల పరంపర ఎదురవుతోంది – తేజం, ఆనందం, అమరత్వం. సరమేయ శునకాలకి సరమ లక్షణాలన్నీ ఉన్నాయి. దివ్యదృష్టి, విశాలమైన గమనం, గమ్యానికి తీసుకుపోయే మార్గం మీద పయనించే సామర్థ్యం – ఈ లక్షణాలన్నీ వాటి సొత్తు. గోవుల బృహత్తు వద్దకు సరమ మనను చేరవేస్తుంది. మృతిలేని, మెరిసే పశువులు మేసే అద్భుత క్షేత్రం వద్దకి తీసుకుపోయే మార్గంలో ఆ కుక్కలు జీవాత్మకి తోడుగా ఉండి కాపాడతాయి. సరమ మనని సత్యం వద్దకి తీసుకుపోతుంది, ఆనంద దాయకమైన సూర్యదృష్టిని ప్రసాదిస్తుంది. ఈ దుస్తర లోకంలో మనిషికి ఆ కుక్కలు ఆనందాన్ని అందిస్తాయి. సూర్యుడి దర్శనాన్ని పొందే అవకాశాన్ని ఇస్తాయి. దివ్యమార్గాన వేగంగా చరించే కలికి నడకల దేవతలా కనిపించినా, విశాల గమనం గల సంరక్షకుల జననిగా ప్రత్యక్షమైనా, సరమ యొక్క తత్వం ఒక్కటే. శోధించి తెలుసుకునే సత్యం యొక్క శక్తి ఆమె. లోదృష్టి చేత గుప్తంగా ఉన్న సత్యాన్ని, అందరాని అమరత్వాన్ని ఆమె

కనుక్కుంటుంది. అయితే ఆ శోధనకి, ఆ ఆవిష్కరణకి మాత్రమే ఆమె పని పరిమితమై ఉంటుంది.

.

అధ్యాయం 21

చీకటి పుత్రులు

అంగిరసులు, ఇంద్రుడు, సరమ, పణుల గుహ, ఉషాదేవి విజయం, సూర్యుడు, గోవులు మొదలైన వైదిక ప్రతీకలకి చెందిన గాధల పైన ఆర్య, ద్రావిడ రాజకీయాలని ఆపాదించే ప్రయత్నం సబబు కాదని అంతకు ముందే ఎన్నో సార్లు అనుకున్నాము. ఆ కథలన్నీ కాంతిపిపాసులకి, చీకటి శక్తులకి మధ్య ఘర్షణని ప్రకటిస్తాయి. ఆ గోవులు సూర్యుడి యొక్క, ఉషస్సు యొక్క ప్రకాశనానికి ప్రతీకలు. అవి మామూలు ఆవులు కాజాలవు. ఆర్యుల కోసం ఇంద్రుడు జయించి పెట్టిన విశాల, నిర్భయ, గోవుల క్షేత్రం – అది నిజానికి బృహత్తర స్వర్లోకం, సౌర ప్రకాశం విలసిల్లిన ప్రపంచం, మూడింతలు తేజోవంతమైన సురలోకం. అదే విధంగా పణులు గుహలకి చెందిన చీకటి శక్తులు. పణులని దస్యులు అని, దాసులు అని కూడా అంటారు. ఆర్యులని ఆర్యవర్ణపు వారిగా వర్ణించినట్టే, దస్యులని తరచు దాస వర్ణానికి చెందిన వారిగా వర్ణిస్తారు. బ్రాహ్మణాలలోను, తదుపరి రచనల లోను వర్ణం అనే పదాన్ని కులాన్ని, వర్గాన్ని సూచించడానికి వాడారు. అయితే ఋగ్వేదంలో కూడా ఆ పదాన్ని అదే అర్థంలో వాడారు అనుకోడానికి లేదు. దస్యులు మంత్రాక్షరాన్ని ద్వేషిస్తారు. సోమరస నైవేద్యాన్ని వాళ్లు దేవతలకి సమర్పించరు. తమ ఆవులని, అశ్వాలని తదితర నిధులని

తామే దాచుకుంటారు గాని ఋషులతో పంచుకోరు. వారు యజ్ఞం చెయ్యాడానికి ఒప్పుకోరు. భారతావనిలో అప్పట్లో వివిధ సాంప్రదాయాల మధ్య ఘర్షణని ఉపమానంగా తీసుకుని, దాన్ని అధ్యాత్మిక పోరాటానికి, పయనానికి ప్రతీకగా ఋషులు వాడారని అనుకోడానికి అవకాశం లేకపోలేదు. అయితే ఋగ్వేదంలో మాత్రం ఋషులు వర్ణిస్తున్నది భౌతిక పోరాటాలని, దాడులని కాదని, వాళ్లు వర్ణిస్తున్నది అధ్యాత్మిక పోరాటాన్ని, విజయాన్ని అనుకోవడంలో మాత్రం సందేహం లేదు.

వేదాన్ని అన్వయించేటప్పుడు, అక్కడక్కడ కొన్ని శ్లోకాలని ఎంచుకుని, వాటికి ఏదో ప్రత్యేకమైన అర్థాన్ని ఆపాదించి, ఆ అన్వయం మరెన్నో ఇతర చోట్ల పొసగకపోయినా పట్టించుకోకుండా ముందుకు సాగే ప్రయత్నం అర్థరహితం అని చెప్పొచ్చు. వేదంలో పణుల ప్రస్తావన వచ్చిన సందర్భాలు అన్నిటినీ ఊకుమ్మడిగా తీసుకోవాలి. వారి ఐశ్వర్యం, వారి గుణగణాలు, వారిపై దేవతలు, ఋషులు, ఆర్యులు సాధించిన విజయాలు, - వీటన్నిటినీ ఏకంగా తీసుకుని అలాంటి సమగ్ర పరిశీలన బట్టి పణుల తత్వం గురించి ఒక నిర్ణయానికి రావాలి. ఈ విధానాన్ని అనుసరిస్తూ శోధిస్తే, పణులు మానవ మాత్రులు కారని స్పష్టంగా తెలుస్తుంది. వాళ్లు భౌతికమైన చీకటికి గాని, అధ్యాత్మికమైన చీకటికి గాని చెందిన శక్తులు. ఇక కొన్ని సందర్భాలలో అయితే వాళ్లు భౌతిక చీకటికి చెందిన శక్తులు ససేమిరా కారని స్పష్టంగా అర్థమవుతుంది. మరి కొన్ని చోట్ల వాళ్లు మనుషుల్లో దైవసాధకులకు, యాజ్ఞికులకు బద్ధ శత్రువులు. ఇంకొన్ని చోట్ల వాళ్లు మానవ శతువులు కారు, భౌతిక తేజానికి శత్రువులూ కారు, వాళ్లు అధ్యాత్మిక తేజానికి, సత్యానికి, మేధకి శత్రువులు. వీటన్నిటి బట్టి మనకి అర్థమయ్యే విషయం ఒక్కటే – వాళ్లు ఎప్పుడూ అధ్యాత్మిక తేజానికి శత్రువులే.

దస్యుల మూల తత్వం ఎలాంటిదో తెలియాలంటే ఈ ఋక్కును (IV.14.4) పరిశీలించాలి. "అగ్ని పుట్టగానే ప్రజ్వరిల్లి దస్యులని నాశనం చేశాడు, తేజం చీకటిని హరించింది; అతడు గోవులని, జలాలని, స్వర్ ని కనుగొన్నాడు," *అగ్నిర్జాతో అరోచత ఘ్నన్ దస్యూన్జ్యోతిషా తమః; అవిన్దద్ గా అపః స్వః.* దస్యులని రెండు పెద్ద వర్గాలుగా విభజించవచ్చు. ఒక వర్గం

పణులు. వీరు గోవులని, జలాలని కాజేస్తారు. వీరు ముఖ్యంగా ఆవుల వ్యర్థాలతో వ్యవహరిస్తారు. రెండవ వర్గం వృత్రులు. వీరు జలాలని, తేజాన్ని హరిస్తారు. వీరు ముఖ్యంగా నీటిని అందకుండా నిలువరిస్తారు. దస్యులు అందరూ స్వర్ లోకం దిశగా ఆరోహణకి అడ్డుపడతారు. ఆర్య వీరుల ధనార్జన ప్రయత్నానికి అడ్డుపడతారు. తేజం పట్ల వారి వ్యతిరేకతకి కారణం స్వర్లోక దర్శనం (*స్వర్దృశ్*) పట్ల వారి వ్యతిరేకత, సూర్య దర్శనం పట్ల, పరమ జ్ఞానదర్శనం (*ఉపమా కేతుః*) పట్ల వారి వ్యతేకత. జలాల పట్ల వారి తిరస్కారానికి అర్థం విశాల స్వర్లోక గమనం (*స్వర్వతీర్ అపః*) పట్ల వారి వ్యతిరేకత, సత్యధారల (*ఋతస్య ప్రేషా, ఋతస్య ధారాః*) పట్ల వ్యతిరేకత. ధనార్జన పట్ల వారి వ్యతిరేకతకి కారణం స్వర్లోకపు సంపత్తి (*వసు, ధన, వాజ, హిరణ్య*) పట్ల వారి తిరస్కారం, సూర్యుడిలోను, జలాలలోను దొరికే ఆ అపారమైన పెన్నిధి, *అప్సు సూర్యే మహద్ ధనం*. అయినా ఇక్కడ కలహం అంటే వెలుగుకి చీకటి మధ్య, సత్యానికి అసత్యానికి మధ్య, దివ్యమైన మాయకి అదివ్య శక్తులకి మధ్య కనుక, దస్యులు అందరినీ చీకటి శక్తులుగా గుర్తించడం జరుగుతుంది. మరి అగ్ని యొక్క జననం వల్ల, జ్వలనం వల్ల కాంతి పుడుతుంది. ఆ కాంతితోనే అగ్ని దస్యులని వధిస్తాడు, చీకటిని హరిస్తాడు. ఈ సందర్భంలో చారిత్రకమైన అన్వయం ససేమిరా పొసగదు. ఆ దారి వెంట సాగి ప్రకృతి బద్ధమైన అన్వయాన్ని తీసుకుంటే, హోమాగ్ని కాంతుల వలనే సూర్యోదయం జరుగుతుందనే అర్థం లేని నిర్ణయానికి రావలసి ఉంటుంది. అందుకనే వేదాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అన్వయానికి పూనుకోవాలి; విడివిడి శ్లోకాలని తీసుకుని అర్థం చెప్పబోతే అనర్థాలు ఎదురవుతాయి.

ఒక పక్క ఆర్యులకి, మరో పక్క పణులకి, లేదా దస్యులకి మధ్య వైరుధ్యం ఐదవ మండలంలో మరో ఋక్కులో కూడా ఎదురవుతుంది. III.34 లో ఆర్య వర్ణ అనే పదజాలం కూడా కనిపిస్తుంది. దస్యులు చీకటి శక్తులని అంతకు ముందే గుర్తించాము. మరి ఆర్యులు తప్పనిసరిగా తేజానికి చెందిన వారు అయ్యుండాలి. కాబట్టి వేదంలో సూర్యుడి తేజం ఆర్య తేజమని, దస్యులు చీకటికి అతి వ్యతిరేకమని స్పష్టమవుతుంది. వశిష్ఠుడు కూడా మూడు ఆర్యజాతులని ప్రస్తావిస్తాడు – వారు *జ్యోతిరగ్రాః*, అంటే తేజం నడిపిస్తున్న వారు, తేజం ముందుండి దారి చూపిస్తున్న వారు (VII.33.7). ఆర్య దస్యుల సమస్యని విశదీకరించాలంటే ఇంకా లోతైన చర్చ అవసరం. అది అర్థం కావాలంటే ఆ అంశం చర్చకు వచ్చిన

వేదభాగాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలి. వాటిలో సమస్యలని ఎత్తి చూపాలి. ప్రస్తుతానికి మాత్రం ఈ నాంది ప్రస్తావనతో సరిపెట్టుకుందాము. వేదంలో ఋతం జ్యోతిః, హిరణ్య: జ్యోతి తదితర పదబంధాలు ఉన్నాయన్నది ఒకసారి స్మరించాలి. నిజమైన కాంతి, బంగరు కాంతి అనే అర్థం గల ఈ పదబంధాలలో మన సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. సౌరకాంతిని సూచించే ఈ మూడు విశేషణాలు – ఆర్య, ఋత, హిరణ్య – పరస్పర బోధకాలు, ఇంచుమించు పర్యాయపదాలు. సూర్యుడు సత్యానికి దేవుడు. కాబట్టి అతడి కాంతి *ఋతం జ్యోతిః* ఈ సత్యతేజమే ఆర్యుడిలో (మానవుడైనా, దేవుడైనా) ఉంటుంది. అసలు అతని ఆర్యత్వానికి అదే చిహ్నం. అలాగే బంగరు అనే విశేషణాన్ని కూడా తరచు సూర్యుడికి ఆపాదిస్తారు. వేదంలో బంగారం సత్య సారానికి, సత్య పదార్థానికి చిహ్నం. మరి ఆ పదార్థమే, తేజమే సూర్యుడిలోను, స్వర్లోక జలాలలోను దొరికే పసిడి పెన్నిధి, *అప్సు సూర్యే*. దీన్ని బట్టే *హిరణ్యం జ్యోతిః* అనే పదజాలం వచ్చింది. ఈ బంగరు రంగులో మెరిసే కాంతి సత్యం యొక్క రంగు లేదా వర్ణం (*వర్ణ*). అదే ఆర్య చిత్తంలో చరించే విరాజమాన ఆలోచనల రంగు. అదే ధగధగ మెరిసే ఆవుల రంగు (*శుక్ర, శ్వేత*), అదే తేజం రంగు. దస్యులు చీకటి శక్తులు కనుక వారి వర్ణం నలుపు. అలాగే సత్య తేజపు ప్రకాశం, - *జ్యోతిః ఆర్యమ్*, - అదే ఆర్య వర్ణం అని సూచిస్తాను. అదే ఆర్యుల (*జ్యోతిరగ్రాః*) వర్ణం. రాతిరి రంగు అజ్ఞానపు చీకటి, అదే పణుల రంగు. అదే దాస వర్ణం. ఈ రకంగా చూసినప్పుడు వర్ణం అనే పదాన్ని తత్వం, లేదా స్వభావం అని, లేదా ఆ స్వభావం గల వారి వర్గం అని అర్థం చేసుకోవచ్చు. రంగు ఆ స్వభావానికి చిహ్నం. ప్రాచీన ఆర్యుల కాలంలో ఈ భావన చలామణిలో ఉండేదన్న విషయం, కాలంతరంలో చతుర్వర్ణాలని తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు అనే నాలుగు రంగులతో సూచించడాన్ని బట్టి అర్థమవుతుంది.

V.34 లో కొన్ని పంక్తులు ఇలా సాగుతాయి. "ఐదు చేత గాని, పది చేత గాని ఇంద్రుడు ఆరోహించడానికి ఇష్టపడడు. సోమ రసము అర్పించని వాడికి, అతడు ఎంత ఎదిగినా సరే, (ఇంద్రుడు) ప్రసన్నుం కాడు; లేకుంటే అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసి ఉధృత చలనంతో అతణ్ణి నాశనం చేస్తాడు; దైవోపాసకుడికి అతడు ఆవులతో నిండిన గోశాలని వరంగా ప్రసాదిస్తాడు. బలోద్ధతితో (శత్రువును) దునుమాడేవాడు, చక్రాన్ని చేత ధరించేవాడు, సోమరసాన్ని

అర్పించని వారి పట్ల విముఖుడు, సోమరసంతో ఉపాసించే వారికి వృద్ధి కలిగిస్తాడు; ఇంద్రుడు అతిభీకరుడు, సమస్తాన్ని శమింపగలడు. ఆర్యుడై దాసుణ్ణి పూర్తిగా లొంగదీసుకుంటాడు. పణుల ఆనందాన్ని కదిలించి, కాజేసి, దాన్ని ఉపాసకుడి విలాసం కోసం పంచిపెడతాడు. ఆ ఆనందం వీరశక్తులతో నిండి వుంది (*సూనరం వసు, వీర,* నృ అనే శబ్దాలని ఇక్కడ ఏకార్థంలో వాడడం జరిగింది); ఇంద్రుడి శక్తితో విరోధం తెచ్చుకునేవాడికి, ఆ శక్తి దారి పొడవునా అతడి గతికి అడ్డుపడుతూ ఉంటుంది (*దుర్గే*[35] *చన ధ్రియతే ఆ పురు*). మెరిసే ఆవులలో మాఘువుడు, సకల సిరులతో, శక్తులతో నిండిన రెండింటిని గుర్తించినప్పుడు, అతడు తన జ్ఞానంలో ఎదిగి మరో మూడవ వాణ్ణి తన సహాయకుడిగా తీసుకుంటాడు. అప్పుడతడు తన సాటి వీరుల సహాయంతో ప్రచండ వేగంతో ముందుకు ఉరికి, గోవుల సమూహాన్ని విడుదల చేస్తాడు." సూక్తంలోని ఆఖరి ఋక్కు అత్యున్నత జ్ఞానాన్ని (*ఉపమాం కేతుమ్ అర్యః*), దృష్టిని సాధించగల ఆర్యుడి (దేవుడైనా, మనిషైనా) గురించి చెప్తుంది. జలాలు సంగమించి అతణ్ణి పోషిస్తాయి. అతడి ధామం ఒక ధృఢమైన, అద్భుత యుద్ధశక్తి, *క్షత్రమ్ అమవత్ త్వేషమ్.*

ఈ ప్రతీకల గురించి ఇంతవరకు తెలుసుకున్న దాని బట్టి ఈ ఋక్కు యొక్క అంతరార్థాన్ని సులభంగా అర్థం చేసుకోగలము. దివ్య మానస శక్తికి ప్రతినిధి అయిన ఇంద్రుడు, అజ్ఞానపు బలాల రహస్య నిధులని హస్తగతం చేసుకుంటాడు. వాళ్లు సంపన్నపరులైనా వారితో చేతులు కలపడానికి ఇష్టపడడు. భాసించే ఉషస్సుకి చెందిన బద్ధ పశువులని తెచ్చి దేవతలని ఉపాసించే యాజ్ఞికుడికి ప్రసాదిస్తాడు. అజ్ఞానమయ జీవితాన్ని, మరింత ఉన్నత జీవన స్థాయికి ఉద్ధరించి, అక్కడి దివ్యనిధులు ప్రాప్తమయ్యేలా చేసే ఆర్యుడు అతడే. ఇక్కడే కాక వేదంలో ఎన్నో ఇతర చోట్ల ఆర్య, లేదా అర్య అనే పదాలని దేవతలని సూచించడానికి వాడారు. దీన్ని బట్టి ఆర్యులకి, దాస్యులకి మధ్య వైరుధ్యం కేవలం జాతీయమైన, సామాజికమైన, మానవీయమైన వైరుధ్యం కాదని, దానికి మరింత లోతైన ప్రాముఖ్యత ఉందని అర్థమవుతుంది. ఇక్కడ యోధులు నిశ్చయంగా ఏడుగురు అంగీరసులు; గోవులని విడిపించడంలో ఇంద్రుడికి సహాయపడేది వారే. అంతేగాని ఆ సహాయం చేసేది మరుత్తులు

[35] ఋషులు ఎప్పుడూ దేవతలని తమ మార్గాన్ని సుగమం (*సుగ*) చెయ్యమని, సుఖమయం చెయ్యమని ప్రార్థిస్తుంటారు. అందుకు వ్యతిరేకమైన ప్రయాణం 'దుర్గ', ఈ మార్గంలో ఎనలేని (పురు) సవాళ్లు, బాధలు, అడ్డంకులు ఎదురవుతాయి.

కారు. సాయణుడు పొరబాటుగా *సత్వభిః* అన్న పదాన్ని మరుత్తులు అని అన్వయిస్తాడు. అయితే మెరిసే పశువుల మధ్యకి ప్రవేశించిన ఇంద్రుడికి, కాంతులు చిందే ఆలోచనా తరంగాలని వశం చేసుకున్న ఇంద్రుడికి, ముగ్గురు వ్యక్తులు ఎదురవుతారు. ఆ ముగ్గురూ ఎవరన్నది నిర్ణయించడం కొంచెం కష్టమే. బహుశా అంగిరస జ్ఞానానికి చెందిన ఏడు కిరణాలని పది కిరణాల స్థాయికి పెంచిన ముగ్గురే ఆ ముగ్గురూ కావచ్చు. వాళ్లే పది నెలల గడువును అవలీలగా దాటి, సూర్యుణ్ణి, ఆవులని విడిపించగలరు. ఎందుకంటే ముందు ఆ ఇద్దరినీ కనుక్కొని, అటుపిమ్మట ఆ మూడవ వ్యక్తి సహాయాన్ని పొందిన తరువాతనే ఇంద్రుడు పణుల నుండి ఆవులని విడిపించగలిగాడు. వారిని కాంతి దారి చూపగా నడిచిన ముగ్గురు ఆర్యుల గాధతో ముడిపెట్టవచ్చు. లేదా స్వర్ కి చెందిన మూడు లోకాలతో కూడా జోడించవచ్చు. మరి అనుపమాన జ్ఞానదృష్టిని (*ఉపమా కేతుః*) సాధించడమే వారి ప్రయాస యొక్క చరమ ఫలితం. ఆ పరమ జ్ఞానమే స్వర్లోక దర్శనాన్ని పొందగల జ్ఞానం. స్వర్ కి చెందిన ముల్లోకాలలోను (*రోచనాని*) ఆ జ్ఞానం నెలకొని ఉంటుంది. దీని గురించి III.2.14.లో ఇలా వుంది – "*స్వర్దృశం కేతుం దివో రోచనస్థామ్ ఉషర్బుధమ్,*" స్వర్ ని దర్శించే జ్ఞానదృష్టి, జ్వలించే జగత్తులలో నిలిచి, ఉషస్సుని మేల్కొలుపుతుంది.

III.34 లో మనకి విశ్వామిత్రుడు ఆర్య వర్ణ అనే పదజాలాన్ని పరిచయం చేస్తూ, దాని అంతరార్థాన్ని కూడా తెలియజేశాడు. ఆ ఋక్కులో మూడు శ్లోకాలు (8-10) ఇలా ఉంటాయి – "స్వర్ ని, దివ్యజలాలని సాధించగలిగిన వారు అత్యంత ప్రియమైనదాన్ని, సదా ప్రభావశీలమైన దాన్ని, శక్తిదాయినిని (గానం చేస్తారు). దివిని, భువిని ఇంద్రుడు గెలిచిన తరుణంలో ధీమంతులు ఆనందిస్తారు. ఇంద్రుడు అశ్వాలని వశం చేసుకుని, సూర్యుణ్ణి గెలిచి, సకల భోగభరితమైన గోవుని జయిస్తాడు; సువర్ణమయ ఆనందాన్ని గెలిచి, దస్యులని దునుమాడి ఆర్యవర్ణానికి అండగా నిలుస్తాడు; ఇంద్రుడు ఔషధాలని, దినాలని, వృక్షాలని, మధ్యతలాన్ని జయిస్తాడు; వలుణ్ణి వధించి, మంత్రాక్షరాలని పలికే వక్తకు ప్రోద్బలాన్ని ఇస్తాడు; పనులలో తన సంకల్పానికి అడ్డుగా నిలిచే వారిని (*అభిక్రతూనామ్*) అణగదొక్కుతాడు." ఆర్యుని కోసం ఇంద్రుడు గెలిచి ఇచ్చే సంపదలలోని ప్రతీకాత్మక అంశాలన్నీ ఇక్కడ మనకు కనిపిస్తున్నాయి. వాటిలో సూర్యుడు, పగళ్లు, దివిసీమలు, మధ్యతలం, అశ్వాలు, ఉద్భిజాలు, ఔషధాలు, చెట్లు (వనస్పతీన్ అనే పదానికి ద్వంద్వార్థం

వుంది – అటవీపతులు, ఆనందపతులు). ఈ సందర్భంలో మనకి వలుడికి, అతడి దస్యు మూకకి ప్రతికూలంగా ఆర్యవర్ణం నిలిచి ఉండడం కనిపిస్తోంది.

కాని అంతకు ముందు వచ్చిన శ్లోకాల్లోనే మనకి *వర్ణ* అనే పదం ఎదురవుతుంది. ఆ పదం ఆర్య భావాల యొక్క వన్నెని సూచిస్తుంది, సత్యమైన, ప్రభావంతమైన ఆలోచనలని సూచిస్తుంది. "స్వర్ ని జయించి, పగళ్లకి జన్మనిచ్చిన ఇంద్రుడు, అపేక్షకుల (అంగీరసులు) సాయంతో ఈ (దస్యు) సేనలని జయించాడు; మానవుడి కోసం పగళ్ల జ్ఞాన దర్శనం (*కేతుమ్ అహ్నామ్*) ప్రకాశించేలా చేశాడు; విస్తారమైన విలాసాన్ని అందివ్వగల తేజస్సుని కనుగొన్నాడు... అతణ్ణి ఆరాధించే వారి ఆలోచనలని ఈ జ్ఞానంలో సచేతనం గావిస్తాడు. (దస్యుల అవరోధానికి అతీతంగా) వీటి (ఈ ఆలోచనల) ప్రకాశవంతమైన వర్ణాన్ని ముందుకు తీసుకు వెళ్లాడు; *అచేతయద్ ధియ ఇమా జరిత్రే ప్రేమం వర్ణమ్ అతిరచ్ ఛుక్రమ్ ఆసామ్*. ఘనుడైన ఇంద్రుడి అగణిత ఘన లీలలని వారు సక్రియం చేస్తారు (ప్రశంసిస్తారు). తన శక్తితో, అప్రతిహతమైన బలంతో, జ్ఞాన ప్రభావంతో (*మయాభిః*) కుటిల దస్యులని నుగ్గు చేస్తాడు."

ఇక్కడే మనకు *కేతుమ్ అహ్నామ్* అనే వైదిక పదజాలం ఎదురవుతుంది. దీని అర్థం జ్ఞాన దృష్టితో పగళ్లని దర్శించడం. దీని అర్థం విశాలమైన ఆనందానికి గొనిపోయే సత్య సూర్యుడి కిరణాలు. మనిషి కోసం ఇంద్రుడు స్వర్ ని జయించడం వల్ల ఏర్పడేవే "పగళ్లు." అంగిరసుల సహాయంతో పణుల సేనలని ఇంద్రుడు నాశనం చేసిన తరువాత, సూర్యోదయం జరిగి, మెరిసే పశువులు ప్రత్యక్షమవుతాయి. మనిషి కోసం, మానవ శక్తుల కోసం దేవతలు ఇవన్నీ సాధిస్తారు. ఈ విజయాలు వారి సొంత ప్రయోజనం కోసం కాదు. ఎందుకంటే ఆ శక్తులన్నీ ముందే వారి వశమయ్యాయి. నృ అంటే దివ్య మానవుడి కోసం, లేదా పురుషుడి కోసం, ఇంద్రుడు ఆ మానవత్వానికి చెందిన ఎన్నో శక్తులు ప్రసాదిస్తాడు, *నృవద్... నర్యా పురూణి;* ఈ ఆలోచనలకి చెందిన జ్ఞానాన్ని అతడిలో మేల్కొలుపుతాడు. వాటినే పణుల నుండి విడిపింపబడ్డ గోవులుగా ప్రతీకాత్మకంగా వ్యక్తం చెయ్యడం జరిగింది. ఆ ఆలోచనల

జిలుగే, *శుక్రం వర్ణమ్ ఆసామ్*, 9 వ శ్లోకంలో పేర్కొనబడ్డ శుక్ర, లేదా శ్వేత ఆర్య వర్ణం. ఇంద్రుడు ఈ ఆలోచనల "రంగు"ని పెంచుతాడు, పణుల వ్యతిరేకతకి అతీతంగా ముందుకు తీసుకు పోతాడు, *హత్వీ దస్యూన్ ప్రార్యం వర్ణమ్ ఆవత్*. పైగా దస్యులు వక్రబుద్ధి గల వారు (*వృజినాన్*). ఇంద్రుడి ప్రయాసల చేత లేక జ్ఞానాకృతుల చేత, అతడి మాయ (*మాయా*) చేత, వారు జయించబడతారు. దస్యుల యొక్క, అంటే వృత్రుడి యొక్క, వలుడి యొక్క మాయకి (*మాయా*) వ్యతిరేకంగా ఇంద్రుడు తన మాయని (*మాయా*) ని ప్రయోగించి జయిస్తాడు. వేదంలో తిన్ననైనది, వక్రమైనది అనే పదాలు సత్యానికి, అసత్యానికి సమానార్థం గలవి. కాబట్టి ఈ పణులు, దస్యులు అసత్యం యొక్క, అజ్ఞానం యొక్క కుటిల శక్తులని స్పష్టంగా తెలుస్తోంది. వారు వారి మిథ్యామయ జ్ఞానాన్ని, మిథ్యామయ శక్తిని, ఇచ్ఛని, కర్మలని, దేవతలకి, ఆర్యులకి చెందిన సత్యమైన జ్ఞానానికి, సత్యమైన శక్తికి, ఇచ్ఛకి, కర్మలకి ప్రతికూలంగా నిలుపుతారు. తేజం యొక్క విజయం అంటే ఈ రకమైన అబద్ధపు, రాక్షస జ్ఞానం మీద, అంధకారం మీద సత్యం యొక్క దివ్యజ్ఞానం యొక్క విజయం. ఆ విజయం సూర్యారోహణం, ఆ విజయం పగళ్ల పుట్టుక, ఆ విజయం ఉషాగమనం, మెరిసే పశువులు అనబడే కాంతుల కిరణాల విడుదల, జ్యోతిర్లోకం దిశగా వారి ఆరోహణ.

ఇక్కడ ఆవులు అంటే సత్యవంతమైన ఆలోచనలు అన్న సంగతి IX.111 లో, సోముడికి ఉద్దేశించబడ్డ ఋక్కులో విశదం అయ్యింది. "ఈ ప్రచండ కాంతితో, తనను తాను పునీతం గావించుకుని, సూర్యుడి ఆత్మలగమైన అశ్వాల వంటి ఆత్మలగ్నమైన అశ్వాలతో విరోధ శక్తులని భేదించుకుంటూ ముందుకు దూసుకుపోయాడు. పిండితీసిన సోమరసంలా అతడు భాసిస్తాడు. తనను తాను పునీతం గావించుకుని రాజిల్లుతాడు, జ్యోతిర్మయుడు. ఋక్కుని పలికిన వక్తలతో పాటు, ఏడు నోళ్లు గల ఋక్కుని పలికిన వక్తలతో (అంగీరస శక్తులు) పాటు, అతడు సకల రూపాలను ఆవరిస్తాడు. ఓ సోముడా! నీవు పణుల నిధులని కనుగొంటావు. మాతల (పణుల గోవులు, ఎన్నో ఇతర ఋక్కులలో అదే విధంగా ఉద్దేశించబడింది) ప్రభావం వల్ల నిన్ను నీవు నీ స్వగృహంలో (స్వర్), సత్యవంతమైన ఆలోచనల వల్ల నిన్ను నీ స్వగృహంలో, ప్రకాశింపజేసుకుంటావు. *సమ్ మాతృభిర్ మర్జయసి స్వ ఆ దమ ఋతస్య ధీతిభిర్ దమే*. ఇక్కడ ఉన్నత లోకాలకి (*పరావతః*) చెందిన సామం (విశాల బృహత్తులో

సమమైన సాఫల్యం, సమానే *ఊర్వే*) అంటే ఆ స్వర్లోకమే – అక్కడే సత్యవంతమైన ఆలోచనలు తమ ఆనందసారాన్ని కనుగొంటాయి. త్రిలోకాలకి (లేదా త్రివిధమైన మూలప్రకృతికి) చెందిన జ్యోతిర్మయులతో, అతడు (జ్ఞానం యొక్క) విశాల అభివ్యక్తీకరణను ధరిస్తాడు, భాసిస్తూ విశాల అభివ్యక్తీకరణను ధరిస్తాడు." పాణులకి చెందిన ఆవుల వల్ల సోముడు తన స్వగృహంలో పరిపూతుడై, ప్రభాసమానుడవుతాడు. అగ్నితదితర దేవతలకి చెందిన ఆ గృహమే స్వర్ కి చెందిన విశాల సత్యలోకమని (*ఋతం బృహత్*) మనకు తెలుసు. కాంతులీనే ఆ గోవులలో పరంధామానికి చెందిన మూడు తత్వాలు ఇమిడి ఉంటాయి (*త్రిధాతుభిర్ అరుషీభిర్*). వాటి చేతనే సోముడు సత్యం యొక్క జననాన్ని[36], విశాల అభివ్యక్తీకరణని ధరిస్తాడు. ఆ ఆవులో సత్యాన్ని తెలుసుకోగల ఆలోచనలు. రాజిల్లే ముల్లోకాలు ఇమిడి వున్న స్వర్ యొక్క బృహత్తులో 'త్రిధాతు'వుల సమమైన సాఫల్యం జరుగుతుంది. ఈ *త్రిధాతు* అనే పదాన్ని అత్యున్నత లోకానికి చెందిన మూడు తత్వాల సంగమ తత్వాన్ని (*తిస్ర పరావతః*) సూచించడానికి ప్రయోగించడం కనిపిస్తుంది. ఈ తిస్ర పరావతః అనే పదజాలాన్ని ఎక్కడైతే గోవులు స్వేచ్ఛగా సంచరిస్తూ ఆనందిస్తాయో (*రణయంతి*) ఆ విశాల, భయరహిత బయళ్లని సూచించడానికి వాడారు. ఆ ప్రదేశమే సత్యవంతమైన ఆలోచనలు ఆనందించే ప్రదేశం, *యత్ర రణయంతి ధీతయః*. ఇక తదుపరి శ్లోకంలో సోముడి రథం జ్ఞానాన్ని సంపాదిస్తూ, కిరణాల చేత మహోన్నత దృష్టిని కలిగి, ఉత్కృష్టమైన దిశలో ముందుకు సాగుతున్నట్టుగా వర్ణించబడుతుంది. *పూర్వం అను ప్రదిశం యాతి చేకితత్, సం రశ్మిభిర్ యతతే దర్శతో రథో దైవ్యో దర్శతో రథః*. ఈ ఉత్కృష్టమైన దిశ దివ్యమైన, లేక బృహత్తర సత్యానికి చెందిన దిశ అని స్పష్టంగా తెలుస్తోంది. ఈ కిరణాలు ఉష యొక్క, లేక సత్య సూర్యుడి యొక్క కిరణాలు అన్నది స్వయం విదితం. అవి పణులు దాచిన గోవులు. రగిలే ఆలోచనలు, *ధియః*, తీక్షణమైన కాంతి గలవి, *ఋతస్య ధీతయః*.

[36] వయః (VI.21.2-3 ని చూడండి). ఈ సందర్భంలో ఇలా చెప్పబడింది. జ్ఞానం గల ఇంద్రుడు, మన వాక్కుకి ఆధారంగా నిలిచే ఇంద్రుడు, ఆ పదాల చేత యజ్ఞంలో ఎదిగే ఇంద్రుడు, *ఇంద్రం యో విదానో గిర్వాహసం గీర్భిర్ యజ్ఞవృద్ధమ్*, జ్ఞానరహితమై విస్తరించిన చీకటిని, సూర్యుడి శక్తిచేత జ్ఞానం యొక్క అభివ్యక్తిగా మార్చుతాడు, *స ఇత్ తమో అవయునం తతన్వత్ సూర్యేణ వయునవచ్ చకార.*

వేదంలో పణుల, గోవుల, అంగీరసుల చిత్రీకరణ ఎక్కడ కనిపించినా, సూచించబడ్డ అంతరార్థం మాత్రం ఎప్పుడూ ఒక్కటే. పణులు సత్య చింతనలకి అడ్డుపడతారు, జ్ఞానంలో తమస్సులో నివసిస్తారు (*తమో అవయునమ్*). ఇంద్రుడు, అంగీరసులు మంత్రాక్షరం తోను, సూర్యుని తోను ఆ తమస్సుని తొలగించి, దాని స్థానంలో తేజస్సును ప్రవేశపెట్టి, సత్యం యొక్క బృహత్తు వ్యక్తమయ్యేలా చేస్తారు. ఇంద్రుడు పణులతో పోరాడేది భౌతికమైన అస్త్రశస్త్రాలతో కాదు, మంత్రోక్తులతో పోరాడుతాడు (VI.39.2), *పణీన్ వచోభిర్ అభి యోధద్ ఇంద్రః.* ఈ ఋక్కుని వ్యాఖ్యానం లేకుండా యదాతథంగా అనువదించినా చాలు ప్రతీక వెనుక ఉన్న అంతరార్థం సులభంగా బహిర్గతమవుతుంది. "దివ్యుడు, ఆనందమయుడు అయిన ఋషిని (సోముడు), యజ్ఞధరుణ్ణి, విరాజమాన ధీశక్తిని మధురోక్తులతో వ్యక్తం చేసే వక్తను, కాంతి గోవులు (*ఇషో గో అగ్రాః*) నడిపించే ప్రేరణల పదాలు పలికే వక్తను, ఓ దేవుడా, మాతో ఐక్యం చేయి. పర్వతమంతా వ్యాపించి, సత్యలగ్నమైన కాంతి గోవులని కోరుకునేవాడు, సత్యచింతనలు పూన్చిన రథంలో అరుదెంచుతాడు, *ఋతధీతిభిర్ ఋతయుగ్ యుజానః*; అప్పుడు ఇంద్రుడు అఖిలమైన వలుడి పర్వతాన్ని బద్దలుకొట్టాడు, పదాలతో పాణుల మీద పోరాటం సలిపాడు. అతడు (సోముడు) రేబవళ్లు ఇందుతేజంతో వెలుగొందుతు, కొన్నేళ్ళ పాటు కాంతిరహిత రాత్రులని ప్రకాశించేలా చేశాడు. అప్పుడు వారికి పగళ్ల దర్శనం కలిగింది. శుద్ధమైన ఉషస్సులకి అతడు జన్మనిచ్చాడు. తాను స్వయంగా భాసిస్తూ, కాంతి రహితులని కాంతిపూర్ణులు గావించాడు; సత్యం చేత ఎన్నో (ఉషస్సులని) ప్రకాశింపజేశాడు. సత్యానికి పూన్చబడ్డ అశ్వాలతో, స్వర్ ని కనుక్కోగల చక్రంతో, యజ్ఞకర్తకి సంతృప్తినిచ్చే ఐశ్వర్యంతో ముందుకు సాగాడు." ప్రతీకలో ఆలోచన, సత్యం, గోవులతో, పాణులతో అనుసంధానమైన శబ్దం అనే భావాలు పదే పదే ఎదురవుతాయి. దివ్యమనోశక్తి అయిన ఇంద్రుడి మాటల వల్ల గోవులని బంధించిన వారు జయింపబడతారు; చీకటిగా ఉన్నది కాంతిమయం అవుతుంది; సత్యానికి లగ్నమైన అశ్వాలు పూన్చిన రథం, ప్రస్తుతం మన దృష్టికి ఆనని విరాజితమైన సచ్చిదానంద బృహత్తును (జ్ఞానం చేత, *స్వర్విదా నాభినా*) కనుక్కుంటుంది. "బ్రహ్మ చేత ఇంద్రుడు వలుణ్ణి ఛేదించి, చీకటిని దాచి, స్వర్ ని బట్టబయలు చేస్తాడు" (II.24.3), *ఉద్గా ఆజదభినద్బ్రహ్మణా వలమగూహత్తమో వ్యచక్షయత్స్వః.*

అసలు ఋగ్వేదం సమస్తమూ తేజోశక్తుల విజయగీతం అనుకోవాలి. సత్యం యొక్క శక్తితో, దృష్టితో ఆరోహించి, అసత్యం చొరబడలేని దాని మూలంలో, స్వధామంలో సత్యాన్ని వశం చేసునే మహద్ యత్నాన్ని కీర్తించే మహాకావ్యం ఋగ్వేదం. "సత్యం చేత గోవులు (విరాజిత చింతనలు) సత్యం లోకి ప్రవేశిస్తాయి; సత్యం కోసం ప్రయాసపడుతూ సత్యాన్ని జయిస్తారు; సత్యం యొక్క మహోగ్ర శక్తి కాంతి గోవుల కోసం అన్వేషిస్తూ (శత్రువుని) భేదిస్తూ ముందుకు పోతుంది; సత్యం కోసం రెండు బృహత్తర లోకాలు (దివి, భువి) అనేకమై, అపారం అవుతాయి, సత్యం కోసం ఇరువురు మహా జననులు శిశువులకి జన్మనిస్తారు," *ఋతేన గావ ఋతమ్ ఆ వివేశుః ఋతం యేమాన ఋతమ్ ఇద్ వనోత్యే ఋతస్య శుష్మస్తురయా ఉ గవ్యుః, ఋతాయ పృథ్వీ బహులే గభీరే ఋతాయ ధేనూ పరమే దుహాతే* (IV.23.9-10).

అధ్యాయం 22

దస్యులపై విజయం

ఇటు ఆర్య దేవతలకి, అటు ఆర్య ఋషులకి ప్రతికూలంగా దస్యులు పని చేస్తుంటారు. పరమ సత్యానికి చెందిన అదితి లోనుండి దేవతలు ఆవిర్భవిస్తారు. చీకటి పాతాళంలో దితి లోనుండి దస్యులు, దానవులు పుడతారు. ముల్లోకాలలోను రశ్మిపతులు, నిశిపతులు పరస్పరం కలహించుకుంటూ ఉంటారు. ఇక్కడ ముల్లోకాలు అంటే భువి, దివి, ఆ రెంటికి నడుమ ఉండే మధ్యతలం. మరోలా చెప్పాలంటే భువి అంటే శరీరం, దివి అంటే మనస్సు, మధ్యతలం అంటే ఆ రెంటినీ పరస్పరం అనుసంధానం చేసే ప్రాణశక్తి. X.108 లో సరమ పరంధామం, *పరాకాత్*, నుండి దిగి వస్తుంది. ఆమె రసజలాలని (రసా) దాటాల్సి వస్తుంది. తనను కూడా దాటేస్తుందేమో నని భయపడి రేతిరి ఆమెకు ఆశ్రయమిస్తుంది, *అతిష్కదో భియసా*. దస్యుల సదనాన్ని చేరుకుంటుంది, *దస్యోర్ ఓకో న సదనమ్*. ఆ ఇంటిని వాళ్లు *రేకు పదమ్ అలకమ్*, అనే పదాలతో వర్ణిస్తారు. అంటే తెలిసిన విషయాల పరిమితులకి ఆవల విస్తరించిన అసత్యపు లోకం. పరంధామం కూడా తెలిసిన విషయాల పరిమితులకి అతీతంగా ఉంటుంది.

అది '*రేకు పదమ్*' – కాని అది సత్యానికి లేదా సత్యలోకానికి చెందినది, అసత్యలోకానికి చెందినది కాదు. ఆ అసత్యలోకం జ్ఞాన విరహితమైన అంధకారం, *తమో అవయునం తతన్వత్*. ఇంద్రుడి బృహత్తు భువి, దివి, మధ్యతలాల పరిధికి అతీతంగా విస్తరించినప్పుడు, ఆవలి ధృవం వద్ద సత్యానికి, జ్ఞానానికి చెందిన ప్రపంచాన్ని, *వయునవత్*, ఆర్యుడి కోసం సృష్టించి ఇస్తాడు. ముల్లోకాలని అధిగమిస్తుంది కనుకనే అది *రేకు పదమ్*. ఈ చీకటి, పాతాళానికి చెందిన ఆ చీకటి ప్రపంచమే అచిత్తి. విషయ ప్రపంచానికి అడుగున ఉన్న ఈ అచిత్తినే భూమి లోతుల్లో నుండి పైకి తన్నుకొచ్చి, దివి వెన్నును తాకే పర్వతంగా చిత్రిస్తారు. దీన్నే కొండ అడుగున దాగిన రహస్య గుహగాను, చీకటి గుహగాను వర్ణిస్తారు.

కాని ఆ గుహ పణుల గృహం. దివి, భువి, మధ్యతలం వారి కర్మభూమి. వారు అచిత్తి యొక్క బిడ్డలే అయినా, తమ కర్మలలో మాత్రం వారు ససేమిరా అచేతనులు కారు. వారు కృతక జ్ఞాన రూపాలతో (*మాయాః*) వ్యవహరిస్తారు. వాటి సత్యం అచేతనపు చీకటిలో దాగి వుంటుంది. వారి ముసుగు అబద్ధపు ముసుగు, అది సత్యం యొక్క ముఖం కాదు. మనం చుట్టూ చూసే ప్రపంచం చీకటి పొరల్లో దాగిన చీకటి లోంచి పుట్టింది. అన్నిటినీ ఆవరించే అంధకారపు ఉప్పెనలోంచి, అచేతన సముద్రం (*అప్రకేతం సలిలమ్*, X.129.3) లోంచి పుట్టింది. ఆ అసత్తులో ఋషులు తమ యెదలోని ఆకాంక్షవల్ల, తమ మనసులోని ధీశక్తి వల్ల అసలైన జీవనానికి ఊపిరి పోయగల తత్వాన్ని కనుగొన్నారు. అచేతన సముద్రం లోనుండి వస్తువులు జనించినప్పుడు వాటి అసత్తు ముందు ప్రకటితమవుతుంది. దాని ప్రగాఢ అంధకారమే వేదం చెప్పే మహా రాత్రి, *రాత్రీం జగతో నివేశనీమ్* (I.35.1). అది సమస్త జగతినీ, దాని అవ్యక్త అవకాశాలనీ తన ప్రగాఢమైన ఎదలోతుల్లో దాచుకుంటుంది. మనం జీవించే ఈ త్రికలోకం మీద రాత్రి తన పాలనను విస్తరింపజేస్తుంది. అప్పుడు దివి నుండి, అంటే మనో జీవి లోనుండి, ఉష జన్మించి, చీకట్లో దాగిన సూర్యుణ్ణి విడుదల చేసి, ఆ మాహారాత్రిలో, అసత్తులో, ఓ మహత్తరమైన పగటి దర్శనానికి రూపం పోస్తుంది. అందుచేతనే ఈ ముల్లోకాలలోను జ్ఞానమూర్తులకి, అజ్ఞానమూర్తులకి మధ్య నిరంతరం సంకుల సమరం సాగుతుంటుంది.

పణ్ అనే శబ్దానికి వ్యాపారి, శ్రామికుడు అనే అర్థం వుంది (అలాగే పన్[37]; తమిళంలో పణ్; గ్రీకులో పోనోస్ అంటే శ్రమ). దీన్ని బట్టి పాణులు అంటే సామాన్య, అప్రకాశిత ఐంద్రియ వృత్తులని పాలించే శక్తులు అని అనుకోవచ్చు. ఆ వృత్తుల మూలాలు దివ్యమానసంలో ఉండవు. అంధకారమైన, అచేతనమైన భౌతిక దేహంలో ఉంటాయి. మానవుడి తపన అంతా, పైనుండి దిగి వచ్చే ప్రకాశవంతమైన ప్రభావం సహాయంతో అలాంటి చీకటి వ్యవహారాలని మార్చి, మనో, ప్రాణ దేహాలలో మరింత ప్రకాశవంతమైన వృత్తిని ప్రతిక్షేపించాలని. అలాంటి మహర్లక్ష్యాన్ని కోరుకుని, దాని కోసం శ్రమించి, పోరాడి, పయనించి, ఆత్మశిఖరాన్ని ఆరోహించే ప్రతీ మనిషి ఆర్యుడే (*అర్య, అర్య, అరి* – ఈ పదాలకి శ్రమించడం, పోరాడడం, ఎగబాకడం, ఎదగడం, ప్రయాణించడం, యజ్ఞానికి సిద్ధం చెయ్యడం మొదలుకుని పలు అర్థాలు ఉన్నాయి). మరి ఆర్యుడు చేపట్టిన పని ఒక యజ్ఞం, ఒక పోరాటం, ఒక ఆరోహణ, ఒక ప్రయాణం. అది చీకటి శక్తుల మీద చేసే దండయాత్ర. దివికి, భువికి ఆవల స్వర్లోకపు అత్యున్నత శిఖరాల ఆరోహణ. నదులని, సముద్రాన్ని దాటి వాటి ఆవలితీరం వద్దకి, అనంతత చేలాంచలాల వద్దకి చేర్చే మహత్తర పయనం. ఆర్యుడికి శ్రమించే తత్వం వుంది, అతడు కర్మలకి కర్త (కారు, కీరి మొ॥). అతడి పనులలోకి శక్తిని ప్రవేశపెట్టే దేవతలు *సుక్రతు*, అంటే యజ్ఞంలో నిర్దోషమైన బలాన్ని ప్రయోగించేవారు. దస్యుడు లేక పాణి, అందుకు వ్యతిరేకుడు, అతడు *అక్రతు*. ఆర్యుడు యజ్ఞం చేసే వాడు – *యజమాన, యజ్యు*; దాన్ని స్వీకరించి, భరించి, ఆ యజ్ఞాన్ని ప్రోత్సహించే దేవతలు *యజత* లేక *యజత్ర*, అంటే యజ్ఞబలాలు; దస్యుడు ఈ రెంటికే వ్యతిరేకుడే – అతడు *అయజ్యు*. యజ్ఞంలో ఆర్యుడు దివ్య శబ్దాన్ని కనుగొంటాడు – *గీః*, మంత్ర, బ్రహ్మ, ఉక్త. అతడు బ్రహ్మ, అంటే మంత్రోక్తిని గానంచేసేవాడు. ఆ వాక్కును విన్న దేవతలు ఆనందించి, సమర్థిస్తారు – *గిర్వాహసః*, *గిర్వణస్*. దస్యులు ఆ వాక్కుని ద్వేషిస్తారు, దాన్ని నాశనం చెయ్యాలని చూస్తారు *బ్రహ్మద్విషః*, శబ్దాన్ని భ్రష్టుపరుస్తారు, *మృధ్రవాచః*. ఆ శబ్దాన్ని పలకడానికి వారి వద్ద దివ్యశక్తిగాని, దివ్యశ్వాసగాని ఉండవు – వారు *అనాసః*. ఆ వాక్కు గురించి ఆలోచించి

---

[37] సాయణుడు వేదంలో పన్ అనే శబ్దానికి 'ప్రశంస' అనే అర్థాన్ని తీసుకుంటాడు. కాని ఒక చోట మాత్రం 'వవహార' (వ్యవహారం) అనే అర్థాన్ని ఇస్తాడు. నాకైతే ఆ పదానికి కర్మ అనే అర్థమే సమంజసంగా తోచుతుంది. పణ్ అనే మూల శబ్దం నుండి కర్మేంద్రియాలని సూచించే పదాలు ఉత్పన్నమవుతాయి, *పాణి*, చెయ్యి, కాలు, పాదం, లాటిన్ లో పెనిస్. అలాగే పాయుః అన్న సంస్కృత పదాన్ని కూడా గమనించండి.

అందులోని సత్యాన్ని మానసీకరించే శక్తి కూడా వారి వద్ద ఉండదు – వారు *అమన్యమానాః*. కాని ఆర్యులు వాక్కు గురించి ఆలోచించగలరు – వారు *మన్యమానాః*. ఆలోచనని, చింతనా మానసాన్ని, దివ్యజ్ఞానాన్ని స్థిరంగా నిలుపుకోగలరు – వారు *ధీర, మనీషీ, కవి*. దేవతలు కూడా పరమ భావనని ఆలోచించగల మహత్తర ధీమంతులు – *ప్రథమో మనోతా ధియః, కవయః*. ఆర్యులు దేవతలని ఆరాధిస్తారు – *దేవయు, ఉశిజ్*. యజ్ఞం చేత, వాక్కు చేత, ధీశక్తి చేత తమ ఆత్మను, ఆ ఆత్మలోని దేవతా శక్తులని పెంచుకోవాలని ప్రయత్నిస్తారు. కాని దస్యులు దైవద్వేషులు, *దేవద్విషః*, దివ్యత్వానికి అడ్డుపడతారు, *దేవనిదః*. వృద్ధిని నిరాకరిస్తారు, *అవృధః*. దేవతలు ఆర్యుడి మీద తమ సిరులు కురిపిస్తారు. ఆర్యుడు తన సంపదని దేవతలకి సమర్పిస్తాడు. బలవంతంగా లాక్కుంటే తప్ప, దస్యుడు తన ధనం ఆర్యుడికి అందకుండా దాచుకుంటాడు. అమృతతుల్యమైన సోమరసాన్ని పిండి మనిషిలో ఆనందాన్ని చిలికించే ప్రయత్నం చెయ్యడు. అతడు *రేవాన్* అయినా కూడా అతడి గుహ, గోవులతో, గుర్రాలతో, ఎన్నో నిధులతో నిండి ఉంటుంది, *గోభిర్ అశ్వేభిర్ వసుభిర్ న్యృష్టమ్*. అయినా అతడు అరాధస్ - ఎందుకంటే అతడి సంపద మనిషికే కాక అసలు తనకి కూడా ఐశ్వర్యాన్ని గాని, ఆనందాన్ని గాని ఇవ్వలేదు. పణుడు పిసినారి జీవనానికి చిహ్నం. ఆర్యుడికి, దస్యుడికి మధ్య జరిగే యుద్ధంలో అతడు ఎప్పుడూ దోచుకోవాలని, ధ్వంసం చెయ్యాలని చూస్తాడు. దస్యుడి విరాజమాన గోవులని దొంగలించి తన చీకటి గుహలో దాచాలని చూస్తాడు. "భక్షకుడైన పణిని వధించు; ఎందుకంటే అతడు తోడేలు (వృకః అంటే చించేవాడు అని అర్థం) (VI.51.14)."

అయితే ఈ వర్ణనలన్నీ ఆర్య దేవతలని, ఆర్య సాంప్రదాయాన్ని ద్వేషించే మానవ శత్రువులకి కూడా వర్తింప జేయొచ్చునని సులభంగా వాదించొచ్చు. కాని అలాంటి అన్వయం అసంభవం. ఎందుకంటే I.33 ఋక్కు ఆ సందేహాన్ని పూర్తిగా తీర్చుతుంది. అందులే ఈ భేదాలన్నీ కచ్చితంగా వర్ణించబడతాయి. ఇంద్రుడు తన మానవ సహచరులతో కలిసి దస్యుల మీద చేసిన యుద్ధాలని ఈ ఋక్కు వర్ణిస్తుంది. దాన్ని బట్టి దస్యులు, పణులు, వృత్రులు తదితరులంతా మానవ వీరులో, కిరాతులో, చోరులో కారు. హిరణ్యస్తూప అంగీరసుడు రచించిన ఈ ఋక్కులో మొదటి పది శ్లోకాలు కచ్చితంగా గోవుల కోసం చేసిన

యుద్ధాలని, అంటే పణులతో యుద్ధాలని, వర్ణిస్తాయి. “రండి, గోవుల కోసం గాలిస్తూ ఇంద్రుడి వద్దకి పోదాం రండి; మరి అతడే మనలో ఆలోచనలని వృద్ధి చేస్తాడు; అతడు అజేయుడు, అతడి ఆనందాలు సంపూర్ణమైనవి; విరాజమాన గోవుల మహోన్నత జ్ఞాన దర్శనాన్ని అతడు మనకోసం విడిపిస్తాడు (చీకటి నుండి వేరు చేస్తాడు), *గవామ్ కేతమ్ పరమ్ ఆవర్జతే నః;* పులుగు తన ప్రియతమ గూటికి చేరుకున్నట్టు రెక్కలు కట్టుకుని అజేయుడైన ఆ ఐశ్వర్యప్రదాత అయిన ఇంద్రుని వద్ద వాలుతాను, మహత్తర కాంతుల పలుకులతో అతడికి ప్రణమిల్లుతాను; అతడి సాధన చేసేవారు యాత్రలో అతణ్ణి తప్పక ఆవాహన చేయవలసిందే. అతడు తన సమస్త సేనలతో విచ్చేసి, తన అమ్ముల పొదిని స్థిరంగా నిలుపుతాడు; తాను కోరుకున్న వారికి గోవులని ప్రసాదించగల యోధుడు (ఆర్యుడు) అతడు. ఓ ఇంద్రుడా, (మా వాక్కుతో) నీవు మించి ఎదిగావు, నీకు గల అతిశయమైన ఆనందాన్ని నీలోనే దాచుకోకు, మాలో పణుడిగా మారబోకు. *చోష్ కూయమానో భూరి వామం మా పణిర్ భూర్ అస్మద్ అధి ప్రవృద్ధ.* ఇందులో ఆఖర్లో వచ్చే పదబంధం చాలా ముఖ్యమైనది. ప్రస్తుతం దాన్ని ఇలా అన్వయిస్తే - “మా విషయంలో పిసినారిగా ప్రవర్తిల్లకు” - శక్తంతా ఆవిరైపోతుంది. కాని పణులు ఐశ్వర్యాన్ని తమ వద్దనే దాచుకుంటారని, దాన్ని మనుషులతో గాని, దేవతలతో గాని పంచుకోరన్న విషయాన్ని విస్మరించినట్టు అవుతుంది. దీన్ని ఇలా అన్వయిస్తే మరింత సహజంగా ఉంటుంది – “అపారమైన ఆనందాల పెన్నిధి గలవాడవు. మనుషులకి అందకుండా తన సంపదని తన వద్దనే దాచుకునే పణుడిలా ప్రవర్తించకు. పణులు తమ గుహ్యమైన అచేతనలో సిరులని దాచినట్లే, నీవు నీ అతిచేతనలో మాకు అందకుండా నీ ఆనందాన్ని దాచుకోకు.”

అప్పుడు ఆ ఋక్కు దస్యుడైన పణితో ఇంద్రుడి యుద్ధాన్ని వర్ణిస్తుంది. దివిని, భువిని పణుడి నుండి తిరిగి సాధించడం కోసం ఇంద్రుడు చేసే యుద్ధమది. “ఓ ఇంద్రా! భళి! నీవు నీ శస్త్రంతో ఆస్తిపరుడైన దస్యుణ్ణి వధిస్తావు. నీ బలాలు నీకు సేవ చేస్తుంటే ఒంటరిగా పోరు సలుపుతావు; నీ వింటి నుండి వెలువడేవి (శరాలు) వడిగా దిశ దిశలా ప్రసరిస్తాయి. తమ సిరులని పంచుకోక దాచుకునేవారు, సమర్పణ చేయని వారు తమ మరణాన్ని చేరుకుంటారు. సమర్పణ చేయని వారి తలలు దూరంగా తెగిపడతాయి. ఓ మెరిసే అశ్వాల

స్వామీ! ఓ సురలోక ధృవమూర్తీ! నీ ధర్మానికి ఒడంబడని వారిని (*అవ్రతాన్*) దివి నుండి, భువి నుండి బహిష్కరిస్తావు. వారు నిర్మల మూర్తి సేనలకి వ్యతిరేకంగా పోరాడారు. నవగ్వుల ప్రేరణతో అతడు ముందుకు కదులుతాడు; వృషభానికి ఎదురుగా పోరాడిన ఆబోతులు పక్కకి విసిరేయబడ్డాయి. ఇంద్రుడి ప్రతాపం ఏమిటో వారికి తెలిసి, కొండ వాలు వెంట పలాయనం అయ్యారు. ఓ ఇంద్రా! మధ్యతలానికి అవతలి పక్క (*రజసః పారే*, సురలోకపు సరిహద్దులు) నవ్వి ఏడ్చినవారితో నీవు పోరాడావు. దస్యుణ్ణి దగ్ధం చేసి స్వర్గం నుండి తరిమేశావు. నిన్ను సమర్థించి సోమ రసాన్ని సమర్పించిన వారికి అండగా నిలిచావు. పుడమి చుట్టూ ప్రదక్షిణ చేసి వారు బంగరు రత్నపు (ఇది సూర్యుడికి చిహ్నం) కాంతిలో భాసించారు. వారు ఎంత ఆత్రుత పడ్డా ఇంద్రుణ్ణి అధిగమించ లేకపోయారు. మరి ఇంద్రుడి గూఢచారులు సూర్యుడి చుట్టూ మొహరించి వున్నారు. ఓ ఇంద్రా! నీ బృహత్తుతో దివిని, భువిని ఆక్రమించిన నీవు, మంత్రోక్తుల సహాయంతో దస్యుణ్ణి వెలివేశావు. ఆలోచనాపరుల సహాయంతో ఆలోచనారహితులని (సత్యాన్ని ఆలోచించని వారిని) అటకాయిస్తావు, *అమన్యమానాన్ అభి మన్యమానైః*. వారి దివి, భువి అంచులని చేరుకోలేకపోయారు. వృషభుడైన ఇంద్రుడు తటిల్లత సహాయంతో, తేజోబలంతో, మెరిసే ఆవుల పొదుగులని పితికి పాలు తీసి చీకట్లోంచి వెలికితీశాడు."

ఆ యుద్ధం జరిగేది భూమి మీద కాదు. అది జరిగేది అంతరిక్షపు ఆవలి తీరం వద్ద. వజ్రాయుధం చెరిగే నిప్పుల మహిమ వల్ల దస్యులు స్వర్గం వదిలి పారిపోతారు. వారు భూమి చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. భువి నుండి, దివి నుండి వెలివేయబడతారు. దివిలో గాని, భువిలో గాని వారికి నిలువ నీడ దొరకదు. అంతర్యం అంతా అప్పుడు ఇంద్రుడి మహిమతో నిండిపోతుంది. వారికి అతడి తటిల్లతల ధాటి నుండి తప్పించుకునే ప్రదేశమే దొరకదు. ఎందుకంటే సూర్యుడు తన గూఢచార్లని నలుమూలలా పంపుతాడు. వారి కిరణాల వెలుగులో పణులు పట్టుబడతారు. ఇదంతా ఆర్య, ద్రావిడ జాతుల మధ్య జరిగిన భౌతికమైన యుద్ధం ససేమిరా కాదని స్పష్టంగా తెలుస్తోంది. అలాగే ఆ తటిల్లతలు కూడా భౌతికమైన మెరుపులు కావు. ఎందుకంటే మెరుపులకి చీకటి శక్తుల వినాశనానికి, ఉషకి చెందిన గోవుల నుండి పాలు పితకడానికి, చీకటి నుండి వారిని విడిపించడానికి, మధ్య సంబంధం లేదు. కాబట్టి ఈ అయాజ్ఞికులు, ఈ వాగ్ద్వేషులు, ఆలోచనారహితులు, ఆర్య తెగల యొక్క మానవ

శత్రువులు కాదన్నది సుస్పష్టం. దివిని, భువిని మాత్రమే కాక అసలు మానవుణ్ణే ఆక్రమించుకోవాలని చూసే శక్తులవి. వాటికి ద్రావిడ జాతులకి మధ్య సంబంధం లేదు.

అయితే వారు ఎంత ప్రయత్నించినా "దివికి భువికి అంచులని" చేరుకోవడంలో విఫలం అవుతారు అన్న విషయాన్ని ఒకసారి గమనించాలి. పోనీ శక్తులు మంత్రోక్తి లేకుండా, యజ్ఞం చెయ్యకుండా, దివికి, భువికి ఆవల నున్న ఉన్నత లోకాలని చేరుకోవాలని ప్రయత్నిస్తారనే అనుకుందాం. అజ్ఞానమయ సాధనని అనుసరిస్తూ వారు సత్యాన్ని చేరుకోవాలని అనుకుంటారు. కాని వారు దివి, భువి అంచులని చేరుకోలేకపోతారు. ఇంద్రుడు, తదితర దేవతలు మాత్రమే మనో, ప్రాణ, దేహ తలాలని తమ మహత్తుతో పూరించి వాటిని అధిగమించగలుగుతారు. పణుల యొక్క కాంక్ష గురించి సరమ ఒక చోట (X.108.6) సూచన ప్రాయంగా ఇలా అంటుంది. "నీ వాక్కులు అందరానివి అగుగాక, నీ ఆకృతులు అహితమై, అశుభం అగుగాక. దివ్య మార్గాన పయనించ గోరే నీవు, ఆ మార్గాన్ని కలుషితం చేయకుండుగాక. ఇరు ప్రపంచాలలోను (మానవం, దైవం) బృహస్పతి నీకు సంతోషాన్ని ప్రసాదించకుండుగాక." అప్పుడా పొగరుబోతు పణులు ఇంద్రుడితో జట్టుకట్టాలని చుస్తారు. అతణ్ణి తమ గుహలోకి రమ్మని, తమ ఆవులని సంరక్షించమని బలవంతం చేస్తారు. ఆందుకు స్పందిస్తూ సరమ 'ఇంద్రుడు అన్నిటినీ అధిగమిస్తాడే తప్ప, తనని అధిగమించడం ఎవరితరమూ' కాదని సమాధానం చెప్తుంది. అప్పుడు వారు సరమతో స్నేహం చేసి సౌభ్రాతృత్వాన్ని వెలిబుచ్చాలని చూస్తారు. ఎక్కడో సుదూర లోకంలో జీవించే సరమను ఆ లోకాన్ని వదిలి తమతో పాటు వసించమని అడుగుతారు. దేవతలు ఎన్నో అష్టకష్టాలకోర్చి సరమను ఆ లోకంలో స్థాపించారు. అప్పుడు సరమ ఇలా అంటుంది – "సౌభ్రాతృత్వం, సోదరీత్వం వంటివి నేనెరుగను. అవి ఇంద్రుడికి తెలుసు. భీకరులైన అంగిరసులకి తెలుసు. వారు గోవులని కోరుకుంటూ నన్ను రక్షించారు. కాబట్టి నేను వచ్చాను. కాబట్టి ఓ పణులారా! వీడి పొండి, మరింత అనువైన చోటికి పొండి. మీరు బంధించిన ఆవులు సత్యం దిశగా పైకి పోతాయి. దాచబడ్డ ఆ ఆవులని బృహస్పతి, సోముడు, రోకలి బండ, తేజోమూర్తులైన ఋషులు కనుగొంటారు."

VI.53 లో పణులు తాము దాచుకున్న సంపదని స్వయంగా వొదులుకుంటున్నట్టుగా వర్ణించబడింది. ఆ ఋక్కు సూర్యుణ్ణి సంవర్ధకుడైన పూషణుడిగా ఉద్దేశించి కీర్తిస్తుంది – ఓ పూషణుడా! నీవు మార్గానికి పతివి! పూర్ణత్వాన్ని సాధించడం కోసం నిన్ను రథానికి కట్టినట్టుగా ధీశక్తితో జోడిస్తాము... ఓ ప్రకాశవంతుడవైన పూషణుడా! ఏదీ ఇవ్వని పాణుడికి కూడా నీవు ఇస్తావు. పూర్ణవిజయానికి దారితీసే మార్గాలని వివేచన చేసి గుర్తించు. ఆక్రమణదారులని వధించు. మా ఆలోచనలని పరిపూర్ణం గావించు. ఓ మహర్షీ! నీ అంకుశంతో పణుల గుండెల్ని ఛేదించు. వారు మాకు లోబడి ఉండేలా చెయ్యి. ఓ పూషణుడా! నీ అంకుశంతో పణులని ఛేదించు, వారి గుండెల్లో మా ఆనందాన్ని నెలకొల్పు; ఓ విరాజమానుడైన మహర్షీ! నీవు చేత బట్టిన అంకుశం వాక్కును తట్టి లేపుతుంది. ఆ అంకుశంతో వారందరి గుండెల మీద ఉల్లేఖించి, ఛేదించు (ఆ విధంగా వారు మాకు లొంగి ఉండేలా చెయ్యి). నీ అంకుశపు పొడుపులే నీ కిరణాలు. అవి పశువులని (*పశుసాధనీ*, నాల్గవ శ్లోకంలో *పశుసాధన్తాం ధియః*) పరిపూర్ణం గావిస్తాయి. మేము కోరుకునే ఆనందం అదే. గోవును జయించి, అశ్వాన్ని జయించి, సంపూర్ణ ఐశ్వర్యాన్ని జయించే ధీశక్తి మాలో కలుగజేయి."

పణుల ప్రతీక యొక్క అన్వయంలో మనం అవలంబించిన విధానం సరైనదే అయితే, పైన వెలిబుచ్చిన భావాలన్నీ సహజంగా, సముచితంగా తోస్తాయి. కాని సయణుడి అన్వయం పూర్తిగా భిన్నంగా వుంది. అతడి ప్రకారం పణులు కేవలం పీనాసులు, లుబ్ధ మానవులు. వారి మనసును మార్చమని, వెన్నలా మెత్తగా చెయ్యమని, పాపం ఆకలితో అలమటించే నిరుపేద కవి సూర్యభగవానుణ్ణి ప్రార్థిస్తున్నాడు. వైదిక అవగాహన ప్రకారం ఉపచేతన ఒక చీకటి లోకం. అందులో చిక్కుకున్న అజ్ఞానమయ సామాన్య జీవనంలో దివ్యజీవనానికి చెందిన అందాలెన్నో గుప్తంగా ఉండిపోతాయి. అజ్ఞానమయ శక్తులని నిర్జించి ఆ నిగూఢ నిధులని వెలికితీయాలి. అందుకోసం ఊర్ధ్వజీవన ప్రభావం అధమ జీవనంపై ప్రసరించి దాన్ని వశం చేసుకోవాలి. దస్యుణ్ణి జయించి గాని, వధించి గాని ఇంద్రుడు దస్యుడి నిధులని ఆర్యుడికి అందజేస్తాడని వేదం చెప్తుంది. అలాగే పణులతో సంధి చేసుకుని తద్వారా దక్కే శాంతిని త్రోసిపుచ్చుతుంది సరమ. అంతేకాక దేవతలకి లొంగిపొమ్మని సరమ దస్యులకి సూచిస్తుంది. అలాగే వారు నిర్బంధించిన గోవులని ఆర్యులకి ముట్టజెప్పమని సూచిస్తుంది.

అంతేకాక వారు స్వయంగా ఆ చీకటి లోకాన్ని వీడి మరింత ఉన్నతమైన లోకానికి తమ నివాసాన్ని మార్చమని (*ఆ వరీయః*) కూడా సూచిస్తుంది. సత్యదేవుడైన పూషణుడి అంకుశపు పొడుపుల ప్రభావం వల్ల మూసుకున్న యెద తెరుచుకుంటుంది, హృదయం లోంచి మంత్రాక్షరం పెల్లుబుకుతుంది. ఆ కూసుమొన గల అంకుశపు ప్రభావం చేత విరాజమాన గోవులు పరిపూర్ణం అవుతాయి. కాంతులు చిందే భావాలు ఉద్భవిస్తాయి. పణుడి పరివర్తన సంభవిస్తుంది. అప్పుడు నల్లని గుండె గల సత్యదేవత కూడా ఆర్యుడు కాంక్షించిన దాన్నే కాంక్షిస్తాడు. ఆ విధంగా కాంతి యొక్క, సత్యం యొక్క ఈ నిశిత చర్య వల్ల అజ్ఞానమయ ఇంద్రియ వృత్తికి చెందిన బలాలు ఆర్యుడికి దాసోహం అవుతాయి.

కాని మామూలుగా అయితే దస్యులు ఆర్యుడికి శత్రువులు. ఇక్కడ *దస్య* అనే పదాన్ని దాస అనే అర్థంలో (*దాస* అంటే సేవకుడు, ఇది *దస్* అంటే పని అనే పదం నుండి వచ్చింది) తీసుకోకూడదు. ఈ పదాన్ని నశింపజేయడం, గాయపరచడం (*దాస, దస్యు*, అంటే శత్రువు, దోచుకునేవాడు అని అర్థం, ఇది విభజించడం, గాయపరచడం అనే అర్థం గల దస్ అనే పదం నుండి వచ్చింది.) అన్న అర్థంలో తీసుకోవాలి. పణుడు అంటే చోరుడు. అతడు గోవుల కాంతులని, అశ్వాల వేగాన్ని, దివ్య సిరులని దొంగలిస్తాడు. అతడు తోడేలు, భక్షకుడు, అత్రి, వృక; అతడు అవరోధకుడు, *నిద్*, వాక్కును భంగపరిచే వాడు. అతడు శత్రువు, చోరుడు, అబద్ధపు ఆలోచనలు, చెడు ఆలోచనలు గలవాడు. తన చౌర్యంతో, అటకాయింపులతో సాధకుడి మార్గాన్ని దుర్భరం చేసేవాడు. "ఆ శత్రువుని, ఆ చోరుణ్ణి, మాలో దుష్ట ఆలోచనను నాటే ఆ వక్రబుద్ధిని మా నుండి దూరంగా నెట్టివేయి. ఓ విశ్వాత్మా, మా మార్గాన్ని సుగమం చేయి. పణుణ్ణి వధించు, ఎందుకంటే అతడు తోడేలు, భక్షకుడు" (VI.51.13-14). అతడి దాడులని దేవతలే అడ్డుకోగలరు. "ఈ దేవత (సోముడు) తన పుట్టుకతో, ఇంద్రుడి సహాయంతో, పణుడి శక్తిని నిరోధించాడు." స్వర్ ని, సూర్యుణ్ణి, సమస్త సిరులని గెలిచాడు (VI.44.22). ఈ పణులని నిర్జించాలి, నశింపజేయాలి. వారు కబళించిన నిధులని వశపరచుకుని ఉన్నత జీవనానికి ఆ నిధులని అర్పించాలి. "పణుల అవిచ్ఛిన్న శ్రేణులని

భేదించి నీవు గొప్ప వరాలని ప్రసాదించావు ఓ సరస్వతీ. ఓ సరస్వతీ! దేవతల అవరోధకులని నాశనం చేయి" (VI.61). "ఓ అగ్నీ, ఓ సోముడా, మీరు పణుల గోవులని దొంగలించినప్పుడు, అందరి కోసం అనన్య కాంతిని కనుగొన్నప్పుడు, మీ శక్తి మేలుకొంది."

ఉషోదయ సమయంలో యజ్ఞం కోసం దేవతలు మేలుకున్నప్పుడు, పణులు కూడా మేలుకోరాదు. వారు మేలుకొంటే యజ్ఞక్రమానికి అవరోధం కలుగుతుంది. వారు తమ గుహల చీకటి గుయ్యారంలో ఉండిపోనీ. "ఓ ఉషాదేవీ! సకల సిరుల రాణీ! మమ్మల్ని పూరించే వారిని (దేవతలని) మేల్కొలుపు. కాని పణులని మాత్రం నిద్రలేపవద్దు. శ్రీపతుల కోసం నిండుగా కాంతులు చిందించు. ఓ సకల సిరుల రాణీ! నిన్ను కొలిచే వారిపై సిరులు కురిపించు. ఓ ఊషాదేవీ! నీవు సత్యానివి. యవ్వనవతియై ఆమె మన ఎదుట భాసిస్తుంది. రగిలే గోవుల సందోహాన్ని ఆమె సృజించింది. అసత్తులో దృష్టి శక్తి నిండుగా రాజిల్లింది" (I.124.10-11). అలాగే మరో చోట (IV.51) , "అదుగో, మన ఎదుట పరమ తేజం జ్ఞాన పూర్ణమై చీకటి లోంచి మేలుకుంది. సురపుత్రికలు సువిస్తారంగా భాసిస్తున్నారు. మనిషి కోసం ఉషస్సులు మార్గాన్ని ఏర్పాటు చేశారు. యజ్ఞాలలో ఉషస్సులు మా ఎదుట స్థిరంగా స్తంభాల్లా నిలిచాయి. పునీతమై, పావకమై అవి గోశాలల యొక్క, చీకటి యొక్క ద్వారాలని తెరిచాయి. ఈ రోజు ఉషస్సులు పెల్లుబికి, హర్షులలో జ్ఞానాన్ని మేల్కొలిపి, వారికి పూర్ణ ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాయి. వెలుగు చొరబడని చోట, చీకటి హృదిలో పణులని చిరకాలం నిద్దరోనీ." వారిని చీకటి పాతాళంలోకి తోసివేయాలి. వారు చెరపట్టిన ఉషస్సులని విడిపించి ఊర్ధ్వతలాలకి పైకెత్తాలి. "పణులు కుటిలమైన ముడి వేస్తారు, పని పట్ల వారికి శ్రద్ధ లేదు. వాక్కును చెడగొడతారు. వారికి విశ్వాసం లేదు, వృద్ధి లేదు. వారు యజ్ఞాన్ని ఆచరించరు. అగ్నిదేవుడు వారిని ఇంకా ఇంకా దూరంగా తరిమేశాడు. మహోన్నతుడైన అగ్ని అయాజ్ఞికులైన వారిని పాతాళంలోకి తొక్కేశాడు. పాతాళపు చీకట్లో అంతవరకు ఆనందించిన వారిని (గోవులని, ఉషస్సులని), తన శక్తి చేత అత్యున్నత తలానికి ఉద్ధరించాడు... తన ఘాతాలతో అడ్డుగోడలని బద్దలు కొట్టాడు. ఆర్యుడికి చేరేలా ఉషస్సుని ప్రసాదించాడు," *అర్యపత్నీర్ ఉషసశ్ చకార* (VII.6.3-5). వృత్రుడు, లేదా వలుడి చెరలో ఉన్న నదులని, ఉషస్సులని *దాసపత్నీః* అంటారు; దేవతల ప్రభావం చేత వారు అర్యపత్నీః అవుతారు. వారు ఆర్యుడికి సహచారిణులు అవుతారు.

అజ్ఞానమూర్తులని సంహరించాలి, లేదా సత్యానికి, సత్యసాధకులకి అనుకూలమై ఉండేలా చెయ్యాలి. కాని వారి ఐశ్వర్యం మానవ సాఫల్యానికి అత్యవసరం. "పణులలో అత్యంత ఐశ్వర్యవంతమైన శిరస్సుల మీద" ఇంద్రుడు స్థితమై ఉంటాడు, పణీనాం వర్షిష్ఠే మూర్ధన్న్ అస్థాత్ (VI.45.31); అతడు కాంతులు చిందే గోవుగా మారి, ప్రచండ వేగం గల అశ్వంగా మారి తరగని సిరులని కురిపిస్తాడు. పాణుల అపారమైన సంపదలోని పూర్ణత్వం, స్వర్గం దిశగా దాని ఆరోహణ, వృద్ధి – ఇదే దివ్యమార్గం అని, అమరత్వానికి నాంది అని మనం ముందే గ్రహించాము. "అగ్నిని రాజేసిన అంగిరసులు (సత్యం యొక్క) మహోన్నత అభివ్యక్తిని వశం చేసుకున్నారు, కర్మలలో పరిపూర్ణ సాఫల్యాన్ని సాధించారు; పణుల పూర్తి వైభోగాన్ని, అతడి గో, అశ్వ సందోహాన్ని వశం చేసుకున్నారు. అథర్వుడు మొదట మార్గాన్ని ఏర్పరచాడు, అటుపిమ్మట సూర్యుడు ధర్మం యొక్క, ఆనందమయ అనన్యుడి యొక్క సంరక్షకుడిగా జన్మించాడు, *తతః సూర్యో వ్రతపా వేన ఆజని*. ఉషనస్ కావ్యుడు గోవులని ఊర్ధ్వ మార్గాన అదిలించాడు. వారి సహాయంతో మేము యజ్ఞం చేసి అమరత్వాన్ని సాధించగోరుతున్నాము. యమధర్మరాజు సంతతిలా అమరత్వం పుట్టాలి, *యమస్య జాతమ్ అమృతం యజామహే* (1.83.4-5). అంగిరస ఋషి కవిక్రతువుకి ప్రతీక, అథర్వ ఋషి దివ్య మార్గాన సాగే యాత్రకి ప్రతీక, ఉషనస్ కావ్య ఋషి దివ్యజ్ఞానం వల్ల స్వర్గం పట్ల కలిగే ఆకాంక్షకి ప్రతీక. అధమ జీవనం వెనుక, దాని శతకోటి వక్రతల వెనుక దాగి వున్న సత్య ప్రకాశనాలని, సత్య శక్తులని అంగిరసులు గెలుస్తారు. అథర్వుడు తన శక్తితో మార్గాన్ని రూపొందిస్తాడు. అప్పుడు రశ్మిపతి అయిన సూర్యుడు జన్మించి దివ్యమైన ధర్మానికి, యమధర్మరాజు పాలనకి సంరక్షకుడిగా నిలుస్తాడు. ఉషనస్ కావ్యుడు మన ఆలోచనల రాశీకృతమైన ప్రకాశాన్ని సత్య మార్గం వెంట ముందుకు తోస్తాడు. ఆ యాత్ర సూర్యుడి వశమై వున్న ఆనందానికి గొనిపోతుంది. ఆ విధంగా సత్యధర్మం నుండి అమరత్వం పుడుతుంది. ఆ అమరత్వాన్నే ఆర్యాత్మ యజ్ఞం చేసి చేరుకోవాలని తపిస్తుంది.

అధ్యాయం 23

ఉపసంహారం

ఇంతవరకు మనం ఋగ్వేదంలోని అంగీరస గాధని పలు కోణాల నుండి పరిశీలించాము. అందులోని ప్రతీకలని పరీక్షించాము. ఇప్పుడు దాని నుండి మనం నేర్చుకోదగ్గ ముఖ్యమైన పాఠాలని వ్యక్తం చేసే ప్రయత్నం చేద్దాము. వేదంలో అంగిరసుల గాధ, వృత్రుడి కథ - ఈ రెండూ అతి ముఖ్యమైన గాధలని ముందే చేప్పాను. అవి పలు చోట్ల పదే పదే ప్రత్యక్షమవుతూ ఉంటాయి. ఒకదాంతో ఒకటి గాఢంగా పెనవేసుకున్న ప్రతీకలుగా ఆ రెండూ ఋక్కులలో అంతర్లీనంగా ఎన్నో చోట్ల కనిపిస్తూ ఉంటాయి. ఇక తక్కిన వైదిక ప్రతీకావళి అంతా ఆ రెండు ప్రతీకల చుట్టూ అల్లబడి ఉన్నట్టు కనిపిస్తుంది. అవి రెండు కేంద్ర భావనలు అనడానికి లేదు గాని అవి ఆ ప్రాచీన భావనిర్మాణంలో రెండు మూలస్తంభాలని చెప్పొచ్చు. వాటి అర్థం తెలిసిందంటే మొత్తం ఋగ్వేద సంహితలోని అంతరార్థం అంతా మనకి అవగతం అయినట్టే. వృత్రుడు, జలాలు మబ్బుకి, వర్షానికి, పంజాబులో పరవళ్లు తొక్కే మహానదులకి ప్రతీకలే అయితే, అంగీగిసులు భౌతికమైన ఉదయాన్ని కలుగజేసే వారే అయితే, అప్పుడు వేదంలోని ప్రతీలన్నీ ప్రకృతిగతమైన పరిణామాలని సూచిస్తున్నాయని అర్థం చేసుకోవచ్చు. ఆ పరిణతులన్నీ దేవతలలోను, ఋషులలోను, రాక్షసులలోను మూర్తీభవిస్తున్నాయని తలపోయవచ్చు. వృత్రుడు, వలుడు ద్రావిడ దేవతలే అయితే, పణులు, వృత్రుడు మనిషికి శత్రువులే అయితే, మొత్తం వేదం అంతా ఎవరో ప్రకృతిని ఆరాధించే అనాగరక తెగల దాడికి గురైన ద్రవిడ భారతానికి చెందిన పౌరాణిక గాధని అని అనుకోవచ్చు. అలా కాకుండా వేదం అంతా వెలుగుకి, చీకటికి, సత్యానికి అసత్యానికి, చావుకి అమరత్వానికి, చెందిన శక్తుల మధ్య జరిగే అధ్యాత్మిక ఘర్షణకి ప్రతీక అనుకుంటే, అదే వేదం యొక్క అసలైన అర్థం, పరమార్థం అవుతుంది.

అంగిరస ఋషులు ఉషస్సుని సాధిస్తారని, చీకట్లోంచి సూర్యుణ్ణి విడిపిస్తారని, అయితే ఆ ఉషస్సు, ఆ సూర్యుడు, ఆ చీకటి అధ్యాత్మిక విషయాలకి ప్రతీకలని ఇప్పటికే నిర్ణయించాము. వేదంలోని ఒక కేంద్ర భావన అజ్ఞాన తిమిరంలో చిక్కుకున్న సత్యాన్ని జయించడం. సత్యంపై విజయం చేతనే అమరత్వ సిద్ధి కూడా సాధ్యమవుతుంది. ఋతం అనే వైదిక భావనకి అధ్యాత్మికమే కాక, మానసికమైన అన్వయం కూడా ఉంది. దాని అర్థం అసలైన అస్తిత్వం, అసలైన చైతన్యం, అసలైన ఆనందం. అది ఈ దేహానికి లేదా భూమికి, ప్రాణశక్తికి చెందిన మధ్య తలానికి, మనోసీమని సూచించే ఆకాశానికి ఆవల ఉన్న అస్తితం. ఈ తలాలన్నీ దాటినప్పుడే అతిచేతనా తలానికి చెందిన సత్యాన్ని చేరుకోగలము. ఆ తలమే దేవతల స్వధామం, అదే అమరత్వానికి ఆధారం. అదే స్వర్లోకం. అంగిరస ఋషులు తమ తరువాత వచ్చే మానవ తరాల కోసం ఆ స్వర్లోకాన్ని చేరే మార్గాన్ని ఏర్పరచారు.

అంగిరసుల తత్వానికి రెండు ముఖాలు ఉన్నాయి. ఒక పక్క వాళ్లు విశ్వైక, మానవీయ కార్యక్రమాలలో దేవతలకి సహాయపడే దివ్య ఋషులు. మరో పక్క వారు మానవజాతికి ఆద్యులు, ప్రతినిధులు, ప్రాచీన పితరులు. వారి అధ్యాత్మిక అనుభవం లోనుండి, స్మృతి లోనుండి వేదమంత్రాలు ఆవిర్భవించాయి. ఏడుగురు అంగీరస ఋషులు అగ్ని పుత్రులు, అగ్ని శక్తులు. కవిక్రతువు యొక్క బలాలు. వారి దివ్యజ్వాల లోనే దివ్య జ్ఞానం ప్రచ్ఛన్నంగా ఉంటుంది. దాని వల్లనే చరమ విజయం సిద్ధిస్తుంది. ధరాగత జీవన వృద్ధిలో ఈ జ్వాలా రహస్యాన్ని భృగులు కనుగొన్నారు. కాని అంగీరసులు ఆ జ్వాలని యజ్ఞవాటికలో వెలిగించి, యజ్ఞ కార్యాన్ని ఏడాది పొడవునా కొనసాగిస్తారు. ఏడాది పొడవునా సాగే ఆ యజ్ఞకార్యం, చీకట్లో నుండి సత్యసూర్యుణ్ణి వెలికి తీసే దివ్యప్రయాసలోని దశలకి ప్రతీక. అలా ఏడాదిలో తొమ్మిది నెలల పాటు యజ్ఞం చేసేవారిని నవగ్వులు అంటారు. తొమ్మిది గోవులు లేదా తొమ్మిది కిరణాలకి సంబంధించిన ఋషులు వీరు. సూర్యుడి ఆలమందల కోసం గాలించే ప్రయత్నాన్ని వీరు చేస్తారు. పణుల మీద దండయాత్రలో వీరు ఇంద్రుడికి తోడ్పడతారు. పది నెలల పాటు యజ్ఞం చేసేవారు దశగ్వులు. వీరు పది కిరణాలకి సంబంధించిన ఋషులు. వీరు ఇంద్రుడితో పాటు పణుల గుహలోకి చొచ్చుకుపోయి, పోయిన ఆలమందలని తిరిగి సాధిస్తారు.

మనిషి తనకి చెందిన దాన్ని తన కన్నా ఉన్నతమైన దివ్యప్రకృతికి నివేదించుకోవడమే యజ్ఞంలోని అంతరార్థం. అప్పుడు దేవతలు కురిపించే సిరుల వల్ల అతడి మానవత్వం పరిపూర్ణం కావడమే యజ్ఞఫలం. అలా అర్జించబడ్డ ధనం గొప్ప అధ్యాత్మిక అనుభూతుల, ఆనందాల ఐశ్వర్యం. ఆ అనుభవ రాశి యాత్రలో మార్గగామిలా, యుద్ధంలో శస్త్రంలా అండగా నిలుస్తుంది. ఆ యజ్ఞం ఒక ప్రయాణం, ఒక పురోగమనం. అసలు యజ్ఞం అంటేనే అగ్ని దారి చూపుతుండగా దివ్యమార్గం వెంట నడుస్తూ దేవతలని చేరుకునే ప్రయత్నం. అలాంటి యాత్రకి ఒక తార్కాణంగా అంగిరస పితరులు దివ్యమైన స్వర్లోకాన్ని చేరుకునే ప్రయత్నాన్ని పేర్కొనవచ్చు. వారు చేసే యజ్ఞం కూడా ఒక యుద్ధమే. పణులు, వృత్రులు తదితర దుష్టశక్తులు వారి ప్రయత్నానికి అడ్డుపడతాయి. ఇంద్ర, అంగీరసులకి పణులకి మధ్య జరిగే యుద్ధం ఆ ప్రయత్నంలో ఒక ముఖ్య ఘట్టం.

యజ్ఞంలోని ముఖ్యాంశాలు జ్వాలని వెలిగించడం, నేతిని (ఘృత), సోమరసాన్ని అర్పించడం, మంత్రాక్షరాన్ని జపించడం. జపం చేత, సమర్పణ చేత దేవతలు వర్ధిల్లుతారు. యజ్ఞం వల్ల దేవతలు జన్మిస్తారు, సృష్టింపబడతారు, లేదా మనిషిలో అభివ్యక్తం అవుతారు అన్నట్టుగా వేదం వర్ణిస్తుంది. వారి వృద్ధి వల్ల, మహత్తు వల్ల ఇక్కడ దివి, భువి వర్ధిల్లుతాయి. అంటే మన భౌతిక, మానసిక జీవనం మరింత ఇనుమడిస్తుంది. భౌతిక, మానసిక జీవనంలో కలిగిన వృద్ధి మళ్లీ ఊర్ధ్వ లోకాలని పోషించి పెంచుతుంది. ఊర్ధ్వ ప్రపంచం దివ్యమైనది, అనంతమైనది. భాసించే గోవు, అనంతమైన జగజ్జనని, అదితి, ఆ ప్రపంచానికి ప్రతీక. అధోలోకాలకి ఆమె యొక్క చీకటి పార్శ్వమైన దితి ప్రతీక. యజ్ఞం యొక్క ముఖ్య లక్ష్యం ఆ దివ్య జీవనాన్ని జయించి, దాని ధర్మానికి, పాలనకి ఒడంబడి ఇక్కడ ఈ మానవ జీవనం సాగేలా చెయ్యడం. యజ్ఞంలో వాడే నెయ్యి ఆ భాసించే గోవు నుండి వచ్చే ఒక ఉత్పత్తి; అది మానవ మనోసీమలో సౌరకాంతి యొక్క ప్రకాశానికి ప్రతీక. సోమరసం అస్తిత్వంలో దాగిన అమృతమైన ఆనందానికి ప్రతీక. జలాలలోను, వృక్షప్రపంచంలోను రహస్యంగా ఉన్న ఆ రసాన్ని పిండి తీసి దేవతలకి, మానవులకి పానీయంగా ఇస్తారు. సత్యం యొక్క మేధో కాంతిని వ్యక్తం చేసే భాషే మంత్రాక్షరం. అది ఆత్మలో జనించి, హృదయంలో రూపం దాల్చి, మనసులో రూపుదిద్దబడుతుంది. ఘృతం చేత మించి జ్వలించే అగ్ని, విరాజమాన శక్తితో

బలాన్ని పుంజుకున్న ఇంద్రుడు, మంత్రం చేత తీక్షణమైన సోమరసపు ఆనందం, - సూర్యుడి ఆలమందలని గెలుచుకునే ప్రయత్నంలో ఇవన్నీ తోడ్పడుతాయి.

మంత్రాక్షరానికి బృహస్పతి అధిపతి. అగ్ని పరమ అంగిరసుడు అయితే, ఆ అగ్ని నుండి అంగిరసుల కూటమి జనిస్తే, ఏడు నోళ్లు గల ఒక ప్రత్యేక అంగిరసుడే బృహస్పతి. తేజోమయ ధీశక్తికి చెందిన ఏడు కిరణాలవి. ఆ ధీశక్తిని వ్యక్తం చేసే ఏడు మంత్రోక్తులు. ఆ మంత్రోక్తుల ఉచ్చారణా శక్తికి ఈ ఋషులు మూర్తిరూపాలు. అది సత్యాన్ని వ్యక్తం చెయ్యగల సంపూర్ణ మేధ. ఏడు తలలు గల ఆ మేధ మానవుడి కోసం నాల్గవ లేదా దివ్య ప్రపంచాన్ని గెలిచి ఇస్తుంది. ఆ విజయంలో భాగంగా యజ్ఞానికి చరమ లక్ష్యం అయిన సంపూర్ణ అధ్యాత్మిక ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి అగ్ని, ఇంద్రుడు, బృహస్పతి, సోముడు – వీరంతా సూర్యుడి ఆలమందలని గెలిచే వారి గాను, ఆ సిరులని మనిషికి అందకుండా దాచే దస్యులని నశింపజేసేవారి గాను వర్ణించడం జరుగుతుంది. సరస్వతి భావ ధారకి ప్రతీక, సత్య స్ఫూర్తికి చిహ్నం. ఆమె కూడా దస్యులని నశింపజేసి మెరిసే ఆలమందలని గెలిచి తెస్తుంది. వాటిని ఇంద్రుడికి ముందు నడిచే సరమ కనుగొంటుంది. ఆమె సౌరదేవత, ఉషాదేవత, సత్యం యొక్క లోజ్ఞాన శక్తికి ప్రతీక. ప్రభాతానికి ప్రతీక అయిన ఉషాదేవి ఈ మహత్తర విజయం కోసం పాటుపడే దేవతాగణంలో ఒకరు. అంతేకాక అసలు ఆమె అవతరణే ఆ పూర్ణ, విరాజమాన విజయానికి సంకేతం.

ఉష అంటే దివ్యమైన ప్రభాతం. ఆమెతో పాటు ఉదయించే సూర్యుడు అతిచేతనా సత్యానికి మూర్తిరూపమైన సూర్యుడు. అతడు తెచ్చే పగలు సత్యమైన జ్ఞానం వల్ల వెలసే నిజమైన జీవితం అనే పగలు. అతడు పారద్రోలే రాత్రి అజ్ఞానపు తిమిరం. పైగా చీకటి తన గుండెల్లో ఆ పగటిని గుప్తంగా దాచుతుంది. అసలు ఉషాదేవి తానే సత్యం, సూనృతా, సకల సత్యాలకి ఆమె జనని. దివ్యమైన ఉషస్సుకి చెందిన ఆ సత్యాలే ఆమె గోవులు, మెరిసే ఆలమందలు. వాటికి తోడుగా పని చేస్తూ జీవితాన్ని శాసించే సత్య శక్తులే ఆమె అశ్వాలు. వేదంలోని ఎంతో ప్రతీకాత్మకత ఈ గోవుల, గుర్రాల చుట్టూ పరిభ్రమిస్తుంది. మరి దేవతల నుండి మనిషి కోరుకునే సిరులలోని ముఖ్యమైన అంశాలకి ఇవి ప్రతీకలు. పగటికి చెందిన ఈ ఆవులని రాక్షసులు దొంగలించి దాచేస్తారు. ఆ పాతాళ వేల్పులు తమ రహస్య ఉపచేతనా సొరంగాలలో వాటిని దాస్తారు. ఆ గోవులు జ్ఞానప్రకాశనాలు, సత్యానికి చెందిన ఆలోచనలు, గావో

మతయః. వాటిని తమ చెరసాల లోంచి విడిపించాలి. దివ్య ఉషస్సు యొక్క శక్తులన్నీ చేతనలోంచి ఎగదన్నుకు రావడమే వాటి విడుదలలోని అర్థం.

ఆ విడుదలకి మరో అర్థం చీకట్లో పడి వున్న సూర్యుణ్ణి తిరిగి సాధించడం. పణుల గుహలో ఇంద్రుడు, అంగీరసులు కనుగొన్న "ఆ సత్యం" సూర్యుడు అని కూడా చెప్పబడింది. ఆ గుహని కూలదోసినప్పుడు అందులో అంతవరకు బందీగా వున్న దివ్యమైన ఉషస్సు యొక్క ఆలమందలు, ఆ సత్యభానుడి కిరణాలు, ఆత్మశిఖరాన్ని అధిరోహించడం ప్రారంభిస్తాయి. అసలు ఆ సూర్యుడే దివ్యజీవనానికి చెందిన విరాజమాన ఊర్ధ్వ సముద్రం దిశగా ఆరోహించడం ప్రారంభిస్తాడు. నీటి మీద నౌక కదిలినట్టుగా ధీమంతులు దారి చూపుతుండగా ఆ సూర్యుడు ఆ కాంతుల కడలి ఆవలి తీరాన్ని చేరుకుంటాడు.

ఆలమందలని దాచిన పణులు నిజానికి పాతాళ కుహరానికి యజమానులు. వీరు దస్యులలో ఒక ప్రత్యేక వర్గం. వైదిక ప్రతీకాత్మకతలో వీరిని ఆర్య దేవతలకి, ఆర్య ఋషులకి, కార్యకర్తలకి వ్యతిరేకంగా ఉన్నట్టుగా వర్ణించడం జరిగింది. యజ్ఞం చేసి, జ్యోతిర్మయమైన మంత్రాక్షరాన్ని కనుగొని, దేవతలని ఉపాసించి, వారిని పెంచి, ప్రతిగా వారి చేత పోషించబడి, ఎదిగి ఉన్నత జీవనంలోకి ప్రవేశించగలిగిన వాడు ఆర్యుడు. అతడు కాంతి వీరుడు, సత్య యాత్రికుడు. దస్యుడు అదివ్యజీవి. అతడు యజ్ఞం చేయడు. ఐశ్వర్యాన్ని పోగు చేసుకుంటాడు గాని దాన్ని సక్రమంగా వినియోగించలేడు. ఎందుకంటే అతడు భావప్రకటన చెయ్యలేడు. అతిమానస సత్యాన్ని మానసిక పరిభాషలో వ్యక్తం చెయ్యలేడు. అతడికి మంత్రం పట్ల, దేవతలు పట్ల, యజ్ఞం పట్ల ద్వేషం. అతడు ఉన్నత జీవన విధానానికి తనను తాను అంకితం చేసుకోడు. అతడు చోరుడు, రిపుడు, వృకుడు, భక్షకుడు, విభాజకుడు, అవరోధకుడు, చెరపట్టేవాడు. దస్యులు చీకటి శక్తులు, అజ్ఞానమయ శక్తులు. కాబట్టి సత్యసాధకులకి, అమరత్వ సాధకులకి వారు వ్యతిరేకులు. దేవతలు కాంతిశక్తులు. అనంతతకి సంతతి వారు. అనన్యుడైన పురుషోత్తముడి కోటి రూపాలు వారు. వారి సహాయం చేత, వృద్ధి చేత, వారి మానవ కార్యకలాపాల చేత మనిషి ఉద్ధరించబడతాడు. సత్యాన్ని, అమరత్వాన్ని చేరుకోగలుగుతాడు.

కాబట్టి అంగీరస గాథని సరిగ్గా అన్వయిస్తే మొత్తం వేద రహస్యం అంతా మనకి పట్టుచిక్కుతుంది. వేదంలో ఆర్యులు పోగొట్టుకున్న ఆవులని, గుర్రాలని దేవతలు తిరిగి తెచ్చిస్తారు. ఆ ఆవులకి, గుర్రాలకి ఇంద్రుడు స్వామి, ప్రదాత. అసలు తానే ఆ గోవుకి, ఆ అశ్వానికి మూర్తిరూపం. ఇక్కడ ఆవులు, గుర్రాలు భౌతికమైన పశువులు కావు. యజ్ఞం చేసి ఆ యజ్ఞ ఫలంగా కోరుకునే ఈ సంపదలన్నీ కొన్ని అధ్యాత్మిక సిరులకి ప్రతీకలు అనుకుంటే, యజ్ఞ ఫలంగా వాంఛించే ఎన్నో ఇతర అంశాలు – పుత్రులు, పరిచారకులు, పసిడి, పెన్నిధి – మొదలైన విషయాలు కూడా అలాంటి ప్రతీకలే అయ్యుండాలి. ఘృతాన్ని ఉత్పత్తిగా ప్రసాదించే గోవు మామూలు ఆవు కాదని, కాంతులతల్లి జగజ్జననికి ప్రతీక అని తెలుసుకున్నాం. ఇక ఘృతం జలాలలో లభ్యం అవుతుంది అంటారు, పణుల వల్ల గోవులో మూడు విధాలుగా ఉత్పన్నం అవుతుంది అంటారు – అటువంటి ఘృతం మామూలుగా యజ్ఞంలో నివేదించబడే ఒక భౌతికమైన ద్రవం కాలేదు. అదే విధంగా మధురమైన సోమ రసం నదులలో ఉంటుంది అంటారు, తీయని వెల్లువగా సముద్రం లోనుండి ఎగసి పడుతుంది అంటారు, ఆ సముత్తుంగ మధుర తరంగం దేవతలని చేరుకుంటుంది అంటారు. ఇవే కాక యజ్ఞంలో వాడే ఎన్నో ఇతర నైవేద్య పదార్థాలు కూడా ప్రతీకలే నని అనుకోవలసి ఉంటుంది. అసలు బాహ్యంగా చేసే యజ్ఞ కర్మ కూడా ఆంతరికంగా జరిగే ఆత్మసమర్పణకి ప్రతీక. అంగీరస ఋషులు కూడా కొంతవరకు ప్రతీకలే. దేవతలకి మల్లె వారు కూడా సగం దివ్యులైన కార్యకర్తలు, యజ్ఞానికి సహాయకులు. అలాగే వారితోను, వారి కృషితోను అనుసంధానమై పని చేసే భృగులు, అథర్వులు, ఉశనుడు, కుత్సుడు తదితరులు అందరూ పాక్షిక ప్రతీకలే. అంగిరస గాథ, దస్యులతో వారి పోరాటాల కథలు అన్నీ ప్రతీకాత్మక గాథలే అయితే, ఋగ్వేదంలో మనకి కనిపించే మరెన్నో గాథలు కూడా ఆ కోవకి చెందినవే అయ్యుండాలి. ఉదాహరణకి రాక్షసులకి వ్యతిరేకంగా దేవతలు ఋషులకి సహాయం చేసిన వృత్తాంతాలు కూడా అటువంటివే అనుకోవాలి. ఈ కథలన్నిటికీ ఎన్నో లోతైన అంతరార్థాలు ఉన్నాయి. వేదకవులు ఈ కథలకి కూడా అంగీరస గాథతో సమానమైన ప్రాధాన్యతని ఇస్తారు.

అలాగే యజ్ఞం చేయక, యజ్ఞఫలాన్ని నిరాకరించే దస్యులు, మంత్రాక్షరాన్ని, దేవతలని ద్వేషించే దస్యులు, ఆర్యులతో నిరంతరం కలహించే దస్యులు – వీరిలో వృత్రులు, పణులు

తదితరులు ఎందరో ఉన్నారు – వీరంతా మనుషులు కారు. వీరంతా చీకటికి, అజ్ఞానానికి, చెడుకి ప్రతీకలైన బలాలు. అలాంటప్పుడు ఆర్యుల యుద్ధాలు, ఆర్య రాజులు, ఆర్య రాజ్యాలు మొదలైన వన్నీ చాలా వరకు ప్రతీకలేనన్న విషయం క్రమంగా విశదం అవుతుంది. అయితే అవి సంపూర్ణ ప్రతీకలా లేక పాక్షికమైనవి మాత్రమేనా నన్న విషయాన్ని ప్రస్తుతం తేల్చుకునే పరిస్థితిలో లేము. అందుకు మరింత లోతైన పరిశోధన కావాలి. కాని అది మన ప్రస్తుత లక్ష్యం కాదు. మన ప్రస్తుత లక్ష్యం అసలు వైదిక గాధలు ప్రతీకలు అన్న విషయానికి ఏవైనా ఆధారాలు ఉన్నాయా అన్న విషయాన్ని తేల్చుకోవడం. వేద ఋక్కులు ప్రాచీన భారత ఋషులు చెప్పిన అధ్యాత్మిక సందేశాలు అన్న విషయాన్ని ఇక్కడ ప్రతిపాదించాము. ఆ ప్రతిపాదనకి ఎన్నో ఆధారాలు ప్రకటించాము.

అయితే ఈ ప్రతిపాదనని ఇంకా బలంగా స్థాపించాలంటే వృత్రుడు జలాల గాధని మరింత క్షుణ్ణంగా పరిశీలించాలి. వృత్రుడు, జలాలు అనే కూటమికి, అంగీరసులు, తేజస్సు అనే కూటమికి మధ్య లోతైన సంబంధం వుంది. మొదట మనం గుర్తించాల్సిన విషయం వృత్రసంహారి అయిన ఇంద్రుడు, మరియు అగ్ని, మొత్తం వైదిక దేవకోటిలో అతి ముఖ్యులైన ఇరువురు దేవతలు. ఇంద్రుడి లక్షణాన్ని, క్రియలని పూర్తిగా స్థాపించ గలిగాము అంటే మనం ఆర్య దేవతల లక్షణాలని కుదురుగా తెలుసుకున్నట్టే. మరో విషయం ఏమిటంటే మరుత్తులు, వారి సహచరులైన వైదిక వాగ్గేయకారులు మొత్తం వైదిక కర్మకాండలో, ప్రకృతిబద్ధమైన వైదిక చరిత్రలో ఎంతో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమిస్తారు. వారు నిస్సందేహంగా వైదిక వర్ష దేవతలు. అగ్ని, అశ్వినులు, వరుణుడు, మిత్రుడు, త్వష్టి తదితర దేవుళ్లు, దేవతలు, సూర్యుడు, ఉషాదేవి – ఈ వైదిక దేవతల్లో ఎవరికీ మరుత్తులని పోలిన భౌతిక, ప్రకృతిబద్ధమైన అన్వయం పొసగదు. అలాంటి వర్ష దేవతలకి కూడా అధ్యాత్మికమైన అన్వయం ఉందని నిరూపించగలిగితే, మొత్తం వైదిక మతానికి, కర్మకాండకి ఒక ప్రగాఢమైన గూడార్థం వుందని గుర్తించడంలో సందేహం ఉండదు. చివరిగా వృత్రుడు, అతడి సహచర గణాలైన శుష్ణుడు, నముచి తదితర రాక్షసులంతా వారి అధ్యాత్మిక క్రియలని బట్టి దస్యుల జాతికి చెందిన వారేనని గుర్తించడం పెద్ద కష్టం కాదు. అటువంటి అంతరార్థమే వృత్రుడు అడ్డుపడే సురలోక జలాలకి చెందిన గాధలో కూడా ప్రస్ఫుటం అవుతుంది. ఈ అవగాహనని

ఆధారంగా చేసుకుని ఋషులు, దేవతలు, రాక్షసులు తదితరుల గాధలన్నిటినీ అధ్యాత్మికంగా అన్వయించడం సాధ్యమవుతుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో అంతకన్నా దూరంగా వెళ్లడానికి సాధ్యపడదు. ఎందుకంటే వేద ఋక్కుల్లో రూపొందించబడ్డ వైదిక ప్రతీకల వివరాలు అత్యంత సంక్లిష్టమైనవి. వాటి వెనుక శతకోటి దృక్పథాలు తారాడుతూ ఉంటాయి. అన్వయకారులకి అనంతకోటి అవరోధాలు అడ్డుపడుతూ ఉంటాయి. యుగయుగాల విస్మృతి వల్ల వేదాన్వయంలో ఎనలేని అపార్థాలు చోటుచేసుకున్నాయి. అవగాహనలో ఏర్పడ్డ అంత ఆపారమైన అగాధాన్ని ఒక్క అంగలో దాటడం సాధ్యం కాదు. ప్రస్తుతం మనం చేయగలిగిందల్లా ఒక్కటే. కొన్ని ముఖ్య రహస్యాలని వెలికి తీసి, కొన్ని మూలసూత్రాలని స్థాపించి, భావి కాలంలో జరగబోయే వేద శోధనా ప్రయాసని బలమైన పునాదుల మీద స్థాపించగలిగితే మన లక్ష్యం నెరవేరినట్టే.